శ్రీ కృష్ణ భాగవతము

ప్రథమ భాగము

రచన

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

41894

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

శ్రీకృష్ణభాగవతము

ప్రథమ భాగము

(ప్రథమస్కంధము నుండి సప్తమస్కంధము వఱకు)

రచన:

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

ప్రచురణ:

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1997

SRI KRISHNA BHAGAVATHAMU - Vol. I

by

Sripada Krishna Murthy Sastry

© All Rights Reserved.

T.T.D. Religious Publications Series No. 496

T.T.D. First Edition : 1997

Copies : 1000

Price : Rs. 45-00

Published by:

M.K.R. Vinayak, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati – 517 507.

Printed at:

Gayathri Art Printers,
Hyderabad - 500 029.

ముందుమాట

భారతీయ సంస్కృతికి రామాయణ, భారత, భాగవతాలు ప్రమాణ గ్రంథాలు. వీటిలో ఒకటి కావ్యం, రెండవది ఇతిహాసం, మూడవది పురాణం. సంస్కృత భాషలో ఉన్న ఈ గొప్పగ్రంథాలను తరతరాలుగా తెలుగువారు వేర్వేరు సాహితీరూపాలలో అనువదింప చేసికొన్నారు; నేటికీ చేసికొంటూనే వున్నారు. ఈ పవిత్ర గ్రంథాల ప్రయోజనమూ, విశిష్టతా అలాంటివి! అయితే ఈ మూడు గ్రంథాలను ఒకే చేతిమీదుగా తెనిగించిన ఖ్యాతి 'కవిసార్వభౌమ' శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికి ఒక్కరికే దక్కింది. ఇది ఒక విశేషం!.

ఆంధ్రదేశంలో భాగవతమహాపురాణానికి ఉన్నంతటి ప్రశస్తీ, ప్రచారమూ మరే గ్రంథానికీ లేదంటే అతిశయోక్తి కాదు. ఇందుకు రెండు కారణాలు:(1) శ్రీ కృష్ణుని అవతారగాథ విపులంగా వర్ణింపబడివుండటం, (2) బమ్మెర పోతన భక్తికవితామాధుర్యం. ప్రహ్లాదచరిత్ర, గజేంద్ర మోక్షం, రుక్మిణీకల్యాణం -- వంటి ఘట్టాలు, ఆ యా ప్రార్థన పద్యాలు ఇంటింటా తెలుగువారిచే ప్రతిదినమూ ఈ నాటికీ పారాయణ చెయ్యబడుతూ వస్తున్నాయి. దీనిని బట్టి, భాగవతం ఆంధ్ర ప్రజాజీవితంలో మమేకంగా కలిసిమెలిసి పోయిందని చెప్పవచ్చు.

అయితే, పోతనామాత్యుడు వ్యాసుని రచనను ఆంధ్రీకరించడంలో అక్కడక్కడ మూలాన్ని అతిక్రమించాడనీ, అందువల్ల, -- ఆదినుండి ఆఖరు దాకా సంస్కృతమూలానికి మిగుల విధేయమైన అనువాదాన్ని తెనుగు ప్రజానీకానికి అందించాలి -- అనే పూనికతో శ్రీపాదవారు ఈ శ్రీ కృష్ణభాగవతాన్ని రచించినట్లు ఇందులో పేర్కొనబడింది. ఇక, ఈ గ్రంథనామధేయం కూడా ఇందలి విషయాన్ని బట్టీ, ఈ రచయిత పేరును బట్టీ -- ఉభయరీతులా సార్థకమైవుంది.

ఈ గ్రంథం క్రీ.శ. 1952లో మెజస్టిక్ ముద్రాశాల, రాజమహేంద్రవరం వారిచే ముద్రింపబడింది. ప్రస్తుతం ఆ ముద్రితపత్రినే యథాతథంగా ప్రచురించడం జరుగుతోంది. మీ ముందున్న ఈ సంపుటం శ్రీకృష్ణ భాగవతంలోని తొలి ఏడుస్కంధాల ప్రథమభాగం. ఇలాగే, ఎనిమిది నుండి పన్నెండవ స్కంధం వరకు గల ఐదు స్కంధాల గ్రంథం ద్వితీయ భాగంగా ముద్రించబడుతోంది.

మొదటినుండీ ఆధ్యాత్మిక, ధార్మిక సారస్వతాన్ని ప్రజల అందుబాటులోకి తీసికొనిరావటానికి నిరంతర కృషికావిస్తూవున్న తిరుమల తిరుపతి దేవస్థానములు ఇంతకుముందు పోతనభాగవతాన్ని సంపుటాలుగా ప్రచురించడం జరిగింది. అదే ఉద్దేశంతోనే, ప్రతులు అలభ్యమైపోయిన ఈ భాగవతాన్ని -- ఆంధ్రరాష్ట్ర తొలిఆస్థానకవి, శతాధిక గ్రంథకర్త, అభినవశ్రీనాథుడూ ఐన ఈ మహాకవి తదేకదీక్షగా నాలుగే నాలుగు మాసాల్లో రచించిన ఈ "మోక్షగ్రంథాన్ని" తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణగా పారకలోకానికి సమర్పిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

ఉపోద్ఘాతము

—:0:—

మనభారతదేశంబునం గలహైందవజాతి కంతకును ప్రమాణగ్రంథము లనఁబడి ధర్మార్థకామమోక్షాదులగు నెల్లవిషయములను బోధించునవి భారతభాగవతరామాయణంబులు. ఆమూఁడును మూఁడు వేదము లనియు, మూఁడు లోకములనియు, మూఁడుమూర్తు లనియుఁ గీర్తింపఁబడుచున్నవి. అందు మొదటిరెండును నారాయణాపరావతారమగువ్యాసభగవానులును, మూఁడవదియగురామాయణము వాల్మీకి మహర్షియు రచించి సర్వలోకోపకార మొనర్చినారు. ఇందు రామాయణము గాయత్రీమంత్రాక్షరసంఘటితము గావున గాయత్రీరామాయణ మనిపేరుగాంచినది. "భారతః పంచమో వేదః" అనుప్రసిద్ధిగలదై భారతము సర్వప్రపంచమును బోధించుచున్నది. భాగవతము భక్తివైరాగ్యము లుపదేశించుమోక్షగ్రంథ మని లోకస్తుతంబగుచున్నది. ఈమూఁడు మహాగ్రంథములును గీర్వాణభాషయం దుండుటచే సర్వజనసులభములుగామింజేసి దేశీయు లగుమహాకవు లాయాదేశములవారికి సులభసాధ్యము లగునట్లు వారివారిభాషలలో వాని ననువదించియున్నారు.

ఆంధ్రభాషలో మునుమున్ను మూర్తిత్రయము నాఁబడుకవిత్రయము వారు (నన్నయ, తిక్కన, శంభుదాసులు) మహాభారతమును, మంత్రిభాస్కరాదులు రామాయణమును, బమ్మెరపోతనామాత్యాదులు భాగవతమును పరివర్తనము చేసినారు. ఆవలికాలమున మఱికొందఱుకవులు భారతరామాయణములను మరల నాంధ్రీకరించుటకుఁ బ్రియత్నించినను భాగవతము నెవ్వరును మరలఁ దెలిఁగించుటకుఁ బ్రయత్నింపలేదు. అందుకుఁ గారణము పోతనామాత్యుని కవిత్వముకడ నితర కవిత్వము పైత్యమగు ననుభయమే యని యూహింపనై యున్నది. పోతనభాగవతములోఁ బ్రహ్లాదచరిత్రము, వామనచరిత్రము, గజేంద్ర

మోక్షణము, రుక్మిణీకల్యాణము, గోపికాగీతలు, భ్రమరగీతలు, జలక్రీడలు, రాసక్రీడ లోనగుఘట్టములలోనిపద్యము లమృతప్రాయములు. కావుననే యీయైదునూర్లసంవత్సరములనుండి యేకవియు మరల భాగవతము సాంధ్రీకరించుటకుఁ బూనుకొనియుండ లేదు.

ఇట్లుండ నిక్కాలమునఁ గవిసార్వభౌమ, మహామహోపాధ్యాయ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు దానిని మరలఁ దెలుఁగున వెలయింపఁ బూనుట యెంతయు ముదావహము. వీరు శాలివాహనశకము 1866 నకు సరియగు నక్షయసంవత్సరాశ్వయుజబహుళషష్ఠీసోమవారమున జనించిరి. వీరు వెలనాటివైదికబ్రాహ్మణులు కౌశికగోత్రపవిత్రులు. అధ్వరకర్త లగు వేంకటసోమయాజిగారికిని వేంకటసుబ్బసోమిదేవమ్మగారికిని బుత్రులు. బాల్యమునందే భారతాదిగ్రంథములలోనికథ లెల్లఁ దండ్రిగారివలన విని యానందించుచుండువారు. అక్షరాభ్యాస మైనపిమ్మట నొకపాఠశాలలోఁ జేరి కొంచెము తెలుఁగు ఇంగ్లీషు చదివి యంత నవి విడిచి శ్రీ యివటూరి నాగలింగశాస్త్రిగారియొద్దఁ గావ్యనాటకాలంకార శబ్దశాస్త్రాదిసాహిత్యము సంపాదించినారు. కావ్యములు చదువునట్టి కాలములోనే తండ్రిగారియొద్దఁ గొంత యజుర్వేదమును, శ్రీ వాజపేయయాజుల పాపయ్యసోమయాజులుగారియొద్దఁ జయనాంతము శ్రౌతమును శ్రీ కల్లూరి బ్రహ్మసోమయాజులుగారియొద్దస్మార్తముసర్వము నభ్యసించి తండ్రిగారియజ్ఞమునకుఁ దామే యాధ్వర్యవము చేసినారు. ఆకాలమందే తెలుఁగుపుస్తకము లెన్నో సంపాదించి తమసహాధ్యాయులు మధిర సుబ్బన్నదీక్షితులుగారితోఁ గూడి చదివి కవిత్వము చేయఁ గలశక్తిని సంపాదించినారు. పదిరెండవయేట సంస్కృతకవిత్వము చెప్పనేర్చి కొన్ని శతకము లష్టకములు లోనగునవి రచించినారు. పదియాఱవసంవత్సరములో శ్రీనాథుని గురువుగాఁ గొని తెలుఁగుకవిత్వము చెప్పఁ బూని యిప్పటికిఁ బురాణములు, ప్రబంధములు, కావ్యములు, నాటకములు, విమర్శనములు, నిఘంటువులు, ఛందోవ్యాకరణాదులు, ప్రహసనములు,

శతకములు, అష్టకములు బహువిధచిత్రవిచిత్రగ్రంథములు లోనగునవి సుమారు నూటయేఁబది గ్రంథములు రచించుటయే కాక మువ్వురు మహాకవులు మూఁడువందలయేండ్లకుఁ బూర్తిచేసిన శ్రీమహాభారతమును, భాస్కరాదులు ముగ్గురు నల్గురు రచించిన శ్రీమదాంధ్రరామాయణమును, పోతనాదులచేఁ దెలిఁగింపఁబడిన శ్రీమద్భాగవతమును రచించియున్నారు.

వీరు బాల్యముననే యష్టావధాన శతావధానములు చేసి మహారాజసభలలో మెప్పువడసినారు. కల్లికోట మహారాజావారి సభలో సంస్కృతమున శతావధానము చేసి కవిరాజబిరుదముతోఁగూడ స్వర్ణపదకాదిబహుమానముల నందిరి. వీరికి మహాపండితపరిషత్తులలోఁ 'కవిసార్వభౌమ, విశ్వకవి, ప్రసన్నవాల్మీకి, కవిబ్రహ్మ' లోనగు నెన్నో బిరుదములు వచ్చినవి. గవర్నమెంటువారు మహామహోపాధ్యాయబిరుదమును, ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు కళాప్రపూర్ణబిరుదము నొసంగిరి. మఱియును శ్రీ రారామపురంబున స్వర్ణాభిషేకంబును, రాజమహేంద్రవరంబునఁ గవిగండపెండేరమును, విజయవాడపురంబున, సాలూరుపురంబున గజారోహణోత్సవాదులతో మణికిరీటమును, మఱియు నందు నందు ననేకస్వర్ణపదకంబులును బారితోషికములుగా సంప్రాప్తములైనవి. రాజమహేంద్రవరమునందలి చిత్రవస్తుప్రదర్శనశాలాప్రదేశమునఁ గవిసార్వభౌముల శిలావిగ్రహమును బ్రతిష్ఠించి యున్నారు. ఈలో మన మదరాసు గవర్నమెంటువారు వారిని ఆంధ్రాస్థానకవిగా స్వీకరించి బహూకరించినారు. ఇట్లు చతుర్విధకవిత్వమం దారితేరిన కవిసార్వభౌములు ఇన్నిగ్రంథము లొక్కచేతిమీఁదఁ జేయఁగలిగిరనియు, ఎనుబదియైదుసంవత్సరములవయస్సు గలవారయ్యు నిప్పటికిని దినమున శతకప్రబంధము మృదుమధురశైలిని రచింపఁ గలరనియు చెప్పుటలో నతిశయోక్తి లేదు. ఆశుకవిత్వమందు వీరందెవేసినచేయి. వీరితో సమానముగా నిపుడు కవిత్వము చెప్పఁగలవారు లేరని ఘంటాపథముగాఁ జెప్ప వచ్చును. వీరికవిత్వము సర్వలక్షణలక్షితమై మృదుమధుర

మై మనోహరముగా నుండుననుట సత్యదూరము కాదు. ముంజేతి కంకణమున కద్దమేల? వారియే గ్రంథము చూచినను ఈనావాక్యము తార్కాణము కాఁగలదు. శ్రీశాస్త్రిగారు భారతభాగవతరామాయణ ములు చరిత్రవర్ణనముగా రచింప లేదనియుఁ బూర్వగ్రంథములు మూలభిన్నములుగా నుండుటంజేసి మూలార్థము లోకులకుఁ దేటతెల్లంబు గావించుట కిట్లు మగల వాని నాంధ్రీకరించినా రనియు మనము తెలిసి కొనవలసియున్నది. పోతనకవిత్వము లోకవిశ్రుతమై యున్నదని జంకక భాగవత మాంధ్రీకరింపఁ బూని తద్దేకదీక్షగాఁ గొన్ని మాసములలో నే యీ శ్రీకృష్ణభాగవతము పూర్తి గావించినట్లు తెలియుచున్నది.

పోతన స్వకపోలకల్పితముగాఁ దనభాగవతము పెంచియుండుట సర్వలోకవిదితము. సంస్కృతభాగవతమునకంటె తెలుఁగుభాగవతమునఁ గొన్ని వేలపద్యములు హెచ్చుగా నున్నవి. గ్రంథాదిని గల నైమిశారణ్య వర్ణనములును, గజేంద్రునిస్తోత్రమును గంగావతరణాదులను జూచినచో నీవిషయము తేటతెల్ల మగును. గజేంద్రమోక్షఘట్టములో 'అలవైకుంఠపురంబులో', సిరికింజెప్పడు, తనవెంటఁ సిరి' ఈపద్యములు అమూలకములు. మూలములో నీవిషయము లేకున్నను విష్ణువు వైకుంఠమునుండి వచ్చినప్పుడు తెలుఁగులో వ్రాయుట తప్పుగా దందు రేమో? గజేంద్రుని రక్షించినవాఁడు వైకుంఠమునుండి వచ్చినవిష్ణువు గాఁడు గజేంద్రమోక్ష కథమొదటనే "మానవాధీశ్వర" యనుపద్యములో "హరిపుట్టె హరి మేధునకుఁ బ్రీతి హరిణియందు" అని చెప్పుటచే హరిమేధుఁ డను బ్రాహ్మణునికి హరిణియనుస్త్రీయందు పుట్టినహరి వచ్చి రక్షించెను. ఇది రామ కృష్ణాదులవంటి యవతారమే కాని విష్ణుః కాదు. మఱియు నాగజేంద్రుఁ డడవిలో విహరించుట లోనగునవి మూఁడుమూఁడింతలు – వింతలు. మఱియు వ్రేతలు యశోదతోఁ కృష్ణునిచేష్టలు చెప్పినస్థలమందు "మా పిల్లచన్నొడిసిపట్టి చీకెను" "మావారు లేనపుడు వచ్చి పిలిచి పొందఁడిగెను" "తెఱవయొకతె నిద్రింపఁగ కట్టినవలువ వీడ్చి తేలుం గఱ

పించినాఁడు" "తరుణి వంగి వెన్న దీయుచో వెనుకగదిసి నీకొడుకు మగ పోడుములు చేసెను" ఇత్యాదులు చదువుటకు, వినుటకు నసహ్యములై యశ్లీలములైనపద్యము లమూలకములు. ఇందు గోపికలు తొల్లి దండ కారణ్యములో నుండుమహర్షులు రామునివరంబున నిట్లు గోపికలై పుట్టిరి. గోపికాకృష్ణులకుఁ గలసంబంధము జీవపరమాత్మైక్యానుసంధానమువంటి దనియు, వారు మహాపవిత్రు లనియు చెప్పుచుండ వారిని పచ్చిభోగము వారినిగాను కృష్ణుని విటునిగాను చేయుట యుక్తముగాఁ దోపదు. భాగ వతము దశమస్కంధములో:—

"సీ. ఈపొదరింటిలో నిందాఁక కృష్ణుండు
నాతోడ మన్మథనటన మాడె
నియ్యేల మగుచోట నిందాక చెలువుండు
గాఢంబుగా నన్నుఁ గౌఁగిలించె
నీమహీజమునీడ నిందాక సుభగుండు
చిట్టంబు చెయ్యేల సిగ్గు గొనియె
నీపువ్వులతపొంత నిందాక దయితుండు
నను డాసి యధరపానంబు చేసె
ఆ. నీపరిసూనవేది నిందాక రమణుండు
కుసుమదామములను గొప్ప దీర్చె."

ఈయొక్కపద్యమే పైమాటలు రుజువుగావించుచున్నది. ఇది పచ్చిశృంగారము కాదనుటకు వీలులేదు. ఇట్లే గోపికాగీతలు, రాసక్రీడ మున్నగువానియందు శృంగారము మేఱమీఱి కానవచ్చుచున్నది.

ఈయుపోద్ఘాతములో ముఖ్యముగాఁ బ్రస్తుతగ్రంథమును విమ ర్శింపవలసియున్నది. అది మహాపండితులు చేయవలసినకార్యము. అస్మ దాదుల కసాధ్యము. కావున నావిషయము పండితులకు విడిచివేయు చున్నాను. గాని కవిసార్వభౌమునికవిత్వతత్త్వమును గూర్చి మాత్రము

ఇంచుక చెప్ప సాహసింతును. శ్రీ శాస్త్రిగారు శాస్త్రీయముగా సువిమర్శనము చేసికాని పద్యములు వ్రాయరు. సార్థకవిశేషణములు గాని వేయరు. వారు చేయుసంబోధనము లన్నియు సార్థకములై యుండును. అసాంప్రతప్రయోగము లెన్నఁడును వీరు చేయరు. ఛందోవ్యాకరణ మార్గమున కీషద్భేదము నైన రానీయఁగూడ దని వీరినియమము. మొదటి నుండియు వీరు గ్రామ్యభాషను నిరసించి గ్రంథములు వ్రాసిరి కాని అన్యదేశ్యములు, మాండలికములు లోనగునవి ప్రయోగింపవచ్చుననియు గ్రంథదృష్టములుగాని, జడ్డి, జడ్డివాఁడు లోనగుపదములు గ్రంథస్థములు చేయవచ్చు ననియు వీరితలంపు. కవిత్వములో దీర్ఘసమాసములు పెట్టక సర్వజనబోధముగా నుండునట్లు చిన్నచిన్నపదములు వాడుకలో నున్నవి మాత్రమే చేర్పవలయు నని వీరు చెప్పుదురు. కథానుక్రమణికలో గద్యమెట నుండవలెనో పద్య మెటనుండవలెనో బాగుగఁ దెలిసి వ్రాయుదురు. ఇదికాక కవిత్వములో అక్షరసాజాత్యము ముఖ్య మనియు, అది తెలుఁగులో నొక్క శ్రీనాథుఁడుమాత్రమే తెలిసికొనె ననియు వీరుచెప్పుదురు. ఇత్యాదులు శాస్త్రిగారికవిత్వవిశేషములు. వెనుకటికంటె నిప్పటి వీరికవిత్వమునఁ గొంచెము మార్పు గలిగినది. శ్రీకృష్ణరామాయణము భారతమంత ప్రౌఢముగాక మృదులశైలిం దగిలియున్నది. రామాయణము వలెనే యీకృష్ణభాగవతమును మృదుమధురమై ద్రాక్షాపాకము నై యున్నదని చెప్పుచు సర్వమునకుఁ బండితులే ప్రమాణ మని యింతతో విరమించుచున్నాను.

29–12–51
హైదరాబాదు

దివాకర్ల వేంకటావధాని, ఎం. ఏ. ఆనర్సు.
ఆంధ్రభాషోపన్యాసకుఁడు,
ఉస్మానియా విశ్వవిద్యాలయము.

విన్నపము

—:0:—

శ్రీభారతభాగవతరామాయణములు భారతీయులకుఁ బ్రధానగ్రంథములు. అవి సంస్కృతభాషయం దుండుటచే సర్వజనసులభసాధ్యములు కాకుండుటంజేసి వారువారు వానిని వారివారిభాషలలోనికిం బరివర్తనము చేసియున్నారు. మన తెలుఁగులో నున్న వానిలో మూలాతిక్రమణములు పెక్కులు చూపట్టుటంజేసి పవిత్రగ్రంథములు వ్రాయుట ఇహపరసాధకం బని నేను భారతరామాయణములు పునరాంధ్రీకరణము చేసినాఁడను. అపుడు కొందఱు మిత్రులు ముఖ్యములైనమూఁడుగ్రంథములను జేసినవాఁడ వగుదువు భాగవతము గూడఁ మూలార్థము విడువక తెనిఁగింపు మని నన్నుఁ బ్రోత్సహించిరి. మఱి కొందఱు పోతనామాత్యుని కవిత్వము కడ వేరికవిత్వము నాస్వాదింపఁ జాలదు నీవు భాగవతము మాత్రము చేఁబూనవల దని బోధించిరి. నే నీరెండు తెఱంగులం జర్చించి కవిత్వములోఁ బోతనతోఁ బోటీ సేయఁజేనిమాట యాథార్థమే కాని, పోటీసేయుటకుఁ గాదు భాగవతము వ్రాయుట తెలుఁగునందు మూలాతిక్రమణములు వ్యత్యయవిపర్యయాదులు కొన్నిపడినవి వానిని సవరించుటకు మాత్రమే నాయుద్యమ మని సాహసించి భాగవతముంగూడఁ జేబూని యచిరకాలములో నిట్లిట్లో రచించితిని. నాయీరచనయం దెన్నో లోపము లుండవచ్చును. భాగవతకవిత్వము మిక్కిలి ప్రౌఢము రెండు మూఁడు వ్యాఖ్య లున్నను బద్యార్థము చేసికొనుట సుకరము కాదు. అందులో భాగవతమంతయు బహువిధవేదాంతఘట్టములతో విరాజిల్లుచున్నది. ఎంతవారికైన "వినాయకం ప్రకుర్వాణో రచయామాస వానరం" అన్నట్లు కాకపోదు. మఱియు నందు సూర్యచంద్రాదివంశములలోని పురుషులనామములు వివిధప్రతులందు వివిధములుగాఁ గన్పట్టుచున్నవి. నే నేదో యొకమార్గ మనుసరించి వ్రాసితిని. అచ్చుతప్పు లిందుఁ గుప్పలుతిప్పలు. ఇందలి నాప్రమాదములను బెద్దలు మన్నింతురుగాక.

ఈగ్రంథము నేను వ్రాయుచుండుట వినిఁ దీనిని కొందఱు దమకుఁ గృతి నిమ్మని కోరిరి. నేను వేరికిని మాట యియ్యనికాలములో శ్రీరాజా సాగి సూర్యనారాయణరాజుగారు వారిస్వగ్రామమగు నరిసీపట్నము కడనున్న తంగేడునకుం గొంపోయి నన్ను మిక్కిలి గౌరవించి భాగవతకృతిం గోరిన నే నంగీకరించి వారికీ భాగవతమాశీర్వచనరూపకముగాఁ గృతి నొసంగితిని. ఇప్పుడు కూడఁ గృతులు గ్రహించువారు కలరుగాని వీరియంత గౌరవప్రపత్తులు మఱి యెవ్వరికి నుండవని మాత్రము చెప్పఁగలను. వారికిఁ బరమేశ్వరుఁ డాయురారోగ్యైశ్వర్యములు ప్రసాదించుఁ గాక యని కోరుచున్నాను. మఱియు నాయీగ్రంథమున కుపోద్ఘాతము వ్రాసి వన్నె తెచ్చిన మహావిద్వాంసులకు నానమస్కారములు కృతజ్ఞతాపూర్వకముగా సమర్పించుచున్నాను.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.

విషయసూచిక

పుట

1 ఇష్టదేవతా ప్రార్థనాదికము

3 గ్రంథ రచనావశ్యకత

4 కృతి పత్యన్వేషణము

5 కృతిపతి సందర్శనము

8 సూర్య వంశాభివర్ణనము

12 సాగిరాజ వంశావతారము

26 సూత శౌనకసంవాదము

28 సూతుఁడు నారాయణస్మరణంబు సేయుట

30 ఏకవింశత్యవతారములు

32 సూతుఁడు తత్త్వవిచారము సేయుట

34 భాగవత రచనా విచారము

37 నారదుఁడు వ్యాసునికడకు వచ్చుట

39 నారదుని పూర్వజన్మ వృత్తాంతము

46 నారదోపదేశమున వ్యాసుఁడు భాగవతంబొనర్చుట

47 భారతార్థ కథాప్రశంస

50 అర్జునుఁడు బ్రహ్మశిరోనామాస్త్రము ప్రయోగించుట

52 అర్జునుఁడు పుత్రఘాతియగు వానిం గట్టితెచ్చుట

55 కృష్ణుఁడశ్వత్థామను శపించిపుచ్చుట

57 ఉత్తరాగర్భంబుఁ గాచి రక్షించిన కృష్ణుని కుంతిస్తుతించుట

59 కృష్ణాదు లంపశయ్యనున్న భీష్మునికడ కరుగుట

62 భీష్ముఁడు శ్రీకృష్ణుని స్తుతించుట

64 భీష్మ నిర్యాణము

65 శ్రీకృష్ణుఁడు ద్వారకాపురంబునకుం జనుట

67 పరీక్షిత్తు పురుషోత్తమరక్షితుండై జన్మించుట

69 ధర్మరాజునకు విప్రులు పరీక్షిత్తు జాతకంబు చెప్పుట

72 గాంధారీ ధృతరాష్ట్రులు మహాప్రస్థానము చేయుట

73 నారదుఁడు ధర్మరాజునకుఁ గర్తవ్యమెఱింగించుట

75 ధర్మరాజు దుర్నిమిత్తములు గని చింతించుట

78 అర్జునుఁడు దుఃఖించుచుఁ గృష్ణ నిర్యాణముఁ జెప్పుట

పుట

80 రాజు పరీక్షిత్తునకుఁ బట్టంబుఁగట్టి పోవుట

81 పరీక్షిత్తుని రాజ్యపాలనము

83 గోరూపధారులయిన భూదేవీ ధర్మదేవతల సంవాదము

84 పరీక్షిత్తు ధర్మదేవతల నుద్ధరించి కలిం గర్హించుట

86 పరీక్షిత్తు కలి ననుగ్రహించి స్థానంబొసంగుట

87 పరీక్షిత్తు వేఁటకుం బోవుట

88 పరీక్షిత్తు శమీకునిపై సర్పశవంబు వైచుట

89 శృంగి పరీక్షిత్తుని శపించుట

92 రాజువిప్రశాపమువిని పశ్చాత్తాప తప్తుండగుట

94 శుకమహర్షి పరీక్షిత్తునికడకు వచ్చుట

98 ఖట్వాంగుని ముక్తిప్రకారము

101 శుకుండు విరాట్స్వరూపముం దెలుపుట

103 యోగులుకావింపఁదగు కార్యములు

105 యోగానుసంధానక్రమము

107 అర్చిరాది గతిక్రమము

109 కామ్యఫలస్వరూప నిరూపణము

113 శ్రీశుకుండు భగవంతునిఁ బ్రార్థించుట

114 బ్రహ్మనారదునకు బ్రపంచప్రకారము దెల్పుట

118 భగవంతుని లీలావతార కథనము

122 భాగవతోత్తములు- భగవత్స్వరూపము

124 పరీక్షిత్తు ప్రపంచోద్భవాదికంబుఁ జెప్పుమని యడుగుట

126 బ్రహ్మదేవుని తపఃప్రకారాదికము

130 శ్రీహరి బ్రహ్మదేవునకు వరం బిచ్చుట

133 బ్రహ్మసృష్టి క్రమాభివర్ణనము

136 శుకుండు కురుపాండవ వైరాదికముం జెప్పుట

142 విదురుం డుద్ధవునిఁగని కుశలప్రశ్నము చేయుట

144 ఉద్ధవుడు కృష్ణ నిర్యాణముం దలఁచి దుఃఖించుట

149 విదురుం డుద్ధవు వీడ్కొని మైత్రేయుని దర్శించుట

151 మైత్రేయుడు సృష్ట్యాదిక్రమం బెఱింగించుట

156 విదురుడు మైత్రేయునికడఁ దత్త్వవిచారము సేయుట

158 భగవత్తత్త్వ నిరూపణము

160 పద్మజుండు భగవంతుని స్తుతించుట

పుట

163 సర్గకాలాది నిరూపణము
169 బ్రహ్మముఖమునుండి నీలలోహితాదులు పుట్టుట
170 బ్రహ్మ వాక్కుం జూచి మోహించుట
173 స్వాయంభువమనువు ప్రజాసర్గము సేయుట
173 ఆదిరాజ చరిత్రము
175 యజ్ఞ వరాహావతారఘట్టము
176 ధర నుద్ధరించిన వరాహమూర్తిని బ్రహ్మాదులుస్తుతించుట
179 సనక సనందనాదులు వైకుంఠంబున కరుగుట
180 జయవిజయుల శాపాదికము
182 హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతము
184 హిరణ్యాక్షుఁడు వరాహమూర్తినెదిరించి చచ్చుట
187 యక్షాదిదేవ గణసృష్టిక్రమము
189 స్వాయంభువమను వంశావతారము
190 కర్దముని విష్ణువనుగ్రహించుట
192 స్వాయంభువుఁడు కర్దమాశ్రమ మునకువచ్చుట
194 స్వాయంభువుఁడు కర్దమునకు కన్యాదానము చేసి పోవుట
196 స్వాయంభువ పుత్రికయగు దేవహూతిచరిత్రము
198 దేవహూతి పతితో దివ్యవిమానం బెక్కి సంచరించుట
200 దేవహూతిగర్భంబున కపిలుం డుదయించుట
202 కపిలుండు దేవహూతి కధ్యాత్మతత్త్వం బెఱింగించుట
204 సాంఖ్యతత్త్వ ప్రదర్శనము
205 తత్త్వలక్షణము
212 కాలస్వరూప నిరూపణము
214 పిండోత్పత్తి ప్రకారవర్ణనము
217 కర్మఫల ప్రవచనము
219 దేవహూతి కపిలాచార్యుం బ్రస్తుతించుట
222 స్వాయంభువమను సంతానము
224 అనసూయాత్రులకుఁ ద్రిమూర్తులు పుట్టుట
226 దక్షప్రజాపతి సంతానము
227 దక్షుం డీశ్వరుని ద్వేషించుట
230 దక్షుఁడు యజ్ఞము సేయఁబూనుట
233 దక్షుఁడీశ్వరుని నిందించుట

పుట
235 దక్షాధ్వర ధ్వంసము
237 బ్రహ్మాదు లీశ్వరానుగ్రహంబు వడయుట
241 అధర్ముని వంశవృత్తాంతము
243 ధ్రువోపాఖ్యానము
246 నారదుఁడు ధ్రువునకు దర్శనమిచ్చుట
250 నారదుఁడు ధ్రువునకు మంత్రోపదేశము చేయుట
252 ధ్రువుఁడు తపస్సు చేయుట
264 ధ్రువుఁడు సాక్షాత్కరించిన భగవంతుని స్తుతించుట
256 భగవంతుఁడు ధ్రువునకు వరంబులొసగుట
259 ధ్రువుండు తపోవనంబునుండి గృహంబు చేరుట
262 ధ్రువుఁడు గుహ్యకులతో యుద్ధము చేయుట
264 మనువు దర్శనమిచ్చి మనుమని శాంతింపఁ జేయుట
265 ధ్రువుఁడు విమానమెక్కి విష్ణుపదంబుఁ జనుట
267 ధ్రువుని పుత్రపౌత్రాదివర్ణనము
268 వేనుని వృత్తాంతము
272 పృథుచక్రవర్తి జన్మాదికము
275 పృథుచక్రవర్తి సద్గుణములు
276 పృథువు భూదేవిని నిగ్రహించుట
279 పృథువు భూమినుండి యోషధులం బిదుకుట
ఇంద్రుఁడు పృథువు యాగాశ్వము నపహరించుట
284 ఇంద్రుని నిగ్రహించిన పృథువునికడకు బ్రహ్మాదులు వచ్చుట
285 హరి పృథునికడకువచ్చి వరమిచ్చుట
పృథుచక్రవర్తి చేసిన మహోపన్యాసము
291 సనకాదులువచ్చి జ్ఞానోపదేశము చేయుట
294 పృథువు విరక్తుండై తపోవనికేగి ముక్తుండగుట
296 పృథురాజ పుత్రపౌత్రవర్గము
298 ప్రచేతసుల తపఃప్రకారము
299 పరమేశ్వరుఁడు పరబ్రహ్మం బ్రస్తుతించుట
302 ప్రాచీనబర్హికి నారదుండు పురంజనోపాఖ్యానము చెప్పుట
303 పురంజనుఁడుద్యానంబున నొక స్త్రీని గాంచుట
305 పురంజనుడు స్త్రీనిం బెండ్లియాడుట
308 పురంజనుడు స్త్రీలోలుఁడై చెడుట
312 పురంజనుడు స్త్రీయై పుట్టుట

పుట

314 పురంజనుని పూర్వజన్మకథనము
316 పురంజనకథాతత్త్వ నిర్వచనము
320 కర్మఫలముల పూర్వాపరవిచారము
322 దేహాత్మస్వరూప నిరూపణము
323 ప్రచేతసులకు హరిప్రత్యక్షమై వరం బొసంగుట
326 నారదోపదేశమునఁ బ్రచేతసులు ముక్తిం గాంచుట
330 మనుపుత్రుండగు ప్రియవ్రతుడు రాజ్యమేలుట
335 ప్రియవ్రతుడు మేరుప్రదక్షిణము చేయుట
336 మేరుప్రదక్షిణమున ద్వీప సముద్రము లేర్పడుట
337 అగ్నీధ్రుని చరిత్రము
338 అగ్నీధ్రుని తపోవనవర్ణనము
339 వసంత ఋతువర్ణనము
341 అగ్నీధ్రుడు పూర్వచిత్తిం గని మోహించుట
343 నాభికి మేరు దేవియందు శ్రీహరి వృషభుడై జనించుట
346 ఋషభుడు కొడుకులకు నీతు లుపదేశించుట
351 భరతోపాఖ్యానము
353 భరతుడు తపించుచు లేడిపిల్లం బెంచుట
355 భరతుడు తప్పిపోయిన లేడిపిల్లకై దుఃఖించుట
358 భరతుడు లేడియై పుట్టుట
360 భరతుని బ్రాహ్మణజన్మము
364 భరతునిసత్తికి బోలి వెట్టుట
366 భరతుడు రహూగణునితో బ్రసంగించుట
370 భరతుని జ్ఞానోపదేశము
373 భరతుండు ముక్తినొందుట
374 భరతుని పుత్రపౌత్రవర్గము
377 భూగోళద్వీప స్వరూపాది నిర్ణయము
378 ద్వీపములు, పర్వతములు, నదులు, వనులు.
383 భారతాది వర్షములు
384 హయగ్రీవుని వృత్తాంతము
390 భారతవర్ష ప్రశస్తి
395 ప్లక్షాదిద్వీపములు వానియౌన్నత్యము
[illegible] ఖగోళస్వరూపాది నిర్ణయము

పుట

405 సూర్య రథ వర్ణనము
406 చంద్రసూర్యగ్రహ నక్షత్రాది సంచారము
412 పాతాళాది లోకప్రస్తావము
418 నరకలోకము - శిక్షాస్మృతులు
427 శుకుడు పాపనిష్కృతులప్రకారం బెఱింగించుట
430 అజామిళోపాఖ్యానము
433 విష్ణుదూత యమదూత సంవాదము
435 అజామిళుని ప్రాథమికప్రవర్తనము
436 అజామిళుడు శూద్రిం బెండ్లి యాడినకథ
440 అజామిళుని పశ్చాత్తాపము
441 అజామిళుడు విష్ణుసాయుజ్యము నొందుట
446 మన్వంతర కాలసృష్టిక్రమము
447 దక్షుండు చేసిన హంసగుహ్యాక స్తవరాజము
449 దక్షునకు భగవంతుడు బ్రత్యక్షమగుట
452 నారదుండు దక్షసుతులకు జ్ఞానోపదేశము చేయుట
454 దక్షుడు నారదుని శపించి ప్రజాసర్గము చేయుట
460 బృహస్పతి యింద్రుం బరిత్యజించి పోవుట
461 దైత్యు లింద్రుపై దాడివచ్చి యోడించుట
462 దేవతలు విశ్వరూపుని బురోహితునిగ వరించుట
464 నారాయణకవచ ప్రభావము
470 ఇంద్రుండు విశ్వరూపుని సంహరించుట
470 బ్రహ్మహత్య యింద్రుని వెన్నంటి తఱుముట
471 బ్రహ్మ బ్రహ్మహత్యం బ్రార్థించి వేడబాపుట
472 త్వష్ట వృత్రాసురుని బుట్టించుట
473 దేవతలు వృత్రునికోడి విష్ణువుం బ్రార్థించుట
477 మహావిష్ణువు వృత్రవధోపాయం బెఱింగించుట
478 దధీచి దేవతలకు నిజశల్యాస్త్రములిచ్చుట
481 ఇంద్రుండు వృత్రాసురుని సంహరించిన కథ
486 బ్రహ్మహత్య యింద్రుని జుట్టుముట్టుట
488 వృత్రుని పూర్వజన్మము - చిత్రకేతు చరిత్రము
490 చిత్రకేతునికి జ్ఞానోపదేశము చేయుట
493 చిత్రకేతునకు మృతబాలుండు బ్రతికి యుపదేశించుట
495 నారదుండు మంత్రోపనిషద్విద్య నెఱింగించుట

పుట

496 చిత్రకేతుడు శపించి భగవత్ప్రసాదము నొందుట
497 చిత్రకేతుడు భగవంతుని స్తుతించుట
500 గర్వియగు చిత్రకేతుని గౌరి శపించుట
504 సవిత వంశప్రవచనాదికము
505 దైత్యదానవ సంపత్తి
506 మరుత్తులు దేవత్వమొందిన కథ
510 పుంసవన ప్రభావకథనము
514 పరమేశ్వరుని సర్వసమత్వము
518 వైరాదులును ముక్తిహేతువు లని చెప్పుట
520 జయవిజయుల శాపాదికము
521 హిరణ్యాక్ష హిరణ్యకశిపుల కథ
524 సుయజ్ఞోపాఖ్యానము
526 కలవింకముల కథ
528 హిరణ్యకశిపుని తపఃప్రకారము
531 హిరణ్యకశిపుడు వరములంది విజృంభించుట
534 దేవతలు వైకుంఠమునకరిగి మొఱపెట్టుట
540 ప్రహ్లాద చరిత్రము
542 ప్రహ్లాదుని విద్యాభ్యాసము
546 ప్రహ్లాదుడు దైత్యబాలకులకు జ్ఞానోపదేశము చేయుట
549 హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని శిక్షించుట
553 నరసింహావతార ఘట్టము
555 నరసింహమూర్తి హిరణ్యకశిపుని సంహరించుట
557 నరసింహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించుట
561 ప్రహ్లాదుడు నరసింహుని స్తుతించి ప్రార్థించుట
567 నరసింహమూర్తి ప్రహ్లాదు ననుగ్రహించుట
571 త్రిపురాసుర సంహారము
574 వర్ణాశ్రమ ధర్మకథనము
581 ప్రహ్లాదాజగర సంవాదము
587 గృహస్థాశ్రమ విశేషములు
597 నారదుడు తనజన్మవృత్తాంతము చెప్పుట

శ్రీరస్తు.

శ్రీకృష్ణభాగవతము

ప్రథమస్కంధము.

ఇష్టదేవతాప్రార్థనాదికము

శా. శ్రీమీఱన్ గిరిజాసమేతుఁ డగుచున్ సేవించి రావేల్పు లీ
భూమిం గాశికఁ బొల్చి భక్తతతికిం బూర్ణార్థసంసిద్ధియున్
క్షేమం బిచ్చెడువిశ్వనాథుఁడు దయన్ వీక్షించి రక్షించుతన్
శ్రీమత్సాగికులాబ్ధిశీతకరునిన్ శ్రీసూర్యనారాయణున్. 1

మ. పదియార్వేలయి యెప్పుడుం గొలువఁగోపస్త్రీలు భాగ్యామణుల్
ముదమొప్పం దను జుట్టివాఱుఁగొని రేపుల్మాపులుం గూడిమా
డి దయం గోరుచునుండిన న్నగుల మోడిం జూపుచున్ బ్రహ్మచ
ర్యదశం దేలెడువేలు పేలుత మహారాజాన్వవాయప్రభున్. 2

తే. కడలికూఁతురు జయలక్ష్మి కరుణ జేసి
విడనిసిరు లిచ్చి లోకైకవినుత మైన
సాగివంశాబ్ధిరాజు రాజప్రవరుని
సూర్యనారాయణుని దయం జూచుఁ గాక.

మ. వెలిదమ్మిం గొలువుండి ప్రాణిసమితిన్ విన్నాణ మేపాఱఁ గాఁ
గలుగం జేసి పురాకృతంబు తదళీకంబందు ముబ్బంతుల
న్వొలయం జేయుచు భారతీసహితుఁడై వ్గొందు వేల్పున్నతిం
దెలియ న్వచ్చెడుసాగిసూర్యనకిడున్ దీర్ఘాయురారోగ్యముల్. 4

మ. గ్రహరాజై నిజతేజ మెల్లకపలం గ్రాలంగ లోకాళికిన్
స్పృహ గల్గించుచుఁ గర్మసాక్షి యగుచున్ బెంపొంది సప్తాశ్వుఁడై
బహుమార్గంబు పరిభ్రమించుచుఁ బ్రజం బాలించు దేవుండు ధూ
ర్వహుఁడై సాగికులాబ్ధిసోముఁ డగుసూర్యక్ష్మాపతిం బ్రోచుతన్. 5

చ. అనిలవరప్రసాదమున నంజనకుం బ్రభవించినంతనే
నినుని మహాఫలం బనుచు నెంచి గ్రసింపఁగ మిన్నుముట్టి పెం
పునఁ జనుసత్త్వమూర్తి జవముం గలఁడై లవణాబ్ధి దాఁటి సీ
తనుఁ గని రామునిం దెలుచుదక్షుఁడు మాకృతినాథు నేలుఁతన్. 6

సీ. చిన్నారిముంగురుల్ చిందులు ద్రొక్కంగ
నుదుట జాబిలిరేకఁ గదియఁ జేసి
మధుమదవివశయై మంజులవాగ్విలా
సము విస్తరిల్లఁగ సలుపు కొనుచు
నడు గొండు తమ్మిపై నిడి రత్నపీఠము
నందు సుఖాసీన యగుచు నుండి
వీణ వాయించుచు గాణయై యెడ నెడఁ
జిలుఁకలపలుకులు చెవుల వినుచుఁ

తే. గలువపేరు ధరించి కోమల మయి హారి
నీలమాణిక్యకాంతుల నెఱి నెసంగు
మెయి నరుణవస్త్ర మెంతయు మిసిమి మెఱయ
జగము లేలుశ్యామల కృతీశ్వరునిఁ బ్రోచు. 7

సీ. పటికంపుఱాలడా లటమటింపఁగఁ జాలు
నిద్దంపుఁదెలిమేనినిగ్గు లెసఁగ
సూర్యచంద్రాగ్నుల సొంపొందుమూడేసి
కనులఁ జౌవంచ మొగంబు లలరఁ
బాపటసుత నేపు చూపులేజాబిల్లి
చేర్చుక్క వలె వ్రేలి చెన్ను మీఱ
నైదైదుచేతుల నబ్జత్రిశూలాది
పరికరంబులు మహాప్రతిభ దెలుప

తే. ఎల్లవేదములకుఁ గన్నతల్లి యగుచు
నెన్న మూర్తిత్రయంబున కన్న నున్న

తముగ వర్తించి నిజభక్తసమితిఁ గాచు
నట్టిగాయత్రి ప్రోచు నారాయణవిభు. 8

క. శాంతు మునీంద్రస్వాంతని
శాంతున్ భక్తాంతరాయచయపరిశాంతున్
గాంతానంతనుతమహో
దంతున్ మతిమంతు నేకదంతుఁ దలంతున్. 9

సీ. సిరముపూఁ బూఁపచందురునివెన్నెలతో ని
గారంపుఁదెలిమేనికళలు నెఱయఁ
బాణి నాడెపుఁజిల్కపల్కులు మీటువ
ల్లకి కనుగుణతాళలయలు గాఁగ
నుపనిషత్తులు నిత్య ముడిగంపుచెలియలై
యిరుచక్కి వీచోపు లిడుచునుండ
నొండొంటఁ బయ్యంట నోరయు సంగీతసా
హిత్యద్వయంబున నెసఁగ సరులు

తే. అంచవాహనమం దూర్మి నధివసించి
పంచమశ్రుతి వీణ వాయించుకొనుచు
జగములేలఁగ వెలసిన చదువు చెలువ
నలువరాణి మదాత్మలో వెలయుఁ గాక. 10

వ. అని పూజ్యపూజాతత్పరుండనై భారతంబు రచించినపదంపడి
రామాయణంబును జేయం బూని ముగించియున్న యప్పు డొక్క
సమయంబున నాపరమమిత్రులు కొందఱు నన్నుం గాంచి. 11

—♦ గ్రంథరచనావశ్యకత ♦—

చ. ఇతరులు వ్రాసినట్టికృతు లీవు రచింపనివాఁడ వయ్యు భా
రతమున మూలభిన్నములు వ్రాఁతలు పెక్కులు గాన వచ్చుటన్
క్షితిజనసమ్మతంబుగను జేసితి వౌ! సరి చేసి వాని న
వ్వితమున రామచంద్రకృతి విన్నను వొప్పగఁ జెప్పి తెన్నఁగన్. 12

చ. భువనపవిత్రముల్ కృతులు మూడవు నందొగి రెండు తీరె భా
గవత మొకండు వ్రాయుటకుఁ గా దని యెంచకు మందు లోపలన్
దవిలెడుఁ జెక్కుతీరు లగుదారులు వానిని సంస్కరించుటల్
తవు నని మేము చెప్పఁగము తావకచిత్త మదెట్టు లుండునో. 13

ఉ. పోతనవంటిసత్కవులు పుట్టరు పుట్టిన నట్టిరీతిగా
వ్రాఁతలు వ్రాయువా రరిది భాగవతం బది ముద్దులొల్కు నే
నీతఱి వ్రాయఁ బూనితి నయేఁ బరిహాస మొనర్తు రంచు లో
బీతున బోకు నీకవిత వేఱికవిత్వము నేని మించెడిన్. 14

ఆ. ఇదియుఁ గాక భరతపృథివిఁ మణులైన
మూఁడుకృతులు చేసి పాడిమిఁ గను
నట్టివాఁడ వగుదు వదియు రచింపుము
తెలియు నీకు నాలు నెలల పనియె. 15

వ. అని ప్రబోధించిన నే నొండెంచక సాహసించి భాగవతమహా
పురాణంబు తదేకదీక్షగా నాల్గుమాసంబులలో ననౌచిత్యంబు
పరిహరించి యౌచిత్యంబు గ్రహించి మూలానుసారంబుగా నాంధ్రీక
రించి దాని నేరికిం గృతి యిత్తు నేరి కిచ్చిన నా కిహపరసాఫ
ల్యంబు నొందఁ గలుగు నని విచారించుచు లోకం బన్వేషించు
చున్న కాలంబు 16

—♦ కృతిపత్యన్వేషణము ♦—

ఉ. కోరుటుజడ్జి యీకృతిని గొందును నే నని కొన్నినాళ్లు పో
దారి యొసంగె ధీసచివతాపద మందిన యొక్కఁ డీకృతిన్
గోరినవార్త రాఁ గడచె గొన్నిదినంబులు పాదజుం డొకం
డారసి నా కిడం బదిసహస్రము లిచ్చెద నంచుఁ బల్కుటన్. 17

ఆ కాలహరణ మయ్యెఁ గాని ముద్రించు
భాగ్య మబ్బదయ్యె భాగవతము
పయినఁ దెలియ వచ్చువారికిఁ గృతి యీయ
మనసు పుట్ట దయ్యె వినుఁడు నాకు. 18

వ. మఱియుం గొంద ఱీకృతిం గోరిరి కాని నేను వేఱికి నీయ నొల్లని
యుల్లంబునఁ గాలక్షేపంబు గావించితి నంతలోన. 19

ఉ. నే నొకకార్యముం గలిగి నెయ్యుని వేంకటరామశాస్త్రినిన్
దో నరుదేరఁ గాఁ గొని ప్రతుష్టమతిం దుని కేగి పిమ్మటన్
దానికిఁ గొంతదవ్వున వినంబడుతంగెడు నాఁగ గ్రామముం
గానఁగ నెంచి బస్సుపయిఁ గాలిడి పోయెదునంత నింతలోన్. 20

వ. తంగేడుగ్రామంబు లోచనగోచరం బయ్యె నదియును. 21

సీ. సర్సిపట్నముగోడ్డు నా బడు రైలుస్టే
షనున కుదగ్దిశఁ దనరుచుండుఁ
దానినుండి బస్సునం జను గ్రామమును డాసి
నరిసిపట్నమునకు నాటుదారిఁ
బ్రాక్సముద్రముగాలి ప్రతిదినాంతమునందుఁ
జలువ లీనుచు నట మెలఁగుచుండుఁ
గొట్టికచుట్టునం గొఱలుఁ గేదారముల్
కేదార మది యేమొ నాఁ దలిర్చి

తే. వైష్ణవాలయమును డాసి వఱలు వాపి
యమృతతుల్యామృతం బిడునట్టి దగుచు
మానవాళికి గా కెడ్డ చేనుచెట్టు
లగు నుదకదాన మిడుచెఱు వొకఁ డగు నట 22

తే ఊష్మశకటంబు డిగి దారి నూరుఁ జేరు
నంత శ్రీరామలక్ష్మణు లనఁగ నొప్పు
రెండుపిప్పలవృక్షముల్ నిండువేడ్కఁ
గూర్చున ట్లగు నట నొక్కకల్య గలదు. 23

చ. ప్రభువులు ప్రాడ్వివాకులును రాజులు రాజపురోహితుల్ హితుల్
విభవ మెసంగ నుండుటకు వీ లగున ట్లయి ధర్మశాల యొం
డభినవవైభవంబునను నారయ నొప్పెడుఁ జెట్లచెంగటన్
శుభము లెసంగఁ జేయుచును జూడఁగ వచ్చెడు నచ్యుతుం డటన్.

వ. అంత నేను నామిత్రునితో నావిశ్రాంతిభవనంబునం జేరి విశ్రమించి యున్నసమయంబున. 25

—♦ కృతిపతి సందర్శనము ♦—

సీ. లోకసంప్రస్తుత లోకబాంధవవంశ
సాగరరాకానిశాకరుండు
పరమపావన బుచ్చిబంగారయాదేవి
ఘనగర్భశుక్తి ముక్తాఫలంబు
సప్తసంతానప్రశస్త మహాకృతి
సంతానసంగ్రహణాంతరంగుఁ
డుర్వరాదేవతాత్యుచిత పూజాసక్త
నిర్మలహృదయుండు కర్మఠుండు
తే. రాజబిరుదాంకితుఁడు సత్యరాజసోద
రుండు భారతధర్మవిదుండు సాగి
రాజసూర్యనారాయణ రాజవరుఁడు
నాదు రాక నాకర్ణించి సాదరమున. 26

వ. సంభ్రమసంతోషంబులు భూషణంబులుగాఁ జనుదెంచి సాష్టాంగ
నమస్కారంబు గావించి కుశలప్రశ్నానంతరంబున నర్ఘ్యపాద్యంబు
లును ఫలాహారంబు నొసంగి విశ్రమించినపదంపడి నన్ను నిజాంతః
పురంబునకుం దోడ్కొనిపోయి కర్పూరతాంబూల జాంబూనదాంబ
రాభరణ ఫలాదులతో నిండినపళ్లెరంబులు దానం దనధర్మపత్ని
యును బాణితలంబుల నిడుకొని నిలువంబడి వినయవినమితగాత్రు
లై రఘుడు రాజేంద్రుండు. 27

మ. కవిలోకేశ్వర! మీసమర్చనము వేడ్కం జేసి భాషింప నా
డవు చిత్తం బభిలాషతో వెలయనై హర్షించు నిన్నాళ్ల కా
భవికం బబ్బెను మాపురాకృతము చెప్పం జొప్పడె నీమరు స
త్కవివర్యుల్ ఋషితుల్యు లంచుఁ దలఁతుం దత్త్వార్థచిత్తంబునన్.

మ. ముఃతుల్యుం డగుపక్కివీంద్రువలనం బుణ్యప్రదం బై జగ
ద్వినుతం బై నీకృతిన్ గ్రహించుటకు నెంతే స్వాంతముం జేసితిన్
గనవచ్చెం జూఁడి మీరు భాగవతముం గావించి యున్నా రటం
చును దానిం గరుణించి నాకుఁ గృతి నీఁ జూడంగ నే వేఁడుదున్. 29

క. భగవద్గ్రంథంబునఁ జే
రగు నేనిన్ వాసిజన్మ మది సార్థకమై
జగదభినుతమై సుగతిం
దగులుం గదె సార్వభౌమ! తథ్యము గాఁగన్. 30

వ. అని రాజదంపతు లనేకవిధంబులం బ్రార్థించుచు నుపాయనంబు నాక
రంబులం బెట్టినం బట్టి పరమానందకందళితాంతరంగుండనై నేనును.

చ. ఎవ రెవరో మహాత్ము లగునిభ్యులె యీకృతి మాకు మా కటం
చవిరళకాంక్షమై తెలియునట్టులు పల్కుచు నన్నుఁ గోరి రే
నవు నని వేరికిం బలికినట్టిఁడఁ గాను మహాకృతిం గొనం
దవినవిభుండు గావలయు నా సువిచారము లోనఁ గల్గుటన్. 32

చ. కృతుల నొసంగువారికి గ్రహించెడువారికి నిందు నందు సం
చిత మగుసౌఖ్యసంపదలు చేకుఱఁగాఁ దగు నర్థి దైవని
ర్మితి నగు నిందు మర్త్యులగరిమ్మత యింతయు నుండ దెవ్వ రె
గ్గతి జతనించినన్ వృథయె గా యని చిత్తవినిశ్చయం బగున్. 33

చ కవులు ధనాశమై కృతులు కష్టుల కిచ్చిన నిందు నందు దు
ర్భవదురితాంధకార మది వచ్చెడు వేల్పులవేల్పు పిమ్మటన్
భువి సుగుణైకభూషణుఁడు పూరుషుఁ డొప్పఁ గృతిం గ్రహింప నో
రవికులవార్ధిచంద్రమ! కరంబు ముదం బగుదెంచె నా కిటన్. 34

మ. రవివంశంబున నుద్భవించితి విలన్ రాజాధిరాజస్తుతం
బవుసాగ్యన్వయమందు మానికమవై హార్వొంది యుర్వీసుర
ప్రవరార్చామతి నొప్పుచుంటివి శ్రుతిం బాటింతు వోరాజ! భా
గవతంబుం గృతి యిత్తు నీకుఁ గొనుమా కౌతూహలప్రక్రియన్.

తే. సప్తసంతానములఁ గృతిసంతతి పర
మోత్తమం బగు నీకృతి నొందినట్టి
నీకుఁ బుత్రసంతానము లోకమెన్నఁ
గలుగఁ గల దాప్రభావము కలిమి రాజ 36

వ. అని సంభావించి పలుకుచు నాశీర్వదించి మించిన వేడ్క వారిచే
ననిపించుకొని గృహంబునకుం జనుదెంచి ముదం బందుచు ముందు
మంగళాచరణంబుగా నమ్మహారాజవంశావతారం బభివర్ణించెద.

— సూర్యవంశాభివర్ణనము —

సీ. మూఁడుమూర్తులకును మూలమై యేమూర్తి
విరిసి ముజ్జగముల వెలుఁగుచుండి
నఖిలలోకాధార యగు వేదమాతృక
కే వేల్పు తండ్రియై యెసకమెసఁగఁ
దమ ముజ్జగించి విశ్వమునకుఁ గన్నిచ్చి
కాలస్వరూపియై క్రాలు నెవఁడు
తన తేజమునను గ్రహతతికి నగ్నికి దేజ
మిచ్చి వెల్గించెను నేఘనుండు
తే. అతఁడు మాకృతిపతి యేలునాదిదేవుఁ
డఖిలలోకములకు మిత్రు డరుణమూర్తి
విష్ణుపదదివ్యరత్నము వేదపేటి
రేవెలుంగులదొరజోడు వేవెలుంగు 38

వ. అతనికి వైవస్వతుండు పుత్రుండై పుట్టి మను వయ్యె నతండు తన
పేర నొక్క మహాస్మృతిం గావించి లోకం బుద్ధరించె. 39

చ. మనుకృతధర్మశాస్త్ర మది మానవకోటికి బెన్నిధానమై
మునిజనమాన్యమై సకలపుణ్యపథంబుల జూపునట్టిదై
ఘనతరసంకటార్థముల గానఁగ నీయనిదై శ్రుతిప్రచో
దన మయి భారతావని ప్రధానతఁ గాంచి కడుం బ్రకాశిలున్.

వ. ఆమనువునకు నిక్ష్వాకుం డతనిపేర సూర్యవంశం బిక్ష్వాకువంశం బయ్యె. 41

ఆ. అతఁడు రాజ్య మేల నమరినదాదిగా
సకలసౌఖ్యము లిల సమకురుటను
బ్రజలు సూర్యవంశభవుల నిక్ష్వాకువం
శజు లటంచుఁ బిలువ సాగి రపుడు. 42

వ. ఆయిక్ష్వాకునకు వికుక్షి వికుక్షికిఁ బురంజయుండు పురంజయునకుఁ గకుత్థ్సుండు పుట్టె. 43

తే. ఆతఁ డిక్ష్వాకు మించినయట్టిఁ డగుటఁ
దత్కులంబునఁ బుట్టినధరణివిభులు
జగతిఁ గాకుత్థ్సు లనియెడుసంజ్ఞ వడసి
ఖ్యాతి గాంచిరి సర్వలోకములయందు. 44

వ. అక్కకుత్థ్సునకు ననేనుండు నాతనికిఁ బృథుచక్రవర్తి పుట్టె నతనికి యువనాశ్వుండు నాతనికి శాంబస్తుఁడు శాంబస్తునకు బృహదశ్వుండు వానికిఁ గువలయాశ్వుండు కువలయాశ్వునకు దృఢాశ్వుం డతనికి హర్యశ్వుఁడు వానికి నికుంభుఁడు నికుంభునకు బర్హణాశ్వుఁడు వానికిఁ గృతాశ్వుఁడు వానికి శ్యేనజిత్తు వానికి యువనాశ్వుఁ డతనికి మాంధాత మాంధాతకుఁ బురుకుత్సుండు పురుకుత్సుండు చక్రవర్తియై ప్రఖ్యాతిఁగాంచె నతనికి రెండవద్రసదశ్వుఁడు వాని కసరణ్యుండు నతనికి హర్యశ్వుఁడు హర్యశ్వునకు నరుణుండు నరుణునకుఁ ద్రిబంధనుండు నతనికి సత్యవ్రతుం డనంబడు త్రిశంకుఁ డుదితుం డయ్యె నతనికారణంబున విశ్వామిత్రుండు స్వర్గంబునకు మఱియొకస్వర్గంబు నిర్మించె వినుండు. 45

మ. గురుధిక్కారము చేసె నంచును ద్రిశంకున్ రోసి వాసిష్ఠు లొం
డరయం జాలక నీవు పుల్కసుఁడ వౌ దంచున్ శపింపంగ నా
ధరణీంద్రుండు ప్రకంపితుం డగుచు గోత్రామండలిన్ మెట్టుచున్
బరికించెన్ ఘను గాధినందనుని విశ్వామిత్రు సద్గోత్రునిన్. 46

ఉ. కాంచి మునీంద్ర! మాలఁడవు క మ్మనుచున్ వృథగా శపించి రే
కొంచెముగాని దోపమునకుం గుఱి గానిననున్ వసిష్ఠు లీ
వంచనఁ బాపుకోఁ దలఁచి వచ్చితి దేవర నాశ్రయింపఁగా
నంచితసత్యసంపదల వారసి నన్నుఁ గృతార్థుఁ జేయవే. 47

తే. అనిన నాతఁ డౌఁ గావుత మనుచు వాని
చే సవన మొండు చేయించి వాసవాది
సురలఁ బిలిచిన వార లధ్వరము గనఁగ
రామిఁ గౌశికుఁ డలిగి స్వర్గంబునకును 48

తే. మాఱుస్వర్గంబు నిర్మించి మానవేంద్రు
నందు నివసింపఁగాఁ జేసె నఖిలలోక
మబ్బురంపడి కౌశికు నభినుతించె
నతనిసామాన్యుఁ డని చెప్ప నయితి యగునె. 49

వ. ఆత్రిశంకునకు హరిశ్చంద్రుం డతండు సత్యవాదియై స్వర్గంబునకు
నిర్గమించి పదునాలుగు వేలమన్వంతరము లింద్రునర్ధాసనంబున నాసీ
నుండు గా నయ్యె. 50

తే. సత్యసంరక్షణార్థ మాత్మ్యవిభుండు
భార్య నమ్మెను దా మాలవాని కమ్మఁ
గాఁ బడియు వల్లకాఁటను గాచువాఁడ
నైయె కుతిలఁ గుడ్వె లోక మాహా యనంగ. 51

వ. ఆహరిశ్చంద్రునకు లోహితుండు వానికి హరితుఁడు హరితునకు జం
పుఁడు జంపునకు సుదేవుండు సుదేవునకు విజయుండు విజయునకు
భరుకుఁడు భరుకునకు వృకుండు వృకునకు బాహుకుఁడు బాహు
కునకు సగరుం డతనికారణంబున సాగరు లఱువదివేగురు కపిలుకో
పానలంబున దగ్ధు లగుటయు సముద్రమునకు సాగర మని పేరు
వచ్చుటయును సంభవించె. 52

చ. సగరునియజ్ఞవాహమును శక్రుఁడు దొంగిలి క్రిందిలోకమం
దగుకపిలర్షి చెంత నిడె నవ్వల నర్వదివేల సాగరుల్

జగతినిఁ ద్రవ్వుకొంచు జని సంయమిచెంగట మోడి చూపుటన్
బగబగ మండు కంటఁ గనె వారి సతం డయి రెల్ల బూదిగన్. 53

వ. ఆసగరునకు నసమంజసుండు వాని కంశుమంతుండు వానికి దిలీపుండు వానికి భగీరథుం డతండు నిజతపఃప్రభావంబున దేవదేవుని మెప్పించి గంగానదిం దెచ్చి పితృదేవతలకుఁ దర్పణంబు గావించె నతనిచేరనే గంగ భాగీరథి యనంబడె. 54

ఆ. ఏండ్లు పూండ్లు గాఁగ నేకాగ్రతనమున
శివునిఁ గొలిచి గంగఁ జేతఁ బూని
ధరకుఁ దెచ్చునప్డతండు పడినపాటు
చెప్పఁ దరము గాదు శేషునకును. 55

వ. ఆభగీరథునకు శ్రుతుండు సుతుం డయ్యె శ్రుతునకు నాభి నాభికి సింధుద్వీపుఁడు సింధుద్వీపునకు నయుతాయు వతనికి ఋతుపర్ణుండు వానికిఁ గల్మాషపాదుండు నాఁబడుసుదాసుండు సుదాసునకు నశ్మకుండు వానికి మూలకుండు వానికి దశరథుండు వానికి నైడబిడుఁడు వానికి విశ్వసహుఁడు విశ్వసహునకు ఖట్వాంగుఁడు ఖట్వాంగునకు దీర్ఘబాహుఁడు దీర్ఘబాహునకు దిలీపుఁడు దిలీపునకు రఘుమహారాజీతండు చేసినమహోన్నతకార్యంబులం జేసి సర్వోన్నతుం డయ్యె నిక్ష్వాకువంశంబు రఘువంశంబు నాఁబడె. 56

మ. మను విక్ష్వాకు కకుత్స్థముఖ్యు లగునాక్ష్మావల్లభుల్ చేయ నో
పనిసత్కార్యము లెవ్వి యెవ్వి యొనరింపం జాలె నోకాని స
ర్వనరేంద్రోన్నతుఁ డై రఘుప్రవరుఁ డాభాస్వన్మహావంశ మె
ల్ల నిజాఖ్యం బొలుపొందఁ జేసినటులై లక్షింప నయ్యెన్ ధరన్. 57

వ. ఆరఘువున కజమహారాజు పుట్టె నాతనికి దశరథుం డతం డపుత్రకుండై పుత్రకామేష్టిం గావించి తత్ప్రభావంబున శ్రీమహావిష్ణువును బుత్రునిఁ గాఁ బడసె. 58

చ. దశరథుఁ డెంతవాఁడొ విశదం బగుచుండదె యెల్లవారికిన్
దశదిశలన్ నిజాహ్వయముఁ దాఁకగఁ జేయుటె కాదు మింటికిన్

విశదముగా గమించు నిడ వింతయ కాదు జగన్నివాసునిన్
బశుపతివంద్యునిన్ హరిని బాలునిఁ గా గొనఁ గల్గ వింటిరే. 59

వ. దశరథపుత్రుం డగులక్ష్మీకళత్రుండు శ్రీరామనామంబునం దేజరిల్లి మహాలక్ష్మి యగుసీతామహాదేవిం బెండ్లియాడి దేవీసహితుండై కాంతారంబున కరిగి కందమూలఫలాశనుండై కాలంబు గడుపుచు ఖరదూషణాదినక్తంచరుల ననేకులను బరిమార్చుటయె గాక లోకవిద్రావణుం డగు రావణాసురుని సంహరించి త్రైలోక్యంబుఁ గాచి రక్షించె నా శ్రీరామచంద్రునకుఁ గుశుఁడు లవుం డనునిద్దఱు పుత్రులందుఁ గుశునకు వెనుక నతిథి నిషధుఁడు పుండరీకుఁడు క్షేమధన్వుఁడు దేవానీకుఁడు వజ్రనాభి హిరణ్యనాభి సుదర్శనుఁడు బృహద్బలుఁడు బృహద్రథుఁడు ప్రతివ్యోముఁడు భానుమంతుఁడు సుప్రతీకుఁడు పుష్కరుఁడు బృహద్రాజు బర్హి కృతంజయుఁడు రణంజయుఁడు సంజయుఁడు శాక్యుఁడు శుద్ధోదుఁడు లాంగలుఁడు ప్రసేనజిత్తు సురథుఁడు సుమిత్రుఁడు లోనగు పెక్కురు రాజన్యులు పుట్టి సాకేతంబు రాజధానిగాఁ బూజ్యరాజ్యపాలనంబు గావించి రంత సుమిత్రునన్వయంబున విక్రమార్కుండు పుట్టి మహోన్నతఖ్యాతిం గాంచె.

ఉ. భట్టియుఁ దాను దేశముల వర్షము వర్షము నాఱుమాసముల్
మెట్టుమ నాఱుమాసములు మేదిని నేలుచు నెందు నెందుఁ జూ
పట్టినవింతలం గనుచు బ్రహ్మవినిర్మిత మైనయాయువున్
నెట్టనఁ బెంచుకొ‌ఁ గలిగె నేర్పున వేయికి వేయి హెచ్చఁగన్. 61

వ. అనంతరం బాతని సంతతియందు దుర్జయమహారా జభ్యుదయంబు నొందె. 62

— సాగిరాజవంశావతారము —

క. రణముల దుర్జయుఁ డగుటన్
గణుతింపఁగ నయ్యె నతఁడు ఘనయశుఁ డగుచున్
గుణగణనిధి యై విద్వ
ద్గణములఁ బాలించి మించెఁ గడు మోదమునన్. 63

ఉ. ఆమహనీయవంశము మహామహిమన్ మహిమండలంబులన్
దామరతంపరై ప్రబలె దాశరథుల్ బలెం దత్కులీనులున్
శ్రీమహితుల్ యశోమహితశేసధులై పొలుపొందిరెందఱో
నేమముతోడ వారలను నే నిటుపై నిటఁ బ్రస్తుతించెదన్. 64

వ. ఆదుర్జయమహారాజునకు రణంజయమహారాజు పుట్టె నతనికి ద్యుతికర్ణమహారాజు పుత్రుం డయ్యె ద్యుతికర్ణునకు ధవళకర్ణమహారాజు జనించె వానికి మణికర్ణమహారాజుదయించె నతనికి హేమకర్ణసోమకర్ణులు పుత్రు లందు సోమకర్ణ మహారాజునకు ద్విజకర్ణమహారాజు పుట్టె నాతఁడు మాగధులచే నోడింపఁబడి దేవగిరిం గోలుపోయి వారికి సామంతుఁడై వేంగిదేశమును బాలించె హేమకర్ణమహారాజునకుఁ బ్రభాకరమహారాజతండు పుట్టి పురుషోత్తముండై పౌరుషంబున మాగధులన్ జయించి మరల దేవగిరిదుర్గముం గైవసంబు గావించుకొనియె నాప్రభాకరమహారాజునకు భాస్కరమహారాజు వానికి జనార్దనమహారాజు జనార్దనునకుఁ బ్రదీపమహారాజు ప్రదీపునకు సాగ్నివీచిమహారాజతండు సాగ్నిరాజనియు సాగిరాజనియుఁ బిలువంబడుచుండె నాకారణంబున నతనివంశమువారు సాగివారనం బ్రసిద్ధి గాంచిరి. ఆసాగిరాజునకు దర్పకమహారాజు దర్పకమహారాజునకు ముప్పరాజు పుత్రుం డీతనిముత్పరాజనియు మూర్పరాజనియుఁ బిల్చుచుందురు. ముత్పరాజునకు సూరసింగరాజు వానికిఁ బోత్రిరాజు వానికి గోంకదోరపురాజు వానికిఁ బోతరాజు పోతరాజు గుడిమెట్ల రాజధానిగా రాజ్యము పాలించె వీనికిని వేములవాడ భీమకవికిని పోరు పడి తీఱనిదయ్యెఁ బోతరాజునకుఁ ద్యాగరాజు వీనినిఁ జాగిరాజనియు సాగిరాజనియుఁ బిలుతురు సాగ్నివీచిమహారాజుకతంబుననే కాక వీనికారణంబునను వీరివంశమునకు సాగివారనుపేరు సుప్రసిద్ధమైనది త్యాగరాజునకు దోరపురాజు వానికి సాగిపోతరాజు వానికి నరసింహరాజు నరసింహరాజునకు మాచిరాజు మాచిరాజునకు దోరపురాజు నెరపోతరాజు ననునిద్ద

కుమాళ్లు వారిలో నెరపోతరాజునకు శ్రీరామరాజు శ్రీరామ
రాజునకు రామరాజు తెలుఁగురాజు గోపరాజు ననంతరాజు నను
నలుగురుకుమాళ్లు వీరిలో రామరాజు వత్సవాయిగ్రామము వీడి
వచ్చుటంజేసి వత్సవాయివా రని వారి సంతతివారికిం బేరు వచ్చినది.
మాచరాజు ప్రథమపుత్రుఁ డైనదోరపురాజునకు గోపరాజు సింగ
రాజు పుత్రులు సింగరాజునకుఁ బోతరాజు ఇతండు నలగామ వీరా
రెడ్డిపుత్రిక ముక్తాంబను బెండ్లియాడి రెడ్లకుఁ దోడుపడినవాఁడయ్యె
గోపరాజునకు సింగరాజు సింగరాజునకు రాయపరాజు రాయప
రాజునకు దోరపురాజు దోరపురాజునకు గోపరాజు గోపరాజునకుఁ
జాగిరాజు పోతరాజునను వారు. వీరిలోఁ బోతరాజుకొడుకు లగు
రాఘురాజు జగ్గరాజును గొండవీడునకు వెడలిపోయిరి. చాగిరాజు
కుమారులు గోపరాజు బాచిరాజును బాచిరాజునకుఁ జాగిరాజు
చాగిరాజునకు దోరపురాజు దోరపురాజునకు రాయపరాజు రాయప
రాజునకు రామరాజు జగ్గరాజు ఇందు రామరాజునకు బుద్ధిరాజు
రామరాజు. ఈబుద్ధిరాజుకతంబున సాగివారిలోఁ గొందఱు బుద్ధి
రాజువా రని పేర్కొనం బడిరి. జగ్గరాజునకు రామరాజు వీరు
కాక్రేసికోనయందును జెయ్యేటియందును మూలపురుషు లైరి.
సాగిరాజపుత్రుం డగుగోపరాజునకు బెద్దిరాజు దోరపురాజు నను
నిద్దఱు పుత్రులు పెద్దిరాజునకు గోపరాజు పోతరాజు నను నిద్దఱు
పుత్రులు గోపరాజునకు సింగరాజు సింగరాజునకు దోరపురాజు
దోరపురాజునకు గోపరాజు గోపరాజునకు రాయపరాజు రాయప
రాజునకు గోపరాజు గోవిందరాజును గోపరాజు వైనతేయతీరమం
దలిగోగనమఠమునందు నివశించి వైనతేయనదికి సాగరసంగమంబు
గల్పించె గోపరాజునకు రామరాజు వానికి గోపరాజు నరసరాజు
గోపరాజునకు రామరాజు గంగరాజు రామరాజునకు సీతారామ
రాజు వానికి రఘునాథరాజు రఘునాథరాజునకు సీతారామరాజు
ఈయనయురట్లమల్లవరమునందుఁ గాపురముండె. 65

ఉ. ఈతఁడు సాగివంశమున కేడ్గడ యట్టిఁడు దానకర్ణుఁడై
భూతలవాసులం గవులఁ బూజ్యులఁ విప్రులఁ బండితేంద్రులన్
బ్రీతమనస్కుఁడై మనిచె భూముల గీముల సంగ్రహించి వి
ఖ్యాతయశోవిశాలుఁ డయి కాలముపుచ్చెను సత్ప్రవర్తనిన్ 66

క. ఆతం డచ్యుతయమ యను
నాతిం బెండ్లాడి కనియె నరసింహాశుభా
ఖ్యాతుం గృష్ణమరాజుం
బూతాత్ముల నిర్వురైనపుత్రుల నెమ్మిన్. 67

ఉ. అందు నృసింహరాజు ఘనుఁడై వ్యవహారములందు దక్షుఁడై
కుందనపుంసలాక యనుకోమలి బుచ్చయమన్ వివాహమై
పొంది యురట్లమల్లవరమున్ గొని యుండి యటఁ బ్రియంబునం
గొందలపాటు లేనిమదిఁ గోరిక లీరికలెత్త వర్తిలెన్. 68

తే. ప్రథితుఁ డతఁడు సీతారామరాజవరునిఁ
గాంచి పుత్రుని జగదతిఖ్యాతుఁ డగుచుఁ
గులము వన్నెకుఁ దెచ్చి యింపలరె మిగుల
సుగుణగణములప్రోవయి సుకృతి యగుచు. 69

సీ. ఆరాజసుతుఁడు సీతారామరాజు తం
గెడుగ్రామమునయందు విడియ నగుచుఁ
జెఱువులు త్రొవ్వించి క్షేత్రముల్ సవరించి
పంటలు పండించి వనులఁ బెంచి
రాజబిరుద మంది రాజు లగ్గింపఁ దం
గెడుఁ గొట్టివాడ నాఁబడెడునూళ్ళ
విభుత సంపాదించి వెలయ సీతారామ
దేవాలయ మ్మటఁ దెలియ నిలిపె

తే. నుపవనంబులు నిర్మించి యూరిచుట్టుఁ
జలసమృద్ధిగఁ గుల్యలన్ నిలువరించి

చిన్నయమ్మను బెండ్లాడి శ్రీదుఁ డనఁగఁ
బ్రథితుఁ డయ్యె సీతారామరాజవరుఁడు. 70

సీ. సత్సంతతుల నిల్పునై వ్వాత్మకుఁడు సర్వ
చక్రంబులను నేలుసత్ప్రభుండు
దోషాకరుఁడు గానియోషధీశుం డెన్న
సన్నగింపనికళాశాస్త్రమూర్తి
గురుగద మొందనికువలయమిత్రుండు
విషరాశిఁ బొడమనివిశదకీర్తి
అకలంకుఁ డైనమహావిధుం డెందు ని
శాటత్వ మొందనియట్టిరాజు

తే. అతఁ డనఁ బిత్రుపైతామహం బైనరాజ్య
మును దనుము వోవఁ బాలించుచును ధరిత్రి
నఖిలధర్మపరాయణుం డగుచుఁ దనరె
రాజచంద్ర సీతారామరాజవరుఁడు. 71

వ. ఆసీతారామచంద్రుండు చిన్నాంబాదేవియందు జానకీరామరాజు
నృసింహరాజు సూర్యనారాయణరాజు జోగిజగన్నాథరాజు బుచ్చి
వేంకటపతిరాజు బుచ్చివేంకటరాజగోపాలరాజు ననునార్వురు పుత్రు
లం గనియె నందు నాద్యుం డగుజానకీరామరాజు. 72

తే. తండ్రి పొసఁగించుసత్కార్యతతికిఁ దాను
దోడుపడువాఁడ నై వానితోడ సతము
సర్వవిధములఁ దండ్రికి సవతు వచ్చి
సజ్జనస్తోత్రపాత్రుఁడై సౌరు మీఱె. 73

సీ. దేవేరి వేంకటత్రిపురసుందరనర
సయ్యాంబయనియెడుసాధ్వియందుఁ
గనియె సీతారామజనపతి నతఁడు జా
నకిఁ బెండ్లియాడి యాసక్తివలన

నప్పలనరసింహు నాత్మజునిం గనె
నల్లసీతారామునాత్మజన్ము
లందు యుఁగ్దై యలరునృసింహుఁడు
పెదబుచ్చివేంకయం బెండ్లియాడి
తే. తనయులం బొందఁ జాలక తనకనిష్ఠ
సోదరుఁడు రాజగోపాలుసుతుని ఘనునిఁ
బ్రవిమలాత్ము సీతారామరాజు దత్త
పుత్రునిఁగ స్వీకరించి తా పొలుపు మిగిలె 74

వ. తృతీయుండగు సూర్యనారాయణరాజు సుందరనరసయ్యామం బెండ్లియాడి జానకీరామరా జనుకుమారుని వేంకటసుభద్రియ్య యను కుమార్తెనుం గనియె జానకీరామరాజు ప్రథమభార్య యగురామ మూర్యమ్మయందు సూర్యనారాయణరాజును, ద్వితీయభార్య యగు లక్ష్మీనరసయ్యమ్మ యందుఁ జిన్నసూర్యనారాయణరాజు, రామకృష్ణరాజు, బుచ్చివేంకటపతిరాజు, సత్యనారాయణరాజు నను వారిం గనియె. 75

వ. సీతారామరాజు చతుర్థపుత్రుం డగు జోగీజగన్నాథరాజచంద్రుండు లక్ష్మీనరసయ్యాంబను దేవేరిగాఁ బరిగ్రహించి మనకృతిపతియు బుచ్చివేంకటగోపాలరాజు తృతీయపుత్రుం డగు సూర్యనారాయణ రాజుఁ దత్తహోమవిధిం జేసి పుత్రునిఁ గా స్వీకరించె. 76

క. తలవాఁకిళుల మెలంగెడు
నెలనాగయు మగనిఁబోమ్ము నెక్కెడు చెలియున్
జెలువుఁ డిల మెలఁగ గద్దె వ
యి లలిం జనుసకియు సాటియే యాయమకున్. 77

క. నరసయమ దైవభక్తియు
గురుభక్తియు భర్తృభక్తి గుదిరినమదితో
నిరతము మెలఁగుచు వారికిఁ
బరిచర్య యొనర్చునట్టిపద్ధతి నలరెన్.

వ. పంచమపుత్రుం డగుబుచ్చివేంకటపతిరాజు చినబుచ్చివెంకయ్యామ్మం
బరిగ్రహించి యామెవలన వేంకటనరసయ్యామ్మ వరహాలమ్మ యను
నిరువురు పుత్రికలం గాంచె. 79

మ. ఉరలాంపండితు లేగుదేర మది నెంతో సంతసం బందుచున్
బరమామోదముతోడ వారలఁ దగం బాటించుచుం బంచభ
క్ష్యరసాన్నంబులు పెట్టి నూర్లు పదులున్ సత్కారముల్ చేయుచున్
వచివస్యం బొనరించువాఁ డయి కడుం బ్రఖ్యాతినిం గైకొనెన్. 80

తే. సతతము పరోపకారము సలుప నగుచు
గుప్తదానము లెన్నియోఁ గోరి చేసి
యుత్తమోత్తముఁ డనుయశం బొంది వెలసె
బుచ్చివేంకటపతిరాజు భూతలమున. 81

వ. షష్ఠపుత్రుం డగుబుచ్చివేంకటరాజగోపాలరాజేంద్రుండు బుచ్చిబంగా
రయ్యం బెండ్లియాడి యామెవలన సత్యనారాయణరాజు వేంకట
నారాయణసీతారామరాజు సూర్యనారాయణరాజు సీతారామరాజు
నాఁబడునల్వురు కుమారులను బుచ్చిసీతయ్య సుందరయ్య చిన్నయ్య
వేంకటనరసయ్య వేంకటసావిత్రి బుచ్చివేంకయ్య యనునార్వురు
కుమార్తెలం గనియె మఱియును. 82

మ. కులమర్యాదయు సంప్రదాయమును నెక్కొఁ జేయుచున్ భ్రాతృవ
ర్యులయందుం గడుభక్తి గల్గి సత మార్యు ల్మెచ్చ సత్కార్యముల్
సలుపం గల్గినవాఁడయై గురుల నిచ్చం గొల్చి భూదేవతా
విలసద్భక్తియు దైవభక్తి గలఁడై వెల్గొందె నాతం డిలన్. 83

క. కంతు జయంత వసంతుల
నెంతయు సౌందర్యగరిమ నెదిరించెడు నా
శాంతస్వభావుఁ జూడఁగ
నెంతయు లోకంబువార లెంతయుఁ బ్రీతిన్. 84

వ. ఆరాజేంద్రునిధర్మపత్నియు. 85

తే. దైవభక్తియుఁ బతిభక్తి తనకు భూష
ణములు గా నొప్పెఁ బేదలై రమణ చెడిన
వారలకుఁ గొంగుబంగారమై రహించి
మించె బంగారమే యనుమిసిమిఁ గాంచి. 86

వ. ఆబుచ్చివేంకటరాజగోపాలరాజపుత్రులలో నగ్రజుం డగుసత్యనారా
యణరాజచంద్రుండు. 87

సీ. తాలుకాబోర్డునన్ కాంగ్రెసుప్రజాసంస్థఁ
ప్రెసిడెంటుపదము పండ్రెండు సమలు
చేసి మహాఖ్యాతి భాసిల్లె నారామ
ము లనేకములు చేసెఁ బొలములందు
నాంజనేయస్వామియాలయముం గట్టి
తనరించెఁ దద్దేవతాప్రతిష్ఠ
నందు నందును దేవతాలయములకడ
నిలిపె ధ్వజస్తంభములను బెక్కు

తే. వైదికాచారనిరతుఁడై భూదివిజుల
భక్తి గలిగి దర్శించుచు వారివలన
దీవనలఁ బొందుచు సతంబు దేవపూజ
లాచరించుచు నుండు నాధీచతురుఁడు. 88

చ. కనుఁ గొనఁగా విభక్తు లయి కర్జములం బొనరించువార లా
ననుజులు పుత్రుల ట్లగుచు నగ్రజుఁ డాతనిమాటవెంబడిన్
దనరుచు నుందు రాతఁడును దమ్ముల బిడ్డలకన్న మిన్న గాఁ
గనుఁగొనుచుండు నేడుగడ తా నయి యేలుచునుండు నెప్పుడున్. 89

సీ. బుచ్చిబంగారయన్ బొంది పత్నిగ నామె
వలనఁ గనెం బుత్రకులను ముగుర
ఘనులు వా ర్బుచ్చివేంకట రాజగోపాల
రాజనాముఁడు వెన్క రామచంద్రుఁ

డును రామభద్రుఁడు తనయులు సత్యవ
తియు సుందరయ బంగరయ యన ముగు
రల్లసత్యానుజుం డైననారాయణ
ప్రథితసీతారామరాజవరుఁడు
తే. వేంకటసుభద్రయమ్మ యర్కవెలఁదిఁ బెండ్లి
యాడి యగ్రసోదరసుతు ననఘు రామ
చంద్రరాజు సుతుం గాఁగ సంతరించు
కొనియె దత్తునిగాఁ జేసికొని ముదమున. 90
తే. వ్రతపరాయణుఁ డైనయారాజవరుఁడు
తంగెడున దేవళమునకు దాపునందుఁ
గట్టె విశ్రాంతభవనము కనులపండు
వగుచు నయ్యదిభాసిల్లు సొగసు మీఱి. 91
క. సీతారాములవెనుకన్
ఖ్యాతిం బొలుపొందు సూర్యనారాయణరా
జై తగి జోగిజగన్నా
థాతిప్రియదత్తపుత్రుఁడై తళుకొత్తెన్. 92
సీ. రాజగోపాలరాట్ప్రథితపుత్రులలోన
కడగొట్టువాఁడయి ఘనత కెక్కె
శ్రీసీతరామరాజాసూర్యకాంతమన్
గొని యామె వలన సద్గుణనిధులను
గనియె నృసింహరాజును గృష్ణరాజును
సూర్యనారాయణా[illegible]రుచిరాఖ్యుఁ
జినరామచంద్రరాజును సత్యవతి నాఁగ
నలరెడుకన్నియ నలువుమీఱి
తే. ఇట్లు పుత్రపౌత్రాది సమృద్ధ మగుచు
సాగివంశము జగదేకశస్త మగుచుఁ

41829 TIRUPATI

బొదలుచుండెడు తద్వంశభూషణ మయి
ప్రబలె సూర్యనారాయణ రాజవరుఁడు. 93

—♦ కృతిపతిచరిత్రసంగ్రహము ♦—

ఉ. శ్రీయుతలగ్న మైనతులఁ జేర బుధార్కులు మీనమందు రే
రాయఁడు కేతు వంగనను రాహుకవుల్ విలు భానుఁడున్ ఘటం
బాయమ రేజ్యుఁడు న్మకరమందు శనైశ్చరుఁ డొప్ప సూర్యనా
రాయణరాజు కార్తికమునందు జనించెను శోభకృత్తునన్. 94

తే. శనిమహాదశ పండ్రెండుసమ లెనిమిది
నెలలు నిరువదియొకదినంబులును మిగిలి
యుండునపు డుత్తరాభాద్రయుక్తభాను
వాసరైకాదశి జనించె నాసుజనుఁడు. 95

శా. సూర్యాభిఖ్యుఁ డతండు శుక్లకలితాబ్జుం డట్లు వర్ధిల్లి యై
శ్వర్యం బేర్పడ నెల్లవారలకు వాంఛాస్థానమై దేవతా
చార్యుం బోనిగురూత్తముం బడసి విశ్వఖ్యాతుఁడై విద్యలన్
వీర్యం బేర్పడ నేర్చి చల్లనయమై పెంపొందెడిం చంద్రుఁడై. 96

క. దేవబ్రాహ్మణభక్తిన్
భావింపంబడుచు నతఁడు పండితులయెడన్
భావము గలిగి మెలంగుచు
శ్రీనెలయన్ లోకధర్మశేవధి యయ్యెన్. 97

మ. నిజహస్తంబున నెంతవిత్త మగు నంతే కాక పై నెంతయే
సుజనుల్ యాచకు లేగుదెంచి యడుగం జూడంగఁ బోకవ్వలన్
బుజుచిత్తంబున నిచ్చు నిచ్చమెయి నేమే నేరికే నిత్తు నం
చు జగం బెన్నఁగ నాడె నే నను లోనవ్వుం దప్పిపోఁ డెప్పుడున్.

తే. ఆడితప్పనివాఁడు నత్యార్జకుండు
పలికిబొంకనివాఁడును భవ్యయశుఁడు
గొప్పవాఁడ నే ననుగర్వ మెప్పు డప్పు
రుషునకున్ లేనిమాటయె రూఢి తెలియ. 99

ఉ. స్నానము సంధ్యయున్ జపము సజ్జనసేవయు ధర్మచింతయున్
గాని యొకప్పు డన్యగతిఁ గాల్గదలింపఁడు దుష్ప్రసంగతిన్
దాను మెలంగఁ బోఁ డెపు డతం డొకదుర్వ్యసనంబువంక నే
మానసముం బొనర్చ ననుమాటవచింపరు నవ్వులాటకున్. 100

చ. జనకుల నట్టు లన్నల నజస్రముఁ గొల్చును దమ్ముకుఱ్ఱలన్
దనయులయట్లు చూచెడినిఁ దల్లులు వోలెను భ్రాతృపత్నులం
గనుఁగొను నన్యవిత్తమును గాచను పెళ్లగతిన్ దలంచు భూ
తనిచయ మాత్మవోలె సతతంబు గణించు నతండు దండియై. 101

చ. శ్రితుఁ డగువాఁ డొకప్పుడును జేసినతప్పును జెప్పిపుచ్చినన్
హితమతి నాలకించి యొకయింతయు వానికి హాని చేయఁ బో
కతులసమాదరంబునను నారయుచు న్మను పున్నప్రేమకున్
శతగుణ మైనప్రేమను బ్రశంస యొనర్చుచు బ్రోవఁ జూచెడిన్. 102

సీ. సూరిస్తుతుం డైనసూర్యనారాయణ
రా జెలమంచిలిగ్రామమందు
దేవాలయము గట్టి దేవసేనాని సు
బ్రహ్మణ్యదేవతాప్రవరు నిలిపి
తత్ప్రతిష్ఠకుఁ గొంతద్రవ్యము వెచ్చించి
ధూపదీపాద్యర్చ రేపుమాపు
సలుపుటకుం బ్రతిసంవత్సరము మూఁడు
వందలరూప్యముల్ వసన నిచ్చు

తే. మఱియు నప్పురి జరిగినమహితసత్రి
యాగమునకుఁ బదియు నెన్మి దైన నెలఁ
పదియు నెన్మిది నూర్ల రూప్యముల నిచ్చె
సాగిసూర్యనారాయణ త్యాగమూర్తి. 103

ఉ. ఆతనికాత్మగౌరవమతాభినివేశము లబ్బసంబునన్
జాతము లైనవం చనుట సత్యవిదూరము యుద్భవంబుతో

నై తళుకొత్తుచుండె నన నయ్యెడు గౌరవభంగ మన్న చోఁ
బ్రాతిగఁ బ్రాణ మెంచఁ డని పల్కఁగఁ వచ్చు యథార్థసంగతిన్.
శా. నే నీవాఁడను నన్నుఁ బ్రోవు మనుచున్ నిక్కంబు భాషించినన్
వానిం బుత్త్రునికన్న మిన్నగను సంభావించి తత్తన్మన
స్థానార్థంబులు దీర్చి పేర్చినదయన్ దా నెంచి రక్షించెడిన్
వానిం బోలినభక్తవత్సలుఁడు చూపట్టం డొకం డెక్కడిన్. 105
క. కపటము కల్లయు మోసము
విపరీతార్థంబు నికృతి వికటోక్తియు దం
భపదంబు సాగిసూర్యున
కెప్పుడున్ లే వనుచు సత్య మే వచియింతున్. 106
చ. దయగలవాఁ డతండు తనదండకు వచ్చినయెట్టివారినిన్
బ్రియమునఁ గాంచి వారిపనిరీతిఁ గనుంగొని దానికుత్తరం
బయ మగున ట్లొసంగుచు క్షణార్థము లోనన యంపిపుచ్చు ని
శ్చయముగ నిద్ది వానిసహజం బగుసద్గుణ మంచు నెంచెదన్. 107
చ. కవులనఁ గాఁ గవిత్వమనఁగాఁ గడుఁ బ్రేముడిఁజేసి వారికిన్
దవినమనం బొసంగెడు నతండు జగజ్జనవర్ణనీయుఁడై
కవి నగునన్ను నాకవితఁ గన్గొని మిక్కిలి సంతసించుచున్
సవిధమునంద యుంచుకొని సారెకుఁ బ్రోచుచు నాదరించెడున్. 108
సీ. అడిగినయర్థంబు లర్థుల కడలేక
యిచ్చెదుముచ్చట నెసఁగువాఁడు
ఘనతర మీయుపకారంబు నీచేతఁ
గా నౌ నటన్నచోఁ గడఁగు వాఁడు
పరుఁడైనబాధలఁ బడనున్నఁ జేతనై
నంతలోఁ దొలఁగింపఁ నలరువాఁడు
భూతదయాళుత్వబుద్ధి నెల్లెడ మంచి
వాఁ డని పే రంది వఱలువాఁడు

తే. అతఁడు నలువొందు సత్యవాక్యప్రవర్త
కుండు శాంతుఁడు సుగుణసాంద్రుండు మృదుల
హృదయుఁ డాచారనిరతుండు సదమలుండు
సాగిసూర్యనారాయణ క్ష్మావిభుండు. 109

చ. సుగుణము లెల్లఁ బ్రోగుపడి చూపఱకు న్మదు లుల్లసిల్ల ని
ర్జగమున సాగిసూర్యుఁ డన జన్మము నొందెనొ లేక తల్లి దా
సుగుణము లుగ్గున న్మెదపి సొంపుగఁ బోసెనొ బొజ్జలోనఁ గా
కగణితసద్గుణంబు లిటు లారయ నాదొర కేల కల్గెడున్. 110

సీ. విజ్ఞుఁ డాతఁడు పొల్చి వేంకటరాజగో
పాలారసుం డయి ప్రభవమంది
ఘనుఁడు శ్రీజోగిజగన్నాథరాజేంద్రు
దత్తపుత్రుం డయి తనరుచుండి
కలిదిండివంశవేంకటసుందరునకు వేం
కటసుభద్రయ్యకుఁ గలిగినట్టి
సాధ్వి వేంకటనరసయ్యను బెండ్లాడి
గార్హస్థ్యధర్మము ఘనత నడపు

తే. చంద్రమతికి సావిత్రికి క్ష్మాసుతకును
సాటి యని పేరుగాంచి విశాలజగతి
గరితతనమున నొప్పు వేంకటనరసయ
నామ సాధ్వీలలామ విజ్ఞానధామ. 111

సీ. చాపలంబున బెరజనుఁ జేర నొల్లని
మంగళ దేవి యీమంగళాంగి
బలురాగ మై నోళ్లఁ బడి రచ్చ లెక్కని
మంజులవాణి యీమంజువాణి
మగనిసామేను వోఁ దెగి గద్దరింపని
మృగరాజగమన యీమృగవరాక్షి

పాటి చెప్పినఁ గాని మాటాడఁ దలఁపని
విబుధేంద్రదేవి యీవిబుధదేవి

తే. అనుచు నెల్లరుఁ గొనియాడఁ బ్రాణనాథు
నెద వసించియు వాక్స్థాన మెలమిఁ గొనియుఁ
గలసికొని యనువర్తనముల నిలిచియుఁ
గొలుచు వేంకటనరసాంబ గుణకదంబ. 112

ఉ. మేనికి నీడ వోలి తనమే నిది నాఁగఁ దలిర్చుచున్ సదా
తానును భర్తయుం గలసి తత్త్వము చిత్తము మాట మంతియున్
గానఁగ వచ్చి యొక్కటిగఁ గన్నులపండువయై మెలంగు నా
మానవతీలలామఁ గొని మాన్యుఁడు ధన్యుఁడు సూర్యుఁ డెన్నఁగన్.

—♦ షష్ఠ్యంతములు ♦—

క. ఏతాదృగ్విధగుణవి
ఖ్యాతునకున్ రాజవంశకలశాబ్ధిసము
ద్భూతునకుం గవితాసం
ప్రీతునకున్ విష్ణుభక్తివిస్ఫీతునకున్. 114

క. పాత్రునకు వసిష్ఠమునీ
గోత్రునకున్ జోగిరాజకులపుత్రునకున్
జైత్రునకున్ సర్వజగ
న్మిత్రునకున్ సాగిసూర్యనృపగోత్రునకున్. 115

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాశీర్వదించి గ్రంథరచనాప్రారంభకాలంబునఁ బారాశర్యసమర్చితుం డగుపరమేశ్వరు నంతరంగంబునం దిడుకొని నిధ్యాననిశ్చలమనస్కుండనై. 116

"శ్లో. జన్మాద్యస్య యతో న్వయా దితరత శ్చార్థే ష్వభిజ్ఞ స్స్వరా
ట్తేనే బ్రహ్మహృదాయ ఆదికవయే ముహ్యంతి యత్సూరయః।
తేజోవారిమృదాం యథా వినిమయో యత్ర
ధామ్నా స్వేన సదా నిరస్తకుహకం సత్యం పరం ధీమహి॥" 117

"శ్లో. ధర్మః ప్రోజ్ఝితకైతవోఽత్ర పరమో నిర్మత్సరాణాం సతామ్
వేద్యం వాస్తవమత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనమ్।
శ్రీమద్భాగవతే మహామునికృతే కింవా పరై రీశ్వర
స్సద్యో హృద్యవరుధ్యతేఽత్ర కృతిభి శ్శుశ్రూషుభి స్తత్క్షణాత్॥

"శ్లో. నిగమకల్పతరో ర్గళితం ఫలం శుకముఖా దమృతద్రవసంయుతమ్
పిబతభాగవతం రసమాలయం ముహు రహో రసికాభువిభావుకాః"

వ. అని యుత్తమశ్లోకంబులగు వ్యాసకృత శ్లోకంబులఁ బరబ్రహ్మ ప్రార్థనం గావించి నాయొనర్పంబూనిన శ్రీకృష్ణభాగవతం బనుమహా పురాణంబునకుఁ గథాక్రమంబెట్టి-దనిన నైమిశారణ్యపుణ్యక్షేత్ర నివాసు లగుశౌనకాదిమహర్షులు హర్షోత్కర్షంబున సహస్రవర్ష సత్రయాగంబు గావించుచు సమాగతుండయిన రోమహర్షణతనూజాతు సూతుం బూజించి యి ట్లనిరి. 120

— ♦ సూత శౌనక సంవాదము ♦ —

సీ. సూత! విజ్ఞానసమేత! పురాణేతి
హాససంహిత లెల్ల నవధరించి
పరమార్థతత్త్వముఁ బ్రకృతిపురుషతత్త్వ
మును లోకమున నీవు బోధపఱచు
చుంటి నిన్నుం బోలి యుండఁడు తెలిసిన
వాఁడు వేఱొక్కఁ డీవసుధయందుఁ
గలి వఱ తెంచెడుఁ గలుగవు ధర్మముల్
భోగలాలసు లయి పోదు రెల్లఁ

తే. బ్రజలు వారికి సుగతులు వఱలు పొంటె
నానతిమ్ము శ్రేయస్సాధనాతి వేల
మైనదానిఁ దాపత్రయం బడఁచుదాని
సులభముగ ముక్తిమార్గముఁ జూపుదాని. 121

మ. భగవంతుం డగువాసుదేవుఁడు ధరాభారంబు వాపంగ వాం
ఛ గలాఁడై వసుదేవునాలయమునన్ జన్మించి భక్తాళికిన్

సుగతుల్ గల్గఁగఁ బెక్కులీలలను నీక్షోణిం బ్రదర్శించె నో
ప్పుగ నయ్యున్నియు సర్వపావనములై హర్షోందు నా నొప్పెడున్.

సీ. ఆమహనీయునినామమే సంసార
దుఃఖనాశకమయి తోఁచుచుండు
నాభగవంతునియవతారమే జగ
త్క్షేమంకరం బయి చెన్నుమీఱు
నా దేవదేవునియంఘ్రియుగ్మమె భవ
భయహరం బయి మహాప్రతిభఁ గాంచు
నా దైత్యదమనునిపాదగంగయె జగ
త్త్రియము పునీతమై తనరఁ జేయు

తే. నారదాదిమహర్షు లాశౌరిదివ్య
కథలు వర్ణించుచుం బుణ్యకలితు లైరి
వానిసంస్మరణమె సర్వపాపహరము
వానినే వినఁ గోర్కె యేవానికైన. 123

మ. ఎవఁడో మూఢుఁ డొకండు విష్ణుకథలం దిష్టంబు లేనట్టిఁడై
భువిపై నుండిన నుండు వాఁడు పసరంబుం బోనివాఁ డెల్లరున్
జవులం దేలెడుతత్కథామృతము నిచ్చం గ్రోల యత్నింతు రో
శివతాతీ! వచియింపు మద్ది శ్రుతికిం జేకూర్పఁగాఁ బర్వమున్. 124

మ. కలిమాయన్ సవనాదులం గెడపఁగాఁ గాంక్షించుమా కిప్డు గా
దిలి పుచ్చెన్ హరి నిన్ను సాగరము నర్థిం దాఁటఁగా నున్నమ
ర్త్యులకున్ నావికుఁ బుచ్చినట్లు కరుణాభా! తత్కథానౌకపై
బలిమిన్ నిల్పి భవార్ణవంబు తరియింపం జేయవే భూప్రజన్, 125

తే. బ్రహ్మకులసాధువై ధర్మపాలకుఁ డయి
దీనపరతంత్రుఁడై కృష్ణదేవుఁ డరిగె
నిపుడు తత్కథలే మన కెడ్గడ లయి
యుద్ధరింపఁగఁ జాలెడు నోయి సూత.

వ. అని ప్రార్థించినం బ్రసన్నహృదయుండై రౌమహర్షణి మహాహర్షంబున
భగవత్కథాకాలక్షేపంబు సేయం దలంచి కన్నులు మూసికొని
తనమనంబున. 127

— సూతుఁడు నారాయణస్మరణంబు చేయుట —

మ. భవబంధంబులు కర్మబంధములు ద్రుంపం జాలి యోగీశ్వర
ప్రవరుం డొక్కఁడ జ్ఞానమూర్తి యయి పోవం బోవ వ్యాసుండు పు
త్రవిమోహంబున బిడ్డ! యంచుఁ బిలువన్ దద్రూపమై మాఱు మ్రో
సె వనానోకహజాల మట్టిశుకునిన్ సేవింతు భూతాత్మునిన్. 128

వ. అని భాగవతంబునకు మూలకంద మగుశుకునిం గీర్తించి గురువందనం
బాచరించి నరనారాయణ సరస్వత్యాదుల కెఱంగి శౌనకాదుల
దిక్కు మొగంబై యి ట్లనియె. 129

చ. అడిగితి రీరు లోకహిత మాస పొనర్చుచుఁ బ్రశ్న మిద్ది యె
ప్పుడు సకలేష్టదం బగుచుఁ బొంపిరివోయెడు విష్ణునామముల్
విడువక సంస్మరించినను విఘ్నము లన్నియుఁ బాయుఁ బుణ్యముల్
కడుకొని డాయు ముక్తియును గల్గెడు నెయ్యెడ నెట్టివానికిన్. 130

సీ. వాసుదేవునియందు బద్ధమై శుద్ధమై
కలిగినభక్తి తత్కరుణఁ జేసి
భవబంధముల నెల్లఁ బాఱఁ దోలుచు నాత్మ
విజ్ఞాన మెంతయు వెలయఁ జేయు
దాన సాక్షాత్కారమై నిభృతానంద
మనుభవింపఁగఁ జాలు నతఁడు తాన
యై మోక్షలక్ష్మీసమాశ్లిష్టుఁడై పర
మాత్మునిలో లీనమై సుఖించు

తే. ఫల మపేక్షింపకయ కర్మముల నొనర్చి
ధర్మ మర్థము కామము దవిలి వడిపి
సంగమును బాసి సత్సంగసాధనముల
భక్తియ [illegible] సంగ్రహింపంగ వలయు. 131

తే. ధర్మమునఁ జేసి యర్థము దానివలనఁ
గామ మందున నింద్రియగ్రామతృప్తి
దాన జీవననే ఫల మూ నటంచుఁ
గొంద ఱంద్ర ట్లనం జెల్ల దంసు మేము. 132

క. కామన చేయక చేసిన
యేమాత్రపుధర్మ మైన నెంతయు ఫలదం
బై మించి ... ఁ గూర్చెడు
నామూలమునన్ లభించు నఖిలార్థములున్. 133

తే. కావునన్ మునుల్ సవనాదికర్మములను
సలిపి విజ్ఞానవంతులై సకలశుభము
లందఁ గలుగుచునుందు రోయనఘులార !
భక్తియే ముక్తిసాధనశక్తిఁ దనరు. 134

చ. జపము తపంబునుం జలుపఁ జాలనివారు నిరంతరంబు లోఁ
గృపణత లేక విష్ణుగుణకీర్తనముల్ వినువార లైనచోఁ
జపలము గానిభక్తి మది సంభవ మందెడు దాన జ్ఞాన మై
యెపుడును వీడిపోని కమలేశ్వరుఁ గూడి మెలంగ నయ్యెడిన్. 135

సీ. విష్ణుపరంబులు వేదముల్ యజ్ఞముల్
వేదాంతవిహితము లై తలిర్చు
యోగసాంఖ్యాదులు యోగీశ్వరుం డగు
విష్ణుపరంబులు వివిధకర్మ
ములు దానములు వ్రతంబులు సర్వశాస్త్రముల్
విష్ణుపరంబులై వెలయుచుండు
సర్వమున్ విష్ణువే సత్వాదిగుణముల
వివిధరూపంబులుఁ దవిలి యుండు

ఆ. విష్ణుమయము గాక వే ఱగునది లేదు
వివిధజీవులందు వెలయుచుండి

నహ్నా గట్టులోనివానియం దుండి వే
రైనయట్లు తోఁచు నచ్యుతుండు. 136

ఉ. అన్నిట నిండి యుండుఁ బరమాత్ముఁడ యెల్లర కాదిమూల మై
సన్నుతమూర్తి యై తలఁచు సజ్జనులం దనురక్తుఁడై శుభా
సన్నము గాఁగఁ బెక్కు లయి సాధ్వవతారము లెత్తుచుండు స
ర్వోన్నతుఁడై జగచ్చయము నోమెడుచిత్తము గల్గి వింటిరే. 137

తే. అతఁడు సృష్టిని గావింప నాది నెంచి
పదునొకం డింద్రియంబులు పంచభూత
ములను పదునాఱుకళలతోఁ బొలుపుమిగిలి
తత్త్వమయ మగురూపము దాల్చె మున్ను. 138

సీ. అతఁడు యోగనిద్రాసక్తి జలమందు
శయనించి యుండ నాసమయమందు
నతనినాభీపద్మమందు మరీచిము
ఖ్యప్రజాపతులకు నధిపుఁ డైన
బ్రహ్మ పుట్టెను వానివలనఁ లోకము లయ్యె
నంతకుం గారణమై దలిర్చు
సర్వేశ్వరునిరూపు సత్త్వమయం బగు
నదియె సర్వాదియై నతిశయిల్లె

తే. అవల ననిరుద్ధరూప మా నది ద్వితీయ
మయి సహస్రశీర్షములు సహస్రహస్త
ములు సహస్రాంఘ్రులు సహస్రముఖములును స
హస్రనయనంబులుం గల్గి యలరుచుండు. 139

— ఏకవింశత్యవతారములు —

ఉ. ఆరమణీయమూర్తియె సమస్తజగంబున కబ్జయోనికిన్
గారణభూతమై తెలియఁ గాఁ బడె దానికి నేవికారమే
నారయ రాదు సర్వము తదంశజ మెన్న సనత్కుమారుఁడై
తీరిచి బ్రహ్మచర్యము ప్రతిష్ఠితముం బొనరించె ధారుణిన్. 140

వ. ఇది ప్రథమావతారంబు యజ్ఞవరాహంబై కృంగిపోవుభూమి నుద్ధరించె నిది ద్వితీయావతారంబు నారదుండై పుట్టి పంచరాత్రశాస్త్రంబు ప్రవర్తింపం జేసె నిది తృతీయంబు ధర్మునిభార్య యగుమూర్తి యందు నరనారాయణులై పుట్టి ప్రపంచార్థము మహోన్నతతపంబు గావించె నిది చతుర్థంబు కపిలుండై పుట్టి యాసురి యనుబ్రాహ్మణునకుఁ సాంఖ్యశాస్త్రం బనుగ్రహించె నిది పంచమంబు అనసూయాత్రులకు దత్తాత్రేయుండై పుట్టి యలర్కప్రహ్లాదుల కధ్యాత్మతత్త్వం బెఱింగించె నిది షష్ఠంబు రుచిమహామునికి నాకూతియందు యజ్ఞుం డనం బుట్టి స్వాయంభువమన్వంతరకాలం బెసంగం జేసె నిది సప్తమంబు ఆగ్నీధ్రపుత్రుఁ డగునాభికి మేరుదేవియందు ఋషభుం డనం బుట్టి యోగీశ్వరానుష్ఠేయాశ్రమాదిధర్మంబులు బోధించె నిది యష్టమంబు పృథుచక్రవర్తియై గోరూపధారిణి యగుధారుణి నోషధులం బిండె నిది నవమంబు చాక్షుషమన్వంతరసంప్లవంబున మహామత్స్యంబై మహీరూపం బగు నావ నెక్కించి వైవస్వతమనువుగా నున్నసత్యవంతుం గాపాడె నిది దశమంబు కూర్మంబై సముద్రమున మునుంగు మందరంబు తనవీఁపునం దాల్చె నిది యేకాదశంబు ధన్వంతరియై యమృతకలశంబు దెచ్చి దేవతల కిచ్చె నిది ద్వాదశంబు మోహినీరూపం బెత్తి పూర్వదేవతల మోహింపం జేసి దేవతల కమృతం బొసంగె నిది త్రయోదశంబు నరసింహమూర్తియై హిరణ్యకశిపుం ద్రుంచి ప్రహ్లాదుం బ్రోచె నిది చతుర్దశంబు వామనమూర్తియై బలిచక్రవర్తిచే నపహృతం బగులోకత్రయంబు మరల సంగ్రహించి యింద్రున కిచ్చె నిది పంచదశంబు పరశురాముండై బ్రహ్మద్రోహులగురాజుల ముయ్యేడుమాఱులు సంహరించె నిది షోడశంబు సత్యవతియందుఁ బరాశరునకు వ్యాసుండై పుట్టి వేదంబుల కచ్చుకట్టి పురాణంబులు రచించె నిది సప్తదశంబు దశరథరాముండై పుట్టి దుష్టులగురావణాదుల రాసి పుచ్చె నిది యష్టాదశంబు యదువంశంబున రామకృష్ణులై పుట్టి కంసాదుల సంహరించి భూభారంబు హరించె

నిది యేకోనవింశత్యవతారంబు పదంపడి కీకటదేశంబున జినునకు
బుద్ధుండై పుట్టి దుష్టులకు మోహంబు పుట్టించు నిది వింశత్యవతారము
కలిపేరితు లై చోరప్రాయులు పాపస్వభావులు నగుదుష్టజనుల
సంహరింప విష్ణువర్ధనునకుఁ గల్కి యనం బుట్టి కృతయుగధర్మంబు
నిలుపు నిది యేకవింశత్యవతారంబు మఱియు లోకావనార్థము భగ
వంతుఁ డెన్నియో యవతారంబు లెత్తె మంత్రద్రష్ట లగువసిష్ఠాదు
లును బ్రహ్మనిష్ఠు లగుశుకాదులు నింద్రాదులును బ్రియవ్రతాది
మనుపుత్రులును దక్షాదిప్రజాపతులు మొదలగువారు విష్ణునంశాం
శంబున జనించినవారు రామకృష్ణాదులు భగవంతుని పూర్ణావ
తారము లని మఱియును. 141

క. ఈయవతారరహస్యము
లాయాకాలముల భక్తులై పఠియింపన్
బాయు సమస్తామయముల్
డాయున్ సౌఖ్యంబు లెల్లెడ న్మనుజులకున్. 142

— సూతుఁడు తత్త్వవిచారము చేయుట —

సీ. రామకృష్ణాదులే దామోదరావతా
రము లన నొప్పు దీప్రకృతి యెల్ల
తద్రూపమే యనఁ దగు ని ల్లెఱుంగక
నేనె దేవుం డను నే మనుజుఁడ
నా దేహ మిది యని వాదు లాడుచునుండు
యాథార్థ్య మెఱుఁగనియట్టి రగుచు
వాయువునకు దుమ్మువలన రూ పెంచెడు
నట్టు భ్రాంతిచే జీవునందు రూపు
తే. ఆఁపుచంద్రు దృశ్యత్వ మారోపితంబు
కాని జీవస్వరూపము కాదు తెలియఁ
గానఁ బడఁ డెప్డు జీవుఁడు వానికెపుడు
చావుపుట్టువుల్ లేవునాశనము లేదు. 143

క. జీవుఁడు కర్మాధీనుం
డై వెస జన్మముల నెత్తునట్టిం డగుచున్
గావించుఁ బుణ్యపాపము
లీవిధి మాదేవునకుఁ గల్గ దింతయుఁ దెలియన్. 144

తరళ. చిదచిదాత్మక మాప్రపంచముఁ జేసి యీశుఁడు లీలమై
సదమలంబుగఁ గాచి ప్రోచియుఁ జంపు నవ్వల నట్లు గా
కెదియొ యుంచక చేసి కర్మము నెప్డు విఘ్నహతుండు నై
పొదల నేరఁడు జీవుఁ డిద్దియె పో విభేదము చూడఁగన్. 145

సీ. భగవంతుఁడు స్వతంత్రుఁ డగు జీవుడుం బోలె
నస్వతంత్రుఁడు గాఁడు భాస్వరుండు
జ్ఞానశక్త్యాదిగుణానపాయత గల్గి
మోహదుఃఖాదులఁ బొందఁ బోక
యనుభవించున్ విషయాదుల లీలమైఁ
దనదుసంకల్పమునన నటుండు
వలెను దేవాదిరూపము లంది మెలఁగును
మత్స్యకూర్మాదు లీమాద్రి నయ్యె

ఆ. వేషధారి తనదువేషంబునకుఁ దగు
చర్య గలిగి మెలఁగు చందమునను
దవులుచు భగవంతుఁ డవతారముల నెత్తఁ
గలఁడు స్వస్వభావములను విడక. 146

ఉ. మీరలు భక్తియోగమున మించినవారలు దానఁజేసి సం
సారపరిభ్రమం బెప్పుడు సంభవ మందదు మీకు ముక్తికిన్
దారి లభించె భాగవతనామక మైనపురాణ ముత్తమం
బై రమణించు దానిని మహాత్ముఁడు వ్యాసుఁడు చేసె వాసిగన్.

క. దానిన్ జ్ఞానులకుం దల
మానిక మగుశుకునిచేత మాన్యునిచేతన్

బూని చదివించె నయ్యాది
జ్ఞానమునకు నిలయము శ్రుతిసమ్మత మరయన్. 148

ఉ. జ్ఞానము భక్తియోగమును గల్గినభాగవతంబు నమ్మహా
మౌనివరేణ్యుఁ డాశుకుఁడు మానసవీధిని నిల్పి కొంచు న
ద్దానిఁ బరీక్షితుం డనెడుధాత్రికళత్రునకున్ వచింపఁ గా
నే నటఁ జేరి వింటి వచియించెద మీ కది విన్నయట్లుగన్ 149

తే. కృష్ణభగవానుఁ డరిగిన క్షితితలంబు
రాత్రి యై నట్లు చీఁకట్లు గ్రమ్ముకొనియె
భాగవతము సూర్యుఁడు వోలెఁ బ్రభవ మంది
ప్రజ్ఞ గలిగించుఁ జీఁకట్లఁ బాయఁ జేసి. 150

వ. అని చెప్పిన వృద్ధుండును ఋగ్వేదియు నగుశౌనకుం డుగ్రశ్రవసుని
దిక్కు మొగంబై నీవు తత్త్వార్థవేత్తవు బాదరాయణపుత్రుండును
భగవంతుండు నగుశుకుండు పరీక్షిత్తునకుం జెప్పినభాగవతం బెల్ల
మాకుఁ జెప్పు మని మఱియును. 151

—♦ భాగవతరచనావిచారము. ♦—

సీ. బాదరాయణుఁ డేనిపంపున భాగవ
తము రచించెను వానితనయుఁ డైన
శుకుఁడు మహామహుం డొకఁనాఁటికిని దన్నుఁ
దెలియంగ నీయక తిరుగుచుండుఁ
బరమాత్మపై దృష్టి పరఁపి వెంబరవిత్తు
వలె నుండు వేఱొకోఁ బలుకఁ డెపుడు
గురుజాంగలంబులఁ దిరుగునాతఁడు హస్తి
పురి కెట్లు పోయెను బుడమిఱేని

తే. కెట్లు దర్శన మిచ్చెఁ దా నెట్లు భాగ
వతము వచియించె గోవులపాలు పిండు
నంతకాలమ యొక్కచో నడుగు నిలుపు
వాఁ డచట నంతకాల మేవాసి నుండె. 152

చ. ♦శుకుఁడు దిగంబరుం డగుచుఁ జొప్పనఁ బోవుచునుండ నొక్కచో
నొకనది నాడునాం డ్రతని నొద్దఁ గనుంగొనుచుండి రంతఁ గొం
కక కొడుకా యటంచు వెనుకం జనుదెంచెడువ్యాసుఁ జూచి సం
శుకములు దాల్చి రప్డు మునిసోముఁడు వారలఁ జూచి యి ట్లనున్.

ఆ. ♦కోడెకానిఁ జూచి కోకలు చుట్టరు
వృద్ధు నన్నుఁ జూచి వెలఁదులార!
బిడియమునను దొట్రుపడుచుఁ గోకలు చుట్టి
రేమికతమొ చెప్పుఁ డిప్పు డనిన. 154

తే. ఈవు స్త్రీలను బురుషుల నెఱిఁగి యుంటి
వతఁడు స్త్రీపురుషవిభేద మనఁగ నేమొ
తెలియనట్టిఁడు గాన నిట్టులు మెలంగి
నార మని చెప్పినా రఁట వారు బళిర. 155

వ. అట్టిభాగవతోత్తమునితో భాగవతోపదేశంబు నొందినపరీక్షిన్నరేం
ద్రుండు పరమభాగవతుం డతనివృత్తాంతం బత్యద్భుతం బండ్రు
కావున నంతయు నెఱింగింపు మనిన సూతుండు సంతసించుచు ని
ట్లనియె. 156

సీ. సత్యవతీపరాశరులకుం బుట్టిన
బాదరాయణుఁ డొక్కప్రాహ్ణమందు
నరిగి సరస్వతి కఘమర్షణస్నాన
మాచరించి రవికి నర్ఘ్య మొసఁగి
తీరమం దెవ్వరుఁ జేరనిచోటను
గూరుచుండి ప్రపంచ మారఁ జూచి
యాచారహీనులు నాస్తికుల్ ధర్మవి
ప్లవకారు లల్పజీవనులు ఖలులు

చొప్పన=మార్గమందు; కోడెకాఁడు=యౌవనవంతుఁడు.

సీ. ఆశ్రమాచార వర్ణమతాదులందు
భ్రాంతి జేనట్టిరై మందభాగ్యు లగుచుఁ
బుట్టెదరు వారిఁ జేర్చుట యెట్టు లొక్కొ-
యనుచు ధ్యాననిశ్చలమనంబునఁ దలంచి. 157

వ. సకలశ్రేయస్సాధనంబును జాతుర్హోత్ర మంత్రప్రకాశనీయంబును
యాగాదిరూపకంబు నగునట్టి వేదంబులు ఋగ్యజుస్సామాథర్వణంబు
లుగా విభజించి స్త్రీశూద్రద్విజబంధుబోధకంబుగా నితిహాసంబులును
బురాణంబులును బంచమవేదం బనుభారతంబును రచించి యందు
ఋగ్వేదంబు పైలుండును యజుర్వేదంబు వైశంపాయనుండును సామ
వేదంబు జైమినియు నథర్వవేదంబు సుమంతుండును నితిహాసపురా
ణంబులు మాతండ్రియగు రోమహర్షణుండును జదివి పారంగతు లగు
నట్లు చేసి దీనవత్సలుం డగునావ్యాసుం డిట్లు లోకోపకారంబు
గావించియు సంతసింపనిస్వాంతంబున. 158

చ. గురువులసేవ చేసితిని గొల్చితి నగ్నుల వేదశాఖలన్
గరిమ నెసంగఁ జేసితిని నాలుగువర్గము లేర్పడన్ మహో
త్తరములు బ్రహ్మముఖ్యము లుదారపురాణములున్ రచించితిన్
నిరతపవిత్రతం గలిగి నేను ప్రశంసకు నెక్కియుండియున్. 159

ఆ. కొఱఁత స్వాంతమందుఁ గొంత గల్గినయట్లు
తోఁచుఁ గారణంబు తోఁప దయినఁ
బలుక నైతి భాగవతధర్మములు కాన
నాదుచిత్త మిట్లు నవయుచుండు. 160

ఉ. భాగవతార్థధర్మములు ప్రస్తుతి కెక్కఁగ నొక్కగ్రంథమున్
బాగుగఁ జేసి వాసి గలభక్తుల కిచ్చెద వారు మెచ్చినన్
భాగవతుల్ తరింత్రు భగవంతుఁడు నెంతయు సంతసించు నా
యోగము మంచిదై తనరునో యని లోఁ దలపోయుచుండఁగన్. 161

—♦ నారదుఁడు వ్యాసునికడకు వచ్చుట ♦—

సీ. ♦వేదోపనిషదర్థవేత్త పురాణేతి
హాసకల్పన్యాయభాసురమతి
ధర్మతత్త్వజ్ఞుండు ధర్మార్థకామమో
క్ష వినిశ్చయజ్ఞానకలితచిత్తుఁ
డంగషట్కవిధిజ్ఞుఁ డైక్యసంయోగనా
నాత్వాదిసమవాయనయవిదుండు
పంచావయవయుక్త వాక్యదోషగుణజ్ఞుఁ
డుత్తరోత్తరవక్త సత్తపస్వి
తే. కవి ప్రగల్భుఁడు మేధావి భువనదర్శి
సర్వశాస్త్రప్రవీణుఁడు సంధివిగ్ర
హాదిషాడ్గుణ్యతత్త్వజ్ఞుఁ డనఘమూర్తి
నారదుం డఖిలకలావిశారదుండు. 162

వ. అట్లు వచ్చిననారదు నల్లంతదవ్వులం గాంచి వ్యాసుండు లేచి వాని కెదురేగి తోడితెచ్చి సుఖాసనాసీనుం గావించి పూజించిన సంతసించుచు బ్రహ్మమానసపుత్రుండు పరాశరపుత్రుం గాంచి శంకించుచు నిట్లనియె. 163

ఉ. వ్యాసమునీంద్ర నీమనమునం దెప్పుడున్ ముద మావహిల్లునే
చేసితి భారతంబు శ్రుతిశీర్షము లేర్పడ నాల్గుశాఖలన్
భాసిల సంతరించితివి పావనమూర్తివి సర్వధర్మముల్
నీసముఖంబునం దెపుడు నిల్చును నీకు విచార మేటికిన్. 164

చ. అనుటయు వ్యాసుఁ డిట్లనియె నౌ నవు నీ వనినట్లు సర్వమున్
దనరెడుఁ గాని నాదగుమనంబున సంతస మొందకుండె నో

♦ అంగషట్కము=శిక్ష, వ్యాకరణము, ఛందము, నిరుక్తము, జ్యోతిషము, కల్పము; ఐక్యము=పృథివ్యాదిరూపైకభావము; సంయోగనానాత్వము=అసాధారణ సంబంధముగల పృథివీత్వజలత్వాదిరూపభేదము; సమవాయము=భూతసాధర్మ్య వైధర్మ్య సాంకర్యము; పంచావయవములు = ప్రతిజ్ఞాహేతూదాహరణోపనయ నిగమనములు; షాడ్గుణ్యము=సంధి విగ్రహ యాన ఆసన ద్వైధీభావ సమాశ్రయములు.

మునివర బ్రహ్మపుత్రుఁడ వభూతచరిత్రుఁడ వెల్లలోకముల్
కనుఁగొనివత్తు సూర్యునిప్రకారమున న్నినుఁ బోల రెవ్వరున్. 165

క. నీకుం దెలియని దింతయు
లోకంబున లేదు నాదులో నీరీతిన్
వ్యాకులత గలిగి యుంటకు
నేకారణమో వచింపవే మునినాథా. 166

వ. అనిన నారదుం డి ట్లనియె. 167

మత్త. ఇంచు కించుక గాఁగఁ జెప్పితి వీవు భాగవతార్థముల్
సంచితంబుగఁ జెప్ప వైతివి సంయమీశ్వర! యద్ది నీ
కించుకుం గలకారణం బగు కేవలం బొకభక్తినే
పెంచి భాగవతం బొనర్పుము విష్ణుకీర్తనఁ మొప్పఁగన్. 168

క. భగవన్మహిమము తెలుపని
దగుకావ్యము కాకతీర్థ మట్టులు వ్యర్థం
బగు బహులక్షణవంతం
బగ నుండిన యమకచిత్రములఁ బే ర్వడినన్. 169

మ. పరమోదారగభీరకల్పనలతో భాసిల్లకున్నన్ మహో
త్తరచిత్రాదులఁ గల్గకున్న నపశబ్దం బర్థమై యుండినన్
హరి! నారాయణ! వాసుదేవ! జగదీశా! యంచుఁ గీర్తించుచుం
గర మొప్పారుప్రబంధ మైన త్రిజగత్కల్యాణముం గూర్చెదున్. 170

ఉ. ఐహికధర్మముం దెలుపునట్టివి యెట్టివి యైన కబ్బముల్
దేహికి నిష్ప్రయోజకతఁ దెచ్చెడి వయ్యెడుఁ గావు ముక్తికిన్
దోహదముం బొనర్చు నవి దూదికి నెత్తగు సారహీనముల్
దేహము పోయినన్ ప్రజకుఁ దేజ మిడు భగవత్ప్రబంధముల్. 171

క. అపురుషోత్తముఁ జేరో
నోపని గ్రంథములు లెంతె యొప్పినఁ గావ్యా
లాపాంశ్చ వర్జయే త్తను
వ్యాపనమున కైన వనుచువర్ణింప నగున్. 172

ఉ. భూతహితంబు సేయుటకుఁ బొంకెఱు జగంబున నచ్యుతాంశసం
భూతుఁడ వైతి నీ వితరముల్ వచియించుట కాదు వైష్ణవ
ఖ్యాతకథాప్రసంగమునఁ గానఁగ వచ్చుమహాప్రబంధ మ
త్యాతతభక్తియుక్త మగునట్టులు చేయుము నీకు మే లగున్. 173

ఉ. నీవు మహానుభావుఁడవు నేర్తు సమస్తము విష్ణుభక్తసం
భావితభక్తిభావమున భాసిలుభాగవతాఖ్యకావ్యమున్
శ్రీ వెలయంగఁ జేసి సరసీరుహలోచనుజన్మకర్మముల్
భూవలయంబునన్ విఱియు పోలికఁ దెల్పుము పొల్పు మీఱఁగన్.

వ. బాదరాయణా! భగవద్గుణానువర్ణనంబునం జేసి నీవు కృతకృత్యుండ
వగుదు వెట్టియవరవర్ణుం డయినను హరిభజనమ్మునం జేసి భాగవతో
త్తముం డగు దీనికిఁ దాత్కారణంబుగా మదీయపూర్వజన్మవృత్తాం
తంబు చెప్పెద నవహితుండ వగు మని మఱియును. 175

— నారదునిపూర్వజన్మవృత్తాంతము —

సీ. నాతొంటిపుట్టువునన్ నే నొకానొక
వేదవాదులయింటివిధులు తీర్చు
దాసిపుత్రుఁడ నయి తను వంది యుండితి
నపుడు వర్షాకాల మరుగుదెంచెఁ
దివిరి చాతుర్మాస్యదీక్షఁ దీర్పఁగ నొక్క
చో నివాసము సేయుమానసమున
సన్న్యాసు లగువారు చనుదెంచి నలు నెలల్
వేదవాదులయింట విడిసి యుండి

తే. రపుడు వారికి శుశ్రూష లాచరింప
నేను నియమితుఁ డయి వారి నెపుడు విడక
కన్నుసన్నలనే యెల్లకార్యములను
సలుపునట్టిఁడనై వారిఁ గొలిచినాఁడ. 176

ప్రత్యూషమున లేచి నిత్యకృత్యంబులు
నెఱవేఱఁగాఁ జేసి నిర్మలోద
కముల నాడఁగఁ జేసి కాయంబు తడి యొత్తి
భస్మత్రిపుండ్రముల్ పరఁగఁ బెట్టి
దేవార్చకంబులు దెచ్చి గోపీనముల్
శాటికలును మంచి నీట నుదికి
ఫలము లాహరింప సలిపి కాళ్సేతులు
గడిగి నీళుల నొత్తి యిడి తులసిని
పాదసంవాహన మొనర్చి పరమభక్తి
నాటలకుఁ గాక వేఁడుక లరయఁ బోక
వార లానతిచ్చినయట్లు పనులు సేయు
చును భజించితి వారల కనుగతి నయి. 177

మితభాషి నగుచుఁ జెప్పిన
గతి మెలఁగెడునన్నుఁ గాంచి కరుణామయులై
యతివరులు తాము తిని శే
షిత ముచ్ఛిష్టము మొసంగఁ జేసిరి నాచేఁ. 178

ప్రతిదినం బ ట్లుచ్ఛిష్టభోజనంబు చేయుచు సేవించుటం జేసి ధర్మప్రతిబంధకంబు లగుపాపంబులు తొలంగ భాగవతశుశ్రూషం జేయుచుఁ బరిశుద్ధమనస్కుండ నై భగవచ్చింతాపరుండ నై నిజాంతఃకరణంబున నియమవ్రతంబుగాఁ గృష్ణసంకీర్తనంబునం దభిరుచిం గలవాఁడ నై పరివ్రాట్టులపరమానుగ్రహపాత్రుండ నై భగవద్భక్తిం దగిలి తదేకారాధనపరుండ నై పరివర్తించితి నిట్లు శరద్వర్షఋతులు నాలుగుమాసములు వారి సేవించుచు వారిపాదోదకంబును భుక్తశేషంబును స్వీకరించుచుఁ బరిచర్యలం జేయుచు వినీతుండ నై యున్నంత దీనవత్సలు లగువారు నాయందుఁ గరుణఁ జేసి యతిరహస్యం బగుజ్ఞానం బుపదేశించిరి దానం జేసి నేను భగవంతుని త్రిగుణాత్మకప్రకృతిమహిమం బెఱింగికొంటి నట్టివిజ్ఞానంబున జ్ఞాను లావాసుదేవపదంబు నొందఁ

గలవా రగుదురుగదా ద్వైపాయనా! నా కట్టిభక్తిజ్ఞానములు
గలుగుటకు వాసుదేవగుణశ్రవణంబ కారణంబును మహాత్ములసేవయు
నని యెఱుంగుము మఱియు నీశ్వరార్పితకర్మకలాపము భక్తియోగ
మూలమునఁ దాపత్రయశాంతి గావించు ఫలాపేక్షిత మైనకర్మకాం
డము సంసారహేతువై తాపత్రయంబుం గూర్చునట్టి దగు నాకర్ణిం
పుము. 179

సీ. అవని నపథ్యవస్తువుల భక్షించుట
సంభవించెడి రోగసంచయంబు
వ్యాధికారణభూతవస్తువులే యౌష
ధముగ సేవింప రోగములు దెరలు
నట్లు కర్మములు ఫలాభిసంధికిఁ గాక
భగవదర్పితబుద్ధిఁ బరఁగె నేని
తాపత్రయంబునఁ దగిలినసంసార
సాగరము దరింప సాధన మగుఁ

తే. గాన భగవంతునకు మెప్పు గలుగుపొంటెఁ
గర్మముల నాచరించి తత్కలితభక్తి
యోగమున జ్ఞానియై ముక్తి నొందఁ గలఁడు
జనుఁ డని యెఱుంగ వలయు నోసంయమీంద్ర. 180

తే. భగవదర్పణబుద్ధి నిపగిదిఁ గర్మ
ములు పొనర్చుటె కాక తద్భూరిగుణము
లెంచుచున్ దేవ సకలలోకేశ్వరా! ము
కుంద! యని సంస్మరించినఁ గొంద్రు ముక్తి. 181

ఉ. ఏ నిటు లాచరించుట మునీణ్ణుతుఁ డైనముకుందుభక్తిమై
జ్ఞానము సంగ్రహించుకొనఁ జాలినదాన నతండు నాపయిన్
మానక ప్రేముడిన్ సలిపి మాన్యమహత్త్వము గల్గఁ జేసి యెం
తేని యనుగ్రహించె నని యి ట్లువచించుచునుంటి సంయమీ. 182

తే. నీవు భగవంతుకీర్తిని దెలుపునట్టి
చక్కనిప్రబంధ మొక్కఁ డొనంగఁ జేసి
తెలియఁ దగుసమస్తాంశముల్ దెలిపి యందు
బోద్ధలకుఁ దెల్పి శాంతిని బొందు మవల. 183

వ. అని నారదుండు తనజన్మకర్మవృత్తాంతంబు లెఱుంగఁ జెప్పిన నప్పరా శరాత్మజుం డట్లు నీకు జ్ఞానోపదేశంబు చేసి పరివ్రాజకులు చిన్నవాఁడ వగునిన్ను విడిచి పోయినప్పుడు నీ వేమి చేసితి వేమ్మూర్తిఁ జేసి నీ ప్రాయంబు చెల్లించితి వవసానంబున నాశరీరం బెట్లు పరిత్యజించితివి నీకుఁ బూర్వజ్ఞాన మెందునం జెడకుండెం జెప్పు మనిన నారదుండు.

సీ. స్త్రీస్వభావమ్మునఁజేసి నాతల్లి మి
క్కిలిమూఢురా లేను గల నొకండ
యొరు నింట నెప్పుడు నుడిగంపుదాసియై
ప్రాలు పరాధీనురాల యగుచు
నాయమ కేను నా తాయమ్మయే దిక్కు
గాక వేఱొకదిక్కు లేక నన్ను
మిక్కిలి ప్రేముడిఁ మే లెంచునది యైన
స్వాతంత్ర్య మింతయుం జతనపడమిఁ

తే. జక్కగా నన్నుఁ బోషింపఁ జాలకుండె
నయిదువత్సరములప్రాయ మపుడు నాకుఁ
గలిగి యుండుట దిగ్దేశకాలగతులఁ
దెలియనట్టేఁడనై నేను మెలఁగుచుంటి. 185

ఉ. అందున నేను నాదుతలియందలిప్రేముడి త్రోసిపుచ్చ లే
నందున నామె వీడి యెవు డక్కడి కిక్కడి కేగ కామెతో
నందలివారికార్యముల నారయుచుం జెయిదోడు గాఁగ నే
నుందును దల్లికొక్కఁ డయి యుండినదానఁ దదాదరంబునన్. 186

తరు. ఇటు లుండ నొక్కనాఁ డినుఁ డస్తమించి
-యిరు లల్లుకొనియుండ నొక్కటి రేయి

నటు నిటుఁ దిరుగుచు నాలపాల్పిందు
 నది యయి గో వృందునట కేగునపుడు
తటుకున నొక్క త్రాఁచు తలపయిఁ గాలు
 తగులంగఁ గఱచె నంతటిలోనఁ దల్లి
దిట చెడి నేలపైఁ దిబుకున వ్రాలి
 దివి కేగె నింతలో దేహంబు విడిచి. 187

వ. దైవనిర్మితి నైనదానికి నే నింతయుఁ జింతింపక భగవదనుగ్రహకాంక్షి నై యింటివారికిం జెప్పి యటనుండి కదలి యుత్తరాభిముఖుండ నై పోవుచు న్మార్గమధ్యంబున సస్యసమృద్ధంబు లగు దేశంబులును బురంబులును గ్రామంబులును బల్లెలుం బక్కణంబులుం దాఁటి మనోహరారణ్యంబులు పర్వతంబులు నదీనదంబులు పద్మాకరంబులు సరోవరంబులు నతిక్రమించి పోయి పోయి వివిధతరులతాగుల్మసంభృతంబును నానావిధసత్త్వసమాకీర్ణంబును భయంకరంబు నగు నొకమహారణ్యంబునం బ్రవేశించి కొంతదూరంబు పోయి పోయి మార్గాయాసంబునం బడలికలు పొడమ నాఁకలియుం డప్పియు డెప్పరంబుగ బాధింపఁ బరవశత్వంబున నొడ లెఱుంగని తెఱంగున నై ముందుఁ బోఁ జాల కొక చెట్టుక్రిందం బడి కొంత విశ్రమించి నంతఁ జెంతం గన వచ్చు వాఁకలో దాన మాడి పిపాస వోఁ గడుపాఱ నీరు ద్రావి కొంతశాంతి వహించి పిలువఁ బిట్ట లేనియమ్మహారణ్యమం దొక రావిచెట్టుక్రిందం గూరుచుండి జీవాత్మయం దంతరాత్మ యైనపరమాత్మను బరివ్రాజకు లుపదేశించిన తెఱంగున నా కభ్యస్త మైనవిధంబున వశీకృతమానసుండ నై కనులు మూసికొని లోలోనన్ ధ్యానించుచుంటి నంతలోన. 188

ఉ. ప్రేమ పురస్సరం బగుచు ప్రీలి చలింపనిచంద మేర్పడన్
వేమఱు నేత్రకోణముల వెల్లువలై వెడలంగ బాష్పముల్
నా మెయి నాల్గుతట్టులఁ గనంబడఁ బుల్కలు మే న్వడంక నా
లో మహనీయమూర్తి మదిలోపలఁ గానఁగ నయ్యె నయ్యెడన్.189

తే. దేహ మాత్మ నెఱుంగని దేహి నగుచు
దేవునిం గాంచి వెండియుఁ దేఱిపాఱ
నట్టిభగవంతునిం జూడ నాసఁ జేసి
నిలిచి చూచితిఁ దేరి లోపల వెలుపల. 190

ఆ. మనము నిలువరించి మఱి మఱి ధ్యానించి
కాంచ నెంచి విభునిఁ గాన లేక
మిగుల వగలఁ గుదుచు మిసిమింతుని న్నిన్నుఁ
జెప్పనట్టు లగుమఁ జెల్లముగను. 191

శా. నీ కీజన్మమునందుఁ గల్గదు నను న్వీక్షించుభాగ్యంబు లో
కైకేద్యం బగుజన్మ మెత్తఁ గలయప్డే గల్గ నేఁ గావున
న్నాకై శోకము నొందఁ బోకు మవలన్ నాప్రేమకుం బాత్రమై
నాకో నొప్పెద నోయిమాణవక! నాభక్తుండవై రక్తిమై. 192

ఉ. ఈ వొకయింతకాలము మునీశ్వరసేవ పొనర్చి యుంటి వా
భావనఁజేసి నీకు నొకవార మొకింతగ నాదుదర్శనం
బీవగ నయ్యె దీన మది యెప్పుడు నాపయిఁ బాయకుండు నీ
భావము నన్నుఁ జూచుటకు వాంఛ యొనర్చుచునుండు నెప్పుడున్.

సీ. మునిసేవఁ జేసి నీబుద్ధి నాయం దిట్లు
దృఢమై స్థిరం బయి తెలియ నయ్యెఁ
గల్పాంతరమునందుఁ గలుగు బ్రహ్మాత్వము
మదనుగ్రహమున నయ్యెదవ నాకు
భృత్యుఁడవై భక్తవృషభుఁడ వయ్యెదు-
క్షయమునన్ నాస్మృతి లయముగాదు
విలవిల నోకు మీవిధమున నోవత్స!
యని వింటివాకున నఖిలవిభుఁడు

తే. కానరానట్టిదేహము గలఁడ యగుచు
పలికి విరమించె నంత నే శ కిఁజేసి

ప్రణతి గావించి మఱిమఱి ప్రస్తుతించి
సేవ యొనరించి నాఁడ నాచి తమందు. 194

వ. ఇట్లు భగవంతునిసమారాధనంబు గావించి వానినామంబులు స్మరించి వేదగుహ్యంబు లగువానియవతారంబులును జేష్టితంబులును సంస్మరించుచుఁ బిచ్చివానిమచ్చున భూమండలం బెల్లఁ బరిభ్రమించుచు సంతోషితస్వాంతుండనై విషయస్పృహ విసర్జించి కామక్రోధాదులం గడతేర్చి పేర్చినవివేకంబున దేహావసానసమయంబు ప్రతీక్షించుచుఁ గల్పావసానంబువఱకుం జావకుండి ప్రారబ్ధ మనుభవించుచుంటి నంతఁ గొంతలోన మెఱుపు మెఱసినచందాన మృత్యు వాసన్నమైన నే నపుడు సకలజీవులకాధారభూతమైనయనిరుద్ధదేహ మొందఁ బ్రయత్నించుచుండ నాప్రాకృతదేహంబు నశించునంత సర్వంబుం దనయందు లీనంబుగాఁ బ్రలయసముద్రంబున శయనించినభగవంతుని నాభికమలంబునం బ్రవేశించుపరమేష్ఠిప్రాణంబున నేఁ బ్రవేశించి సహస్రయుగంబులు వేఁగించితి ననంతరంబ. 195

తే. నాభికమలంబునుండి యన్నలువ లేచి
జగము సృష్టింప నూహించుసమయమందు
నతనిప్రాణంబునుండి నే నమ్మరీచి
యును వసిష్ఠాదులును బుట్టియుంటి మవల. 196

చ. భగవదనుగ్రహంబు గలవాఁ డగునేను ధృతవ్రతుండనై
జగముల సంచరింపఁ గలశక్తియు నుక్తియుఁ గల్గి వెల్గుచుక్
దెగువ విరించి మున్నిడినదివ్యవిపంచికఁ గేలఁ బూని యిం
పగుస్వరసప్తకంబుఁ దనయంత నదే సిరతంబు మ్రోయుచోన్. 197

క. దాని న్మీటుచు హరికథ
గానం బొనరించుకొంచుఁ గలభూములలో
మానుగఁ దిరుగుచు ననిశము
మానసమున హరినిఁ గనుచు మలయుచు నుందున్. 198

వ. అని చెప్పి ముకుందగుణవర్ణనశ్రవణసంసేవాదుల కే యమాదియోగ
మార్గంబును సరి గా దనుటకుఁ దనజన్మకర్మాదులు తార్కాణ
మని తెలియ వక్కాణించి నారదుండు స్వేచ్ఛావిహారసంచారియై
కృష్ణద్వైపాయను నామంత్రణంబు చేసి మహతి వాయించుకొనుచు
వియద్గమనంబున నిర్గమించె ననంతరంబ వ్యాసుండు సరస్వతీనదికిఁ
బశ్చిమతీరంబున శమ్యాప్రాస మనునిజాశ్రమంబునకుం జని యొక్క-
చో సుఖాసనాసీనుండై జలోపస్పర్శనంబు గావించి స్వాంతంబు విష
యాంతరవిముక్తిం బొందునట్లు చేసి.

— నారదోపదేశమున వ్యాసుఁడు భాగవతం బొనర్చుట —

సీ. మాయావిమోహిత మై యుండుజీవునిఁ
ద్రిగుణాత్మకం బగు దేహ మనియుఁ
దాపత్రయసమన్వితం బనియు ననంగ
నై దానితత్త్వంబు నరయఁ గలిగి
పంకమగ్నుం డగువగిది నుండి పరాత్ప
రుని నెఱింగి భజించుకొన నసాధ్య
మది భగవద్భక్తి యనునొక్క-సాధన
మున నె కా కన్యసాధనమువలనఁ

తే. గలుగ నేరదు భగవంతుఁ గలియు పొంటె
భాగవతసంహిత యొకండు పరమ మనుచు
లోకహిత మెంచి రచియించె నాకృపాళుఁ
డుర్విజనులశోకముఁ బాప నోపెడు నది. 200

చ. అతఁడు వివక్షితార్థము లవన్నియుఁ గల్గెడునట్లు కూర్చి సం
తతహరిభక్తిబోధక ముదాత్తగుణప్రతిపాదకంబు సు
వ్రతజనసేవితం బయిన భాగవతం బొనరించి దాని న
చ్యుతభజనానురక్తుఁ డగుసూనునిచేఁ జదివించె నెంచఁగన్. 201

మ. భగవద్ధ్యానవిరోధి కా దనుచు నావ్యాసాత్మజుం డాశుకుం
డొగి నాగ్రంథమహాత్మ్యముం దెలిసి యెంతో భక్తి భావించుచుఁ

భగవద్భక్తుఁడు పార్థపౌత్త్రునకు సంప్రార్థింపఁగా దానినిఁ
సుగమం బయ్యెడునట్లు చెప్పెను మహర్షు ల్మేలు మే ల్మే లనన్.

వ. అని చెప్పి సూతుండు భాగవతకథాశ్రవణప్రథమదీక్షితుం డగువరీ
క్షిత్తుజన్మకర్మాదికంబు సెప్పువాఁడై మునుమున్న దాని కుపోద్ఘాతం
బై కృష్ణకథామిశ్రమైన పాండవులకథం జెప్పెద నాలకింపుఁ డని
వెండియును. 203

భారతార్థకథాప్రశంస

సీ. భారతయుద్ధంబు ప్రస్తుతింపం బడెఁ
గురుపాండవుల కతిఘోర మగుచు
నుభయసేనలలోని యోధు లందఱుఁ ద్రెళ్ళి
స్వర్గతిఁ గాంచి రాసమయమందు
భీమగదాఘాతభిదురంబునన్ సుయో
ధనుఁడు తొడల్ తెగి ధరణిఁ బడియె
నాలోన గురుపుత్త్రుఁ డైనయశ్వత్థామ
తనన్నపతికిఁ బ్రియం బని తలంచి

తే. తనకు విప్రియకుం దగ దనుచుఁ దలఁప
కఘు మనెడుమాట మఱచి దుష్టాత్ముఁ డగుచు
ద్రౌపదీపుత్రకులను నిద్రాళు లైన
వారి కుత్తుకలను గోసె వాడికత్తి. 204

ఉ. ♦కన్నకుమారు లట్లిలుగఁ గన్గొని కంటికి మంటికి నేకధారగా
విన్నజనాళిగుండియలు వ్రీలిపడం బడి రోదనం బొన
ర్పన్నెఱి దప్పి యప్పుడఁతిపజ్జకుఁ ఫాల్గునుఁ డేగుదెంచి తాఁ
గన్నుల నీరు నించుచును గాంతఁ గనుంగొని యూఱడించుచున్. 205

ఉ. ఏడువ కీవు నే నిపుడ యేగి దురాత్ముని బ్రహ్మబంధువుఁ
జూడక దేశికాత్మ యని చూచుచునుండఁగ నెల్లవారు నా

♦ ఇలుగు, ఈలుగు=చచ్చు;

పోఁడిమి చూపి గాండివసముద్ధతబాణపరంపరాహతిం
గాఁ డుడిగించి తచ్ఛిరముఁ గైకొని వచ్చెద నీకు నిచ్చెదన్. 206

క. ♦కడకాలఁ దన్ని దానిని
జడములలోఁ దానమాడి సాధ్వీమణి నీ
యెడఁ గల్గుదుఃఖ మిగ్గతి
వెడలంగాఁ జేసికొమ్ము వెలఁదులతోడన్. 207

వ. అని ద్రోవది నూఱడం బలుకుచు గవచంబు దొడిగి గాండివంబు ధరించి కృష్ణసారథ్యంబున దంబుమీఱురథంబునఁ గపిధ్వజం బెత్తించి తాను భీమాదులతో దానిపై నెక్కి భయభ్రాంతుండై పాఱిపోవు నశ్వత్థామ వెన్నుఁదన్ని వెంబడించె నంత నశ్వత్థామయుఁ దన్నుఁ జంప వచ్చునర్జునుని దూరంబునం జూచి యేచినబీతునఁ బ్రాణంబు లె ట్లయిన రక్షించుకొనం దలంచి రథాశ్వంబులఁ దఱుముకొనుచుం బోయి పోయి హయంబు లలయుటం జేసి ముందుఁ జనం జాలక ప్రాణ రక్షణంబున కొం డుపాయంబు గానక. 208

మహా. తనపైకి న్వచ్చువానిం ధనువును శరముల్ దాల్చి పెల్లార్చువానిన్
ఘనరోషాకీర్ణ రక్తోగ్రనయనయుగళుం గాంచి భీముల్ రథస్థుల్
వెనుకం గృష్ణార్జునాదుల్ వెనుకొనుటయు హృద్వీథికి న్భీతికొల్పన్
దనువెల్లం గంప మొందం దలఁచె విడువ నస్త్రంబు నత్యుత్తమంబున్

గీ. ఒకయిషీకముఁ జేకొని యుచితరీతి
నందు బ్రహ్మశిరోనామకాస్త్రరాజ
మెసఁగు న ట్లభిమంత్రించి యేసె నెల్ల
జగ మపాండవ మగు నని సరభసమున. 210

మత్త. అయ్యిషీకమునందుఁ గల్పమునందుఁ బోలె మహానలం
బయ్యెడం జనియించి లోకము లన్నియుం ద్రుటిలోపలన్
బ్రుయ్య నేర్చెడునట్లు మండుచుఁ బొంగి రాఁ గని పాల్గునుం
డయ్యుపద్రవ మెల్ల విష్ణున కార్తిఁ జూపుచు ని ట్లనున్. 211

♦ జడములు=జలములు;

ద్విపద. చూడు చూడుము కృష్ణ! చూడు మోకృష్ణ
వేడి వెలార్చుచు విచ్చేయు నేమొ
గో డగుదెంచెడి గోవింద మాకు
నేడు రక్షకుఁ డొకం డీవ కా కిందు. 212

సీ. సంసారదావాగ్ని సమయువారికి నీదు
భక్తియే మోక్షసంప్రాప్తి కగును
సకలాంతరాత్మవై సర్వేశ్వరుండవై
వర్తింతు పురుషాఖ్య వఱలఁ దాల్చి
ప్రకృతిద్వయముకంటెఁ బరుఁడవై జ్ఞానశ
క్తిం జేసి మాయను ద్రెంచికొందు
కర్మానుసారముగా గతుల్ గల్పించి
జీవకోటిం ద్రిప్పుచేవఁ గొంటి

తే. దుష్టశిక్షణ మొనరించి శిష్టర
ణముఁ బొనర్పఁగ వెలసిన నలిననాభుఁ
డవు ముకుందుఁడ వోదేవ దివియు భువియు
నిండి పఱతెంచు నది యేమొ నే నెఱుంగ. 213

వ. అనినఁ గృష్ణుండు. 214

మత్త. ద్రోణపుత్రుఁడు వచ్చునిక్ గని తోఁప కెద్దియు దీనుఁడై
పా దద్దఱిల్లు చుపాయ మొక్కఁడ యంచు నా
ద్రోణదత్తము బ్రహ్మశీర్షముఁ దొట్టుపాటున నీపయిన్
ద్రాణ గల్గఁగఁ జేసి యేసెను దానివీర్య మవార్య హా. 215

శా. హా హా హా పరతెంచు నల్లదిగో చాపాచార్యసంపాదితం
బై హర్వొందెడునస్త్రరాజ మిపు డొండస్త్రంబునం దీనియు
త్సాహంబుం గడతేర్పఁ గా వదియె యేతత్కాలమం దేసి నీ
దేహజ్ఞాతుల నిన్నుఁ గాచుకొను మోదేవాధినాథాత్మజా. 216

—♦ అర్జునుండు బ్రహ్మశిరోనామాస్త్రము ప్రయోగించుట ♦—

ఉ. ఆవచనంబుల న్విని రయంబునఁ దే ర్డిగి ఫాల్గునుండు గాం
డీవము సంతరించుచుఁ గడిందిమగంటిమిఁ బూని లోన స
ద్భావముతోడ ద్రోణికిని భ్రాతలకుం దనకున్ శివం బగుం
గావుత మంచు మ్రొక్కెఁ గడఁకం గురుపీఠికి దేవకోటికిన్. 217

చ. గురుతనయాస్త్రశాంతి మదిఁ గోరుచు బ్రహ్మశిరంబు మంత్రభా
స్వరముగఁ జేసి యేసె నది సర్వవియత్తల మాక్రమించి దు
ర్భరతరకీలముల్ సెదరఁ గ్రాలుచు నగ్గురుపుత్రునస్త్రముం
దొరసి యెదిర్చె లోకమునఁ దోఁప మహాప్రళయప్రసంగతుల్. 218

వ. అంత నయ్యస్త్రద్వితయసంఘర్షణంబున. 219

మహా. ధరగంపించెం బయోధు ల్తరలికలఁగె భూధ్రంబులుఱ్ఱూతలూఁగెన్
సురమార్గంబందు మంటల్ సొరిదిగఁ గవిసెన్ సూర్యతేజంబుమాసెన్
గురిసెం బాషాణధారల్ గొఱవులు పడియెం గూలె నిర్ఘాతపంక్తుల్
గురుశబ్దం బుప్పతిల్లెం గుతలమునఁ బ్రజాకోటికి న్భీతి యయ్యెన్. 220

వ. ఇట్లు సర్వభూతభయంకరంబై యున్నయవసరంబున నారదుండు కృష్ణ
ద్వైపాయనునిచెంగటం బొడసూపె నంత లోకహితార్థంబు గావించు
తలంపున నయ్యిరువురు మునీంద్రులు నయ్యస్త్రద్వయంబుమధ్యంబున
నిల్చి భారద్వాజధనంజయులం గాంచి యి ట్లనిరి. 221

క. నానాశస్త్రాస్త్రజ్ఞులు
మానితగుణు లైనతొంటిమానవనాథుల్
మానవుల మీఁద నియ్యా
స్త్రానలము న్విడిచి రే సమంచిత మగునే. 222

వ. అనవుడు నర్జునుం డమ్మునులం గాంచి నమస్కరించి యి ట్లనియె.

పంచ. ప్రయుక్త మస్త్ర మస్త్ర మేసి పాయఁ జేయ నెంచి యి
ట్లయుక్తకార్య మేను జేసినట్టివాఁడ నైతి నో

నయప్రవక్తలార యిప్డు నామహాస్త్రశాంతికై
ప్రయత్న మాచరింతు నేని వానియస్త్ర మేర్చెదన్ 224

వ. మాకును లోకంబులకును గీడు వాటిల్లకుండునట్లు మీరలు హితంబు దలంపుఁడు మీరు దేవసంకాశులరు మీతలంపునం జేసి నాయస్త్రం బుడిగింతు నని సవ్యసాచి తనయస్త్రం బ్రశమంబున నుపసంహ

సీ. అనిఁ బ్రయుక్తం బగునా బ్రహ్మశిర ముప
సంహరించుటకు నిర్జరులు నోప
రర్జునుం డాచరితాధికబ్రహ్మచ
ర్యవ్రతుం డగుట మరల్పఁ జాలె
బ్రహ్మచర్యము లేనివాఁడు మగిడ్చిన
నది వానిఁ బ్రజతోడ నవనిఁ గూల్చు
బ్రహ్మతేజఃప్రభవము గాన దాని కా
మహితప్రభావము విహిత మయ్యె

తే. నట్లు నరుఁడు నిజాస్త్రసంహారము నొన
రింపఁ గనుఁగొని ద్రౌణి వారింప నెంచి
శక్తియుక్తుండు గాక లో శాంతి దక్షి
దీనుఁడై వ్యాసునకు నిట్లు తెలియ ననియె. 226

ఉ. గాడుపుపట్టి ధర్మవిముఖత్వమునన్ ధృతరాష్ట్రపుత్రులన్
వీడక చంపి యంత నను వెన్నడి వచ్చి వధింప నున్నచోఁ
గూడినప్రాణభీతి నిది కూడును గూడదు నాఁక మంత్రముం
దోడుగఁ జేసికొంచు నిటు తోఁపఁగఁ జేసితి నిమ్మహాస్త్రమున్. 227

తే. విను మపాండవ మగుఁ గాత మనుచు దీని
నిగుడఁ జేసితి వెండియు మగుడఁ జేయఁ
దలఁప నిది మృత్యు వగుఁ బాండవులకు నెల్ల
రోసమునఁ జేసి పాపముఁ జేసినాఁడ. 228

మహా. అనినన్ ద్వైపాయనుం డిట్లను గురువరపుత్రా నరుండిమ్మహాస్త్రం
బును దాఁ గైకొంచునున్నం బొసఁగినకినుకం బూని నీమీఁద నేయ

న్మన మెచ్చం జేయఁడయ్యె న్మఱకువగొని యిమ్మాడ్కి నీ వేయునస్త్రంబును వారింపంగ నస్త్రంబును విడియుఁ గృపం బూని వారించెఁ గంటే.

వ. గురూపదేశంబునం జేసి బ్రహ్మాస్త్రాదులు నేర్చి క్షత్రియధర్మంబునం దుండి చలింపకున్న యీసవ్యసాచికిని వానియన్నదమ్ములకు నీ వేల కీడురోయుదువు మఱియును బ్రహ్మశిరోస్త్రమన్యాస్త్రంబునఁ బ్రతిహతంబగునట్టిద యేని యీరాష్ట్రంబున ద్వాదశవర్షక్షామంబు ననావృష్టియు నగునని చెప్పుచుంటి మట్లుగాకున్న నితండు తనయస్త్రంబున నీ యస్త్రంబు శాంతింపఁ జేసి తన్నుం దనవారినిం గాపాడుకొనఁ గలం డట్లు కాకుండ నీవు నిన్నును బాండవులను రాష్ట్రంబునుం గాపాడ నెంచి నీయస్త్రం బుపసంహరించుకొనుము కోపం బుడుగుము. 230

ఆ. అపుడు పార్థుఁ డనియె ననఘులార యితండు
దీనిశాంతి యెఱుఁగఁ డేన లోక
మొప్పుపొంటె యిపుడ యుపసంహరించెద
ననుచు నట్లు చేసి యంతలోన. 231

— అర్జునుండు పుత్రఘాతి యగువానిం గట్టితెచ్చుట —

వ. అర్జునుం డం దున్నవారిం జూడ కరుణనేత్రుండై ధాత్రికిండిగి వడివడిం జని వెడఁగుపోలె వడవడవడంకునశ్వత్థామం బట్టుకొని యూపంబున యాగపశువుం గట్టినట్లు రజ్జువులం గట్టి రథంబుపైఁ బెట్టుకొని మునులకు మ్రొక్కి శిబిరంబుముఖుండై పోవుచుండె నపుడు భగవంతుం డగుకృష్ణుండు గురుపుత్రుం గోపించుచు నర్జునుం గాంచి యిట్లనియె.

శా. రక్షింపం దగ దీద్విజాధముని నిద్రాసక్తులై రాతిరిన్
క్షేత్రజ్ఞానము లేని బాలకులఁ గోసెం బత్తుకల్ మేకలన్
భక్షింపంగఁ గిరాతజాతి బలె నోహో క్షణార్ధంబులో
సుక్షాత్రం బది చూపుచుం డునుము లోఁ జూడంగఁ బో కింతయున్

మ. నిదురం బోయెడువాని మద్యపుని స్త్రీనిన్ బాలునిన్ లోలునిన్
గదనంబున్ విడి పాఱువాని విరథున్ ఖండింప రా దందురన్

బోదలుం బాప మటంచు శాస్త్రములు చెప్పన్ వీఁడు విప్రుండ య
య్యోఁ దెఱం గీఁ గెను వీనిఁ జంపుటలు శ్రేయోదాయకం బయ్యెడిన్.

ఆ. ఆతతాయి వీనియాదల ఖండించి
నే వినంగనుండ ద్రౌపదికడఁ
దలను దెచ్చి యిత్తు నెలనాగ! యం టది
బాస సత్య మ్మిట్లు పలయు సలుప. 235

వ. అని కృష్ణభగవానుండు చెప్పుచున్న నర్జునుండు గురునిఁ దలంచుకొను
వాఁ డగుటం జేసి వానిం జంప నొల్ల కల్లనం దెచ్చి ద్రౌపదికడం
బెట్టిన నామె పుత్రశోకసంతప్తచిత్త యై యుండియుఁ బశువుం బోలెఁ
బట్టి పగ్గంబులం గట్టి పడవైచిన గురుపుత్రుంగని కరుణాతరంగితాంతరం
గయై నిజవల్లభుం గాంచి యి ట్లనియె. 236

మ. గురుపుత్రుండును బ్రాహ్మణుం డితనినిం గ్రోధంబునం జేసి యి
క్కరణిం గొట్టను బోలెఁ గట్టుటలు నేఁ గానంగ లేకుంటి నో
కరుణాళూ! విడిపించు బంధనములన్ గందెన్ శరీరం బయో
తరలుం బో దురితంబు వచ్చెడిని నీతం డెన్న ద్రోణుండె కా. 237

మ. కృపి యీపుత్రుని చావు విన్నదగుచున్ గీడొంచి దుఃఖంబునన్
గృప లేనట్టినరుండు చేసె నిటులం చే మేమొ ని న్నాడు నా
కృపుఁడున్ సైపఁడు లోన దూఱెడి నయో కిం చీతనిం ద్రుంచినన్
జెప్పుమా చచ్చినవాండ్రు వచ్చెదరొకో జీవేశ్వరా వెండియున్. 238

వ. అని ధర్మార్థసహితంబులును గరుణాయుతంబులును సకలలోకపూజ
నీయంబులు నగు ద్రౌపదీవాక్యంబులు విని ధర్మరా జి ట్లనియె. 239

శా. నీవాక్యంబులు న్యాయమార్గమునకున్ వేఱెంతయుం దూరమై
పో వెంతో కరుణారసంబు కలవై పూజ్యంబులై యొప్పెడిన్
నీ విట్లాడుదు వంచు నే ననుకొనన్ లే దెంతయోపుత్రదుః
ఖావేశంబున నున్న యిప్పుడును నీస్వాంతంబు శాంతం బహో. 240

వ. అని ధర్మజుండు పాంచాలిసుస్వభావంబు నెంచి నుతించుచుండఁ గృష్ణా
ర్జుననకులసహదేవసాత్యకులును మఱియుఁ దక్కనుం గలవారు నా

నని ప్రశంసించి రంత నంతకాకారుం డగుభీమసేనుండు మహాక్రోధం బున మండిపడుచు. 241

ఉ. ద్రోవది ధర్మపన్నములు దోర్బలగఁ జేసెఁ గృపీకృపాదు లీ
చావునకున్ దపింతు రఁట చాలుఁ బురే నిదురించుబిడ్డలన్
వేవుర నూఁచకోఁతలుగ వీఁగక కోసినదాన నేరి కే
నోవును లేదు లే దనుచును న్వచియింపఁగ వత్తు రేమొకో. 242

ఉ. పామును జంప రా దనుచుఁ బక్కఁబరుండఁగఁ బెట్టుకొంట లెం
తే మహనీయమం చనుట యెట్టిదొ ద్రోవది పల్కినట్టివా
కామెయి నుండె మెచ్చుకొని రన్నయు నచ్యుతుఁ డమ్మహామహుం
డేమని యేమి యన్న నొరు లేమని పల్కఁగ నేర్తు రాప్రభూ. 243

వ. వేదము చెప్పెను గీదము చెప్పె ననుట కే ననుమతింపఁ బాపాచా రుండగువానిఁ బట్టి గిట్టించుటయె పరమశ్రేయం బని చెప్పుచుంటి నన శ్రీకృష్ణుండు నవ్వుచు నర్జునుదిక్కు మొగం బై యి ట్లనియె. 244

సీ. బ్రాహ్మణుం డగుటఁ జంపఁగ రా దనియు నాత
తాయి గావునఁ జంపఁ దగున యనియు
నే నంటి ద్రోవదితో నీవు తలఁ గొట్టి
తెత్తునం టాయమ తే మ్మటనియె
భీమసేనునివాక్య మీమెయి నగు దానిఁ
జెల్లించుటయు నీకుఁ జేయన తగు
నిది గాక ధర్మజుం డీతనిప్రాణముల్
దీయంగ రా దని తెలియఁ జెప్పె

తే. ఇన్ని విధముల కార్య మి ట్లెన్న వచ్చెఁ
బోలినట్టులు చేయు మోపురుషసింహ
నావుడును జిష్ణుఁ డాకృష్ణుభావ మెఱిఁ
చేతఁ గరవాలమును బూని చేర వచ్చి. 245

వ. రథంబునుండి నేలఁ బడఁ దన్ని యశ్వత్థామశిరంబుపై నున్న చిరత్న రత్నంబు శిరోజంబులతోడం గూడ ఛేదించి తెచ్చి ద్రౌపదిచేతి కిచ్చి

వాని మేనికట్లు విప్పించి వెడలం ద్రొబ్బె నంత నతండును బ్రహ్మ
హత్యఁ జేసియుండుటం జేసియు శిరోమణిపోవుటం జేసియుఁ దేజో
విహీనుండై పాండవశిబిరంబుననుండి తలవంచుకొని క్రిందులు చూచు
చుం జనియె నప్పు డప్పుండరీకాక్షుం డతనిం బిలిచి యి ట్లనియె. 246

—♦ కృష్ణుం డశ్వత్థామను శపించి పుచ్చుట ♦—

సీ. నీయమోఘాస్త్రము నెలఁతగర్భము సొచ్చి
చంపినన్ వెండియుఁ జావకుండుఁ
బుత్రుండు దీర్ఘాయువుం బొందు బాలజీ
వితఘాతుకుని నిన్ను విజ్ఞు లెల్లఁ
గాపురుషుం డండ్రు కావున నప్పాప
ఫల మీవు పొందంగఁ గలవు వినుము
గతి లేక నిర్జనక్షితి నసహాయుఁడై
వ్యాధిబాధితుఁడవై బోధము చెడఁ
తే. బూయశోణితదుర్గంధములకు దాన
కం బగుచు మూఁడువే లేండ్లు త్రిమ్మరుం గ
లాఁడ వెంతయుఁ గష్టంబు కూడుకొనఁగఁ
దెలిసి నీదుష్కృతికి నీవ తిట్టుకొనుచు. 247

వ. అని మఱియును. 248

చ. మృతుఁ డయి మత్తపోమహిమ మేకొనఁ గల్గినదాన వెండియున్
బ్రతికిన శ్వేతవాహనునిపౌత్రుఁడు నీవు వినం గనం బరి
క్షితుఁ డనఁ దేరి గౌతమునిచెంత శరంబునఁ దీరి కౌరవ
క్షితి కధినేతయై ప్రభుత సెల్లఁగ నర్వదియేఁడు లేలెడిన్. 249

వ. అని పలుకుచున్నంత గురుపుత్రుం డొండాడక దారివట్టి చనియెఁ
బాండవులును సపరివారంబుగా గంగానదికిం జని ప్రేతరూపంబు నొం
దినజ్ఞాతివర్గంబునకుఁ దిలోదకపిండప్రదానాదికంబు గావించి గృహం
బునకుం జనుదెంచి రంత ధర్మరాజునకు రాజ్యపట్టాభిషేకంబు మా

దశ్వమేధంబులు నైనపదంపడి కృష్ణుండు సాత్యకిప్రభృతులతోఁ బాం
డవానుజ్ఞాతుండై రథం బధిరోహించి ద్వారకాపురంబునకుం బ్రయా
ణం బ నయ్యవసరంబున. 250

మత్త. వెట్టనూర్చుచు నూర్పు లెంతయు వింటఁ బర్వెడునట్లు గా
నట్టు నిట్టు పదద్వయం బిల యందుఁ దొట్రిల మెట్టుచుఁ
బిట్టుగా మెయిఁ జెమ్మటల్ ధరణిం బడం గనుఁదోయినీర్
పుట్టి కాలువ గట్ట నుత్తర పొక్కుచుం బఱువెత్తుచుఁ. 251

శా. ఓకృష్ణా! మధుసూదనా! యదుపతీ! యోవాసుదేవా! హరీ!
నాకై వచ్చుచునుండె నగ్నివలె మంటల్ మండుచుఁ మెండుగా
నోకారుణ్యపయోబ్ధి! యోవరద! న న్నోమంగ నిప్పట్టునన్
నీకుం దక్క మఱొక్కరుం డెవఁడుగానీ లేడు లే డోప్రభూ. 252

క. నాగతికిఁ వగవను నే
నాగర్భము గతికి వగతు నళినదళాక్షా!
వేగమ వచ్చెడి నిదిగో
లోఁగక యిచ్చిచ్చుటలుగు లోఁ జొఱఁబాఱుఁ. 253

క. రక్షింపుము రక్షింపుము
రక్షక! చెడకుండఁ బాండురాజకులము నా
కుక్షిస్థశిశు వొకండే
ప్రక్షీణతఁ బాపుపొంటె వఱలెడు తెలియఁ. 254

వ. అని మొఱ్ఱ వెట్టుచున్నం గని భక్తవత్సలుం డగుభగవంతుండు
శ్రీకృష్ణుం డది గురుపుత్రప్రయుక్తబ్రహ్మశిరోనామాస్త్రం బని తెలిసి
కొని దానిం బాండవాస్త్రంబులు వారింపఁ జాల విట్టిచో వారికిం
దనకంటె నొండొక్కదిక్కు లే దని మిక్కిలి కనికరించునంతలో నయ్యా
స్త్రం బుత్తరగర్భంబు సొచ్చుటయు నాలోఁ జక్రహస్తుండు సూక్ష్మ
రూపుండై గర్భంబు సొచ్చి వైష్ణవమాయం జేసి యర్భకున కావర
ణంబు గల్పించి చక్రధారం జేసి బ్రహ్మశిరంబు నుక్కడంచి వెలికి

వచ్చి విచ్చలవిడి విహరించుచుండు విశ్వేశ్వరుం గాంచి కుంతి చెంతం జేరి యి ట్లనియె. 255

—◆ ఉత్తరాగర్భంబుఁ గాచిరక్షించినకృష్ణునిఁ గుంతి స్తుతించుట ◆—

సీ. నీవు చరాచర నిఖిలప్రపంచము
　　నకుఁ గారణుండవు ప్రకృతికంటెఁ
బరుఁడ వంతటికి నీశ్వరుఁడవు భూతాళి
　　వెలుపల లోపల వెలయుచుండు
మాయ నాఁబడు తెఱమాటునను దిరోహి
　　తుఁడ వయి యుందువు జడమతులకుఁ
దోఁపరాకుండు నాట్యోపయుక్తము లైన
　　వేషముల్ నటునట్లు వేయుచుండు
తే. వెఱుఁగఁ జాలరు బ్రహ్మాదు లేని నిన్ను
యోగగమ్యుఁడ వోదేవ! యోగబాహ్యు
లైనస్త్రీలందుఁ జేరినదాన నేను
దెలియఁ జాలుదునే నిన్ను దేవదేవ. 256

వ. నీవు లీలామానుషవిగ్రహుండ వని మహావిష్ణుండ వని యెఱుంగక వాసుదేవుండ వని కృష్ణుండ వని చుట్టంబ వని చూచుచు సంబోధించుచుం జనవు చేయుచున్నవార మోకృష్ణా! వాసుదేవా! దేవకీనందనా! గోవిందా! నీకు వందనము పంకజనాభా! భక్తవత్సలా! నీకు నమస్కారము పంకజనేత్రా! పంకజమాలీ! పంకజాంఘ్రీ! నీ కేటికోళ్ళు దేవా! దీనశరణ్యా! నీవు ప్రకృతివయుండవు నీ నవతారంబులందును స్వభావంబు విడువక సాధారణధర్మంబులం జూపుచుందువు.

సీ. కంసునిచే దుఃఖకలిత యా దేవకి
　　బన్నంబు వాపినపరిభువ వీవు
కన్నబిడ్డలతోడఁ గడుకష్ట నొందెడు
　　ననుఁ గాచిరక్షించినాఁడ వీవు

విషభోజనముఁ జేసి వెడలనుండినభీముఁ
జాకుండఁ జేసిన శక్తి వీవు
ద్రౌణిబ్రహ్మాస్త్రము దరలించి మాకుల
ముద్ధరించినమహోద్యోగి వీవు
తే. దేవ నిష్కాములకు లభ్యుఁ డీవు త్రిగుణ
వృత్తు లయినకామాదుల వీడు దీవు
క్షుత్పిపాస లూర్ములు నీకుఁ జూడఁ బడవు
మోక్షదుఁడ వీవు నీ కిదే మ్రొక్కుచుంటి. 258
తే. కాల మాద్యంతములు లేక క్రాలుచుండు
నది వశముచేసి కొనును బ్రహ్మాదు లంత
వారి నైనను సమవర్తియై రహించి
యట్టికాలము నీరూప మాదిపురుష. 259
ఆ. లేదు నీకుఁ బ్రియుఁడు లేఁ డప్రియుండును
నీదునిగ్రహంబు నెఱి ననుగ్ర
హమ్మ యగును నీదుహతిఁ దైత్య నగుపాత
నాదు లెల్ల ముక్తి నంది రనఘ. 260
ఆ. కర్మరహితుఁ డీవు కర్మగుణోత్పత్తి
నీకు లేదు గాన నీవు దేవ
లందు జెల్లలందు నాలయందుఁ ఋషు
లందు నవతరింతు వాదిదేవ. 261
ఉ. నీ వపరాధివం చెఱుఁగ నేరక తల్లి యశోద త్రాటనిన్
నో వగు దేరఁ గట్టినఁ గనుంగవ నశ్రులు దేరఁ బుల్కనన్
దేవినిఁ జూచుచుం జకితదృష్టుల లేనిభయంబు నొంది తీ
వావిధముం దలంచుకొన నచ్చెరు వయ్యెడు నిందిరావరా. 262
మ. మను మెక్కన్ మనకృష్ణుఁ డంచుఁ దలికిన్ మాటాడినన్ దల్లి కో
పనమై ని న్నదలించి శిక్ష విధియింపం జూచునయ్యమ్మకున్

గనుమంచున్ వదనాంతరంబునను లోకంబుల్ సమస్తంబుఁ జూ
పిననీమూర్తి భజింతు సంతతము నో విశ్వేశ ! విశ్వాత్మకా ! 263

తే. నీచరిత్రము వినువారు నిన్నుఁ బొగడు
వారు నీరూపు ధ్యానించువారు నిన్నుఁ
గొలుచువారును సంసారకూపములను
గూలిపోవక ముక్తిఁ గైకొందురు తండ్రి. 264

శా. భూభారంబు హరించి శిష్టజనులం బోషింపఁగా క్షత్రియుం
డై భూదేవుల బాధలం దొలఁచి దేవాధీశులం గొల్చి యెం
తో భక్తిన్ గలయోగివల్లభుఁడ వై తోఁపంగ నై తో ప్రభూ
మాభూనాథ ! నమస్కరించెద నిదే మ మ్మేలుకొ మ్మెప్పుడున్. 265

వ. అని కుంతీదేవి భక్తివివశయై ప్రార్థించినన్ విని వాసుదేవుండు మంద
స్మితసుందరవదనారవిందుండై జగం బెల్ల మోహింపం జేయుచుఁ
గుంతికోర్కిం జేసియు ధర్మజునివాక్యం బతిక్రమింపఁ జాలమిం జేసియు
నిజపురప్రయాణంబు మాని కొన్నినాళ్ళు కరిపురంబున నుండె నాలో
బంధువధాదుఃఖంబునఁ బరితపించుధర్మరాజు నూరార్చుచు వ్యాసాది
మహామునులచే నూఱడిల్లఁ జేయించుచునుండె నప్పు డాధర్మనందనుండు.

ఉ. తాతలఁ దండ్రులన్ సుతులఁ దమ్ముల నన్నల నెల్లచుట్టలన్
భూతలనాథులన్ మఱియు భూరిచమూసముదాయ మియ్యెడిన్
ఘాతుకుఁడై వధించితిని నాదగుదోషము పెద్దకొండయై
పాతఱలాడుచున్నయది పాయఁగ రానిద యింత నంతలన్. 267

క. కుక్కలు నక్కలు మెసవుట
కక్కఱపడు మేనిసుఖము నాశించి కటా
పెక్కగు వేలజనంబుల
నిక్కరణిం గూల్చినాఁడ నెట్లగుదు నిఁకన్. 268

—♦ కృష్ణాదు లంపశయ్య నున్నభీష్మునికడ కరుగుట ♦—

వ. అని తాను జేసినప్రజాద్రోహంబునకుఁ బరిపరివిధంబులఁ బరితపించుచు
ధర్మనందనుండు ధర్మంబు లరయుపొంటెఁ గురుపితామహుం దర్శింపఁ

గురుక్షేత్రంబునకుం బయనం బయ్యె నయ్యెడఁ గృష్ణార్జునులును భీమ నకులసహదేవులును ధౌమ్యులును దక్కిన బ్రాహ్మణోత్తములును సకలపరివారపరివృతులై రథంబు లెక్కి ధర్మరాజు ననుసరించి రట్లు పయనంబై కదలి కతిపయప్రయాణంబులఁ గురుక్షేత్రంబునకుం జని నంపశయ్యనున్న దేవవ్రతునిం గాంచి యెల్లరునమస్కరించి రాసమ యంబున నచ్చటికిఁ బర్వతనారదులును వ్యాసభగవానుఁడును బృహ దశ్వుఁడును భరద్వాజుఁడును బరశురాముఁడును శుకుండును వసిష్ఠుం డును నింద్రప్రమదుండును దిృతుండును గృత్స్నమదుండును నసితుం డును గక్షీవంతుండును గౌతముండును నత్రియు విశ్వామిత్రుండును సుదర్శనుఁడును శిష్యప్రశిష్యసహితు లయినకశ్యపాంగీరసాదులును మఱికొందఱు బ్రహ్మర్షులు దేవర్షులు రాజర్షులు భీష్ముం దర్శింప వచ్చి రిట్లు వచ్చినవారి నందఱ దేశకాలవిభాగజ్ఞుం డగుభీష్ముం డాదరించి తనముందఱ నాసీనుండై యున్నలీలామానుషవిగ్రహుం డగుశ్రీకృష్ణుని హృదయకమలంబున నిల్పి పూజించి యెల్లరకుశలం బడిగి ధర్మరా జాదులతో ని ట్లనియె. 269

సీ. వత్సలారా! మీరు బ్రాహ్మణులకు ధర్మ
మునకు విధేయులై తనరుచున్నఁ
గష్టజీవులయట్లు కాఱియఁ బడుచుండు
వారయి యుంట విచారకరము
మీతల్లి పతిఁ బాసి మీకయి యానాఁటి
సుతగఁ బడినపాటు లతులితములు
పనిలేదు దానికై వగవ గాలికి మబ్బు
లట్లు వశంబులై యలరు నెల్ల
తే. ధర్మజుఁడు రాజు నరుఁడు కోదండపాణి
భీమసేనుఁడు గది యయి వెలయుచున్న
మిత్రమై వాసుదేవుఁడు మీఁద నరయు
చున్నను విపత్తు లగుచుండు టొప్పునె కట! 270

క. దైవాధీనము సర్వము
దైవమునకు ముఖ్యు లెల్లతత్త్వజ్ఞు లిలన్
గావున దేనికి వగవక
భావలయం బేలుకొనుము పురుషలలామా. 271

శా. సాక్షాద్విష్ణు వితండు వృష్ణికులమం దై స్వప్రకాశంబు ప్ర
త్యక్షంబుం బొనరింపఁ బోక వసుదేవాత్మోద్భవుండై నిగూ
ఢక్షాత్రింబును గల్గి వెల్గుశితికంఠస్వామి దేవర్షి లో
నాక్షేత్రజ్ఞు లెఱుంగుచుందు రితనిన్ స్వాంతంబులం దెప్పుడున్. 272

ఉ. ఈతనిమాతులేయుఁ డని యిష్టసఖుం డని దేహబంధుతా
ప్రీతికి నైనవాఁ డని వివేకము గల్గి యమాత్యపద్ధతిన్
దూతకృతిన్ నియంతృతను దోడ్పడువానిగఁ జేయుచుందు రీ
భూతలనేత సర్వసమపూజ్యతఁ గాంచును భక్తిగమ్యుఁడై. 273

మత్త. భక్తవత్సలుఁ డిమ్మహాత్ముఁడు భక్తిభావన సేయునా
భక్తులం దధికాదరంబును బర్వఁ జేయుచు సర్వముల్
ముక్తిఁ గూర్చెడునట్టిదేవుఁడు పుణ్యలేశము కల్మి నా
సక్తిలోచనగోచరుం డయి సమ్ముఖంబున నయ్యెఁబో. 274

తే. భక్తిమై నీమహాత్ముని భావమందు
నిలిపి లోఁజూపునన్ మూర్తినిం గనుఁగొని
నామసంకీర్తనంబుఁ బొనర్చుకొనుచు
మేను విడిచినయోగికి నౌను ముక్తి. 275

ద్విపద. ఆదేవదేవుఁడు హరి వాసుదేవుఁ
డీదివ్యపూరుషుం డే నుల్లమందుఁ
బ్రోది గావించుచుఁ బూజించుకొనుచు
నాదు దేహమునఁ బ్రాణమ్ములు వీడి
మీఁదికిం జనుదాక మీఁదఁ జేవైచి
గాదిలిం గనుచుండఁగా వేఁడుచుంటి. 276

వ. ఇట్లు పలుకుచున్న శరతల్పగతుం డగుభీష్మునిం దిలకించి ధర్మరాజు బ్రాహ్మణాదివర్ణధర్మంబులును వర్ణాశ్రమాదిధర్మంబులును దానధర్మంబుల తెఱంగును నీతిశాస్త్రోక్తంబులగు రాజధర్మంబులును ప్రవృత్తినివృత్తిభేదంబులును ధర్మార్థకామమోక్షంబులును స్త్రీధర్మంబులు భగవద్ధర్మంబులును జెప్ప ననుగ్రహింపు మనిన నతండు శ్రీకృష్ణప్రేరితుండై నానాఖ్యానేతిహాసరూపంబుగా సంగ్రహంబుగ విపులంబుగ వర్ణించి చెప్పుచు స్వచ్ఛందమరణంబు గలఁడై భీష్ముం డుత్తరాయణకాల మరుదెంచుటం గాంచి దేహాదిసంబంధంబు లెల్లఁ బరిత్యజించి యితరప్రసంగంబులు చాలించి చతుర్భుజుండై యెదుట సాక్షాత్కరించి యున్న పీతాంబరు నాదివిష్ణుఁ గృష్ణు మానసంబున నిడికొని నిమీలితలోచనుండై నివృత్తసర్వేంద్రియవృత్తివిభ్రమంబు గలఁడై దేహాత్మభ్రమ నసింపఁ బరిశుద్ధాంతఃకరణంబునఁ బరాత్పరుఁ ధ్యానించుచు ని ట్లని ప్రార్థించె. 277

—♦ భీష్ముఁడు శ్రీకృష్ణుని స్తుతించుట ♦—

తే. సుగము నొందుచు నొక్కొ వోఁ దగ వసింప
లీల విగ్రహ మొందిన బాలకృష్ణు
నందు గతతృష్ణ మగునా మనంతరాత్మ
సతము నివసించుఁ గాక చంచలము గాక. 278

ఉ. నల్లనిమేనికాంతులు ఘనాఘనసంపదసొంపు డింప సం
పల్లలితోత్తరీయము సువర్ణసువర్ణము మేల మాడ న
ల్లల్లనఁ గుంతలంబులు ముఖాబ్జమునం దళు లట్లు వ్రేల వ్రే
పల్లె విహారముం సలుపు బాలునిఁ గృష్ణుని నేఁ దలంచెదన్. 279

ఉ. కయ్యమునందు నశ్వఖురఘాతసముద్భవధూళి గ్రుంగి గొ
య్యొయ్యనఁ జూర్ణకుంతలము లూఁగుచుఁ జెమ్మటఁ దోగు మోము నేల్
దియ్యము చూప నాదుశరతీక్ష్ణతఁ జిల్లులు వడ్డ మేల్ జిరాఁ
గ్రయ్యలు గట్ట నెత్తు రొడికంబుగ నొప్పెడుతండ్రి నెంచెదన్. 280

చ. తనచెలికానిమాటబడిఁ దా నరదం బని కాది రెండు వా
హినులకు మధ్యభాగమున కేగఁగఁ దోలి పరాళిఁ జూపి చూ
పునన తదాయువెల్లఁ గడముట్టఁగఁ జేయుటె కాక బంధులన్
దునుమగ రామిఁ బల్కునరుదుర్మతిఁ బాపినశౌరిఁ గొల్చెదన్. 281

సీ. చక్రంబు చేఁ బూన సమరంబునం దను
తననిగమం బెల్ల వెనుకఁ ద్రోచి
చక్రంబు వట్టింతు శౌరిచే నను నాదు
బాస చెల్లించెదువాఁడ యగుచు
నాశరంబుల నొచ్చి నలువఱి మునికోల
రథముపైఁ బెట్టి చక్రంబు వట్టి
కరిమీఁదఁ బడ దూఁకుహరి వోలె నేలకు
నుఱికి లంఘించి నాయున్నకడకుఁ

తే. గేశపాశము విడి వ్రేల క్షితితలంబు
దద్దఱిల్లఁగఁ బైకొక తావు వీడ
హుంకరించుచు నరుదెంచునంకకాఁడు
నాకు దిక్కయి యుండెడుఁ గాక యిపుడు. 282

క. సర్వం బెవ్వనియం దగు
సర్వం బెవ్వానివలన సంభవ మగు నీ
సర్వము తా నగు నెవ్వఁడు
సర్వాత్ముం డైనవాని స్మరియింతు నెదన్. 283

తే. నరకసంత్రాసమును బాపి ధరణిజనుల
మనిచి సంసారసాగరమగ్ను లైన
వారికిం దరియై జగద్వల్లభుఁ డగు
కృష్ణు విష్ణు హృషీకేశు నే భజింతు. 284

ఉ. విష్ణుమయంబు సత్య మగు విష్ణుమయంబు జగత్త్రయం బగున్
విష్ణుమయంబు సర్వమని నిన్ను భజించెద భక్తకోటికిన్

దృష్ణ దొలంగ నీప్సితము దీర్చి సుఖం బొడఁగూర్తు వీవు శ్రీ
కృష్ణ! నిను న్నుతించి భజియించెద నన్ను ననుగ్రహింపవే. 285

తరళము. గుడుసు వా ల్గొని నాపయిం బడఁ గోరి రా నరుఁ డాఁగుడున్
విడువు మర్జున! భీష్ముఁ జంపుదు వీరభోజ్యము రాజ్యమున్
దడయ కిప్పుడ తెచ్చి యిచ్చెద ధర్మసూతికిఁ జోరు నోఁ
గడిమి సూపెద నంచుఁ బల్కెడుకంజనాభుని మ్రొక్కెదన్. 286

మ. అనియందున్ నరరథ్యచోదనము చేయం బూని పగ్గంబులున్
మునికోలం గొని దక్షిణస్థుఁ డగుచుం బొల్పొందుతద్రూపమున్
గనుచుం జచ్చినవీరు లందఱును స్వర్గం బందగాఁ బోయి రా
మునివంద్యుండు పరాత్పరుండు హరి నామ్రోలన్ గనం బొల్చెడున్

మ. మనమున్ వాక్కును గాయ మిచ్చి త్రిజగన్మాన్యుండు దా నావ్రజాం
గనలం బ్రాణము వోలెఁ జూచుచనురాగం బేర్పడం దేర్చుచుం
దను వొక్కం డనునట్లు ధర్మ మనువొందం జేసి లాలించు నా
ఘనునిం గృష్ణుని విష్ణుఁ జేరుతను నాకాయంబు ప్రాణంబులున్. 288

తే. రాజసూయాధ్వరంబున రాజు లెల్ల
నరయుచుండంగఁ బూజితుఁడై మహేంద్ర
వైభవంబును బొందినవాసుదేవు
నరయ నామానసము లగ్న మగును గాక. 289

మ. తెలియ న్వేఁడివెలుం గొకం డయి వియద్వీథి న్వెలుంగొందుచున్
జలకుంభంబులఁ బెక్కు లట్లగుచుఁ జాంచల్యాద్యపోధర్మముల్
కలుగం బోవనియట్లు విశ్వవిభుఁ డొక్కం డయ్యుఁ దా నెల్లజీ
వులయందుం గనవచ్చు వాని నెడఁదం బొందించుకొందున్ సదా.

—♦ భీ ష్మ ని ర్యా ణ ము ♦—

వ. అని యిట్లు భీష్ముం డంతరంగంబున భగవంతుం డగుశ్రీకృష్ణు నిడికొని ప్రస్తుతించి శ్వాసవాయువుల నంతర్లీనంబుగావించి దేహంబు విడిచి యర్చిరాదిమార్గంబునఁ బరంధామంబు నొందె నంత నందున్నవా

రందఱు నగ్నివలెం బ్రజ్వరిల్లుచుం బయికిం బోవుభీష్మునిప్రాణజ్యోతిం జూచుచు నిశాసమయంబునం బక్షిసముదయంబు వలె మౌనముద్రం దాల్చి యుండి రాసమయంబున దేవదుందుభులు మ్రోసెం బుష్ప వృష్టియుం గురిసె నంతం గృతాంతనందనుండు వ్యాసానుమతంబున దేవవ్రతున కగ్నిసంస్కారాద్యౌర్ధ్వదైహికంబుం బొనరించి తన్మృతికి ముహూర్తకాలంబు దుఃఖించె నాలో నున్నమునీంద్రు లందఱు దేవకీనందను నుపనిషద్వాక్యంబుల నభివర్ణించుచు ననుమతిం బడసి తమతమపొందుపట్లకుం జని రవ్వల ధర్మరాజు శ్రీకృష్ణునితోం గృష్ణాది సోదరులతో హస్తినాపురంబుం జేరం జని పుత్రశోకసంతప్త లగుగాం ధారీధృతరాష్ట్రుల దరియ నరిగి నమస్కరించి మంచిమాటల దుఃఖోపశమనంబు సేసి వారియనుమతిం బడసి పైతృకం బగుపూజ్యరాజ్యంబున నభిషిక్తుండై ప్రజాపాలనంబు గావించుచుండె నపుడు శ్రీకృష్ణుం డట్లు బ్రహ్మాస్త్రంబువలనం బరిక్షయంబు నొంద నున్నపరీక్షిత్తును రక్షించి యతండు పెద్దవాం డగువఱకు రాజ్యపాలనంబు గావింపం జెప్పి యెల్లవారియనుమతంబు వడసి సపరివారుండై చతుర్విధసేనాసమేతుండై రథం బెక్కి ద్వారకాపురంబునకుం బయనం బయ్యె నప్పుడు. 291

— శ్రీకృష్ణుండు ద్వారకాపురంబునకుం జనుట —

సీ. శంఖమృదంగముల్ పుంఖానుపుంఖముల్
భేరులు దుందుభుల్ బోరుకొనియె
వందిమాగధులు కైవారముల్ సలిపిరి
హరిమీఁద గరితలు విరులు గురిసి
ఉత్తరయు సుభద్రయును గుంతి ద్రౌపది
మొదలగుకురుకులసుదతు లెల్ల
ధర్మరాజాదులు ధౌమ్యాదులును గొంత
దూరము కృష్ణునితోడ నడిచి

తే. రాలవట్టము తగఁ బట్టె నర్జునుండు
సాత్యకియు నుద్ధవుండు వింజామరలను
వేయుచుం బార్శ్వముల నిల్చి రాయెడ యదు
భూషణుం డింద్రవైభవమున నెసంగె. 292

వ. ఇ ట్లెల్లరుం దన్నుఁ బరివేష్టింపఁ గొంతదూరంబు చని వారి నుండుం డని నిలువరించి నిజపురాభిముఖుండై చనియె ధర్మరాజాదులు నెట్టకేలకు మగిడి పురంబు సొచ్చి రట్లు తనవారి నంపిపుచ్చి శౌరి ద్వారకాభిముఖుండై పోవుచుఁ గురుదేశంబు లతిక్రమించి పాంచాలశూరసేనాది దేశంబులు దాఁటి యమునాప్రాంతమున బ్రహ్మావర్తంబును గురుక్షేత్రంబును మత్స్యదేశంబును సరస్వతీప్రాంతమునఁ దృణజలరహితభూభాగంబుమీఁదుగా సౌవీరాది దేశంబు లుపగమించి యానర్తంబులు దరియ నరిగి ద్వారకాపురంబు చేరి పాంచజన్యంబు పూరించుటయు నాసమయంబునఁ బౌరు లాధ్వని విని మనకృష్ణుండు వచ్చుచుండె నని సంతోషంబున నెల్లరు రథాదు లెక్కి యెదురు వోయి యథోచితోపచారాపచితుల నభినందింపఁ జేసి వేఁడుక లోడిక లెత్తఁ దోడుకొని వచ్చుటయు భక్తవత్సలుం డగుకృష్ణుండు పురప్రవేశంబు చేసి యెదురువడినబల రామాక్రూర ప్రద్యుమ్న సాంబ చారుదేష్ణ ప్రభృతుల నాదరించుచు బ్రాహ్మణాశీర్వాదనాదంబును మంగళతూర్యంబులును మిన్నుముట్ట నటవిటగాయకు లాడుచుం బాడుచు ననుసరింపఁ బురంధ్రీరత్నంబులు పుష్పవర్షంబు కురియుచుండ రాజమార్గం బతిక్రమించి యంతఃపురంబునఁ దండ్రికిని దేవకీప్రభృతు లగు ♦ నేడ్వురు తల్లులకును దండప్రణామంబు గావించి వారియాశీర్వచనంబు లంది పదం

♦ ఏడ్వురుతల్లులు—వీరు దేవకుని కూఁతులు, వసుదేవుని భార్యలు:—దేవకీదేవి, ధృతదేవి, శాంతిదేవి, ఉపదేవి, శ్రీదేవి, దేవరక్షిత, సహదేవి యనువారు కావచ్చును. వీరేకాక వసుదేవునకు రోహిణి, పౌరవి, మదిర, కౌసల్య, రోచన, ఇళ, లోనగువారు పెక్కండ్రుభార్యలు కలరు. ఇట్టిచో నేడ్వురుతల్లులనుట కేమి కారణమో? వీరేడ్వురు తన్నుఁగన్న దేవకికిఁ దోఁబుట్టువులని యేమో? విచారింప నగు.

పడి పదాఱువేలసౌధంబులచేఁ బ్రకాశించుచున్న నిజమందిరంబునకుం
జని భార్యల నందఱ వేఱువేఱ దర్శనస్పర్శనాలింగనాదుల నభినందిం
పం జేసి బంధుమిత్రాదుల గూడి యిష్టాలాపంబులం బ్రొద్దుపుచ్చుచు
సుఖంబుండె నంత నక్కడ హస్తినాపురంబున. 293

సీ. తఱిఁ దప్పకుండఁగ స్తనయిత్నువులు వచ్చి
నెల మూఁడువానలు నిలిచి కురిసె
ధాత్రీతలం బది సస్యసంభరితం బయ్యెఁ
గుంభవృష్టిగఁ బాలు గోవు లిచ్చె
ఋతుధర్మమును దప్ప కెల్ల యోషధులును
ఫలియింప నయ్యెనుఁ బ్రజలు దనియ
వనము లన్నియుఁ బుష్పఫలభరితము లయ్యె
నలుగడధర్మము నిలువ నయ్యె

తే. వ్యాధు లాధులు క్షామడాంబరము లీతు
లెందునుం గానఁ బడవయ్యె నెల్లప్రజకు
సకలసౌఖ్యములుం గల్గె శమనసుతుఁడు
శాంతుఁడై రాజ్యమేలునాసమయమందు. 294

— పరీక్షిత్తు పురుషోత్తమరక్షితుండై జన్మించుట —

వ. ఇట్లు ప్రజానురంజకంబుగాఁ బాండురాజు చందంబున రాజ్యంబు పరి
పాలించుచున్నసమయంబునం గొంతకాలంబున కుత్తరగర్భంబునం
దుండునర్భకుం డశ్వత్థామశస్త్రానలదహ్యమానుం డగుచు నప్పుడు
తనసమీపంబున నంగుష్ఠమాత్రపరిమాణంబు గల యొకపురుషునిం
గాంచె నతండును. 295

సీ. నీలంపుటాలఁడాల్ డీలింపఁ జాలుమై
హొంబట్టుటెంటెంబు డంబుమీఱ
నునుబోరఁ గౌస్తుభ మనుమానికపుఁ బేరు
క్రొక్కారుమెఱుఁగునాఁ గొమరుమిగులఁ

గెంగేలఁ దలకట్టుసింగాణి విలమురి
గుదుసువా ట్గుదెయును గడిమిఁ దెలుప
వేవెలుంగులతేనిచేవఁ గాదనిపించు
బొమిడిక పూదలఁ బొదలుచుండఁ

తే. బేరురంబున సిరి కడుంబేర్మిఁ దనర
నింతయై యింతలోపల నెంతో యగుచు
వేడిమికిఁ దాళజాలక వెచ్చనూర్చు
కడుపులోపలివానికిఁ గానవచ్చె. 296

వ. అతండు నిప్పువోలె నొప్పు తనచేతిగదాదండ మన్నిదిక్కులం ద్రిప్పు
కొనుచు దివాకరుండు నిజకరంబుల నీహారంబుం బలె బ్రహ్మాస్త్రతేజం
బుపసంహారింపం జేయుచుఁ దనసమీపంబున దీపించుటం గాంచి దశ
మాసపరిచ్ఛేద్యుండయినగర్భస్థబాలకుం డితం డెవ్వం డని పరీక్షించు
చుండునంత నపరిచ్ఛిన్నస్వరూపస్వభావములు గలుగునతం డంతర్ధా
నంబు నొందె నంతలోన. 297

ద్విపదము. గ్రహము లుచ్చస్థితిం గాలుచునుండ
మహిమవంతం బయి మలయులగ్నమునఁ
పాండవవంశముం బ్రబలింపఁ జాలఁ
బండితవేద్యుఁ డా బాలుండు పుట్టె
నాశుభవృత్తాంత మాలించి వేడ్క
నాశమనాత్మజుం డాచార్యు ధౌమ్యుఁ
బిలువంగ నంచి సంప్రీతిమై స్వస్తి
పలికించి వేదోక్తపద్ధతి జాత
కర్మాదు లొనరించి బ్రహ్మదేవతలకు
భర్మముం గోవులు పంటభూములును
గజులు హయంబులు గ్రామముల్ మఱియు
వరదానము లొనర్చి మన్నించి పుచ్చె. 298

వ. విష్ణుసంరక్షితుం డగుటం జేసి విష్ణురాతుం డనియుఁ బరీక్షితుం డగుటం జేసి పరీక్షితుం డనియుఁ బేరులు పెట్టించి పిమ్మట నెల్లభూసురులం గాంచి యి ట్లనియె. 299

—♦ ధర్మరాజునకు విప్రులు పరీక్షిత్తుజాతకంబు సెప్పుట ♦—

ఉ. మావంశంబునఁ బుట్టినట్టిరు జగన్మాన్యప్రభావంబునన్
జేవం బొల్చిరి యిక్కుమారకుఁడు వంశీయాంచితాచారమం
దేవేళం బ్రచరించుచుండునొకొ వా కిం డన్న విప్రోత్తముల్
దేవప్రార్థనఁ జేసి యి ట్లనిరి దేదీప్యగ్రహప్రస్థితిన్. 300

సీ. ఇక్ష్వాకునిం బోలి యీతండు ప్రజలను
బాలించు ధర్మము పట్టు విడక
రఘురామచంద్రుని రమణ బ్రాహ్మణభక్తి
చనఁగ సత్యప్రతిజ్ఞతఁ దలిర్చు
శిబిచక్రవర్తివాసిన్ శరణ్యుఁ డయి
దాతయై లోకవిఖ్యాతిఁ గాంచుఁ
గంధితెఱంగున గంభీరుఁ డగు నగ్ని
వలె నెప్పుడు ప్రతాపవంతుఁ డగును
తే. గాశ్యపి విధంబునను నోర్పు గలిగి యుండు
నలువ తెఱఁగున సమబుద్ధి గలిగి మెలఁగు
శంకరుఁడు వోలె శ్రితరక్షణాంకితుఁ డగుఁ
గృష్ణునిం బోలె సద్గుణకీర్తితుఁ డగు. 301

మ. హయమేధం బొనరించు జ్ఞాననిధియై హర్షించుచుం బెద్దలన్
నయమార్గంబున సేవ సేయు సుతులన్ గాంచుం గులఖ్యాతులన్
నియతిన్ ధర్మము నుద్ధరించి ప్రజల న్మే లెంచి పాలించు ని
శ్చయవిజ్ఞానమునన్ ఋషీంద్రుఁ డన నై క్ష్మామండలిం బొల్చెడిన్.

చ. అతఁ డొకమౌనిశాపమున నవ్వలఁ దక్షక సర్పదష్టుఁడై
మృతుఁ డగు నట్టిచో శుకమునీంద్రునిసంగతిఁ దత్త్వబోధనాం

చితుఁ డయియుండు దాన మునిశేఖరు లందగ రాని వైష్ణవో
న్నతపద మందుఁ బొందుపడు నాకపదేశ్వరవర్ణనీయుఁడై. 303

వ. అని చెప్పి భూసురోత్తము లాధర్మరాజసత్కృతులై చని రంత విష్ణు
రాతుండును దాతలపోషణంబున శుక్లపక్షక్షపాకరునిచందంబున దిన
దినప్రవర్ధమానుం డయ్యె నంత ధర్మరాజుతమ్ములు విజయంబు చేసి
తెచ్చినధనంబున మూఁడశ్వమేధంబులు గావించె నక్కాలంబున. 304

సీ. ♦తీర్థయాత్రకు నయి స్థిర మెట్టఁ జని క్షత్త
మైత్రేయమునిని సమాశ్రయించి
తత్త్వవిజ్ఞానముం దగ నొంది కృతకృత్యుఁ
డై మరలఁ వచ్చె హాస్తిపురికి
ననుఁగుఁచుట్టం బగునతనిరాకకు నెల్ల
వారును సంతోషభరితు లైరి
ధర్మజుం డాతనిఁ దనయింటికిం గొని
పోయి పూజించె సంపూర్ణభక్తి
తే. అపుడు భుజియించి సుఖ యగునతని నరసి
ధర్మజుం డనుఁ దీర్థయాత్రలను దీర్చి
వచ్చితివె ద్వారకాపురవరమునందు
నున్నయాదవుల్ కుశలులై యున్నవారె. 305

తరళము. విదురుఁ డిట్లను దాను జూచినవీధ్రతీర్థమహాత్మ్యముల్
విదిత మౌ నటు చెప్పి యాదవవీరనాశ మొకింతయే
మదికి దుఃఖము గల్గునో యని మాని చెప్పుట లాపయిన్
సదయుఁ డా ధృతరాష్ట్రునిం గన స్వాంతముం గలఁడై చనెన్. 306

శా. ఆమాండవ్యుని శాపకారణమునన్ బ్రాపింప శూద్రత్వ మీ
భూమిం బుట్టెఁ గృతాంతుఁడే విదురుఁడై పూర్ణత్వముం గల్గి యా

♦ క్షత్త=విదురుఁడు; వీధ్రము=నిర్మలము;

చ్ఛామాత్రంబున సర్వముం దెలియనై స్వభ్రాతకుఁ గాలవృం
బూమెల్ తెల్పెడునట్టివాఁడ యగుచుం బోయెఁ నయం బేర్పడన్.

వ. అట్లు ధర్మజుననుజ్ఞ వడసి విదురుండు ధృతరాష్ట్రునికడ కేగి త న్నెఱిం
గించి యి ట్లనియె. 308

ఉ. కాలము తీరసించెడిని గానఁ బ్రతిక్రియఁ జూడ నొప్పు భూ
పాల! పురంబు వీడి వనభాగమునం దప మాచరింపఁగాఁ
బోలును నీకు మిత్రులును బుత్రులు పోయిరి వృద్ధు వైతి నీ
కేల విరాళి నానుడి నొకింతవిరాగము నొందు టొప్పెడిన్. 309

వ. మఱియును. 310

సీ. నే మున్న యింటికి మిన్న ముట్టఁగ నిప్పు
వెట్టిరి కూటిలో విషము గలిపి
రానాఁడు మాపత్ని మానభంగ మొనర్చి
రడవులకుం దోలి రపుడు మమ్ము
విషసర్పములచేత వెట్టఁగాఁ గఱపించి
నిదురించుచోఁగట్టి నీటఁ ద్రోచి
మారాజ్యము హరించి మాసర్వమును గైవ
సము చేసికొని మమ్ముఁ జంప నెంచి

తే. రకట నీపుత్రు లనుచు నెప్డయిన మాట
బడుల ననుకొన్న నీదగు నెడఁద కెంత
యేనియును దాప ముదయించు నిట్టితోడుసు
లేల శాంతుఁడవై వని కేగు మీశ. 311

తే. పాండవులు నిన్ను ననకున్నఁ బ్రజలు నిన్ను
ననక మానరు ధృతరాష్ట్ర! తనయుపక్ష
మగుచుఁ జేసిననీచేత లతివిగర్హ్య
ము లని నీచిత్తమే నీకుఁ దెలుప కున్నె. 312

చ. ధనములు ధాన్యముల్ సుతులు దారలు భూములు గీము లన్నియున్.
గనుఁగొన నశ్వరంబు లని గన్గొని లోన విరక్తి నూని యో

మనుజవరేణ్యా సందియము మాని యిఁక న్వినుదీయు ధర్మపు
త్రునకును జెప్ప కుత్తరము త్రోవను బొమ్ము తపించువాఁడవై. 313

—♦ గాంధారీధృతరాష్ట్రులు మహాప్రస్థానము చేయుట ♦—

వ. అని చెప్పినఁ బ్రజ్ఞాచక్షుండు దృఢప్రజ్ఞుండై సర్వబంధంబులుం దెగనాడి విదురుండు చూపినమార్గంబునఁ దపంబు చేయం బ్రయాణంబై పోనెం చిన గాంధారియు నతని ననుసరింప విదురునితోఁ గూడఁ దపోవనంబు నకుం జనియె. మఱునాఁ డరుణోదయంబున ధర్మరాజు లేచి కాల్యకరణీయంబులు నిర్వర్తించి పితృవందనంబు సేయ ధృతరాష్ట్రునిగృహంబునకుం జనుదెంచి యట గాంధారీధృతరాష్ట్రులను విదురునిం గానక విచారించుచు నొక్కచో సంజయుం గాంచి యి ట్లనియె. 314

మ. సుతులుం జుట్టలు గిట్టిపోవుట కెదం శోకంబు పాకంబుగా
మతి లేనట్టిముసళ్ళు చీఁకు లకటా మాతల్లి గాంధారియుఁ
ధృతరాష్ట్రుండును క్షత్తయుఁ గృహమునం దెందుం గనన్ రారు దుః
ఖితులై దూఱుచు నన్ను గంగఁ బడి పూన్కిం బాసిరో ప్రాణముల్.

వ. అని యడుగుచున్నధర్మరాజుపలుకు లాలకించి సంజయుండు ధృతరాష్ట్రవిరహం బోర్వఁ జాలనిచిత్తం బుత్తలంపడఁ గొంతతడ వూరకుండి ధైర్యంబు తెచ్చుకొని ధర్మరాజున కి ట్లనియె. 316

ద్విపద. నాతోడఁ జెప్పక నన్ను వంచించి
నాతండ్రి ధృతరాష్ట్రనరనాథుఁ డతని
నాతి యెందేఁ బోయినారొ నే నెఱుఁగ
రాతిరి యగుదాఁక రాజుతో నుంటి. 317

వ. అనుచున్నంతఁ గొండొకసమయంబునఁ దుంబురునారదు లాకాశయానంబుననుండి యరుదెంచిన ధర్మజుండు వారిం బూజించి మా ధృతరాష్ట్రుండు గాంధారియు విదురుండు నారేయి నెం దేగిరో తెలియక నాచిత్తం బుత్తలంపడుచున్నది. సర్వజ్ఞు లగుమీర లనుగ్రహించి యెఱింగింపుఁ డనిన నారదుం డి ట్లనియె. 318

—♦ నారదుండు ధర్మరాజునకుఁ గర్తవ్య మెఱిఁగించుట ♦—

సీ. వినుము ధర్మజ్ఞ ! యీవిశ్వమంతయు నీశ్వ
　　రాధీన మగుట నీ వాత్మలోన
వేని గుఱించియు నేని దుఃఖించుట
　　వలదు భూతమ్ములు గలియు విడును
ముకుదాట నెద్దు ప్రజకు వశం బయ్యెడు
　　పగిది వేదం బనుపగ్గమునను
కట్టంగఁ బడియు జగంబు వశం బగు
　　నీశ్వరునకు నని యెఱుఁగ వలయు
తే. అందువలన బ్రహ్మాదిగా నఖిలజీవి
కోటి భగవంతునకుఁ జిక్కికొనియె యుండు
నాటలకుఁ గందుకాదుల యట్లు జంతు
కోటు లీశ్వరునకు నాడుకొనియెడునవి. 319

క. నీ వీలోకము ధ్రువ మని
భావింతువె నేడు చూడఁ బడునది రేపో
యేవలనఁ జూప నుండదు
కావున ధ్రువ మనఁగఁ గలమె కనుఁగొనుచు నిటుల్. 320

శా. అజ్ఞానాతిశయంబు పెంపునను దేహం బాత్మగా నెంచుటన్
బ్రాజ్ఞుం డయ్యును దేహనాశనమునన్ బ్రాల్మాలి దుఃఖాత్ముఁడై
యజ్ఞుం డట్లగు నీవు జ్ఞానమున మాయారూపకభ్రాంతికిన్
బజ్ఞానంబును బో నడంపకుము ధైర్యస్థైర్యముల్ గల్గుటన్. 321

మ. ధృతరాష్ట్రాదులు దిక్కులేమిఁ దను వేరీతిన్ భరింపంగ నై
క్షితి వర్తించెద రంచుఁ జింతపడుటల్ చెల్లంగఁ బో దీవు త
ద్గతికిన్ గా వలమిత్తి వాతికగు మేధాశాలి తా నన్య్వ ని
ర్గతి రక్షింపఁగఁ జాలెడిన్ దెలుపుమా క్ష్మాపాలచూడామణీ. 322

తే. మఱియు సంచిత మగుకర్మమార్గమునను
దిగ్రుణములకు నధీనమై తిగిలి పంచ
భూతమయ మగు దేహ మెరీతిఁ బరుల
నెట్లు రక్షింప నేర్చునో యెఱుఁగఁ జెపుమ. 323

తే. నీవు నీమేను రక్షింప నేర నెట్లు
పెరల రక్షింపఁగా నేతు వరయ నజుఁడు
జీవనోపాధి గల్పించి చేసె జీవు
లను నొరుల కొంం డ్లుపకరింతు రనుట కల్ల. 324

ఉత్సాహ. కాలరూపుఁ డగుచు వెలసి కమలనాభుఁ డెల్లదు
ష్టాళిఁ గూల్చి శిష్టజనుల నాదరింప ద్వారకః
గ్రాలెఁ గృష్ణుఁ డనఁగ దేవకార్యము నెఱవేర్చఁ గా
లీలమై స్వధామమునకు లేచిపోవు నింతలోః. 325

వ. మీరు నాకృష్ణుం డున్నయంతకాల ముండి ధృతరాష్ట్రాదులవలె
వనంబునకుం జనుండు. మీధృతరాష్ట్రుం డిపుడు విదురగాంధారీసహి
తుండై హిమవన్నగంబునకు దక్షిణంబున సప్తశ్రోతం బనునాశ్రమం
బున నున్నవాఁ డది మిక్కిలి పవిత్ర మయినప్రదేశం బటఁ త్రిలోక
పావని యగుగంగానది సప్తమహర్షులప్రార్థనంబునం జేసి యేడుపా
యలై ప్రవహించుచున్నది దానం జేసి దానికి సప్తశ్రోత యని పేరు
వచ్చిన దాచోట మీపెదతండ్రి పానీయమాత్ర మాహారంబు
గావించుకొనుచు నియమవ్రతంబున నిష్ఠాగరిష్ఠుండై నిర్గతవ్యాపారుం
డై ప్రవర్తించుచున్నవాఁడు. ఇట్లు సన్యస్తకర్ముం డై యున్నవానికై
నీవు విచారించుచు విఘ్నంబు గావించు టొప్పదు. 326

తరువోజ. నేఁటి కైదవనాఁడు నీపెదతండ్రి
నియమచిత్తుండయి నిలిచి యోగాగ్నిఁ
గాటముగా నెల్గుకరణినిఁ జేసి
కాయంబు భస్మంబు గాఁ జేసి కొనును

బాటించి గాంధారి పతితోడ నందుఁ
బడి ప్రాణములు వాసి పరమాత్మ నొందు
నేటి యావిదురుండు మిమ్మాటపడియు
మీ దెఱుంగుటఁ బోవు మేదినిం బట్టి. 327

వ. అని చెప్పి నారదుండు ధర్మరాజుశోకంబు పోకార్చి తుంబురుసహితుం
డై యథేచ్ఛం జనియె. ధర్మజుండును విగతవిచారుండై బంధులం జూచి.

—♦ ధర్మరాజు దుర్నిమిత్తములు గని చింతించుట ♦—

మత్త. వాసుదేవునివార్త లారసి వత్తు నే నని యర్జునుం
డాసరోజదళాక్షుప్రోలికిఁ నార్తిమైఁ జనె నెన్నియే
మాసముల్ కడతేఱె నాతఁడు మమ్ముఁ జూడఁగ రాఁ డయో
దోసముల్ పచరింప నయ్యెడు దుర్నిమిత్తము లిత్తఱిన్. 329

సీ. అకట మహాఘోర మై కడువ్యత్యాస
మై కాలగతి గాన నగుచునుండె
ఋతుధర్మములు మాఱె క్షితిఁ గామలోభాదు
లతులితగతి కయ్యె నవగుణములు
ప్రబలెను వ్యవహారపద్ధతు లన్నియుఁ
గపటయుతంబులై కానఁబడియె
పతులతో సతులు సంతతము పోరాడుదు
రడకింత్రు పితరుల నాత్మభవులు

తే. అన్నదమ్ములు గలహింతు రనుఁగుసుతల
నమ్మి కొందురు బ్రాహ్మణు లధ్యయనము
చేయ నొల్లరు శూద్రులే చెప్పుచుండ్రు
శాస్త్రధర్మము లెల్ల నీసమయమందు. 330

వ. ఇట్లనేకంబు లగుదుర్నిమిత్తంబులు పొడకట్టుచుంట లెఱింగి ధర్మ
రాజు భీముం బిలిచి యి ట్లనియె. 331

ఉ. తమ్ముఁడ ఫాల్గుణుండు చనె ద్వారక కేడు నెలల్ గతించె శీ
ఘ్రమ్ముగ వత్తు నం చనియెఁ గవ్వడి రాఁ డిది యేమిహేతువో

యిమ్మెయి నారదుండు వచియించినయట్టులు కాల మయ్యెనో
యమ్మురదానవారి యెటు లారడి పొందఁగ నయ్యెనో కటా. 332

మ. మన మీరాజ్యసుఖంబులం గొనుటకున్ క్ష్మామండలిం బేరు గ
ల్గి నెఱిం గ్రాలుట కధ్వరంబు లనురక్తిం జేయఁగా నుంటకున్
ఘనుఁ డాకృష్ణుననుగ్రహంబ యతఁ డేకష్టంబునం బొందె నో
యని నాచిత్తము తత్తఱించు ననుజన్మా! దుర్నిమిత్తంబులన్.

ఆ. వామభాగమైనబాహువు నేత్రము
తొడయు మాటిమాటి కడరుచుండె
దీన నింతలోనె తెలియంగ నాపదల్
గలుగు ననుచు లోనఁ దెలియ వచ్చె 334

సీ. నక్కలు సూర్యునిదిక్కున కేదు రయి
మోమెత్తి యార్చెడు భీమముగను
కుక్క యొక్కఁడు నాదుచక్కి మొఱ్ఱో యను
నట్లు భాంకారము నాచరించు
నపసవ్యముగ గోవు లప్పుడు నప్పుడు
మముఁ జుట్టివచ్చు నంభారవమున
నేనుంగు లశ్వము లేవేళ జూచినఁ
గంట నీర్గార్చెడుఁ గాల్వ గట్ట

తే. ఘూకములు భీకరంబుగాఁ గూయఁ జొచ్చె
దిక్కు లెప్పుడు కావిరిఁ జిక్క నయ్యె
మేఘములు లేక పిడుగులు మేదినిఁ బడు
మాటిమాటికిఁ గంపించు క్ష్మాతలంబు. 335

మ. పరివేషంబులు చంద్రసూర్యులకుఁ గన్పట్టున్ రజం బెల్లెడన్
బరివర్తించి మునుంగు వెట్టెడుగతిన్ గాటంబుగా గాలి వీ
చు రవీందుల్ గడు మాసినట్లయిరి కార్చున్ రక్తమున్ మేఘముల్
వరదేవాలయవిగ్రహంబు లవి కంప్రం బందెడున్ మాటికిన్. 336

వ. ఇత్యాదిదుర్నిమిత్తంబు లనర్థంబు శంకింపం జేయుచున్న వని గుండె లరచేతం బెట్టుకొని యుండె నాసమయంబున ద్వారకాపురంబునుండి యర్జునుం డరుదెంచి ధర్మరాజుపాదపద్మంబులం బడి నమస్కరించి కన్నీరు మున్నీరై కాలువలు గట్టం దల వంచుకొని వెక్కి మ్రింగుచుం గూరుచున్న వానిం గాంచి మిన్ను విఱిగిమీఁదం బడిన ట్లయిన ధర్మజుం డాతురుండై నిలువంబడి తొట్రుపడుచు ని ట్లనియె. 337

సీ. ద్వారకాపురమందు బంధువర్గం బెల్ల
నోయి క్షేమంబుగా నున్నదట్టె
మాతామహుండును మాతులుండును మన
మేనయత్తలు లోగనైనవారు
వారిపుత్రులు పుత్రికారత్నములు దేవ
కుండు జయంతుఁ డక్రూరుఁ డరయ
కుశలులై యుండిరే కులపతి బలుఁడు ప్ర
ద్యుమ్నసాంబు లనిరుద్ధుండు చారు
తే. దేష్ణుఁడు సుషేణుఁ డాదిగాఁ దెలియఁ దగిన
వా రనామయులై యున్నవారె మఱియు
నుద్ధవుఁడు నందుఁ డుపనందుఁ డొప్పుచున్న
వారె చెప్పుము తమ్ముఁడా వగపు వోవ.

సీ. ఎవనిబలంబున నెల్లయాదవులును
ద్వారకాపురి సుఖులై రహింతు
రెవ్వఁడు భుజశక్తి నెల్లవేల్పుల గెల్చి
పారిజాతముఁ దెచ్చి పాతె వసుధ
నెవఁడు కంసాదుల నెల్లదుష్టుల నోర్చి
నిష్కంటకము చేసె నిఖిలధరణి
యేవాఁడు దేవకీదేవికోరికఁ జేసి
చచ్చినబిడ్డలఁ దెచ్చి చూపె

తే. ఎవఁడు దుర్యోధనాదులఁ బవరమందు
నోర్వఁగాఁ జేసి మన కిట్టియున్నతపద
మొందఁ గాఁ జేసి రక్షించుచుండు నట్టి
కృష్ణభగవానునకు నేఁడు క్షేమమె కద. 339

తే. నీకుఁ గుశలమె కద వోయి నిన్నుఁ జూడఁ
దేజ మఱి యున్నయట్టులు తెలియ వత్తు
కారణం బేమి తమ్ముఁడా కడుపు చెఱువు
గాఁగ నగుచుండెఁ జెప్పుమా కలతెఱంగు. 340

—♦ అర్జునుండు దుఃఖించుచుఁ గృష్ణనిర్యాణముం జెప్పుట ♦—

వ. అని యడుగుచున్నయన్నం గాంచి యర్జునుండు ప్రాణమిత్రవియోగం
బునఁ బీడితుండై కన్నీరు మున్నీరై కాఱ మోము వెలవెల బాఱఁ
జింతాభరంబున మాటాడ నేర కతికష్టంబున దుఃఖం బరికట్టి కన్నీరు
కరతలంబునం దుడుచు కొనుచు గొంతు రాల్పడ గొణుగు కొనుచు
ని ట్లనియె. 341

.. ఏ నెవ్వనివియోగ మెప్పుడు గల్గినఁ గాని
జీవచ్ఛవమ్ము నాఁ జెప్ప నగుదు
నేమహాత్మునికృప నేను మత్స్యము నేసి
పాంచాలిఁ దెచ్చినవాఁడ నయితి
నెవ్వానిప్రాపున నేను ఖాండవ మగ్ని
కర్పించితినొ దేవతాళి నోర్చి
యేమహామహునికృపామృతవృష్టిచే
మనసర్వతాపముల్ మాయ మయ్యొ

తే. అతఁడు మనప్రాణబంధువు సతతరక్ష
కుండు మనపాలిభాగ్యము దండితారి
శ్రీరమాధవుఁ డయ్యయో చెప్ప లేను
మనల విడనాడి పోయె నే మనెదువాఁడ. 342

వ. మఱియు నతిలోకసుందరం బైనమయసభాభవనంబు మనకు సంప్రా
ప్తించుటకు నశ్వమేధంబున నానాదేశాధీశు లరుదెంచి మనకు దరిసె

నంబులు వట్టుటకుఁ గారణభూతుం డైనవాఁడును నీసతికబరీభారంబు వట్టి సభలోనికిం గొనివచ్చి దుశ్శాసనాదులు మానభంగంబు సేయు చుండ నామెం గాపాడియున్నవాఁడును మనభీమసేనునిచే జరాసంధు నిం జంపించి రుద్రయాగంబున నాహుతులు గానున్నరాజుల రక్షిం చినవాఁడును దురాత్ముఁ డగుదుర్యోధనునిపంపునఁ బదివేల్బ్రాహ్మ ణులతోఁ దనకుఁ భోజనము పెట్టు మని వచ్చినదుర్వాసునివలన దోసంగు రాకుండఁ గావించినవాఁడును నేను శంకరుని మెప్పించి పాశుపతంబు నింద్రాదులవలన నానావిధాస్త్రంబులును బడసి యీ దేహంబుతోడన స్వర్గంబునకుం జని కాలకేయాదుల సంహరించుపట్ల నా బాహువుల కనంతసామర్థ్యం బొసంగినవాఁడును నాకు రథసార థియై కౌరవసేనాసముద్రంబు దరియింపం జేసి విజయం బొసంగిన వాఁడును మహాసంగ్రామంబున భీష్మద్రోణ కర్ణశల్యాదుల ప్రాణం బులు చూపులతోడన హరించినవాఁడును మఱియు ననేకమహా కార్యంబు లొనరించి లోకమ్ము నుద్ధరించినవాఁడు నగుమహానుభా వుండు వాసుదేవుండు దేవకీనందనుండు శ్రీకృష్ణభగవానుండు మనలను దవభౌతికదేహంబును విడిచి స్వీయం బగుపరంధాంబు నొందె నట్టి నిరతిశయప్రీతిపాత్రం బగుమిత్రరత్నంబుఁ గోల్పోయి మార్గమధ్యం బునఁ గృష్ణభార్యలం గొనివచ్చుచు దుర్జను లగువ్యాధులచే నబలవలె జయింపఁబడితి నాగాండీవంబు నారథంబును నాగుఱ్ఱములు నా బాణ ములు నప్పటివె యైన నేను నప్పటివాఁడనే యైనను నవి యన్నియు నూషరక్షేత్రంబునం బెట్టినబీజంబులు వలె నిరర్థకంబు లయ్యె నయ్యా మహారాజా! యాదవవీరు లందఱు మద్యపానంబున నొడలెఱుంగక మునిశాపంబునం జేసి తమలోఁ దారు పోరి చచ్చి రందు నల్వురు మాత్రమే శేషించి రని చెప్పి మాటాడ నేరక శ్రీకృష్ణపాదపద్మ ధ్యానంబు గావించుచుఁ గామక్రోధాదులవశంబునం బడక తొల్లి భగ వంతుడు తన కుపదేశించినతత్త్వంబనుస్మరించుచు దేహాత్మభేదభ్రాంతిం

దొలగించుకొని గుణత్రయవిదూరుం డై యుండె. ధర్మరా జర్జునుని వలన యాదవాన్వయనాశనంబు విని నారదవాక్యంబు స్మరించుచు భగవన్మార్గం బెఱింగి స్వర్గప్రయాణప్రయత్నంబు గావించుచుండెఁ గుంతియుం గొడుకువలన నంతయు విని సర్వసంగపరిత్యాగంబు గావించె ధర్మరాజు కృష్ణనిర్యాణదినంబు మొదలు కలిప్రవేశం బని నిశ్చయించుకొని. 343

—♦ ధర్మరాజు పరీక్షిత్తునకుఁ బట్టంబు గట్టి పోవుట ♦—

సీ. తనమనుమనిఁ బార్థతనయునితనయుని
అభిషిక్తుఁ జేసి రాజ్యమున నిలిపి
యనిరుద్ధునికుమారుఁ డగువజ్రునిన్ శూర
సేనదేశములకుఁ జేసి పతిగ
నవలఁ బ్రాజాపత్య మనునిష్టి గావించి
యగ్నిహోత్రము నాత్మయందు నిలిపి
మోహ మహంకారమును దవ్వుగాఁ ద్రోచి
ప్రేమానుబంధముల్ పెల్లగించి
తే. ఇంద్రియములకు విషయేచ్ఛ లేగఁ జేసి
చిత్తమును బ్రాణమునయందుఁ జేరఁ జేసి
ప్రాణము నపామున దాని వ్యానమునను
వ్యానము సమానమున లయ మందఁ జేసి. 334

శా. వ్యాపారంబులు సర్వము న్విడిచి యాహారంబు వర్జించి ని
త్యాపాయం బగుకాయము న్విడువనై వ్యాహారముం జేయ కెం
తో పిచ్చిం గలవాఁడు నోలె నగుచున్ దో ర్దేరిఁ గైకోక తా
నాపై నుత్తరదిక్కువట్టి చనె బ్రహ్మజ్ఞాని యై మౌని యై. 345

వ. అంత నతనిసోదరులును దమకు మరణంబు సమీపించిన దని తలంచి ధర్మరాజు ననుసరించి రిట్లు వా రందఱును భగవత్ప్రాప్తిప్రతిబంధకంబు లగుపుణ్యపాపంబులు భస్మంబు గావించి రజస్తమోరహితం

బగురూపంబు గలిగి భగవద్భక్తులు పొందం దగు శ్రీమన్నారాయణ పదంబు నొందిరి ద్రౌపదియు భగవంతునియందు భక్తిం జేసి పరమ పదంబు నొందె విదురుండును బ్రభాసతీర్థంబునం గొంతకాల ముండి తాను యముండ కావునం బితృదేవతా ప్రార్థితుండై తనలోకంబు నకుం జనియె ననంతరం బప్పరీక్షిన్నరేంద్రుండు. 346

—♦ పరీక్షితుని రాజ్యపాలనాదికము ♦—

మ. మునిలోకాంచితుఁడై నధర్మజుఁడు పెంపుం సొంపు దీపింపఁ గా
దనకుం బట్టము గట్టి పోయినపయిన్ దత్త్వార్థ విద్వర్యుఁడై
ఘనుఁడై భాగవతోత్తముం డయి జగత్ఖ్యాతంబుగా రాజ్యముం
గొని పాలించెం బితామహాదులబలెం గొండాడఁగా భూభుజుల్. 347

సీ. అంత నుత్తరుకూఁతు రగునిరావతిఁ బెండ్లి
యాడి గార్హస్థ్యమునందు నుండి
జనమేజయాదులఁ దనయుల నల్వురఁ
గని కృపాచార్యునిఁ దనగురువుగ
నెలకొల్పుకొని దేవతలు హవిర్భాగముల్
స్వస్వరూపముతోడ వచ్చి కొనఁగ
భూరిదక్షిణలతో మూఁ డశ్వమేధముల్
సలిపి దిగ్విజయంబు సలుపుచోం బె
తే. దిక్కు లిరునాల్గు దిరుగాడె ధీరుఁ డగుచు
నప్పు డొకసమయంబున సంప్రీభవుఁడు
రాజలక్షణలక్షితుం డై జగమున
మెలఁగుచుండెడివాఁ డొక్కతలమునందు. 348

ఉ. గోమిథునంబుఁ బట్టుకొని కొట్టుచుఁ గాళ్ళుల నెట్టుచుండ నా
భూమిధవుండు వానిఁ గలిపూరుషుఁగా మది నెంచి వానినిన్
వేమఱు నిగ్రహించె నని వెండియు నిట్లను దచ్చరిత్ర మెం
తే మహితంబు చెప్పెద సమాహ పొనర్చుచు నాలకింపుఁడీ. 349

సీ. నరపౌత్రుఁ డాతఁడు కురుజాంగలములందుఁ
వసియించి నిజరాజ్యపాలనంబు
గావించుచుండెడు కాలంబునం గలి
తనదేశమునయందుఁ దవిలియుండె
నని విని వానితో నని సేయఁ దలపోసి
చతురంగసేనల జతనుపఱచి
విల్లునమ్ములు పూని నల్లనిగుఱ్ఱాలఁ
బూన్చినరథ మెక్కి పోయెఁ దనదు
తే. తేరిపై నున్నమృగరాజుభూరితేజ
మెల్లదిక్కులఁ జీఁకట్లు ద్రెళ్ళఁ జేయ
హస్తకౌక్షేయమునఁ గాంతి హరువు సూప
బయలుదేరెను విజయంబుఁ బడయుపొంటె. 350

వ. ఇట్లు ప్రయాణంబై సముద్రములకు సమీపముగ వ్యాపించియున్న భద్రాశ్వము కేతుమాలము హరివర్షము హిరణ్మయము భారతము లోనగువర్షంబులం గెలిచి మఱియు నుత్తరకురుభూములం గలశత్రు భూపాలురవలనఁ గప్పంబులం గొని యం దందుఁ బెద్దలచరిత్రంబు లాలకించి సంతసించుచు నల్లె శ్రీకృష్ణమాహాత్మ్యమును విని పరమానందభరితుండై తా నశ్వత్థామబ్రహ్మశిరోనామాస్త్రమ్మునఁ బీడితుం డగుటయుఁ గృష్ణభగవానుఁడు తన్ను రక్షించుటయు యదుపాండవస్నేహంబును మఱియు ననేకకథలు విని హర్షించుచు భక్తవత్సలుండు భగవంతుఁ డగుకృష్ణుండు తమవారికి సారథిత్వము మంత్రిత్వము సభాపతిత్వము దూతత్వము లోనికార్యంబులు సేయుట విని వాని సంస్మరించుచు శ్రీకృష్ణునిపాదపద్మములు తనహృదయపీఠంబునం దిడికొని ధ్యానించి పూజించుచుఁ బ్రవర్తించుచున్నయెడఁ బ్రభాసతీర్థంబున నొక్కచో ధర్మపూరుషుండు వృషభరూపంబు దాల్చి యేకపాదంబు నేల మోపి నడుచుచుఁ దనచెంత గోరూపధారిణియై పిల్లలేనితల్లివలెం దల్లడిల్లు భూదేవిం గాంచి ధర్మవృషభం బి ట్లనియె

—• గోరూపధారులైనభూదేవీధర్మదేవతల సంవాదము •—

శా. తల్లీ! నీ విది యేల కన్నుఁగవఁ గొంతల్ గానిచందంబులన్
నీళ్ళుల్ గాఱఁగ నేడ్చుచుంటి వయయో నీమోమునున్ వాడె నీ
యుల్లంబం దెదియోవిచారగరిమం బుద్భూత మైన ట్లగున్
ద్రెళ్ళుం బో యనునట్లు దోఁచెదవు నీ దీనత్వముం దెల్పుమా. 352

సీ. నీప్రియబంధుల కప్రియం బేదేని
వచ్చియున్నది యేమొ పరమసాధ్వి
యొరిగాల నడపించుచుండిరి శూద్రకు
లని తల్లడిలుచుంటివా జనిత్రి
సంకరజాతి నా సామియై పాలించు
నిఁక నని చింతింతు వేమొ తల్లి
నాబిడ్డ లీమీఁద దేవ లైతిన లేక
బాధ లందెద రనియా ధరిత్రి

తే. ద్విజులు కుత్సితకర్మదుర్విధులఁ బడుట
శ్రితులకున్ దిక్కులే దని సొక్కుచుంటొ
నీదుభారము వాప నానాదిపురుషుఁ
డస్తమించె ననుచుఁ జింతయా మహీశ. 353

వ. అనిన భూదేవి ధర్మదేవత కి ట్లనియె. 354

చ. ఎఱుఁగనివాఁడ వోలె నను నేటికిఁ గ్రొత్తగఁ బల్కరింతు వో
పురుషవరేణ్యా నీ కెఱుఁగఁ బోలనిసంగతు లేమి యుండు మున్
గరగర నొప్పనీదునలుకాళులు లే కొరిగాల మెట్టు టే
కొఱతయొ నాకు నట్టిదియె కూడఁగ వచ్చె నటంచు నెంచుమా. 355

వ. మఱియు నాశ్రితపక్షపాతమును దుష్టశిక్షణశిష్టరక్షణంబులును సర్వ
నియామకత్వంబును బలపరాక్రమంబులును స్వాతంత్ర్యంబును నైపుణ్య
మ్మును గాంభీర్యధైర్యస్థైర్యంబులును శాస్త్రార్థవిశ్వాసంబు లోకరక్షణ
పరత్వంబును లోనగుమహాగుణంబుల నొప్పు శ్రీకృష్ణభగవానుఁడు

నన్నుఁ బెడఁబాసి పోవుటంజేసి నేనిట్లుంటి లోకం బంతయుఁ గలి ప్రేరితంబై పాపభరితంబై యున్నయది దీన నాదుఃఖం బింత యన రాకున్న దని నా కింకహలకులిశపద్మాంకుశధ్వజరేఖాసమంచిత మైన శ్రీకృష్ణునిపాదచిహ్నంబులఁదాల్చుభాగ్యము లేకపోయె నని చింతించు చున్నదాన నోధర్మపూరుషా! నిన్ను నాలుగుపాదములచేతను నడి పించుమహానుభావుండు శ్రీకృష్ణుండు నన్ను విడిచి పోయె నింక నా దుఃఖం బనంతం బిది యోగీశ్వరులును సహింప లేనిది నను బోంట్లం జెప్ప నేల యని పలుకుచున్నసమయమ్మున రాజర్షి యైన పరీక్షిన్న రేంద్రుండు వానికి సమీపించునంతలో మృణాళంబుబలె తెల్లనగు గోమిథునంబును దానిం దన్నుచు దండహస్తుండై రాజలక్షణములతోఁ గూడినయొకశూద్రుండును లోచనగోచరం బగుటయు నయ్యవస రంబున. 356

ఉ. గోవృషభంబు శూద్రుఁ డగుక్రూరుండు వెన్కొని తన్నుచుండుఁడుం
జేవ చెడంగ మూత్రమును జిల్లునఁ గార్చుచు నొంటికాలితోఁ
గ్రేవల నిల్చె నశ్రువులు క్రిందఁ బడన్ బదతాడితాంగియై
గోవును బాష్పముల్ విడిచి కొంచు గనంబడె భూమిజానికిన్. 357

వ. అట్లున్నం గని పరీక్షిన్నరేంద్రుండు రథస్థుండై ధనుర్జ్యారం బెక్కు వెట్టి మేటిగంభీరవచనంబుల శూద్రరూపునిరీక్షించి యిట్లనియె. 358

— పరీక్షిత్తు ధర్మదేవత నుద్ధరించి కలిం గర్హించుట —

శా. ఓరీ క్రూరుఁడ ధర్మపౌత్రుఁడను నేనుండంగ రారాజు నై
క్రూరత్వంబున సాధుజంతువుల నీకో హెచ్చఁగా నిట్లు దు
ష్టారంభంబునఁ దన్నుచుంటి తగునే చంపం గాల ని న్నిప్డు యో
ఘోరాస్త్రంబులపాలు చేసెదను లోకుల్ నన్ను మేలెన్నగన్. 359

తే. వేషమును బట్టి రాజునా వెలయు నైతి
క్రూరతను జేవు నీవు శూద్రుని తెఱఁగున

గాన వచ్చుచు నుంటి వో శిష్ట! నిన్ను
దండితునిఁ జేయుచున్నాఁడఁ దడయ కిపుడ. 360

వ. అని ధర్మవృషంబు దిక్కు మొగం బై. 361

ఉ. ఓవృషభేంద్ర! నీవు ధవళోన్నతదేహము గల్గియుంటి వి
ట్లీవిధి నొంటిపాదమున నిచ్చట నిల్చితి పొల్పు వోవఁ గా
నీవొక దేవుఁ డంచు మది నెంచఁగ వచ్చెడు నేగి యుగ్గతిన్
గావుట కేమికారణము గల్గెనొ నాకు నెఱుంగఁ జెప్పవే. 362

తే. కురుకులోద్భవుఁ డైననేఁ గువలయంబు
నేలుచుండఁగ నేప్రాణి యిట్లు కంట
నీరు వెట్టుట లేదయో నీకు నింక
వనరఁ బని లేదు క్రూరు నీతని వధింతు. 363

వ. నిన్నింక నాల్గుపాదంబుల నడిపింతు దుష్టశిక్షణార్థము నే నిదె కంక
ణము కట్టుకొన్నవాఁడ నగ పుడుగు మని గోరూపధారిణి యైన
భూదేవిం గాంచి యి ట్లనియె. 364

తే. తల్లి! వగవకు మేరాజు తనప్రజల
బాధ లారయఁడో వాఁడు బ్రతికి చచ్చి
నట్టిఁడే నీదుబాధ వో నాచరింతు
నిట్లు చేయకయున్న నే నేల బ్రదికి. 365

వ. అని యూఱడం బలికి వెండియు వృషభమూర్తిం గాంచి యి ట్లనియె.

శా. ఏదుర్మార్గుడు నీదుపాదములు మూఁడీరీతి బంధించెనో
యేదుర్మార్గునికారణంబున నిటుల్ హేరాళమై వచ్చెఁ గీ
డాదుర్మార్గునిఁ బట్టి చీల్చెదను రాజై యుండి నే నిట్టివా
ఖేదంబుల్ దెగనేయ కుండినను దుష్కీర్తిం బడం బోవనే. 366

వ. అనిన ధర్మవృషభం బి ట్లనియె. 367

సీ. కులమునకుం దగఁ బలికితి వోరాజ!
యేనివలన మాకు నిట్లు వచ్చె

మే మెఱుంగము దాని నీమెయిఁ జేష్టల
చేఁ బల్కుబడులచేఁ జిత్తమందుఁ
నెఱుఁగంగ వలయుఁ గొందఱు దుఃఖకారణ
మాత్మయందురు కొంద ఱపుడు చేయు
కర్మమే యందు రింకను గొందఱు స్వభావ
మని యందు రందఱు నన్నిగతులఁ
తే. బలుకుచుందురు సరిదాకఁ దెలుప లేము
ప్రకృతమున మాకుఁ గలిగిన బాధ యెల్ల
నిశ్చయించికొనం జెల్లు నీక నీవ
యనెడువాక్యము లాలించి మనుజవిభుఁడు. 368

వ. ఓయి ధర్మమూర్తీ! నీవు వృషరూపుండ వయినధర్ముండవు నీ వెల్ల ధర్మంబు లెఱుంగుదువు నీయిక్కట్టు లెఱింగియు ధర్మజ్ఞుండవు గావునఁ జెప్ప వైతివి నీకుఁ దపశ్శౌచదయాసత్యంబులు నాలుగు పాదంబు లిందు మూఁడు నివు డధర్మాంశము లయిన స్మయసంగ మదంబులచేత నాశితంబు లై సత్యం బొక్కటిమాత్రము మిగిలియున్న దాపాదంబు లధర్మరూపుండు ననృతవర్ధితుం డగుకలిచే నశింపఁ జేయఁబడు చున్నవి గోరూపధారిణి యగునీభూదేవియుఁ గృష్ణుండు తన్ను విడిచి పోయినదానఁ గన్నీరు విడుచుచున్నయది యని వాని నూరార్చి యధర్మకారణం బగుకలిపురుషుని సంహరింప నెంచి నిశితం బగు నిస్త్రింశం బొండు గ్రహించినఁ దన్నుఁ జంప వచ్చురాజుం గని భయ కంపితాంగుం డై పురుషరూపుం డగుకలి పరీక్షిత్పదంబుల వ్రాలి నమ స్కరించె నంత దీనవత్సలుం డగుపరీక్షితుండు వానిం జంపం దలంపక చిఱునవ్వు నవ్వుచు వాని కి ట్లనియె. 369

—♦ పరీక్షిత్తు కలి ననుగ్రహించి స్థానం బొసంగుట ♦—

తరువోజ. శరణు సొచ్చితి కానఁ జంప నే నిన్ను
జాల్ముండ వైన నృశంస నాయేలు

ధరణీతలమునఁ బాదము వెట్టఁ గొండు
    తావునకుం బోయి తలదాఁచుకొమ్ము
నరదేవులం దీవు నర్తింతు నిన్ను
    నాటుకొని వశించు నలువుమీఱుచును
దురిత మసత్యము దుష్టత్వ మెల్ల
    దోషముల్ కాన నో దుర్బుద్ధి మఱియు. 370

వ. బ్రహ్మావర్తము దయాసత్యశౌచాదిసమస్తధర్మములకు నాలవాలము మఱియు నీదేశమున మునీంద్రులు యజ్ఞరూపుం డగుకృష్ణు నుద్దేశించి యజ్ఞముల్ సేయుచుందురు వారికి సంతసించి భగవంతుఁ డందు వారి కంతరాత్మయై శాసకుండై వర్తించి వారికోరికలం దీర్చుచుండు నట్టిదేశమున నీవు ప్రవేశింప నర్హుండ వనినఁ గలి గడగడ వడంకుచు రాజున కి ట్లనియె. 371

సీ. ఎందుండు మందొ నీ వందందు నుండు నో
    భూప ! నాకుం దావుఁ జూపు మనుఁడు
రా జనుఁ గలిపురుషా ! జంతువులఁ జంపు
    చోట జూదం బాడుచోట మద్య
పానము గావించుస్థానమునందును
    నిరతంబు నుండుము నిర్భయమున
మఱియు ననృతము కామము క్రోధమును వైర
    మును గలచోట్లను బొందు మీవు

తే. అనిన రాజాజ్ఞ తలదాల్చి జనవిభుండు
నుడివినతలంబు లన్నియుఁ గడిమి నొంది
కలిమహారాజు వర్తించుఁ గడిమ మెఱసి
జనులు తత్తత్ప్రదేశముల్ చనఁగ రాదు. 372

— పరీక్షిత్తు వేటకుం బోవుట —

వ. ఇట్లు పరీక్షితుండు కలిని నిగ్రహించి ధర్మదేవతకుఁ దపశ్శౌచదయలను తక్కినమూఁడుపదంబు లొసంగి భూదేవత కానంద మాపాదించి

ధర్మరాజార్పితరాజ్యసింహాసనం బధిష్ఠించి చక్రవర్తియై సర్వజన సమ్మతంబుగా సార్వభౌమలక్ష్మీసంపన్నుండై రాజ్యపాలనంబు గావించుచు నొక్కనాఁడు మృగయావిహారార్థమడవికిం జని నానావిధ మృగవిహంగమవధం బాచరించుచు భగవంతుఁ డగుయదుృ్రేంద్రు యజ్ఞమృగము వెన్నంటిపోవుచందంబునఁ దనచేత వ్రేటువడినయొక్క మహామృగంబువెంట నంటి యొంటి వోయి క్షుత్పిపాసార్తుం డయి పరిశ్రాంతిఁ జెంది తనమనంబున. 373

తే. సుకముగా రాజకీయముల్ చూచుకొనుచు
సతులు సుతులును వేష్టింప సౌఖ్యపడక
వేఁట కే నేల వచ్చితి వెఱ్ఱి నగుచు
నకట వ్యసనంబు లన్నియు నొకటి గాదె. 374

క. సప్తవ్యసనములందుం
బ్రాప్తించిననొక్కఁడేని పండితుఁ డైనం
దృప్తుఁ డయి చెడును వానికి
వ్యాప్తిం బడు నెల్లశ్రమలు పరముం దప్పున్. 375

వ. అని మృగంబు నన్వేషించుచుఁ బెద్దదవ్వు వోయి పోయి యట నొక గోప్రచారంబునఁ బయఃపానంబు సేయులేఁగలనోళ్ళనుండి రాలిన ఫేనం బాహారించుచు మౌనవ్రతుండై యున్నశమీకుం డనుముని వరుం గనియె నప్పు డతండు. 376

—♦ పరీక్షిత్తు శమీకునిపై సర్పశవంబు వైచుట ♦—

సీ. ప్రాణేంద్రియమ్ములు స్వాంతమ్ము బుద్ధియు
వ్యాపారములనుండి వదలఁ జేసి
జాగ్రదాదిక మవస్థాత్రయమునకును
నిరతంబు పరుఁ డయి నియతితోడ
నాత్మానుసంధాన మాచరించుచు బ్రహ్మ
విషయికభావనావివశుఁ డగుచు

నెదిరిఁ ద న్నెఱుఁగక కదలక మెదలక
స్థాణువుమాడ్కి నెసంగుచుండె
ఆ. జడలు బడుగుటొడలి గడువడిఁ గప్పఁగా
నిఱికోలు గట్టి యెండిపోయి
నట్టిమోము గలిగి నట్టియమ్మునిఁ గాంచి
పాండవేయుఁ డిట్లు పలుకఁ దొడఁగె. 378
ఉ. ఏను బరీక్షితుం డనుమహీపతి నిట్టులు వేఁట వచ్చితిన్
మౌనివరేణ్య! దప్పి గొనినాఁడను నల్గడ మెట్టుచుంట నెం
దేని జలాశయం బిచట నేర్పడఁ దోఁప దొకిన్ని నీళ్ళు నా
ప్రాణము లాఁగుపొంటె నిడఁ బ్రార్థన సేయుచునుంటి ని న్నిటుల్.
వ. అని ప్రార్థించియుఁ బ్రత్యుత్తరంబు గానక పిపాసార్దితుండు కావున నొం డెఱుంగక ము న్నెప్పుడు నెట్టితప్పునుం జేసి యెఱుంగని యమ్మహారాజు కర్మపరిపాకంబునం జేసి పరికింపఁ జాల కటఁ జచ్చి పడియున్న పాముం దనవింటికొప్పున నెత్తి వానియఱుతం దగిలించి మరలి కరిపురంబునకుం జనియె నంత నట. 380

— ♦ శృంగి పరీక్షితునిఁ శపించుట ♦ —

ఉ. ♦ఒండొకచోఁ దపించుచు మహోద్ధతి నొప్పెడు నాశమీకసూ
నుం డది యంతయుం గృశునినోటన వించుఁ గలంగి శృంగి నా
నుండినపేరు సార్థముగ నుగ్రుఁడ యై జల మాని తండ్రిపై
నెండువు నేయు నీచు దెగు నేఁడవనాఁటను దక్షకాహిచేన్. 381
చ. ♦అని శపియించి శృంగి సరయం బగుకాల్నడఁ దండ్రిపాలికిం
జని శవ మంసమందుఁ గలజాడ లెఱుంగక నిశ్చలస్థితిం
బొనరుటఁ జూచి సర్పశవముం బెడఁబాపి పరీక్షి దాగమున్
మనమున నెంచుచు న్వనట మానటి కుందుచు నున్న యంతటన్. 382
వ. సమాధి విడం గన్నులు దెఱచి నలుగడం బరికించుతండ్రికి దండపరిణామంబు చేసి పరీక్షితుండు వచ్చి సర్పశవంబు వేయుటయుఁ దా

♦ ఎండువు=ఎండిపోయిన శవములోనగునవి; ♦ ఆగము=అపరాధము.

నతని శపించుటయుఁ దెలియఁ జెప్పిన శమీకుండు కరం బలిగి కొడుకు
దిక్కు మొగంబై. 383

క. సీ ! సీ దోసము చేసితి
భూసురుఁడవు మఱి తపస్విముఖ్యుఁడ విది నీ
భాసురమతి ధర్మం బని
చేసినయదియే ప్రకోపశీలుఁడ వకటా. 384

ఉ. కోపము సత్యముం జెఱచుఁ గోపము తాపముఁ గల్గఁ జేసెడుం
గోపము వైరకారణము కోపము ధర్మమునుం దొలంచెడుం
గోపము సర్వకార్యములకుం బ్రతిరోధకరంబు కోపనే
పాపము కోపి యైన జనవంచితుఁడై నరుఁ డందుఁ గష్టముల్. 385

ఆ. దయయు క్షమయు లేనితపసితపంబును
మత్తుఁ డైనవానివిత్తచయము
ధర్మబాహ్యుఁ డైనధరణీశురాజ్యంబు
నోటికడవలోనినీటిఁ బోలు. 386

వ. అని మఱియును. 387

ఉ. రాజులు ధర్మమార్గమున రాజ్య మొనర్చుటఁ జేసి తాపసుల్
తేజము నొందుచుం దపము తీర్చి పొనర్చుచు నుం డ్రభీతిమై
రాజులు తత్తపోంశగు లరాజక మైనఁ జెడున్ సమస్తమున్
రాజులు రక్షణీయు లపరాధము చేసిన హానికోటికిన్. 388

ఆ. ప్రజకు రాజు తండ్రి ప్రజరాజునకు బిడ్డ
పోష్యపోషకాదిముఖ్యధర్మ
ములను బిడ్డ తండ్రివలన నె గ్గయినను
సైఁచి యుంట శాస్త్రసరణి గాదె. 389

సీ. రాజు లేకున్నచోఁ బ్రజలు చోరప్రాయు
లై యొండొరులధనం బపహరింత్రు
వారిని వీరును వీరిని వారునుం
జంపుకొందురు వీడి సాధ్వసంబు

స్త్రీల నపహరింతు రాల బలాత్కార
ముగఁ దోచుకొనిపోదు రగడు విడిచి
వర్ణాశ్రమాచార వైదికకర్మముల్
ధర్మముల్ నశియించు ధరణియందుఁ

తే. కుక్కలును గోఁతులుం బోలె నక్క టకట
మానవులజాతి సంకీర్ణ మార్గ మొందు
రాజు లేకున్న రాష్ట్రము ప్రాణ హీన
మైన దేహమువంటిదై జాను దఱుగు. 390

చ. ధర పతి ధర్మము న్నిలుపు ధర్మమునం దగు నధ్వరంబు ల
ధ్వరముల దేవకోటికి ముదం బగు మోదితు లైన దేవతల్
పరఁగ సువృష్టి నిచ్చెదరు వర్షమునం బ్రభవించు నోషధు
ల్కరమగు నోషధిప్రతతులం బ్రజ వర్ధిలుఁ నాతఁ డల్పుఁడే 391

తే. ధర్మపరిపాలనము సేయుధరణిపతికి
దురిత మనునది యింతయుఁ దొడరఁ బోదు
పదుగురకు శ్రోత్రియుల కెనవచ్చు నృపతి
యని మనువు వల్కె నెఱుఁగవే తనయ నీవు. 392

క. *శ్రుతిహితధర్మవ్రతుఁ డతు
లితవిక్రమకీర్తి సల్లలితమూర్తి పరీ
క్షితుఁ డతని క్షితిం దగఁ దప
మతికినమన మతఁడు చితుక నలుగం దగునే. 393

వ. సకలధర్మపరాయణుం డగున ప్పాండవేయుండు క్షుత్పిపాసాతురుం డయి
నావ్రతం బెఱుంగక చేసినదానికి నీ వజ్ఞానంబునం జేసి పసివాఁడుం
బోలెఁ గసిమసంగి కోపంబున శాపంబు పెట్టి పాపంబు మూఁటకట్టి
కొంటి విది నాకె కా దఖిలలోకంబుల కప్రియంబు. 394

తే. వయసు మీఱినవాఁడేని ప్రాజ్ఞుఁడేని
కొడుకు గుణవంతుఁడై కీర్తి గొనెడునట్లు

* చితుకు=నలుగు; చెడిపోవు;

తలఁచి బోధించుచుండును దండ్రి యెపుడు
గాన నే నిప్డు చెప్పెదుదాని వినుము. 395

క. మరలింపఁ గలిగితేనియు
మరలింపుము శాప మనఁడు మది బెదరుచు నే
మరలింప నోప నాపలు
కరయంగ మృషాత్వ మంద దనె శృంగి వడిన్. 396

వ. అనిన శమీకుండు మిగుల వగలం బొగులుచుఁ జేయునది యెద్దియును లేక శృంగిశాపంబున నగుతక్షకదంశమునకు మణిమంత్రతంత్రాదు లమరించుకొమ్మని తనప్రియశిష్యుం డగుగౌరముఖునివలనఁ బరీక్షి తునకుఁ జెప్పిపుచ్చె నట నంత నౌత్తరేయుండును. 297

—♦ రాజు విప్రశాపము విని పశ్చాత్తాపతప్తుం డగుట ♦—

క. తన్నెఱుఁగ కెదిరి నెఱుఁగక
యున్నట్టుల యుండి తపము నొనరుచుమునులం
గన్నుం గానక వదరుచు
బన్నంబులు గూర్చుజనులు బడలంబడరే. 398

సీ. ♦కడుపులోపలిచల్ల గదలకుండఁగ నింట
నిట్లుండ కడవి కే లేగినాఁడ
నేగి యంతన పోవ కిట్టట్టు మెట్టుచు
మెకములగమి నేల మెసవినాఁడ
మెసవి యంతన పోక వెసఁ బాఱుపందితోఁ
గఱకరినై యేల పఱచినాఁడఁ
బఱచి యంతనపోక పాపపీనుఁగు నెత్తి
తపసికుత్తుక నేల తాపినాఁడఁ

తే. దాపితిని గాన దయ లేక తాపసుండు
పాముచేఁ జావు మని తిట్టె బాము వెట్టె

♦ మెసవినాఁడ=చంపినాఁడ; అనిలక్షణచేసీయర్థము సిద్ధమగుచున్నది;

నకట చెడుపోకలం బోయి యాగడముగఁ
గ్రొవ్వి యుండినవారికి గొడవ లవదె. 399

వ. అని విచారించుచు మునిశాపప్రకారంబున సప్తమదినంబునఁ దక్షకునిచేఁ దనకుఁ జావు నిశ్చయించుకొని విషయాసక్తుం డగుతనకావిషానలంబు విరక్తికిం గారణ మగుచున్నందుల కెంతయు సంతసించుచు రాజ్యంబు విడిచి ముకుందపాదభజనంబు ముక్తిదాయకం బని తలంచి త్రిలోకపావన మగుగంగాతీరంబునకుం బోయి యట ననశనవ్రతంబు పూని దేహాద్యభిమానంబు దెగ త్రెంపులు గావించుకొని మౌనియై ముకుంద పాదారవిందధ్యానంబు గావించుచుండె నాసమయంబునఁ దీర్ఘయాత్రాచణశీలురై పోవువా రగుచు నత్రియు వసిష్ఠుండును చ్యవనుండును శరద్వంతుండు నరిష్టనేమియు భృగువు నంగిరసుండును బరాశరుండును విశ్వామిత్రుండును బరశురాముండును నుతథ్యుండును నింద్రప్రమదుండును నిధ్మవాహుండును మేధాతిథియు దేవలుండును నార్ష్టిషేణుండును భారద్వాజుండును గౌతముండును బిప్పలాదుండును మైత్రేయుండును నౌర్వుండును గవషుండును నగస్త్యుండును వ్యాసుండును నారదుండును లోనగువారు మహర్షులు రాజర్షి యగుపరీక్షిత్తు నీక్షించి పో వచ్చి రప్పు డమ్మహారాజు వారల నందఱ నాహ్వానించి యెదురేగి తోడుకొని వచ్చి షోడశోపచారాపచితులం బూజించి సేవించుచుఁ దన కాశృంగిశాపంబు ముక్తికారణంబు కా నుంట కానందించుచు మీరు నా కట్టిజ్ఞానోపదేశంబు గావించి నన్నుఁ గడ తేర్పుం డని చేతులు గట్టుకొని ప్రార్థించుచు నుదఙ్ముఖుండై ప్రాచీనాగ్రంబు లగుదర్భలపైఁ గూరుచుండె నయ్యెడ సమాగతు లగునా మును లెల్లను నోయిరాజేంద్రా! నీవు పరమభక్తుండవు నీ వుత్తమ లోకము నొందువఱకు మే మిట నుండి నీమహావైభవం బారయు చుండు మని పలుకుచున్న సమయంబున. 400

—♦ శుకమహర్షి పరీక్షితునికడకు వచ్చుట ♦—

సీ. పదియాఱ్ శరత్తుల ప్రాయంబు గలవాఁడు
గోఁచి వెట్టక యుండుగోనబుకాఁడు
పదియాఱు వన్నె మేల్పసిడిదేహము వాఁడు
కఱినెఱులఁ మేనుఁ గప్పువాఁడు
విడక బ్రహ్మంబును వీక్షించు నెఱివాఁడు
వెడఁగు నాఁ దోఁచెడువింతవాఁడు
సర్వభూతములందు సమవర్తి యగువాఁడు
కర్మ మేదియు లేనికడిమివాఁడు
తే. ఆలపాల్పిండునంతసే పాఁగువాఁడు
గేలిసేయుచు బాలకుల్ క్రేవలఁ జను
దేరఁ దిరుగాడువాఁడు నెందేని చనుచు
వెకలి నా వచ్చె నచటికి శుకమహర్షి. 401

వ. అట్లు వచ్చినవ్యాసపుత్రుం డగుశుకయోగిం గాంచి యెల్లమునుల తోడఁ బరీక్షితుం డెదురువోయి సాష్టాంగనమస్కారంబు గావించి తోడితెచ్చి చిత్రాసనంబునం గూరుచుండం బెట్టి యర్ఘ్యపాద్యాది విధులం జేసి చేసినపూజలం బరిగ్రహించి చుక్కలతో నిండియున్న నింగి వెలుంగుచంద్రుండు నాఁ బరిశాంతుండై ప్రకాశించుబ్రహ్మ రాతుం గని విష్ణురాతుండు లేచి చేతులు జోడించుకొని మృదు మధురంబు గా నిట్లనియె. 402

ఉ. మీరుమహానుభావులకు మీదగుదర్శనభాగ్య మబ్బుటఁ
భూరితరాఘు లన్నియును బోకడఁ బెట్టఁగ నయ్యె నోమహా
పూరుషవర్య నాదునఘముల్ కడతేఱెఁ గృతార్థజన్ముఁడఁ
భారతవంశ మిప్పటికి పావన మయ్యె మునీంద్రచంద్రమా. 403

క. మాతాతలపైఁ గలిగిన
ప్రీతిఁ గృష్ణుండు నన్ను వీక్షించెడు వా

బ్రహ్మరాతుఁడు=శుకమహర్షి; విష్ణురాతుఁడు=పరీక్షిన్మహారాజు;

డై తాపసోత్తమా యిటు
నాతావున కనిచె నిన్ను నాగొంద దీర్పన్. 404

క. లేకున్న భవద్దర్శన
మీకష్టున కగుట కల్ల ఋషికులతిలకా
లోకమున దేవుఁ డనఁగా
నీకంటె నొకండు లేడు నిక్కము తెలియన్. 405

ఉ. కాయము వాయ నుంటి మునికౌశిక నేఁ డిఁక నేఁడునాళ్ళలో
నీయెడ నేమి చేసిన మునీడ్వినుతంబును దివ్యమంగళం
బై యలరారువైష్ణవమహాపద మందెదనో వచించి నా
కాయతిలోకగమ్య మగునర్థము నానతియిచ్చి ప్రోవవే. 406

ఆ. ముక్తి తెఱవు నాకు మునినాథ యెఱిఁగించి
భక్తుఁ డైననాదు బన్నములను
బాపు మనుచు నిన్నుఁ బ్రార్థించుచుంటి నా
శుకమహర్షి కరుణఁ జూచె నతని. 407

వ. అనిన శౌనకాదు లవ్వలివృత్తాంతంబు సెప్పు మని సూతు నడుగుట
యును. 408

హంసగతి. సూర్యనారాయణక్ష్మోణిభృద్వంశజుం
డార్యసంస్తుత్యుఁడై యత్యపూర్వంబు లై
శ్వర్యదంబుల్ కృతుల్ సర్వదా సల్పుచున్
శౌర్యసంపద్గతిన్ ఖ్యాస్థలిం బొల్చెడున్ 409

గద్యము

ఇది శ్రీమహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందుఁ
బ్రథమ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

శ్రీ కృష్ణ భాగవతము

—:0:—

ద్వితీయ స్కంధము

—:0:—

క. శ్రీమత్తంగెడునామ
గ్రామంబున సిరులెసంగఁ గాంతామణితోఁ
బ్రేముడిఁ గాపురముండెడు
శ్రీమంతుఁడు సాగివంశశేఖరుఁ డెసఁగన్. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె న ట్లడిగిన పరీక్షిన్న
రేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 2

—♦ శుకుఁడు పరీక్షిత్తునకు ముక్తిమార్గం బెఱింగించుట ♦—

తే. ఈవు నన్నడిగినప్రశ్న మెల్లలోక
హితకరమ్మును శ్రేష్ఠము సతతతాత్త్వి
కాతివేద్యము హృద్య మనంతధర్మ
సంభృతం బని చెప్పుదు జనవరేణ్య. 3

సీ. ఐహికఫలకాములై యాత్మతత్త్వము
తెలియనిగేస్తులు తెలిసికొనఁగఁ
దగినయంశము లెన్నొ తనరారుచుండును
మానవు లాత్మవిజ్ఞానశూన్యు
లగుచు వానినెఱుంగ నాశింపక పవళ్ళు
రేలు వ్యర్థముగఁ బోనాలకింత్రు
పగలు దారాదుల పరిపోషణార్థము
రాత్రి నిద్రారతుల్ రాజ్యమేల
తే. వేరికో గాక గృహులైనవారి కట్టి
బుద్ధి పుట్ట దాత్మజ్ఞానమునకు మొనయ

దనిశమున్ దారపుత్రాదులందు దేహ
మందు నాసక్తులై యుందు రవనినాథ. 4

మ. తనచుట్టంబులు లోనివారు తనువుల్ ద్రవ్యంబులుం బాసి పోఁ
గనులారం గనుచుండియున్ వెడఁగులై కాంతాకుమారాదికం
బును నిత్యం బని నమ్మి నెమ్మనమునం బోకంత విజ్ఞానమున్
గానఁబో నట్టిరయై చరించెదరు తాఁగోఁ నెల్లబంధంబులన్. 5

మ. తగులం బంది సమస్తభూతముల కంతర్యామియై యుండునా
భగవంతుండు జగన్నియామకుఁడు సర్వంబుం దదాధేయమై
తగు నాతండు సమాశ్రయించినజనుం దా నెంచి తత్పాపముల్
దెగిపోఁ జేయు నటంచుఁ గొల్వఁ దగు నాదివ్యప్రభావాఢ్యునిన్. 6

ఉత్సాహ. పరమపదముఁ గోరునట్టిభక్తు లమ్మహాత్మునిన్
నిరతమున్ స్మరించుకొంచు నిర్మలంబు లైనత
చ్చరితలన్ మనంబు నిల్పి సాంఖ్యముఖ్యధర్మత
త్పరతఁ జేయుచున్ భజింప వలయు మర్త్యుఁ డెప్పుడున్. 7

ఆ. మరణకాలమందు మఱియు నారాయణ
స్మరణ మాచరించుజనునిజన్మ
మరయ సార్థకంబ యని సనకాదిసం
యములు పలుకుచుందు రవనినాథ. 8

ఆ. కామ్యకర్మములకుఁ గాక విజ్ఞాను లా
వారు శ్రితదురితము వాయఁ జేయు
హరి సమాశ్రయించి యాతనిగుణముల
ననువదించుచుందు రంతరాత్మ. 9

మ. భగవన్నామనుతిప్రధాన మగుచున్ భాసిల్లుచున్ భక్తపా
పగతుల్ వాపఁగ నైనభాగవత మన్ భాస్వన్మహాగ్రంథ మొం
డగు దానిన్ వచియించి నాజనకుఁ డావ్యాసర్షి నాకు న్నయం
బగుఁ బొమ్మం చుపదేశమున్ సలిపెఁ బ్రేమాయత్తచిత్తంబునన్. 10

ఆ. నేను బ్రహ్మమందు లీనచిత్తుఁడ నైన
భాగవతము వానిపరమలీల
లనువదించునట్టి దగుట నాకర్షింపఁ
బడితిఁ దత్త్వభావపటిమవలన. 11

శా. ఆయాఖ్యానము నీకుఁ జెప్పెదను భక్తాగ్రేసరుం డైననీ
వాయాసంశయముల్ సమస్తమును బో నాలింపు మీలో నుపా
దేయం బయ్యది యొక్కఁడే వినిన నీదిష్టంబు వర్ణింపనై
నీయం దీశ్వరసత్కటాక్ష మది సంధింపంగనౌ పార్థివా. 12

— ఖట్వాంగునిముక్తిప్రకారము —

సీ. భాగవతము నేను బలికెద శ్రద్ధధా
నుఁడ వయి వినిన విష్ణునికటాక్ష
మునకుఁ బాత్రమ వయి పొనరుదు తత్సేవ
సలిపినకతన మోక్షము లభించు
ఫల మపేక్షింపక సలిపినకర్మయో
గమునందు హరికీర్త నమువరంబు
స్వల్పకాలమున నా కదియెట్టు లనకు మ
చంచలమతి వైన క్షణమె చాలు
తే. మున్ను ఖట్వాంగుఁ డనునొక్కపురుషవరుఁడు
ద్వీపములు నేడు పాలించి దేవకోటి
కసురతతినుండి కలిగెడునలజడులను
బాపుచును వారికరుణకుఁ బాత్ర మయ్యె. 13

వ. అతం డొక్కనాఁడు దేవలోకంబునకుం బోయి దేవారులం దోలుచుఁ
దన కొకమహూర్తకాలంబున మరణము సంభవించు నని తెలిసికొని
దేవయానంబునఁ దనపురంబునకు వచ్చి తనసర్వస్వమ్మును విడిచి
నిర్భరవైరాగ్యంబున భగవంతునియందు లగ్నంబైనచిత్తంబుఁ గలిగి

నామస్మరణంబు చేయుచు రెండుగడియలకాలంబున హరిని భజించి మోక్షంబు నొందె నాకర్ణింపుము. 14

ఉ. ఏడుదినంబు లీవు మృతియించుట కంతర ముండె నేటికిన్
జేడ సమస్తముం విడిచి నీవు చలాచల మైనచిత్తముం
గూడఁగఁ జేసికొంచు హరిఁ గొల్వుము దాన లభించు మోక్ష మే
వాఁడును బొంద లేని హరిభావము నొందుదు వంతలోఁపునం. 15

వ. మఱియు నాకర్ణింపుము పరంబు గోరుపురుషుండు సర్వసంగపరిత్యాగంబు గావించి దారపుత్రాదులందును గేహదేహాదులందుం గలమమకారంబు పాఱఁ ద్రోలి వైరాగ్యవంతుండై జితేంద్రియుండై సన్యసించి విజనస్థలంబున దర్భాసనాసీనుండై ♦ యకారోకారమకారసంయోగంబున నైనయేకాక్షరంబు మనంబున నభ్యసించుచు రేచకపూరకకుంభకము లను ప్రాణాయామంబున నుచ్ఛ్వాసనిశ్వాసరూపం బయిన వాయువుతో మనం బరికట్టి హరిధ్యానంబు గావింప నలయు నని మఱియు. 16

సీ. రథము శరీరము రథికుఁడు జీవాత్మ
సారథి బుద్ధియై సౌరుమీఱు
మనసు కళ్ళెలకళ్లె మన నయి బలిసిన
యింద్రియాశ్వంబుల నిఱియఁ బట్టి
విషయవీథులవెంట వెడలంగ నీయక
నియమమార్గమునందు నిలుప వలయు
వెనుకటి బాములు విడక చేసినపుణ్య
పాపాదికర్మ సంబంధమునను

తే. సంభ్రమించెడుమది సదసద్వివేక
మున నిపుణ మైనబుద్ధితోఁ బొనరఁ జేసి

♦ ఆకారోకారమకారసంయోగాక్షరము=ఓంకారము;

బాహ్యవిషయము లన్నియుఁ బాఱఁద్రోలి
వాసుదేవుని ధ్యానించి వడయు ముక్తి. 17

తే. ధారణాయోగమున విష్ణుఁ దలఁప వలయు
ధారణ రజస్తమాదులఁ జేరరాగ
మును నశింపఁగఁ జేయు నందునను భక్తి
యోగ మది ప్రాప్త మగు నన యోగి నరసి. 18

వ. పరీక్షిన్నరేంద్రుం డి ట్లనియె. 19

క. ధారణ యనఁగా నెట్టిది
ధారణ యేగతిని నిల్చు ధారణ యెట్లి
పూరుషునిమనోమలినము
దీరిచి వైచెడినిఁ జెప్పవే మునినాథా. 20

వ. అనిన శుకుం డి ట్లనియె. 21

సీ. పురుషుఁ డాసనయోగమున నేర్పు గలఁ డయి
రేచకాదుల గాలిఁ బ్రిదుల నీక
సంగములను వీడి పొంగెడుపదునొండు
నింద్రియంబుల కైనయే పడంచి
భగవద్విరాడ్రూప పతితబుద్ధిం జేసి
నెమ్మదిచలనంబు నిలుప వలయు
నటు చేసి జగ మెల్ల నావిరాడ్రూపము
గాఁ గను టే భక్తి యోగఫలము

తే. భూతములును నహంకారమును మహత్తు
న నెదునే డావరణముల నావిరాట్టు
విశ్వరూపము ధ్యానించువిధ మెఱుఁగుటే
ధారణాయోగఫల మని తలఁప వలయు. 22

శుకుండు విరాట్స్వరూపముం దెలుపుట :—

వ. మఱియు నవ్విరాట్టునకుఁ బాదమూలంబు పాతాళంబు పార్ష్ణిప్రపదంబులు రసాతలంబు గుల్ఫంబులు మహాతలంబు జంఘలు తలాతలంబు జానువులు సుతలం బూరుద్వయంబు వితలాతలంబులు జఘనంబు మహాతలంబు నాభి నభస్స్థలం బురస్సు గ్రహాదులతోడి నక్షత్రలోకంబు కంఠంబు మహర్లోకంబు ముఖంబు జడలోకంబు లలాటంబు తపోలోకంబు శిరస్సు సత్యలోకంబు బాహువు లింద్రాదిదేవతలు కర్ణంబులు దిక్కులు శ్రవణేంద్రియము శబ్దంబు నాసాపుటంబులు నాసత్యులు ఘ్రాణేంద్రియము గంధము వదనం బగ్ని నయనంబులు ద్యులోకంబు చక్షురింద్రియములు సూర్యుండు కనుఱెప్పలు రాత్రిం దివంబులు భ్రూవిక్షేపము బ్రహ్మపదము తాలువులు రసాభిమాని యగువరుణుండు రసంబు జిహ్వేంద్రియంబు సంభాషణంబులు వేదంబులు దంష్ట్రలు యముండు దంతంబులు దారపుత్రాదిస్నేహకళలు మందహాసము లోకముల మోహింపఁ జేయుమాయ కటాక్షవీక్షణంబె సమస్తప్రపంచసృష్టి పెదవులు వ్రీడాలోభంబులు స్తనయుగ్మంబు ధర్మంబు వె న్నధర్మమార్గంబు గుహ్యంబు ప్రజాపతి ముష్కంబులు మిత్రావరుణులు జఠరము సముద్రము శల్యసమూహములు గిరులు నాడీసమూహములు నదులు రోమములు వృక్షములు నిశ్వాసము వాయువు గమనముకాలము సంచారంబు ప్రాణికర్మజాలంబు కేశంబులు మేఘంబులు వస్త్రంబులు సంధ్యలు మనస్సు చంద్రుండు హృదయం బవ్యక్తం బహంకారంబు రుద్రుండు విజ్ఞానవ్యవసాయశక్తులు మహత్తత్త్వంబు నఖంబులు గజాశ్వోష్ట్రాదులు శ్రోణితలంబు పశుమృగాదులు శిల్పినైపుణ్యము నానావిధపక్షిజాలము బుద్ధి మంత్రము వాసస్థలము మానవులు స్వరములు గంధర్వాదిదేవతలు స్మృతి ప్రహ్లాదము వేద్యము దైత్యదానవానీకంబు మఱియు నమ్మహామహునకు బ్రాహ్మణులు ముఖంబు లనియు క్షత్రియులు భుజంబు

లనియు వైశ్యు లూరువు లనియు శూద్రులు పాదము లనియు వసు
రుద్రాదిదేవతాభిధానములు నామము లనియు ద్రవ్యములు హవి
ర్భాగము లనియు యజ్ఞప్రయోగము లాతనిక్రియ లనియు మహా
త్ములు వచింతురు. అట్టిసర్వమయుం డగుసర్వేశ్వరుని విగ్రహంబు
ముముక్షువులు మంత్రమనస్సంధానంబు సేయుచుందు రని. 23

సీ. కలలోన జీవాత్మ కలిగినపుణ్యపా
పములమూలమున నీశ్వరుని వలన
ధరణీపతిత్వము తలకొట్లు లోనగు
సుఖదుఃఖము లొసంగుచున్ జలించు
న ట్లీశ్వరుఁడు చేతనాచేతనాకృతు
లంది యన్నిట నుండునట్టిఁ డగుచు
తద్దోషములను బొందక యవికృతి మహా
నందస్వరూపుఁడై పొందుపడును
తే. అట్టిభగవంతు సేవింప నగు నతండు
కానివస్తు వొకండును గలుగఁ బోద
యని తెలిసి జ్ఞాని ముక్తుఁ డౌ నట్లు కాని
నాఁడు సంసారమునఁ బడి నవయు చుండు. 24

వ. అని చెప్పి శుకుండు వెండియును. 25

మ. మును నేఁ జెప్పినధారణాబలమునన్ బోలించి పద్మోద్భవుం
డనుతర్షంబున నష్టసృష్టివిషయం బౌజ్ఞానమున్ వెండియున్
గొని కల్పాంతము మున్నసంగెడుగతిన్ గోర్కిం బిసాళించుచున్
బొనరింపం గలఁ డయ్యె సర్గము యథాపూర్వంబుగా వింటివే. 26

శా. వేదోక్తంబులు కర్మమార్గములు గావింపఁగ నౌ నంచు మూ
ఢాదాయంబుగఁ గొంద ఱజ్ఞు లయి కర్మారంభముం జేసి స్వ
ర్గాదుల్ పొంది ఫలాంతమందు మఱియున్ బ్రారబ్ధకర్మంబునన్
ఖేదం బేర్పడ జన్మ మెత్తెదరు వెండిం జావ నై పుట్ట నై. 27

—♦ యోగులు కావింపఁదగు కార్యములు ♦—

సీ. మాతాపితలకంటె మఱి వేయిమడుఁగు ల
   త్యధికములై శ్రుతు లలరు చుండు
నవి సుమార్గము చెప్పునవి యగుఁ గాని దు
   ర్మార్గము బోధించుమాడ్కి కగునె
యందువే నయ్యవి యట్లు చెప్పవు గుణ
   త్రయకర్మములఁ జెప్పఁ దవిలి యందు
సత్వముల్ కానిరజస్తమోగుణకర్మ
   ములు పౌనర్భదువారిఁ దెలిపి నాఁడు

తే. మూఢు లయి స్వర్గఫలములఁ బొంద నెంచి
సత్వములపొంతఁ బోవక సలిపి కర్మ
ములు జనుల్ మోక్షలక్ష్మినిఁ బొంద లేక
చచ్చి పుట్టుచు నుందు రజస్ర మిందు. 28

ఉ. సత్వగుణప్రధాను లగుసంయమిచంద్రము లుత్తమోత్తముల్
తాత్వికులై రజస్తమములం బడఁ బోవక మోక్షహేతు వౌ
సాత్వికకర్మముల్ దవిలి సల్పుచు నల్పసుఖానుభూతి కి
ష్టత్వము చూపుచున్ బ్రదుక స్వాంతము సేయరు కొంతయేనియున్.

తే. ఫల మపేక్షింప కున్నచోఁ గలిగినట్టి
తనువు నేరీతిఁ బోషించుకొనఁగ వలయు
బ్రదుకు కేరీతి యని పల్కవత్తు వేని
విను మవహితుఁడవై దానివిధ మదెల్ల. 30

సీ. కొండలలో గుహల్ కో టుండ నివసింప
   మిద్దెలమేడలసుద్ది యేల!
పచ్చికపటచేఁ బరఁగునేలలు గల్గ
   మృదులతల్పములకు వెదక నేల!

దెసలు నారలు తోళ్ళు కొసరకుండం గట్టు
కోన దుకూలములకుఁ గోర్కె లేల!
భగవంతుఁ డిచ్చినవగుకరాంజలు లుండఁ
బైడికంచములకుఁ బాట్లవేల!
తే. ఆఁకు లలములు తిండికి నడవు లిడవె
నీళ్ళ నిడి దప్పి దీర్పఁగ నేళ్లు లేవె
నారు పోసినదేవుఁడు నీరు పోయఁ
డే మదాంధుల సేవింప నేల మునికి. 31

మ. ఖలులం గొల్వఁక సర్వరక్షకునిఁ గాంక్షం గొల్చినం గర్మబం
ధలతల్ త్రెస్సి సుఖస్వరూపుఁ డగు శ్రీనారాయణుం జేరి యె
వ్వలనన్ బాయనిసౌఖ్యసంపదలలో వర్తించు చానంద తుం
దిలచిత్తుం డయి యోగి యోగపరతన్ దీపించు నెల్లప్పుడున్. 32

సీ. భగవంతునిం గాక పరునిఁ జింతించెడు
వాఁడు పశువువంటివాఁడు సతము
వైతరణీనది వంటిసంసృతిఁ బడి
యాధ్యాత్మికము లగునఖిలబాధ
లనుభవించెడు జ్ఞాని యగువాఁడు తనహృద
యాకాశమున జగదాకృతి యగు
భగవంతుఁ డగుహరి భజియించి నుతియించు
చాపదల్ పొందఁ బోఁ డాపురుషుఁడు
తే. శంఖచక్రగదాపద్మ చాపములను
దాల్చు శాంతరసము ముఖతామరసము
నందుఁ దాండవించుచునుండు నతనికనులు
జలజములఁ బోలి యుండు విశాలము లయి. 33

పంచ. కదంబపుష్పకేసరప్రకాశమానవస్త్రముం
ముదంబుమై ధరించుస్వర్ణ భూషణాంచితంబు లై

గదాదులం ధరించి దోర్యుగద్వయం బెసంగు శీ
ర్ష దేశమందు స్వర్ణరత్నసత్కిరీట మొప్పెడున్. 34

తరు. అతనికర్ణముల స్వర్ణాంచితకుండ
లాన్వితము లతనియంఘ్రిలు పరాని
శతమన్యుహృత్పద్మసదలంకృతములు
శంఖ మాతనికంఠసఖ మయియుండు
నతనివక్షము కౌస్తుభానూనభూష
ణాతిభూషిత మతం డఖిలప్రపంచ
మతులితశక్తిమై నరసి రక్షించు
నతని దర్శించిన నగు ముక్తి యతికి. 35

తే. అతని నిర్భయదేశమునందు సుఖము
గా నిలిచి యింద్రియంబులు గట్టి ప్రాణ
వాయుబంధన మొనరించి యచలచిత్తుఁ
డగుచు ధ్యానించి మోక్షమునందు యోగి. 36

చ. ఘనుఁ డగుయోగివర్యుఁ డొగిఁ గల్గినరాగముఖాతిదోషముల్
మనమున నుండి త్రోలి యనుమానము లేనిమనీష నీశ్వరున్
గొనకొని సంస్మరించుచును గొంతటిలోపలఁ గ్రాఁగిలించుచున్
ముని యయి యుండి తద్భజనముం బొనరించిన ముక్తుఁ డయ్యెడిన్.

వ. యోగి యగువాఁడు దేహావసానసమయంబున నఖిల విూశ్వరమయుం
బని యెఱింగి యెల్లవాసనలఁ బరిత్యజించి భగదుపాసనాపరుండై
యుండ వలయు మఱియు. 38

— యోగానుసంధానక్రమము —

సీ. తనపాదమూలమునను గుదస్థానమూ
ఆధార చక్రము నదిమి పట్టి
ప్రాణవాయువు నాభి నగుమణిపూరక
చక్రమునుం బొంద సలిపి యచటి

నుండి హృదయమందు నుండునవాహత
చక్రముఁ జేర్చి యాచక్ర- నుండి
దాని నుదానముతో నంట నలిపి వి
శుద్ధచక్రమునను జొరగఁ జేసి
తే. దాని నటమండి మెల్లగాఁ దాలుమూల
మున నిలువఁ జేసి యటనుండి భ్రూయుగమ్ము
నడుమ నుండునాజ్ఞాచక్రనాళమందుఁ
గొలిపి కనులు ముక్కులు మూసికొనఁగ వలయు. 39

శా. విజ్ఞానంబున బ్రహ్మతేజమును లో వీక్షించు చుండంగ న
య్యాజ్ఞాచక్రమునుండి వాయువు ముహూర్తాఖ్యాక కాలంబునన్
బ్రజ్ఞానేశ్వరుఁ జేరుకో నగుచు మూర్ధం బంత భేదించి స్థూ
లాజ్ఞానావృతదేహము న్విడుచు దివ్యజ్యోతిరూపంబునన్. 40

వ. మఱియు నాకర్ణింపు మాప్రాణవాయువుల ప్రయాణంబునకు రెండు గతులు కల వం దొకటి ధూమ్రమాదిగతి యనియు రెండవది యర్చి రాదిగతి యనియు నిందు ముముక్షువుల కర్చిరాదిగతి ముఖ్యంబు. అబ్రహ్మాత్ము లగువారు జీవులు స్వతంత్రు లనుబుద్ధితో బ్రహ్మాదుల సేవించువారై ధూమ్రమాతిగతి నవలంబించి యణిమాదు లగునైశ్వ ర్యంబులతోఁ దులదూఁగుచుందురు. సిద్ధుల కాస్థానం బగుచతుర్ముఖ లోకంబున కరుగఁ దలంచినవారు మరణించునప్పుడు మనస్సు నింద్రి యంబులం గూడుకొని పోయెద రట్టియోగులు జనలోకాదులందు వాయుతుల్యవేగముఁ గలిగి ప్రవర్తింతురు. యమనియమాదులను సమాధి నొందువారికి బ్రహ్మాండాంతర్గతంబు లగులోకంబుల యథేష్ట విహారం బగు దీనంజేసి కర్మికంటె యోగి యధికుం డనియు వాని కంటె భగవదుపాసకుఁ డధికుం డనియు వాఁడు చతుర్దశభువనాత్మ కాండకోశమున కుపరిభాగంబునందును జరింపం గలఁడు గావున నర్చిరాదియోగ ముత్తమం బౌముముక్షువు దాని నవలంబించి గమించు క్రమంబునుం జెప్పెద నాకర్ణింపుము. 41

—◆ అర్చిరాదిగతిక్రమము ◆—

సీ. హృదయకమలమందు నెసఁగెడుపరమాత్మ
సదనుగ్రహమునకు సదన మగుచు
నలముముక్షువుచేత వెలయింపఁ బడు బ్రహ్మ
మును జేరుటకు మార్గభూత మగుచు
నడచుసుషుమ్నాఖ్యనాడి ముఖద్వార
మునసుండి వెడలి నెత్తి నగుపుఱ్ఱె
నవల నౌనాకాశమం దయి పోయి య
ర్చిశ్శబ్దవాచ్యునిఁ జేరు నగ్ని

తే. అచ్చటం బుణ్యపాపకర్మాళినాశ
నమ్ము పొనరించుకొనున ట్లొనర్చుకొనుట
కలుగ నేరదు ధూమాదిగతినిఁ బొందు
వారల కటంచుఁ దెలియంగ వలయు ననఘ. 42

ఆ. ఆతఁ డగ్నినుండి యలశింశుమారచ
క్రమునఁ జేరు నద్ది గ్రహభములకు
నాశ్రయంబు విష్ణునాస్థానభూత మ
జాదివందనీయ మమల చరిత. 43

వ. ముముక్షు వాశింశుమారము నతిక్రమించి పుణ్యపాపవిహీనంబై సూక్ష్మతరం బయినలింగదేహమున నసహాయుండై సంచరించుచుఁ గల్పాంతంబువఱకు నాయుర్దాయంబు గలిగి యవ్వల దేవతావిహార రమణీయం బగుజనలోకమును బొంది పిమ్మట నవాంతరప్రళయంబున ననంతవిషాగ్నులం జేసి దహ్యమానం బగు నని యెఱింగి యటనుండి యోగీంద్రులదేవయానంబులఁ దేజరిల్లుచు రెండుపరార్థంబు లుండి బ్రహ్మలోకంబునకుం బోవు నదియును. 44

ద్విపదము. అలబ్రహ్మలోకము నాకాదిలోక
ములకంటె నధికమై పొలుచుకాలంబు

గలదగు నందు దుఃఖము మనోభ్రాంతి
యలవడఁ బోదు శీతాతపవర్ష
ములబాధ లెప్పుడు పుట్టవు గాని
సలలితం బగుప్రపంచమునకన్న భిన్న
ము లగులక్షణములఁ బొలిచెడుకర్మ
ములఁ బట్టి సంసారమున దుఃఖములను
గలిగెడునో యని కడుభీతిఁ గుడువ
వలసినవాఁ డయి వర్తించు నందు. 45

వ. మఱియు నాచతుర్ముఖలోకంబున నిర్వేదము నొందుచు నటనుండి పరమపదంబునకుఁ బోవ నెంచినవాఁ డందుఁ బృథివ్యప్తేజోవాయ్వాకాశాహంకారమహత్తత్త్వము లను నేడావరణంబులు గలవు. వాని నతిక్రమింపవలయుం గాన మున్ను పృథివ్యావరణంబు నొంది తత్స్వరూపోపలక్షితుండై పోయి జలావరణంబున జలంబై యవల నావరణాగ్నిం బొంది క్లేదతాపాదులు లేమి సంభ్రమింప కగ్నియై కదలి వాయువులం గలసి మెలసి శబ్దగుణకం బగునాకాశంబు నొందు నింక ముముక్షువు తన సూక్ష్మరూపేంద్రియములచే భూతగుణంబులం గ్రహించువిధంబు చెప్పెద నాకర్ణింపుము. 46

సీ. తనఘ్రాణేంద్రియమునఁ బృథివీగంధ
మును రసనఁ జలమ్ముల రసమ్ము
చక్షురింద్రియమున జ్వలనుని రూపమ్ము
త్వక్కుచే గాలిలో స్పర్శగుణము
శ్రవణేంద్రియమ్మున దివిఁ గలశబ్దమ్ము
నంతఃకరణముచే నాశయంబు
నొగి గ్రహించుచుఁ బోయి యోగి భూతగుణేంద్రి
యములకుఁ గారణ మైనయట్టి
తే. దగునహంకార మనియెడునావరణము
తగులముం గొని పదపడి తదుపలబ్ధ

మగుమహత్త్వమును బొంది యవల నతఁడు
త్రిగుణవిరహిత మగుప్రకృతిని రహించు. 47

వ. ఇట్లుపలక్షితుం డగునతండు నిరతిశయానంద మనుభవించుచు మఱొర్మ్ములు లేక పరమానందస్వరూపుఁడై యున్నపరమాత్మ్మం బొందు నీయర్చిరాదిమార్గమే పరమభాగవతోత్తము లనుసరింతురు దీని ననుసరించి ముక్తింబొందినవాఁడు పునర్జన్మంబు నొందఁ బోక పరమానందసుఖం బనుభవించుచుండు నని మఱియును. 48

సీ. విధ మిది యంతయుఁ విధికి మున్ హరి చెప్పె
నరయ సంసారికి నర్చిరాది
గతికంటె నుత్తమగతి లేదు దానిచే
హరిభక్తి జనియించు నపుడు బ్రహ్మ
మూఁడు వేదంబులు ముమ్మాఱు పరికించి
ముక్తిసాధన మల్లభక్తి యనియె
భక్తిచేఁ బరమాత్మ్మపయి ననురాగ మౌ
భక్తి గల్గును హరిభజనమునను
తే. నామసంకీర్తనము వందనంబును స్మర
ణము కథాశ్రవణము దర్శనము నొనర్చి
సర్వసంగములఁ రోసి సర్వవిభుని
భక్తిఁ బడయఁ గల్గినవాఁడు ముక్తి నొందు. 49

—♦ కామ్యఫలస్వరూపనిరూపణము ♦—

ద్విపద. ఆసన్నమరణుల కాచరింపంగ
నౌసాధుమార్గము నంతయు నీకు
నెఱిగించితిని వెండి యింకొకమార్గ
మెఱిఁగించెదను విను మిభపురాధీశ 50

వ. బ్రహ్మవర్చసకాముండు బ్రహ్మణస్పతి నింద్రియకాముం డిందుని
బ్రజాకాముండు దక్షుఁడు మొదలగుప్రజాపతులను అన్నాద్యకాము

డదితిని స్వర్గకాముం డదితికుమారు లగుద్వాదశాదిత్యులను రాష్ట్రకాముండు విశ్వేదేవతలను బ్రజాస్వాధీనకాముండు సాధ్యులను శ్రీకాముండు మాయాదేవి యగుదుర్గను దేజస్కాముఁడు విభావసుని వసుకాముఁడు వసువులను వీర్యకాముండు రుద్రులను ఆయుష్కాముం డశ్వినులను బుష్టికాముం డిలాదేవినిఁ బ్రతిష్ఠాకాముండు ద్యావాభూములను సౌందర్యకాముండు గంధర్వులను స్త్రీకాముం డూర్వసిని సర్వాధిపత్యకాముండు పరమేష్ఠిని యశఃకాముఁడు యజ్ఞేశ్వరుని గోశకాముఁడు ప్రచేతసుని విద్యాకాముఁడు వామదేవుని దాంపత్యకాముఁడు కాత్యాయనీదేవిని ధర్మార్థకాముఁడుత్తమశ్లోకోపాధికుం డగువిష్ణువును సంతానాభివృద్ధికాముఁడు పితృదేవతలను రక్షాకాముఁడు పుణ్యజను లగుయక్షులను నోజస్కాముఁడు మరుద్గణంబును రాజ్యకాముఁడు మనువులను శత్రువిజయకాముఁడు నిరృతినిఁ గామకాముఁడు సోముని వైరాగ్యకాముఁడు పరమపురుషుని సర్వార్థకాముఁడు మోక్షకాముఁ డగువాఁ డవిచ్ఛిన్న భక్తియోగంబునఁ బరమపురుషుని ధ్యానించి పూజించి యుపాసించి యజించి సేవింప వలయు నని మఱియును. 51

ఉ. వారికి మోక్ష మె ట్లయిన వచ్చెడునే యనుదేని విన్ము భూ
దారుడ ! యిట్లు వేల్పుల నుదారతఁ గొల్చుచు నున్న మీఁదటన్
జేరును భక్తియోగ మది చేరినయంతన శౌరి నెంతయున్
గోరికఁ జేసి కొల్చుట కగున్ లభియించును జ్ఞాన మందునన్. 52

తే. దాన నిశ్చలచిత్తుఁడై ధ్యానయోగ
యుక్తుఁడై హరికథలందు రక్తి గలిగి
నామసంకీర్తనము నె ప్డొనరుచు కొనుచు
యోగియై తెగి మోక్షము నొందఁ గలఁడు. 53

వ. అని చెప్పినశౌనకుండు సూతుం జూచి బరీక్షిన్నరేంద్రుం డవ్వల నేమిప్రశ్నంబు చేసె శుకయోగీంద్రుఁ డేమి చెప్పె వారిద్వరు నుత్తమశ్లోకులు వారిపరిశ్నోత్తరంబులు ముక్తిసాధనంబులు. 54

ఉ. బాలురఁ గూడి బాలుఁ డగుపార్థకుమారకుమారుఁ డాడుచున్
గాలము పుచ్చె బాలుఁ డయి క్రాలెడుకృష్ణునిలీల లన్నియున్
గేళిగఁ జేయుచున్ ముదము క్రేళ్ళుఱుకన్ బొనరించునట్టిభూ
పాలుఁడు సేయుప్రశ్నములు పండితపామరవేద్యము ల్గదా 55

చ. హరిభజనం బొనర్చునరు నాయువుగాక నిరంతరంబు సం
సరణమునం జరించునరజంతువునాయువు నాఁడునాఁ డహ
స్కరుఁ డుదయించి నప్పుడును సాయము వచ్చినయప్పు డుత్తరో
త్తరము హరించి కొంచుఁ జనుఁ దద్భుజనప్రతిభాప్రభావముల్. 56

తే. దినము దిన మట్టు లాయువు తీఱెడు నని
తా నెఱుంగక మూర్ఖుఁడు దారపుత్ర
గృహధనాదులకై తహతహపడి తన
కాలమును దోసిపుచ్చు నక్కట కట కట. 57

క. బ్రదుకుటకు ఫలము తనదగు
నుదరము పోషించుకొనుట యొక్కటె యనుచున్
హృదయేశు నెఱుఁగఁ జాలక
యదవద లగువానిజన్మ మది యేమిటికిన్. 58

సీ. అడవులందుం జెట్టు లాకాశ మంటగఁ
బెఱుగుచుం బ్రిబలి జీవింప నోటు
కడుపునిండం దిని కసవు నీళ్ళులు ద్రావి
యూళ్ళఁ దిరుగులాడ వో పశువులు
కుక్కలుం బందులు గొంపకొంపకుఁ బోయి
పొట్టనిండం దిని మెట్ట పట్టె
లొట్టెలు గాడిద లిట్టట్టు తిరుగుచు
మోపులు మోయవే మోయ లేక

తే. జ్ఞానహీనము లగునట్టిజంతువులకు
విష్ణుభక్తిహీనులకును భేద మేమి

గల్గు నని చెప్పవచ్చెడు తెలిసి మాట
లాడు నా నరపసువు లయ్యెడియు గాక. 59

తే. ...కిఁ బొట్టనించు
కొనుట యొక్కఁడె ఫలముగాఁ దనుచు నెఱిఁగి
విష్ణుభక్తిపరుం డయి వెలయుజనుని
జన్మమే జన్మ మని చెప్పఁ జను మునీంద్ర. 60

సీ. విష్ణునికథలను విననట్టిజానుగుల్
గ్రావంబులం గలకందరములు
వైష్ణవగాథలఁ బలుకనినాలుక
తడికారుకప్పలతోడుగు నాల్క
కమలనాభునకు మ్రొక్కనిశిరం బది గడ్డి
బొమ్మపై వెట్టినపొల్లశిరము
పుండరీకాక్షునిపాడ గనం బోవని
కనులు ప్రతిమ కైనగాజుకనులు

తే. శార్ఙ్గిఁ గొలువనిచేతులు శవముచేతు
లీశ్వరునిఁ గొల్వకుండినహీనజనుని
దేహ మారయఁ బ్రాణముల్ దెగినయట్టి
దిక్కుమాలినప్రేతపెందేహ మరయ. 61

వ. విష్ణుభక్తిపరాయణుండు గానినరుండు నడపీనుఁగుం బోనివాఁ డని తెలియం దగు ననినఁ పరీక్షిన్నరేంద్రుండు గృహపశుధనదారసుతాదులఁ బరిత్యజించి విష్ణుకథాశ్రవణాసక్తిం దగిలి యున్నవాఁడు గావున శుకునిం జూచి మీవచనంబు లమృతతుల్యంబులు మీరు చెప్పిన హరికథలు వినుటం జేసి నాయవివేకము పటాపంచ లైనది. భగవంతుఁ డగువాసుదేవుండు లోకముల నెట్లు సృజించునో వాని నెట్లు పాలించునో యెట్లు సంహరించునో మఱియు నాతఁ డీభూతలంబున నేయేయవతారములు దాల్చెనో వాని నెట్లు బాలించెనో యవి

యన్నియు నత్యాశ్చర్యకరంబులు గావున వానిం జెప్పి కర్ణపర్వంబు
గావింపు మివి యన్నియుం జెప్పుటకు నీవె సమర్థుండవు నీకంటె
సమర్థుండు లేడు. నాయందు దయ యుంచి చెప్ప ననుగ్రహింపు
మనిన శుకుండు తనమనంబున శ్రీహరి నిట్లు ధ్యానించి నమస్కరించె.

— శ్రీశుకుండు భగవంతునిఁ బ్రార్థించుట —

దండకము. దేవాదిదేవా జగద్భావనీ వెన్న జీవాత్మకంబెన్ బరుం డన్న
య ట్లుండి యంతర్బహిర్భాగముల్ నిండ వ్యాపించి వర్తించు
చున్నాఁడ వోకన్నతండ్రీ! ప్రపంచంబు గావించియుం బెంచియుం
ద్రుంచియున్ లీల బ్రహ్మత్వమున్ శంకరత్వంబు విష్ణుత్వముం
దాల్చుచందంబునం బొంది శక్తిత్రయాత్ముండవై సర్వమం దంతరా
త్ముండవై వ్యాప్తిఁ గైకొందు వైనన్ భవద్రూపమెన్నంగ సుజ్ఞానగ
మ్యంబు సౌమ్యం బగమ్యం బవిజ్ఞానికి న్నీవు భక్తాళిపాపంబులం
బాపఁగా నుందు హంసాశ్రమంబందు నే లందు శిష్టాళికష్టంబులం
దీర్చి యిష్టార్థముల్ గూర్తు వోదేవ! నీదైనవాత్సల్య మగ్గింపఁగా
నేర రెవ్వారు కృష్ణుండవై పుట్టి గీతోపదేశంబు గావించి లోకంబు
రక్షించి తక్షీణదాక్షిణ్యభావా! భవద్వైభవంబుం బ్రతిష్ఠించు నీ
పుణ్యగాథల్ మదిన్ నిల్పుకొంచున్ నినున్ భక్తి భావించి సేవించు
వారిన్ నినుం బోలెఁ గావించి రక్షింతు చాంద్రాయణాదుల్
వ్రతంబుల్ తపంబుల్ జపంబుల్ సదోపాసనల్ దానముల్ ధర్మముల్
కర్మముల్ నిన్ను సేవించుదీక్షావిధిం బోల వోజ్ఞానగమ్యాఁ భవద్భ
క్తియోగంబునం జేసి యోగీంద్రచంద్రుల్ పరంధామముం బొందుచుం
డ్రెట్టిపాపుండునే నింత ధ్యానించి ధన్యాత్ముఁ డౌ వేదశీర్షోక్తవిజ్ఞాన
వేద్యుండవై యుందు వోయయ్య నాకుం బ్రసన్నుండవై బోధనా
శక్తి గల్గింపు మీవే సమస్తప్రపంచాళికి న్నేతవుం ద్రాతవుం ధాత
వున్ నాదు దేహంబునం దంతరాత్ముండవై నీవు దీపించుచున్నాఁడ
వో దేవ నీకే నమస్కారముం జేయుచున్నాఁడ నన్నుం గటాక్షింపు
మో దేవతాసార్వభౌమా! నమస్తే నమస్తే నమః. 63

వ. అని భగవంతుని నుతించి. 64

మ. ♦సరగన్ సత్యవతీపరాశరులకున్ జన్మించి సత్యంబున
న్వగుస న్వేదము లచ్చుకట్టియుఁ బురాణంబు ల్వినిర్మించి ధ
ర్మరహస్యార్థము లెల్లఁ దేటపడఁగా మర్త్యాళి రక్షించుమ
ద్గురునిన్ సన్నుతసన్మునిప్రవరుఁ గొల్తున్ వ్యాసభట్టారకున్. 65

వ. అని గురువందనంబు చేసి శుకుండు రాజుం గని ము న్నీయర్థంబు
నారదుండు బ్రహ్మదేవు నడుగఁ దనకు విష్ణుదేవుండు చెప్పినచొప్పున
నతం డతనికిం జెప్పె దాని నీ కిపుడు చెప్పెద నవహితుండవై వినుము
నారదుండు బ్రహ్మం గాంచి. 66

సీ. వేల్పుపెద్దవు నీవు వెలయించితివి సృష్టి
చెప్పుము నాకుఁ దత్సృష్టివిధము
జగము లె ట్లగు నవ్విక్షయ మగు టెట్టిది
పరివ ఁ డెవ్వఁడు పలుకు మీవె
ప్రభువు నీ కేఁడును బ్రభువు గానఁగ రాఁడు
తపియింతు నీ వేనిదయను గోరి.
నాసందియము దీర్ప వే సకలేశ్వర!
యనవుడు బ్రహ్మ యి ట్లనియె వత్స!

తే. సృష్టికర్త నాలోకపరివృఢుఁడు గలఁడు
వాని తేజము చేఁ బుష్పవంతు లగ్ని
చుక్కలును వెల్గుచుండు నీచక్కి నెఱుఁగ
కీవు న న్నీశ్వరుం డని యెంతు వకట. 67

—♦ బ్రహ్మ నారదునకుఁ బ్రపంచప్రకారము దెలుపుట ♦—

వ. ప్రకృతి మహత్తత్త్వము నహంకారము లోనగువవియుఁ బుణ్యపాప
రూపకర్మములు కాలము సత్త్వరజస్తమోగుణములు జీవజాలము
సర్వమును వాసుదేవవ్యతిరిక్తములు కావు శ్రుతులు నారాయణ

♦ సరగన్=శీఘ్రముగ; అనఁగా సద్యస్కాలమందని భావము.

ప్రతిపాదితములు దేవతలు నారాయణాత్మసంభవులు లోకములు నారాయణాధీనములు యజ్ఞములు నారాయణరూపంబులు ప్రాణాయామాదులు కృచ్ఛ్రచాంద్రాయణాదులు తపస్సు భక్తి పురుషార్థసిద్ధి సర్వము నారాయణాధీనము నేను త్రిగుణాత్మకుండ దగువానిచే సృజింపఁబడి తదనుజ్ఞం జేసి ప్రపంచము సృజించుచుంటి నని చెప్పి యుప్పు డాసృష్టిక్రమం బెఱింగించెద నాకర్ణింపు మని మఱియును ఆపురుషాధిష్ఠిత మైన ప్రకృతివలన మహత్తత్త్వము పుట్టునది రజస్సత్త్వసంవర్ధిత మై వికృతిం గొన్న మహత్తత్త్వమువలనఁ దమఃప్రధాన మైన భూతపంచకము జ్ఞానేంద్రియకర్మేంద్రియములు నహంకారము పుట్టిన నహంకారము ద్రవ్యజ్ఞానక్రియాశక్తుల వికారంబు నొంది త్రివిధం బయ్యె ద్రవ్యశక్తి పృథివ్యాదిభూతంబులను జ్ఞానశక్తి జ్ఞానేంద్రియపంచకంబును క్రియాశక్తి కర్మేంద్రియపంచకంబునుం బుట్టించు నె ట్లనిన ద్రవ్యశక్తి యనంబడు తామసాహంకారంబున మొదట నాకాశంబు పుట్టి శబ్దగుణకమై ప్రపంచమునకుఁ బ్రమాణభూత మగుచున్నది దానివలన శబ్దస్పర్శప్రధాన మగువాయువు పుట్టినది యా వాయువు మేనం గలుగుటం జేసి ప్రాణరూపేంద్రియములకు మానసమునకు దేహమునకు బలము గలిగించుచున్నది వికృతిం బొందు నావాయువువలనఁ దేజస్సు పుట్టినది దానియందు శబ్దస్పర్శరూపంబులు మూఁడుగుణంబు లుండు నా తేజస్సువలన జలంబు పుట్టినది దానియందు శబ్దరూపరసంబులు గుణంబు లై యుండు జలంబువలన గంధగుణము ప్రధానముగాఁ గలభూమి పుట్టినది దానియందు శబ్దస్పర్శరూపరసగంధములు నాల్గుగుణంబులు గలిగి యుండు నివి తామసాహంకారకార్యంబు లింక సాత్త్వికాహంకారకార్యము లాకర్ణింపుము తామసాహంకారమువలనఁ జంద్రుఁ డధిదైవతం బగు మనస్సు పుట్టినది మఱియు దిక్కులు వాయువును సూర్యుఁడు ప్రచేతసుఁడు నశ్విదేవతలు నగ్ని యింద్రుఁడు నుపేంద్రుఁడు మిత్రుఁడు ప్రజాపతి

యనుపదుగురిచే నధిష్ఠితంబు లగునింద్రియములు పుట్టినవి సాత్వికా హంకారమువలనఁ గర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు బుద్ధి ప్రాణము పుట్టిన వింద్రియాధిదేవతలం జెప్పెద వినుము శ్రవణేంద్రియమునకు దిక్కులును త్వగింద్రియమునకు వాయువును నయనేంద్రియమునకు సూర్యుండును రసనేంద్రియమునకుఁ బ్రచేతసుండును ఘ్రాణేంద్రియమునకు నశ్వినీదేవతలును వాగింద్రియమునకుఁ బ్రజాపతియు నధిదేవత లిట్లుండియు బ్రహ్మాండశరీరనిర్మాణంబున నసమర్థంబు లయ్యె నప్పుడు భగవత్ప్రేరితంబులై కార్యకారణభావాన్వితంబయినబ్రహ్మాండనిర్మాణం బయ్యె. అంత నొకపూరుషుం డయ్యండంబును భేదించుకొని బయలు వెడలె నతండును. 68

సీ. వేయి శీర్షంబులు వేయి ముఖంబులు
వేయి నేత్రంబులు వేయి తొడలు
వేయి పాదంబులు వేయి హస్తంబులు
వేయి కంఠంబులు వేయి శ్రుతులు
గలిగి యప్పురుషుండు వెలసె విరాట్టయి
భువనము లాతనియవయవములు
వానిముఖమునుండి బ్రాహ్మణుల్ పుట్టిరి
బాహువులఁ క్షత్రియులు లెసఁగిరి
తే. ఊరువుల వైశ్యులును బాదయుగమువలన
శూద్రులును సంభవించి రాశోభనాంగుఁ
డెల్ల లోకముల న్నిండి యెసక మెసఁగు
చుండు నాతనిదెలియంగ నోప రెవరు. 69

వ. మఱియు నాపురుషోత్తమునిముఖంబునుండి వేదంబులును వానికధిదైవతం బగువహ్నియుం బ్రభవించె సప్తధాతువులనుండి గాయత్ర్యాదిఛందస్సులును రసనేంద్రియంబునుండి హవ్యకవ్యంబులు నమృతాది రసంబులును నాసికారంధ్రంబులనుండి ప్రాణవాయువులును జక్షు

రింద్రియంబునుండి సూర్యుండును దేవలోకంబులును కర్ణంబులనుండి
శబ్దగుణగగనంబులును త్వగింద్రియమునుండి వాయువులును రోమ
ములనుండి యజ్ఞోపకరణాదులును దరుగుల్మలతాదులును గోళ్ళనుండి
లోహంబులును కేశంబులనుండి మేఘజాలంబులును బాహువులనుండి
లోకపాలురును గుహ్యంబునుండి కామార్థపురుషార్థంబు లానంద
మును బృష్ఠభాగంబునుండి నధర్మజ్ఞానంబును నాడీసమూహంబు
నుండి నదీనదంబులును శల్యంబులనుండి పర్వతంబులును గర్భగోశము
నుండి సముద్రంబులును హృదయంబునుండి సర్వప్రాణిమనస్తత్త్వం
బును నుత్పన్నంబు లయ్యె. మఱియు నీవు నేను మునులు గంధ
ర్వులు నప్సరములు యక్షులు రక్షస్సులు పక్షులు నురగంబులు
పశువులు పితృదేవతలు సిద్ధసాధ్యవిద్యాధరాదులు సూర్యాదిగ్రహం
బులు నక్షత్రములు మెఱుములు మేఘంబులు లోనగు సమస్తవస్తు
జాతంబు నాభగవంతునిశరీరజాతం బని యే యెఱుంగ నగు నని
రుద్ధనామధేయుం డగునతండు ప్రపంచకాంతర్బహిర్భాగంబుల నగు
సర్వమును దనశాసనమున నధీనము గావించుకొని జీవాత్మయై
కర్తయు భోక్తయునై మోక్షప్రదుండునై ప్రవర్తిల్లుచుండు నతం
డాద్యంతంబులు లేనివాఁడు నజుఁడు నవ్యయుఁడు నచ్యుతుఁడు నప్ర
మేయుఁడు నై యుండు. 70

చ. అతఁడు సమస్తవస్తుగతుఁ డయ్యును సత్త్వరజస్తమోగుణా
శ్రితుఁ డయి సృష్టి సల్పు మని చెప్పటఁజేసి తదుక్తపద్ధతిన్
సతతము లోకముల్ సలుపఁ జాలితి శూలియుఁ దన్నియుక్తుఁడై
సతతము సంహరించుపని సల్పుచునుండె నిజంబు చెప్పితిన్. 71

మ. భగవద్వైభవ మే నెఱుంగుటకు నోపన్ రుద్రముఖ్యామరుల్
తగ రెవ్వారును వానిమాయవలనన్ దథ్యంబుగా నందఱున్
వగ లోఁ గైకొని మోహితాత్ము లగుచున్ వర్తించుచున్నారు లో
కగతుల్ సర్వము వాని వంచుఁ దెలియంగాఁ జెల్లు నుల్లంబునన్ 72

వ. శోభయు లజ్జయు నియామ్యవర్గము బుద్ధియు క్రతువస్తువులు పవిత్రత్వము
లోనగునవి దివ్యమంగళవిగ్రహము ధరించినవిరాట్పురుషునివిభూతు
లని తెలియం దగు మఱియు నాభగవంతునందు నానావతారంబు
లెత్తి యందం దొనర్చిన మహాద్భుతకార్యంబులు గణనాతీతంబులు
వాని వినుటంజేసి సర్వపాపంబులు సమసిపోవుం గావున భగవంతుని
లీలావతారంబులును దత్కథామృతంబు నిట సంగ్రహంబుగం
జెప్పెద నాకర్ణింపు మని యి ట్లనియె. 73

— భగవంతునిలీలావతారకథనము —

సీ. మును హిరణ్యాక్షుఁ డ౯ మూర్ఖరాక్షసుఁ డొక్క
కాలంబునం గండకావరమునఁ
జాపచుట్టగఁ జుట్టి క్ష్మాతలం బెల్ల స
ముద్రంబునం బడి మున్గిపోవ
నుండినయప్పు డచ్యుతుఁడు వరాహమై
దంభోళి గిరినట్లు దైత్యుఁ గూల్చి
దంష్ట్రాగ్రమున భూమిఁ దగనుద్ధరించెని
య్యది వరాహావతారాఖ్యనలరు

తే. రుచికి నాకూతికిని గొమరుఁడు సుయజ్ఞుఁ
డతఁడు దక్షిణ యనుసతియందు సుయము
లనఁగఁ బన్నిద్దఱం గని యవనిబాధ
లను హరించి సుయజ్ఞుఁడు తనరె హరిగ. 74

చ. కపిలుఁడు దేవహూతికిని గర్దమనామునకుం గుమారుఁడై
విపులయశస్కుఁడై వెలసి వీతభవామయుఁడై వెలుంగుచు౯
గృప దళుకొత్తఁ దల్లికిని గేవలసాంఖ్యము సెప్పి తాఁ బరం
తపుఁ డయి ముక్తుఁ డయ్యె నది ధాత్రిఁ దగెం గపిలావతారమై. 75

మ. అనసూయాసతితోడ నత్రిముని మున్నా శ్రీహరిం గొల్చి పు
త్రుని వేడ౯ హరి మీకు దత్తుఁ డసుపుత్రుండై ప్రసాదింతు మి

మ్మని జన్మించెను వారి కాప్రభువె దత్తాత్రేయుఁడై కార్తవీ
ర్యనరేంద్రాదుల నుద్ధరించె నవతారంబై ధరామండలిన్. 76

తే. మును దపించెడు తఱి నాదుమనమునన్ స
నకుఁ డవల సనందుఁడును సనత్కుమారుఁ
డును సనత్సుజాతుఁడు నంశమున జనించి
తనరి రిలఁ గుమారాఖ్యావతార మనఁగ. 77

సీ. ధర్ముఁ డన్ముని దక్షతనయ మూర్తినిఁ బెండ్లి
యాడె వారలకు నారాయణుఁ డన
హరి పుట్టి బదరికన్ గురుతపం బొనరింప
నటకు నింద్రుఁడు పుచ్చె నచ్చరలను
వంచింప వచ్చిన వారి వంచింప నా
తం డూరువున నొక్కతరుణిఁ జేసె
నదియె యూర్వశి దాని నరసి సిగ్గున నచ్చ
రలు లేటమొగములఁ దొలఁగి చనిరి

తే. అతఁడు నరుఁ డనుసఖునితో నధికతపము
లోకకల్యాణమును గోరి
యధికుఁడై నరనారాయణావతార
మనఁగఁ ద్రిభువనవిఖ్యాతి నందఁ గలిగె. 78

సీ. పఱగు ము న్నుత్తానపాదునితనయుండు
ధ్రువుఁడు సవతితల్లి దెవడుకతన
నిలు పీడ వని కేగి యొక్కటిఁ దపియించె
హరి వాని కంతఁ బ్రత్యక్ష మగుచు
వరము లిచ్చినఁ గొని బాలుఁ డాతఁడు మహో
న్నత మగుపద మందె నది యుదీచి
ధ్రువమండలం బని తోఁచు నయ్యది సప్త
మునిమండలము మీఁదఁ బొనరుచుండు

తే. ధ్రువునకున్ వర మిడినవిష్ణువు తనదవు
కళ నొసంగినకతన నాఘనయశుండు
నొక్కయవతార మని చెప్ప నొప్పె జగతి
ధ్రువునిదర్శింప హెచ్చు నాయువు జనులకు. 79

ఉ. శ్రీ వెలయంగ మున్ పృథువు చెన్నలరారుచు వేనపుత్రుఁడై
భూవలయంబు నేలుచునుఁ బూజ్యచరిత్రము గల్గి భూమినిన్
గోవును గాఁగఁ జేసి హిమగోత్రము వత్సగఁ జేసి భూప్రజన్
బ్రోవఁగ నోషధుల్ మణు లపూర్వము పిండె శుభావతారమై 80

క. నాభికి సుదేవియందున్
శోభావహుఁ డగుచుఁ జక్రి సుతరత్నం బై
ప్రాభవము నొంది వృషభుఁడు
నా భువిఁ బొగడొందె యోగినాథుం డగుచున్. 81

ఉ. నే వెలయించుసత్రమున నీరజనాభుఁడు పేర్మిమై హాయ
గ్రీవుఁడు గాఁగఁ బొల్చి యట గీష్పతిముఖ్యులు మ్రొక్కుచుండఁగా
నావలనన్ బ్రసన్నుఁ డయి నానతు లందెను బైడిమేనివాఁ
డావరమూర్తి ముక్పుటములందలియూర్పునఁ బుట్టె వేదముల్. 82

ఆ. ప్రలయకాలమందు జలమయంబుగ నున్న
యపుడు మత్స్య మగుచు నవతరించి
పడవ నిలిపి కాచె వైవస్వతుని సోమ
కుని వధించి శ్రుతులఁ గొంచు వచ్చె. 83

చ. సుర లసురుల్ సుధం బడయఁ జూచి సముద్రము పాలకుండ మం
దరము మథించు దండ మహితాద్రిఁగఁ జేసి మథించుచుండ నా
ధరణిధరంబు క్రుంగఁ బడ దాని జలంబుల మున్గకుండ ను
ద్ధరణ మొనర్చె వీపుపయిఁ దాలిచి శ్రీహరి కూర్మరూపుఁడై. 84

మ. అతిభీముం డగునాహిరణ్యకశిపుం డన్ రాక్షసుం డుగ్రుఁడై
పరిభర్జించుచునుండ నాత్మభవునిన్ భక్తానుకంపాదృతిన్

నరసింహాకృతి నై జగద్భయకరున్ నక ంచరున్ జించె నా
పరమాత్ముండు పరాత్పరుండు హరి విశ్వప్రస్తుతోజోగతిన్. 85

చ. అమితతృషాభరంబున వనాంతరమందు మెలంగుచున్ గజేం
ద్రము జలమానుచో వడిగ గ్రాహము పట్టినఁ బ్రాణభీతిఁ గా
వుమ యని వేడఁ జక్రమును బూని వడిన్ హరినాథుకావతా
రమున గజేంద్రునిన్ మనిచె గ్రాహము దానినిఁ జావ నేయుచున్.

చ. అదితికిఁ గశ్యపార్యునకు నాత్మజుఁడై ప్రభవించి పొట్టినై
నది ముద మీనుచుండ బలి నారసి వేఁడి పదత్రయంబు భూ
పదము సమస్తముం గొని సుపర్వుల కిచ్చి బలీంద్రువాఁకిటన్
గదలక కాచుచుండె నొకకాలము నాఁటికి వామనాకృతిన్ 87

సీ. హరి నీకు మున్ పరమాత్మతత్త్వము సెప్పె
హంసావతార మయ్యాది మునీంద్ర
మనురూప ధారియై తనచక్రమున దుష్ట
తతిఁ గూల్చె నది యవతార మగును
వనధి ధన్వంతరి యనఁ బుట్టి వెజ్జయి
హరి ముజ్జగంబుల నరయుచుండు
జమదగ్నిగర్భవాసమున రాముం డయి
ముయ్యేడువారముల్ పొడిచె ఖలుల

తే. దశరథున కాత్మజుం డయి ధరణిఁ బుట్టి
రాముఁ డన నొప్పి ఖలుఁ డగురావణాసు
రుని దురమునందు వ్రెల్మిడిఁ దునిమి సకల
భూములం బ్రోచె నవతారమూర్తి యగుచు. 88

మ. బలకృష్ణాఖ్యల యాదవాన్వయమునం బ్రజ్ఞాసమగ్రప్రభా
విలసద్వీర్యమునన్ జనించి జగతిన్ విద్రోహులై యున్నదు
ష్టులఁ గంసాదుల సంహరించి సుజనస్తోమంబునుం గాచువా
రలు శ్రీవైష్ణవమూర్తు లెన్నఁ ద్రిజగత్ప్రఖ్యాత తేజోనిధుల్. 89

తే. శ్రీమహావిష్ణు వావ్యాసభూమికఁ గొని
వేదములను విభాగించి విశ్వవినుత
ముగఁ బురాణము లెన్నియోఁ బొనరఁ జేసి
ముజ్జగంబులఁ బ్రోచె నమ్మునివరుండు. 90

తే. వేదమార్గావలంబులై విక్రమించి
మయవినిర్మితపురముల మాటు చేరి
ముజ్జగము నేచు దైత్యుల మోహపెట్టి
బుద్ధుఁడై చేసెఁ బాషండబోధములను. 91

తే. వేదధర్మము లన్నియు వెలితి పడుచు
మ్లేచ్ఛభూయిష్ఠమై లోక మచ్ఛత చెడి
తీరునప్పుడు కల్క్యవతార మెత్తి
కృత్యులం దోలి జగము సముద్ధరించు. 92

వ. మఱియు నాకర్ణింపు మేనును నవబ్రహ్మలును మరీచ్యాదులును సృష్టివిషయమై భగవంతునిచే నియమింపఁ బడితిమి. మనువులు నింద్రాదిదేవతలు రాజులును బాలనంబున నియమితులు సంహార కార్యంబున రుద్రాదులు నియుక్తు లిట్లు సృష్టిస్థితిలయంబులకు భగ వంతుఁడు హేతుభూతుండై యుండు నతనిలీలావతారంబు లనంతం బులు వాని గణింప నాకుఁ గాదు వేయితల లున్న శేషునకు నశక్యం బని మఱియు ని ట్లనియె. 93

—♦ భాగవతోత్తములు - భగవత్స్వరూపము ♦—

చ. సకలము సన్యసించి కలుషం బొకయింతయు లేనిభక్తితో
వికృతము లేనిచిత్తమున వీఁగి మనోరుజ లెల్లఁ గొల్చినన్
సకలజగన్నియామకుఁడు సంయమిచంద్రులపాల జాలిమై
నొకలవకాలమందు పరమోన్నతిఁ గల్గఁగఁ జేయ నుండెడిన్. 94

చ. శునక సృగాల భోజ్య మయి చూడఁగ నుండెడుమేనిపై దురా
శను గొని సంస్కృతిం బడి ప్రశంసకు నెక్కనిదుష్టకార్యముల్

దన కేదియో లభించు నని తత్పరతం బచరింపఁ బోక దే
వుని భజియించువానికిని బొందఁగ వచ్చెడు నుత్తమస్థితుల్. 95

వ. అట్టి పరాత్పరుం డగుపరమేశ్వరు నంతరంగంబునం దెఱింగి భజించి ముక్తింగాంచినవారు కొందఱు గల రందు నేను రుద్రుండు సనకాదులు మొదటివారము. మఱియుఁ బ్రహ్మోదుండును స్వాయంభువమనువు నతనిభార్య శతరూపయు నతనిపుత్త్రుఁడు ప్రియవ్రతుండును నతనిదుహిత లగు దేవహూతి మొదలగువారును ప్రాచీనబర్హి యను రాజేంద్రుండును ఋభుమహర్షియు నుత్తానపాదునికుమారుం డగు ధ్రువుండు నిక్ష్వాకు దిలీప భీష్మ యయాతి ముచికుంద రంతిదేవ శ్రుతదేవ విభీషణ విదుర దేవల జనక హనుమదాది మహాత్ములును గయ నహుష సౌబ ర్యుదంక శిబి పిప్పలాద పరాశర భూరిషేణోపేంద్రదత్త పార్థ శ్రుతదేవాదులు నాభగవద్భక్తివిశేషంబునం జేసి తన్మూర్తిం దెలిసి సంసారసాగరంబు దరించి కృతార్థులై రింక నా భగవంతుని స్వరూపంబు చెప్పెద నాకర్ణింపుము. 96

సీ. అది శోకరహిత మత్యానంద సుఖద మ
యాదియై బ్రహ్మం బని చదువఁ బడును
నేమాయలుం దాని స్పృశియింపఁ జాలవు
పూర్వశ్రుతులు దానిఁ బొగడ లేవు
శ్రుతిశీర్షము లవి యించుక పల్కఁ గలవేమొ
పరమాత్మతత్త్వము ప్రకృతిపురుష
భిన్న మయ్యది దాని కెన్న నేదోషము
లంటవు చిదచిత్తులందు నున్న

తే. కేవలము జ్ఞానమయ మని కీర్తి వడయు
జడత దానికి లే దెప్డు వడయ దాత్మ
లను వెలుంగుచు నుండు సూర్యునివిధమున
దానిఁ గనఁ జాలువారలు కాను ముక్తి. 97

—• పరీక్షిత్తు ప్రపంచోద్భవాదికంబు చెప్పు మని యడుగుట •—

వ. నారదా! నీ కిట్లు సంగ్రహంబుగ వాసుదేవునివిభూతు లెఱింగించితి నిదియే భాగవతంబు దీనిని నీవు బాగుగ గ్రహించి భగవంతుని యందు మనుజులకు భక్తి లభియించునట్లు చేయుము. భగవంతుని సంతసింపఁ జేయునది భక్తియే యట్టిభక్తి యుత్పన్నం బయినచో వర్ణాశ్రమాచారములు దానములు తపంబులు జపంబులు స్వాధ్యాయంబులు నిష్ప్రయోజనంబులు భగవంతునిలీల లహర్నిశంబు వినుచు గానము సేయుచు స్మరించుచుండువారు మాయామోహితులు గాక భక్తిభరితు లగుదు రని బ్రహ్మ నారదునకుం జెప్పె నది శుకుండు రాజునకుం జెప్పిన నతం డతనిదిక్కు మొగంబై బ్రహ్మప్రేరితుం డగునారదుం డాయాధర్మంబు లెవ్వరి కెఱింగించె నో విన నెంచితి మఱియు జీవునికి దేహారంభ మెట్లు కలుగును? బద్మభవుని జన్మవృత్తాంతాదికం బెట్టిది? విరాట్పురుషునవయవములచే లోకములును లోకపాలురును గల్పింపఁబడినవందు రది యట్లుండ బ్రహ్మ యథాపూర్వముగ సృజించె ననుట యెట్టిది? కల్పప్రమాణంబు లెంతలు మనుజులయు దేవతలయు పితృదేవతలయు నాయుఃప్రమాణం బెంత? కాలగతి యెట్లు పరిణమించును? ఏకర్మముల నేలోకంబు వచ్చు? కర్మము లెన్ని తెఱంగుల నుండు? దేవాదిరూపంబు లందఁ గోరువా రెట్టికర్మముల నాచరింపం దగు? లోకములు దిక్కులాకాశము గ్రహనక్షత్రములు నదీనదపర్వతములు సముద్రములు ద్వీపములు లోనగునవి యె ట్లుత్పన్నంబు లైనవి? బ్రహ్మాండబాహ్యాంతర ప్రమాణం బెంత? మహాపురుషులచరిత్రము లెట్టివి? వర్ణాశ్రమధర్మ నిర్ణయం బెఱువంటిది? యుగము లెన్ని యుగప్రమాణ మెంత? యుగంబుల నాచరింపఁ దగుధర్మంబు లెవ్వి? ఆపద్ధర్మము లవ యెట్టివి? చతుర్వింశతితత్త్వంబు లెట్టివి? అష్టాంగయోగం బెట్టిది? యోగులకు లభ్య మగునిష్టసిద్ధు లవ యెట్టివి? అర్చిరాదిగతు లెట్టివి? యోగులకు

లింగశరీరభంగ మెట్లు గలుగును? ఋగ్యజుస్సామాధర్వ వేదంబులు నుపవేదము లన బడునాయుర్వేదాదులు ధర్మశాస్త్రములు నితిహాస పురాణాదు లెట్లు పుట్టినవి? భూతములయవాంతరప్రళయంబును మహాప్రళయంబు నెట్టివి? యాగాదికర్మములయు తరుతటాకాది పూర్తకర్మములయు కామ్యకర్మములయువిధంబెట్టిది? మఱియుఁద్రివర్గ ప్రకారంబును జీవాత్మబంధమోక్షప్రకారంబును జీవాత్మస్వరూపావ స్థానంబును భగవంతునికర్మసాక్షిత్వంబును ప్రళయమం దుదాసీనుఁ డై యుండుటయు లోనగుసమస్తంబు నేను వినం దలంచితి నానతి మ్మనిన సంతసించుచు శుకుండు బ్రహ్మసమ్మిత మైనభాగవతముం జెప్పెద విను మని యి ట్లనియె. 98

సీ. కల గన్న వానికిఁ గలుగు రథాదిసం
బంధ మీశ్వరుమాయ పరఁగ కుండ
ఘటియింపకుండెడు కరణిఁ బ్రకృతివిల
క్షణుఁ డగునట్టి యీశ్వరునిమాయ
వలననే భోగ్యవస్తులయందు భోక్తృతా
సంబంధ మది గల్గి సాగుచుండు
మాయం దిరోహితమై యుండుటం బట్టి
గాంచికిఁ బ్రాకృతవస్తుభోగ్య

తే. బుద్ధి జనియించు మాయచే మాయఁ బడెడు
జ్ఞానరూపుఁడు జీవుఁడు తాను దేవ
తాదిరూపము లాత్మయం దలవరించు
కొనుచు బహురూపి యగునట్లు కనుఁగొన నగు. 99

తే. ప్రకృతిసంయుతజీవుఁడు వాస్తవమున
దా విలక్షణుఁ డైనమాయావిశేష
ము లగుసత్వరజస్తమస్సులను గల్గి
మెలఁగుచుండెడు నెప్పుడు మెలకువ చెడి. 100

క. ఈదేహం బీగేహం
బీదివ్యములైనవస్తు లిన్నియు నావే
నాదే సర్వం బనుకొని
తాఁ దిరుగున్ భవమునందుఁ దగులము గలుగన్. 101

తే. కాలమునకును మాయకుఁ గాక యుండఁ
బరఁగుపరమాత్మయందు నాప్రాణి మనము
నిలిపి నాది నే ననునది వెలలఁ ద్రోలి
మోక్షసాధన మగుజ్ఞానమును గొన నగు. 102

వ. భగవద్భక్తి జీవునకు మోక్షసాధకం బగు దీనికిఁ దార్కాణంబుగా
బ్రహ్మదేవునితపఃప్రకారంబు చెప్పెద నాలకింపు మని యిట్లనియె

— ♦ బ్రహ్మదేవుని తపఃప్రకారాదికము ♦ —

సీ. ధాత మున్ దనకు నాధారభూతం బగు
పద్మమందు వశించి ప్రజ్ఞకలిమిఁ
లోకముల్ సృజియింప లోఁ దలంచెను గాని
తద్విధాన మెఱుంగుదారిఁ గనక
చింతాకులాత్ముఁడై చేయుకర్జము లేక
ప్రళయకాలపయోధిఁ బడి మెలఁగుచు
నుండంగఁ దప యను రెండక్షరంబులు
శ్రవణంబులన్ రెండునారులు పడె

తే. వేరు వల్కిరో యని వాని వెదకి వెదకి
కాన లేకెల్లదిక్కులఁ గలయఁ దిరిగి
విసిగి వేసారి తా నుండు విరికి మఱియుఁ
జేరి యిట్లని తర్కించెఁ జిత్తమందు. 104

చ. తప తప నాఁ దపంబు విదితంబుగఁ జేయ విధించుశబ్ద మేఁ
దప మొనరింతు నీశ్వరవిధాన మటంచు వినిశ్చయంబునన్

జపలత వీడి చక్క నయి శ్వాసనిబంధన మాచరించి స
త్తపము సహస్రవర్షము లుదారత సల్పె ననల్పవైఖరిన్. 105

వ. ఇట్లు వేయుదివ్యవత్సరములు నత్యంతఘోరతపం బొనర్చినబ్రహ్మదేవు నకు నారాధనీయుం డగునారాయణుండు ప్రత్యక్షుం డై తనకు నివాస భూతం బైనవైకుంఠంబు లోచనగోచరం బగునట్లు చేసె నదియును.

సీ. సారూప్యమును బొంది సన్మునీంద్రులు నిత్య
ముక్తులు నివసించుపుణ్యభూమి
యచ్చట నాధ్యాత్మికాదితాపత్రయం
బజ్ఞానమును భయం బరయ రాదు
సత్త్వగుణం బొందు సంపూర్ణమై యుండు
నం దుండువారు శ్యామలాంగు లరయ
నాల్గుచేతులవారు నలినపత్రవిశాల
నేత్రయుగ్మమువారు నిఖిలలోక

తే. వందనీయులు బంగారు వన్నె గలుగు
పట్టువస్త్రము ధరియించునట్టివారు
దివ్యయానములం దెక్కి తిరుగువారు
విష్ణులోకమునం గలవీరు లెల్ల. 107

మ. కలమందారవనాంతరప్రవిలసత్కల్యామృతాబ్జోచ్ఛల
త్కలహంసప్రతికూజితోన్నత రవాక్రాంతాచ్ఛసౌధోపరి
స్థలకేళీచలనాతిలాలసమరుద్బాలామణీవాక్యసం
కులశబ్దార్థపునఃపునశ్శ్రవణరక్తుల్ విష్ణుభక్తుల్ పురిన్ 108

ఉ. ఆనగరిలలామమున నద్దమరేఁ జని యాలకించినన్
జానుగఁ దోఁచుశాస్త్రములచర్చయు నర్చిత వేదపాఠముల్
గానవిశస్త్రపుం గనెడుగాథలబోధలు సాధుసంస్తుతుల్
జ్ఞానకథాప్రసంగములు సంతతము న్వరసాధవీథులన్. 109

సీ. గంగాదితీర్థముల్ గని యెఱుంగనిచెట్టఁ
డడుగునఁ బుట్టించు నమరగంగఁ
గూడుగుడ్డలు లేక కుతిలఁగుడుచునిస్వుఁ
డాఢ్యుఁడు లక్ష్మీకటాక్షమునకుఁ
గుట్టుపోఁగులును లే కట్టిటుపడుపేద
కౌస్తుభహారముం గడకఁ దాల్చు
నడుగెడు నడ లేమి నలసెడుబడుగు మేల్
పులుగుఁద త్తడి నెక్కి మెలఁగు చుండుఁ
తే. గత్తిఁ గని జంకుపిఱికి చక్రంబు పట్టు
వెన్నుఁ డనుమాట యొకమాటు విన్న యేని
తిరుపతులయందు నెమ్మేను దొరఁగ నేని
యిట్టివా రందు నెందు నున్నట్టివారు. 110

ఉ. అందఱు నూర్ధ్వపుండ్రధరు లందఱు చామనచాయనేసివా
రందఱు శంఖచక్రధరు లందఱు పన్నగవైరి నెక్కువా
రందఱు నల్వఁ గన్నదొర లందఱు నాలుగుచేతు లున్నవా
రందఱు సర్వలోకపతు లందఱు వైష్ణవమూర్తు లప్పురిన్. 111

శా. పూర్ణాస్వాదనముం బొనర్చి పనులం బూఁదేనెలం దుమ్మొదల్
కర్ణాహ్లాదకరంబుగా నెప్పుడునుం గానంబు గావింప నా
కర్ణింపంబడు విష్ణునామకకథాకావ్యానులాపంబు లా
వర్ణింపం దగు నవ్వైకుంఠనగరీ వర్యం బవార్యంబుగన్. 112

వ. అట్టి వైకుంఠము తనకట్టెదుటం బొడకట్టిన బ్రహ్మదేవుం డందలివింత
లకు విస్మయంబు నొందుచుం బోయిపోయి యొక్కచో నొక్క
దివ్యభవనంబున సుఖాసీనుం డై యున్న నారాయణమూర్తిం గాంచె
నతండు. 113

సీ. యజ్ఞరూపుం డయి యజ్ఞాదులందు నా
రాధింపఁబడువాఁడు రమ్యమూర్తి

చిదచిదాత్మకమయి చెలఁగుజగమ్ము రూ
పముగ నొప్పెడివాఁడు పాంచరాత్రి
ధర్మముల్ సలిపెడుకర్మఠులనుఁ దన
జగతికిం గొనిపోయి సాఁకువాఁడు
నంద సునందాది బృందపార్షదపరి
వేష్టితుం డయి సదా వెలయువాఁడు
తే. మందహాససుందరముఖానందదాయి
మణికిరీటము కాంతులు మట్టుమీఱఁ
బీతకౌశేయవాసము ప్రీతిఁ దాల్చి
పొల్చు శ్రీదేవి యొమ్మునఁ బొలుపుమిగుల. 114

తే. అట్టిభగవంతునిం గాంచి యబ్జభవుఁడు
గనుల నానందబాష్పముల్ గాఱుచుండ
హర్షపులకితగాత్రుఁడై యట్టె వంగి
పాదపద్మంబులకు మ్రొక్కెఁ బ్రీమనుఁ డగుచు. 115

ఉ. మ్రొక్కినపద్మసంభవుని మోముపయి న్నిగిడించి చూపులన్
మిక్కిలి ప్రేముడించుచును మెచ్చుగుదెంచెను నీదునిష్ఠకున్
జక్కనితండ్రి నీ వికను సల్పఁగఁ జాలుదు భూతసృష్టి నీ
కొక్కవరం బొసంగుటకు నుల్లము సేసితి వేఁడు మిత్తఱిన్. 116

వ. అని పల్కినఁ బరమపురుషునకుఁ బరమేష్ఠి యి ట్లనియె. 117

శా. దేవా! నీవు సమస్తలోకముల వర్తింతింద్రియార్థాళికిన్
నీవే కర్తవు నీవె భోక్తవు నను న్నిర్వర్గ కున్నాఁడవో
నావంకన్ గరుణించి నీదుమహిమన్ గన్గొంగఁ జాల్ శకి నా
వి ప్డీయ నన్గ్రహింపవె జగత్సృష్టిక్రియాసిద్ధికిన్. 118

వ. మఱియు బ్రహ్మాభిమానంబునం జేసి సృష్టి చేయుచున్న మహదహం
కారంబులు బంధింప కుండునట్లుగను వరం బనుగ్రహింపు మని ప్రార్థించు
చున్న నలువకు నారాయణుం డి ట్లనియె. 119

—♦ శ్రీహరి బ్రహ్మదేవునకు వరం బిచ్చుట ♦—

తే. ఓయి కమలాసనా నీకు నాయనుగ్ర
హమున మంత్రసంయుత మగునస్మదీయ
రూపమును దెల్పుజ్ఞానము రూఢి మెఱయ
నీకు సంప్రాప్త మగుఁ గాత మోకుమార. 120

సీ. పరమేష్ఠి ! నే నెంత పరిణామవంతుఁడ
నో నాదురూ పెట్టిదో మదీయ
భావ మెట్టిదో నేను గావించినట్టి సృ
ష్టి స్థితి సంహార చిత్ర మెట్టి
దో చేష్టితం బెట్టిదో యెట్టికార్యము
లే నొనర్తునో నీకు నెఱుఁగ వచ్చు
చిదచి ద్విలక్షణాంచిత మైనమత్స్వరూ
పముఁ దెలిసితి వేని వలఁతి వగుదు

తే. నీవు నిశ్చలచిత్తుఁడ నై వఱలుచు
నేను జెప్పినతత్త్వవిజ్ఞానమునను
సృష్టిసంహారముల మోహ మింతయేని
పొంద వీకఁ బొమ్ము సర్గము పొనరుచుటకు. 121

వ. అని చెప్పి యప్పరమేశ్వరుం డప్పు డప్పురాదులతో నంతలో నంత ర్ధానంబు నొందె నంత బ్రహ్మదేవుండు భక్తిభరితుండై వైకుంఠుం బ్రశంసించుచుఁ దత్కృపారసపాత్రుం డై సమస్త ప్రపంచంబును యథా పూర్వముగా సృజించి దానికి నే లగునట్లుతపంబుగావించుచుండె నయ్యవసరంబున నారదుండరుదెంచి తండ్రికి దండప్రణామంబు గావించి పరిచర్యసేయుచు సంతసింపం జేసి విష్ణుమాయాప్రకారము చెప్పు మని యడిగిన నతండు తనకు నారాయణుండు చెప్పినచొప్పంతయుఁ జెప్పె నారదుం డెఱింగి దాని సరస్వతీతీరంబున నున్న నాతండ్రి వేద వ్యాసునకుం జెప్పె నతండు దాని దశలక్షణలక్షితం బగుభాగవతంబు

గావించి నా కుపదేశించె. అది నీవు న న్నడిగినదానికుత్తరం బగు
గావున నీకుఁ జెప్పుచుంటి నాకర్ణింపు మని శుకుండి ట్లనియె. 122

ఉ. వ్యాసకృతంబు భాగవతపద్యము హృద్యము నీవు విన్నచో
నాసముఖంబునం దగ వినం గలవేని యసంశయంబుగన్
దోసము లన్నియుం దొలఁగి ద్రొక్కి గమించు టెకాక మోక్షల
క్ష్మీసదయానుషంగమును జేకుఱ నయ్యెడు నయ్య భూభుజా. 123

వ. ఇదియునుం గాక నీవు న న్నడిగినప్రశ్నంబు లన్నింటికి నాపురాణం
బుత్తరంబు లిచ్చుఁ గావున శ్రద్ధాళుండవై విన నవధరింపు మాదిఁ
బురాణంబునందలిదశలక్షణంబు లెవ్వి యనిన సృష్టియుఁ బ్రతిసృష్టి
యు స్థానము పోషణ మూతులు మన్వంతరము లీశానుచరితము
నిరోధము ముక్తియు నాశ్రయంబు ననునీపదియు లక్షణంబులు గలు
గుటంజేసి యిది పురాణంబు నాఁబడు నిందు గడపటిది యగునాశ్రి
యంబు బ్రహ్మంబునాఁబడుం దక్కిననతొమ్మిదియు దీని వివరించుటకుఁ
జెప్పఁబడినవి మఱియు నాపదిలక్షణంబులకుం గలలక్షణంబులు
చెప్పెద నాలకింపుము. 124

సీ. పంచభూతములును వానిధర్మము లగు
గంధాదివిషయముల్ జ్ఞానకర్మ
మహితేంద్రియమ్ములు మహదహంకారముల్
వీనిసృష్టియె సర్గవిశ్రుతిఁ గొనుఁ
జతురాననబ్రహ్మ జన్మించెను విరాట్టు
వలనఁ బ్రపంచ మావలఁతి చేసె
నాభూతసృష్టియే యగు విసర్గంబన
శ్రీపతివిజయమే స్థితి యన నగు

తే. అదియె స్థానము భక్తుల నరయుచుంటె
పోషణము తొంటినుండి జీవులను విడని
కర్మవాసన లూతులు కలజగముల
నరయుఘనులఁ జెప్పుటయె మన్వంతరములు. 125

కం. ఈశుం డవతారములన్
శ్రీశుండై చేసినట్టియిద్ధచరితతే
యీశానుచరిత మని పరా
నీశుఁడు వ్యాసుండు నిర్ణయించెన్ గృతులన్. 126

తే. జీవుఁ డాత్మయుఁ గర్మము నావృత మగు
శక్తితో సూక్ష్మతను బొంది చలము వీడి
ప్రకృతియం దుంటయె నిరోధభావ మగుచు
భాగవత మందు సంజ్ఞలై పరిఢవిల్లు. 127

చ. భగవదనుగ్రహంబునను భాసిలి జీవుఁడు దేవతాదిరూ
పగతికిఁ గాక సర్వవిధపాపములం దిగనాడి యెన్ని దా
సుగుణములన్ దలిర్చుచును శోభనమూర్తిసమానమూర్తియై
తగుటయె ముక్తి యంచు వినుతం బగుచుండుఁ బురాణకాండలోన్.

పంచ. ప్రపంచకంబు లెల్ల లేని ప్రజ్ఞకల్మిఁ బుట్టు గి
ట్టి పోవుచుండు నెవ్వ డాతఁడే పరాత్పరుండు వా
ని పేర నాశ్రయం బనంగ నిల్పి ప్రస్తుతింతు రా
కృపాళునిం గనంగ నుండుటే సమస్తధర్మముల్. 129

సీ. అతఁడు పరబ్రహ్మ యన నొప్పి జీవాత్మ
యందు నియంతృత్వ మంది యుండు
నాధ్యాత్మికుం డని యాధిదైవికుఁ డని
చెప్పంగఁ బడుచు వసించు శ్రోత్ర
నేత్రాదులన్ జ్ఞాననేతృత్వముం గాంచి
యాధిభౌతికుఁ డని శోధితుఁ డగుఁ
గావున జ్ఞాతయు జ్ఞానకారణమును
జ్ఞేయ మాతఁడ యగుఁ జెప్పవలయు

తే. జీవు నట్లు కించిజ్ఞుఁడై చెప్ప నొప్పఁ
డతఁడు సర్వజ్ఞుఁ డయ్యు జీవాశ్రయుఁ డయి

వెలుఁగుచుండు నెట్టివికారములును లేక
ద్రష్టయును దృక్కు దృశ్యము దాన యగుచు. 130

—♦ బ్రహ్మసృష్టిక్రమాభివర్ణనము ♦—

సీ. అతఁడు చతుర్ముఖుఁడై సృష్టిసేయ నై
బ్రహ్మాండభాండంబు పగులఁ జేసి
తనువసింపఁ బవిత్రతల మెద్ది యని యెంచి
నారముల్ సృజియించిఁ బూరముగను
శయనించె నందు వత్సరములు పెక్కులు
నారములఁ శయనంబు సేయు
కతన నారాయణాఖ్య వహించె నాతని
మహిమంబు దెలుప నేమాత్ర మందు

తే. ఆతఁ డొక్కఁ డయ్యు దేవాదు లైన
పెక్కురూపములం బొందఁ బెరిమఁ జేసి
యోగతల్పమునం దుండి యొరిమ లేచి
తలఁచినంతన నంతయు వెలయఁ జేసి. 131

వ. అనంతరం బతండు స్వసంకల్పంబున జతుర్ముఖుండై స్వశరీరభూతం బైన చిదచిదాత్మకకారణద్రవ్యంబునఁ గరణజ్ఞాతృజ్ఞేయముల సృజించి ప్రాణవ్యాపారము చేయుచుండెఁ బ్రాణవాయువువలన నోజోబల ధర్మంబులు గలిగెఁ బ్రాణవాయువే సర్వేంద్రియమూలాధారభూతం బా ప్రాణవాయువుచలనంబున హృదయజఠరాగ్ని ప్రజ్వరిల్లు దాన నాఁకలియు దప్పియునుం జనించు. దానిం దీర్పఁ గోరిన నాస్యం బుత్పన్నం బయ్యె నంత రసనేంద్రియం బై నంత షడ్విధరసంబులుం గలిగెఁ బిమ్మట ముఖంబువలన వాగింద్రియంబును నధిష్ఠానదేవతయగు నగ్నియు నుత్పన్నంబు లయ్యె. అంత నా విరాట్పురుషుని కంఠమున వాయునిరోధంబు గలుగుటం జేసి దాని చలనంబునకు నాశిక జనించె. గంధగ్రహణార్థము ఘ్రాణేంద్రియ ముత్పన్నం బయ్యె. సర్వార్థదర్శనార్థము నేత్రేంద్రి

యము సూర్యునితోఁ గూడ నుద్భవం బయ్యె నవ్వల శబ్దగ్రహణా
ర్థము కర్ణేంద్రియ ముదయించె నంత వస్తుమృదుత్వాదు లరయ
నింద్రియంబులును చర్మంబును బుట్టె దానివలన లోమంబు లుద
యించె నంత బహువిధకర్మకరణదక్షంబు లగుకరంబులుఁ బాదంబులునుం
బుట్టె నవ్వల బ్రజాపతిదేవతాకం బైనభోగాదిసౌఖ్యోపభోగంబు
లగుగుహ్యావయవంబులు పుట్టె నంత గుదస్థానంబును నాభియుం
జనించె నంతఁ బానాదిధారణార్థ మాంత్రకుక్షి నాడీనివహంబు
పుట్టె నవలఁ గామసంకల్పస్థానం బగుహృదయంబు పుట్టె దానివలనఁ
జంద్రికామసంకల్పంబు లుదయించె నంతఁ ద్వక్చర్మమాంసరుధిరమే
దోమజ్జాస్థులును సప్తధాతువులు పృథివ్యప్తేజోమయంబు లైనయింద్రి
యంబులు నహంకారంబులుం బుట్టె నంత సగుణంబును సర్వవికార
స్వరూపంబులును మనస్సు విజ్ఞానరూపిణి యగుబుద్ధియునుం బుట్టె.
ఇట్లు భగవంతునిబహిరార్వ్యావృతం బగుస్థూలరూపంబు సంగ్రహంబు
గం జెప్పితి నింక నవ్యక్తంబును నాదిమధ్యాంతరహితంబు నిత్యంబు
నగుసూక్ష్మరూపంబు గల దది యవాఙ్మానసగోచరంబు మఱియు
నాచతుర్ముఖుండు ప్రజాపతులను మనువులను వసువులను దేవతలను
ఋషులను బితృగణంబులను సిద్ధచారణగంధర్వులను విద్యాధరయక్ష
గుహ్యకులను గిన్నరుల నప్సరసలను నాగులను గింపురుషులను
బూతుషులను రక్షఃపిశాచాదులను భూతభేతాళకూష్మాండాదులను
పశుపక్షిమృగాదులను నానావిధజంతుసంతతులను విధాతృరూపం
బున సృజించి విష్ణురూపంబునఁ బాలించి రుద్రరూపంబున నిరాకరించు
నని యెఱింగించి యిట్లు నీకు సంక్షేపంబుగఁ జెప్పితి నవల మఱియు
విపులంబుగం జెప్పెద మఱియుఁ బ్రళయ మహాప్రళయ లక్షణంబు
లును గాలకల్పలక్షణంబులును నపుడ వినవచ్చు నని శుకుండు
పరీక్షిత్తునకుం జెప్పె నని చెప్పిన శౌనకుండు సూతుం జూచి భాగవ
తోత్తముం డగువిదురుండు సర్వంబును విడిచి తీర్థాటనంబు గావింప

జని వచ్చుచు నొక్కచో మైత్రేయుం గని వానివలన నధ్యాత్మ
తత్త్వం బెఱింగికొనియె నని వినియుంటి మాయాప్రకారం బంతయు
నెఱింగింపు మని యడుగుటయును. 132

ద్వితీయస్కంధాంతము.

ఉత్సాహము. సాగివంశ మనఁగనొప్పు సన్నుతోన్నతోల్లస
త్సాగరంబునందుఁ జంద్రసదృశుఁడై జనించి స
త్త్యాగముం దలిర్పఁ జేయు పొల్పుగల్గి వేదశా
స్త్రాగమేష్టుఁ డైనసూర్యుఁ డాఢ్యుఁడై తలిర్చెడున్. 133

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందు
ద్వితీయ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

శ్రీకృష్ణభాగవతము

తృతీయస్కంధము

—:0:—

క. శ్రీమత్సాగికులాంబుధి
సోముండై రాజలోకసోముండై సు
త్రామసమవైభవుండై
భూమీశుం డైనసూర్యుఁ బ్రోవుము దేవా !

వ. అవధరింపు మక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. నట్లు చెప్పి శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునిదిక్కు మొగంబై నరేంద్రా ! నీవు నన్నడిగినచందంబున మున్ను రాయబారియైవచ్చిన శ్రీకృష్ణుని నిరాకరించిన సందర్భమునఁ దాను బలికినపలుకుల కలుకం జేసి చెండనాడిన దుర్యోధనాదుల రోసి తీర్థాటనము చేయుచున్న విదురుండు దర్శన మిచ్చినమైత్రేయుఁ దిలకించి పెక్కువిషయంబులుఁ బ్రశ్నించె నవి చెప్పెద నవహితుండ వగు మనిన నతం డతనిదెసకుం దిరిగి మునీంద్రా ! విదురుం డేమిటికిఁ దీర్థాటనంబు గావించె శ్రీకృష్ణునిరాయబారం బెట్టిది వానిని వారు నిరాకరించిన చందం బెట్టిది వివరించి చెప్పు మనిన శుకుం డి ట్లనియె. 2

—♦ శుకుఁడు కురుపాండవవైరాదికముం జెప్పుట ♦—

మ. ఘను లాపాండవధార్తరాష్ట్రులకు లోకవ్యాప్తభేదంబు రా
ధనలోభంబున రాజ్యకాంక్షమెయి జూదం బయ్యె నద్దానిచే
వనవాసంబు ఘటిల్లెఁ బాండవుల కాపై వారి కాలంబు వ
చ్చెను దత్సర్వము ప్రస్తుతింపఁబడియెఁ శ్రీభారతాఖ్యానమై. 3

సీ. పాండుభూపతి తొల్లి ప్రవ్రజితుం డయి
తనయులఁ గని కానఁ దనువు విడిచె

మునులు పాండవులను బురమునకుం దెచ్చి
ధృతరాష్ట్రునకు నివేదించి చనిరి
వేదమునన్ ధనుర్వేదమునన్ వారు
విద్వాంసులై జగద్వేద్యు లయిరి
ధార్తరాష్ట్రులు పాండుతనయుల కల్మికి
సైప కీర్ష్యాకులస్వాంతు లైరి
ఆ. తోడరి కర్ణశకునిదుశ్శాసనాదుల
దుష్టబోధఁ జేసి దుష్టుఁ డాసు
యోధనుండు వారి కుఱక యొగ్గులు సేసె
రాజ్యలుబ్ధుఁ డగుచు రమణ చెడఁగ. 4
చ. అలసి నదీసమీపమునయం దొకచో నిదురించుభీమునిం
బొలుపఱ నంటఁ గట్టి జలపూరమునం బడఁ ద్రోచియుం గడున్
సిలుగుగఁ గృష్ణసర్పములచేఁ గఱపించియు భోజనంబునం
గలిపి విషంబు వెట్టియును గాఱియ వెట్టిరి వారు చెట్టలై. 5
ఆ. బలము దైవబలము కలిమి నాభీముండు
బ్రదికె నీటఁ బడియుఁ బ్రబలవిషముఁ
దినియు నంగసంధులను గోడెత్రాఁచుల
గములచేతఁ దద్ద కఱవఁబడియు. 6
తే. ప్రబలి ధృతరాష్ట్రనందనుల్ పాండవులకుఁ
జేయునపకారములు దుష్టచిత్తునకును
జేయునుపకారములు వోలెఁ జెన్ను దఱిగి
వ్యర్థముల య్యె నొగి దైవబలముకలిమి. 7
చ. త్రిదివమునందు నుండియును దేవవిభుం డటు ప్రాణికోటులం
బొదలఁగఁ జేయునో సుఖము పొంపిరి వోవఁగ నెందు నుండియున్
విదురుఁ డొకండు వారి నెఱు పీఁగ కపాయములం దొలంచుచుం
బొదలఁగఁ జేయుచుండె నటఁ బోల నుపాయములన్ ఘటించుచున్.

మ. ♦ధృతరాష్ట్రానుమతిన్ సుయోధనుఁడు కుంతీపుత్రులం గూల్పఁగా
జతుగేహం బది వారణావతమునన్ సంధించి బంధుత్వమున్
మతిలో నెంచక వారి నుంచి యట హోమంబుం బొనర్పంగ ను
న్నతకీర్తిన్ దాని నెఱింగి వారు మృతికి న్గాకుండి రాయుష్మతిన్. 9

ఆ. నడికి రేయిఁ జిచ్చు వడి దరికొలుపంగ
నున్నవానితోడ మున్న లక్క
యిల్లు గాల్చి భీముఁ డేగె సొరంగంబు
వలనఁ గొంచును దనవారి నెల్ల. 10

వ. అంతఁ బాండవు లొరు లెఱుంగకుండ బ్రాహ్మణవేషములు వైచి
కొని తల్లితో నేకచక్రపురంబున నుండి రపుడు భీమసేనుం డట
బకాసురుం జంపి యటనుండి కాంపిల్యపురంబునకుం జని స్వయంవరం
బునం ద్రౌపదిం బరిగ్రహించి యట నొకసంవత్సరం బుండి ధృతరా
ష్ట్రానుమతంబున నర్ధరాజ్యంబు వడసి ఖాండవప్రస్థపురంబునఁ బెక్కు
వర్షంబులు రాజ్యం బేలునప్పుడు పాండవులమహావైభవంబునకుం
జూపోపక దుర్యోధనుండు మాయాద్యూతంబు గల్పించి పాండవే
యులం బరాజితులం జేసి పదిరెండేండ్లు వనవాసము నొక్కయే
డజ్ఞాతంబును జేయునట్లు సమయంబు చేసిన వారును వారు చెప్పిన
చొప్పున సమయంబు దీఱిచి వచ్చి తమసగపాలు తమ కిమ్మని
వేఁడుచు ధార్తరాష్ట్రుల పాలికి శ్రీకృష్ణునిం రాయబారిగం బుచ్చిన
నతం డట కరిగి నిండుకొలువులో ధృతరాష్ట్రునిదిక్కు మొగంబై
యి ట్లనియె. 11

చ. తనకనినట్టిబిడ్డలను దమ్మునిబిడ్డల నొక్కరీతిఁగా
మనమున నెన్నఁగాఁ దగుదు మానవధర్మవిదుండ వొడ్లు చె
ప్పన పని యున్నె నీ కెఱుక వచ్చునదే కదె పాండుపుత్రకుల్
పొనరిచి వచ్చి రాసమయముం బదుమూఁడగువత్సరంబులున్. 12

♦ ఇట హోమము బొనర్చె ననఁగా గాల్చిపుచ్చె నని లక్షణార్థము.

క. తమసగబాలిమ్మని భీ
ష్మముఖుల్ వినుచుండ నిన్ను సంప్రార్థింపన్
సముదాచారము నడపఁగఁ
బ్రమనులరై పుచ్చి రిట్లు ప్రభువర్య! ననున్. 13

మ. అటు కాదేనియు మీఁదుమిక్కిలి యగున్ బ్రాణంబు లాశింప ర
చ్చటివారల్ కదనం బగున్ బ్రజయు నాశం బంది పోవున్ సమ
స్థటచిత్తంబున సంచరింపు మని కృష్ణుం డిచ్చె వాకిచ్చినం
గుటిలాత్ముల్ విన కెక్కసక్కెములు పల్కుల్ పల్కి రత్యుద్ధతిన్.

వ. కృష్ణుండును సంధికార్యము పొసంగమిం బ్రయాణోన్ముఖుండై మఱి
యుం జెప్పవలసినంత చెప్పి యెల్లర నామంత్రణంబు చేసి చనియె
నప్పుడు ధృతరాష్ట్రుండు విదురుం బిల్చి మంత్రాలోచనంబు గావిం
చిన నతండు వానికి ట్లనియె. 15

మ. పదుమూఁడేడులు పాయఁజేసి తమపాల్ ప్రార్థించుచున్నారు ని
త్యదయోపేతులు పాండునందనులు మీ రవ్వారిపాల్ వారికిన్
ముద మొప్పారఁగ నిచ్చిపుచ్చుటలు పెంపుం గూర్చెడి న్నీకు నీ
విదితార్థంబున నింత యేమిటికి వార్వీ ర్చెప్పఁగా నేటికిన్. 16

మ. అనుకొన్నట్లు క్రియాకలాపములు చేయం బూనకున్నంత క్రో
ధనుఁ డాభీముఁడు సింహ మట్లగుచు నీదాయాదులం బట్టి నె
ట్టన లేళ్ళం బలెఁ జీల్చి వైచెడిని గట్టా! యట్లు గాకుండ నీ
వు నయం బేర్పడఁ గార్యముల్ నడపుటల్ పోలున్ మహీవల్లభా.

సీ. దేవదేవుఁడు వాసుదేవుఁడు వారికిం
దోడునీడయి యుండు పీడ కెప్పుడు
దేవతలున్ భూమిదేవతల్ వారికి
మేలు గోరుచునుండ్రు మేదినీశ
పొందు పొసంగింపఁ బూని వచ్చినపురు
షోత్తముని న్నీడు నుత్తమసుతుఁ

డగుఁ గా దనక తూల నాడె నింతయు విని
యీ పూరకుంటి వేమొ యనక

తే. ఆతఁ డీరేడుజగముల నాఁ యనంగ
భస్మసాత్కృత మొనరించుప్రజ్ఞఁ గలఁడు
నీదుసిరి యిట్టిపట్టున నిల్చు ననుచుఁ
దలఁప నేర్ బెద్ద లగువారు తలఁపఁ బోరు. 18

తే. తులసివనమున గంజాయి మొలచినట్లు
నీకు దుర్యోధనుఁడు పుట్టె నీకుమార
రూపదవమున నీవంశ మేపు దఱుగుఁ
గావునన్ వీనిఁ ద్యజియింపఁ గార్యమిపుడు. 19

వ. అని పలికిన దుర్యోధనుం డతిక్రోధకషాయితాక్షియుగళుండై కట
కటంబడి కటంబు లదరఁ గొలువు గలయం బరికించి యి ట్లనియె. 20

ఉ. వేఁడుర వీని నీసభకుఁ బిల్చినవాఁ డిటు కన్నగాన కీ
పాడునుడుల్ వచించెడిని బాపకిరాతుఁడు వీఁడు వీనికిం
గూ డిడి సాఁకు వారిపయిఁ గ్రోధముఁ జేయుచు శత్రుపక్షమున్
బాడుచు ధర్మపన్నములు పల్కుచునుండెను వేత్తయో యనన్. 21

ఆ. దాసికొడుకు వీఁడు తగ వాడ వచ్చెను
నన్ను వెడల నడవఁ గొన్ని చెప్పి
వీని నగరునుండి వెడలింపుఁ డని నాదు
నాజ్ఞ దెలుపుచుంటి నడపుఁ డట్లు. 22

వ. అని కర్ణశల్యాదుశ్శాసనాదులమతంబునం బలికినపలుకులు ములుకులై
చెవులు సోఁక విదురుండు నొచ్చికొనుచు ధృతరాష్ట్రుం డంతయు విని
ప్రల్లదంబు లాడుకొడుకు వారింప కూరకున్న నచట నిమిషమాత్రం
బు నిలువ నొల్ల కల్లన లేచి స్వగృహంబునకుం జనియు నప్పురం
బుననుండుటకు నిచ్చ చేయనివాఁడై తీర్థయాత్రల నెపంబునం జేసి
కరినగరంబు విడిచి సహస్రమూర్తి యగుహృషీకేశుండు వేంచేసి

యున్న పుణ్యక్షేత్రంబులు వనంబు లుపవనంబులు పర్వతంబులు సరో వరంబులు నదీనదంబులు లోనగుననేకతీర్థంబులు సేవించుచు నెల్ల తీర్థంబులఁ గ్రుంకు లిడుచు వల్కలాదులు గట్టి యధశ్శయనంబు గావించుచుఁ దెలిసినవారికైనం దెలియరాని వేషంబునఁ దిరుగాడుచు నియమవ్రతంబులు నిర్వర్తించుచు నెల్ల భారతవర్షంబుఁ గలయం గ్రుమ్మరుచుఁ బ్రభాసక్షేత్రంబున కేగుదెంచి యచ్చటిప్రజలసంభాషణంబులం జేసి. 23

సీ. పొందు పొసంగమిఁ బురుషోత్తముఁడు వచ్చి
వచియించుటం జేసి పాండవులును
గౌరవులును రాజ్యకాంక్షమై నొండొరుల్
సంగ్రామరంగము సలిపి రనియు
నుభయసేనలఁ జాల యున్నవా ర్వదిమంది
యనియు భీష్మాదులు హతుల యనియుఁ
బాండవాగ్రజుఁడు భూభారంబుఁ గొని కృష్ణు
ననుమతి నేలెడు ననియును విని

తే. బంధుమరణమునకుఁ జాలఁ బరితపించి
యింతలో శాంతి వహియించి యీశ్వరేచ్ఛ
కచ్చెరువు నొందువాఁ డయి యరిగె పడమ
రగ సరస్వతి ప్రవహించుజగతి కడకు. 24

వ. అమ్మహానదిం గలత్రితతీర్థము నుశనస్తీర్థము మనుతీర్థము పృథుతీర్థము నగ్నితీర్థము నసితతీర్థము వాయుతీర్థము నుదానతీర్థము గోతీర్థము గుహాతీర్థము యమతీర్థము లోనగుతీర్థంబులు సేవించి మఱియు నందందు శ్రీవిష్ణుశంఖచక్రాదిలాంఛనంబులం బొలుపారుదివ్యాలయంబులం బ్రతీక్షించుచుం జని చని సురాష్ట్రదేశంబును మత్స్యసౌవీర కురుజాంగలదేశంబులు నతిక్రమించి యమునానదిం బఱియఁ నరిగి యట నొకచోఁ బరమభాగవతోత్తరుండు ప్రశాంతస్వాంతుండును

బృహస్పతికిఁ బ్రియశిష్యుండు నగునుద్ధవునిం గాంచి గాఢాలింగనంబు గావించుకొని విశ్రమించియున్నయప్పు డతని కిట్లనియె. 25

—♦ విదురుఁ డుద్ధవుంగని కుశలప్రశ్నము చేయుట ♦—

మ. ధరణీభారము వాయఁ జేయుట కమర్త్యప్రార్థనం జేసి మా
ధుర దేశంబునఁ బుట్టి క్రూరులు జగద్ద్రోహుల్ నశింపఁగా మహో
త్తరకార్యంబు లొనర్చి పేర్చినమహోదారుల్ యశోదాశుభో
దరసంభూతులు రామకృష్ణులు శుభోదర్కంబు గా నుండిరే. 26

సీ. పురుషోత్తముల గర్భమునఁ గన్న దేవకీ
వసుదేవులు కుశలపరిధితులు కద
యాదవసేనల కధినాథుఁ డైనప్ర
ద్యుమ్నుఁడు కుశలియై యున్నవాఁడె
యదువృష్ణిభోజదాశార్హ విభుం డుగ్ర
సేనుఁడు సుఖియయి చెలఁగు నొకో
మున్ను కుమారుఁడై యెన్నికం గాంచిన
సాంబుఁడు క్షేమము నంది యున్నె

తే. అర్జునునిఁ గొల్చి విలువిద్య నభ్యసించి
నేటి యైనసాత్యకికిఁ సేమ మోటు కృష్ణ
భక్తి భరితుఁ డక్రూరుఁడు భద్రగదులు
పొదలుదురె చెప్పు ముద్ధవా ముదము పొదల. 27

వ. మఱియుఁ బ్రద్యుమ్ననందనుండును శస్త్రాధిష్ఠానదేవత యనం బరఁగినయనిరుద్ధుండును సత్యభామాసుతుండు చారుదేష్ణుండు గదుఁడు లోనగువారును శ్రీకృష్ణాంగనలును క్షేమంబుగ నున్నవారె. 28

శా. తనధర్మాంశమునన్ ధరాతలమునన్ ధర్మంబు మూర్తీభవిం
చినచందంబున నై పరివర్తిలుచు నేజీంద్రంబునం దైన శాం
తినిఁ గోల్పోనివరితంబునన్ మెలఁగుకుంతీనందనాగ్రణిండు వి
పరినుతుండై ధర యేలుచున్ సుఖమునన్ వర్తించునే యుద్ధవా. 29

మ. బకకిమ్మీరహిడింబముఖ్యదనుజవ్రాతంబులన్ వ్రేల్మిడిన్
గకుబంతంబులు మ్రోయ శౌర్యమున నుగ్రంపశ్యుఁడై కూల్చి పెం
పుకముల్ లోకమునందు నిల్పినమహోత్సుంభత్ప్రభావుండు వా
యుకుమారుండు వృకోదరుండు సుఖియై యున్నాఁడె వృష్ణిప్రభూ.

మ. తిగకంటన్ జగమేర్చునట్టిగిరిమున్ దీపించుభూతేశుతోఁ
దెగువం బోరొనరించి తత్కరుణ కాధేయంబ వై లోకమం
దు గణింపంబడి కాలకేయుల నస్త్రిన్ దున్మాడి వృష్ణీష్టుఁడై
తగుభీభత్సుఁడు సేమముం గలఁడవై తళ్కొత్తునే మాధవా. 31

శా. నాసత్యాంశమునన్ ధరాతలమునన్ బాండుక్ష్మాజాని సం
తోసంబుం గొన నాత్మజన్ము లగుచుం దోపంగనై సోదర
వ్యాసంగంబున వన్నె కెక్కినకవల్ ప్రాప్తాధిపత్యంబునన్
వాసిం గాంచి మెలంగుచుండిరె పృథాభవ్యాదరం బేర్పడన్. 32

వ. లోకోత్తరు లైనకుమారులం గన్నతల్లి కుంతియు శౌర్యనిధు లై దేవ
సన్నిభు లైనపతులం బడసినద్రౌపదియుఁ గృష్ణభగవానునకుం జెల్లె
లును విజయున కిల్లాలు నగుసుభద్రయు లోనగువా రందఱు
క్షేమంబుగ నున్నవారే యని మఱియును. 33

ఉ. ఆడిన దాటగాఁ దనదునాత్మజు నెగ్గఁగఁ జేయు చందునన్
గీ డగునంచుఁ జెప్పినను గించు తెఱంగున సంచరించుచున్
వేడివెలార్చుదుఃఖమున వేఁగుచు నుండెడునాంబికేయుఁ డీ
నాఁడు సజీవుఁ డేకద వినం దలపోయుదుఁ జెప్పు ముద్ధవా. 34

వ. అని విదురుం డడుగుచున్న వాని కెట్లునుం జెప్పఁ జాల కుద్ధవుండు
తన కైదేండ్లప్రాయమునఁ దోడిబాలురతో నాడునప్పుడు కృష్ణ
చర్యారూపంబు లైనయాటలాడుచుఁ దల్లి కుడువ ర మ్మనినం బోక
కృష్ణుని సేవించుచుండువాఁడు గావునఁ గృష్ణనిర్యాణంబు తలంపునకు
రా మే నెల్లఁ గంపింపఁ జెప్పుటలు జాలువాఱఁ గన్నుల న్నీళ్ళు
కాల్వలై ప్రవహింప నో రెండుకొనిపోవఁ బెదవులు కంపింప శ్రీకృష్ణ

భక్తియోగనిమగ్నమానమానసుండై యొడ లెఱుంగ కింతతడ వేమియుం బలుకక నేర కుండి హు స్సురనుచు వెట్టనూర్చుచుఁ బేర్చిన దుఃఖంబున వెక్కి మ్రింగుచు భగవల్లోకమునుండి క్రిందికి మనంబుం దిగిచి గద్గదకంఠుండై కొంతసేపటికిఁ గొండొక్కమాటగా విదురునిం దిలకించుచు ని ట్లనియె. 35

—♦ ఉద్ధవుఁడు కృష్ణనిర్యాణముం దలంచి దుఃఖించుట ♦—

ఉ. ఏమని నీకు మాకుశల మిప్పుడు చెప్పుదు నోయి క్షత్త ! మా
భూములు మాగృహంబులసమున్నతి మాసకలార్థసిద్ధులున్
భూమి నడంగి పోయినవి ముజ్జగముల్ దలపోయ నిప్డు నీ
ర్వామిని మున్గిపోయిన తెఱంగునఁ గానఁగ వచ్చు నక్కటా. 36

ఉ. చెప్పఁగ నోరు రా దిపుడు చెప్పు మటంచును నీవు వల్కుటన్
చెప్పక యుంటయుం దగదు చెప్పఁగ నే మగు మాయుపాధు లీ
చొప్పున నాశ మయ్యె నని చొంగలు గ్రుక్కుచుఁ జెప్పుచుంటి నో
యప్ప నిఁ కేమి చెప్పెద సమస్తము శూన్యము శూన్య మిత్తఱిన్.

శా. ఆడెందంబున నుండు వాఁడ నగుటన్ రారాపులన్ సైఁచి నే
నీడం బోవక చెప్పుచుంటి విదురా! యే మందు ముల్లోకముల్
పాడై పోయెడుకాల మయ్యె నయొ మాపాలుండు గోపాలుఁ డా
క్రీడారత్నము మాయ మయ్యె జగముం గింపాకముం జేయుచున్.

తే. ధర్మజునిరాజసూయము తరుణమందుఁ
బరమవిద్వేషి యగుశిశుపాలునకును
గరుణ ముక్తి నొసంగినపరమపురుషు
విరహము సహించి యుండుట భరము గాదె. 39

ఉ. పూతనచన్నుదోయి విషముం గొని పా లిడి చంప రాఁగ న
ప్పాతకవంతురాలిచనుఁబాలను గ్రోలియుఁ దాను చావ కా
ఘాతుకురాలికిన్ సుగతి గల్గఁగఁ జేసిన బాలకృష్ణునిన్
జేతమునన్ భజింప కొకచెట్టఁడు నేనియుఁ బుట్టి యుండునే. 40

ఉ. తామరచూలి ప్రార్థనను దా వసుదేవునియింటఁ బుట్టి యున్
దామసుఁ డైనకంసుఁ డనుదైత్యునిభీతిని గొల్లపల్లెలో
నామెయిఁ జేర్పఁగాఁ బడియు నయ్యవనిం బదునొండువర్షముల్
రామునిఁ గూడి క్రీడల విరామము లేనటు విస్తరించుచున్. 41

సీ. గోపాలబాలురం గూడి గంతులు వేయు
చాడుచుఁ బాడుచు నడవులందుఁ
దిరుగుచు జలకేళిఁ దేలుచుఁ గ్రేపుల
మేపుచు వయసింత మీఁదఁ బడఁగ
వేణుగానము చేసి వ్రేతలమనములు
చూఱలాడుచుఁ దన్నుఁ జేర వచ్చు
మాయావు లగువారి మట్టువెట్టుచు మహో
ద్భుతకార్యముల వెన్నో పొనరుచుచును

తే. బాలకృష్ణుఁడు వర్తించి కాళియాహి
నుక్కడంచి గోవర్ధన మొక్కకేల
నెత్తి గోగోపగణముల నేలినట్టి
వరదు విడి యుంటి జీవచ్ఛవం బనంగ. 42

ఉ. వెన్నెలరేయి వేడ్కమెయి వ్రేతలు వేగురు గూడి యాడుచోఁ
గ్రొన్ననవిల్తువేడుకలఁ గూర్చెడువాఁడును బోలె మోదులన్
గ్రొన్నన లెత్త వేణువునఁ గ్రొత్తచవుల్ జనియింప నూఁదుచున్
విన్ననువొప్ప నొప్పునలవెన్నుఁడు గన్గొన లేక పోయెఁ గా. 43

మహాస్రగ్ధర. తనతల్లిం దండ్రి బందిం దగిలిచినఖలుల్ దన్నుఁ జంపంగ నెన్నే
పనులం గావించి క్రూరత్వమునను జగతి న్బాధలం గూర్చువానిన్
జననింద్యుం గంసు నొక్కంజన చనియిలపై జావఁగాఁ జేసి లోకం
బునఁ బేర్మిం గొన్నవాని న్మునిజనహితునిం బుచ్చి జీవింతు నయ్యో.

సీ. చదివి సాందీపని చచ్చినసుతుఁ దెచ్చి
గురుదక్షిణ యొసంగె గరిమ మెఱయ

శిశుపాలముఖ్యులఁ జెండి రుక్మిణిఁ దెచ్చి
పితృదేవతలు మెచ్చఁ బెండ్లియాడె
నాగ్నజిత్యాదుల నారులం బెక్కుర
బెండ్లియాడెను జగద్విశ్రుతముగ
భీమసేనునిచేత భీము జరాసంధుఁ
జీల్పించి రాజులచెఱలు వాపె
తే. నారదుఁడు తెచ్చి యిచ్చినపారిజాత
సుమము రుక్మిణి కీ సత్య చూచి సైఁప
కున్నఁ గని స్వర్గమున కేగి యుర్వి కల్ల
వృక్షముం దెచ్చె వాని నే నెట్లు మఱతు. 45
ఆ. తనకు మేనయత్తతనయులు పాండవుల్
వారిపక్ష మగుచుఁ గౌరవాళి
హాత మొనర్చి ధర్మసుతుచేత మూఁడశ్వ
మేధముల నొనర్ప మిసిమిఁజేసె. 46
తే. గురుసుతుని యస్త్రబలమునఁ గూలునట్టి
యుత్తరాగర్భమును గాచి యూడి పోవు
పాండవాన్వయమును నిల్పెఁ బరమపురుషుఁ
డట్టికృష్ణుఁడు లేనియియ్యవని యేల? 47
చ. వసుధకుఁ గల్గుభార ముడుపం బ్రభవించి కురుప్రజావళిన్
వెసఁ బరిమార్చి యంతటన విశ్రమ మొందక యాదవావళిన్
ముసలము కారణంబున సమూలము పెల్లగిలంగఁ జేసి తా
నసదృశతేజుఁ డయ్యు వనమం దొకచో విడనాడె దేహమున్. 48
వ. అట్టియెడ నే నమ్మహాత్ముని సందర్శనంబు గావించిన నన్ను గార
వించె నప్పు డటకుఁ బరమభాగవతుం డైనపారాశర్యసఖుండును బర
మసిద్ధుండు నైనమైత్రేయుండు యదృచ్ఛమైఁ జనుదెంచినం బుండరీ
కాక్షుండు లేనగ వాననసీమ నంకురింప నాతండు వినుచుండ నన్నుం
గాంచి. 49

సీ. విను ముద్ధవా ! నీవు మునుపటిబామున
వసువులలో నొక్కవసువ వరయ
యప్పు డందఱుం గూడి యాచరించెడిసత్రి
మం దీవు ప్రార్థించి తర్థి వగుచు
నీమదిం గలకోర్కి నే నెఱుంగుదు నది
యితరదుర్లభ మైన నే నొసఁగుదు
నరలోకమును వీడి పరమపదంబున
కరిగెడుతఱి నన్ను నరయ నైతి
తే. నాయనుగ్రహపాత్రమ వై యలరితి
వింక నీకుఁ బునర్జన్మ మెప్పుడు లేద
యిదియ కడపటిజన్మ మోవృష్ణివర్య !
ధన్యుఁ డైతివి నీవు నాదర్శనమున. 50
తే. సృష్టికాలమున న్నేను సృష్టనాభి
కమలమం దున్న యప్డు తత్త్వము నెఱుంగఁ
జేసితి నది భాగవతమై చెన్నుమీఱె
నీదుమది కిప్పు డది తోఁచి నెఱి పొనర్చు. 51
వ. అని పరమాదరంబునం బలికినపరమేశ్వరునిపలుకుల కానందతరంగితాంతరంగుండ నై పులకాంకితగాత్రుండ నై నేత్రకోణంబుల బాష్పధారాపూరంబు వెల్లివిఱియ డగ్గుత్తిక వెట్టి యి ట్లని విన్నవించితి. 52
మత్త. నీదుపాదము లాశ్రయించిననిర్మలాత్ముల కెప్పుడున్
మోద మింతని చెప్ప నొప్పదు మోక్షమేనియు వా రెదన్
కాదు కా దని త్రోసిపుత్తురు కంజలోచన నాకు నీ
పాదసేవ యొకండు దక్కఁగఁ బ్రాఁతి గా దెది యేనియున్. 53
సీ. నిష్క్రియునకు నీకు నెఱిమీఱుఁ గర్మము
జన్మరహితునకు జన్మ మయ్యెఁ
గాలరూపుఁడు నీకుఁ గాలాదిభయ మగుఁ
బరమాత్మునకును స్త్రీబహుళసేవ

పరమాత్మబోధసంభరితునకు నీకు
ననుఁబోంట్లకోడ మంత్రివయుఁ బొనర్చు
టరయఁ బండితులకే నచ్చెరు వుదయించు
సర్వాత్ముఁడవు నీవు సర్వసాక్షి

తే. విట్టిపరమేశ్వరుఁడవు సర్వేశ్వరుఁడవు
నీదులీలలు గణియింప నేను గాదు
బ్రహ్మముఖ్యులు చాల రోపరమపురుష
నను దరిం జేర్ప నీ కిదే నతి ముకుంద. 54

వ. అని ప్రార్థించినం బ్రసన్నుండై పరమేశ్వరుండు నన్నాదరించి పర
మాత్మతత్త్వం బుపదేశించి యంపిపుచ్చిన నే నమ్మహాత్మునకుఁ
బ్రణమిల్లి ప్రణుతుల నర్పించి తద్వియోగంబు సైపనివాఁడనై యిం
తింతనరానియట్లు చింతించుచు నెట్టకేల కప్పురాణపూరుషుని వీడ్కొని
తదీయదివ్యక్షేత్రం బయిన బదరికాశ్రమంబునకుం బోవుచుంటి ననిన
విదురుం డోర్వరానిసుహృద్బంధువియోగంబునకుఁ గొండొకవడి
శోకించి సహజవిజ్ఞానంబున దైవతంత్రంబునకు వగవం బని లే దని
తనకుఁ దాన యుపశమిల్లి పరమభాగవతోత్తముం డగునుద్ధవునిదిక్కు-
మొగంబై యి ట్లనియె. 55

తే. నీకుఁ బరమేశ్వరుఁడు కృపఁ గా నేర్పినట్టి
యాత్మతత్త్వము నాకు దయార్ద్రహృదయ
తామరసుఁడవై చెప్పు ముద్ధవ! భవాబ్ధి
శు లలఁతుల నేలనే కదా మెలఁగుచుందు. 56

మ. అనుడుఁ విష్ణుపదార్చనాభిరతుఁ డా యుద్ధవుం డాతనిం
గని నీపైఁ గృపఁ జేసి కృష్ణుఁడు సమక్షంబందు మైత్రేయునిం
గనుఁగొంచు న్నినుఁ జేర వచ్చు విదురాఖ్యాతుండు నాభక్తుఁ డా
తని కీతత్త్వ మెఱుంగఁ జేయు మనియెం దాత్పర్య మేపారఁగన్. 57

వ. కావున నీ వమ్మునిని నుపాసించి కృష్ణోక్తం బగునధ్యాత్మవిద్య నధిగ
మింపు మని చెప్పి హరికథాసల్లాపంబుల నింత తాపంబు చల్లార్చు
కొనుచు నా రేయి విదురునితో నుద్ధవుండు కాళిందీపులినతలంబునన్
శయనించి మరునాఁ డరుణోదయంబున విదురు నామంత్రించి బదరికా
రణ్యంబునకుం జనియె నని రాజేంద్రుండు మునీంద్రున కి ట్లనియె.

మ. అనఘా ! యాదవు లందఱున్ మఱియుఁ గృష్ణాదుల్ ధరం బాసి పో
యినపై నుద్ధవుఁ డేటి కట్లు మిగిలెం బృథ్వీస్థలిం జెప్పవే
యన నాతం డను గృష్ణుఁ డేగుచును దత్త్వార్థంబు తా నేగ నే
గునొ యం చాతని నిల్పెఁ బోల్పెసఁగ రాఁ గోర్కెఁ బ్రదర్శించుచున్.

వ. అట్లు నియోగించినఁ గృష్ణతత్త్వంబు లోకంబున దృఢీకృతం బగునంత
వఱకుం బ్రచారంబు సాఁగింప దేహత్యాగంబు సేయకుండె న
ట్లుద్ధవుం డరిగినపదంపడి విదురుండు భగవంతుం డవతారంబు చాలిం
చుచుం దనపైఁ జూపినపరమాదరంబున కత్యంతానందంబు నొందుచు
నటఁ గొన్నినా ళ్ళుండి పయనంబై గంగాద్వారంబున సుఖాసీనుండై
యున్నమైత్రేయమహామునీంద్రునికడ కడకువం జని ప్రణమిల్లి త
న్నెఱింగించి యి ట్లనియె. 60

— విదురుం డుద్ధవు వీడ్కొని మైత్రేయుని దర్శించుట —

తే. సంసృతిమహార్ణవంబునఁ జచ్చి పుట్టి
సుఖము దుఃఖము నొందుచు నుదయు మొదలు
లేక యుండెడుమాయట్టిలోకులకును
జేయఁ దగుకార్య మెద్దియో చెప్పు మనఘ. 61

క. మాయట్టిప్రకృతిపురుషులఁ
బాయక రక్షించుపొంటె పరమర్షివరా
మీయట్టిపుణ్యమూర్తుల
నీయుగమున నిలిపి పోయెఁ గృష్ణుం డనఘా. 62

క. కావున సుఖరూపం బై
భావింపఁగ నచ్చుపథము పలుకుము నే మ
ట్లావిష్ణుఁ గొలిచి యజ్ఞా
నావృత మతిఁ జక్కఁ జేయ నాశింతు మొగిన్. 63

వ. మఱియు మాయామయుం డైనభగవంతుండు పురుషావతారము లెత్తి యేయేకర్మము లాచరించెఁ దా నిరీహుం డయ్యు నీవిశ్వ మెట్లు సృజించె నెట్లు పెంచె నెట్లు త్రుంచె నీశ్వరుండు తా నొక్కరుం డయ్యు నెట్టులు బ్రహ్మరుద్రాదు లగుబహువిధంబులు రూపంబులు ధాల్చె మత్స్యాద్యవతారంబు లేమిటికి నెత్తె మఱియు నతండు సర్వసత్వసమూహంబునకు నాధారభూత మగునంతర్బహిర్లోకంబులను లోకపాలురను లోకపాలేశ్వరుల నెట్లు చేసె వర్ణాశ్రమధర్మవిభాగ మెట్టిది త్రైవర్ణికులు దదితరులు ననుష్ఠింపం దగుధర్మములు వేద వ్యాసుండు చెప్ప విని యుంటి నంతఁ గృష్ణకథామృతం బల్పంబ మఱియు నయ్యమృతంబుఁ గ్రోల మనం బయ్యె దానం జేసి సంసార కారణం బైనగృహాద్యాసక్తి నశించు నట్టిహరికథల నా కెఱింగింపుము. సృష్టిస్థితిలయకారణభూతుం డైనహరి యతిమానుషంబు లగునేయేకార్యంబు లాచరించెం జెప్పు మనిన నతం డతని నభినందించుచు ని ట్లనియె. 64

క. మాండవ్యశాపమున భూ
మండలమున నిట్లు వ్యాసమౌనీంద్రునిపు
త్రుండ వయి జనించినధ
ర్మండవు నీ వనఁగ నొక్కరుండవె చెపుమా. 65

క. దానం జేసియ కాదే
శ్రీనాథుఁడు పుడమి విడిచి చెచ్చెర డాకిం
బో నున్నప్పుడు నాతో
జ్ఞానమునీకున్ వచింపఁగా నాజ్ఞ యిడెన్. 66

వ. కావున నోయి విదురా! నీకు సృష్టిస్థితిలయంబులు మఱియు భగవ
ల్లీలలు నానుపూర్విగం జెప్పెద నాకర్ణింపుము. 67

సీ. సృష్ట్యాదియం దెల్ల జీవుల కాత్మభూ
తుఁడు పరమాత్ముఁ డొక్కఁడ కలండు
స్వప్రకాశుఁడు ద్రష్ట పరమైకరూపుఁడు
లీనమాయుం డయి లేనివాని
కరణిఁ దలంచుచుఁ గారణరూపమ
యై కానవచ్చెడు నదియమాయ
దానికోడ్పాటునఁ బూని జగత్సృష్టి
గావించె నీశ్వరుఁ డీవిధమునఁ

తే. త్రిగుణశక్తిసమేతమై తేజు మెఱియు
మాయఁ జిచ్ఛక్తియుక్తుఁడై మహితుఁ డైన
పురుషుఁ డాతఁడు కాలశక్తిరతిఁ జేసి
విశ్వ ముదయింపఁగాఁ జేసె విపులశక్తి. 68

— మైత్రేయుఁడు సృష్ట్యాదిక్రమం బెఱింగించుట —

వ. మఱియుఁ గాలప్రేరితం బయినవిజ్ఞానాత్మకంబు తమోనిరాసకంబు
నగుమహత్తత్త్వం బుదయించె నామహత్తత్త్వమే కార్య మగు నధి
భూతమునకుఁ గారణం బగు నధ్యాత్మమునకుఁ గర్త యగునధిదైవత
మునకు నాశ్రయంబై భూతేంద్రియమనోమయంబై వైకారికతైజ
సతామసము లన మూఁడువిధముల నొప్పు నహంకారం బయ్యె
నందు వైకారికతైజసంబులు సాత్త్వికరాజసంబు లని పేర్కొనం బడు
నందు వైకారికాహంకారంబున మనస్సు నింద్రియాధిష్ఠాతలై విషయ
ప్రకాశంబు గావించు దేవతలును బుట్టిరి. జ్ఞానేంద్రియకర్మేంద్రియ
ములు తైజసజాతంబులు తామసాహంకారంబున భూతసూక్ష్మ
మ్మగుశబ్దంబు పుట్టె దానఁ గాలమాయాంశయోగమున నాకాశంబు
పుట్టె దానివలన స్పర్శము దానివలన వాయువు నుదయించె వాయు

వాకాశముతోడం గూడి బలయుతంబై రూపతన్మాత్రముం బుట్టించె దాన లోకప్రకాశకం బైన తేజస్సు పుట్టెఁ దేజస్సు వాయువుతోడం గూడి రసముం బుట్టించె దానఁ గాలాంశయోగంబున నుదకంబు గలిగె జలము తేజోయుతంబై గంధముం బుట్టించె దానఁ బృథివి యుదయించె ని ట్లియనభూతపంచకసంసర్గమునం జేసి యుత్తరోత్తర గుణాధిక్యంబు గలిగె విను మాకాశంబున కితరసంసర్గము లేదు గావున శబ్ద మొక్కఁడే గుణం బయ్యె వాయువునకు నిజగుణం బగు స్పర్శము గగనసంసర్గమున శబ్దం బుదయించెఁ గావున వాయువునకు శబ్దస్పర్శంబులు రెండునుగుణంబు లయ్యెఁ దేజస్సునకు నిజగుణంబగు రూపంబును నభోవాయుసమన్వయంబున శబ్దస్పర్శంబులును గలిగి గుణత్రియం బయ్యె జలమునకు గుణం బగురసంబును నభోనిలతేజో న్వయమున శబ్దస్పర్శరూపములు మూడుం గలియ గుణచతుష్టయం బయ్యెఁ బృథివి కాత్మగుణం బగుగంధమును నభోవాయుతేజస్సలిల సంబంధమున శబ్దస్పర్శరూపరసంబులు గలియ గుణపంచకం బయ్యె వికృతి విక్షేపము చేతనయు నివి మహదాద్యభిమానదేవతలు విష్ణు దేవునంశమువా రితరేతరసంబంధరహితు లై బ్రహ్మాండనిర్మాణా క్షమర్థులై పరమేశ్వరుం జేరి యి ట్లనిరి. 69

శా. ఏపాదంబు సమాశ్రయించి మును లెంతే దుఃఖదం బై మహా
పాపవ్యాపృత మైనసంసృతిని క్షిప్రం బీఁగి కొం డ్రట్టిసం
తాపచ్ఛత్రము నీపదాబ్జమున కోతండ్రీ! నమస్కారముల్
వ్యాపాదిల్లగఁ జేయుచుంటిమి మముం బాలించి రక్షింపవే. 70

శా. ♦చిత్తైకాగ్రత వేదముల్ చదివి తచ్చింతం గనుంగొంగ నై
హృత్తాపం బడగించుకోఁ గలరొ హానీంద్రుల్ సురేలాపగో
త్పత్తిస్థానం బెది యట్టినీదుపదముం భావించి సేవించు చ
స్మత్తాపత్రయ మీఁగి కో నయితి మోసర్వప్రపంచేశ్వరా. 71

♦ సురేలాపగోత్పత్తిస్థానము=సురనది పుట్టినచోటు.

సీ. ఆశ్రయించినమాత్ర నభయం బొసంగెడు
నిన్నాశ్రయింతు మో నీరజాక్ష
నేను నాయది యను నెగు లందువారికి
లో నుండియును నీవు కాన రావు
నిను భజించెడివారు నిర్మలచిత్తులై
నీలోకమును బొంద నేర్తు రభవ
మమ్ముఁ బుట్టించితి విమ్మెయి మేము నీ
సృష్టికి సాయముఁ జేయ లేము
తే. నిర్వికారుఁ డధిష్ఠాత నీవు కార్య
ములకుఁ గారణ మగుమాకు మొదటివాఁడ
వజుఁడ వయ్యు సత్త్వాదిగుణాదులకును
దానకం బగుచుందు వో శ్రీనివాస. 72

వ. మహాత్మా! మహదాదుల మగు మే మెట్లు ద్దానిం జేయవలయు నట్టిజ్ఞానంబును శక్తినిం బ్రసాదింపు మనినఁ బరస్పరసంయోగంబు లేక రచనాసామర్థ్యముం బొందఁ జాలనినిజశక్తు లగుమహదాదుల యవస్థం గాంచి భగవంతుండు. 73

సీ. పొసఁగఁ గాలంబు నుద్బోధించి ప్రకృతిని
భరియించి ప్రకృతితో నిరువదియును
మూ డగువరతత్త్వములలోఁ గ్రియాశక్తి
సహితుఁడై చొచ్చియు సకలజీవ
కర్మప్రబోధము గావించుచుం దత్త్వ
గణ మొండొకంటెనిఁ గలియఁ గూర్చె
నాత్రయోవింశతి యాక్రియాశక్తి ప్ర
బోధంబుమై నది పూరుషపద
తే. వాచ్య మగువిరాడ్దేహము వఱలఁ జేసె
దాన నీచరాచరలోక మైె నెఱిఁ గొనె

నాది నయ్యధిపూరుషుఁ డండకోశ
మున జలంబునఁ బెక్కేండ్లు పొనరి యుండె. 74

వ. జగత్కారణంబు లగుమహదాదులకుఁ గార్యరూపుం డగునావిరాట్టు జ్ఞానశక్తి క్రియాశక్తి భోక్తృశక్తుల నెసంగి క్రియాశక్తియోగంబునఁ బ్రాణాపానవ్యానోదానసమానములు నాగకూర్మకృకరదేవదత్తధనంజయములు ననుక్రమంబున దశవిధంబులం దనరె నిదియె పరమాత్మునాద్యవతారంబు. 75

కం. ఆతఁడు తనచిచ్ఛక్తిఁ
భూతముల సృజించునట్టిబుద్ధి నెసఁగుచో
నాతని కుదయించె శుభ
ఖ్యాతస్థానములు వాని నభివర్ణింతుఁ. 76

వ. అమ్మహాపురుషున కాది వక్త్రస్థానంబు పుట్టె దాని నగ్నిదేవుండు వాగింద్రియముతోడం జొచ్చె నంత నటఁ దాలుస్థానంబుబొడమె నందు వరుణుండు రసజ్ఞానస్థానం బైనజిహ్వేంద్రియముతోడం బ్రవేశించె నవల ఘ్రాణేంద్రియము పుట్టె నందు నశ్వినులు చొచ్చిరి పిదప నేత్రము లయ్యె నం దాదిత్యుఁడు రూపజ్ఞానసాధనం బైనచక్షురింద్రియముతోడం బ్రవేశించె నంతఁ జర్మం బుదయించె నందు వాయువు స్పర్శజ్ఞానసాధనం బైనత్వగింద్రియముతోడం జొచ్చె నవలఁ గర్ణంబులు పుట్టె నందు శబ్దగ్రహణసాధనం బైనశ్రోత్రేంద్రియము దిక్కులుం బ్రవేశించె వెనుకఁ జరమావయవం బయ్యె నందు రేతస్సుతోఁ బ్రజాపతి ప్రవేశించె నంతఁ గుదం బేర్పడె నందు మలవిసర్జనసాధనం బైనపాయ్వింద్రియముతో మిత్రుండు చొచ్చెఁ బిదప హస్తంబు లయ్యె నందు నిందుఁడు క్రియవిక్రయాదిశక్తితోడం జేరె నవలఁ బాదంబులు పుట్టె నందు గతితోడ విష్ణువు ప్రవేశించె నంత హృదయం బేర్పడె నందుఁ జంద్రుడు సంకల్పవికల్పాదిసాధనం బైనమనస్సుతోడం జొచ్చెఁ బిదప బుద్ధి యయ్యె

నందు వాగీశుండు బోద్ధవ్యప్రతిపత్తిసాధనం బగుబోధముతోడం
జొచ్చె నవల నహంకార ముదయించె నందు రుద్రుండు కర్తవ్యప్రతి
పత్తిసాధనం బైనచేతనముతోడం బ్రవేశించె నప్పురుషునిశీర్షంబున
దివంబును బదముల భూమియు నాభి నంతరిక్షంబును గ్రీమంబున
నయ్యె నందు దేవనరభూతంబులు చొచ్చె సత్త్వప్రధానంబున దేవతలు
రజఃప్రధానంబున మనుష్యులు పశ్వాదులు తమఃప్రధానంబున రుద్ర
పారిషదభూతాదులునుం బ్రవేశించె. 77

సీ. ఆపురుషునిముఖమునందు వేదంబులు
విప్రులుం బుట్టిరి విశ్రుతముగ
బాహువులందు సంభవ మయ్యె క్షత్రము
విప్రులరక్షించు విధులపొంటె
నూరువులందు వైశ్యులు జనించిరి కృషి
వాణిజ్యములతోడ వసుధఁ దనుపఁ
బాదములం గల్గి రాదట శూద్రులు
మూడువర్ణములను బ్రోది సేయ

తే. ఇట్లు తమతమవృత్తుల నేలుకొనఁగఁ
బుట్టినట్టినాలుగువర్ణముల జనులును
శ్రద్ధతోడ స్వధర్మముల్ సలుపుకొనుచు
నాత్మగురుఁ డైనహరిఁ గొలు రనుదినంబు. 78

వ. ఇట్లు భగవంతునియోగమాయాప్రభావంబున నైనవిరాడ్రూపము
సాకల్యంబుగ నభివర్ణించుట యశక్యంబు నాకుఁ దెలిసినంతమాత్రి
నావాక్కులను బవిత్రముం జేసికొనుపొంటె నిట్లు చెప్పితి నాదికవి
యగుబ్రహ్మ సహస్రవత్సరంబులు చెప్పినను హరిమహిమ పర్యా
ప్తంబు గావింప నోపండు వాఙ్మానసంబుల బ్రహ్మరుద్రాదులు
నెవ్వానిం గానఁ జాలకుందు రట్టిపరాత్పరున కే నిదె వందనం
బాచరింతు ననిన విని విదురుండు ప్రార్థనారూపవాక్యంబులఁ బ్రీతి
పుట్టించుచు మైత్రేయున కిట్లనియె. 79

—• విదురుఁడు మైత్రేయునికడఁ దత్త్వవిచారము చేయుట •—

సీ. నిర్వికారుండును నిర్గుణుండును జిదా
త్ముండు నైనభగవంతునకు లీల
చే నైనను గుణక్రియానుబంధ మ్మెట్లు
పొసఁగెడు నిత్యతృప్తుఁ డగునాత్మ
సకుఁ గామ మె ట్లగు సకలుషుండు నివృత్తి
గలభగవంతున కెలమిఁ గ్రీడ
యం దిచ్ఛయును జెప్ప నగు నె సృష్టిస్థితుల్
సలుపువాఁ డతఁ డని తెలిపి రప్పాఁ
తే. డతని కాత్మవిజ్ఞానవిచ్యుతిఁ బడయని
జీవునకు నవిద్యాయోగభావ మెట్లు
క్షేత్రముల భోక్తయై యుండు జీవుఁ డరయ
నద్వితీయాత్ముఁ డని చెప్ప నగును గాదె. 80

వ. అట్టివాని కాత్మానంద భ్రంశము గర్మబంధము నెట్లు గలుగుం
జెప్పు మనిన విదురునకు మైత్రేయుం డి ట్లనియె. 81

సీ. విదుర! తర్కమున కెయ్యది విరోధించు న
య్యది భగవన్మాయ యనఁగ నగును
దాన విముక్తుఁడై తనరునీశ్వరునకుఁ
గార్పణ్యబంధముల్ గానఁ దోఁచుఁ
గలలోనఁ దనతల ఖండించిన ట్లగు
జాగరంబున దానిజాడ లగు నె
జలములఁ జంద్రుండు చలియించు నది యింటఁ
జంద్రున కుండ దాచందమునను
తే. ప్రజలు దేహాద్యనాత్మధర్మమ్ము తదభి
మాని జీవునకే యభిమానరహితుఁ
డైనయీశ్వరునకు నెవ్వి యంటఁ బోవ
యని యెఱుంగఁగ వలయు నోయనఘచరిత. 82

వ. మఱియు సర్వాంతర్యామియు సాక్షిభూతుఁడు నగుపరమాత్మునీ
యందు సర్వేంద్రియోపరతి గలిగినప్పు డప్పురుషునకు నిద్రించువానికిం
బలె నెల్లక్లేశంబులు నాశనం బగు ననిన విదురుండు. 83

తరువోజ. భవదీయసూక్తి యర్కవరఖడ్గమునను
భావసంశయలతల్ పక్కనఁ దెగిరె
నవరిల్లునీశ్వరుస్వాతంత్ర్య మచటఁ
జనుజీవుపరతంత్రసంగతి యెల్ల
సవిమర్శముగ నీవచస్సునఁ దెలిసె
శాస్త్రార్థమునఁ జేసి సత్యం బటంచు
భువనరక్షకుఁ డైనపుండరీకాక్షు
పూర్ణతత్త్వ మెఱుంగఁ బోలెడు నాకు. 84

వ. దేవా! భగవంతునిపాదారవిందసేవాసక్తి పరమోత్సవంబు దానిం
భావించుభాగవతులసాంగత్యంబును సామాన్యుల కలభ్యంబు లట్టిపర
మేశ్వరునివిభూతివిశేషంబులు మఱియుఁ బ్రజాపతులవృత్తాంతంబును
సృష్టిప్రకారంబును మనువులు మన్వంతరలక్షణంబులును వంశంబును
వంశానుచరితంబును భూలోకాదులసన్నివేశప్రమాణంబులు తిర్యఙ్మ
నుష్యదేవాదులయు పక్షిసరీసృపాదులయు సర్గాదికం బంతయు విన
నెంచితిఁ దేటతెల్లంబు గావింపు మనిన నతం డతని కిట్లనియె. 85

సీ. విదుర! యొప్పెదవు నీయుదయంబునం జేసి
పూరువంశము జగత్పూత మయ్యె
లోకహితార్థ మాలోచించి కోరితి
భాగవతపురాణభాగ మెల్ల
నది నీకుఁ జెప్పెద నాది నొకప్డు స
నత్కుమారాది మౌనవ్రతరతు
లల్లపాతాళమునం దుండుసంకర్ష
ణాఖ్యుని దేవుని ధ్యానపరుని

తే. నాకవాసప్రపూజితు నాగకన్య
కాసహస్రసమంచితుఁ గాంచి తన్మ
హాత్మ్య మెఱిఁగినవా రయి యతనియడుగుఁ
దమ్ములకుఁ ద్రొక్కి తచ్చరిత్రమ్ముఁ బొగడి. 86

వ. పరమాత్మస్వరూపము దెలియఁ గోరి విన్నవించిన నాసంకర్షణ దేవుండు సనత్కుమారున కీభాగవతరహస్యంబు చెప్పె నతండు సాంఖ్యాయనునకుం జెప్పె నతండు నిరంతరానువర్తనుండు నాగురుండు పరాశరునకును బృహస్పతికిం జెప్పెఁ బరాశరమునీంద్రుండు పౌలస్త్య వరంబునఁ బురాణవక్తయై ముఖ్యశిష్యుండ నగు నాకు దయాళుండై బోధించె సంప్రదాయాగతం బయినభాగవతపురాణము నిత్యానువర్తనంబుల నొప్పు నీకుఁ జెప్పెద నవహితుండవై విను మని యిట్లనియె. 87

—♦ భగవత్తత్త్వ నిరూపణము ♦—

సీ. ఏకార్ణవంబున నీవిశ్వము మునింగి
నపు డద్వితీయనారాయణుండు
సర్పతల్పంబున శయనించి నిద్రాన
శమునను జేసి నేత్రములు మోడ్చి
జలములం జిచ్ఛక్తి కలితుఁడై తాఁ జతు
ర్యుగసహస్రంబులు నుండి యట్లు
భువనసృష్టి యొనర్ప బుద్ధిచేసిన యంత
నిజనాభినుండి నిర్నిద్రభంగి

తే. వెలుఁగుచును బద్మకోశము వెలసె నొకఁడు
జీవులకు నుపభోగ్యముల్ చేయఁ గలుగు
నాత్రిలోకాత్మకం బగునంబుజంబు
నందు వేదమయుం డగునజుఁడు వొడమె. 88

వ. ఆస్వయంభు వంభోరుహకర్ణికపయిం గూరుచుండి లోకదిదృక్షం జేసి తనమెడ నిటు నటు గా నాలుగుదిక్కులకుం ద్రిప్పుటవలన నాలుగు

ముఖంబు లేర్పడి చతుర్ముఖుం డయ్యె నతం డాతమ్మిమిద్దెపైఁ గూరు
చుండి యెదిరిఁ దన్నెఱుంగం జాలక. 89

సీ. ఎవఁడ నే నీపద్మ మీనీళ్ళులం దేల
యుండె నాధార మొండొకఁడు దీని
కుండుఁ బో యని తనయుల్లంబునం దెంచి
కమలనాళంబుమార్గమునఁ జేసి
మొదలుచూడఁగఁ గ్రింది కదె,యిదె యని పోయి
పోయి వెన్నునిబొడ్డు పొడఁ గఁనక య
పోయినదారినే మునుపటితమ్మిగ
ద్దియఁ జేరఁగా వచ్చి తెలిసి నిలిచె
తే. అప్పులం దంధకారమునందు నుండు
నతనికిం దోచె హరిచక్ర మట్టికాల
మపుడు మెల్లన వాయువు నాఁగఁ బట్టి
చిత్తనిగ్రహ మొనరించి చేసెఁ దపము. 90

వ. ఇట్లు నూఱేండ్లు సమాధియోగం బాశ్రయించి తపించుచు నద్దాన
నుత్పన్నజ్ఞానుండై హృదయకమలంబున శ్రీమన్నారాయణమూర్తిం
జూడఁ గలిగె నతండును. 91

ఉ. శేషునిమేనిశయ్యపయిఁ జేరిచి మేను మణికిరీటస
ద్భూషణభూషితం బగుచుఁ బొల్చుశిరంబు ఫణంబునీడ సం
తోషముతోడఁ జేరిచి యశోధికవైభవ మేర్పడంగ సం
భాషణ మాచరింప కట భాసిలుచుండె నభంబు సూచుచున్. 92

సీ. సంధ్యాజలదమందుఁ జదలఁ గెంజాయ నాఁ
బీతాంబరము మేనఁ బేర్మి సూప
మకరకుండలమణిమండిత కేయూర
హారాదిభూషలు హరువు సూప
నింద్రనీలముతళ్కు లిట్టట్టు పడఁ జేయు
మెఱుఁగుచామనచాయ మేను మెఱయ

వనమాలయును గౌస్తుభమును గంఠంబున
నెయ్యములై వ్రేలి నెఱి నెసంగ

తే. అధరబింబద్యుతుల్ దెసలందుఁ బర్వ
మందహాససుందరముఖమండలంబు
డంబుమీఱ రవీందునేత్రంబు లొలయ
నలరుచుండె మనోహరాంగాంచితుఁ డయి. 93

వ. అట్టిదివ్యపురుషుం గాంచి కాంచనగర్భుండు తన్నును హరినాభిసరో
జంబును బ్రళయజలంబును వాయ్వాకాశంబులు నరయం గలిగెఁగాని
యొండొక్కం డేమియు నరయం జాలక రజోగుణసముద్రిక్తుండై
భగవంతు ని ట్లని స్తుతించె. 94

—♦ పద్మజుండు భగవంతుని స్తుతించుట ♦—

సీ. ఎన్నాళ్లకో నిన్ను నే నెఱింగితి నిల్లు
నీకంటె నొకరుండు లేకయుండు
నీ వొకరుండవే వేవుర ట్లగుచుందు
వది నీదుమాయాప్రభావాతిశయము
నాపుట్టుమూల మహానాభితో నుండిన
యీరూపమే జగత్కారణంబు
దేవ నీదగునిట్టిదివ్యమంగళవిగ్ర
హముఁ జూపితి వనుగ్రహమున నాకు

తే. భక్తితో నీపదముఁ బట్టువారి నీవు
విడక యుందువు నీకంటెఁ బడనివాఁడు
జన్మమృత్యుజరాభీతి జడనుపడుచు
నెల్లదుఃఖంబులం బొందు నిది నిజంబు. 95

ఆ. బద్ధకాము లగుచుఁ బ్రజలు నానావిధ
ములను నిన్ను భజింప మొనసి యున్న

వారికిఁ బ్రసన్నభావంబున న్నీవు
దర్శనం బొసంగఁ దలఁప వెపుడు. 96

క. సవనాదివివిధకర్మము
లవి నీ కర్పించునట్టివై యుండిన నీ
వవు నని వారికి నెన్నే
భవికంబులు గూర్చుచుండు పంకజనాభా. 97

ఆ. సృష్టికర్త నేను స్థితికర్త వీవును
విలయకర్త హరుఁడు వీరు మువురు
మూలముగ మరీచిముఖులు మన్వాదులు
పొదలఁ బెఱుఁగుభువనము లవి నీవ. 98

చ. కడుపున నెల్లలోకములు గైకొని నిద్దురసౌఖ్య మిట్టి దం
చెడఁ దలపోయఁ జేయుచు నిటే జలరాశిని శేషశయ్యపైఁ
బడి నిదురించునీవలనఁ బద్మమునం బ్రభవించి నట్టినే
నిడుదు నమస్కృతుల్ జలరుహేక్షణ! నన్ను ననుగ్రహింపవే. 99

వ. అని యిట్టులాత్మజనకుం డైననారాయణునిఁ బ్రస్తుతించిన నతండు ప్రస
న్నుండై తదీయమోహంబు వాయువిధంబున గంభీరవాగ్గర్జనల
ని ట్లనియె. 100

సీ. చతురాస్య! నీ వలసత్వముఁ గొనకుము
తగదు విషాదముఁ దగులు కొనఁగ
సృష్టి కుద్యోగింపు మిష్టార్థములు నీకు
సమకుఱుగా మున్న సలిపినాఁడ
నీ వింకను దపింపు మావిధివలన నీ
వంతర్గతిఁ జూతు వఖిలజగము
లంతట న్నిండు బ్రహ్మస్వరూపువి నన్నుఁ
గని నంత మోహము కదలి పోవు

తే. నాయనుగ్రహమునఁ జేసి నీయెడల వి
కారముం బొందకుండెడుఁ గాన సృష్టి
కార్యమున కీవు గడఁగు మిక్కాలమందు
నిను రజోగుణ మద్ది బంధింపఁ బోదు. 101

సీ. నలినమ్ముపై నీవు నిలిచి మఱి దీని కే
దేని యాధారము కానఁ బడదొ
యని దానితోఁ గ్రింది కరిగి వెదకుటచేఁ
గారణమ్మై నేను గలుగుదు నని
నీకు బోధింపఁగా నే నిల్లు చూపట్టి
తిని నీవు స్తోత్రము నొనరుచుటను
దపియించుటను నిష్ఠఁ దగులుటం జేసియు
మదనుగ్రహము గల్గి మాన్యుఁ డైతి

తే. తపములు జపంబు లధ్వరతతులు నాదు
ప్రీతికే యని తెలియు మో తాత! యిపుడు
మున్ను నాలోన లీనమై యున్న విశ్వ
మును సృజింపు యథాపూర్వముగను మఱియు. 102

వ. అని పరమేశ్వరుండు నిజరూపముం జూపి సృష్టిక్రమంబు తేటపఱిచి యంతర్హితుం డయ్యె నయ్యెడ నయ్యజుండు పురుషోత్తముండు చెప్పిన చొప్పున నూఱుదివ్యవర్షంబులు తపస్సు గావించి నిజాసనం బైన కమలము గాలిం గదలుటం జూచి తనతపోబలంబునను విద్యవలనను విజ్ఞానంబునను వృద్ధిం గాంచినవాయు వాజలంబులం గ్రోలె నప్పుడు నీళ్లు లేకున్న నుండినయప్పద్మము మిన్నంటిపోవుచుంటం గని ప్రళయలీనంబు లగులోకంబులు దీనం జేసితి నని తలంచి తా నప్పద్మకోశమునం జొచ్చి దాని మూఁడుగా విభజించె నది పదునాలుగు నయ్యె నామూఁడు విభాగంబులును మూఁడులోకంబులు దైనందినసృజ్యంబు లీలోకంబులకు మీఁద మహర్లోకంబు మొదలుకొని సత్యలోకంబువఱకు నితరలో

కంబులు కల వవి నిష్కామకర్మఫలభోగ్యంబు లగుటంజేసి వానికి దీర్ఘ కాలస్థితి కలుగుఁ గావున దైనందినసృష్టి కలుగదు. పైమూడులోకము లు కామ్యకర్మఫలరూపంబులు గాన నుత్పత్తివినాశములు కల వగుటంజేసి దైనందినసృష్టి నొందుచుండు నవి యనిన విదురుండు మునీంద్రా ! పరమేశ్వరునకుఁ గాలాఖ్యరూపంబు కల దని చెప్పితిరి తద్రూపంబు నిరూపింపు మనిన మైత్రేయుం డిట్లనియె. 103

—♦ సర్గకాలాదినిరూపణము ♦—

తే. కాల మనగుణములగతి కరము నిర్వి
శేష మాద్యంతశూన్యమై చెలఁగు నద్ది
దానిని నిమిత్తముగఁ గొని తాఁ బ్రపంచ
రూపమున లీల సృజియించె నాపురుషుఁడు. 104

వ. అవ్యక్తరూపం బగుకాలమున నిది పరిచ్ఛిన్నంబై వేఱు వేఱుగాఁ దోఁప వచ్చెడి నది యిప్పటివలెనే పూర్వకల్పంబునందు నుండు నింక భవిష్యంబునందు నుండఁ గలదు లోకపరిచ్ఛేదకత్వము లోకసామాన్యలక్షణంబు కాలవిశేషలక్షణ మెఱుంగఁ దన్నిమిత్తసర్గభేదంబులును దెలియ నగుఁ గానఁ దత్ప్రకారంబు వివరించెద వినుము. సర్గంబులు ప్రాకృతము లనియు వైకృతము లనియుఁ దొమ్మిదివిధంబులు ప్రాకృతవైకృతోభయాత్మకం బైనసర్గము దశమము దాని ప్రళయము త్రివిధము గుణములకు వైషమ్యము గల్పించుమహత్తత్త్వము సృజించుట ప్రథమసర్గము ద్రవ్యజ్ఞానక్రియాత్మక మగు నహంకారసృష్టి ద్వితీయసర్గము మహాభూతములతోడ నయినభూతసృష్టి తృతీయసర్గము జ్ఞానేంద్రియ కర్మేంద్రియసృష్టి చతుర్థసర్గము వైకారికనామధేయదేవసృష్టి పంచమసర్గము జీవుల కావరణవిక్షేపంబులు గావించుసృష్టి షష్ఠసర్గ మివి ప్రాకృతసర్గములు వైకృతసర్గములలో స్థావరసృష్టి సప్తమసర్గము. ఈస్థావరసర్గమందు వనస్పత్యోషధిలతాత్వక్సారవీరుద్ద్రుమంబు లనునాలుగువిధంబులు గలుగుటం

జేసి యిది షడ్విధం బయ్యె నుత్తరకాలవిచారము లేక ఘ్రాణేంద్రి
యంబుల నర్థమునం గనుచు నిరువదియెనిమిదివిధంబుల నొప్పుతిర్య
గ్జంతువులయష్టావింశతివిధస్సృష్టి యష్టమసర్గంబు గోవు మేక మహి
షము లేడి సూకరము గవయము దుప్పి గొఱియ లొట్టె యను
నవి తొమ్మిదియు ద్విశఫంబులు ఖర మశ్వ మశ్వతరము గౌరము
శరభము చమరి యనునాఱు నేకశఫంబులు కుక్క నక్క తోడేలు
కుందేలు తాబేలు పులి పిల్లి యేదు సింహము కోతి యుడుము
ననునివి బండ్రెండును బంచనఖములు మకరాదు లగుజలచరజంతు
సముదాయ మొక్కటియుం జేర్చి లెక్కింపఁ దిర్యగ్జంతువు లిరువది
యెనిమిదివిధంబుల విశదం బగు ఖచరంబు లగుకంక గృధ్ర బక
శ్యేన హంస సారసాదు లగుపక్షిజాతులును దిర్యగ్జంతుగణపరిగణితం
బులు. ఇది యష్టమసర్గము గుణప్రధానులు కర్మపరులై దుఃఖము
సుఖము గాఁ దలంచునరుల యర్వాక్స్రోతం బగుసృష్టి నవమసర్గము
ఈమూఁడును వైకృతసర్గములు సనత్కుమారాదులు దేవమనుష్య
భావంబులం బరగుటం జేసి వారిసృష్టి ప్రాకృతము వైకృతము గాక
యుభయాత్మకంబై దశమసర్గం బనంబడు వైకృత మగుదేవసృష్టి
దేవసర్గము పితృసర్గ మసురసర్గము గంధర్వాప్సరస్సర్గము యక్ష
రాక్షససిద్ధసర్గము చారణవిద్యాధరసర్గము కిన్నరకింపురుషాదిసర్గము
భూతప్రేతపిశాచసర్గము నన నెనిమిదివిధంబు లివ్విధంబునఁ బ్రాకృత
సర్గంబు లాఱు వైకృతసర్గంబులు మూఁడు నుభయాత్మకసర్గ మొక్క
టియుం గూడి సర్గంబులు దశప్రకారంబు లయ్యె నియ్యవి బ్రహ్మ
సృష్టిభేదంబు లింకఁ గాలచక్రవిశేషలక్షణం బెఱింగించెద నాకర్ణింపుము
కార్యపదార్థాంశములలోఁ గట్టకడపటిదియై విభాగింప శక్యముకానిదై
సూక్ష్మముకంటె సూక్ష్మమై పరఁగునది పరమాణువు రెండుపరమా
ణువు లొక్కయణువు మూఁడణువులు త్రసరేణువు మూఁడుత్రసరేణు
వులకాలము త్రుటి నూఱుత్రుటు లొకవేధ మూఁడువేధలు లవము

మూఁడులవములు నిమేషము మూఁడునిమేషములు క్షణ మైదుక్షణములు కాష్ఠ పదునైదుకాష్ఠలు లఘువు పదియేనులఘువు లొక్కనాడి యగు రెండునాడులు ముహూర్త మేడునాడులకాల మొక్కయామ మెనిమిదియామము లొకయహోరాత్రము పంచాదశాహోరాత్రము లొకపక్షము శుక్లకృష్ణభేదమునఁ బ్రవర్తిల్లుపక్షములు రెండు గూడిన నొక్కమాసం బగు మనుష్యమానకల్పిత మైన మాసము పితృదేవతల కొక్కయహోరాత్రము రెండుమాసములొక్కఋతు వాఱుమాసము లొక్కయయన మది దక్షిణోత్తరభేదంబుల ద్వివిధము మానవమానకల్పితం బగుయయనములు రెండు గూడిన దేవతల కొక్కయహోరాత్రము పండ్రెండు నెలలొక్క సంవత్సరము సంవత్సరములు నూఱు నరులకు పరమాయువు. చంద్రాదిగ్రహము లశ్విన్యాదినక్షత్రములు గూడినకాలచక్ర మెక్కి కాలాత్ముఁ డైనసూర్యుఁడు పరమాణువాదిగాఁ గల కాలభేదమునకుఁ బరిచ్ఛేదకుఁడై ద్వాదశరాశ్యాత్మకం బైనభువనకోశమున సంచరించుచుండును ద్వాదశమాసాత్మకం బైనకాలము సౌర బార్హస్పత్య సావన చాంద్ర నాక్షత్రము లను మానభేదములచే సంవత్సరము పరివత్సర యిడావత్సర యనువత్సర యిద్వత్సర మను సంజ్ఞలం బొందుఁ గాలశక్తిం జేసి బీజాదులకుఁ బలుదెఱంగుల శక్తి గలుగుచుండును జనులకాయురాదివ్యయప్రదర్శనంబు లొనగునవి యంత రిక్షమునఁ జరించుద్వాదశాత్మునివలన సంభవించెడుకాలము పరమాత్మస్వరూపం బని చెప్పిన విని విదురుండు దేవపితృమనుష్యుల యాయుర్మానంబు నూఱేసియేం డ్లని మీమాటబడి నెఱింగితి నీఁక ముల్లోకములకు మీఁదిలోకముల నుండుజ్ఞానులగతి యెఱుంగ నయ్యెడఁ దద్విధం బంతయు నాకుఁ దెలియ నాన తి మ్మనిన మైత్రేయుం డతని కి ట్లనియె. 105

సీ. వినుము కృతము త్రేతయును ద్వాపరంబును
గలి యన నాల్గుయుగంబు లలరుఁ

బండె్రెండుదివ్యసంవత్సర సాహస్ర
 ములు నిరూపింప నై వెలయుచుండు
నందుఁ గృతంబున కగునాల్గు వేలపై
 యెనుబదినూ ఱేడు లెంచ నగుచుఁ
ద్రేతాయుగమునకుఁ దెలియంగ మూడు వే
 లాఱునూ ఱేడులు నంకె కగుచు
తే. ద్వాపరమునకు రెండు వేల్ పైన నాల్గు
నూర్లు కలి కొక వేయు నిన్నూఱు నేండ్లు
పరిమితిగ నేర్పడెఁ దొంటిపరమమునుల
యనుభవంబునఁ జేసి విఖ్యాతము లయి. 106

వ. అందుఁ గృతయుగంబున మొదటినన్నూఱేండ్లు సంధ్య యనియుఁ దుదినన్నూఱేండ్లును సంధ్యాంశం బనియును త్రేతాయుగంబునకు మొదటిమున్నూఱేండ్లు సంధ్య యనియు దుది మున్నూఱేండ్లు సంధ్యాంశం బనియు ద్వాపరంబునకు మొదటియిన్నూఱేండ్లు సంధ్య యనియుఁ దుది యిన్నూఱేండ్లు సంధ్యాంశం బనియుఁ గలియుగంబునకు మొదటినూఱేండ్లు సంధ్య యనియుఁ దుది నూఱేండ్లు సంధ్యాంశం బనియు వ్యవహరింతురు సంధ్యలందుఁ గర్మఫల మనుభవించువారిసృష్టియు సంధ్యాంశంబులవారిలయమును బ్రవర్తిల్లుచుండు సంధ్యాసంధ్యాంశములమధ్యకాలమే తత్తద్యుగసంజ్ఞలం బొంది యుండు.

తే. కృతయుగంబున ధర్మము కెరలువొడుచు
నాల్గుపాదములఁ ద్రేతఁ గల్గు మూఁడు
పాదముల ద్వాపరంబునఁ బాదయుగము
తనరు కలి నేకపాదము ధర్మగతులు. 108

సీ. ఈలోకములమీఁద నెసఁగు మహర్లోక
 మాది లోకములు బ్రహ్మాంతముగను
నం దుండు వారల కాచతుర్యుగసహ
 స్రమ్మొక్కపగ లా్రకమమ్మ నిశయు

నిద్రించునారాత్రి నీరజగర్భుండు
పవలు సృష్టి యొనర్చుఁ బడక విడిచి
యొక్కపగటిలోన నొగి పదునాలుగు
మన్వంతరమ్ములు మాయ మగుచు

తే. ఒకొకమను వేలు డెబ్బదియొక్కయుగము
లట్టిమన్వంతరములఁ దదన్వవాయు
లేలుచుందురు రాజులై నేల యెల్ల
సద్గతికిఁ జేటు గల్గనిచందముననను. 109

వ. అప్పుడు సప్తమహర్షులు వసురుద్రాదులు దేవేంద్రాదులు గంధర్వాదులు నాయామన్వంతరములకు వేఱువేఱ యేర్పడుచుందు రిది యే సృష్టి దినదినంబునుం జేయుత్రిలోకీసర్గము ప్రతిమన్వంతరంబునను భగవంతుఁడు సత్త్వగుణంబున నవతారంబు లెత్తుచుండు రేలు తమోలేశంబున విక్రమంబు చాలించి సర్వంబు తనలో లీనంబు గావించుకొనుచుండు నలువ కపుడు రాత్రి యగు చంద్రసూర్య పరిచారము లేక ముల్లోకంబు లద్దేవునిలో నడంగిపోయెడు నట్టియెడ.

సీ. సంకర్షణోగ్రాగ్నిసంభూతమై యెల్ల
లోకాళి నొక్కింతలోనఁ గాల్చ
నావేఁడికిఁ సైఁప కలమహర్లోకవా
సులు జనలోకముఁ గలయఁ బోదు
రంతఁ గల్పాంతమునందుఁ బొంగిసముద్ర
ములు గాలిఁ ద్రిభువనంబులను ముంచు
నవు డనంతాసనుఁడై హరి జనలోక
వాసులస్తోత్రముల్ వరుస వినుచు

ఆ. యోగనిద్రఁ గాంచి యొక్కింతఁ గను మూయు
నిట్లు రాత్రి పవలు నేర్పడంగ
నైన నూఱుసమలయాయువు బ్రహ్మకు
నవల మర్త్యు లట్టు లతఁడు సెల్లు. 111

వ. ఆశతవత్సరంబులఁ రెండుపరార్ధంబు లిప్పటి కాబ్రహ్మదేవునకుఁ బ్రథమపరార్ధము కడచి రెండవపరార్ధము నడుచుచున్నది. ప్రథమ ప్రహరాదిని శబ్దబ్రహ్మసంభవంబునం జేసి బ్రహ్మనామధేయమహాకల్పం బతిక్రమించెఁ బిదప నారాయణునినాభిపద్మమున జనించిన కతనఁ బాద్మనామధేయమహాకల్పం బయ్యె ద్వితీయపరార్ధంబు మొదట హరి వరాహావతార మెత్తుటం జేసి వరాహకల్పం బిప్పుడు నడచుచున్నది బ్రహ్మాయుఃకాలం బెల్ల నాద్యంతరహితుండును జగత్కారణం బగుభగవంతునకు నిమేషమాత్రం బయ్యె నీకాలము దేహగేహాభిమానులకుఁ బ్రభు వగుఁ గాని పరమేశ్వరునకుఁ బరిచ్ఛేదంబు గావింపం జాలదు. షోడశవికారంబు లుత్తరోత్తరదశగుణాధికంబు లగుసప్తావరణంబుల నావృతంబై పంచాశత్కోటియోజన విస్తృతం బైనయీబ్రహ్మాండకోశము మఱియు నెన్నియండకోట్లు నాపరమాత్మునకుఁ బరమాణుప్రాయంబులును గావు. 112

క. ఇది కాలలక్షణం బగు
విదితము గా వించినాఁడ విదురా! యింకన్
సదమలమతి విధి చేసిన
యది యగుసృష్టి న్వచింతు నాలింపు మొగిన్. 113

వ. ఆబ్రహ్మదేవుండు మునుమున్న సృష్టికిం గడంగి తమస్సు మోహము మహామోహము తామిస్ర మంధతామిస్రము ననునవిద్యావృత్తు లేనింటం జేసి దోషభూయిష్ఠ మైనయాసృష్టికిఁ దాన మెచ్చక భగవంతుని ధ్యానించుచు నితరం బగునుత్తమసృష్టికి నుద్యమించి దానికి మున్న నిష్క్రియు లూర్ధ్వరేతస్కు లగుసనక సనందన సనాతన సనత్కుమారు లనుఋషుల సృజించి బిడ్డలారా! మీరు ప్రజల సృజింపుఁ డని నియోగించిన వారు మోక్షకర్ములు గావున నాసృష్టి సేయ నంగీకరింపమి నడరి విధాత క్రోధతామ్రాక్షుం డయ్యె నయ్యెడ. 114

— బ్రహ్మముఖమునుండి నీలలోహితాదులు పుట్టుట —

సీ. క్రోధతామ్రాక్షుఁ డా ద్రుహిణుని భ్రూమధ్య
మునసుండి జనియించె ఘనుఁడు నీల
లోహితుఁ డాది వేల్పులకు రోదించుచుఁ
బుత్రుఁ డాతఁడు చతుర్ముఖునిఁ జూచి
నామముల్ స్థానముల్ నాకుఁ జూపు మనంగ
నతఁడు రోదించుచు నైతి కాన
రుద్రుండ వనుచుఁ బేర్గొందు హృదయ మింద్రి
యములు ప్రాణము వాయు వగ్ని జలము

తే. జగతి నభమును సూర్యుఁడు చంద్రముఁడును
దపము ననునీపదునొకండుస్థానములను
నీకుఁ గల్పింపఁ బడె మున్న శోక మిట్లు
చేయకుండుము మఱియును జెప్పెద విను. 115

వ. మన్యువు మనువు మహాకాలుఁడు మహత్తు శివుఁడు ఋతుధ్వజుఁడు నురురేతుఁడు భవుఁడు కాలుఁడు వామదేవుఁడు ధృతవ్రతుండు నను పదునొకండు నీకు నామంబులు మఱియు ధీవృత్తి యశన యుమ నియుత్తు సర్పి యిళ యంబిక యిరావతి సుధ దీక్ష రుద్రాణి యను పదునొకండుగురు నీకు భార్యలు నీ వీనామస్థానాంగనలం బరిగ్రహించి ప్రజాపతివై ప్రజలసృజింపు మనిన నానీలలోహితుండు తదాదేశమునఁ బ్రజాసర్గమున కుపక్రమించి సత్త్వాకృతిస్వభావంబులం దనకుఁ బోలిన ప్రజల సృజించె నపుడు రుద్రసృష్టు లగువారు జగం బావరించి మ్రింగివేయుచుంటం గాంచి విరించి శంకించి రుద్రుం బిలిచి నీ సృజించినప్రజ లతితీవ్రదృష్టిం జేసి జగంబులం గాల్చుచుండి రిఁక నీ వీప్రజాసృష్టిం గావించు టుడిగి సర్వభూతహితంబుగాఁ దపంబు గావింపుము దానం జేసి తొంటికల్పంబునందు వలె నీవు విశ్వంబు సృజింపఁ గలవు. 116

తే. తపము సామాన్య మన రాదు తపమువలన
సర్వభూతాంతరగతుండు సర్వరక్ష
కుఁడు పరంజ్యోతి యగువానిఁ గొలువ నగుచుఁ
బురుషుఁ డెల్ల శుభంబులఁ బొందఁ గలఁడు. 117

వ. అనిన నీలలోహితుం డట్లు కాక యని వాని వలగొని తపోవనంబున కరిగె నంత నిట సర్గచింతం జేయునాభీజాతునకు భగవచ్ఛక్తియుక్తిం జేసి మరీచి యత్రి యంగిరసుఁడు పులస్త్యుఁడు పులహుఁడు క్రతువు భృగుఁడు వసిష్ఠుఁడు దక్షుఁడు నారదుఁడు ననుపదుండ్రు పుట్టి రందు నారదుఁ డుత్సంగంబున దక్షుఁ డంగుష్ఠమున వసిష్ఠుఁడు ప్రాణమున భృగువు త్వక్కున గ్రతువు కరమునఁ బులహుఁడు నాభినిఁ బులస్త్యుఁడు కర్ణమూల నంగిరసుఁడు ముఖమున నత్రి నేత్రమున మరీచి మనస్సునందును పొలుపొందిరి మఱియుం బ్రజాపతిదక్షిణభాగంబున నారాయణస్వరూపం బగుధర్మంబును బృష్ఠభాగంబున లోకభయంకరం బగునధర్మంబును హృదయంబునఁ గామమును భ్రూయుగంబునఁ గ్రోధము నధరోష్ఠమున లోభము ముఖమున వాక్కును సముద్రంబులును మేఢ్రంబున నిరృతియుఁ బాయువున నఘాశ్రయంబును ఛాయవలన దేవహూతిపతి యగుకర్దమప్రభువును జనించిరి. 118

—♦ బ్రహ్మ వాక్కుం జూచి మోహించుట ♦—

ఆ. అట్లు సృష్టి సేయునాప్రజాపతివక్త్ర
మునను వాక్కు వెడలుటను గ్రహించి
స్రష్ట దానిరూపసౌభాగ్యములు చూచి
చెనక నెంచె కూఁతు రనక కనక. 119

వ. అప్పు డధర్మప్రవృత్తుండును మోహితచిత్తుండు నగుతండ్రియొద్దకు మరీచి ప్రముఖు లగుపుత్రులు చనుదెంచి. 120

ఉ. కామము నిల్పఁ జాల కిటు కన్నకుమారిని నీమె నంటఁగా
నీమెయి మోహముం గలిగి యీ వపమార్గముఁ ద్రొక్కఁ బోలునే

యేమహి నిట్టిచేష్టలను లెప్పుడు నెవ్వరు చేసి యుండుటల్
నేము వినంగఁ బో మిది సమీహిత మంచుఁ దలంప రెవ్వరున్. 121

క. మీ రాచార్యులు మీయా
చారము మది నెంచి కాదె సర్వప్రజలున్
బ్రారంభింతురు కార్యము
లారా యేమందు మిట్టి రగునీశ్వరులన్. 122

వ. అని పలుకుచున్న పుత్రులం జూచి సిగ్గుపడి పరమేష్ఠి తనమోహవికార దేహంబు విడిచె దాని దిక్కులు గ్రహించె. అదియే ఘోరనీహారత మంబయ్యె నంత మఱియొక్కసమయంబున జతుర్ముఖుండు సృష్టి విచారము సేయుచుండ నతనిచతుర్ముఖంబులనుండి చతుర్వేదంబులు వెలికి వచ్చె వచ్చిన వానిం గాంచి వీని నెట్లు జనుల కుపకరింపఁ జేయుదునో యని తలంచుచున్న యాబ్రహ్మముఖంబుననుండి మఱియు జాతుర్హోత్రంబయినకర్మతంత్రంబులు నుపవేదంబులు న్యాయంబులు ధర్మపాదంబులును జతురాశ్రమవృత్తులునుం బొడసూపె. 123

క. అన విని విదురుం డిట్లను
ననఘా పరమేష్ఠి సృష్టి యగునాసమయం
బున నేవేదం బేముఖ
ముననుండి జనించెఁ దెలుపఁ బోలెదు నీకున్. 124

వ. అనిన మైత్రేయుండు విదురా! వినుము చతుర్ముఖునిపూర్వాది ముఖంబులఁ గ్రమంబుగ ఋగ్యజుస్సామాథర్వణవేదంబు లుత్పన్నంబులైన వెంటన చాతుర్హోత్రం బయినశస్త్రంబులును హోతృస్తోత్రికర్మంబును నిజ్యయనునధ్వర్యుకర్మంబును స్తుతిస్తోమం బనునుద్గాతృస్తోత్రికర్మంబులును బ్రాయశ్చిత్తరూపం బయిన బ్రహ్మకర్మంబును నాముఖంబులన వరుస జనించె మఱియు నాయుర్వేదంబును ధనుర్వేదంబును గాంధర్వవేదంబును స్థాపత్యవేదంబును గ్రమంబునం బుట్టెఁ బంచమవేదం బగునితిహాసమును బురాణమును సర్వముఖంబులం

బుట్టెఁ గర్మతంత్రంబులగు షోడశ్యుక్థులు పూర్వవక్త్రంబునుండి చయ నాగ్నిష్టోమంబులు నప్తోర్యామాతిరాత్రంబులు వాజపేయగోసవం బులు క్రమంబుగఁ బుట్టె విద్య దానము తపస్సు సత్యము ననుధర్మ పాదములు నాల్గింటితో బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్యాసా శ్రమచతుష్టయంబు నాశ్రమభేదంబులు క్రమంబుగాఁ బ్రాజాపత్యము బ్రహ్మము బృహత్తు నైష్ఠికము నని బ్రహ్మచర్యంబులు నాలుగు విధంబు లగు వార్త సంచయము శాలీనము శిలోంఛ మని గృహ స్థాశ్రమము నాలుగు విధములు వైఖానసము వాలఖిల్య ఔదుంబ రము ఫేనప మని వానప్రస్థాశ్రమంబులు నాలుగువిధములు కుటీచక బహూదక హంస పరమహంస లని తురీయాశ్రమంబు నాలుగువిధం బులు. అన్వీక్షకి త్రయి వార్త దండనీతి యనునవి మోక్షధర్మకా మార్థవిద్యలు వ్యస్తము లగువ్యాహృతులు మూఁడు సమస్తములు మూఁడు నొక్కటి యగుతురీయంబును బ్రహ్మదేవునిపూర్వాది ముఖంబుల నుద్భవిల్లెఁ బ్రణవం బాతనిహృదయాకాశంబునను ఛందస్సులలో నుష్ణిక్ఛందస్సు లోమములనుగాయత్రీచ్ఛందస్సు త్వక్కునను ద్రిష్టుప్ఛందస్సు మాంసమునను ననుష్టుప్ఛందస్సు స్నాయువునను జగతీచ్ఛందస్సు అస్థులను బంక్తిచ్ఛందస్సు మాంస సారమునను బృహతీచ్ఛందస్సు ప్రాణమునను నుద్భవిల్లె నన్నలువకు స్పర్శములు జీవంబుగా స్వరములు దేహంబుగా శషసహ లింద్రియం బులుగా యరలవలు బలంబుగా సమకూరె షడ్జాదిస్వరంబు లేడు తత్క్రీడం జనించె వ్యక్తం బగు వైఖరీవృత్తియు నవ్యక్త మగుప్రణ వము నాత్మగా నొప్పి శబ్దబ్రహ్మాత్మకుం డైనబ్రహ్మదేవునకుఁ బరుఁడై పరమేశ్వరుండు వెలయుచుండు. 125

తే. అపుడు లోకపితామహుఁ డైనస్రష్ట
తనయొనర్చినసర్గము తలఁప విస్తృ
తమ్ముగా దని తలపోసి తగినసృష్టి
చేయఁగా నెంచి యది యెట్లు చేయ నగునొ. 126

—♦ స్వాయంభువమనువు ప్రజాసర్గము చేయుట ♦—

సీ. అనుచు నాలోచించునాచతుర్ముఖుని దే
హమునుండి రెండుగా నైనకాయ
మొక్కఁడు జనియించె నొయ్యన నయ్యది
స్త్రీయుఁ బూరుషుఁ డయి చెన్నమీఱెఁ
బురుషుఁడు స్వాయంభువుండు స్త్రీ శతరూప
వారు జాయాపతు లైరి పిదప
నామిథునమునుండి భూమిఁ బ్రజావృద్ధి
యయ్యెఁ బ్రవృత్తమై యయ్యది విను
తే. మట్టిస్వాయంభువునకు భార్యాలలామ
యయినశతరూపయందుఁ బ్రియవ్రతుండు
ననఘుఁ డుత్తానపాదుఁ డన్ తనయు లిద్ద
ఱుదయమందిరి లోకు లోహో యనంగ. 127

వ. మఱియు నామనుదంపతులకు నాకూతి దేవహూతి ప్రసూతి యను ముప్వురు తనయలు వుట్టిరి మనువాపుత్రికలలో నాకూతిని రుచికిని దేవహూతిని గర్దమునకును బ్రసూతిని దక్షునకును నిచ్చె వారివారి సంతానంబునం జేసి జగంబు నిండిపోయె నని చెప్పిన విని విదురుండు.

మత్త. ఆదిరాజచరిత్రముల్ విన నయ్యెఁ జిత్తము గాన నో
యాది తేయనుతోన్నతీ యిదె హస్తయుగ్మము మోడ్చి నీ
పాదపద్మము లంటి వేఁడెద వాక్యొనం దగు నావుడున్
బాదరాయణమిత్రుఁ డాతఁడు పల్కె నిట్లు నయంబునన్. 129

—♦ ఆదిరాజచరిత్రము ♦—

సీ. స్వాయంభువుం డట్లు శతరూపతోఁ బుట్టి
పద్మగర్భునిఁ గాంచి పలికె నిట్లు
నీ వందఱకుఁ దండ్రి వీవె రక్షకుఁడవు
మావలన నొకింతమాత్ర మైన

నీకుఁ బ్రయోజన మేకరణిం గాని
లేనిమాట నిజం బ్బైనఁ గాని
యే మేని పరిచర్య మేము చేసికృతార్థ
తను జెందు కోరిక దనరఁగాన

తే. ఆన నెట్టుము మాచేత నెనపనులు
చేఁత కన బ్రహ్మ యి ట్లను
నీనుడికి నిచ్చ మెచ్చితి నీకు మేల
యగును జెప్పెద విను మయ్య యాదరమున. 130

క. నీ వీశతరూపసతిన్
భావమున వరించి యీమెవలనన్ సుతులన్
దేవాభులఁ బెక్కుఱఁ గని
భూవలయం బేలు జన్నము లొనర్చి కడున్. 131

మ. ప్రజలం బ్రోచుట నాకు సేవ యనుచున్ భావింతు నోతండ్రి దా
న జగన్నాథుఁడు సంతసించెడిని దాన న్నీకు మే లయ్యెడిన్
వృజినంబుల్ బెడబాసి నీవు సుగతిం బెంపొందుచుం దన్న నా
సుజనాగ్రేసరుఁ డబ్జయోనికి నమస్సుల్ చేసి తా ని ట్లనున్. 132

శా. భూతస్థానము భూతలం బిపు డయో మున్నీటిలో మున్గె నో
తాతా! నాకుఁ బ్రజాళి కెందు నిలువం దా వింతయున్ లేదు నీ
వేతద్రీతి సమస్తముం దెలిసి మ మ్మేరీతి వర్తింపఁగాఁ
జేతో సర్వము నీయధీన మనుచుం జేసె న్నమోవాకమున్. 133

వ. అటు స్వాయంభువమనువు నివేదించిన విని విరించి జలనిమగ్నం బగు
భూమి నుద్ధరించుట యె ట్లని పెద్దయుం బ్రొద్దు చింతించి. 134

తరువోజ. ము న్నొకతూరి యీభూమి మున్నీట
మునుఁగ నే జల మెల్ల మునుకొని త్రావి
త న్నుద్ధరించితి ధరణి నిప్పట్ల
తా నిట్లు వెండియుఁ దగ వఱ నీట

నిన్నిటి మునుఁగుట కేమికారణమొ
యెఱుఁగ లే కుంటి నే నింతయు దీని
కన్నలినాక్షుఁడే యగు దిక్కు గాస
యన్యులకు నసాధ్య మక్కార్య మనుచు. 135

—♦ యజ్ఞవరాహావతారఘట్టము ♦—

వ. అని ధ్యానించుచునుండ నతని నాసావివరంబునుండి యంగుష్ఠమాత్ర ప్రమాణంబు గలవరాహపోతం బొక్కండు పొడసూపి చూచుచుండు నంతలో దంతావళంబంత యైనం గని మరీచ్యాదులును సనకాదులు మనువును దాను నవ్విధం బెఱుంగఁ జాలక నివ్వెఱంపడుచు. 136

మ. అవురా! యే మిది నాదునాసను వరాహాకార మీరీతి ను
ద్భవమై చూచుచునుండఁ గొండవలె నై భాసిల్లుచుండెన్ మహో
త్సవముం గూర్చుచు యజ్ఞపూరుషుఁ డిటుల్ తాత్పర్యముం జేసి నా
సవిధంబందుఁ దలిర్చ నంచు ముద మాశ్చర్యంబునుం బొందుచున్

వ. వందనం బాచరించె నంతలో వరాహము దిగంతంబు లవియునట్లు ప్రతిధ్వని ప్రభవింప ఘోర మెత్తి నిర్భరంబుగాఘుర్ఘురించె నప్పుడు సత్యలోకవాసు లెల్ల రు ఋగ్యజుస్సామంబుల నమ్మాయావరాహ మూర్తిం బ్రస్తుతించి రంత. 138

సీ. ఆత్మగుణానువాదాంచితస్తుతు లెల్ల
వినుచు హర్షించుచ న్వేదమూర్తి
మఱియును గర్జిల్లి మట్టు మీఱినజటా
పటలంబు విదళించు చటు నిటు కని
గగనసంచారియై ఖరఖురముల మేఘ
పంక్తులం దన్నుచు వానిఁ దనదు
ధవళదంష్ట్రాధికచ్ఛవి వెలిఁగించుచు
నిజనిరీక్షణముల నిఖిలదిశలు

తే. మెఱపుఁదీగెలతోఁ గూడి మెఱయునట్లు
చేయుచుం బృథ్వి నుద్ధరించెడువిధంబు
తెలుపునట్టిఁడ యై గంధకలన భూమి
చనినమార్గము తెలియుచు జలధిఁ జొచ్చె. 139

శా. ఆకాశంబుననుండి పర్వతము నా నంభోధినీరంబుల౯
లోకాలోకము గూలెనో యనఁగ నాలోఁ బుట్టి ఘోరారవం
బాకూపారము పెల్లగిల్లునటు లత్యంతంబు ఘూర్ణిల్లుచు౯
పై కెత్తె చనుభంగహస్తములతోవ౯ గ్రొమ్ముక్కున ట్లొప్పెదు౯. 140

వ. అట్లపారపారావరంబు *పాయవడం జేయుచుం బోయి పోయి
యొక్కచో భూమిం గాంచి దానిం దనదంష్ట్రాగ్రంబున నెత్తి పెట్టు
కొని మరలె నంతలోన. 141

—♦ ధర నుద్ధరించిన వరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించుట ♦—

క. గదఁగోడ హిరణ్యాక్షుఁడు
కదనము సేయంగ నెదిరి గర్వస్ఫూర్తి౯
దుది మొదలు తెలియనట్టులు
పొదలెడునాపోత్రిశిరము మొత్తె౯ బలిమి౯. 142

ఉ. యజ్ఞవరాహమూర్తి యపు డౌదలపై గద మొత్తి మొత్తనా
నజ్ఞుని రాక్షసాధము మృగాధిపుఁ డేన్గును బోలెఁ దాఁకుచుం
బ్రజ్ఞ చెడంగఁ బాదముల మర్దనముం బొనరించి కొమ్ముతో
నాజ్ఞ యొనర్చెఁ గాలుపురి నారయఁ బొమ్మని యొక్కపోటులో౯.

వ. అట్లు హిరణ్యాక్షుని సంహరించి విశ్వంభర నుద్ధరించి తెచ్చినయజ్ఞ
మూర్తిని బ్రహ్మాదులు బద్ధాంజలులై యి ట్లని ప్రార్థించిరి. 144

తే. అజిత ! యజ్ఞేశ ! నీవరాహావతార
మల్లకల్లోల మొనరించె నబ్ధి యెల్ల
యజ్ఞమయ మైననీమూర్తి నరయఁ గా న
శక్య మట్టినీ కిదె నమస్కారశతము. 145

సీ. నీత్వక్కు ఛందముల్ నీ నెఱుల్ బర్హిస్సు
నీకను లాజ్యము నీపదములు
ఘనచతుర్హోత్రకకర్మము నీముట్టె
స్రుక్కు నీనాసిక స్రువము నీదు
నుదర మిడాపాత్రి మురుకర్ణరంధ్రముల్
చమసము లాస్యము జానుమీఱు
ప్రాశిత్రపాత్రము వదనబిలము గ్రహ
ములు కంఠ ముపసత్తు లలరదములు
తే. నెగడు ప్రాయణీయోదయనీయము లగు
జిహ్వక ప్రవర్గ్యము శిరస్సు చెన్నుమీఱు
సభ్య మవసథ్య మనియెడుజ్వలనయుగము
ప్రాణ మిష్టకాచయనమై పరఁగు మఱియు. 146
తే. వఱలు బాల్యాద్యవస్థలు ప్రాతరాది
సవనములును ద్వజ్మాంసాదిసప్తధాతు
వులును సప్తసంస్థలు నీవు తలఁప యజ్ఞ
రూపుఁడవు నిన్ను వర్ణింప నోపు నెవఁడు. 147
వ. మఱియు నఖిలమంత్రదేవతాద్రవ్యాత్మకుండవు సర్వక్రతుస్వరూపుఁ
డవు భక్తిగమ్యుండవు జ్ఞానప్రదుండవు నీకు దండప్రణామము. 148
శా. నీదంష్ట్రాగ్రమునం ధరింపఁ బడుక్షోణీమండలం బెన్నఁ గా
మోదంబుం బొదవించుచుండెడి మహాభూధ్రంబు శీర్షంబుపై
ప్రాదుర్భూతవలాహకం బనఁగ నోస్వామీ! జగన్నాథ! నీ
పాదాబ్జంబుల నంటి కొల్చెదము మాపాలన్ దయం జూడుమా.
వ. అని యిట్లు బ్రహ్మవాదు లగుమునులు బ్రహ్మాదులుం బ్రసుతించు
చుండఁ బ్రసన్నుండై భగవంతుండు భూదేవి నొకచోఁ బ్రతిష్ఠించి
యంతర్హితుం డయ్యె నీవరాహావతారచరిత్రము భక్తిముక్తిప్రదం
బనిన విదురుండు మునీంద్రా! భూమి నుద్ధరించునెడ హరికిని హిర

ణ్యాక్షునకు నైనరణపరికారంబును వానిజన్మవృత్తాంతంబును వినుట
కుం దివుటమై నాచిత్తంబు తత్తఱించుచున్నయది సవిస్తరంబుగఁ
జెప్పి ననుగ్రహింపు మనిన మైత్రేయుం డి ట్లనియె. 150

సీ. దక్షపుత్త్రిక దితి తనపతి కడ సంజ
నగ్నిహోత్రము సేయునవసరమున
నరుదెంచి మన్మథుం డరుదార నాపయి
వాఁడిబాణచయంబు వదలఁ జొచ్చెఁ
దాళఁ జాలక యున్నదానను నాదుకా
మార్తిఁ జల్లార్చి నాప్రార్థనంబు
నావుడుఁ గశ్యపుఁ డోవనితామణి !
నీకోర్కి దీర్పంగ నే నిదె కలఁ

తే. గాని సమయము కా దిది గడియ తాళు
మవల నీచెప్పినట్టు లే నాచరింతు
మిపుడు సంధ్య ప్రవర్తిల్లు నెల్లభూత
ములకు సంచారసమయ మోపొలఁతి మిన్న. 151

వ. అని యెంత చెప్పినను వినకున్నతఁ డాదితితోడం గూడి లజ్జించుచున్న
సతిం గాంచి మించుబోఁడీ నీ వసమయంబున నాతో నిట్లు కూడితివి గా
వున నీగర్భంబునఁ గ్రూరు లగుపుత్త్రాధము లిరువురు పుట్టి జగత్త్రి
యపీడాకరు లగుదురు లోకేశ్వరుండు శ్రీమహావిష్ణువు ధాత్రి నవతా
రంబు లెత్తి వారి సంహరించెడు నాపుత్త్రులలో నొక్కనికుమారుండు
పరమభాగవతోత్తముండై కులం బుద్ధరించెడు ననిన విని దితి యి
ట్లనియె. 152

తే. ఏమి చేయుదు నోదేవ! యేను జేసి
నట్టిచేఁతకు నారీతిఁ జెట్ట లైన
వారు పుట్టెద రనుటకు వగతుఁ గాని
పౌత్త్రుపేర్మికి నుత్సాహాభరిత నగుదు. 153

వ. అని పలికి దితి భర్త్రాజ్ఞం బడసి గృహంబునకుం జని గర్భవతియై శత వర్షంబులు నీరు మోసె ననంతరంబ యొక్కదినంబున బ్రహ్మమానస పుత్రు లగుసనకసనందనాదులు విగతస్పృహులై నానాలోకముల సంచరించుచు శ్రీమన్నారాయణదర్శనలాలసులై వైకుంఠంబునకుం జని రప్పురంబును. 154

—♦ సనకసనందనాదులు వైకుంఠంబున కరుగుట ♦—

ఆ. పాలవెల్లి యనెడుపద్మమధ్యంబునఁ
గర్ణికాక్రమంబు గలిగి లోక
మాన్య మగుచు విష్ణుమందిర మయ్యాది
వఱలుచుండు వైభవంబుకలిమి. 155

సీ. సంపత్సమృద్ధమై సర్వర్తులందును
దనరుచుండెడు నుపవనులతోడ
నిర్మలామృతముల నెగడొందుకమలాళి
రమణించెడుసరోవరములతోడఁ
బద్మవనంబులపయి నుండి లేచిన
భ్రమరాళిసంగీతరవముతోడ
మాకందఫలములమాధుర్యమున సొక్కి
కులికెడుచిలుకలపలుకుతోడ

తే. నలరి సతతము రాక పోకలు పొనర్చు
హరపితామహశక్రాది సురలతోడ
స్వర్ణమణిగణాలంకృతసలులతోడఁ
బొలుపు మీఱెడు వైకుంఠపురవరంబు. 156

వ. అట్టివైకుంఠపురవరంబు లోచనగోచరం బగుటయు సనకాదులు శ్రీమహావిష్ణువుం దర్శించి పో నుత్సహించి హజారంబు మార్గంబున నాఱు కక్ష్యాంతరములు దాఁటి సప్తమకక్ష్యకడకుం జని యున్నంత. 157

సీ. మకరకుండలలస న్మకుటకేయూరాది
భూషణభూషితుల్ భూరిశంఖ

చక్రగదాయుధావక్రపరాక్రముల్
నీలనీరదసమోన్నిద్రతనులు
దివ్యాయుధోపేత దీర్ఘచతుర్బాహు
లంచితపీతాంబరాంచితులును
వైజయంతీకౌస్తుభ ప్రభాభ్రాజిత
చారువిశాలవక్షస్థలులును
తే. ద్వాదశోర్ధ్వపుండ్రధరు లాద్వారపాలు
రిర్వు రాపోవునట్టిమునీంద్రచంద్రు
లను దిగంబరులను బాలు రనఁగ నైన
వారి నడ్డగించిరి పోవ వలవ దనుచు. 158

—♦ జయవిజయులశాపాదికము ♦—

వ. ఎల్లరుం జూచుచుండఁ దమ్ము నిరోధించినద్వారపాలకులపైఁ గినిసి
మీరు మాకు భగవద్దర్శనంబునకుఁ బ్రతిరోధంబు గలిగించితిరి గావున
మీరు భూతలంబున రాక్షసులై పుట్టుం డని శాపం బొసంగిన వారు
బ్రహ్మదండరూపం బయినవారిశాపంబు విని భయకంపితాంతరంగులై
వారిపాదాబ్జంబుల వ్రాలి మాతప్పు సైఁచి మమ్ము రక్షింపుఁడు
బ్రాహ్మణావమానంబునకుఁ దగినశిక్ష విధించితిరి కాని మాకు హరి
స్మరణంబు మాత్రము మఱపురానియ ట్లనుగ్రహింపుఁ డనునంతలో
శ్రీదేవీసహితుండై విష్ణుదేవుం డట వచ్చిన సనకాదు లాతనిపాద
పద్మంబుల కెఱఁగి బద్ధకరాంజలులై యి ట్లని ప్రార్థించిరి. 159

సీ. ఇందిరేశ ! సమస్తహృదయాంతరములందు
నుండి దుష్టాగోచరుండ వగుదు
వట్టినీ విపుడు మా కిట్లు దర్శన మిచ్చి
తేమందు మయ్య మాయిష్టతపము
సత్యమూర్తివి భక్తజనులకుఁ గొంగుబం
గారమ వని మేము కమలభవుఁడు

చెప్పఁగా విని యుంటి మిప్పుడు మాసంత
స మ్మింత యని చెప్పఁ జాల మనఘ

తే. నీకథామృతపానము నిరత మబ్బు
వారు మోక్షము నైనను వల ద టంద్రు
నీదుదర్శనమునఁ జేసి మాదురితము
లెల్ల నశియించె ధన్యుల మేము దేవ. 160

వ. దేవా ! మే మిపుడు మీద్వారపాలకుల శపించి తప్పుచేసినవారము మాయపరాధము సైఁపు మని వేడుచుంటి మనిన శ్రీమహావిష్ణు వాస నకాదులఁ బ్రసన్నదృష్టిం జూచుచు ని ట్లనియె. 161

శారద. జయవిజయాఖ్యులు వీరలు జాల్ములు నాదగు పార్శ్వదులై
నయ మెఱుఁగంగలవా రయి నాదగుభక్తుల నెర్గనివా
రయి యిట మిమ్ముఁ బరాభవ మందఁగఁ జేసినదాన నిటుల్
భయకరశాపము వెట్టుట పాడి యటందును బ్రహ్మసుతుల్. 162

తే. బ్రాహ్మణులు నాకుఁ బరమదైవతము లరయ
మీప్రసాదముఁ గోరి నే మెలఁగుచుందు
నాపరిచరులు చేసిననయవిహీన
కార్య మేఁ జేసినట్టులు గాఁ దలంతు. 163

తే బ్రాహ్మణులు గోవులును నాదుపరమరూప
ము లగు వారికి నపచారములు పొనర్చు
వార లకథోగతులు గల్గు వారిఁ బట్టి
కారియం బెట్టు జముఁడు దుర్గతులు గట్టి. 164

వ. వీరు నాయభిప్రాయం బెఱుంగం జాలక మీ కి ట్లపచారము చేసిన దానికిఁ దగినఫలం బనుభవించి కాలాంతరంబున వెండియు నాకడకు వత్తు రనినఁ బ్రహర్షోత్కర్షంబునఁ బులకాంకితదేహులై సనకాదులు మోడ్పుఁ గేలు ఫాలంబులం గీలించి గోపాలున కిట్లనిరి. 165

తే. ఈవు బ్రాహ్మణులను మెచ్చి చెన్న లోక
మునకు నుపదేశ మొసఁగుట కనఁగ వచ్చు
నీవు సర్వజ్ఞుఁడవు సర్వదేవదేవుఁ
డవు నిను భజించి బ్రాహ్మణుల్ భువి నగుదురు. 166

ఉ. నీదగునూర్పుగాలిని జనించి జగన్నుతమై తలిర్చునా
వేదము లేకపోయెడిని విప్రుఁడు లేనిని దాని రక్షకై
వేదమునుం బలేక ద్విజుల వీడనివాఁడవవై భరింతు నీ
వోదశరూప మమ్ముఁ గరుణోదధివై గన నేటికోల్లివే. 167

వ. అనిన విష్ణుదేవుండు విప్రులారా! మీశాపంబునంజేసి వీ రిప్పుడ
రాక్షసు లగుదురు మీకు శుభ మ్మగుఁ గాక పోయిరం డని యంపి
పుచ్చి జయవిజయులం గాంచి మీ రీశాపంబునకు వగవ వలదు
ము న్నొకప్పుడు మీరు లక్ష్మి కపచారము చేయుటంజేసి యా మెయు
నిట్లుగా నిర్దేశించెఁ గావున మీరు రాక్షసులై భూమిం బుట్టుఁడు నేను
మూఁడుజన్మంబుల మిమ్ముం గడ తేర్చి నాసన్నిధికిం దీసికొందు నని
ద్వారపాలకులఁ బలికి హృషీకేశుండు సతీసమేతుండై నిజధామం
బునకు నిర్గమించె జయవిజయులు బ్రాహ్మణశాపంబునఁ బ్రక్షీణతే
జస్కులు ప్రతిహతగర్వులు నై వైకుంఠలోకంబునుండి హాహాకారం
బెసంగఁ గ్రిందం బడి పడునంత దితిగర్భంబునందలి కాశ్యపవీర్యంబునం
జొచ్చిరి దితియుఁ బతియాదేశంబునఁ దనగర్భంబు గాపాడుకొనుచు
నూఱేండ్లుగడచినవదంపడి గొడుకుల నిద్దఱఁ గవలం గనియె నప్పుడు.

మ. త్రివిధోత్పాతము లుత్పతిల్లె దివి ధాత్రిన్ వ్యోమమం దెన్నియే
భువి కంపించెను గొండ తండములలో మున్నీరు ఘోషిల్లె గం
ధవహుం డెంతయుఁ బెల్లురేఁగె నుల్కముల్ నాకంబునన్ ధూమకే
తువులున్ బుట్టెను లోకభీకరములై గోఁచెన్ మహాకష్టముల్. 169

— హిరణ్యాక్షహిరణ్యకశిపుల వృత్తాంతము —

సీ. నిప్పులం గ్రక్కుచు నప్పుడు నక్కలు
తెగనట్లు విడకుండ దెసల నార్చెఁ

గుక్కలు మెడలెత్తి యొక్కరు మంచును
కూసె నేడ్చినయట్లు ఘోరరుతిని
గాడిదల్ చెలరేఁగి కాళ్లలం గొట్టుచు
నోండ్రపెట్టుచు మెట్టి నుర్వియెల్లఁ
బశువు లంభారవభరితంబులై పెల్లు
మూత్రపురీషముల్ ధాత్రి విడిచె
తే. ఆలు నెత్తురుపిదికెఁ జెట్లవనిఁ గూలె
మేఘములు చీము గురిసె నమేయశక్తి
విసరెఁ బెనుగాలి గ్రహములు మిసిమి దప్పె
దితికిఁ బుత్రులు పుట్టినదినమునందు. 170

వ. అట్లాదిదైత్యు లిరువురుం బుట్టి పుట్టినంతనం బెఱిఁగి పెద్దకొండల వలె నై రపుడు కశ్యపుండు వారికి హిరణ్యకశిపుం డనియు హిరణ్యాక్షుం డనియు నామధేయంబులు గావించె వారిలో హిరణ్యకశిపుండు తపంబునం జేసి బ్రహ్మదేవుని మెప్పించి తనకు మృత్యుభయంబు లే దని గర్వించుచు లోకపాలురం గెలిచి ముల్లోకంబులు తనవశంబునం బెట్టుకొనియె. వానితమ్ముం డగుహిరణ్యాక్షుండును. 171

సీ. తనతోడఁ బోరాడఁ దగినజోదుం గన
గద మూఁపునం బూని కదలి తిరిగె
మూఁడుజగంబుల నేడును దనతోడఁ
బోరుకొనం జాలుపోటుమగని
నరయంగఁ జాలక యం దందుఁ దిరుగాడు
వానిఁ గన్గొని సురవరులు బెగడి
గరుడునిం గాంచినయురగంబు లట్టులు
పాఱఁ జొచ్చిరి నలువఁలకులకును
తే. బ్రతి యెవఁడు లేమి గర్వంబు బ్రబల వాఁడు-
మత్తమాతంగ మట్టులు మదము కలిగి

కన్ను మిన్ను నెఱుంగక కడలిఁ జొచ్చి
వరుణసైనికులం బాఱఁ దఱిమె నపుడు. 172

వ. ఇట్లు సముద్రంబున నపరిమితప్రకారంబున విహరించుచు నొక్క
నాఁడు వరుణావాసం బైనవిభావరిం జేర నరిగి యాదోగణేశ్వరుం
డై నయసురలోకపాలకుం బిలిచి నీవు దుర్మదులమదం బడఁచువాఁడ
వనియు దైత్యదానవుల నుక్కడంచి రాజసూయము చేసినవాఁడ
వనియు వింటి నేను సమరం బర్థించి వచ్చితి ననిన వరుణుండు మా
కిపుడు యుద్ధాదులం దాసక్తియు నుత్సాహంబును లేదు మఱియు
నీతోడం బోరుసామర్థ్యంబును లేదు నీకు నన్నివిధంబులం జాలినవాఁ
డొక్కపరమేశ్వరుండు దక్క మఱియొక్కరుండు లేడు నీ వమ్మహా
త్మునికడకుం బొమ్ము నీమదంబు సదమదం బగు నతండు నీయట్టి
దుష్టుల శిక్షింపను శిష్టుల రక్షింపను సంసిద్ధుండై యుండు ననిన విని
హిరణ్యాక్షుండు. 173

ద్విపదము. తన్నుమాఱ్కొనఁ జాలుదాయ యొండొక్క
డున్నవాఁ డనియు నయ్యున్నతుఁ డవని
క్రింద రసాతలక్షితి నుండె ననియు
ముందుగా నారదముని చెప్పెనుడులు
వరుణుండు చెప్పుటవలన నిశ్చయము
ధరియించుకొని రసాతలమున కేగి
కొమ్ముకొనం భూమిఁ గొని యుద్ధరించి
నెమ్మదిమై నున్ననీరేజనేత్రుఁ
భూరివరాహరూపుని నందుఁ గాంచి
యోరోరి పందివై యుంటిర రార. 174

—♦ హిరణ్యాక్షుఁడు వరాహమూర్తి నెదిరించి చచ్చుట ♦—

చ. వనచర! యెందుఁ బోయెదవు వచ్చెను వీఁడు కృతాంతునట్టు లీ
వననిధిమేఖలన్ విడుము వారిజగర్భుఁడు దీని మాకుఁ గాఁ

పొనరఁగజేసి యిచ్చె నిది మూర్ఖ విడు మట్టులు వీడవేని నీ
తనువు సహస్రధా తునిఁగి ధారుణిపైఁ బడకుండ దియ్యెదన్. 175

క. నినుఁ జంపి నాదుసుహృదుల
వనటం దీర్చెదను నీవు పడినంత నినుం
గనిపట్టి యున్నయిందిరేఁడు
మును మున్నుగ నెల్లసురలు పొలిసెదరు వగన్. 176

వ. అట్లు ప్రల్లదంబు లాడువానిపై నలుక పొడమ వరాహమూర్తి జలంబునుండి వెడలి వచ్చి వసుంధర నొక్కతగినచోటం బెట్టి తన యాధారశక్తి నం దావిష్కృతంబు గావించి యున్నయప్పుడు హిరణ్యాక్షుండు ఘోరవీక్షణంబులం జూచుచు రెండుచేతుల గదాదండం బెత్తి యోరోరీ దీనం జచ్చితివిరా యని పెల్లార్చుచు వరాహమూర్తి శిరంబుపైఁ బడ వేయుటయు నతండును. 177

ఉ. డాపలికాల దానిని బడం బొనరించియు వైనతేయుఁ డెం
తోపగఁ బాపతేఁ బలెఁ ద్రొక్కియుఁ గాళులఁ జెక్కలై చెడన్
గోప మెసంగఁ జేసినను గో యని యార్చుచు దైత్యుఁ డాగ్రహం
బీపథ మంచుఁ జెప్పుట కొకింతయు శక్యముగాని చక్కిమై. 178

ఆ. జ్వలనమట్లు మండుచండత్రిశిఖశూల
మొండు చేతఁ గొంచు గండుమిగిలి
యజ్ఞమూర్తిమీఁద నడరించి యట్టహా
స మ్మొనర్చె దితిజుఁ డుమ్మలించి. 179

సీ. అది మండుచును మీఁది కరుదేర దైత్యారి
కరచక్రమున దాని గండడంచె
దాన నల్గి సురారి తా రయంబున డాయ
వచ్చి యజ్ఞేశ్వరువక్షమందు
ముష్టిఘాతంబునఁ బొడిచి యంతర్ధాన
మయ్యె నొక్కింతలో నరయ రాక

ప్రాదండ నేస్గను మోదిన ట్లాపోటు
హరికి దాఁకఁ జలింప కతఁడు కనలి

తే. యప్పుడు మాయాబలంబున నసుర యెల్ల
కడల నంధతమస మది కడిమి నించె
రేఁచె మను దుమ్ము పెనుగాలి వీచెఁ బెల్లు
రాలవర్షము గురిసె నాభీలముగను. 180

వ. మింట నుఱుములు మెఱుములుం బెరయ మబ్బు లలుముకొని గ్రహ
కాంతులం గప్పె నప్పుడు పూయాస్థివిణ్మూత్రాసృగ్వర్షంబు గురిసె
గదాసితోమరాదినానాయుధంబులు కుప్పతిప్పలై పడియె రాక్షసాం
గనలు దిగంబరలై శూలాదులు దాల్చి తిరుగున ట్లయ్యె నట్టియెడ
లక్షోపలక్షలు రాక్షసవీరులు చతురంగబలంబులతోడం దలంపడి
పట్టుఁడు కొట్టుఁడు తఱుముఁ డఱుముఁడు త్రోయుఁ డేయుఁ డని
పలికినట్లు తోఁపవచ్చె వచ్చిన మాయావరాహం బయిననారాయ
ణుండు యజ్ఞరూపచక్రిం బవక్రవిక్రమంబునం బ్రయోగించి యెల్ల
మాయలు మాయించె నప్పుడు, 181

సీ. తనమాయ లారీతి దగ్ధమై పోవుడుఁ
బెలుచ హిరణ్యాక్షుఁ డలిగి నడిగఁ
బిడికిళ్ళఁ బొడుచుచో వెఱవక హరి వాని
కర్ణమూలమునందుఁ గరతలమున
నడఁచుటయుం దారుణాఘాతమున వాఁడు
గ్రుడ్లు మీఁదికి రాగఁ గొండవలెను
గూలె నేలకు మొండెమై లాస్యమాడుచు
నసు రెప్పుడో పోయియున్నవాని

తే. యట్లు కూలినరాక్షసు నరసి వేల్పు
లీతఁ డెట్టిపుణ్యము చేసె నిందిరేశు
చేత నీరీతిఁ దెగటారె సిద్ధయోగు
లకు లభింపనితావు వీనికి లభించు. 182

వ. అని హృషీకేశుం గని. 183

తే. లోకకంటకుఁ డైనయాభీకరాసు
రుని వధించి జగంబుల కొనరి యుండు
పీడ దొలఁగించితివి నేఁడు విగతశాత్ర
వులము సుఖయించితిమి దేవ లలితభావ. 184

— యక్షాది దేవగణ సృష్టిక్రమము —

వ. అని ప్రస్తుతించినం జిత్తగించుచు యజ్ఞవరాహరూపుండు నిజపురంబునకు నిర్గమించె వేల్పులును నిజనివాసంబులకుం జని రిది యాదివరాహచరిత్రంబు దీని నాకర్ణించినవారికి సకలైశ్వర్యంబులు సంప్రాప్తంబులగు నని చెప్పిన విదురుం డానందకందళితాంతరంగుండై మునీంద్రా! ప్రజాసర్గముం జేయ నెంచి పరమేష్ఠి మునుమున్న ప్రజాపతుల సృజించి వెనుక నేమి చేసె మరీచ్యాదు లెట్లు ప్రవర్తించి రెఱింగింపు మనిన మైత్రేయుం డిట్లనియె. ఆకర్ణింపుము ప్రకృత్యధిష్ఠాత యగుపరమేశ్వరునివలన సత్వరజస్తమంబులం జేసి మహత్తత్వ ముదయించె దానివలనఁ ద్రిగుణంబై యహంకారము పుట్టి భూతపంచకంబు పుట్టించె నది పరస్పరసంయోగంబున హిరణ్మయం బగునండంబు గల్పించె నయ్యండకోశము నిశ్చేతనంబై వేయేండ్లు జలంబులందుండె నపుడు పరమేశ్వరుండు దానిపై నధిష్ఠించినంత నతనినాభియందు సహస్రసూర్యప్రభాభాసమానం బగుపద్మంబు పుట్టె నా పద్మగర్భంబునఁ జతుర్ముఖుం డావిర్భవించి పితృప్రేరితుండై యథాపూర్వంబుగ సృష్టి సేయం గడంగి మునుమున్న తామిస్ర మంధతామిస్రము తమము మోహము మహామోహ మనుపర్వపంచకంబుతో నవిద్యం బుట్టించి దాని మెచ్చక క్షుత్పిపాసోత్పత్తిహేతుభూతమై యక్షరక్షోగణం బుత్పన్నంబై క్షుత్పిపాసలం జేసి తండ్రి యగునజుని వేధింపం జొచ్చె నంత నతండు ద్యోతనాత్మక మగుదేహంబు పూని దేవతల సృజించె వారు ప్రభాత్మకదివసరూపంబు నొంది రవ్వల నతం

ఢొంఢొళతనువు దాల్చి జఘనంబునం జేసి స్త్రీలంపటు లగుసురుల
సృజించినవారు కామంబునం జేసి సిగ్గు విడిచి మైథునాకాంక్షం జేసి
పైఁ బడ నున్న నతండు పఱచి హరికడకుం జని విన్నవించిన నీ
పేరూపంబు విడిచిపెట్టు మన నతం డట్లు గావించె. విధివిసర్జితమైన
యారూపంబున స్త్రీరూప మైన సంధ్య జనించె నదియును. 185

సీ. కటితటంబున మేలు కనకద్యుతులఁ గ్రాలు
వలిపెంపుమిసిమిదువ్వలువఁ దాల్చి
కాంచీకనకసూత్రకాంతులు వలుగడఁ
గ్రమ్మ రత్నశలాక రహిఁ దలిర్చి
జలజంబుపై భృంగదళములు వ్రాలె నా
నలకలు మోమున నటమటింపఁ
జనుఁదోయి బరువున జవజవలాడంగ
నడుము మందం బయి నడలుసాఁగ

తే. నందె లంతంత గల్లు గ ల్లనుచు మ్రోయ
చెలఁగి కుచ్చెళ్ళు మీఁగాళ్లఁ జిందులాడ
నతనుసంతాపమును గూర్చునట్టిఁ డగుచు
మోహినీరూపమున సంధ్య మొనయ నయ్యె. 186

వ. అసురు లద్దానిం దిలకించి కామాంధకారనిమగ్నమానసులై దాని
చెంతకుం జనుదెంచి. 187

ఉ. ఎవ్వరిదాన వెక్కడికి నేగుచునుంటివి కార్య మెద్ది నీ
వివ్వరుసన్ మదీయ మగుహృజ్జలజం బిది కారియంపడన్
నివ్వటిలంగఁ జేయుదువు నేరము నే మిఁకఁ దాళియుండ నో
జవ్వని పోకు ముందు మని సంధ్యను బట్టిరి బెట్టు నెవ్వఁగన్. 183

వ. అవ్వల నవ్వనజోద్భవుండు తన్నుఁ దాన మూర్కొని కాంతిం జేసిన
విశ్వావసుప్రభృతి గంధర్వాప్సరోగణంబు పుట్టె నంత నతం డలఁ
సత్వంబున దిగంబరులు ముక్తకేశులు నగుభూతప్రేతపిశాచాదులం

బుట్టించి వారిం జూడ నొల్లక ముకులీకృతనయనుం డయ్యె వారుతద్వి
సృష్టం బగుజృంభణాఖ్యతనువుం గైకొనిరి దాన నిద్రాదు లాభూత
ములకుం జూపట్టె మఱియు నింద్రియవిక్లేదకారణంబున నయ్యావి
యున్మాదనామంబున నెన్నంబడుచుండె మఱియు నజుం డదృశ్యరూప
సిద్ధసాధ్యపితృగణంబుల సృజించి తనరూపంబు వారి కిచ్చెం గర్మ
నిష్ఠులు వారికి హవ్యకవ్యంబు లిత్తురు. పిదప నంతర్ధానమున సిద్ధ
విద్యాధరులం గావించె వా రాయంతర్ధానరూపంబు నొందిరి ప్రతిబిం
బంబునం గిన్నరకింపురుషులం జేసి తనరూపంబు విడిన వారు దానిం
గ్రహించి రవలం బదంబులు చేతులుం జాచి పండుకొని పరమేష్ఠి
చింతించుచు సర్గంబు గామి నారూపంబు విడిచి నంత నమ్మేనివెండ్రు
కలం జేసి సర్పనాగసరీసృపాదు లగునహిజాతు లుత్పన్నంబు లయ్యె
నంతలోం దన్నుం గృతకృత్యునిం గా నెన్నుకొనుచుం గడపటం
బరమేష్ఠి మనంబున మనువులం సృజించి తనపురుషరూపము వారి
కొసంగి యనంతరంబ తపస్సు విద్య యోగము వైరాగ్యము లోనగు
వానితోడం గూడినసమాధిం గలిగి జితేంద్రియుండై ఋషులం
బుట్టించి తనతపోవిద్యాదులం గూడినతన దేహాంశము వారి కిచ్చె ననిన
విని విదురుండు స్వాయంభువమనువంశ మనుక్రమంబుగాం దెలియం
జెప్పు మనిన మైత్రేయుం డతని కి ట్లనియె. 189

— స్వాయంభువమనువంశావతారము —

సీ. ప్రజల సృజింపంగా బ్రహ్మ ప్రేరేపం గ
ర్దముండు సరస్వతీతటమునం బది
వేలేండ్లు తపముండి విష్ణునారాధింపం
నాతం డాతనికిం బ్రత్యక్ష మయ్యె
నపు డంతరిక్షమునందు వక్షస్థల
లాలితలక్ష్మీవిలాసు నతనిం
గని మహాహర్షమునను వందన మొనర్చి
లేచి యంజలిబంధ మాచరించి

ఆ. నిన్నుఁ జూచి నాదుకన్నులు సఫలంబు
లయ్యె నిన్ను యోగు లైనఁ జూడఁ
జాల రేను గామసౌఖ్య మాసంజేసి
కామహతుఁడ నైతిఁ గాదె తండ్రి. 190

తే. ఏను గాలాత్ముఁ డగునీకు ఋణము లీఁగఁ
గలుగుపూజఁ బొనర్చెదఁ గమలభవుని
యానతిం జేసి యిపుడు ని న్నాశ్రయించి
యుంపు నందున నే భయం బొందకుందు. 191

వ. త్రయోదశమాసారంబును షష్ట్యుత్తరత్రిశతాహోరాత్రపర్వంబును
షడృతునేమియు ననంతక్షణలవాదిచ్ఛదంబును త్రినాభియు నక్షరంబు
నజరంబు నగుకాలచక్రము సకలభూతాయుర్గ్రసనసమర్థంబగుం గాని
నీకు భక్తులై నిన్ను సేవించువారి యాయువుం గ్రసియింప సమర్థంబు
గాఁ జాల దని మఱియును. 192

చ. ఒకరుఁడ వయ్యు నీవు జగమోయన నే యొకసాయ మొంచ పి
సకలచరాచరంబులను సల్పియు నిల్పియు నల్పి యూర్ణనా
భికి సరివత్తు వోవరద విన్నప మియ్యది నీస్థిరానుకం
పను ననుఁ బాత్రభూతునిగఁ బర్వఁగఁ జేయుచుఁ బ్రోవవే ప్రభూ.

వ. అనిన నబ్జనాభుండు గరుడోపరివిరాజమానుండై కర్దముం గాంచి
యి ట్లనియె. 194

తే. కర్దమా! నీమనోగతకాంక్షితార్థ
మెల్ల నే మున్న యెఱుఁగుదు నిపుడు దాని
వెల్లడించుట కగునాదువిమలభక్తి
జనులకోర్కులు విత లయి జనునె చెప్పుమ. 195

—♦ కర్దముని విష్ణు వనుగ్రహించుట ♦—

వ. చెప్పెద వినుము బ్రహ్మావర్తదేశంబున సప్తసముద్రముద్రితాఖండ
మహీమండలాఖండలుండును సమాత్రిప్రదవిరాజమానుండును సదా

చారసంపన్నుండు నగుస్వాయంభువమను వెల్లి గడచినంత శతరూప యనుసతితో నిటకు వచ్చి నీ కనురూపయుఁ బతివరయు నగు తన కూఁతు దేవహూతి యనుదాని నీ కిచ్చి పెండ్లిసేయు ననంతరం బారాజకన్య నీవలనఁ దొమ్మండ్రఁ గూఁతులం గను వారు మహర్షి పత్నులై మహిమోన్నతిం గాంతు రీవు కలకాలంబు మని సర్వ కర్మంబులు నాయంద సమర్పితంబు గావించి ప్రవర్తించు చుండుము. నేను నీపత్నిగర్భంబునం బుట్టి నీకుఁ దత్త్వోపదేశంబు గావింతు నవ్వేల నీవు మత్పదంబు నొందఁ గల వని పలికి సరస్వతీతీరంబునుండి వైకుంఠమార్గంబు పట్టి చనియె నంతఁ గర్దముండును భగవదుక్త కాలంబుఁ బ్రతీక్షించుచుండె నామనునాఁడు. 196

సీ. మనువు స్వాయంభువు తనకూఁతురును బత్ని

యును ద న్ననుసరింపఁ గనకరథము

నెక్కి వసుంధర యెల్ల వెదకి కొంచుఁ

గర్దముఁ డున్నభూఖండమునకు

వచ్చి యందలిసరోవరమున శ్రీమహా

విష్ణువు నానందబిందువు లవి

క్రందుకొనినదాన బిందుసరోవర

మనుచు సార్థాభిధేయంబు నొందెఁ

తే. బరిమపుణ్యోద మమృతవారిపరివృతంబు

సతతపరమర్షి సేవిత మతులితసుమ

గంధబంధుర మనిశభృంగప్రణాద

భాసుర మ్మది తత్సమీపమ్మునందు. 197

క. కనుపండు వగుచుఁ గర్దమ

మునివరమాశ్రమము లోకపూజితహానీ

ద్జనసేవితంబు బహువిధ

ఘనతరురాజితము పొల్చుఁ గడుపుణ్యద మై. 198

మ. ఋతుధర్మంబులు లేక సర్వఋతువుల్ దేలుం బవళ్ళున్ లతాం
తతతుల్ పండ్లును బత్రముల్ మునులకున్ దాత్పర్యముం జేసి క
ల్పతరూత్తంసముల న్దొసంగుచును జిల్కల్ గోరువంకల్ కడుం
శ్రుతిపేయంబుగఁ బల్కు స్తోత్రములొనర్పం బో యనం బొల్చెడున్.

సీ. మావిపూదేనెల మత్తిల్లి యలిగాయ
కాళి సుస్వరముల నోలిఁ బాడ
శుకశారికాదిసచ్ఛకునసంతానమై
తాళికాళి ఘనశబ్దములఁ బలికెఁ
జివు రాకులను మేసి చిరరవంబున వన
ప్రియకోటికాహళిఁ బ్రీతిఁ బట్టె
తెక్కలల్లార్చుచు నొక్కొకటఁ గొలఁకుల
హంసకాంతాళి నాట్యంబు లాడె

తే. అట్టియామని సంతస మావహిల్ల
మన్మథోత్సాహజనకుండు మాధవుండు
సొగసులకు నెల్లఁ దానక మగుచు నెపుడు
వెలయుచున్నట్టి వనలక్ష్మిఁ బెండ్లియాడె. 200

—♦ స్వాయంభువుఁడు కర్దమాశ్రమమునకు వచ్చుట ♦—

వ. అట్టితపోవనంబు లోచనగోచరంబగుటయు స్వాయంభువమనువు సపరివారంబుగ నందుఁ జొచ్చి చనుచు నొక్కచో నొక్కపర్ణశాలయందు నగ్నికార్యంబు దీర్చి తపశ్శక్తిం దీపించుచు జటాధరుండై మలిన గాత్రంబునఁ జీరవసనంబులు ధరించి యున్న కర్దముం గాంచి నమస్కరించెఁ గర్దముండును దనకడకువచ్చినమనువు ననురూపసత్కారంబుల సత్కరించి సుఖాసనాసీనుండై యున్నసమయంబునఁ గర్దముండు రాజుదిక్కుమొగంబై యి ట్లనియె. 201

సీ. దిక్పాలురయు చంద్రదిననాధులయు నంశ
మును విష్ణునంశముఁ బొంది కాదె

భూపాలు రదయింతు రి భూపాలుఁడవు నీవు
శ్రీమహావిష్ణుఁడవే మదిఁ గన
నీకు నమస్కృతి నేఁ జేయుచుంటిని
పుణ్యమూర్తి వటంచు బుద్ధిఁ జేసి
చైత్రరథం బెక్కి సకలదేశంబులఁ
జరియింతు ధర్మరక్షణము పొంచె

తే. అంశుమంతునిగతి నీకు నన్నికడల
సతతసంచార మగు దాన సకలభద్ర
ములును గల్గెడు నీ కని తెలిసియు నిట
కరుగుదేఁ బని యేమని యడుగుచుంటి. 202

వ. నీరాక నాకు రాక నోలె నానందంబు సంధించుచున్న దనిన రాజేం
ద్రుం డి ట్లనియె. 203

సీ. బ్రహ్మదేవుఁడు వేదరక్షణార్థము నిజ
ముఖమున నుండి విప్రులను సలిపి
తద్రక్షణార్థము తన బాహువులనుండి
క్షత్రియుల సృజించె ధాత్రి మెలఁగ
నా దేవునకు విప్రుఁ డగుహృదయము క్షత్రి
యుం డంగ మని చెప్పుచుందురు బుధులు
కావున బ్రాహ్మణక్షత్రియు లన్యోన్య
రక్షణం బెపుడు కర్తవ్య మగును

తే. అకృతచిత్తులకుం జూడ నలవిగాని
నిన్నుఁ జూచితి నద్దాన నున్నసంశ
యములు విచ్ఛిన్నతం గాంచె ననఘమూర్తి
నీదుపదపరాగముఁ దాల్తు నౌదల నిదె. 204

మ. కమనీయంబులు నీసుభాషితము లేఁ గర్ణంబులం దాల్చి చి
త్తమునం దుత్సవ మొందితిన్ దుహితృవాత్సల్యంబునం జేసి క్లే

శము గైకొనయి దేశదేశములు సంచారంబు గావించుచో
నమరజ్యేష్ఠభవుండు చెప్పె నిను విద్యాశీలవృత్తాదులన్. 205

ఉ. నాదగువిన్నపంబును వినం దగు దీవు కృపార్ద్రచిత్తమం
దాదరమున్ వహించి వసుధామరతల్లజ యీమె నాకు నా
మోదముఁ గూర్చుకూఁతురు సమున్నతలక్షణలక్షితాంగి స
త్యాదృతి నొప్పుకన్య తెలియంబడుచుండెడు దేవహూతి నాన్.206

తే. సోదరి ప్రియవ్రతోత్తానపాదులకును
దనకు ననురూపుఁ డగుపతిఁ గొనఁగ నెంచు
చున్నయది నారదునివాకు విన్నది మొద
లెపుడు నీవయి మది నిల్పి యెసక మెసఁగు. 207

శా. ఏకల్పంబున నైన నీకుఁ దగి తా నింపొందు నీకన్నియన్
నీ కర్పించెద స్వీకరింపుము దయాన్వితాంతరంగుండ వై
లోకాతీతతపఃప్రభావ విను మీలో నప్రయత్నాత్త యా
రాక న్నేన్ గయికొంట లొప్పు నని శాస్త్రంబుల్ వచించుం జుమీ.

క. నీవు వివాహార్థము సం
భావించుచు నుంటి వనుచు బహుజను లనుటన్
నే విని వచ్చితినిచ్చటి
కోవదుగా నాదుకన్య నొసఁగుదుఁ గొనుమా. 209

వ. అనినం గర్దముండు మనువున కి ట్లనియె. 210

—♦ స్వాయంభవుఁడు కర్దమునకుఁ గన్యాదానముచేసి పోవుట ♦—

సీ. పాణిపీడనము నేఁ బడయఁ గోరుచునుంటిఁ
దథ్య మిద్ది యనన్యదత్త యైన
తరుణి నీకూఁతును దఱివార్చి తెచ్చితి
సుప్రజాసంపత్తి యప్రతిహత
మగునట్టికోరిక యది సెల్లు నీకన్య
ధన్య లచ్చిం బోలుమాన్యచరిత

ప్రాసాదమున నీవు బంతులాడుచునుండు
సమయమునందు విశ్వావసుండు
తే. దేవయానముపై నుండి పోవువాఁడు
కాంచి కామించి యొడ లెఱుంగక ధరిత్రిఁ
గూలె నని వింటి నీసకిఁ గోరకుండు
వాఁడు ముల్లోకముల నుండఁ బోఁడు నిజము. 211
ద్విపదము. ఉత్తానపాదునిసోదరి వైన
మత్తకాశిని తాన మాయింటికడకు
విచ్చేసె నీతన్వి వీరిడి నగుచు
నిచ్చ సేయక యుందునే నిర్మలాత్మ. 212
ఉ. ఐన నొకానొకండు సమయం బగు నాకు వివాహ మాడి నే
నీనలినాక్షితోడ వసియించెద మించినవేడ్క గర్భముం
దాను ధరించునంతకు ననంతరమందు గృహస్థధర్మముల్
మాని తురీయధర్మము సమంచితరీతినిఁ బొంద నెంచితిన్. 213
వ. ఇది విధివిహితంబు దీనికి మీకు సమ్మతంబ యేని నాకు నీకూఁతు నిచ్చి పెండ్లి సేయుము కాదేని నాపైఁ దప్పు వెట్టక విజయంచేయ విన్నవింతు ననిన స్వాయంభువుండు తనపత్నితోఁ బుత్రితో నాలోచించి తదనుమతిం గొని కర్దముం గని నీసంకేతంబున కే మొడంబడితి మని గుణాఢ్యుం డగునాకర్దమునకుం దుల్యగుణ యగు తన కన్య నిచ్చి విధిదృష్టవిధానంబున వివాహంబు గావించి నానావిధాంబరాభరణాదులు పారిబర్హంబు లరణంబుగా నిచ్చి నెమ్మనమ్మున మెచ్చుచుఁ గూఁతుం గుచ్చి కౌఁగిలించి శిరంబు మూర్కొనుచుఁ గన్నీట నామె శిరంబుఁ దడుపుచు నల్లునకుం గూఁతునకుం జెప్పి మెట్టకేలకు వారి నామంత్రణంబు చేసి సపరివారంబుగ శతరూపాసహితుండై కదలి సరస్వతీనదీప్రాంతకాంతారవిరాజమానమహాముని ...మంబు లరయుచుం బోయి పోయి బ్రహ్మావర్తంబునఁ దన

ప్రజలు ప్రహర్షంబున నెదుర్కోలు సేసిన వారి నాదరించుచు నిజ
రాజధాని యగు బర్హిష్మతీపురంబునకుం జనియె నదియును. 214

సీ. మున్ను యజ్ఞవరాహమూర్తి యచ్చటఁ దన
మేను విదిర్చుట నేనినుండి
పడినరోమము లెల్లఁ బసిడినిగ్గులతోడ
బర్హిస్సమూహమై పరిఢవిల్ల
మునివర్యు లవ్వానిఁ గొని యజ్ఞముల యజ్ఞ
విభుని నారాధించి విఘ్నకారు
లైనరాక్షసులను బో నెట్టుచుందురు
మనువు తత్సాధనమున సవములు
తే. పొనరిచి ప్రసిద్ధి గాంచె నందునఁ బురంబు
దనరె బర్హిష్మతి యనంగఁ దత్ప్రభావ
మమరపురి కందరానిద యై తలిర్చె
నెల్లసంపద లప్పురి నెసకమెసఁగ. 215

వ. అట్టిబర్హిష్మతీపురంబునం బ్రవేశించి స్వాయంభువుండు సకలజేగీయ
మానవైభవుండై పరివర్తించుచు నానావిధభోగంబు లనుభవించుచు
భగవద్భక్తితత్పరుండై తత్పరాత్ముండై పూజ్యసామ్రాజ్యం బేలుచుఁ
దనమన్వంతరకాలంబున నొక్కనిమేషంబేనియు వ్యర్థంబు గానియ్యక యెల్ల
వాసుదేవప్రసంగంబున నేకసప్తతియుగంబులు గడపి యెట్టి క్లేశంబు
లెప్పుడుం బొందక మును లంతవారికి నానావిధధర్మంబు లుపదేశిం
చుచు సిద్ధుండై ప్రసిద్ధిం గాంచె నిది స్వాయంభువమనుచరిత్రంబు
పదంపడి దేవహూతిచరిత్రంబు చెప్పెద నాకర్ణింపుము. 216

—♦ స్వాయంభువపుత్రిక యగు దేవహూతి చరిత్రము ♦—

సీ. తలిదండ్రు లారీతి! దన్నిడి పోయిన
తర్వాత సాధ్వీవతంస మైన
దేవహూతియుఁ బతి దైవముగా నెంచు

పగిది మెలంగుచుఁ బరిచర్య సేయుచు
సౌహృదంబునఁ జేసి సంతతంబు
భవుని భవాని నాఁ బాయ కాతనినుడి
కారమంద మెలంగఁ గలిగికొనుచు

తే. వ్రతపరాయణ యగుచు దీర్ఘంబుఁగాల
మతని సేవించుచుఁ గృశాంగి యగుచునుండ
నట్టియెడఁ గర్దముండు నిజాంగనఁ గని
ప్రేమపూర్వకవాకు లీరీతిఁ బలికె. 217

ఉ. నీపరిచర్య కెంతయును నే నెద మెచ్చితి నీదు దేహమున్
నీపతిసేవహేతువుననే కదె యిట్లు కృశించె నిగ్గతిన్
నీపయిఁ బ్రేముడించితిని నేను గణించినదివ్యభోగముల్
చూపుదు నీకుఁ జూడు మనుచుం గలిగించెను దివ్యదృష్టినిన్ 218

వ. దేవహూతియు దివ్యదృష్టిం గలిగి బహువిధయోగమాయావిద్యావిచక్షణుం డయిననిజవిభునిప్రభావంబునకు భావంబున నద్భుతంపడుచుఁ బ్రణయవినయవిహ్వలభాషితంబు లొలయ నీవు మహానుభావుండ వని నేను మున్న యెఱుంగుదు నీదగుభోగంబు లనన్యదుర్లభంబులు దీనం జేసి నే నెంతయు సంతసించితి నని మఱియును.

చ. *సమయ మొనర్చి తీవు శయసంగ్రహణం బొనరించువేళ నా
క్రమమునఁ బుత్రునిం బడయుకాంక్ష మెయిన్ సకృదంగసంగమే
ష్టమతిఁ దలిర్చుచుంటి స్మరశాస్త్రసమంచితసిద్ధపద్ధతిన్
సముచితిపౌఢభూషణవిశాలవిలాసవిశేష మేర్పడన్. 220

వ. అని విన్నవించిన నతండు నిజయోగమహిమంబునఁ గామగమైన యొక్కవిమానమ్ము సృజించెఁ సర్వరత్నసమలంకృతంబును సర్వసంపత్సమృద్ధంబునై యున్న దందు శయనాసనవ్యజనంబులును వివిధశిల్పంబులు మరకతకుట్టిమంబులు విద్రుమవేదికలు వజ్రకవాటశోభిత

* శయసంగ్రహణము=పాణిగ్రహణము.

ద్వారదేశంబులును శాతకుంభకుంభసంభారసంభృతంబును బద్మరాగ
ఖచితవజ్రభిత్తికలును విహారస్థానంబులు విశ్రాంతిభవనంబులున్
భోగాయతనంబులును గలిగి కన్నులపండువై యుండె దానిం జూచి
దేవహూతి ప్రీతిం జూపకున్నంత సర్వభూతాంతఃకరణాభిజ్ఞుం డగు
కర్దముండు సుందరాంగీ! నీ వాబిందుసరోవరంబునం గృతస్నాతవై
రమ్ము విమానం బధిష్ఠింపు మనుటయు నా దేవహూతి యును. 221

—♦ దేవహూతిపతితో దివ్యవిమానం బెక్కి చరించుట ♦—

చ. మలినము లైనచేలములు మాసి జటాకృతిఁ గొన్న కేశముల్
మలమునఁ బంకిలం బగుచు మానజిపోయినమేను గల్గు నా
పొలఁతి విమానముం గని సముత్సుకతం జెడి యున్నదయ్యె న
ప్పలుకున నజ్జలాశయము పజ్జకు నేగి జలంబులఁ గ్రుంకెఁ గ్రుంకినన్.

సీ. అందొక్కమణిమయహర్మ్యంబునన్ బాల్య
వయసున నుండినపదియు వేవు
రగుకన్నియలు వచ్చి యమ్మ నీపరిచారి
కలము మాయూడిగములను గొనుమ
యని పరిమళతైలమునఁ జేసి తలయంటి
నలు గిడి పన్నీట జలకమార్చి
దువ్వలువం గట్టి దొడ్డసొమ్ములు వెట్టి
కాయమునన్ మంచిగంధ మలఁది

తే. అమృతమయ మగునన్నము నాసవంబు
గుడువఁ ద్రావ నొసంగి యమ్మడఁతి నచట
నొక్కదివ్యాసనమునఁ గూర్చుండఁ జేసి
దర్పణము చేతి కిచ్చి రత్తరుణు లపుడు. 223

వ. దేవహూతియుం దన దేహసౌందర్యం బందుఁ గాంచి హర్షించుచుం
బ్రియుం దలంచె నంతలో నతండు దివ్యాంగనాసహస్రంబు గొలువఁ
దనమ్రోల నున్నం గని నివ్వెఱంపడుచుండ నతండు సర్వనారీపరి

వృతుండై దేవహూతితో దివ్యయానం బెక్కి తారాగణపరివృతుం
డగుచంద్రునిచందంబున నందు విశ్రమించె నంత నవ్విమానంబును.

ఉ. అవ్వేళ నింగిపై కెగసి రిక్కలమార్గము పట్టి పోవుచున్
మువ్వరుసన్ సురౌఘములు మూగి భజించుచు వెంట నంటఁగా
నవ్వసుధామరుండు సకలామరలోకము లోలిఁ జూచుచున్
దెవ్వని వైభవంబునను దిక్కుల నన్నిట సంచరించుచున్. 225

వ. ఇంద్రాదిలోకపాలవిహారస్థానంబు లగు వైస్రంభకము స్వరసనము నంద
నము పుష్పభద్రము మానసము చైత్రరథము మున్నగు దేవతో
ద్యానంబులం గలయం బరికించుచు సిద్ధాదిప్రసిద్ధస్తోత్రంబు లాలిం
చుచు వాయువేగంబు గలుగునవ్విమానంబునం గాంతాజనపరివృతుం
డై సంచారంబు గావించుచు ద్వీపవర్షాదులం దీపించుభూభాగంబు
లెల్ల దేవహూతికిం జూపుచు నాపురుషోత్తముండు మగిడి తన
యాశ్రమంబునకు వచ్చి తొమ్మిదిరూపంబులు దోఁచు నట్లా దేవ
హూతితోఁ గ్రీడించుచుఁ బెక్కేం డ్లొక్కక్షణంబు వోలె వేఁగించె
ని ట్లాదంపతులు కామలాలసులై సురతోద్యోగంబున నుండ నూతేండ్ల
కాలం బతిక్రమించె నంత నా దేవహూతి తొమ్మిదివిధంబుల గర్భంబు
ధరించి వీర్యభాగంబుకంటె శోణితభాగ మధికం బగుటం జేసి తొమ్మం
డ్రు కూఁతులం గాంచె నట్టియెడఁ గర్దముండు చెప్పినచొప్పునఁ
బ్రవ్రజితుఁడై పోవ నెంచిన నెఱింగి కన్నుల నీరుగ్రుక్కికొనుచు
గద్గదకంఠయై వగపు దోఁచువచనంబులఁ బతి కి ట్లనియె. 226

చ. మునివర ! నీవు చెప్పినటు పోలఁగఁ జేయుదు నంట లొప్పు నై
నను శరణన్న నానుడిమనంబునఁ బెట్టఁగ వేఁడుచుంటి నీ
తనయలు వీరు వీరలకు దంపతితం గలిగింప కీవు నో
యిన నిఁక నే రుది కగుదురేమి యొనర్చెద నే నెలంతుకన్. 227

చ. మఱియొకమాట మీరుచన మానిని నా కిటఁ బల్కువాఁడు నా
తెలుఁగులు చూచువాఁడు ననుఁ దేర్చెడు వాఁ డొకపుత్రుఁ డుండ న

క్క-అ యని మీ కొఱఁగినద బాపి దయామయు లైనమీకు ని
త్తెఱఁగున విన్నవించెదను దీనశరణ్యా యనుగ్రహింపవే. 228

వ. అని కరుణ నీవు వెట్టుకొనుచున్నా రీతిలకంబుం దిలకించి కర్దముండు
తోడ్తోడ భగవదాదేశంబును దలపోయుచు ని ట్లనియె. 229

తే. రాజపుత్త్రి విషాదము రాఁగ నీకు
మచిరకాలమునంద నారాయణుండు
నీదుగర్భమునం జొచ్చి నెమ్మి మీఱ
నందనుం డయి జన్మించునందు వింటె. 230

—♦ దేవహూతిగర్భంబునఁ గపిలుం డుదయించుట ♦—

వ. నీవు వ్రతములు జపములు తపంబులు దానంబులు ధర్మంబులు గావిం
చుచుండు మని చెప్పిన నప్పరమపతివ్రతాశిఖామణి నెమ్మనమ్మున
నమ్మధుసూదను నారాధించు చుండె నిట్లు పెద్దకాలంబు సన నాపద్మ
నాభుండు కర్దమునివీర్యంబు నాస్వాదించి దారువునం దగ్ని నోలె నా దే
వహూతిగర్భంబున నావిర్భవించె నప్పుడు దివి దేవవాద్యంబులు పెల్లు
మోసె బుష్పవర్షంబు గురిసె గంధర్వగానం బనూనం బయ్యె నచ్చర
లాడి రెల్లదెసలు ప్రసన్నంబు లయ్యె నట్టియెడం బరమేష్ఠి మరీచిప్ర
భృతులతోఁ గర్దమాశ్రమంబున కరుదెంచి సాంఖ్యశాస్త్రప్రవాద
కుండై యవతరించిన పరమపురుషుఁ బ్రశంసించుచు గర్దమున కి
ట్లనియె. 231

సీ. నామాటబడి నీవు నడచితి వది నన్నుఁ
బూజించుటని లోనఁ బొంగుచుంటి
నీకూఁతు లగువీరి నెఱిమీఱువారికి
నిచ్చి మహాయశ మీవు గొనుము
పరమేశ్వరుఁడు నీదుగరితగర్భమునందు
నందనుం డయ్యె నానందముగను
గపిలుఁ డన్ పేరఁ సాంఖ్యముఁ బ్రస్తరించెడు
నాచార్యుఁడై నీకు నాఖ్య దెచ్చు

తే. ననుచు బోధించి హంసవాహనము నెక్కి
యట మరీచిప్రభృతుల నిల్చుటకుఁ జెప్పి
తనదు వెంబడి సనకాదిమునులు నార
దుఁడును రా సత్యలోకముఁ దొడరి చనియె. 232

వ. పదంపడి కర్దముండు పరమేష్ఠివచనంబునం జేసి తనతనయలఁ బ్రజాపతు
లకుం బెండ్లి సేయ నెంచి కలను మరీచికి ననసూయ నత్రికి శ్రద్ధ నంగి
రసునకు హవిర్భువును బులస్త్యునకు గతిని బులహునకుఁ గ్రియను
గ్రతువునకు ఖ్యాతి భృగువునకు నరుంధతిని వసిష్ఠునకు శాంతి నథ
ర్వునకు నిచ్చి వివాహంబులు గావించె నల్లుండ్రును గృహోద్వాహు
లై కర్దము నామంత్రించి పత్నులం దోడ్కొని తమతమపొందుపట్ల
కుం జని రంత నొక్కనాఁడు కర్దముఁడు తనకొడుకు భగవంతుం డని
యెఱింగినవాఁడు గావున నేకాంతంబున వానిఁ జేర నరిగి ప్రణమిల్లి
యి ట్లనియె. 233

సీ. సంసారమునఁ గుందుజనులకు నరిది నీ
దుప్రసాదసంసిద్ధి దురితదూర
బహుజన్మపరిపక్వబహుళయోగసమాధి
చేఁ గాని కాదు నీయోగసిద్ధి
యట్టిచో నీ వెంత లని మమ్ముఁ జులకనం
జూడక భక్తులంచుం దలంచి
మమ్ముఁ బోధించుటకుఁగా మాయింటఁ బుట్టితి
మానవరూపము మమతఁ దాల్చి

తే. బహుళశక్తిసమన్వితుఁ బరమపురుషు
సచ్చిదానందరూపు నిన్ జనవు చేసి
యడుగుచుంటి విశోకుఁడ నగుచుఁ బ్రవ
జితుఁడనై పోవుట కనుజ్ఞ చేయు మనుచు. 234

వ. అనినం గపిలుండు తండ్రి కి ట్లనియె. 235

ఉ. నా మనుపల్కినట్టినుడి నాటుకొనం బొనరించువాఁడనై
ప్రేముడిఁ జేసి యి ట్లవతరించితి మీకు సుతుండనై ద్విజ
గ్రామణి నీవు ధన్యుఁడయి క్రాలుదు విం కిట సాంఖ్యయోగముం
భూమి వెలార్పఁ జేయుటకు బుద్ధియు నా కగు భూసురోత్తమా.

ఆ. నాయనుజ్ఞఁ జేసి నాయందు సర్వక
ర్మములు సన్యసించి ప్రవ్రజితుఁడ
వయి దురత్యయంబు భయదమహామృత్యువు
సంతరించి సుగతిఁ జనుము తండ్రి. 237

వ. నేను నాతల్లి కధ్యాత్మవిద్యం బోధించి సంసారసాగరంబు నివర్తించున ట్లనుగ్రహించి వత్తు ననినఁ గర్దముం డానందంబున నందనునకుం బ్రదక్షిణంబు గావించి మించుఁబోఁడికిం జెప్పి యప్పుడ వనంబునకుం జని మౌనవ్రతంబున నాత్మైకశరణుండై నిరహంకారుఁడును నిర్మముఁడును నిర్ద్వంద్వుండు నైన నిర్గుణపరబ్రహ్మంబు దృఢభక్తిం జేసి భావించుచుఁ బ్రత్యగాత్మునియందు నెనసినట్టి యేకాంతభక్తియోగంబున ముక్తబంధనుండై భాగవతగమ్యం బైనముక్తిం బ్రాపించె నని మఱియును. 238

ఆ. అవ్విధమునఁ దండ్రి యగుకర్దముఁడు ప్రవ్ర
జితుఁడ యైనపిదప సుతుఁడు కపిలు
డును జనిత్రితోడ మునివరాశ్రమమందు
నధివసించె మోద మతిశయిల్ల. 239

— కపిలుండు దేవహూతి కధ్యాత్మతత్త్వం బెఱింగించుట —

వ. అంత నొక్కనాఁడు దేవహూతి కపిలుం దరియ వచ్చి మహాత్మా! విషయాభిలాషంజేసి ప్రకాశంబు గానక చీఁకటిం బడి యుంటి దరి గానరాకున్నయది న న్ననుగ్రహించి నీసూర్యరూపంబుం జూపి కాపాడవే తండ్రీ! నిన్నుఁ దత్త్వవిజ్ఞానార్థం బాశ్రయించుచుంటి ననఁ గపిలుండు తలి కి టనియె. 240

సీ. అధ్యాత్మయోగ మయ్యాది సుఖదుఃఖముల్
దెగఁ జేయుటకు హేతు వగుటఁ జేసి
నిశ్శ్రేయసార్థము నిరత మద్దానిని
బురుషు లయ్యోగముఁ బొంద నెంతు
రది నీకుఁ జెప్పెద నాలకింపుము తల్లి!
పొదలుజీవులబంధమోక్షములకు
మనమె కారణ మయి తనరు ననాత్మీయు
లగుదారపుత్రాదులందు మమత

తే. మనము కామలోభాదు లగు మలము విడిచి
శుద్ధ మయి సమమై దుఃఖసుఖములందు
జ్ఞానవైరాగ్యముల భక్తిఁ బూని యున్న
మనుజునకు ముక్తి కరతలామలక మగును. 241

సీ. ఆత్ముఁడు కేవలుం డని ప్రకృతికిఁ బరుం
డని యపరిచ్ఛేద్యుఁ డని యదహ్యుఁ
డని యుదాసీనుఁడు నని యాత్మలోన నె
ఱుఁగఁ గల్గిన నరుండు భగవదధిక
భక్తియోగంబునఁ బరమాత్మసంగతి
గలిగినయట్టిఁడై వెలయుచుండు
భక్తికంటెను వేఱ పరమమార్గము లేదు
సాధుసంగము భక్తిసాధనంబు

తే. ఇతరకర్మములను రోసి సతము సాధు
జనులసాంగత్యమును దృఢజ్ఞానగరిమ
భక్తియుచు గల్గి యుండినపరమమునికి
ముక్తిమార్గము తెఱచినపోల్కి నుండు. 242

వ. మఱియు మూర్ఖచర్యలం దెగడి స్వార్థంబు విడిచి పరదుఃఖంబు
పరిహారించుచుఁ భూతంబుల యెడఁ గరుణం గలిగి యజాతశాత్రవు

లును సర్వసుహృదులై శమదమాదిసంపన్నతయు సాధుశీలతయుం గలవారు నాయెడ దృఢభక్తిం జేసి పరిత్యక్తకర్ములు మదీయకథాశ్రవణాసక్తులు మదధీనచిత్తులు నైనవారికిఁ దాపంబులు తవులం బోవు. వారే సాధువు లట్టిసాధుసంగంబు చేయం దగు సత్సంగమున నా కథలు సుధారససమంబులై కర్ణపేయంబులై సుఖప్రదంబు లగుఁ బురుషుం డైహికాముష్మికభోగములయెడ నిస్పృహుండై యోగంబునం జేసి యింద్రియంబుల నిగ్రహించి చిత్తంబు నాపైఁ దగిలించి వైరాగ్యవిరాజితం బగుజ్ఞానంబున నన్ను ధ్యానించుచున్న నన్నె ప్రాపించు ననిన విని దేవహూతి మహాత్మా! నీయెడం జెల్లుభక్తి యెట్టిది దేని నలవరించుకొనినఁ దాపత్రయంబు లడంగు నా కెల్లు నిరతిశయసుఖంబు గలుగుఁ దత్త్వావబోధంబున కంగం బెయ్యది వీని నెల్ల నాకు నెఱుంగఁ జెప్పు మనినఁ గపిలాచార్యుండు తల్లికి భక్తియోగసాంఖ్యతత్త్వం బి ట్లని చెప్పం దొడంగె. 243

—♦ సాంఖ్యతత్త్వప్రపచర్శనము ♦—

సీ. జ్ఞానేంద్రియంబులు కర్మేంద్రియంబులు
నేకాగ్రమనము ఫలేచ్ఛ లేక
యేయత్నమును లేక నాయెడ వర్తించు
టే భక్తి యనఁబడి యెసకమెసఁగు
ముక్తిసాధన మగుభక్తి భుక్తాన్నము
జఠరాగ్ని బలె పాపచయ మడంచు
నింద్రియవ్యాపార మెల్ల నాపై వైచి
నాదివ్యదర్శనానందు లగుచు

తే. ననుఁ దలంచుచు నాకథల్ వినెడువారు
భక్తిభరితులు గాకున్న ముక్తి వారి
కచిరసాధ్యమ యగు నణిమాదు లెల్లఁ
గోరకున్న వైకుంఠము వారి కబ్బు. 244

వ. మఱియు నాత్మజుని తెఱంగున స్నేహపాత్రుం డని సఖునిచందంబున విశ్వాసార్హుం డని గురువుపగిది హితబోధకుం డని యిష్టదైవంబువలెం బూజ్యుం డని స న్నాశ్రయించినవారిం గాలచక్రంబు గారింప దోరింపం జాలదు న న్ననన్యభక్తిన్ భావించినవారిసంసారతాపత్రయంబులం బాయం జేయుచుం బ్రధానపురుషుండ నగునావలనం గాక యొండొకనివలన భూతములకు భయనివృత్తి కానేరదు వినుము.

ఉ. వీవఁడు గాలి సూర్యుఁడును వేఁడి వెలార్పఁడు వహ్ని వెల్గఁగాఁ
బోవఁడు చంద్రముం డమృతముల్ వెదజల్లఁడు రేలు వజ్రియున్
భూవలయంబునం జినుకు పుట్టఁగ నీయఁడు శ్రాద్ధదేవుఁడున్
జీవులసంగ్రహించుటకుఁ జేరఁడు నాదగునాజ్ఞ గానిచోన్. 246

వ. తల్లీ! తత్త్వలక్షణంబు వివరించెద వినుము. 247

—♦ తత్త్వలక్షణము ♦—

సీ. ప్రత్యక్ప్రకాశుఁడు ప్రకృతికిం బరుఁ డగు
నాత్ముఁడే పురుషాఖ్య నలరుచుండు
నతఁడు దేహాద్యుపాధ్యంతర్గతుం డయ్యు
స్వప్నార్థముం బలె జన్మమృతులఁ
బొందఁడు కర్తనాఁ బోలఁ దోఁచి యకర్త
యై స్వతంత్రుం డయి సాక్షి యగుచుఁ
జనెడునాత్మునకు సంసారము బంధము
సుఖదుఃఖభోక్తృత్వసుగతి లేదు

తే. అనిన విని దేవహూతి యి ట్లనియె సృష్టి
కార్యములకుఁ గారణ మయి క్రాలునీశ్వ
రునకుఁ బ్రకృతికి లక్షణమును వినంగఁ
దలఁతు ననవుడుఁ గపిలుఁడు తల్లి కనియె. 248

వ. వినుము గుణత్రయసమన్వితంబును నవ్యక్తంబును గార్యకారణరూపంబును నిత్యంబు నగునది ప్రకృతి యనంబడుఁ జతుర్వింశతిసంఖ్యా

వశిష్టగణము ప్రధానకార్యం బని బ్రహ్మాదులు పలుకుదురు మహా
భూతంబు లైదు గంధాదు లగుఁ దన్మాత్ర లైదు నింద్రియంబులు
పది మనోబుద్ధ్యహంకారచిత్తంబులను చతుర్విధము లగునంతఃకరణ
వృత్తులునాలుగుంగూడి జతుర్వింశతిగణంబయ్యె నిదియే సగుణబ్రహ్మ
సన్నివేశము కొందఱు కాలమును నిరువదేనవదానిఁగాఁ దలంతురు
ప్రకృతిచేష్టలకుఁ గారణం బగునాభగవంతుఁడే కాలము భగవంతుఁడు
నిజమాయం జేసి పురుషరూపమున లోపలను గాలరూపమున వెలుప
లను దత్త్వసమన్వితుం డగు నతండు ప్రకృతియందుఁ జిచ్ఛక్తి నావ
హింపం జేసి మహత్తత్త్వమును సృజించె నది సూక్ష్మరూపమునఁ
దనలోనున్నవిశ్వమును బ్రకటింపఁ జేయుచుండును వాసుదేవవ్యూహ
సమన్వితం బైనచిత్తము మహత్తత్త్వాత్మకంబు చిత్తంబునకు స్వచ్ఛత్వ
మవికారిత్వము శాంతత్వ మనునవియె లక్షణంబులు మహత్తత్త్వము
వలన రజోగుణోద్రిక్తం బయినయహంకారము మానసేంద్రియో
త్పత్తికారణంబై వైకారికము తైజసము తామసము నాఁ ద్రివిధంబై
పుట్టె నది సత్త్వరజస్తమోగుణసంసర్గమున శాంతత్వమోదత్వమూఢ
త్వంబులం బొందు నందు వైకారికాహంకారమున సంకల్పవికల్పంబులు
లక్షణంబులు గా మనస్తత్త్వ ముదయించె నది యనిరుద్ధునిచే నధిష్ఠి
తం బగు తైజసాహంకారమునఁ ద్రచ్చి బాహ్యాస్ఫురణరూపవిజ్ఞాన
కారణంబై యింద్రియగ్రాహకబుద్ధితత్త్వం బుదయించె జ్ఞానేంద్రియ
కర్మేంద్రియములు తైజసములే యనం దగుఁ దామసాహంకారమున
శబ్దతన్మాత్రంబు పుట్టె దాన నాకాశంబు గలిగె శబ్దము శ్రోత్రము
గ్రాహ్య మగుచుండు శబ్దతన్మాత్రం బయినయాకాశమున స్పర్శ
తన్మాత్రంబును దాన వాయువునుం బుట్టె మృదుత్వకఠినత్వశీతత్వో
ష్ణత్వము లనునివి స్పర్శలక్షణంబు లిట్లు పూర్వభూతములతో నుత్త
రోత్తరభూతంబులతో సమన్వయించిన పృథివికి శబ్దస్పర్శరూపరసగం
ధము లైదు నాకాశేతరముల కొక్కొక్కటి తక్కువగా సమన్వ

యించినభూతములగుణంబులు సంభవమాత్రమునను బదాన్వయము లేమిం జేసి యాకాశమునకు శబ్దగుణం బొక్కండ యయ్యె మహదాదికంబు లగునీయేడు నొండొంటిం గలియక యండకోశమును సృజింపం జాల వయ్యె నీశ్వరుండు కాలకర్మగుణోపేతుండై యందుఁ బ్రవేశించుటం జేసి మహదాదులం గూడినయండ ముద్భవించు నది జలాద్యావరణములలోపలను బ్రధానావరణములవెలుపలను నావృతం బగు నదియె భగవంతునిరూపం బగు నాహిరణ్మయాండకోశమునుండి లేచి దానినావేశించి బహువిధేంద్రియచ్ఛిద్రములంగావించు నాకర్ణింపుము.

సీ. ఆపురుషునకు మున్నాస్యము జనియించుఁ
బిదప వాణియు వహ్ని యుదయ మగును
నాసికాద్వయము బ్రాణము ననుస్యూత మా
ఘ్రాణేంద్రియమ్మును గాలి పుట్టు
నక్షిగోళములందుఁ జక్షుస్సులును సూర్యుఁ
డును గర్ణములు శ్రోత్రమును జనించు
నవ్వలఁ ద్వక్కు రోమాళియు నోషధుల్
పురుషాంగము గుదంబు భువనములును

తే. కాలుసేతు లుపేంద్రుఁడు గతియు నవల
నాడులును లోహితమ్మును నదులు మఱియు
నుదరమును క్షుత్పిపాసలు నుదధి హృదియు
మనము చంద్రుఁడు బుద్ధియు జనన మగును. 250

వ. మఱియు బ్రహ్మయు నహంకారంబును రుద్రుండును జిత్తము క్షేత్రజ్ఞుఁడు గలుగు సమవాయమెల్ల నాయండంబునకుఁ బ్రవృత్తిం గలిగించు నగ్ని వాయువుతో ముఖమును వాయువు ఘ్రాణముతో నాసికమును సూర్యుఁడు చక్షుస్సుతో నక్షిగోళంబును దిక్కులు శ్రోత్రముతోఁ గర్ణములను నోషధులు రోమములతోఁ ద్వక్కును జలములుపస్థేంద్రియముతో బురుషాంగంబును మృత్యువు పాయ్వింద్రియ

ముఖంబుతో గుదంబును నింద్రుఁడు బలముతోఁ జేతులను జంద్రముఁడు మనస్సుతోడను బ్రహ్మ బుద్ధితోడను రుద్రుఁ డహంకారముతోడను హృదయంబునం జొచ్చి కార్యంబు నిర్వహించున ట్లుండియు నండంబు ప్రవృత్త్యున్ముఖముగామి క్షేత్రజ్ఞుండు చిత్తముతో హృదయంబునం బ్రవేశించునపుడది సలిలములనుండి ప్రకృతిక్షేమం బగునట్టిపరమపురుషునిం దెలిసి నుతింపం దగుఁ బురుషుండు నిర్వికారుండు గావున జలంబులం బ్రతిఫలించుసూర్యుఁడు జలసంబంధము గాంచనివిధంబునఁ బ్రకృతిగుణంబు లగుసుఖదుఃఖాదులం బొందఁడు పురుషుండు రాగద్వేషాదులం దగిలి యుత్తమమధ్యమాధమము లగు దేవమనుష్యతిర్యగ్జన్మము లెత్తి కర్మాధీనసుఖదుఃఖంబు లనుభవించుచు సంసారమార్గంబునం బరిభ్రమించుచు విషయములదెస చరించువానికి సంసృతి నివర్తిల్లదు కావున మనస్సు నిరంతరాయం బగుభక్తియోగంబున భగవధ్యానంబునకుం జొనుపవలయు సత్యవచనము మత్కథాశ్రవణము నిర్వైరము సంగత్యాగము బ్రహ్మచర్యము మౌనముంగలిగి మునివ్రతుండై శాంతుండై యాత్మదర్శనుండై యున్నచో నరుండు పరిపూర్ణం బగుబ్రహ్మంబు నొందఁ గలుగు నని చెప్పిన విని దేవహూతి తండ్రీ! ప్రకృతిపురుషుల కన్యోన్యాశ్రయంబున నిత్యత్వంబును దోఁచుచుండెడు వాని కెప్పుడు వ్యతిరేకస్థితి గానరాదు. అకర్తయగుపురుషునకుఁ గర్మబంధంబు ప్రవర్తిల్లు నట్లుండ నప్పురుషునకు విముక్తియుఁ గైవల్యంబు నెట్లు గలుగుఁ దత్త్వవిమర్శనమున సంసారభయంబు వోయినను బ్రకృతిసంబంధ ముండుటం జేసి సంసారబంధము మఱియుం రాక యుండునే యనిన నతం డి ట్లనియె. 251

సీ. సాధనసంపత్తి చాలనిచో వెండి
సంసృతిబంధం బెసఁగుఁ గాని
చాలి తత్త్వజ్ఞానసంపూర్ణుఁ డైనచోఁ
బ్రకృతిబంధంబునఁ బడలు వడఁడు

విసుము ఫలాపేక్ష విడిచి వర్ణాశ్రమో
చితధర్మకర్మముల్ చేయుచున్నఁ
బరిశుద్ధమతి ధ్యానపరత సేవించినఁ
గలిగినవిజ్ఞానగరిమవలన

తే. గాఢవైరాగ్యమునఁ దపఃకలితయోగ
మున నరణిజాతవహ్ని దానిని దహించు
నట్లు ప్రకృతిబంధములెల్ల నడఁగిపోవు
వానికిఁ బెండి బంధముల్ గానఁ బడవు. 252

తే. స్వప్నముననుశిరశ్ఛేదసరణి నైన
మేలుకొన్నపై నాదోషము పోలెఁ దోష
నట్టు లజ్ఞానమున బద్ధుఁ డయిన వాఁడు
జ్ఞాని యగు నేని బంధము గలుగఁ బోదు. 253

ఆ. ఆత్మశుద్ధి గలిగి యధ్యాత్మరతుఁ డయి
బ్రహ్మవఱకు గలుగువస్తుజాల
మెల్ల నశ్వర మని యెంచి విరక్తుఁ డై
ముక్తుఁ డగును నాదుభక్తివలన. 254

వ. స్వధర్మాచరణము విధర్మనిరసనము దైవసంప్రాప్తార్థసంతృప్తి యాత్మవిత్సమర్చ త్రివర్గధర్మనివృత్తి మోక్షధర్మాసక్తి మితశుద్ధాహారభోజనము విజనదేశవాసము నహింస సత్య మస్తేయము బ్రహ్మచర్యము తపస్సు శౌచము స్వాధ్యాయము భగవదారాధనము మౌనము స్థైర్యము ప్రాణవాయువశీకరణము మానసేంద్రియనిగ్రహణము హరిలీలాచింతనము చిత్తైకాగ్రీకరణము ననువాని నవలంబించి యసత్పథంబునం బోవుమనస్సు సరికట్టవలయును శుచిప్రదేశమునఁ స్వస్తికాసనంబున నాసీనుండై పూరక కుంభక రేచకంబులఁ బ్రాణమార్గంబు శోధించి చిత్తము చలింపనిచందంబునం జేసి శ్వాసలయంబున మనోనిర్మలత్వము గలిగించుకొనం దగు యోగధారణంబున మనస్సు నిర్మ

లం బగు నప్పుడు నాసికాగ్రంబు గుఱిసేయుచుఁ బ్రసన్నవదనంబును శంఖచక్రగదాపరిష్కారమును శ్రీవత్సలాంఛనంబును గౌస్తుభోజ్జ్వలంబు నగుభగవన్మూర్తి ధ్యానించుచు నాగుహాశయుని మదిం జలింపకుండునట్లు నిలుపవలయు నప్పుడు. 255

సీ. కలుములజవరాలు కడకఁ బాదము లొత్త
గరుడి శిరంబుపైఁ గరము సైచి
యతసీకుసుమసమశ్యామలాంగంబున
బంగారుదువ్వల్వ రంగు లీనఁ
గటిఁ గింకిణీరవకలితకాంచీకలా
పము మెఱ్ఱుఁదీవనాఁ బస నెసంగ
బమ్మదేవరఁ గన్నతమ్మిపూ పొక్కిలి
యెల్ల జగములకుఁ దల్లి గాఁగఁ
తే. కౌస్తుభంబును వనమాలఁ గడలఁ ద్రోచి
పచ్చవిల్తునితల్లి తా నిచ్చఁ గాపు
రమ్మొనర్చెడు వక్షస్థలమ్ము గ్రాల
నింపుమీఱెడుతేని ధ్యానింప వలయు. 256

క. ఇవ్విధమున హరిపై మది
నివ్వటిలం జేసి భక్తి నిభృతాత్ముండై
యెవ్వఁడు ధ్యానించెడి నో
యవ్వానికిఁ బుట్టుచావు లంటవు తెలియన్. 257

వ. భక్తుం డగునట్టివాఁడు సుఖదుఃఖరహితం బై నమనోవృత్తిం బేసి బ్రహ్మజ్ఞానసంపన్నుండై యపరోక్షీకృతాత్మతత్త్వుండై సుఖదుఃఖాదు లహంకారకృత మగుసహాకారమును కాని తనకు లే వని తెలిసికొనం గలండు. మఱియు సురాపి మీఁదివస్త్ర మున్న లేకున్న నెఱుంగకుండినట్లు యోగి యగునతండు దేహ ముండినం బోయిన దానిం దలంప నేరండు. ఆత్మతత్త్వవిదుం డగునాజీవన్ముక్తుండు సమాధి నధి

రోహించి యుండుం గావున స్వప్నతుల్య మగునా దేహమును గ్రమ్మ అం గ్రహింపం బోవండు మఱియును సర్వభూతములలో నాత్మయు నాత్మలో సర్వభూతములును భూతములలో నాత్మతత్త్వమును యోగి చూడం గలం డనిన దేవహూతి మహాత్మా! ప్రకృతిపురుషాదిలక్షణము సాంఖ్యశాస్త్రోక్తప్రకారంబునం జెప్పితి వింక దానికిం బ్రయోజనం బయిన భక్తియోగమార్గంబును గాలలక్షణంబు నెఱిఁగింపు మనినఁ గపిలమునీంద్రుం డి ట్లనియె. 258

తే. పుడమిని స్వభావగుణభేదములను జేసి
పురుషులకు నభిప్రాయముల్ పరఁగు భేద
ము లయి భక్తియోగమును బెక్కులు ప్రకార
ముల నెసఁగు దానిఁ జెప్పెదఁ దెలియ వినుము. 259

వ. హింసంజేసి కాని దంభంబునం గాని మత్సరంబునం గాని పూని క్రోధియై విభేదంబునం జేయు భక్తి తామసంబు విషయంబు గోరి కాని యశముఁ గోరి కాని యైశ్వర్యముం గోరి కాని ప్రతిమాదుల నర్చించుభక్తి రాజసంబు పాపక్షయంబునకుం గాని యీశ్వరప్రీత్యర్థము కాని శాస్త్రానుసరణార్థము కాని భేదమతింజేయు త్రివిధ భక్తి సాత్త్వికము నాఁబడు నీతొమ్మిదింటిలో నుత్తరోత్తరం బుత్తరంబు శ్రవణకీర్తనాదిభేదంబుల నవవిధంబు లైనభక్తియోగము పూర్వోక్తనవభేదమ్ములఁ దొంబదియొక్కండు భేదమ్ము లయ్యె నవి సగుణభక్తిప్రకారంబులు సర్వగుణాశ్రయుం డైన నాపై నవిచ్ఛిన్నముగ మనంబునఁ బ్రసక్తి గలుగ ఫలాపేక్షయు భేదబుద్ధియును లేక ప్రవర్తించుట నిర్గుణభక్తియోగంబునకు లక్షణంబు లట్టినిర్గుణభక్తియోగముం గొన్నవాఁడు నాసాలోక్యముంగాని సారూప్యముంగాని సామీప్యముం గాని సాయుజ్యముం గాని చేకొనం దలంపక మత్సేవాసక్తుం డై యుండు. 260

తే. సర్వభూతాత్ముఁ డగు నేను సర్వభూత
తతుల నుండు నిది యెఱుంగ కతఁగు లగుచుఁ

బ్రతిమ లర్చింతుర తత్పూజ భస్మహోమ
సదృశ మగు నని తెలియు మోజనని నీవు. 261

మ. తనయం దుండెడునేన యన్య మగుభూతవ్రాతమం దుండు నం
చు నెఱుంగం గలవాఁడు గాక పెర లంచున్ భేదభావంబు గై
కొని వర్తించెడువానిపైఁ గరుణ యేకొంచెంబునే నిల్ప కా
జనసామాన్యన కేను మిత్తి నగుదున్ సాధింతు భీతిం గడున్. 262

వ. కావున సర్వభూతమయుండ నైననన్ను సమదర్శనంబున నర్చింప వలయు నచేతనంబులకంటెఁ జేతనాన్వితంబు లుత్తమంబులు వానిలోఁ గీటాదులకంటె జతుష్పదంబులు వానిలో నశ్వాదులకంటె ధేన్వాదులు వానికంటె మనుష్యులు వారిలో బ్రాహ్మణులు శ్రేష్ఠులు. వారిలో వేదవాదులు వారిలో నర్థజ్ఞానవంతులు వారిలో మీమాంసకులు వారిలో స్వధర్మానుష్ఠానపరులు వారిలో ముక్తసంగు లుత్తమోత్తము లట్టివారు సర్వకర్మములును దేహేంద్రియాదులు సర్వంబును నాకు సమర్పణము చేసినవారు నాకు సన్నిహితులు సర్వోత్తములు వరవర్ణినీ! భక్తియోగాష్టాంగయోగము లెఱింగించితి నిందొక్కఁడు నేనియుఁ దగిలినపురుషుండు పురుషోత్తముం జేరు నింకఁ గాలస్వరూపంబు చెప్పెద నాలకింపుము. 263

—• కాలస్వరూప నిరూపణము •—

సీ. అత్యద్భుతప్రభావాతిశయుం డగు
పరమాత్మ యేకాల మరయ నగును
నఖిలాశ్రయం బగునక్కాలమే చంపు
భూతజాలములను భూతసమితి
యజ్ఞఫలప్రదుం డగువిష్ణు వక్కాల
మును వశంబున నిల్పుకొనఁ గలిగిన
వానికిం బ్రభు వగువాఁడు మిత్రుం డని
శత్రుం డనుచు వేని స్వాంతమందుఁ

తే. దలఁపఁ బోవఁడు కాలము తెలియ నంతి
కాల మతఁ డపరిమత్తుఁడై కాలమునకు
వెఱవ నగుఁ గాలమునఁ జేసి వీచుఁ గాలి
యెండ గాయును సూర్యుఁడు నెఱియు నగ్ని. 264

చ. కురియును వాన లిందుఁడు నకుంఠితరీతి వెలుంగు చంద్రుఁడుం
దరువులు పండ్లు పుష్పము లుదారత నిచ్చు నదీనదంబు లు
ర్వరఁ బ్రవహించు సంద్రములు వాసి మెలంగుచు నుండు నేలలుం
నిరతము పండుచుండును గణింపగఁ గాలమహాత్త్వసంగతిన్. 265

తే. జంగమస్థావరాత్మకజగము లెల్ల
స్వవశమున నిల్పుకొనునట్టిబ్రహ్మముఖ్యు
లెల్లఁ గాలమునకు బద్ధు లెన్నఁ గాల
మే సకలసౌన్య మొనరించు నింతలోన 266

క. కాలము బలవత్తరమై
లీలం బ్రాణులను గర్భలీనము గాఁగన్
జాలి పొనర్చుచు నుండన్
బాలిశు లెఱుఁగంగ లేనివా రగుదు రిలన్. 267

వ. అనిత్యం బగు దేహమును బుత్రమిత్రకళత్రాదులును నిత్యము లను కొని తత్పోషణార్థం బనేకోచ్చనీచకార్యంబు లాచరించుచు దానం దాను గృతార్థుండ నని తలంచుచు సంసారకష్టంబులకుఁ బాల్పడుచు మూఢుండై దురితంబు లెడ తెగక చేయు నదియ పరమ సుఖం బని తలంచుచు నధోగతుం డగు మఱియు నయ్యధముండు జీవికం గోరుచుఁ బడరానిపాట్లం బడుచు దుర్బలుండై లోకాభిభూతుండై మందభాగ్యుండై వితథప్రయత్నుండై కృపణుండై నానావిధంబులకు లోనయి వనటంబడుచు రోగపీడితుండై తుదకుఁ గాలపాశగతుండై వేదనాభరంబున వేఁగుచుం బ్రాణత్యాగంబు సేయు నపుడు యమ దూత లిరువురు వచ్చి వాని యాతనాదేహంబునం జొనిపి కాల

పాశంబులం గట్టి కాలునికడకుం దోడ్కొనిపోవుచు రపుడు వారి యదల్పులు గుండియ లవియం జేయ గడగడ వడంకుచు నత్యంతార్తుండై తాను జేసినపాపంబు తలంచుకొని తల్లడిల్లుచు నాఁకట నకనకపడుచు డప్పి పెల్లునఁ దల్లడిల్లుచుఁ నానావిధనారకంబుల ననంతదుఃఖంబు లనుభవించుచుఁ దొంబదితొమ్మిదియోజనంబులు గలనరకమార్గంబున నల్లాడి పోయి యంధతామిస్రాదుల వేనవేల సంవత్సరంబులు వేఁగివేఁగి యెట్టకేల కటనుండి విముక్తుండై పాపశేషంబున నీచజన్మంబు లెత్తుచుండు. 268

— • పిండోత్పత్తి ప్రకారవర్ణనము • —

సీ. కర్మఫలంబును గలిగిన జీవుఁడు
పురుష రేతఃకణమునకుఁ జేరి
స్త్రీగర్భమునఁ జొచ్చి దిన మొందు శోణిత
సంబంధమును గల్గి సరిగ మూఁడు
దినములలోన గుండ్రనిరూపముం దాల్చి
పదిదినంబుల రేఁగుపండు బోలు
నుండయై యొగి మాంసపిండాకృతిం దాల్చి
యొక నెలకుఁ శీర్ష మొప్ప నగుచు
తే. నెలలు రెం డగువఱకుఁ జేతులును గాళ్ళు
మొద లగునవయవములును మూఁడు నెలల
కు నఖరోమాస్థిచర్మలింగనవరంధ్ర
ములు నుదయ మగు నలపిండమునకు వ్యాత్రేయ. 269

వ. నాల్గవమాసంబునకు సప్తధాతువులు నైదవమాసమునకు క్షుత్పిపాసలు నాఱవమాసంబున జరాయువేష్టితుఁడై తల్లిగర్భంబు దక్షిణభాగంబునం దిరుగుచుండు నప్పుడు మాతృభుక్తాన్నపానాదులధాతువృద్ధిం బొరయుచు నట నున్నక్రిములు తన సుకుమారాంగంబులం గొఱికి తినం జలించుచు మాతృభుక్తకటుతీక్ష్ణలవణక్షారాదుల

రసంబు మేనం దాక బాధపడుచుఁ [illegible] ర్థసంబై దేహ
మునకుఁ జాలినయెడంబు లేక వీపు తలయు వాంచి పొట్టం దగులఁ
బెట్టికాలు సేయి గదలింప లేక వీఁకచెడ నాజీవుండు తనకు జన్మ
స్థానం బగువిణ్మూత్రగర్తమునం బడి పూర్వస్మృతి గలిగి తనపూర్వ
కర్మముం దలపోయుచు నిట్టూర్చుచుండి యేడవనెల వచ్చినది మొదలు
ప్రసూతివాతక్షోభంబునఁ గంపించుచు సప్తధాతుబంధనంబునకుఁ బరి
తపించుచుఁ బరమేశ్వరుని నిట్లు స్తుతించు. 270

తే. భువనములు చేసి వానినిఁ బ్రోచుపొంటెఁ
బెక్కు లవతారముల నెత్తి పేర్మిమీఱ
దుష్టసంహార మొనరించి శిష్టజనుల
గాచి రక్షించు నో దేవ కయి మొగుడ్తు. 271

తే. జంగమస్థావరముల నేస్వామి లీన
మగుచు నుండియు జగమెల్లఁ దగ భరించు
విభుఁడు త్రైకాలికజ్ఞానవిభవ మిపుడు
నాకు దయ చేసె నతనికి నతి యొనర్తు. 273

శా. దేవా గర్భములోనివిట్టున నిటుల్ దీనుండనై యుండియుఁ
నే విజ్ఞానము గల్గి నిన్నుఁ దెలియన్ నేర్పంది యున్నాఁడ నీ
పై విచ్చేసినమాయ నన్నలము నిన్ బాటింపఁ జాల్ శక్తియున్
బోవుం గావున విట్టు దించు నిచటన్ బోఁ ద్రోలుదుం గాలమున్.

తే. వెలికి వచ్చిన సంసృతిం గలుగు సేగి
యిచట నుండుట జీవికి నెంతసుఖమొ
చెప్ప నేటికి దేవ నాతప్పు సైచి
నాకు నీరెండు లేకుండ వాఁకొసఁగదే. 274

వ. అని యనేకవిధంబులఁ దనలోఁ దాను జింతించుచుండు నంత నవ
మాసంబులు కడచినపదంపడి ప్రసవసమయంబునఁ బ్రసూతివాతం
బునఁ దలక్రిందై వివశుండును వివేకశూన్యుండునై జీవుం డతికృచ్ఛ్రం

బునఁ గర్భద్వారము నుండి బైటంబడి జరాయుపరివేష్టితుండు మూత్రపురీషమగ్నుండునై నేలం బడి యేడ్చుచు నెట్లో పెఱిఁగి మలమూత్రకలితం బగు శయనంబున శయనించుచుఁ గదల మెదల లేక తనమేను తాన గీకికొనుచు మశకమత్కుణాదులు కుట్టిన నేడ్చుచు నిట్లు శైశవదుఃఖంబులం గుడిచి కుడిచి పంచవర్షంబులవాఁడై పౌగండదశం బ్రాపించి యధ్యయనాదిక్లేశంబులకై పదంపడి యౌవనము రాఁ బెండ్లియాడి బిడ్డలం గని సంసారతాపత్రయంబునఁ వేఁగుచుం జచ్చి తొల్లింటినరకంబునకుం బోవు వెండియుం బుట్టు నిట్లు విజ్ఞానవిరహితుండై జీవుండు పరిభ్రమించుచుండు నని మఱియును. 275

సీ. సత్యదయాశౌచశమదమాదులు పాయఁ
సలిపెడునద్ది స్త్రీసంగమంబు
దానను గలుగునంతటిమోహబంధము
కడమ వేనింజేసి కలుగఁ బోదు
పరమేష్ఠి యంతటివాఁడును దనకూఁతు
నరసి మోహాక్రాంతుఁ డగుచు మీఁదఁ
బడనున్న నది వడివడి మృగియై పాఱఁ
దానును మృగ మయి తవిలి పాఱె

తే. నకట యే మందుఁ దత్సృష్టియందుఁ వెదుకఁ
నొక్కనారాయణఋషీంద్రుఁ దక్క నొం డ్రొ
కని వచింపఁగ నుండునే కన్నతల్లి!
యది మహామోహయంత్రము యగును గాదె. 276

తే. నారకద్వార మైనస్త్రీ నన్నుఁ జూడఁ
గోరు వారి కేనాఁడును గూడని దగు
నది తృణచ్ఛన్నకూప మా నరయ నట్టి
వానికిఁ మృత్యుదర్శన మా నిజంబు. 277

తే. జన్మమృత్యుపరంపరాజనిత మైన
దేహమునయందు మోహముం దెగడి విడిచి

ముక్తసంగుఁడు ధీరుఁడై భక్తిఁజేసి
నన్ను సేవించి ముక్తుఁడౌ సన్నుతమతి. 278

—♦ కర్మఫలప్రిపచనము ♦—

వ. ఇంకఁ గర్మములు తత్ఫలంబులునుం జెప్పెద వినుమని కపిలుండు
వెండియును. 279

సీ. కామకాముం డయి కర్మమం దాసక్తిఁ
గ్రతువులఁ గావించి పితృగణంబు
నితరగణంబును సతము పూజించెడు
నతఁ డింద్రజగతికి నరిగి భోగ
మనుభవించినవయి నావృత్తి నొందెడు
నతనికి నిత్యత్వ మందు లేదు
నిష్కాముఁడై చేసి నిత్యనైమిత్తిక
కర్మముల్ నాకొసంగఁగ నతండు

తే. నిర్మలుండు ప్రశాంతుఁడు నిర్మముండు
నగుచు రవిమార్గమున వచ్చి యఖిలలోక
వల్లభుండు పరాపరేశ్వరుఁడు పరుఁడు
నైననన్నుఁ బొంది సుఖయించు ననవరతము. 280

వ. పరమేశ్వరభావమున హిరణ్యగర్భు నుపాసించువారు బ్రహ్మలోకముం బొందుదురు వారు బ్రహ్మదేవునకు ద్విపరార్థంబులు నిండి బ్రహ్మాండము నుపసంహరించి పరమేశ్వరుం జెందు నెడఁ దామును నా వేదగర్భునితో బ్రహ్మంబు నధిగమింతురు భేదదర్శనంబు లేక కేవలము భగవంతు నుపాశించువా రాక్షణంబ యపరోక్షముగ భగత్పదంబు నొంది పరమానందభరితు లగుదురు కావున నోతల్లీ! నీవు సర్వభూతేశ్వరుని భక్తిభావమున భజింపుము వేదగర్భుఁ డైనచతుర్ముఖుండు యోగసిద్ధు లగుసనత్కుమారాదులు భేదదర్శనంబునం జేసి కల్పాంతంబునఁ బునరావృత్తిం జెంది నిష్కామకర్మానుష్ఠానంబున సంసారం

బునకుం బాలుగాక తొంటియ ట్లాధికారికపదంబు నొందుదురు భేద దర్శనంబున బ్రహ్మాదులకును బునరావృత్తి యగుఁ గర్మాసక్తులై కార్యకర్మము లాచరించుచుఁ గామ్యఫలాపేక్షులై త్రివర్గమాత్ర పరులై హరికథామృతపానపరాఙ్ముఖు లగువారు దైవోపహతులై పితృలోకమునకుం జని యచటఁ గర్మభోగములం గుడిచి ఫలాంత మునఁ బునరావృత్తి నొంది సంసారరూపకం బగుజన్మంబు లెత్తుచుం దురు. సాధ్వీ ! నీవు సర్వభావంబుల భగవంతు నారాధింపుము భగ వద్భక్తియోగ ముత్తమజ్ఞానంబు గలిగించు జ్ఞానమాత్రం బైనపర మానందస్వరూపంబే పరబ్రహ్మం బనియుఁ బరమేశ్వరుం డనియు వాకొనం బడు నతం డొక్కం డయ్యుఁ బరాఙ్ముఖేంద్రియంబులం జేసినవిభ్రాంతిం జేసి మహత్తత్త్వ మనియుఁ ద్రివిధాహంకారమనియుఁ బంచవిధభూతంబు లనియు నేకాదశేంద్రియంబు లనియు జీవరూపుం డనియు నండకోశదేహుం డనియుఁ దోఁచుచుండు యోగాభ్యాసంబున నిస్సంగుం డైనముని దీనిం గ్రహించి ముక్తుం డగు మఱియు జ్ఞాన యోగమున కాత్మలాభము భక్తియోగమునకు నీశ్వరప్రాప్తియుం బ్రయోజనంబులు మఱియు భగవత్ప్రాప్తికిఁ బెక్కుమార్గంబు లిష్టా పూర్తంబులు దానతపస్స్వాధ్యాయంబులుకర్మసన్న్యాసంబును బ్రవృత్తి నివృత్తిరూపధర్మములును దత్త్వావబోధనంబును వైరాగ్యంబును భగవంతుఁ డొక్కఁడే యని తలంచువారికి నుత్తమగతులు సిద్ధించు ఖలుఁ డవినీతుఁడు దురాచారుఁడు నభక్తుఁడు భాగవతద్వేషుఁ డైన వాని కొకప్పుడు నీశ్వరానుగ్రహంబు గలుగ నేరదు తల్లీ ! యీత త్త్వంబు శ్రద్ధావంతుఁడు భక్తుఁడు సర్వభూతసముఁ డగు శాంతచిత్తు నకుం జెప్పఁ దగుఁ గాని పెఱకుం జెప్పరా దీయోగంబు శ్రద్ధాభక్తి యుక్తుం డై వినువాఁడు పఠించువాఁడును మత్పదంబున నివసించు ననిన విని దేవహూతి మోహంబు విడనాడి సాంఖ్యాచార్యుం డైనకపిలుని బరమార్థబుద్ధిం జేసి మ్రొక్కి యి ట్లని ప్రస్తుతించె. 281

—♦ దేవహూతి కపిలాచార్యుం బ్రస్తుతించుట ♦—

సీ. నీకుఁ బుట్టినబ్రహ్మ నీరూపమును గన
నోపక ధ్యానించె నోపికమెయి
నీవు నిష్క్రియుఁడవై జీవుల భోగార్థ
మీజగంబు సృజింతు వీశ్వరేశ
సంవర్తమున మాయ సలుపుచు శిశు వయి
పవ్వళింతువు వటపత్రమందు
నీబొజ్జలో నష్ట నిఖిలజగంబులు
నిమిడియుండినవయి నెఱి వహించు

తే. అట్టినీ వెట్లు నాగర్భమందు నిమిడి
యుండితివొ యెట్లు పుట్టితివో యెఱుంగ
శిష్టుల ననుగ్రహించియు దుష్టజనుల
నిగ్రహింపఁగ నైననిన్ నే భజింతు. 282

వ. కారణార్థంబుగ వరాహాద్యవతారంబులుం బలె నీయవతారంబును
నధ్యాత్మవిద్యోపదేశార్థం బని నేఁ దలంతు. 283

సీ. నీనామముఁ దలంచి నిన్ను భజించినఁ
జండాలుఁడును బ్రహ్మసముఁడ యగును
జపతపస్స్వాధ్యాయసత్కర్మములు నీదు
స్మరణంబున కొకింతసాటి రావు
నిను నాదుగర్భమునను గంటిఁ దొలి నే
ఫలిపినపుణ్య మేసరణి నగునొ
పరమాత్మునిం బరబ్రహ్మముఁ బరమేశు
విషయసంపర్కము విడిచినట్టి

తే. చిత్తమునఁ జేసి నిన్ను భజించుచుంటి
నాదుసర్వాఘములుం ద్రెంచి నాకు నీదు

సచ్చిదానందరూప మై సత్య మైన
దివ్యపదము నొసంగవే దేవదేవ. 284

వ. అని యివ్విధంబున దేవహూతి ప్రస్తుతించినఁ గపిలాచార్యుండు మాతృవత్సలుండై మధురమంజులవచోరచనల నాయమ్మం బ్రశంసించుచు నమ్మా! నీ వీమార్గం బనుష్ఠించిన నింతలోన జీవన్ముక్తిఁ గాంతు వని నతి యొనర్చి పోయివత్తు నని వీడ్కొని యథేచ్ఛం జనియె దేవహూతియు నాయుపదేశంబున యోగాదేశంబున నాబిందుసరోవరాశ్రమంబునఁ ద్రిషవణస్నానం బొనర్చుచుఁ జీరవల్కలంబులుధరించి నియమవ్రతంబులం జేసి యోగసాధనంబునఁ బుత్రరూపుం డైనహరిఁ ధ్యానించుచు నారూఢవైరాగ్యంబున బ్రహ్మజ్ఞానపరిశుద్ధాంతఃకరణంబున భగవంతుని ధ్యానించుచు భగవత్పదవాచ్యం బైన బ్రహ్మంబునందు నిలిచి జీవభావనివృత్తిం గాంచి నిత్యప్రతిష్ఠితసమాధియోగంబునం జేసి మేల్కొన్నవాఁడు స్వప్నముం దలంచినట్లు సర్వముం దలంచుచు నిజదేహవర్తనం బెఱుంగక నిత్యముక్తుం డైనపరమాత్మం బ్రాపించి జీవన్ముక్తి నొందె నాస్థలం బిప్పటికిని సిద్ధిపదంబు నాఁబడి పరమపావనక్షేత్రం బై ప్రశస్తిం గాంచుచుండె నంత నా దేవహూతి దేహంబు శిథిలంబై ధాతుమలంబు లెల్ల నశింప యోగమహిమంబునం జేసి నదియై ప్రవహించి సిద్ధిప్రదం బయ్యె. 285

మ. కపిలుం డట్టులు తల్లి వీడుకొని వేడ్కన్ సిద్ధసంసేవ్యమై
సుపవిత్రంబు సముద్ర[illegible]ము సంశుద్ధంబు నీశాన్యది
గ్విపులావేద్యము సుప్రసిద్ధ మగుసుక్షేత్రంబునం దుండి లో
కపరిక్షేమము నీహ సేయుమదిఁ గోఁ గావించె యోగస్థితిన్ 286

వ. ఇది కపిలదేవహూతి సంవాదరూపం బైనసాంఖ్యయోగంబు దీని విన్నవాఁడు భగవత్పదాబ్జంబులం బ్రాపించు నని మైత్రేయుండు విదురునకుం జెప్పె నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకుఁ జెప్పె నని సూతుండు శౌనకాదులకుఁ జెప్పె. 287

తృతీయస్కంధాంతము.

ఉ. శ్రీయుతుఁ డై సమస్తనృపశేఖరవర్ణితవైభవుండు నై
పాయనిపేర్మిఁ బెంపుననుఁ భాసిలుచుం గవిలోకమాన్యుఁడై
న్యాయపథైకవర్తి యయి నల్వలరాలెడుసాగిసూర్యనా
రాయణరాజు రాజజననైకవిభూషణుఁ డొప్పుఁగావుతన్. 288

క. శ్రీకృష్ణభక్తిభరితుం
డై కృష్ణునిపేర దివ్య మగుభవనము వి
ద్యాకమనీయముగా సు
శ్లోకుఁడు నిర్మించె బ్రభువులుం గవు లెన్నన్. 289

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణభాగవతంబునందుఁ
దృతీయ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

—:0:—

శ్రీరస్తు

శ్రీకృష్ణభాగవతము

చతుర్థస్కంధము

-:0:-

క. శ్రీకృష్ణభాగవత మీ
లోకంబునఁ గలుగుకృతులలో వర మనుచున్
గైకొనియెఁ గోరి రాజ
శ్రీకుఁడు నారాయణుండు కృష్ణప్రియుఁడై. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె నట్లు మైత్రేయుండు సాంఖ్యయోగప్రభావంబు విదురున కెఱింగించె ననిన విని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రుం గాంచి మఱియు మైత్రేయుండు విదురున కేమి చెప్పె నెఱింగింపు మనిన నతం డతని కిట్లనియె. 2

—♦ స్వాయంభువమనుసంతానము ♦

సీ. ♦వినుము స్వాయంభువమనువునకున్ శత
రూప నాఁబడెడుసరోజనేత్ర
యందు నాకూతియు నలదేవహూతి ప్ర
సూతి యన్ మువ్వురు సుతలు పుట్టి
రపుడు భ్రాతలు గలదైన నాకూతినిఁ
బుత్రికాధర్మము పోలఁ జెప్పి
మనువు రుచి యనంగఁ జనుప్రజాపతి కిచ్చె
శతరూప తన కనుమతి యొసంగ

♦ పుత్రసంతానములేనివాఁడు తనపుత్రికం గన్యాదానము చేయునప్పుడు దీనికి మొదట జనించినవాఁడు నాకుఁ బుత్రుఁ డగుఁగాక యని చెప్పి కన్య నొసంగును. దీనినే పుత్రికాధర్మమందురు. ఇట మనువు పుత్రసంతానము గలవాఁ డయినను బహుళపుత్రకాముఁడై యట్లు చేసె నని యెఱుంగునది.

తే. రుచియు నాకూతియందు నారూఢసిద్ధి
యగుచు యజ్ఞుఁడు దక్షిణ యనెడు మిథున
మును గనియె నందు పురుషుఁడు వనజనాభుఁ
డనియు స్త్రీ శ్రీమహాలక్ష్మి యనియుఁ జనిరి. 3

మ. మను వాయిద్దఱఁ గొంచు వచ్చి నిజవేశ్మంబందుఁ బోషించుచున్
మును జాయాపతు లౌట వారలకు సంమోదంబునం బెండ్లి చే
సెను వా రిద్దఱు వాక్కు నర్థము బలెన్ జేకూర సాంగత్య మె
ప్డును నొం డొక్కరు బాయ కుండిరి కడున్ మోదంబు సంధిల్లఁగన్.

వ. లక్ష్మీనారాయణస్వరూపులగుదక్షిణాసుయజ్ఞుల కప్డు తోషుఁడు ప్రతో
షుఁడు సంతోషుఁడు భద్రుఁడు శాంతి యిడస్పతి యిధ్మ్ముఁడు కవి
విభువు వహ్ని సుదేవుఁడు రోచనుఁ డనుపన్నిద్దఱు పుత్త్రులు పుట్టి
తుషితు లనం బరఁగిరి స్వాయంభువమన్వంతరమునందు నాతుషితులు
సురలు మరీచిప్రముఖులు సప్తర్షులు యజ్ఞుం డింద్రుండు ప్రియవ్ర
తోత్తానపాదులును దత్పుత్త్రపౌత్త్రాదులును నామన్వంతరమున
రాజులై ప్రజాపాలనంబు గావించిరి. 5

తే. మనువు దేవహూతిని గర్దమునకు నిచ్చెఁ
దచ్చరిత్రము చెప్పితి దానిచెలియ
లగుప్రసూతిని బ్రహ్మకు నాత్మజుఁ డగు
దక్షునకు నిచ్చె నెంతయున్ దత్పరతను. 6

వ. ఆదక్షప్రజాపతి సంతానం బనంతంబై ముల్లోకంబు లాక్రమించెఁ
గర్దమునికూఁతులు తొమ్మండ్రు బ్రహ్మర్షులకు సహధర్మచారిణులై
రని చెప్పియుంటిం దదీయసంతానంబుం జెప్పెద నాకర్ణింపుము. 7

ఆ. ఆమరీచి పత్ని యగుకళ కశ్యపుఁ
బూర్ణిమునిని గనియెఁ బూర్ణిముఁడును
విరజ విశ్వగు లనువరసుతులను దేవ
కుల్య యనెడు సుతను గోరి కనియె. 8

తే. అత్రి కనసూయకును హరిహరహిరణ్య
గర్భులవరాంశములఁ జేసి కలిగి రవని
దత్తదుర్వాసులును సోముఁ డుత్తమసుతు
లనిన మునిఁ గాంచి విదురుఁ డి ట్లనియె నపుడు. 9

వ. సృష్టిస్థితిలయకారణభూతు లైనవా రేమిటికయ్యత్రియింటం బుట్టి
రెఱింగింపు మనిన నతం డి ట్లనియె. 10

—♦ అనసూయాత్రులకుఁ ద్రిమూర్తులు పుట్టుట ♦—

సీ. బ్రహ్మనియోగంబువలన నత్రిమునీంద్రుఁ
డనసూయతో ఋక్ష మనెడుగిరికి
నరిగి నిర్వింధ్య యనువరనదియొడ్డున
నియతవ్రతంబున నిలిచి ఘోర
తప మంబుభక్షుఁడై తద్దయు నొనరించె
నుపవసించుచు దీక్ష యొప్పమీఱ
సరగ వర్షశతంబు సర్వేశ్వరునిలోన
ధ్యానంబు సేయుచు హానమునను

తే. అట్లు తపియించు చుండెడునవసరమున
హరిహరహిరణ్యగర్భు లాపరమహాని
సదమలాశ్రమభూమికిఁ గదలి వచ్చి
మునిపరిసరమునం బొల్చి రనువుమీఱ. 11

ఉ. ఆతఁడు వారిఁ గాంచి వినయాన్వితుఁడై కయిదోయి మోడ్చి వి
ఖ్యాతతదీయతేజమునఁ గన్గొనఁ జాలనివాఁడ మై కనుల్
మూఁతలు వడ్డ విప్పి కనఁ బోయియు నోపక లోనిచూపునన్
బ్రీతిగఁ జూచుచున్ వివిధరీతుల విన్నప మాచరించుచున్ 12

ఉ. మీరు చరాచరాత్మకులు మీఁదను గ్రిందను నైనలోకముల్
గోరికఁ జేసి పెంచియును గో మఱఁ జేయఁగ నైనవేలుపుల్
శౌరివిధీశ్వరాఖ్యలఁ బ్రశంసకు నెక్కినవారు మాపయిన్
గారుణికత్వ మేర్పడఁగఁ గావఁగఁ బ్రోవఁగ వచ్చినా రిటుల్. 13

క. మువ్వు రని నేను బలికితి
నవ్వారుసల్ సరి యనంగ నైతి యొకింతే
నెవ్వలనఁ గనినఁ దోఁపదు
మువ్వురు నొక్కండ యనుట పోలును గాదే. 14

ఉ. సంతతి నాస చేసి యిటు స్వాంతమునన్ భజియించి కొల్చుచీ
యింతకుఁ గారణం బగుచు నేర్పడి యుండినవాని నొక్కనే
యెంతయు వేఁడుచుంటి నిటు మీరలు మువ్వురు నొక్కమూర్తియే
వింత యొకింత లే దనుచు వేఁడుకఁ జూపితి రోషి నాపయిన్. 15

వ. అనిన వా రోమునిచంద్రా! మేము నీ వనినట్లు త్రిమూర్తు లనుటయె కాని మా యేకత్వము నీ కివ్విధంబునం దెల్లంబు సేయదర్శన మిచ్చితిమి మాయంశములం జేసి నీకు మూవ్వురు పుత్రులు పుట్టెద రని వరం బనుగ్రహించి యంతర్ధానంబు నొంది రంత నవ్వరప్రభావంబున ననసూయాపుత్రులకు బ్రహ్మాంశమున సోముండును విష్ణ్వంశమున దత్తుండును రుద్రాంశమున దుర్వాసుండును బుట్టి రంగిరసునిభార్య సినీవాలి కుహువు రాక యనుమతి యనునల్వురు కూఁతులం గనియె మఱియు నుచథ్య బృహస్పతు లనునిద్దరు తత్పుత్రులు స్వారోచిష మన్వంతరమున వెలసి రది యుండనిమ్ము పులస్త్యుఁడు హవిర్భుక్కను తనభార్యయందు జన్మాంతరంబున జఠరాగ్ని యనునగస్త్యుం గాంచె నతనికి విశ్రవసుండు పుట్టె. విశ్రవసున కిళబిళయందుఁ గుబేరుండు కైకసియందు రావణ కుంభకర్ణ విభీషణులు పుట్టిరి. పులహపత్ని యగుగతి కర్మశ్రేష్ఠుఁడు వరీయస్సు సహిష్ణుఁ డనుముగ్గురు పుత్రులం గనియెఁ గ్రతుభార్య యగుక్రియ బ్రహ్మణ్యు లయినవాలఖిల్యుల నఱువదివేవురం గనియె వసిష్ఠున కూర్జ యనుపత్నియందుఁ జిత్రకేతుఁడు సురోచి విరజుఁడు మిత్రుఁ డుల్బణుఁడు వసుభృద్ధ్యానుఁడు ద్యుమంతుఁ డనువారు పుట్టి సప్తర్షు లైరి. ఆవసిష్ఠున కింకొకభార్య యందు శక్తిప్రభృతులు పెక్కండ్రు పుట్టిరి. అథర్వపత్ని యగుచిత్తి

యశ్వాశీర్షుం డైనదధ్యంచుం డనుపుత్రుని గనియె. భృగువు నిజపత్ని యగుఖ్యాతియందు ధాతయు విధాతయు ననునిద్దఱు పుత్రులను భగవత్పర యగుశ్రీదేవిని గనియె. మేరుపుత్రిక లగునాయతి నియతి యనుకన్యల ధాత విధాత యనువారు పెండ్లియాడి మృకండుఁడు ప్రాణుఁ డనునాత్మజులం గనిరి. మృకండునకు మార్కండేయుండును బ్రాణునకు వేదశిరుండును బుట్టిరి. భృగునకు శుక్రుండు పుట్టె నిది కర్దమదుహితృసంతానం బని మఱియును. 16

— ♦ దక్షప్రజాపతిసంతానము ♦ —

సీ. ధాతృపుత్రుం డైనదక్షుండు స్వాయంభు
వమనుపుత్రిఁ బ్రసూతిఁ బరిణయ మయి
యామెయందుం బదియాఱ్గురఁ గూఁతులఁ
గని పదుముగుర ధర్మునకు నొసఁగి
యగ్నికి నొక్కత నర్మిలి నిడి మిళి
తు లగుపితల కొక్కజలజనేత్రి
నిచ్చి శంకరునకు నిచ్చె నొక్కర్తుక
సతి యనునాయమ నుతికి నెక్క
తే. శ్రద్ధ మైత్రియు దయయును శాంతి తుష్టి
పుష్టి క్రియయు నున్నతియును బుద్ధి మేధ
యును దితిక్షయు హ్రీ మూర్తి యనెడువీరు
పదియుముగ్వురు ధర్ముని భార్య లరయ. 17

వ. అందు శ్రద్ధాదులు పన్నిద్దఱు క్రమముగా శుభ ప్రసాద అభయ సుఖ ముత్స్మయ యోగ దర్ప అర్థ స్మృతి క్షేమ ప్రశ్రయ లను పన్నిద్దఱు సంతతిం బడసిరి. 18

క. నరనారాయణు లనుఋషి
వరు లావరమూర్తి యనెడువరవర్ణినికిన్
గరిమ జనించిరి విశ్వం
బరుదార సుఖించెఁ గలిగె నానందంబున్. 19

మాలిని. సురలు విరులవానల్ సోనలై కుప్పగూరం
గురిసిరి ధరయెల్లం గోర్కెనై నొప్పె వేల్పుల్
పరమమునులు వారిన్ బ్రస్తుతుల్ చేసి రెంతే
హరుసము జగమందున్ హైన్యముం బాప నయ్యెన్. 20

వ. అట్లు లోకం బానందంబున మునింగి యుండ నానరనారాయణు లిద్దఱుం బదరికాశ్రమంబునకుం జని ధర్మసంరక్షణార్థము తపంబు గావించిరి వారే కృష్ణార్జునులై యవలి కాలంబునంబుట్టి రనంతరంబ దక్షకన్యయగు స్వాహాదేవి యగ్నిహోత్రునివలనఁ బావక పవమాన శుచి నాము లగుముగ్గురు సుతులం గనె వారికి నలువదితొమ్మండ్రు పుత్రులు పుట్టి యజ్ఞంబులందుఁ గ్రియానిర్వాహణం బొనర్చువారైరి సాగ్నులు నిరగ్ను లగు నగ్నిష్వాత్త బర్హిష త్సోమ పాజ్యప నాములగుపితరులు దక్ష పుత్రిక యగుస్వధయందు వయునయు ధారిణి యననిద్దఱు బ్రహ్మవాదినులు పుట్టిరి. మఱియు దక్షకన్య యగుసతీదేవి శివునిం బెండ్లియాడి పతి ననువర్తించె నక్కాలంబున నిరపరాధుం డగుతనపతియెడం దండ్రి పరమద్వేషంబు పూనియుంటం జేసి చేయునది లేక యోగంబున నేను విడిచె నన విదురుండు మునీంద్రా! దుహితృవత్సలుం డగు దక్షుండు లోకశంకరుం డగు శంకరు నేమిటికి ద్వేషించె సతి యెట్లు దేహత్యాగంబు చేసె నది యంతయు నానతిమ్మనిన నతం డతని కిట్లనియె. 21

—• దక్షుం డీశ్వరుని ద్వేషించుట •—

సీ. మున్ను ప్రజాపతుల్ మునులును సురలును
కలసి సత్రం బొండు సలుపుచుండ
నిజతేజమున సత్రసలయంబు దీపింపఁ
దక్షుఁ డచ్చోటికిఁ దరలి వచ్చె
వచ్చిన నాతనివలను గనఁగ లేచి
సన్నిష్ట శివుఁడు దక్క సభ్యు లెల్ల

నిలిచి రంతటు దక్షుఁ డలపితామహునకు
మ్రొక్కి తదాజ్ఞమై యొక్కచోట

తే. విశ్రమించియుఁ దనుఁ గాంచి విబుధులెల్ల
లేచి తగ గౌరవింపంగ లేవ కరయ
కున్న పశుపతిచేష్టలు తన్ననమతి
సలుపుచే యని తలపోసి యలుకఁ జేసి. 22

వ. కన్నుల నంగారకణములు రాల సభాసదుల నందఱం గలయఁ బరికించి సింహాగర్జనంబు సేయుచు ని ట్లనియె. 23

మ. వినుఁడో సభ్యులు! సాధుసజ్జనులసద్వృత్తంబు వ్రాకుత్తు లో
న్గినుకం జేసియ కాని మత్తతను గానీ పల్కఁ బోఁ డీజడుం
డును జాల్మం డగునేడ్పుగొట్టు హరుఁ డిట్టుల్ లోకమర్యాదలన్
దునుగం జేసినయట్టిఁ డయ్యె నితనిం దూషింప నర్హంబెఁ గా. 24

ఉ. బ్రాహ్మణు లగ్ని సాక్షులుగ బ్రాహ్మికి నెత్తగు నాదుపుత్రికన్
బ్రహ్మ యొసంగు మంచు ననుఁ బల్కఁగఁ యొందు చూడకా
బ్రహ్మ మవాచ్యవాటికడ వైచినరీతిని బాఱ వైచితిన్
జిహ్మాకృతిం బొనర్చితిని జెట్టఁడ నైతిని జెప్ప నేటికిన్. 25

ఆ. మామగారు తండ్రి మాదిరివాఁ డనక యీ
మర్కటేక్షణుండు మామ నైన
నా కగౌరవంబు లోక మెఱుఁగఁ జేసె
స్థాణు వట్టు లుండె స్థాణు వితఁడు. 26

వ. మఱియుఁ బ్రత్యుత్థానాభివందనంబులు చేయు కున్న మానె మాట మైన నోట రానీయఁ డయ్యె నుచితగతిం బాటింపఁ డయ్యె ని య్యధముండు. 27

సీ. భూతముల్ ప్రేతముల్ మూఁగి సేవింప శ్మ
శానభూముల జడల్ బాఱ వైచి

కాటిబూడిద మేనఁ గాటంబుగాఁ బూసి
పీనుంగుదండలు పైనఁ దాల్చి
పుఱ్ఱె లెమ్ములును సొమ్ములుగ నెప్డు ధరించి
దిసమొలతో నెల దెసల మెట్టి
నేడ్చుచు నవ్వుచు నిటు నటు లున్మత్తు
నట్లు మెలంగు చహర్నిశంబు

తే. అధము లగుప్రమథులు గొల్వ నధిపతియన
మత్తుఁడై మత్తహాతుఁ డయి మాని క్రియలు
యశుచి యశివుఁ డౌనీశివవ్యాజుఁ డల్లుఁ
డనుటకుఁ సిగ్గుఁ బొందుదు ననఘులార. 28

వ. అని యడ్డ మాఁకయు లేక నోటికి వచ్చినట్లు ప్రేలుచున్నను బల్లెత్తి మాట లాడక శాంతుఁడై యున్నపరమేశ్వరునిం దిలకించి మఱింత మండిపడి వడివడి జలోపస్పర్శనంబు చేసి. 29

ఉ. దేవగణాధముం డయినదేబె యితం డిది యాదిగాఁగ నే
దేవహవిస్థలంబులను దేవవరేణ్యులతోడ హవ్యముల్
భూవలయంబునందుఁ గొనఁ బోవఁగ రా దని శాప మిచ్చె న
ద్దేవమునీశ్వరుల్ వలదు దీన నఘం బని పల్కుచుండినన్. 30

వ. అట్లు శాప మిచ్చినం జిచ్ఛఱకంటి దేవర నొచ్చుకొనుచు నొండొకఁ డుచ్చరింపక దిగ్గన లేచి నిజనివాసంబునకుం జనియె నప్పుడు నందీశ్వరుండు రోషకషాయితాక్షుండై లేచి తాను దూషించినను మాఱుమాటాడనిమహాదేవుని దేవదేవు నీదక్షుండు శపియించి దోషి యయ్యెం గావున నితండు భేదదర్శనుండై తత్త్వవిముఖుం డగుం గాక గ్రామ్యసుఖేచ్ఛం జేసి వేదములందలియర్థవాదములు పరమార్థము లని తలంచుచుఁ గర్మబద్ధుం డగుం గాక మఱియు నాత్మగతి మఱచి పశుప్రాయుండై స్త్రీలోలుం డయ్యెడుం గాక యీఁ డచిరకాలంబునన బస్తముఖుం డయ్యెడుం గాక యీని ననుసరించి శర్వు నవమానించినవారు

సర్వకాలంబు సంసృతిచక్రంబునంబడి తిరుగులాడుచుండుదురు గాక వేదార్థవాదవాక్యంబులం దవిలి కలుషితస్వాంతు లైనశివద్వేషులు నిత్యసంమోహంబు గాంతురు గాక హరతిరస్కార మాలకించి కిమ్మన కూరకున్న విప్రు లెల్లరు సర్వభక్షకులై వృత్త్యర్థంబ విద్యాతపోవ్రతంబులు పూని విత్తదేహేంద్రియారాము లగుదురు గాక యని దక్షాదులకు శాపం బొసంగినంత బ్రహ్మకులంబుం దిరస్కరించుటం జేసి భృగుం డలిగి లేచి చేతు లెత్తి భవవ్రతధరులు తదనుసారులు పాషండులై నష్టశౌచులై మూఢబుద్ధులై జటాభస్మాస్థిధారులై సురాసవప్రధానం బయిన శైవదీక్షం గ్రహింతురు గాక వేదమును బ్రాహ్మణులను నిందించినమీరలు పాషండత్వము తప్పకుండదు గాక సనాతనంబు లోకక్షేమంకరంబు జనార్దనప్రమాణంబు లైనసన్మార్గమును నిందించిన మీరును పాషండులై పోవుదురు గాక యని ప్రతిశాపంబు వెట్టె నంత నవ్విధంబున సహస్రసంవత్సరసత్రంబు నిర్వహించి గంగాయమునాసంగమంబున నవభృథం బొనరించి సదస్యసదుల నెల్లర నంపిపుచ్చి నిజస్థానంబునకుం జనియె నిట్లల్లునకు మామకు నెన్నఁటికిని దీఱని విద్వేషంబు పెచ్చుపెరిగి పోయె. 31

ఆ. తనకు నల్లుఁ డైన ఘనుఁ దుష్టమూర్తియు
నష్టభాగు లున్న యధిపుఁ డైన
హరుని యందు వైర మాతఁ డుడుగక పూనె
కాలమహిమ గాక కలదె యొకఁడు. 32

- ♦ దక్షుఁడు యజ్ఞము సేయఁ బూనుట ♦ -

వ. అట్లు పరమేశ్వరుని ద్వేషించిన దక్షుండు. 33

తే. దక్షుఁ బ్రజాపతుల కెల్లఁ దగిన యట్టి
ప్రభువుఁ గాఁ జేసి పుచ్చె నాబ్రహ్మ వాన
గర్వమతి యయి దక్షుఁడు ఘనుల నేని
సరకు గొనకుండి యజ్ఞముల్ సలుప నయ్యె. 34

వ. సప్తదశప్రాజాపత్యం బయినవాజపేయం బనుమహాయజ్ఞంబుఁ జేసిన
పదంపడి బృహస్పతిసవం బనునుత్తమయాగంబు సేయం బూనె
నాయాగంబునకు ముల్లోకంబులం గలయెల్లవారి నాహ్వానంబు
గావించి పదంపడి. 35

ఉ. అల్లునిఁ బల్కరించుటకు నాత్మ పౌనర్పక యున్నఁ గూఁతునిన్
సల్లలితప్రభావనిధి సర్వజగన్నుత సర్వమంగళన్
దల్లికి ముద్దుబిడ్డ యగుదానిని నైనను బల్కరింపఁగా
నల్లము సేయఁ జాతఁ దయయో హృదయం బది ఱాత నయ్యెనో.

వ. అంత నాదక్షాధ్వరంబునకు బ్రహ్మర్షులు దేవర్షులు దేవబృందంబులు
పితృగణంబులు సిద్ధసాధ్యవిద్యాధరకిన్నరకింపురుషాదులును దరుణుల
తోడం గూడి దక్షపురంబునకుం బయనంబై చనుచుండి రయ్యవసరం
బున వారివలనన వృత్తాంతం బంతయు విని మృత్యుంజయుండు తాను
నయ్యధ్వరంబుం జూడం జన నెంచియుఁ గించిద్జ్ఞుండు వాఁ డేమి
చేసి యేమిచేయునో యని యూరకుండె నపుడు సతీదేవి స్త్రీచాప
లంబునంజేసి తండ్రి సేయుజన్నంబునకుం బోవ నెంచి పతిం గాంచి యి
ట్లనియె. 37

శా. చెల్లెం డ్రక్కలు నెల్లచుట్టలు నటం జేరంగ నుం డ్రెల్లరం
దల్లిం దండ్రినిఁ దండ్రిసేయుమఖముం దర్శింపఁగాఁ గోర్కి నా
యుల్లంబం దుదయించె నిర్వారముఁ బో నూహింతుఁ గా దేని నా
యులాసం బది తీఱ నాకు సెల వీయుం డేగి నే వచ్చెదన్. 38

ఆ. జన్మభూమిఁ జూడఁ జతెంచు స్త్రీజాతి
గాన వాంఛ సేయఁ గలిగె నాకుఁ
జుట్టరికము లేనిసురవల్లభలు నదే
సిండి నింగిఁ బోవుచుండి రటకుఁ 39

క. తెల్లనిహంసలతెఱఁగున
నల్లనియాకసమునందు నలుమూలల వా

రల్లదె చనుచుండిరి నా
తల్లియుఁ దండ్రియుఁ బోనచ్చుతన్మఖమునకున్. 40

వ. అని విన్నవించిన ప్రియావచనంబు లాలగించి చంద్రశేఖరుండు తొల్లి నిండోలగంబులో దక్షుండు తన్నాడినదుర్భాషలు భల్లంబులై మర్మంబులు గాడఁ జేయుచుండ వానిం దలంచుకొని లోనికినుక నడంచుకొని సతి కి ట్లనియె. 41

సీ. ఓసతీ! నీదగునుల్లము పరికింపఁ
దెలసెఁ బిల్చినఁ గాని పిలువ కున్నఁ
గాని బంధువులనికాయంబులకుఁ బోవఁ
దప్పు లే దని నీవు తలఁతు వగును
బొరపొచ్చెములు లేక పోయినయే నట్లు
కాదు మదాంధుఁడై కాఱు లరచె
న న్నిట్టిచోఁ బోవ నయితి గా దందును
ననుఁ బట్టిదూషించు నిను నెలంత

తే. యొడ లెఱుంగక యుండినజడుఁ డతండు
నాదుపై నున్నకోపము నీదుమీఁదఁ
జూపినం జూప వచ్చు నోసుదతిమిన్న
నీ కటం గార మగు నని నేఁ దలంప. 42

ఆ. నీదుతండ్రి క్రోధి నీమీఁదనేనియుఁ
బ్రేమ లేదు కన్నబిడ్డ యనుచుఁ
దలఁపఁ డచట నీకుఁ దప్పక యవమతి
యగును బోయి తేని యటకు నీవు. 34

వ. నాప్రియాణం బుపసంహరించితి నీప్రయాణంబు నట్లు సేయుటయే సమ్మతం బయిన నిందు నీయిష్టంబునక విడిచితి ననిన నయ్యమ్మ పుట్టినింటిప్రేముడిం జేసి మృడునిమాట పెడచెవిం బెట్టి తండ్రి సేయు నది గావునం గాంచునిచ్ఛమై తదీయయాగంబునకుఁ బిలువనిపేరం టంబుగఁ బయనం బయ్యె నంత నక్కడ. 44

ఉ. దక్షుఁడు దీక్షమై క్రతువిధానము పూని యథావిధిన్ జగ
త్ప్రక్షముగా నొనర్చి సురవర్యుల కాహుతు లిచ్చువారు ప్ర
త్యక్షము గాఁగ వచ్చి కొన నల్లురతోఁ దనకన్నవారితో
నక్షయకౌతుకంబున నహర్నిశముల్ నడిపించు నత్తఱిన్. 45

వ. సతీదేవి చనుదెంచి సదస్యంబునం దన్నుఁ బలుకరించువారు రమ్మను
వారునుం గూరుచుండు మనువారును లేకున్న నొక్కచోఁ గూరుచుండి.

మ. తనతోఁ బుట్టువు లాత్మవల్లభులతోఁ దా రెల్లఁ గౌతూహలం
బునఁ గేరింతలు కొట్టుకొంచు మిగులన్ బొల్పొందుచుండంగఁ గ
న్గొని సైరింపఁగ లేక యాసతి మదిన్ దుఃఖించుచుం దండ్రినిం
గని తండ్రీ! విను మామ కెన్న సములేగా? యెల్లజామాతలున్. 47

ఉ. అల్లుర నందఱం బిలిచి యందఱ కెంతను వందనీయుఁ డౌ
నల్లుని నెల్లలోకముల కాకరు నాకరుణాళు నీశునిన్
దెల్లము గాఁగఁ బిల్వ కిటు దివ్యసవంబును జేయఁ బూని తీ
వెల్లసుపర్వులుం గనఁగ నియ్యది నే లిడునే యశైవమై. 48

క. పోవల దనఁగా నిట నే
నే వచ్చితిఁ గన్నవారి యిల్లని కాదే
యీవరుస జరుగుచుండిన
నేవెంబరవిత్తు వచ్చు నెఱిఁగింపు మయో. 49

క. మగఁ డెంతమంచివాఁడై
మగువం బోషించుచున్న మది మెచ్చద యా
మగనాలు తల్లిదండ్రుల
కగునన్నియు నిచ్చు మెచ్చు ననురక్త యగున్. 50

వ. అని యనేకవిధంబులం బలికి పరిదేవనంబు సేయుచుండ దక్షుండు
రూక్షాక్షీణదుర్నిరీక్ష్యుండై దాక్షాయణిం బ్రతీక్షించి యి ట్లనియె. 51

—♦ దక్షుఁ డీశ్వరుని నిందించుట ♦—

ఉ. అండజయాన! వాఁ డొకమహాత్ముఁడు నావచియింప వచ్చితే
నిండినయీసభన్ సురమునిప్రవరుల్ వినుచుండ నేరు పా

పండు నెఱుంగ రీపొగడుచాలిక చాలును వల్లకాటిలోఁ
బండెడుబండ నీమగఁడు వానినిఁ గన్గొన రోఁత పుట్టెడున్. 52

ఆ. కట్ట బట్ట లేదు పొట్టకుఁ దిన లేదు
తోలుఁ దాల్చు విసపుఁదోఁప మెసవు
నుండ నిల్లు లేదు పండ మంచము లేదు
కాటఁ దిరుగు వల్లకాటఁ బండు. 53

ఆ. బిచ్చ మెత్తువాఁడు వచ్చె నాకల్లుఁ డ
టనుచుఁ జెప్పుకొన్న నగును సిగ్గు
వాఁడు నేఁడు గూడ నీడకు రా నేల
పదుగురందు నవ్వుఁబా టదేల. 54

క. నాకడుపునఁ బట్టినది
న్నాకొయ్యకుఁ గట్టిపెట్టు టారయఁగా మం
త్రాకలితపురోడాశము
మాకొనుకుక్కకును వేయుమాదిరి యయ్యెన్. 55

ఆ. *ఏడ్పుగొట్టు విధవ యిలు లేనిసన్యాసి
వానికన్నుఁ గాల వానియిల్లు
వల్లకాఁడు గాను వానిరూపము రుత్త
బూడిద గను బోడుమొండి కొయ్య. 56

వ. అని పరిపరివిధంబుల నోనాడి పరిభవించుటయు న్నాక్రాలుగంటి చేయున దెద్దియును లేక కంటికిం గడవెడు నీళ్లుగా వెక్కి వెక్కి వెక్కసంబుగా నేడ్చుచు సదస్యసదు లగునింద్రాదులం దిలకించి యి ట్లనియె. 57

సీ. ఈశ్వరద్రోహి యౌనీతనికూఁటికే
వాచి వచ్చితి వోయివాసవుండ

* ఏడ్పుగొట్టు=రుద్రుఁడు; విధవ=ప్రభువులేనివాఁడు; వానికన్నుఁ గాల=మండు నేత్రముగలవాఁడు; వానియిల్లు వల్లకాఁడు=శ్మశానవాసి; వానిరూపురుత్తబూడిద=భస్మధారి; మొండికొయ్య=స్థాణువు.

యి ట్లకార్యము దక్షుఁ డెఱిఁగి చేయుచునుండ
నీ వి ట్లుపేక్షించు టేల చక్రి
నిను నెత్తిపైఁ బెట్టుకొనుశివుఁ దూషింప
నింపుండ నీ కొప్పునే మృగాంక
కర్మసాక్షివి నీ వకర్మముం గను చిట్లు
హర్షించుచుంటివే యర్యముండ
తే. సర్వభక్షక ! దుష్టప్రసాద మీావు
సాపడఁగ వచ్చితే బృహస్పతి భవచ్ఛ
రిత్రి చిత్రము నీపెద్దఱికము చాలు
నెఱుఁగ రిందఱు ముం దగునెగ్గు లకట. 59

వ. అని కన్నులు మూసికొని యోగం బనుసంధించె నంతలో నాఁడు సర్వాంగంబులనుండియాశుశుక్షణి యావిర్భవించి వీక్షించుచుండఁగనంత నామెకాయంబుభస్మసాత్కృతంబుగావించె నప్పు డాహావిర్ధానంబునఁ బుట్టినహాహాకారంబురోదసీకుహరంబునం దెసె లేక నిండికొనియెనంత.

—♦ దక్షాధ్వరధ్వంసము ♦—

సీ. గడగడలాడెడు నెడఁదలతో మునుల్
వేల్పులు చేతులు పిసికికొనిరి
చేత్రస్రుక్స్రువములు భీతిమైఁ బడవైచి
ఋత్విగ్గణము పాఱె నిట్టు నట్టు
సూర్యచంద్రాదులు సూచుచుం గదలక
మెదలక తలఁకున నదవదపడి
రిందీవరాక్షుఁ డి ట్టేయుపద్రవ మగు
టెంచునో యని భయ మెంచుచుండె
తే. అదటుగుండెలతో నింద్రుఁ డడలు గుడిచె
దిగులు లోఁ దోఁచె దక్షుని మొగమునందుఁ
బెక్కు లుత్పాతములు యజ్ఞవేదిఁ బొడమె
యోగవహ్నిఁ సతిం గాల్చియున్న యపుడు. 60

వ. ఆవృత్తాంత మంతయును నంతకాంతకుం డంతర్దృష్టి నెఱింగి కుటిల భ్రూకుటియై కటంబు లదరఁ బటపటం బండ్లు గొఱుకుచు నత్యంత భయానకంబుగా నొక్క కేక వైచి యొకజడ నూడఁ బెఱికి నేల వైచె నప్పు డతని మేనం బొడమిన స్వేదబిందుసందోహంబునం జేసి వీరభద్రుం డతిరౌద్రోద్రేకంబున నావిర్భవించి భవుం గాంచి నా కేమి యాజ్ఞ యనుడు నతండు దక్షాధ్వరధ్వంసంబు గావించుటయే కార్యం బనిన వీరభద్రుండు రుద్రరూపుండై ప్రమథగణపరివృతుండై తత్క్షణంబ యజ్ఞ వాటికకుం జని. 61

సీ. అగ్నికుండంబుల నరకాళ్ళఁ జమరుచుఁ
జల్లార్చె ఋత్విజుల్ తల్లడపడ
నదటుగుం డెలతోడ బెదరి పాఱెడు నింద్రుఁ
బెడకాలఁ దన్ని పెం పెడలఁ జేసెఁ
బూషార్కు వదనంబు బోసి నోవఁగఁ జపే
టోద్ధతిం జేసి పం డ్లూడఁ గొట్టె
మూఁడువహ్నుల కైన యేడేసినాల్కలు
కొండనాల్కలు దాకఁ గోసి వైచె
తే. విశ్వసృడ్దేవి దేహంబు వికృతి నొంద
నీడ్చి కొట్టె మృగాంకుని నీల్గఁ జేసె
దక్షుతలఁ ద్రెంచి దానిని దక్షిణాగ్ని
యందుఁ బడవైచి రగులించె నాగ్రహమున. 62

వ. అట్లు చేసి మఱియును. 63

మ. అట నల్లుండ్రము నే మటన్న గరువం బద్దాఁక లేకుండ మి
క్కుటమై తోఁపఁగ నుండువారలను బెక్కుల్ చిక్కులం బెట్టి య
చ్చటియూపంబుల కంటఁ గట్టి పసులన్ జంకించుచందంబునన్
బటుశక్తిం బొనరించి నొంచెఁ బ్రమథవ్రాతంబులం బుచ్చుచున్. 64

మ. నను బాధింపకుఁ డేను దాసుఁడ మొఱో నామీఁదఁ గార్పణ్యముం
గొనకుం డే నపకార మొద్దియును మీకుం జేయ సం చేడ్చుకా

లునికాళ్ళేతులు నంటఁ గట్టి ప్రమథుల్ కోపంబున న్మీఁది కె
త్తి నెఱిం దప్పఁగ నేల వైచిరి మహార్తిం బొందఁగం గుందఁగన్ 65

ఉ. జన్నము బన్నముల్ గలుగ జాఱఁ దొడంగెఁ గురంగమూర్తియై
కన్నులఁ గాంచి దాని వెనుకం బడి ధావనముం బొనర్చుచున్
గ్రన్ననఁ బట్టి బందె నిడి కట్టడి చేసియు వీరభద్రుఁ డా
పన్నుల నార్తులన్ గరుణఁ బాలనముం బొనరించె నంతటన్. 66

వ. ఇట్లు దక్షాధ్వరధ్వంసంబు గావించి వీరభద్రుండు రుద్రుని దర్శింపం జనియె నిక్కడ వియచ్చరులు హరపారిషదాస్త్రాభిహతులై నొచ్చి భయార్తులై బ్రహ్మపాలికిం జని ప్రణమిల్లి సర్వంబు నెఱింగించిన నతండు వారి కిట్లనియె. 67

సీ. తెలివి మాలినదక్షుపలుకులబడి మీరు
నిరపరాధుం డగుహరునకు సవ
భాగము లేకుండుపగిదిఁ గావించి మ
హాపచారము చేసినట్టి రైతి
రందున నింతిదురంతసంతాపము
దక్షునికే కాక తత్ప్రజలకు
సంభవించెను గాన శంకరదర్శనం
బొనరించి ప్రార్థింప నొప్పు మనకు

తే. అనుచు వారలతోఁ గూడి యబ్జయోని
చంద్రశేఖరు దర్శింపఁ జనియె వెండి
కొండదండకుఁ దపియించుచుండుహరునిఁ
జూచి యిట్లని ప్రార్థించెఁ స్తుతులొనర్చి. 68

—♦ బ్రహ్మాదు లీశ్వరానుగ్రహంబు వడయుట ♦—

ఉ. నీవు చరాచరంబులకు నేతవు ధాతవు సంవిధాతవున్
నీవిధ మింతయుం దెలియ నేరనిమూర్ఖుఁడు దప్పు చేసి తా
నీవిధి కయ్యె నైఁపు మని యేనును నీసురపాలితల్లజుల్
దేవర కాళులం బడి యిదే నతి చేయుచునుంటి మీశ్వరా. 69

వ. అని ప్రార్థించినం బ్రసన్నుండై పరమేశ్వరుండు పరమేష్ఠిప్రభృతులం గూడి.

మ. తనకుం బుట్టినవీరభద్రుఁడు కడుం దర్పంబునం జేసి ద
క్షునియజ్ఞం బెఱు చేసి యున్నయెడ కీశుం డేగుదే నెల్లరున్
మునులు న్వేల్పు లనల్పభక్తిభరితాత్ముల్ మ్రొక్కి ప్రార్థించి ద
క్షుని రక్షింపు మటంచు వేఁడుకొనుడుం గోపంబు వోఁ జేయుచున్.

తే. ఇట్టితలఁ గొట్టి దాఁకిన్ గ్రహించి దక్షు
మొండెమునఁ బెట్టి పార్థిణముల్ వోసె నంత
నతఁడు జీవించి ప్రాంజలియై మహేశు
పాదజలజంబులన్ వ్రాలి పరిస్తుతించి. 72

ఉ. నేను మహాధికారమున నెక్కొని యుంటిని నాదునల్లురున్
మానితకీర్తు లీజగతి మాకు సమానుఁడు లేఁ డొకండు నె
మ్మేనను బూదెఁ బూసికొనుమింతుఁడు చుట్ట మటంచుఁ జెప్పకో
మా నెటి వోవు నంచు నభిమానమునం బడిపోతి నక్కటా. 73

మ. అపరాధం బొనరించినాఁడను మహేశా! నిన్ను నీశక్తి నే
నెపుడేనిం దెలియంగ లేనిజడుఁడై హేలాగతిన్ దూటితిన్
విపరీతార్థము లాచరించితిని నానేరంబులన్ సైఁచి నీ
కృప నాపైఁ గలిగించి ప్రోవఁ గదె తండ్రీ! నీకు నే దాసుఁడన్. 74

వ. అనిన శంకరుండు కృపాతరంగితాంతరంగుండై చతుర్ముఖునిమంతనం
బున యాగంబున కనుజ్ఞ నొసంగి కైలాసంబునకుం జనియె నంత
నుపాధ్యా యర్త్విగ్గనంబులో మఱియు యజ్ఞానుష్ఠానంబున కుపక్రి
మించి రట్టియెడ ఋత్విజులు వీరస్వర్గప్రాయశ్చిత్తంబు త్రికపాల
పురోడాశనిర్వపణపూర్వకంబుగా నిర్వర్తించి నైష్ణవేష్టిం గావించి పక్ష
విక్షేపంబున బృహద్రథంతరసామగీతంబులఁ దనరింప గరుడారూఢుండై
హరి యజ్ఞేశ్వరుండై సాక్షాత్కరించిన మునుమున్న దక్షుండు డిట్లని
ప్రస్తుతించె. 75

తే. నీవు స్వప్రకాశంబున నిత్యములు ని
వృత్తము లగునిఖిలమనోవృత్తుల నయి
చిద్ఘనుండవు ఘనుఁడవై చెలగుచుందు
నీదుతత్త్వము ధ్యానింతు నిర్మలాత్మ. 76

వ. అంత ఋత్విజు లి ట్లనిరి. 77

తే. నీవు నిరుపాధికుండవు నిత్యుఁడవును
సర్వదేవేశ్వరుండవు సాధుసేవ్యుఁ
డవును ధర్మోపలక్షణుండ వని వేద
ములు వచించెడు నీ కిదే మ్రొక్కు దేవ. 78

వ. సదస్యు లి ట్లనిరి. 79

శా. ఆయాసంబులు దుర్గమంబులు మహావ్యాలాంతకార్థంబు లా
యాయాదుర్విషయంబు లెల్ల మృగతృష్ణాకారముల్ దేహముల్
మోయఁగ రానివి ద్వంద్వముల్ కరము పెంపుం జెందు గర్తంబులై
స్థాయత్సంసృతిమార్గముం గడచి పోవ న్నివె ది క్కెవ్విరికిన్. 80

వ. రుద్రుం డి ట్లనియె. 81

తే. వరద ! నిష్కాము లగుమునుల్ వందనీయుఁ
డైననిను నెమ్మనంబున యందు నిలిపి
నిరతమును భక్తి సేవించి నిత్యసుఖము
వడయుచుందురు నీపేర్మి వరము సూవె. 82

వ. భృగుమహర్షి యి ట్లనియె. 83

తే. గహన మైననీమాయను గలిగి బ్రహ్మ
ముఖ్యులును నాత్మబోధము వోవఁ దమము
గప్ప లో నున్ననిను నెఱుఁగఁగఁ జాల
రట్టిపరమాత్మునికి నిను నభినుతింతు. 84

వ. దేవా ! నీ వవాఙ్మానసగోచరుండవు సత్త్వాదిగుణంబుల కాశ్రయుండ
వయ్యును మాయామయప్రపంచమునకుఁ బరుఁడవు నీ కిదే నమస్కార

మని బ్రహ్మయు దివ్యాయుధోపేతంబు లగునష్టభుజంబులతోడం గూడిననీదివ్యగాత్రంబు విశ్వభావనంబు మనోనయనానందకరం బని యింద్రుండును నిన్ను సేవింప బ్రహ్మ నిర్మించి యీయజ్ఞము పశుపతికోపమున విధ్వస్త మయినది దీనిని బావనంబు గావింపు మని ఋషిపత్నులును నీవు కర్మములం దగిలి యుండియుఁ దల్లీనంబు నొందకుంపు విది నీపరమాద్భుతప్రకారం బని ఋషులును దేవా! మామానసకుంజరంబు క్లేశ మనుదావానలంబునం జిక్కుకొని తాపంబు నొందిభవత్కథాసుధాసముద్రమునమునింగినంతఁదన తాపమును బాపుకొనుచున్న దని సిద్ధులును లోకేశ్వరా! నీకు స్వాగతము ప్రసన్నుండ వగుము శ్రీనివాసా! నీకు నమస్కారము శ్రీసమేతుండవై మమ్ముఁ బ్రోవుము శీర్షము లేని దేహమువలె నీవు లేనియీమఖంబు శోభింప దయ్యె నని దక్షపత్ని యగుయజమానియు మేము ని న్నెట్లు చూడ గలము పంచభూతోపలక్షితుం డైనజీవునిరీతిఁ దోఁచుటయే భవదీయ మాయావిలాసం బని లోకపాలురును విశ్వరూపుండ వగునీయం దాత్మభేదంబు కనుఁగొనువారికంటె నీకుఁ బ్రియతముండు లేడు భక్తిచే ని న్నారాధించుమ మ్మనుగ్రహింపుము జగదుత్పత్తి స్థితి లయములం గావింప భిన్నగుణంబుల నాత్మభేదంబు గల్పించియు నివృత్తిం గాంచిన పరమాత్ముండవు నీకు వందన మని యోగీశ్వరులును నేనును బ్రహ్మాదులు నెవ్వనిపరతత్త్వం బెఱుంగఁ జాల మట్టిమహాత్మునకు నమస్కృతి యని శబ్దబ్రహ్మంబును నే నెవ్వని తేజంబున దీపించుచు హవిర్భాగంబుల వహింపఁ గలుగుచుంటి నట్టియజ్ఞమూర్తి కేటికో ళ్ళని యగ్నిహోత్రుండును గల్పావసానంబున విశ్వమెల్లం గుక్షిలోనం దాల్చి యేకార్ణవంబున వటపత్రశాయివై సిద్ధహృదయగోచరుం డగు నీవు మాకు సాక్షాత్కరించితివి మేము నీదాసుల మని దేవతలును బ్రహ్మరుద్రేంద్రాదులును మరీచ్యాదులును నీయంశాంశంబులు నీకీ జగంబులుక్రీడాసాధనం బిట్టినీకు మా మ్రొక్కులివె యని గంధర్వులును

నీవ యజ్ఞంబు నీవ హవ్యంబు నీవ హవ్యవహుండవు నీవ మంత్రంబు నీవ సమిద్దర్భాదిసాధనంబు నీవ ఋత్విక్సదస్యులు నీవ యగ్నిహోత్రంబు నీవ సోమాజ్యపశువులు నీవ యజ్ఞవరాహమూర్తి వై పాతాళగతం బైనధరణీమండలం బుద్ధరించి కర్మభ్రంశ మొంది నీదర్శనంబు గోరుచున్న మ మ్ముద్ధరింపు మని బ్రాహ్మణులును మఱియు ననేకు లనేకవిధంబుల యజ్ఞేశ్వరుం బ్రార్థించి రపుడు దక్షుండు హృషీకేశానుగ్రహంబున సాంగముగ నిర్వర్తించిన సంతసించుచు భగవంతుం డి ట్లనియె. 85

ఉ. ఏనును బ్రహ్మ యీశ్వరుఁడు నీసకలంబున కాత్మ యంచు మా
లో నొకయింత యేనియు వెలుంగులభేదము లే దటంచు వి
జ్ఞాను లెఱుంగఁ జాలుదురు శంకరుఁ డొక్కరుఁడే నొకండు నే
గాన మముఁ సమానమతిఁ గన్గొన నొప్పును నీకు దీక్షితా. 86

వ. అనిన దక్షుఁడు త్రికపాలేష్టి నాతని నర్చించి వివిధేష్టుల నితరసురలం బూజించి రుద్రభాగము రుద్రున కర్పించి యవభృథస్నానంబు గావించె దేవతలును దక్షు ననుగ్రహించి త్రిదివంబునకుం జనిరని మఱియును.

తే. అట్లు యోగాగ్ని నాహుతి యైనసతి
మేనకాహిమవంతుల కా మానినియు
లైనదంపతులకుఁ బుట్టె యుభవు భవుని
వల్లభునిఁ గాఁగ వెండియుం బడయఁ గలిగె. 88

వ. ఇది దక్షాధ్వరధ్వంసప్రకారంబు దీని నేను బృహస్పతిశిష్యుండును బరమభాగవతోత్తముం డగునుద్ధవునివలన వింటి నీపవిత్రం బయిన చరిత్రంబు వినినను బఠించినను బాపక్షయంబు నాయురారోగ్యైశ్వర్యాభివృద్ధియు నగు నని చెప్పి విదురునకు మైత్రేయుండు వెండియు.

—◆ అధర్మునివంశవృత్తాంతము ◆—

సీ. ఆచతుర్ముఖునకు నాత్మసంభవు లైరి
సనకమరీచ్యాదు లనఘకీర్తి

లవ్వారిలో మరీచ్యాదులు గేస్తులై
సంతతిం బడసిరి శాంతు లగుచు
నారద సనకసనందనాదులు హంసుఁ
డును నరుణియు యతి యనెడువారు
ప్రకృతులకుం గాక బ్రహ్మనిష్ఠులు నూర్ధ్వ
రేతస్కులై జగత్ఖ్యాతిఁ గనిరి

తే. బ్రహ్మపుత్రుఁ డధర్ముఁ డన్వాఁడు మృషను
నాలుగా నొంది యాయమయందు దంభు
డను తనూజుని మాయ యన్తనయఁ గాంచె
వార లిర్వురు దంపతు లైరి సూవె. 90

క. ఏకోదరు లగువా రీ
వీఁకన్ భార్యాపతిత్వవిధికై కలిధ
ర్మాకృతుల కైరి వారల
వాకొనుటయుఁ గానిదంచు వచియింతు నిటన్. 91

చ. నిర్భృతికి సంతు లేక కడు నొంజిలిఁ గుందుచు వారి నిర్వురన్
నిరతినిఁ జేరఁ దీసి కడు నెమ్మదిఁ బ్రోచుచు దంభుఁ బుత్రుఁగా
ఖరమతి మాయఁ గోడలిగఁ గైకొనె నంతటిలోన వార లి
ర్వురకును లోభుఁడున్ నికృతి పుట్టిరి పుత్రుఁడు పుత్రియై ధరన్. 92

సీ. నికృతి లోభులు వారు నెఱి చెడి జంపతు
లై క్రోధునిన్ హింస యనెడువారిఁ
గనిరి వా రిర్వురు వెనుకటివలెను మి
థునమై కలి దురుక్తి యనెడువారిఁ
బడసిరి వారు దంపతు లయి మృత్యు వన్
సుతుని భీతి యనంగ సుతనుఁ గనిరి
భీతి మృత్యువులును బెండ్లాము మగఁ డయి
యాతనానిరయ లన్ బ్రీతిఁ గనిరి.

తే. ఇది యధర్ముని వంశ మఁట విదితవృక్ష
మగును దీనికి శాఖలై యలరుచుండ్రు
దంభముఖ్యులు శ్రేయముం దలఁచువారు
వారిదరి కేగ నెంచరు భావమునను. 93

వ. ఈయధర్మాదులసృష్టినే ప్రతిసర్గ మందు రోవిదురా! యింక స్వాయం
భువమనువువృత్తాంతముం జెప్పెద నాకర్ణింపుము. 94

సీ. స్వాయంభువునకు నాశతరూపయందు ను
త్తములు ప్రియవ్రతోత్తానపాదు
లనువార లిర్వురు తనయులు విష్ణ్వంశ
మున లోకముల నేలఁ బొడమి రవని
వారిలో నుత్తానపాదునకు సునీతి
సురుచి యనఁ సతు లిర్వు రూరిమఁ గనిరి
సురుచిపైఁ బ్రేముడిఁ జూపును భర్త సు
నీతి నొండొకనీతినిం గనుఁగొను

తే. సురుచికుత్తముఁ డనియెడుసుతుఁడు నాసు
నీతికిఁ ధ్రువుఁ డనియెడుసూతి పుట్టె
రవల నుత్తానపాదుఁ డొక్కప్పు డొక్క
చోటఁ గూర్చుండె నెంతయు నీటు గులుక. 95

—♦ ధ్రువోపాఖ్యానము ♦—

వ. అయ్యవసరంబున నుత్తముఁడును ధ్రువుఁడును దండ్రిచెంతకు వచ్చిన
నుత్తానపాదుండు సురుచిపుత్రుం డగునుత్తమునిఁ జేరఁ జీరి తన
తొడపైఁ గూరుచుండం బెట్టుకొనియె నప్పుడు ధ్రువుండు గూడఁ
దండ్రియుత్సంగంబునఁ గూరుచుండుటకు నభిలాషం జూపెను గాని
యతం డందుల కంగీకరింపఁ డయ్యె నది చూచి సురుచి మగనికిఁ దన
మీఁదను దనతనయునిమీఁదను గలుగుప్రేముడి కెంతయు సంతోష

గర్వంబులు పెచ్చుపెఱుగఁ జేయునది లేక బిక్కమొగంబు వేసికొని
దవ్వుల నిలిచి యున్నధ్రువునిం జూచి పరిహాసపూర్వకంబుగా ని
ట్లనియె. 96

ఉ. దీనముఖంబు వైచికొని దేవురు లాడుచునుంటి వేమి తం
డ్రీ నిను నీదు తండ్రి యిటు లేడ్గడయై కురు వెక్క రమ్మనం
డా నెఱి నీకు నాకడుపునందు జనించినఁ గల్గకుండు నే
హీనశుభావహార్థ యగునింతికిఁ బుట్టుట నిట్లు వచ్చెఁ బో. 97

ఆ. నీవు పోయి తపము గావించి విష్ణుని
కరుణ వడసి నాదుకడుపునందుఁ
బుట్టు మట్టు లైనఁ బొసఁగెడు నీకోర్కె
నేను జెప్పుచుంటి నిజము బిడ్డ. 98

వ. అని పలికిన సవతితల్లిపలుకులు ములుకులై చెవులు సూడిన ట్లయిన నిట్టూర్పు నిగిడించుచుఁ గన్నీరు కాల్వలు గట్ట నేడ్చుచు నటనుండి కదలి తల్లికడకుం జనిన నామె శోకవ్యాకులితచిత్తుం డైనకొడుకుం దిలకించి సునీతి యెదు రేగి తోడితెచ్చి తొడలపైఁ గూరుచుండం బెట్టుకొని తనచెలులవలన సురుచిపలికినపలుకులు విని యున్నదికావునఁ గన్నుల నీరునించుచు నేడ్చుచున్నకుమారు నూఱార్చుచు నిట్లనియె.

ఉ. ఏడువ కేడ్వ కిప్పు డిటు లేడ్చిన నేమిఫలంబు బిడ్డఁడా
నాఁడు సుదుఃఖ మెవ్వరికొ నాఁటఁ బొనర్చితి మందునం జుమీ
నేఁ డిటువచ్చె దుఃఖ మిది నీవును నేనును జేసికొన్నదే
యేదును దాను జేసినదియే మఱి తా నది పొంద నుండెడున్. 100

తే. సురుచి పలికినవాక్యముల్ సురుచిరములు
యగును దురదృష్టవంతురా లవఁగ నేన
కానిచో నన్ను భార్యగాఁ గైకొనినవా
గండు మదినూఁడిగపుదాసి గాఁగఁ గనునొ. 101

వంశస్థ. సునీతినిం భార్యగఁ జూడకుండినన్
జనాళి యట్లన్నను జాల సిగ్గిలున్
తనూజ నేఁ జేసినదాన నే కదా
కనంగ నీరీతులు గల్గ నయ్యెడిన్. 102

ఉ. భర్తలగౌరవంబునకుఁ బాత్రము కానినెలంత కీష్టముల్
పూర్తములు న్నశించెడిని బుత్రిక నే దురదృష్ట నిట్టిచో
నార్తుల కైతి నీకు నిపు డాయమ చెప్పినయట్లు కామధు
గ్భర్తృక యైనయాసవతిగర్భముఁ జేరిన నెంత వాదు నో. 103

తే. సవతితల్లి వచించినచందమునను
దండ్రియుత్సంగ మెక్కఁడు తలఁప యేని
నీవు నామాట విని దేవదేవుఁ డైన
హరినిఁ గూర్చి తపింపుము కరమునిష్ఠ. 104

క. కరుణాళుఁ డతఁడు తొల్లిటఁ
బరమేష్ఠి తపింప వానివరతపమునకున్
కరుణించి మెచ్చి జగములఁ
గురుతరపద మొసఁగి యేలెఁ గొమరుఁడ వింటే. 105

వ. మఱియు నీతాతయగుస్వాయంభువమనువు మహాభక్తితో నారా
యణు నుద్దేశించి యక్షీణదక్షిణలతో ననేకయజ్ఞంబులు గావించి
యుభయలోకంబులందుం బేర్మిఁ గాంచి సుఖం బనుభవించి ముక్తుం
డయ్యె నీవు నాభక్తవత్సలు నె సమాశ్రయింపు మాశ్రితార్థఫల
ప్రదుం డాతండు తక్క మఱియొక్కరుండు భక్తార్తిహరుండు లేడు
నీదుఃఖంబు లెల్ల సమయం జేయు నని పలికిన తల్లిహితవచనంబు లాల
కించి లోనియనుతాపంబు తాన చల్లార్చుకొని ధైర్యం బవలంబించి
తల్లికిం జెప్పి దండ్రినగరంబు విడిచి యుత్తరమార్గంబు పట్టి పోవు
చుండ నమ్మార్గమధ్యంబున నారదుండు డెదురైత న్నెఱింగించి వానిచేఁ
బూజితుండై తనకరంబు లతనిశిరంబుపై నిడి దీవించి తనలోన. 106

—♦ నారదుఁడు ధ్రువునకు దర్శన మిచ్చుట ♦—

శా. అయ్యారే ! చిఱుతం డితం డితని ధైర్యస్థైర్యగాంభీర్యముల్
వెయ్యారుల్ వినుతించునట్టి వగుచున్ విజ్ఞానముం గూర్చెదున్
సయ్యాటంబుల నుండునట్టివయ సీచక్కిన్ గడుం బిన్న వాఁ
డయ్యున్ ఘోరవనంబులం దపము సేయం బూనె నిర్భీకుఁడై. 107

క. ప్రాణముకన్నన్ వీనికి
మాన మ్ముత్కృష్ట మనుచు మదిఁ దోఁచెడు నీ
మానవనాథకుమారునిఁ
గానఁగ నా కబ్బురంబు కడుకొని హెచ్చెన్. 108

వ. అని మనంబునం దలంచుచు బాలుం జూచి యి ట్లనియె. 109

శా. రాజశ్రీవిభవాదిసంపదలతో రాణించుప్రాసాద మీ
యోజ న్వీడి యేఁగుచుంటివి భవద్వ్యూహంబు చింతింపఁ గా
రాజస్త్రీకలితావమానమున కోర్వం జాల కెందేనియుం
జేజేరాయలఁ గొల్వ నేగు దనుచున్ జెప్పంగ వచ్చుం జుమీ. 110

వ. అని తెలిసి యడిగిన యోగిపుంగవుం గాంచి మాణవకుండు దండ
ప్రణామం బాచరించి వినయవినమితోత్తమాంగుండై యి ట్లనియె.

దోదకము. ఓమునిచంద్రమ ! యోగముచేతన్
నామన మెల్లఁ బునాదులతో మీ
రీమెయి నెర్గియు నెట్లని ప్రశ్నన్
క్షేమముఁ గోరుచుఁ జేసితి రిచ్చెన్. 112

తే. మీతలంచినదెల్ల సమీహితంబు
నాదుపినతల్లి ననుఁ జెందనాఁడె దాఁ
గాయపడి నట్టిమనమునఁ గదలి యిట్లు
వనులకుం బోవఁ బయనమై వచ్చినాఁడ. 113

వ. అనిన నారదుం డి ట్లనియె. 114

ఆ. ముద్దు లొలుకుచుంటి ముకుపచ్చ లారని
పిన్నవాఁడ వీవు పిన్నవాండ్ర
తోడఁ గూడి క్రీడ లాడంగ దగువాఁడ
వింత తెంపు సేత యితవు గాదుఁ 115

క. మానము నవమానము నని
మానసమునఁ జింత సేసి మానఁజె పోవం
గా నేల తగదు చింతిల
గా నది పెద్దలు గణింపఁ గలయట్టి దగున్. 116

సీ. దేహ మాత్మగ నీవు దెలియుచుంటం జేసి
మానాభిమాన మీమాద్రి నయ్యె
నది యాత్మసంబంధ మైనది కా దింత
మాత్రకు నీ కిట్టు లాత్రపడుట
తగదు ప్రాజ్ఞుఁడు తన కగుసుఖదుఃఖముల్
దైవమునం జేసి తారసిల్లు
నని నిత్యసంతుష్టుఁడై యుండు నే కాని
యెవరో చేసిన వని యెంచఁ బోఁడు

తే. దాన రిత్త విచారముఁ బూనుకొనఁడు
నీవు తల్లినియోగము నెత్తినిఁ గొని
యీశ్వరుని గొల్వ వనులకు నేగుచుంటి
వెఱుఁగ వందున నగుకష్ట మింతయేని. 117

స్వాగతము. ఈశ్వరుం గొలుచు టెంతో ప్రయాసం
బీశ్వరుండు నిను నింతటిలోనన్
శాశ్వతంబు లగుసౌఖ్యములందున్
విశ్వ మెన్న నిను వేయుఁడు వింటే. 118

శా. ఎన్నో జన్మములందు నెన్నోగతు లెన్నెన్నో మహాకష్టముల్
గొన్నం గాని మహామునీంద్రులకు నేఁ గొమ్మంచు నిష్టార్థముల్

గొన్నాళ్ళంతటిలోన నిచ్చి కృపఁ గన్గొనుండునం చెంచ రా
దన్నా కొండిక నీ వెఱుంగవు తపోవ్యాపారకష్టం బమో. 119

తే. కావున న్నీ ప్రయత్నము వోవు వ్యర్థ
మగుచు వదలుము దీని నీ వవలికాల
మందు జతనింప వచ్చు లో నంతదనుక
సైఁచి యుండుట శ్రేయ మో క్షత్రతనయ. 120

తే. విహితసుఖదుఃఖము లనుభవించు టొప్పు
దాన క్షయ మగుఁ బుణ్యపాపానురూప
కర్మ మందున మోక్షము కరతలామ
లకము వలెఁ దోప వచ్చెడు లలితమూర్తి. 121

వ. అని మఱియు. 122

తే. తనకు మించినవానిఁ గన్గొని ముదంబు
పడవలయు హీనుపైఁ గృప నిడఁగ వలయు
సముఁ డయినవానితో స్పర్ధ సలుపఁ బోక
సఖ్యమునుఁ జేయఁగాఁ దగుఁ సజ్జనునకు. 123

వ. అని యిట్లు బహువిధంబుల భాషించుచున్న దేవమునిం గాంచి ధ్రువుం
డి ట్లనియె. 124

మానిని. ఓమునిసత్తమ నీ వనునంతయు
నుత్తమ మంచుఁ దలంతు నెడన్
నామది కయ్యెడు దుఃఖ మదంతయు
నాసిరిలన్ బొనరించి తిటుల్
భూమి నెవండు తనంతటఁ దా నిటు
బుద్ధి నెఱుంగఁగఁ జాలఁ డొరుల్
వే మఱుఁ దెల్పినఁ గాని గ్రహింపని
చేతోడి యయ్యెడు నిక్కముగన్. 125

క. నే నందులోనివాఁడన్
మౌనీంద్ర ! యెఱుంగఁ జాల మది నే నితరుల్
మానొందఁ దెలిపి యుండిన
మానసమున నెఱుఁగ లేనిమాణవకుండన్. 126

ఉ. నాపినతల్లి నాదునెడ నాటఁగ నాడినమాటలన్ మహా
రోపము లగ్ని నా నయి యరుంతుదమై దహియింపఁ జొచ్చె నా
యోపిక సన్నగిల్లె భవదుక్తులు నామది కిప్పు డెక్కఁగా
నోప విఁ కేమి సేయుదు నయో మునిచంద్రమ మీఱి పల్కెదన్.

తరళము. ఒరులు దూఱిన సైఁచియుండెద రుర్విఁ గొందఱు బుద్ధిమ
ద్వరులు నే నటు సేయఁ జాలనివాఁడ నయ్యెద క్షాత్రధ
ర్మరతి నుండెడుదాన నిట్టిక్రమంబునై నవినీతుఁడై
పరఁగఁ జొచ్చితి నాదుతప్పు కృపామతిన్ సయిరింపవే. 128

ఉ. క్షాత్రము నాకు నిట్టు లయశంబు ఘటింపఁగఁ జేయునట్టినై
మాత్రపలావమున్ సయిఁచుమార్గము నుండి మరల్చె నయ్యె —
క్షత్రియవంశసంభవము సంయమిచంద్రులమాట మీఱి స
త్పాత్రతఁ బాపునట్టి దగుఁ దాపసకౌశిక ! తప్పు సైఁపవే. 129

తే. ఎన్నముల్లోకములయందు నిప్పు డుత్త
మోత్తమం బగుపద మొంద నుల్ల మేను
సలిపి వెడలుచు నుంటి నోసంయమీంద్ర
సాధుపథ ముపదేశింపఁ జనును సూవె. 130

క. పరమేష్ఠ్యుత్సంగంబునఁ
బరువడి జన్మించినట్టిపరమేష్టివి నీ
వరుదుగ వల్లకి మీటుచుఁ
జరింతువు జగమ్ము లెల్ల సప్తాశ్వుఁడు నాన్ 131

వ. అనిన నలరి యతం డతని కి ట్లనియె. 132

స్రగ్ధర. నీకు న్నిశ్రేయసంబు న్నెఱి నిడుపథము న్నేను వాక్రుత్తు నింకన్
వాకో నేముండు నింటి న్వదలితి వనికి న్వచ్చి తొం డేల తొక్కుల్

వైకుంఠు న్భక్తితోడ న్వదలక కొలువ న్వాంఛ గావించుచుండే
కా కొండొక్కండు నీకుం గలుగదు తెలియం గాన నోకన్నతండ్రీ.

మ. యమునాకూలమునం దగు న్మధువనాఖ్యం బొల్చుపుణ్యప్రదే
శము నీ వచ్చటి కేగి యొక్కెడ నివాసంబుం బొనర్చంగ నై
సముదాచారము నిర్వహిల్ల నదిలో స్నానంబు గావించుచుఁ
బ్రిమనం బేర్పడ భక్తితత్పరుఁడవై స్వాంతంబు శాంతింపఁగన్. 134

సీ. సుప్రసన్నాభిముఖప్రసాదముఖాంబు
జేక్షణు లక్ష్మీకటాక్షకలితు
సుభ్రూవిలాసుని సురసుందరుని మంద
హాసభాసురనేత్రు శ్యామగాత్రు
నరుణాధరునిఁ బ్రిణతాశ్రయుఁ గరుణార
సాంచితమృదులసుస్వాంతు శాంతు
శంఖచక్రగదాప్రశస్తచతుర్బాహు
వనమాలిఁ గౌస్తుభాభరణహృదయు

తే. పీతకౌశేయవాసు సంప్రీతహాసు
ఘర్షవర్షను లక్ష్మీసమాత్తవత్సు
శ్రీమహావిష్ణువుఁ నీదుహృదయసీమ
నిలిపి తన్మంత్రజపమును సలుపవలయు. 135

—♦ నారదుఁడు ధ్రువునకు మంత్రోపదేశము చేయుట ♦—

సీ. ఆమంత్ర ముత్తమ మైనది "ఓన్నమో
భగవతే వాసుదేవాయ" యనెడు
ద్వాదశాక్షరములఁ దనరు దాని జపించు
చును దేశకాలాదులను గ్రహించి
భగవంతుఁ బూజింప వలయు నీమంత్రము
నేడురాత్రులు జపియించె నేని
జనుఁ డల్ల దేవతాసందర్శనంబును
జేయఁ గలం డయి చెన్ను మీఱు

తే. భగవదారాధనమునకుఁ బావనజల
గంధపుష్పాక్షతల్ ఫలకందమూల
ములును దూర్వాంకురంబులు భూర్జపత్ర
ములును దులసియునుం గూర్పవలయు భక్తి. 136

వ. ఇట్లు సంభారంబుల సమకూర్చుకొని శంఖచక్రాదిరంగవల్లులచే నలంకృత మగుభూతలంబున జితేంద్రియుండు మితభాషియు నిర్మల చిత్తుండు నై పురుషుండు పురుషోత్తముని ధ్యానావాహనాదులతో వాసుదేవమంత్రపురస్సరంబుగాఁ బ్రతిష్ఠించి పూజింప వలయు నిట్లు చేసి నిరతిశయభక్తిసంపన్నుండై యున్నచో భగవంతుండు భక్తుని మనోభిలషితంబుల నెఱవేర్చు నని నారదుం డుపదేశించిన ధ్రువుండు ముని కభివందన మాచరించి మధువనంబునకుం జనియె. నారదుండు నుత్తానపాదునికడకుం జని పూజితుండై యి ట్లనియె. 137

భుజంగప్రయాతము.
నరేంద్రేంద్ర! నీచిత్తనాళీకమందుక్
కరంబు న్విచారంబు గన్పట్టు చుండెక్
స్థిరత్వం బొకింతేని చేకూరన ట్లీ
వరిష్టంబు శంకించున ట్లుంటి వేమో. 138

వ. అని యడిగిన నారదునకు నరనాథుం డి ట్లనియె. 139

చ. మునివర స్త్రీజితుండ నగుమూర్ఖుఁడ మూర్ఖజనావృతుండ నే
మని వచియింతు నాసుతుని నైదుసమల్ గలవానిఁ దల్లితో
వనులకుఁ దోలి నైచితిని బాపుఁడ నైతిని నాపురాకృతం
బున నగునీశరీరమును బూదిగ నిప్పులఁ గాల్పనే కదా. 140

తే. తండ్రి నగునాదుతోడ యెక్కఁ దనయుఁ డతఁడు
కోరి చెంతకు రా నేను గూళ నగుచు
రాకు పొ మ్మంటి నక్కటా నాకుమారుఁ
డడవికిం బోయె నని వింటి నక్కటకట. 141

శా. ఘోరారణ్యమునందు నాఁకలికి నేకూరైన లేకుండుటన్
రారాపుల్ వడ జాలులో గునుక నేరన్ రామి లోఁ గుందుచున్
జేర న్వచ్చినవాని నేమృగము లేఁ జేకొంచు భక్షింపవే
ప్రారబ్ధం బను భూత మయ్యెడిని నాపాలన్ జముం డల్గెడిన్. 142

న. అని దుఃఖించుచున్న రాజుం గాంచి నారదుండు. 143

ఉ. మానవనాథ చింతిలుట మానుము నీదుకుమారుఁ డెట్టిబీ
తేనియు లేనివాఁ డగుచు దివ్యతపోవని దైవరక్షితుం
డై నెఱి మీఱుచుండె జగమం దతిశాయియశోవిరాజితుం
డై నెగడొందు నీశ్వరసమర్చనలన్ వర మంది నట్టిఁడై. 144

ఆ. అతనికతన జగములందు నీదగుకీర్తి
ప్రబలి వెలుఁగ నగును పార్థివేంద్ర
వగపు విడు మతండు వచ్చును శీఘ్రకా
లమున నీకు సంతసము ఘటిల్లు. 145

వ. అని చెప్పి నారదుం డతని వీడ్కొని యథేచ్ఛం జనియె నంత నుత్తా
నపాదుండును దనచేసినకర్జంబునకుఁ దాన మనంబునం గుములుచు
రాజ్యంబు సేయ నొల్లక ధ్రువునిపైఁ జిత్తం బిడి గడియ యొకమహా
యుగంబుగా దినంబులు వెళ్ళఁ బుచ్చుచుండె నక్కడ ధ్రువుండును.

— ధ్రువుఁడు తపస్సు చేయుట —

సీ. మధువనంబున నొక్కమజ్జికడ న్నిల్చి
యమునాజలంబులయందు నాడి
రాత్రి యుపవసించి రహిసమాహితచిత్తుఁ
డై నారదుఁడు చెప్పినట్లు పరమ
పురుషు నారాధింపఁ బూని మూడేసిప
వలులకు నొకపరి వెలఁగపండ్లు
నాహరించుచు నెల యైనపైనార్నాళ్ళ
కొకపరిఁ గాఱాకు లోరిమఁ దినుచు

తే. హరి భజించుచుఁ బైనెల నట్లు గడపి
తొమ్మిదేసి నాళ్ళకు నొకతూరి వారిఁ
ద్రావి మూఁడవనెల విష్ణుఁ దవిలికొలిచె
నట్లు మూఁడుమాసంబుల నరుగఁ జేసి. 147

వ. నాల్గవమాసంబునఁ బదిరెండుదినంబుల కొక్కవారము వాయు వాహారించుచు జితశ్వాసుండై పరమేశ్వరారాధనంబు గావించె నవ్వల వాయునిరోధంబు చేసి స్తంభాకృతి నేకపదంబున నేల నిలిచి యైదవ మాసంబున హరి నారాధించుచు నింద్రియనిగ్రహంబు గావించి విషయంబుల విరక్తుండై మనంబు నరికట్టి పరమేశ్వరుని ధ్యానించుచుఁ బ్రపంచకదృష్టి లేనివాఁడును నిశ్చలమానసుండై ప్రకృతిజీవుల కీశ్వరుఁ డగుపరాత్పరు నిరీక్షించుచుండె నాసమయంబున. 148

తే. ధ్రువుని తేజము పుంజమై దివము మ్రోయ
నూర్ధ్వలోకము లన్నియు నూఱట చెడఁ
గాలి బొట్టన నేలపైఁ గదియమోపి
యుంట నట నద్ది క్రిందికి యొఱఁగి క్రుంగె. 149

వ. అప్పు డూర్ధ్వలోకంబులం గలవా రాధ్రువునితపోగ్ని తాపంబునకు సైఁపఁజాల కుచ్ఛ్వాసంబు పుచ్చ లేనివారై నారాయణునిసన్నిధానంబునకుం జని నమస్కరించి యి ట్లనిరి. 150

చ. అనదల మేము మమ్ముఁ గృప నారసి ప్రోవుము ప్రాణవాయువుల్
కనుకని కొట్టుకోఁ దొడఁగె గట్టిగ మీఁదికి గాలి పీల్వ నో
పనిగతి గద్దె హేతువు లవంబును గానఁగ రాము నీవు తక్క నేఁ
డును మముఁ గావ నోపఁడు కడుంగడు సేగి జనించెఁ గేశవా. 151

తరువోజ. అని వేఁడువేల్పుల నరసి గోవిందుఁ
డనియె నోసురలార! యవని ధ్రువుండు
ననుఁ గూర్చితపియించు నాభక్తుఁ డతఁడు
నవయుచు నున్నాఁడు ననుఁ గనునిచ్ఛఁ

జని నేను వాని కొసంగి వరములఁ
జనుదెంతు వెఱవేగఁ జను డిప్డు మీర
లనుచు వారల నంచి హరి యెక్కి గరుడి
నమ్మధువనమున కరుదెంచె నంత. 152

వ. ధ్రువుండును నిధ్యానమగ్నాంతరంగుండై తనలో మెఱపు మెఱసినట్లు మెఱసి యంతర్ధానమైన యంతలో బహిర్భాగంబునం జెంత నిలిచి యున్న శ్రీమన్నారాయణునిదివ్యమంగళవిగ్రహంబుఁ దిలకించి భయభక్తిహర్షంబులు మనంబునం బెనంగొన సరభసంబున లేచి సాష్టాంగదండప్రణామంబు గావించి సంస్తుతించుటకుందలంపుచేసెం గాని తద్విధానం బెఱుంగం జాలక వెలవెలఁబోవుచు నిర్విణ్ణుండై యుండె నప్పుడు సర్వజ్ఞుం డగుశ్రీహరి ధ్రువునివర్తనం బరసి కరుణాళుండై శ్రుతిమయంబగునిజశంఖం బతని కపోలంబులకు దాఁకించిన నతండు వేదార్థప్రచురంబు లగువచనంబులు సముద్భూతంబు లగుటయు భక్తియుక్తుండై యి ట్లని ప్రార్థించె. 153

—♦ ధ్రువుఁడు సాక్షాత్కరించిన భగవంతుని స్తుతించుట ♦—

మ. నినుఁ బ్రార్థింపఁగ నేర నట్టిఁ డగుచున్ నే నుండ నయ్యంతలో
ఘనవాక్శక్తి నీ గల్గఁజేసితివి నాకాయంబునం జొచ్చి క
న్గొన నే దొంటిధ్రువుండఁ గా ననుచు నాకుం దోఁచె నిప్పట్టునన్
మునిలోకస్తుత నిన్ను నీనుడులచే భూషించి భాషించెదన్. 154

సీ. అనఘ ! నీశక్తి యత్యద్భుతమగును జ్ఞా
నేంద్రియంబులును గర్మేంద్రియములు
నవల నంతఃకరణాదులుం దత్తద
ధిష్ఠానదేవతల్ దీర్చి కూర్చి
కట్టెకుం బ్రాణము గల్పించి నీ వందు
నంతరాత్ముండవై యలరఁ జొచ్చి
జ్ఞానాదిషడ్గుణాస్థానంబవై లీల
వర్తించునీ కిదే వందనంబు

తే. కాన వచ్చు సమస్తజగంబు వివిధ
రూపములుగ వర్తిల్ల మార్చుటకు నీక
కలదు సామర్థ్య మోదేవ కట్టెలందు
నగ్ని వలె నుందు కానరా నట్టిఁ డగుచు. 155

తరళము. మొదట విశ్వమునున్ సృజింపఁగ బూనినట్టిచతుర్ముఖుం
డది పొనర్పగఁ జాలనట్టిఁడ యై తలంకుచు నుండ నీ
వెదఁ గృపంగొని జ్ఞానమాతని కిచ్చితీ వత డందునన్
గడ కృతార్థతఁ గాంచె సృష్టి ప్రకారమందు మహాప్రభూ. 156

క. తాపత్రయబాధితులకు
నీపదమూలంబ దిక్కు నిను సేవింపన్
రూపింప వచ్చు మోక్షం
బోపరమేశ్వర! భజింతు నుల్లమునందున్. 157

చ. శ్రితులకుఁ గల్పభూరుహము రీతిని వాంఛితముల్ సమస్తమున్
సతతముఁ గూర్చుచుండెదవు సర్వసమర్థుఁడ వింతె కాదు హృ
ద్గతునిఁగ నిన్నుఁ జేసికొనఁ గల్గినవారికిఁ జావుపుట్టువుల్
వెత లవి లేనిముక్తి నిడి ప్రేముడిఁ బ్రోతువు ప్రాణవల్లభా. 158

ఉ. ఇట్టిమహోన్నతుండ వయి యింపెసలారెడునిన్నుఁ గొల్చి యె
వ్వట్టున సర్వసౌఖ్యములు పర్వఁగఁ జేసెడుముక్తిఁ గోర కీ
వట్టిశవంబు నాఁబడెడువర్ష్మము నోమగఁ గోరి నారకం
బ ట్టగుసంసృతిం బడఁగ నాస యొనర్తురు మూఢు లక్కటా. 159

ఉ. నీదగుపాదసేవయును నీదగుభక్తులతోడిమైత్రి సం
పాదిత మైనచోఁ బడయ వచ్చెడుసౌఖ్యముతోడ నీడు గై
కోఁ దగ దల్లమోక్షమును గోరఁగ వచ్చెడుసౌఖ్య మంచు నే
నూఁది వచింతు నీవిభవ మొప్పదె చెప్పఁగ లోకరక్షకా. 160

తే. నీపదార్చన ముక్తికంటెన్ ఘనస మనఁ
గర్మఫలభుక్తి యైన పై ఘనవిమాన

ములను విహరించుచింత లో నిలను గూలు
వేలుపులఁ జెప్ప వలయునే వేదవేద్య. 161

సీ. నీయిచ్ఛచేతనే నీవు కర్త్రాధీనుఁ
డవు నాఁగ మేలురూ పవధరింతు
కర్మబద్ధుం డయి క్రాలుచు జీవుండు
కర్మానురూప మహాకాయముఁ గొనుఁ
బ్రకృతిపురుషులకు వ్యతిరిక్తుఁడవు నీవు
బద్ధుండు జీవుఁడు ప్రకృతియందు
సంకోచ మెఱుఁగవు సంకల్పరూపుఁడ
వీవు జీవుం డట్లు గా వఱలఁడు

తే. నీవు నిత్యముక్తుండవు జీవుఁ డట్లు
కాఁ డసంకుచితజ్ఞానకలితుఁ డీవు
జీవుఁ డతిసంకుచితభావుఁ డీవు ఘనుఁడు
నీకు జీవునకుఁ భేద మీాకరణిద. 162

శా. నీపాదంబుల కేను వందనము నిర్నిద్రస్వభావంబునన్
రేపు న్మాపు ఘానన్తు నాతనువునన్ రేకెత్తియున్నట్టియా
పాపంబుల్ సమయంగఁ జేయుచు దయన్ బాలిచ్చి వత్సంబునన్
గాపాడం గమకించు ధేనువువలెన్ గాపాడి రక్షింపుమా. 163

వ. అని ధ్రువుండు వినుతించి భగవంతునిపాదపద్మములు స్మరించుచు మిన్నకున్నంత భక్తపరతంత్రుం డగునారాయణుం డతనిఁ గరుణావలోకనంబుల నిరీక్షించుచు ని ట్లనియె. 164

—♦ భగవంతుఁడు ధ్రువునకు వరంబు లొసంగుట ♦—

ఉ. బాలక! నావయిం గలుగుభక్తికి మెచ్చితి నీతపంబు నీ
వేల ఘానర్చితో తెలిసె నిప్పుడు నీదుమనోరథంబు నేఁ
బోల నెఱింగితిన్ గరుణ పొంపిరివోవుటఁ జేసి యిట్లు నీ
పాలఁ బ్రసన్నుఁడై వరము పర్వగఁ జేయఁగ నుంటి వింటివే. 165

వ. నీకు శుభం బగుఁగాక కట్టురాటఁ జుట్టు గోమహిష్యాదులు చుట్టివచ్చు చుండు నట్లు ధర్ముఁడు నగ్నియు సప్తర్షులును నక్షత్రరూపంబున నాపదంబు చుట్టునుం దిరిగి వత్తు రట్టిపదం బొం డొక్కండు లే దది యితర దుష్ప్రాపంబు జగత్త్రయంబు నశించిన నశించు నట్టిది కాదు దాని మేలు నీకు షడ్వింశతిసహస్రవత్సరంబుల కవ్వలికాలమున సంప్రాప్తం బగు నంతదనుక భూతలంబున నుండి పితృదత్తరాజ్యం బేలుచుండుము నీజనకుం డుత్తానపాదుండు తాను రాజ్యపాలన భరంబు నీపయిం బెట్టి తాను దపోవనంబునకుం బోవు. 166

ఆ. నీదుసోదరుండు నెఱి దప్పి వని కేగి
సర్పదష్టుఁ డగుచుఁ జచ్చు నీదు
సవతితల్లి సురుచి యవల నడవి కేగి
దావవహ్నిలోన దగ్ధ మగును. 167

వ. నీవు నిష్కంటకంబుగా రాజ్యం బేలుచుఁ బౌండరీకాదియాగంబులం జేసి నన్నుఁ జనువుచు సర్వసౌఖ్యంబు లనుభవించుచుం బిమ్మట సప్తర్షి మండలంబుపై నుండి సర్వలోకవంద్య మగుస్థానంబు మదను గ్రహంబునం బొంది పునరావృత్తి లేనిచందంబున శాశ్వతుండ వై యుండు మని వరం బొసంగి విష్ణుదేవుండు గరుడవాహనారూఢుండై వైకుంఠంబున కరుంతగతిం జనియె నంత ధ్రువుండును. 168

చ. ఒరులకు నొంద రాని దగునుత్తమతానక మందియుక్ మదిక్
గరము ముదంబు నొందక రయుకానొకయింతటిలోన నింటికిక్
సురుచిరలీల నేగె ననుచు స్వచియించిన విస్మయంబునక్
బరమమునీంద్రచంద్రుఁ గని వల్కె నిటుల్ విదురుండు విజ్ఞుఁడై. 169

తే. ధ్రువుఁడు యోగీంద్రులకుఁ జూడఁ దోపకట్టి
శ్రీమహావిష్ణుదర్శనశ్రీ వహించి
యకృతకృత్యునిఁ గాఁ దన్ను నాత్మ నెంచి
సంతసింప లే దనుట విస్మయము సూవె. 170

వ. అనిన మైత్రేయుం డవ్విదురున కిట్లనియె. 171

తే. వినుము చెప్పెద ధ్రువుఁ డల్లపిన్నతల్లి
ప్రల్లదంబులు సైఁపనివాఁడఁ యగుచుఁ
దపము గావించి విష్ణుదర్శనము గలుగ
ముక్తిఁ గోరనిదాన నప్పోల్కి వగచె. 172

క. నే నెంత తెలివిమాలిన
మానిసి నో ముక్తి వడయ మది సేయ కయో
మౌనిహృదంతర్వాసుం
గానఁగ నై యిట్లలంతి గా నైతిఁ గదా. 173

ఉ. చేతికిఁ జిక్కి నైననిధి చెన్నఁటి నై పడఁగొట్టుకొంటి నా
చేతము బాలభావమునఁ జెన్నఱిపోయెను ముక్తిఁ గోర కీ
రీతిని గోరితిన్ సుధ వరింపక హాలహలంబుఁ గోరి న
ట్లే తదనిష్టకార్యమున నేఁ బడి పోయితి నంచుఁ జింతిలున్. 174

మత్త. నాతపం బతినీచ మయ్యెను నామనోధిపుఁ డైనయా
భూతనాథుఁడు దర్శనం బిడి పుత్ర! కోరుము కోరికన్
నీతపంబున కిచ్చ మెచ్చితి నే నొసంగెద నన్న నీ
రీతిఁ దుచ్ఛసుఖంబు గోరితి రిక్త వోయితి నిత్తఱిన్ 175

వ. అని మనోవ్యథం బురస్కరించుకొని ధ్రువుం డట్లు సంతసింప కుండె
నని చెప్పి వెండియు ని ట్లనియె నట్లు ధ్రువుండు వరంబు లంది పురాభి
ముఖుండై చేర వచ్చినవానిం గని కొందఱు పోయి యుత్తానపాదు
నితో నీకుమారుఁడు వచ్చుచున్నాఁ డని చెప్పిన నుత్తానపాదుండును.

ఉ. పుత్రుఁడు వచ్చుచుండె నని పొల్లులు చెప్పిరి వెఱ్ఱు లెవ్వరో
ధాత్రి మృతించినట్టేఁడు నుతం బగురీతిని వెండి వచ్చుటల్
మిత్రులు చెప్పినన్ మనము మే లది యంచుఁ దలంప నౌనె యీ
మాత్రములోని పీతెలుపుమాట లటంచును నమ్మ నట్టేఁడై. 177

—♦ ధ్రువుండు తపోవనంబునుండి గృహంబు చేరుట ♦—

ఆ. అంతలోనఁ జారు లరుదెంచి ధ్రువురాకఁ
దెలుప సత్యమనుచుఁ దలఁచి యతఁడు
సంస్మరించి దేవసంయమివాక్యముల్
సంతసించి మిగుల స్వాంతమందు. 178

వ. వార్తాహరుని బసదనంబున బహూకరించి యుత్తుంగహయసమోహ్యాం
బగుకాంచనరథం బధిష్ఠించి బ్రాహ్మణులు కులవృద్ధులుం గులకాంతలు
వెంట నంట మంగళవాద్యఘోషంబులతో నెదురేగి కొంతదూరం
బుఁబోఁ గుమారుం జూచి రథంబు డిగ్గి నడివడిం జని కౌఁగిలించుకొని
మూర్ధంబు మూరుకొనుచు హర్షబాష్పంబుల నాతనిశిరంబు దడు
పుచు బాష్పసంరుద్ధకంఠుండై పలుకఁ జాలకుండె నంత ధ్రువుండును
దండ్రిపాదంబుల కభివాదనంబు గావించి దీవనలం బడసి తల్లులకడకుం
జని కాళులకు దండప్రణామంబు గావించె నప్పుడు సునుచి తనపాదం
బులఁ జాలిగిపడినరాకుమారుం గని లేవ నెత్తి క్రుచ్చి కౌఁగిటం జేర్చి
యభినందించె నంతఁ దనపాదంబుల వ్రాలినకొడుకు నక్కునం జేర్చి
కుమారదర్శనసంజనితసంతోషాతిశయంబున నయనంబుల బాష్పధా
రాపూరంబు వెల్లువయై ప్రవహింప నొండాడ నేరకుండె నప్పు డమా
త్యాదు లుత్తానపాదునిఁ గాంచి. 179

మత్త. నీయదృష్టము మంచి దయ్యెను నీకుమారుఁడు నష్టుఁడై
పోయినట్టిఁడ నీవు చేసినపుణ్యలేశముఁ జేసి నా
రాయణుం డనుకంపమై నిటు రాజపుత్రునిఁ దెచ్చి నీ
చాయ నిల్పెను రాజ్య మేలుము సౌఖ్యసంగతి నింకిటఁ. 180

వ. అని ప్రకృతిప్రధానపూరుషులు ప్రశంసించుచుండ రాజేంద్రుండు తన
కొడుకుల నిద్దర నొకగజేంద్రంబుపైఁ గూరుచుండం బెట్టి పరివారపరి
వృతుండై పురప్రవేశంబు గావించె నాసమయంబున. 181

సీ. అనఁటికంబమ్ముల నందంపు నెలకొల్పి
మకరతోరణములు మలయఁ గట్టి
ముత్యాలసరములు ముగ్గులుగా దిద్ది
మాతపల్లవములు ప్రీతి నిలిపి
గడపలం దుదకుంభకములఁ బ్రతిష్ఠించి
బంగారుజాలరుల్ పరఁగ జుట్టి
పత్తనం బంతయుఁ బన్నీటఁ గలయంపి
చల్లించి కప్పురముల్ చల్లి దెసల
తే. అగురుసాంబ్రాణిధూపము లారఁ వైచి
కన్నులకుఁ బండువై యుండుకరణి రాజ
ధాని సమలంకృతం బయి జానుమీఱె
ధ్రువుఁడు పురి నడ్డు వెట్టనై శోఁచినపుడు 182

వ. ఇట్లలంకృతం బయినపత్తనరాజవీథిం జనునప్పుడప్పురాంగన లుభయపార్శ్వంబులం గలసౌధంబుల నిల్చి పువ్వులు చల్లుచు నారతులిచ్చుచుండ ధ్రువుండు వారి నాదరించుచుం జని చని హజారంబుకడ గజావరోహణంబు చేసి మందగమనంబునం దండ్రితోడం గూడి పితృగృహంబునం బ్రవేశించి తల్లిదండ్రులు లోనగుబంధుజనంబుల కానందం బాపాదించుచు. 183

పాలనుర్వులఁ బోలి పరిఢవించెడు దుకూ
లపరివేష్టితశయ్యలను దలిర్చి
స్వర్ణమణీగణసముచిత దివ్యాస
నాలంకృతప్రదేశాంచిత మయి
మరకతమాణిక్యమయకుడ్యములు గల్గి
రత్నకవాటవిరాజిత మయి
మేలిమిజాళువా దూలంబులును లస
ద్వైదూర్యవలభులవాసి గలిగి

తే. సకలసంపదంచిత మయి సౌరుమీఱి
కన్నుపండువు గావించుచున్న రాజ
భవనముదయమందు సాధుప్రవరుమాఱఁ
డెల్లబంధువులం గూడి యెసక మెసగె. 184

వ. ఇట్లు కాలంబు పుచ్చుచుండ నుత్తానపాదుండు యుక్తవయస్కుం డగు ధ్రువునకు మంత్రిసామంతాదులయనుమతంబున రాజ్యపట్టంబు గట్టి విరక్తుండై తపోవనంబునకుం జనియె నంత రాజేంద్రుం డగుధ్రువుండు ప్రజానురంజకంబుగా రాజ్యపరిపాలనంబు సేయుచు శింశుమారుం డనుప్రజాపతి కూఁతురు భ్రమియనుదానిం బెండ్లియాడి కల్పుఁడు వత్సరుఁడు నాఁబడు నిర్వురుపుత్రులంగని మఱియు వాయువుకూఁతురై నయిడాదేవిం గూడఁ బెండ్లియాడి యామెయందు నుత్కలుం డనుతనయునిం గనియె నవ్వల ధ్రువునిసోదరుం డయినయుత్తముఁ డవివాహితుం డొక్కనాఁడు మృగయాకుతూహలాయత్తచిత్తుండై మహారణ్యంబునకుం బోయి హిమవత్పర్వతప్రాంతంబున విహరించుచుండ నొకయక్షుండు వానిం జానేసె నంత నతనితల్లి సురుచి తనయు నన్వేషించునదియై వనంబునకుం జని దవంబునం బడి కాలధర్మంబు నొందె నంత ధ్రువుండు వారిమరణవార్త విని మిగుల దుఃఖించి తన్మరణంబు యక్షకృతం బని యెఱింగి. 185

చ. అరదము నెక్కి యక్షులకు నాలయ మౌనలకాపురంబు స
త్వరముగఁ జేర నేగి యటఁ బర్వతము ల్వడిఁ బ్రేలునట్లు గా
దరమును నూఁదె నూఁద నది తద్వివరంబుల నిండి భీషణ
స్వరమున దిక్కులన్ విరిసి సర్వభయంకర మయ్యె నయ్యెడన్. 186

శా. ఆశంఖధ్వని నాలకించి ధనదాధ్యక్షుల్ మహాయక్షు లా
కాశం బంతయుఁ బూరటిల్లినటు గాఁ గ్రౌర్యంబు శౌర్యంబు సం
కాశింపన్ వివిధాస్త్రశస్త్రములతోఁ గాండంబులై వచ్చి భూ
మీశున్ వానినిఁ జుట్టిముట్టి యనికిన్ హెచ్చిల్లి రొక్కుమ్మడిన్.

— ధ్రువుఁడు గుహ్యకులతో యుద్ధము చేయుట —

సీ. ధ్రువుఁడు చుట్టును ముట్టి ఘోరమై చనుదెంచు
యక్షసైన్యముఁ గని యాక్షణమునఁ
గోదండ మెక్కిడి కోకో యనుచు మూఁడు
మూఁ డమ్ముల వారి గాడ నేసె
వార లావేఁడికి వగచి యాతనివిక్రి
మమున కెడంద విస్మయము పడుచు
మెచ్చియుం గ్రోధము పెచ్చున ధ్రువునిపై
నొక రొక్క టాఁ జేసి యుగ్రవిశిఖ
తే. ములను నోనేసి మఱియును ముసలములును
ముద్గరంబులు తోమరములును భిండి
వాలములును బరశువులుఁ బట్టసములు
చిత్రజల్లుగఁ గురిసి రాక్షితిపతిపయి. 188

ఉ. తానును సూతుఁడుఁ రథము తజ్జనులుఁ గనరానియట్టులై
మానవధర్మసైనికసమంచితబాణపరంపరాళికిఁ
లోన నడంగి యుండి జనలోకవిభుండు తలంకుచుండఁ గా
మానసమందుఁ జింతిలి రమర్త్యులు నాకమునం దెలుప్పుచుఁ. 189

వ. అంతలో ధ్రువుండు బాణపరంపరలం బరఁగించుచు నీహారంబునుండి సూర్యుండు వోలె శరవర్షంబు భేదించుకొని వెడలివచ్చి ధనుష్టంకారము గావించి పుంఖానుపుంఖంబుగాఁ శరపరంపరల నిగిడించుచు మహా మారుతంబు మేఘంబులం బోలె శాత్రవుల దవ్వులం బడంద్రోలి మహారభసంబున వేఁడిమిఁ దునుగులం బోనివాఁడిశరంబులం బ్రయోగించి కవచంబులు ఛేదించియుఁ గరంబులు ఖండించియుఁ గుండలమండితశిరంబులు గండడంచియుఁ గరలాఘవంబు సూపుచున్న వాని కోపక హతశేషులు యథాయథలై నలుగడం బాఱఁ జొచ్చి రపుడు ధ్రువుండు కేలఁ గైదువుగలయోధుం గానఁ జాలక యలకా

పురంబుఁ జూడ నెంచియు దాయలు పెక్కుమాయలు గలవా రని
యట్లు సేయమాని సారథితోఁ బ్రశంసించుచుండె నాసమయంబున.

సీ. ప్రళయగర్జారవప్రతిమానమై నింగి
ఘోరారవం బొందు గూడ నయ్యె
నేడుమారుతములు నేకమై పఱతెంచు
నట్లు మహావాత మవని వీచె
నుఱుములు మెఱుములు నురుశరంబుగఁ దోఁచె
రక్తమాంసములతో వ్యక్తమగుచు
విణ్మూత్రవర్షము వియదంతరము నిండ
వర్షించె నేలపై వఱ్ఱు వాఱి
తే. మఱి కబంధము లెన్నియే మహినిఁ బడియెఁ
గడల నాయుధములు దాల్చి కానఁ బడిరి
యోధులు విషాగ్నులను గ్రక్కుచున్నఘోర
మృగము లార్చుచు నెల్లెడ మెలఁగఁ జొచ్చె. 191

తే. ఇట్లు బహువిధమాయల నెన్నియేని
రాక్షసులు పన్ని రది చూచి రాజచంద్రు
డెంతయే బీతు గుడిచెడు నంతలోన
మునులు చనుదెంచి ధ్రువునిఁ గన్గొనుచుఁ గరుణ. 192

వ. నీవు నారాయణునిదర్శనంబునం జేసి ధన్యుం డైనవాఁడవు నీ కీరాక్షసు
లన నెంతవా రనిన ధ్రువుండు జలోపస్పర్శనంబు చేసి నారాయణా
స్త్రంబు వింట ననుసంధానంబు గావించి వారిపై నేయుటయు రాక్షస
మాయ పటాపంచ లైనంత వారును సర్పంబులు గరుత్మంతునిపయిం
బలె ధ్రువునిమీఁదం గవిసి నానావిధాయుధంబులు ప్రయోగించిన
నతండు ధైర్యస్థైర్యంబు లినుమడింప నిశితశరంబుల నెల్లవారిశిరంబులుం
దెగనేసి వారి నందఱ యమలోకాతిథులు గావించె నప్పుడు తనపితా
మహుం డగుస్వాయంభువమనువు మునిగణంబుతో నటకు వచ్చి
మనుమని కిట్లనియె. 193

—• మనువు దర్శనమిచ్చి ధ్రువుని శాంతింపఁజేయుట •—

సీ. తాత! నీ విట్లు భ్రాతృద్రోహ మొనరింపఁ
దగ దుడుగుము క్రోధ ముడుగుట తగు నే
తమ్మునిఁ జంపినదాన ని ట్లని కెత్తి
వచ్చితి నిం డేమిపాప మందొ
యొకఁడు చంపెను గాని యిందఱు చంపరు
సర్వనాశన మిట్లు సలుపఁ దగునె
భగవంతుఁ డీకార్య మగు నని మెచ్చఁడు
కినుక వహించు నిందున నతండు

ఆ. సాపరాధు లైన సైఁపఁ జెల్లును భక్తుఁ
డైనవాఁడు కోప మూని యిట్లు
నిరపరాధు లైననరులఁ జంపినదాన
నచ్యుతుండు మెచ్చఁ డనుచు మఱియు. 194

వ. వత్సా! నీ వైదేండ్లవాఁడవై యున్న యప్పుడు నీసవతితల్లి మాటలం జేసి పరమతపంబు చేసి ప్రఖ్యాతిం బొందితి విప్పు డప్పరాత్పరుని సేవించి ముక్తుండవు క మ్మని చెప్పి స్వాయంభువమనువు మునులతోఁ జనియె ధ్రువుండును దనకుం గల కోపంబును విడిచి పో రీగి పురంబునకుం బోనెంచి కుబేరానుగ్రహంబు సంపాదింప సమకట్టి యున్నసమయంబునఁ గుబేరుండు యక్షపరివృతుండై ధ్రువుం డున్నకడకువచ్చి త న్నాలింగించి యి ట్లనియె. 195

ఆ. క్షత్రిబాల! నీవు స్వాంతంబునం గల
కోప మీఁగి సమర మాపిపోవ
నెంచి తందువలనఁ నెంతయు సంతస
మంది నాఁడఁ జిత్తమందు నిప్పుడు. 196

వ. నేను నీకు వరం బీయ నెంచితి నర్థింపు మనిన ధ్రువుండు సంసారమును దరింపఁ జేయుహరిస్మరణాసక్తి నాకుం గలుగునట్లు వరం బనుగ్రహింపు

మనిన నతం డట్ల యాగంబు గావుత మని వాని నంపిపుచ్చి తా నదృశ్యుం డయ్యె. ధ్రువుండును నిజపరివారపరివృతుండై స్వపురంబునకుం జనియె ననంతరకాలంబున నాధ్రువుండు విధిదృష్టవిధానంబున బహువిధ యాగంబులు గావించి దీనవత్సలుండై యిరువదియాఱువేలవత్సరం బులు భూపరిపాలనంబు గావించి ప్రేమించి కుమారునకు రాజ్య మొసంగి విరక్తుండై బదరికాశ్రమంబున నివసించి పవిత్రజలంబుల నవగాహనస్నానంబు గావించి యింద్రియంబుల మనంబునం బ్రవే శింపం జేసి భగవత్స్వరూపమును ధ్యానంబు సేయుచు సమాధినిశ్చ లుండై దపంబు గావింపం దొడంగె నిట్లు కొన్నినాళ్లు చనినపదంపడి యొక్కనాఁడు చంద్రబింబము వోలె నిజకాంతులచే నంతరాళం బెల్ల దీపింపం జేయుచు నంతరిక్షంబునుండి యొక్కదివ్యవిమానము భూభాగంబునకుం దిగి వచ్చె నవ్విమానరాజంబు. 197

—♦ ధ్రువుఁడు విమాన మెక్కి విష్ణుపదంబుఁ జనుట ♦—

సీ. నీలనీరదకాంతినిం గాదు కా దను
    నెఱి మీఱు దేహముల్ పరిఢవిల్ల
నాలుగుచేతులఁ నలువుమీఱఁ గదాది
    సాధనంబులు గడుఁ సౌరు మీఱ
వరుణపద్మమ్ముల నట్టిట్టు లాడించు
    కన్నుదమ్ములు జగత్కాంతములుగ
ముత్యాలహారముల్ భుజకీర్తులు కిరీట
    ములు కుండలమ్ములు పొలుపు దెలుప
తే. విష్ణుసాయుజ్యమును గొన్న వీరభటులు
ధ్రువునికడ కేగుదెంచి తత్పూజ లంది
మందహాసాంచితముఖారవిందు లగుచుఁ
బలికిరి రీతిఁ బ్రీతిపూర్వకము గాఁగ 198
శా. శ్రీ రస్తు స్థిరవైభవోఽస్తు భవతే శ్రీరాజరాజాంచిత
ప్రారంభోన్నతకీర్తిసాంద్ర! వినుమా రాజేంద్ర! వైదేండ్లయ

ష్ఠే రాజీవదళాక్షుఁ డిచ్చె వర మే మి ష్ఠాపదం బందుకో
రా ర మ్మంచు వచించికొంచుఁ జనఁగా రా నైతి మీరీతిగన్. 199

తే. ఉన్నతోన్నతమై యది యున్న దరయ
దానిఁ జుట్టుఁ దిరుగుచంద్రతారకాదు
లచట సప్తర్షిమండల మతిశయిలు
నది మహాభక్తులకు గమ్య మైనపదము. 200

వ. అని విష్ణుపార్షదు లగునందసునందులు పలికిన వాక్యంబు లాకర్ణించి ధ్రువుండు నిత్యకర్మానుష్ఠానంబులు నిర్వర్తించి మునిజనుల కభివందనం బాచరించి విమానంబునకుఁ బ్రదక్షిణనమస్కారంబు లొనరించి నందసునందులపాదారవిందంబులకు సాగిలిపడి మ్రొక్కి విమానం బధిష్ఠించె దేవదుందుభులు మ్రోసెఁ బుష్పవర్షంబు గురిసె నపుడు ధ్రువుండు దీనురా లగుతల్లిని విడిచి పోవుచుండుటకుఁ లోన విచారించిన నది యెఱింగి విష్ణుదూతలు విమానంబు నడపుచు మార్గమధ్యంబున సునీతి నాతనికిం గాన వచ్చునట్లు చేసిన నతం డామెకు నమస్కరించె నంతలో విమానంబు కొన్ని వేలయోజనంబు లతిక్రమించిన ధ్రువుండు నడుమ నడుమ ననేకదేవయానంబులం దర్శించుచుఁ జని చని సప్తర్షి మండలంబుమీఁద నున్న విష్ణుపదంబుం బొందె నిది ధ్రువునిచరిత్రము దీనిం బఠించిన నీరోగశతాయుష్యమును సిరిసంపదలును సిద్ధించు మఱియు నీచరిత్రము సాయంప్రాతఃకాలములయందును బూర్ణిమామావాస్యలందును బ్రాహ్మణసభలయందును శ్రవణనక్షత్రయుక్త దినంబులందును సంక్రమణంబులందును నాదిత్యవారంబులందును సప్తమీతిథులయందును నిష్కామఁడై దీనిం బఠించిన సర్వార్థసిద్ధి యగునని చెప్పె నని చెప్పిన శుకునిం గాంచి పరీక్షిన్నరేంద్రుఁడు మునీంద్రా! విదురుం డట్లు మైత్రేయునివలన ధ్రువచరిత్రము విని ప్రచేతసు లన నెవ్వరిపుత్రులు వారివృత్తాంతంబు విన నభిలషించుచున్నవాఁడ ననిన నతం డతని కి ట్లనియె. 201

—◆ ధ్రువుని పుత్రపౌత్రాదివర్గము ◆—

సీ. ధ్రువున కుత్కలుఁడు పుత్రుం డని చెప్పితి
నాయుత్కలుఁడు తండ్రి యగుధ్రువుండు
తపియింప నేగినతదనంతరంబున
సామ్రాజ్య మేలునిచ్చం దొరంగె
నాతఁడు పుట్టినదాది రాగద్వేష
ముల వీడి సంగమం దెలమి లేక
ప్రత్యగాత్మను బ్రహ్మవాచ్యునిఁగా సుఖ
రూపునిగా ధర్మరూప మైన
తే. సచ్చిదానందమయునిగా సత మెడందఁ
దలఁచుకొనుచుఁ దత్త్వజ్ఞానకలితవహ్నిఁ
గర్మబంధము లన్నియుఁ గాల్చి వైచి
యాత్మ మరయుట తక్క నొం డరయ కుండె. 202

ఆ. జడుఁడు వెఱ్ఱివాఁడు నెడమూఁగ వలెఁ గాన
వచ్చుఁ గాని లోన వఱలుశక్తి
నెఱుఁగ కతనియనుజుఁ నెంచి వత్సరు రాజు
గా నొనర్చి రిలకుఁ గార్యచణులు. 203

వ. వత్సరుండు సర్వర్ధి యనునారీరత్నముం బెండ్లియాడి యామెవలనఁ బుష్పార్ణుఁడు తిగ్మకేతుఁ డిషుఁ డూర్జుఁడు వసువు జయుఁడు నను నార్వురం బడసె నందుఁ బుష్పార్ణునకుఁ బ్రభ దోష యనునిరువురు భార్య లందుఁ బ్రభకుఁ బ్రాతర్మధ్యందినసాయము లనుమువ్వురు పుత్రులు పుట్టిరి దోషకుఁ బ్రదోషుఁడు నిశీథుఁడు వ్యుష్టి యనుమువ్వురు పుట్టిరి వారిలో వ్యుష్టి యనువానికిఁ బుష్కరణి యనుదానియందు సర్వతేజసుఁ డనుసుతుండు పుట్టె నాతనికి నాకూతి యనుసతియందుఁ జక్షుస్సంజ్ఞ గలమను వనుతనయుండు పుట్టె నామనువునకు నడ్వల యనుపత్నియందుఁ బురుఁడు కుత్సుఁడు త్రితుఁడు ద్యుమ్నుఁడు సత్య

వంతుఁడు ఋతుత్రపితుఁడు అగ్నిష్టోముఁడు అతిరాత్రుఁడు ప్రద్యుమ్నుఁడు శిబి యుల్ముకుఁడు నాఁబడుపన్నిద్దఱు పుత్రులు పుట్టిరి వారిలో నుల్ముకుఁడు పుష్కరిణి యనుదానియందు నంగుఁడు సుమనసుఁడు స్వాతి క్రితువు అంగిరసుఁడు గయుఁడు ననునార్వురు పుత్రులు పుట్టిరి వారిలో నంగుఁడు సునీథి యనునాతియందు వేనుఁ డనువానిం గనియె. 204

ఉ. వేనుఁడు దుష్టుఁడై జగతి వేఱువిధంబునఁ దిక్కుమై కనుం
గో నయినన్ మనంబునను గొంచెము నేనియు సైప కార్తిమై
మానవనాథుఁ డాతనిని మర్త్యుల వీడి యరణ్యభూమికిం
దాను గమించె వేనునిఁ గ్రుధన్ శపియించిరి విప్రు లంతనన్. 205

ఆ. వేనుఁ డింతలోన మేను విసర్జించె
నవుడురాజు లేమి నాధరిత్రి
జారచోరబాధ జనులకుఁ బ్రాప్తించె
దేశ మెల్లఁ జెడియె దిక్కు లేక. 206

తే. అపుడు వేనునిదక్షిణం బైనకరము
ఋషులు మథియించి రందునఁ బృథు వనంగ
సుతుఁడు విష్ణ్వంశమునఁ జేసి చోద్య మెసఁగ
నుద్భవం బందె లోకము నోముపాంట. 207

వ. అని చెప్పినవిని విదురుండు మైత్రేయునింగాంచి మహాత్ముఁడగు నంగభూపాలున కట్టికష్టం బేటికిఁ బుట్టె నా వేనుండు చేసినతప్పు లేమి వానిని మును లేమిటికి శపించిరి. దిక్పాలాంశమునం బుట్టి ప్రజాపాలనము చేయురాజు తప్పు చేసిన నతండు చంపఁ దగినవాఁడు కాఁడని విందును మునినాథా! నాకు సునీథినందనుం డగు వేనుని చరిత్రము వివరించి చెప్పు మనిన నతని కతం డిట్లనియె. 208

—♦ వేనునివృత్తాంతము ♦—

సీ. అంగభూపాలుఁడు హయమేధ మొనరించె
నందు సత్యోత్తము లైనద్విజులు

ఋత్విజులై విధిదృష్టవిధానము
చెల్ల హవిస్సుల నేకరింప
సమ్యగాహూతులై సవనభాగము గొన
నరుదేర కుండినయాజకులును
విస్మయం పడి రాజవృషభున కంతయు
వినిపించి రది విని వెగడు గుడిచి

తే. రాజు మానము విడిచి కారణము తెలుపు
డేమి యపచార మీ నేను ఋభువులయెడఁ
జేసి యుంటినో యెవ రేని చేసియుండి
రో తెలియ నానతిండు సముచితరీతి. 209

వ. అనిన వేదవిద్బ్రాహ్మణు లారాజుఁ దిలకించి యి ట్లనిరి. 210

శా. ఈజన్మంబున నీవు పాప మిసుమంతేఁ జేయఁగా లేదు ము
న్నాజన్మంబునఁ జేసినట్టివృజినం బంటంగ రా దాన నీ
యోజం బుత్రులు లేనివాఁడ వయి యి ట్లున్నాఁడ వద్దాన నా
జేజే ల్వచ్చి హవిస్సులం గొనఁగ వాంఛింపంగఁ బో రి త్తఱిన్. 211

వ. కావున నీ విపుడు పుత్రకామేష్టిం గావింపుము యజ్ఞేశ్వరుండు నీకుఁ బుత్రు నను(గ)హించు దానంజేసి దేవతలు హవిర్భాగంబులు గొందు రనినంత రాజానుమతంబున ఋత్విజులు పుత్రకామేష్టిం గావించి రప్పు డగ్నిహోత్రుండు యజ్ఞకుండంబునుండి పాయసపాత్రముం దెచ్చి రాజున కిచ్చె రాజును దానిం దా నాఘ్రాణించి తనభార్య కిచ్చిన నామె దాని నపసవ్యముగ (గ)హించి భక్షించె దేవతలు వచ్చి హవిస్సు లారగించి రనంతరకాలంబున సునీథ గర్భవతియై నీరుమోసి కుమారుం గనియె వానికి రాజు వేనుం డని పేరు పెట్టె నతం డధర్మాంశసంభవుం డగుటంజేసి బాల్యప్రభృతి నధర్మవర్తనుండయ్యె లోకకంటకుం డయ్యెఁ గ్రూరుఁ డగువాని చేష్టలకు సయిప నోపక తండ్రి చేయఁ గలచర్యలం జేసియు విపులవ్యాపారుండై విరక్తిం

జెంది యొక్కరేయి యెవ్వరికిం జెప్పకుండఁ దపోవనంబునకరిగెఁ బ్రజలు మంత్రులు రాజు నన్వేషించియు నెఱుంగఁ జాలనివారై లోకధర్మం బునంజేసి రాజు లేనిరాష్ట్రం బరాజకంబై చెన్ను దఱిఁగిపోవు నని విచారించి భృగ్వాదిఋషులకు విన్నవించిన వారుసర్వలోకాసమ్మతుం డగువేనునకు పట్టంబు గట్టించి రట్లు రాజైనవేనుఁడు సింహాసన మెక్కినదిమొదలుకొని వానిపొనరించుపాపకార్యంబు లనంతములై సర్వలోకభయంకరంబు లయ్యె నయ్యవసరంబున. 212

సీ. ఐశ్వర్యమదమత్తుఁడై దుష్టుఁ డగువాఁడు
గర్వ మెంతయుఁ దలకాయ కెక్క
జ్ఞానహీనుం డయి సంచరించుచు నుండి
తానె దేవుఁడ నని తలచు కొనుచు
యాగముల్ సేయరా దాగము గా నెంచి
శిక్షార్హు లగుదు రాక్షి తిసురు లని
దానధర్మంబులు పూని చేయఁగ రాదు
వర్ణభేదము లెన్నఁ బడఁగ రాదు
తే. అనుచుఁ దేశములం జాటఁ బనిచి ఖలుఁడు
జీవహింసకు జంకక సిద్ధమునుల
నైన నవహసించుచు నొంచుననుదినంబు
మానవాదునిగతి నయ్యె వేనుఁ డపుడు. 213

వ. ఇట్లు సర్వలోకభయంకరుండై యున్నయావేనరాజున కోపఁ జాలక ప్రకృతిప్రధానయోధవర్గంబు భృగ్వాదులకు విన్నవించిన వారు వాని ననేకవిధంబుల సామవాక్యంబులం బోధించి చెప్ప నప్పరమమూర్ఖుండు వారి కి ట్లనియె. 214

ఉ. మీరలు బుద్ధిహీనులరు మీఁ దెదొ యున్న దటం చధర్మముల్
వారక ధర్మమంచు మది పర్వఁగఁ జేయుచు నెవ్వి యెవ్వి యో
కోరి పొనర్చుచుల్ నృపతిఁ గొంచెము నేనియు గౌరవించుచుల్
జేరి భజింప రిట్టిమిముఁ జీల్చినఁ బాపము రా దొకప్పుడుల్.

సీ. కులటలు భర్తలం గొలిచి భజింపక
పరపురుషుల భక్తి మఱిగినట్లు
ప్రభు వగునాయందు భక్తి సేయక యెవఁ
డో యజ్ఞపురుషుఁ డొం డొకఁ డుండె
నను చూడ లెఱుఁగనియట్టి దుర్వర్తింతు
రో ద్విజులార రాజోత్తముండు
సర్వదేవాంశముల్ పర్వఁ గైకొని పుట్టె
నని యెఱుంగనివార లైతి రకట

తే. మీర లింతటినుండి నన్ జేరి సతము
గొలువకుండిన మి మ్మెల్లఁ గొర్త వేయు
నాజ్ఞ వెట్టుదు నిజము నాయాజ్ఞ రాక
మున్న సత్ప్రవర్తనములఁ బొందు మీరు. 216

వ. అని యనేకవిధంబుల బ్రాహ్మణాదుల నందఱ వేధించుచుండ ఋషులు వీఁడు పాపాత్ముఁడు వీనికతంబున లోకంబు చీఁకాకుపడుచుండె నని చెప్పవలసినట్లు చెప్పి చెప్పి యొప్పక ముప్పు గూర్చువానిం జావ శపించి రంత వాఁ డాశాపంబున నిధనంబు నొందె నంత లోక మరాజకం బగుటం జేసి క్షామడాంబరాది బాధలు జారచోరాది బాధలును బహుళంబు లయ్యె నయ్యెడఁ దైలగుప్తంబు గావించి సునీథిచే రక్షితం బయిన వేనునికళేబరంబుఁ దెచ్చి మంత్రపూర్వకంబుగా దక్షిణోరువును మథించి రంతలోన బాహుకం డను నొకకుబ్జుండు పుట్టె వాఁడును.

సీ. బండికం దెనజిగి బైసిమాలిన మేను
పొట్టికాల్సేతులు మిట్టనుదురు
పెదపెద్దచెక్కిళ్ళు వ్రేలాడు పెదవులు
తుంపుడుమాటలు తొట్టముక్కు
నిప్పులు గ్రక్కెడునేత్రయుగంబును
నెఱిసైన కుఱుచ లౌ నెఱకగములు

చాకిబానకుఁ బోల్కి సలుపఁ జాలినబొజ్జ
చేటల కీడగు నేటిచెవులు
తే. గలిగి పురుషుఁ డొకానొకం డల్పశక్తి
మంతఁ డుదయించి మ్రొక్కుచు మాన్యులార
యేమి సేయుదు నే జెప్పుఁడీ యనంగ
వారు వానిస్వరూపము పాఱఁ జూచి. 218

వ. వీఁ దుష్టుండు కాఁ డని నిశ్చయించి "నిషీద" యని పలికి రాపలుకు టం జేసి వాఁడు నిషాదుం డయ్యె నిప్పుడు నిషాదు లనంబడువారు వానిసంతతిలోనివారే వారు పురంబులం దుండక పర్వతవనంబుల వసించుచుందు రిట్లు వేనునిదేహంబునం గలపాపం బంతయు నారూపంబున బహిర్గతం బయ్యె ననంతరంబ. 219

— పృథుచక్రవర్తి జన్మాదికము —

తరువోజ. మఱియు నా వేనునిమహిత బాహువులు
మథియింప గా నందు మహిమోన్నతులును
బరమకళ్యాణులు బహుళతేజోని
బద్ధవిగ్రహులు దంపతు లుదయించి
వఱలుచుండఁ గాంచి వారు సంతోష
భరితాంతరంగులై వారి శ్రీవిష్ణు
వరమూర్తులుగ నెంచి భక్తి భావించి
బహువిధశుభములు పఱపి రయ్యెడల. 220

వ. ఆమిథునంబులోఁ గీర్తి నభివృద్ధి నొందించుం గావునఁ బురుషునకుఁ బృథు వనియు సద్గుణంబుల లోకమును బ్రకాశింపఁ జేయును గావున స్త్రీకి నర్చి యనియు నామకరణంబులు గావించి వా రిద్దఱు లక్ష్మీనారాయణాంశసంభూతు లని వారిదాంపత్యముం బ్రశంసించి రప్పుడు.

సీ. దివి దేవదుందుభుల్ దీపించెఁ బుష్పవ
ర్షము భూమిపైఁ బడె నమరతరుణు

లాడిరి కిన్నరుల్ పాడిరి బ్రహ్మాదు
　　లరుదెంది యతని విష్ణ్వంశజునిఁగ
నెంచి సేవింప ఋషీంద్రు లాతని నభి
　　షేకవిధులతోడ సేవ చేసి
రెల్ల లోకములవా రల్ల మహారాజు
　　నకుఁ గానుకలు పంచి రకుటిలమతి

తే. వరుణుఁ డొకఛత్రమును బంచె వాయు వొక్క
చామరము ధర్మపురుషుఁడు దామము వృషుఁ
డొకకిరీటము యముఁడు ఘాతుకులఁ గూల్ప
వెలయుదండము నొసఁగి రాపృథువునకును. 222

వ. మఱియు బ్రహ్మదేవుఁడు వేదమయం బగుకవచంబును సరస్వతి ముత్యాలహారమును విష్ణువు నిజాంశభవుండు గావునఁ జక్రాంశంబున నైనచక్రంబును లక్ష్మి మహాసంపదలును శంకరుండు ఖడ్గంబును గౌరీదేవి శతచంద్ర మనుకవచమును మఱియుఁ జంద్రుండు సుధామయంబు లగుతురంగంబులును సుందరం బగురథంబును వహ్ని శృంగనిర్మిత మగు కార్ముకమును సూర్యుండు ప్రకాశవంతంబు లగుమహోన్నతబాణంబులును భూదేవి యోగమయంబు లైనపాదుకలును నింగి ప్రతిదిన పూజార్హ మగునొక్కపుష్పమును సత్యాశిషంబులును సముద్రుండు తనలోనం బుట్టినయుత్తమశంఖంబును నదీనదంబులు పర్వతములు రథ మార్గంబులును సమర్పించిరి ద్యావాభూములు మంగళవాద్యములు బోరుకొలిపె వందిమాగధులు కైవారంబుగావించి రప్పుడు జాత మాత్రి మహోన్నతమేధానిధి యగుపృథువు మందహాససుందరవదనారవిందుం డై మేఘగంభీరవాగ్గుంభనల నెల్లరు విన వందిమాగధుల దిక్కుమొగం బై యి ట్లనియె. 223

ఉ. పుట్టితిఁ బూరుషుండ నయి పూర్వము పశ్చిమ మే నెఱుంగ నే
నెట్టులు సంచరింప నగు నేమి యెఱుంగను లోక మెట్టిదో

యెట్టిది యుత్తమంబొ మఱియెట్టిది కాదొ యెఱుంగ నిట్టిచో
నిట్టులు మీరు నన్ బొగడ నిప్పటి కొప్పమి నేను జెప్పుదున్. 224

క. అని పృథువు పలుకుచుండిన
విని మాగధులు సంతసించి పృథుభూపతిపైఁ
గను ద్రిప్పి యోనరేశ్వర !
నిను వందులు సంస్తుతింప నేరరు తెలియన్. 225

ఉ. కా దని వీరి నిట్లనుట కా దిది స్తోత్ర మటంచు నెంచుటల్
కాదు నిరర్థకం బనుట కాదు భవన్మహిమాదికంబు లీ
మాదిరివంచు వేలుపులమాటలె వీ రిటు తెల్పుచుండి రిం
దేదియు సత్యదూర మని యెంచఁగఁ బో రెవ రిట్టిపట్టునన్. 226

తే. ఆనవెట్టకు వీరల నవనినాథ
కాఁ గల వవెల్ల సత్యముల్ గాఁగ నీకుఁ
దెలియఁ దగినది యనుచు వందులనుఁ జూచి
పలుక ఋషులాజ్ఞ యిచ్చి రావంది జనులు. 227

తే. నీవు దేవాంశభవుఁడ వోనృపలామ !
నీదుసంకల్పమునఁ జేసి యే దయఁ గొని
పుడమి నవతరించితి విట్లు భూపతి వయి
నిన్ను వర్ణించి పలుకఁగా నేర రెవరు. 228

వ. నీ వనంతకళ్యాణగుణసంపన్నుండవు గావున మహామునులయుపదేశంబు
నంజేసి మేము ని న్నిట్లు శ్లాఘింపఁ బూనితిమి. క్షమింపు మని పలు
కుచుఁ బ్రజలదిక్కు మొగంబై. 229

ఉ. ఓమహనీయులార ! యితఁ డో మనయిప్పటిచక్రవర్తియై
భూమి సమస్తధర్మములు పోషణ చేయుచు నెందు లోటు పా
టేమియు లేనియట్లు ప్రజ నేలుచుఁ బోలిచి దుష్టశిక్షణం
బామెయి శిష్టరక్షణ మనంతసమర్థత నాచరించెడున్. 230

చ. తనకిరణంబులన్ రవి సదా ధరణిం గలయేళ్ళనీళ్ళలం
గొనకొని సంగ్రహించియును గొంతటిలో నవి వెండి భూమికే

తనియఁగ నిచ్చిన ట్లితఁడు దర్పమునం గొని కప్ప మెప్పుడే
జనులకొసంగు రక్షణము సల్పెడుకర్జ మెసంగి యుండినన్. 231

—♦ పృథుచక్రివర్తిసద్గుణములు ♦—

సీ. పృథుచక్రివర్తికిం బృథివికిం గలిగిన
సహనంబు గల దని సాట వచ్చుఁ
బ్రజలు వర్షము లేక పరితపించెడునప్డు
కురియుఁ బర్జన్యునిపగిది వర్ష
మితఁడు వేణారణి జతనింపఁ గలిగిన
జాతవేదుఁడు సద్గుణాతిశాయి
తప్పు చేసినవానిఁ దనయునే దండించు
నితనియాజ్ఞ జగంబు సతము నిలుచు

తే. సర్వభూతశరణ్యుఁడు సాధుమూర్తి
దీనవత్సలుఁడున్ ద్విజాధీనబుద్ధి
సత్యసంధుఁడు తల్లులచాడ్పునఁ బర
వనితలం జూచువాఁ డని వలయుఁ దలఁప. 232

ఉ. సాగరమేఖలన్ నిజభుజద్వయి నిల్పి మహౌషధీమణుల్
వేగనివిక్రమంబునను బిండి ప్రజాళికిఁ బంచి పెట్టెడున్
శ్రీగలఁడై ప్రపంచమునఁ జెప్పఁగ నొప్పినవైభవంబునన్
యోగవిభుండు న్యాఁగఁ బొగడొందుచునుండును దండియై ధరన్. 233

వ. జగదేకవీరుం డగునితండు సూర్యుండు నా రథారోహణంబుచేసి ధను
ర్బాణపాణియైఁ ప్రాక్పశ్చిమసముద్రాంతమహామహీమండలంబులవక్ర
విక్రమంబునఁ బ్రదక్షిణము గావించుచుండు దిక్పాలురు వీని కజ
స్రము కానుక లిచ్చుచుండు రింద్రుండు వోలె నితండు పర్వతంబులన్
భేదించి భూమినిమ్నోన్నతత్వము లేకుండ సమత్వంబు నొందఁ జేయు
మఱియును. 234

సీ. ఇతఁ డాజగవము మ్రోయించుచుం బెరలకు
నోపరానిపరాక్రమోన్నతుఁ డగు

నాచరించెడిని బ్రహ్మావర్తమున నూఱు
 హయమేధములు వేల్పు లభినుతింపఁ
గడపటిహయమేధకాలమునఁ దన
 యాశ్వముఁ దేవేంద్రుఁ డపహరించుఁ
దత్త్వవిజ్ఞాన మాతండు సనత్కుమా
 రునితో నెఱిఁగి బ్రహ్మమును గమించు

తే. అనుచు వందులు వేనవే లతిశయముల
విడక పలుకుచు నుండెడు వేళఁ బృథువు
వారల బహూకరించి పైవారలకును
బసదనం బిచ్చి పుచ్చె సంతస మెసంగ. 235

వ. అనిన విదురుండు మునీంద్రా భూమి యేమి కారణంబున గోరూప
మును ధరించెఁ బృథువు దాని నేల పితికెను వత్స మేది పాత్ర మేది
యజ్ఞాశ్వము నింద్రు డేల యపహరించెను అంతయు నవిస్తరముగాఁ
దెలుప ననుగ్రహింపు మనిన మైత్రేయుండు సంతసించుచు నిట్లనియె.

— పృథువు భూదేవిని నిగ్రహించుట —

తే. పృథువు పట్టాభిషిక్తుఁడై పృథివిజనుల
నరయుచున్నప్పు డొకకాలమందుఁ బ్రజలు
కుడువ నన్నము లేమిఁ బెక్కురు గతించి
రంత హతశేషు లరుదెంచి యధిపుఁ గాంచి. 237

చ. కటకట! తిండి లేక యిటు కాఁతియకొందుచుంటి మేము మా
పటుజవసత్త్వముల్ చెడినవోఁ పార్థివతల్లజ! జాఠరాగ్ని మ
మ్మ్రుటమట నొందఁ గాల్చెడిని నాఁకలిబాధకుఁ దాళఁ జాల కి
ప్పటికి గతించి రెందఱో కృపామతి మమ్ము ననుగ్రహింపవే. 238

సీ. పరిపరిగతుల నిప్పగిదిఁ బలుకుచున్న
 ప్రజల దీనాలాపపద్ధతులను
విని రాజు ప్రజలకుఁ దిననన్న మది లేమి
 కేమికారణ మని వ్యాకులతనుఁ

జర్చించి యోషధుల్ సర్వము భూదేవి
హరియించె నని కోప మగ్గలముగఁ
బ్రళయకాలానిలోపముఁ డయి మండుచు
విల్లమ్ములు ధరించి వెడఁదతూఁపు

తే. లెక్కవెట్టిన పృథురాజు నెఱిఁగి పృథివి
గడగడవడంకుచుఁ ధేనుకాయముఁ గొని
వడివడిం బాఱఁ జొచ్చె నయ్యెడయుఁ దరసి
వఱచుదాని పిఱుందన పఱవఁ జొచ్చె. 239

చ. అడవిని వేఁటకానిఁ గని యట్టి భయంబునఁ బాఱులేడి నా
వడివడి వెంబడించునృపవర్యునిఁ గన్గొని బెగ్గడిల్లుచుఁ
గడువడి నూర్చుచుఁ బఱచెఁ గా శ్ళవి నాల్గును రెండు గాఁగ నే
ర్పడునటు సాఁచి వేయుచును బాఱెను వాఱక యెల్లదిక్కులన్ 240

తే. ఎందుఁ బోయిన నందు నాపృథువు దోపఁ
దిరిగి వేసారి యంతలోఁ దీక్షి పోవు
తను వనుచు నెంచి రక్షించుకొన మఱొండు
గతిఁ గనఁగ లేక రా జున్నకడకు మగిడె. 241

వ. అట్లు మగిడి రాజుదిక్కుమొగంబు వెట్టి దీనస్వరంబున ని ట్లనియె. 242

ఉ. స్త్రీవధ సేయ దోష మని చెప్పెడి శాస్త్రము లీ వెఱుంగు దో
భూవర నీదువత్సలత ముజ్జగముల్ కొనియాడు భూతర
క్షావిధి నీవ్రతం బగును గావున భూతములందు భూతమై
యీవగ నున్నవ న్ననుపు మే నపరాధినిఁ గా నెఱుంగుమా. 243

తే. నిరపరాధను ననుఁ జంప నీవు తలఁతు
పాపరాధయై నను స్త్రీని సాఁక నగును
గాని శిక్షింపఁ దగ దని కరుణ గలుగు
నీమనంబున కెఱుఁక లేదే మహీశ. 244

ఉపేంద్రవజ్రము. ప్రపంచకాధారను బట్టి నన్నుం
గృపం గనం బోవక యిట్లు చంపన్

నృపోత్తమా పూనుట నీకుఁ జన్నె
నెపం బిఁ కేదే నిట నిల్చి యున్నే. 245

ఆ. వార్ధినడుమ నావఁ బ్రద్దలు గావించి
దానిలోనిజనము తజ్జలమునఁ
గలుపు నట్లు నన్ను గావించి నీవును
బ్రజలు జలధి మునుఁగు వారు గాదె. 246

వ. అని పలుకుచున్న పృథివికిఁ బృథురాజి ట్లనియె. 247

సీ. నిరపరాధవు గావు నీవు నాశాసన
మును మీఱి యపరాధమును బొనర్చి
తందున వధియింప నర్హురాలవు యాగ
ములహావిర్భాగముఁ బొందు దీవు
మీరు చేసినయుపకారమునకు బదుల్
ధాన్యాదులు హరింపఁ దగునె చెప్పుమ
దండనార్హమ నీవు త ప్పిసుమంతయుఁ
గాన రా దిందు నాఁకటఁ దపించు

తే. వారి నిం బ్రోచు పుణ్యము వచ్చు నాకు
జగతి స్త్రీ యైన దయలేక జనుల బాధ
కైన దానిని హింసింప నఘము రాదు
న్యాయపరిపాలన మొనర్చునవనిపతికి. 248

చ. గరువము పెద్ద నీకు ననుఁ గాండహతింబొనరింతు వేని నీ
పరిజను లీవు నీదుపరివారము నీట మునింగి పోదు రం
చఱచితి వట్టు లైన నిను నంతము నొందఁగఁ జేసి యోగపుం
గరిమను నన్ను నాప్రజను గాచెదఁ బ్రోచెదఁ బై ధరించెదన్. 249

వ. అని కల్పానల్పగభీరభైరవుండై పలుకుచున్న పృథుమహారాజు పాదం
బులపైఁ బడి గోరూపధారిణి యగుధారణి యి ట్లనియె. 250

సీ. నీవు నీమాయచే దేవమనుష్యాదు
లను జేసి తదాశ్రయమున మెలఁగుదు

నీకు షడూర్ములు లేకుంటఁ బ్రకృతికిఁ
బరుఁడవై యుందు వోపరమపురుష
నీవు సర్వజ్ఞుఁడ వీవు సర్వేశుఁడ
వీవు రక్షకుఁడవు దేవదేవ
బ్రహ్మవై సృష్టిని రచియించితివి నీవు
నేను నీసృష్టిలో నైనదానఁ
తే. బ్రకృతి కల్పిత మైనప్రపంచ మెల్ల
నాపయిఁ నిల్పి నా కెంతో రూపు దెచ్చి
నన్నుఁ జంపుట కి ట్లైతి వెన్న నేను
భక్తురాలను గావుమో భద్రమూర్తి. 251
తే. ప్రజల నేలుధర్మంబునఁ బరఁగునీవు
సర్వమునకు నాధారమై చనెడునన్నుఁ
జంపఁ బూనకు మోదేవ! సాధుభావ
నీకు వందన మొనరించి నెఱి భజింతు. 252
మ. జగధాధారముగాఁగ నుండిననుఁ జాల్మిం డోకం డుద్ధతిం
దగులఁ గొంచు సముద్రనీరముల డిందం జేయఁగా బోత్రివై
దిగి పాతాళమునుండి తెచ్చి నను నార్తిం బాపి కాపాడి తో
జగదీశా! యిపు డిట్లు సేయు దఁటె రోషం బేఁగి రక్షింపవే. 253
వ. అని ప్రార్థించినం బ్రసన్నుం డయ్యు రోషరూషితాంతఃకరణుండై
యుండినపృథువుం జూచి మహారాజా! కోప ముపసంహరింపుము
నావాక్యములు సావధానచిత్తుండవై యాకర్ణింపుము. 254

—♦ పృథువు భూమినుండి యోషధులం బిదుకుట ♦—

సీ. పురుషార్థసిద్ధికి ధరఁ దత్త్వదర్శులు
ఋషులు గోరక్షయుఁ గృషియు వర్త
కము మొదలగునుపాయములను గల్పించి
జీవనోపాధులు చెల్లుపొంటెఁ

బరసాధనమ్ము లధ్వరములు విలసిల్లె
నరు లిట్లు సుఖజీవనమున నొందు
కాన వానిని నగువానిఁ గా నెంచి వ
ర్తించిన ఫలియించు టెంచ నరిది

తే. ఇహపరమ్ములకై మున్ను ద్రుహిణుఁ డరసి
యోషధులఁ జేసెఁ గొంద ఱయోగ్యమతులను
నాశనం బగునట్లు లొనర్ప నేను
సంగ్రహించితి వాని లోకైకనాథ. 255

చ. కడుపున జీర్ణ మయ్యె నవి కాలము మిక్కిలి యైనదాన నో
పుడమిదొరా! యుపాయమును బోహణచేసి వచింతు భూప్రజల్
గడుకొని ప్రోఁచుభారమును గల్గితి వేనియు గోవు నైననా
కడరెడుదూడఁ బాల్పిదుకు నట్టిఁడు పాత్రముఁ గూర్పఁగా వగుల్

తే. దోగ్ధయును దోహపాత్రము దూడ గలుగ
వత్సలత్వమున న్నేను పాలరూప
మునబొసఁగు నోషధుల నీయ మన మొనర్తు
దానఁ బ్రజలకు నన్నము గాన వచ్చు. 257

తే. ఎచట నిమ్నోన్నతంబులై యొసఁగుతల ము
లన్నియును నీవు నీవగునంబకములఁ
జదనుగాఁ జేయు మందున జలము నిలిచి
సస్యములు పండు నన్నము సంభవించు. 258

వ. అని భూదేవి పలికిన విని పృథుచక్రవర్తి తాను దోగ్ధయై తనఁజేతు లం బాత్రముగఁ జేసి స్వాయంభువమనువును వత్సము గావించి సకలౌషధిమూల మగుక్షీరములం బిదికి భూమివయిం జల్లి యోషధులం బుట్టించె. 259

ద్విపదము. అంత వసిష్ఠాదు లగుమునీశ్వరులు
సంతసంబున బృహస్పతిని వత్సముగఁ

సలిపి యింద్రియములఁ సత్పాత్రమందు
నలరు ఛందోమయమగుక్షీరములను
బిదికిరి దేవతల్ వృషుఁడు వత్సముగఁ
బొదల బంగారుచెంబుల నమృతమ్ము
పితికిరి దానవుల్ వేడ్కఁ బ్రహ్లాదు
నుతవత్సముగఁ జేసి నున్ననియున్న
కలశమునఁ బెట్టి గాడియు మాధ్వి
విలసిల్లు మద్యముఁ బితికిరి వెన్క
ఘనులు గంధర్వులు కడఁక విశ్వావ
సుని దూడగాఁ జేసి సొగ సగుపద్మ
మహితపాత్రమున వాఙ్మధురదుగ్ధముల
రహిఁ బాఅఁ బిదికిరి రమణించుమేన
నచ్చరల్ సౌందర్య మనుపాలు పిదిగ
రిచ్చమైఁ బితరులు నిను దూడగాఁగ
సలిపి కుంభమునందు సరసాన్నదుగ్ధ
ములు పిదికిరి సిద్ధమునులు కపిలుని
లేఁగఁగా నొనరించి లీల వ్యోమమున
యోగసిద్ధుల నెల్ల నొసఁగెడుపాలు
పిదికిరి యక్షులు ప్రీతిమై మయుని
సదమలవత్సమై చనఁ జేసి యద్భు
తము లొసంగెడుమాయఁ దగులఁ బిదికిరి
క్రిమ మొప్పఁ బాములు ఘనుని దక్షకునిఁ
గ్రేపుగా నొనరించి కేవలవిషము
నేపునఁ బిదికి రయ్యెడల గోవులును
బశుపతి వాహము వత్సముం జేసి
విశదముగా వనుల్ వెలయుపాత్రముగఁ

చేసి తృణంబను క్షీరముల్ పిదికె
వాసిమీఱఁగ సర్వపర్వతములును
భాసిల్లుహిమనంతు వత్సగాఁ జేసి
యూసానువులు పాత్రమై హాయి వొంద
రత్నౌషధుల నెల్ల రమణ మీఱంగ
యత్నపూర్వకముగా నప్పుడు పిదికె. 260

వ. ఇట్లు సమస్తజాతులును దమతమజాతిలో నుత్తమము లగువానిని వత్సములుగా నొనరించి తమతమస్థానములందు వాంఛలను క్షీరంబుల నాగోరూపధారిణి యగుధారణివలనఁ బిదుకుకొనిరి పృథురాజు న్ట్లు మనోరథసిద్ధింబడసి భూదేవినిఁ దనకన్నకూఁతుగా భావించి ప్రేమించి పిమ్మట నిజాస్త్రశస్త్రప్రభావంబునఁ బర్వతశిఖరంబుల నుగ్గునూచంబు గావించి భూమండలంబెల్ల సమతలంబు గావించి పంటలు పండించి ప్రజలకు జీవనాధారంబు గల్పించె మఱియును. 261

సీ. బాటలు నిర్మించి పేటలు గట్టించి
పురములు గ్రామముల్ పొందుపఱచి
ప్రాకారములు గట్టి పరిఘలు త్రవ్వించి
పల్లెలు పక్కనాల్ పరఁగఁ జేసి
గోనివాసంబులు సేనానివాసముల్
హయగజశాల లందందు నిలిపి
నానావిధంబులై నలువుమీఱెడుయంత్ర
శాలలు మఱియుఁ గర్మాలయములు

తే. కనకతామ్రాదిఖనిజముల్ గలుగుచోట్లు
గాంచి తత్కార్యము లొనర్పఁ గలిగి వైద్య
శాలలును బాఠశాలలు సత్రములును
ధర్మశాలలు స్థాపించె ధరణివిభుఁడు. 262

—♦ ఇంద్రుఁడు పృథువు యాగాశ్వము నపహరించుట ♦—

వ. ఇట్లు కావించి ధర్మపాలనం బొనర్చుచుండిన పృథుచక్రవర్తి స్వాయంభువమనువున కాశ్రమం బైన సరస్వతీతీరంబునం బ్రకాశమానంబగు బ్రహ్మావర్త మనుసిద్ధక్షేత్రమున నూ ఱశ్వమేధంబులు గావించె నందుఁ గడపటిదగు నశ్వమేధంబు ప్రవర్తించుచున్న సమయంబున బ్రహ్మ విష్ణు మహేశ్వరులును లోకపాలురును గరుడగంధర్వకిన్నర యక్షరక్షః ప్రభృతి దేవయోనివిశేషులును దేవదానవులును గపిల నారదదత్తాత్రేయులు సనకసనందనాదులును లోనగువా రెందఱో మహామహులు యాగదర్శనలాలసులై చనుదెంచి రప్పు డాభూమి యాజ్యాదిహవిస్సుల నరణ్యా మభీష్టవస్తువులను సమకూర్చుచుండె సరస్వతీనది చెఱకురసము ద్రాక్షారసము బాలు పెఱుగు నేయి తక్రము నన్నపానాదుల నొసంగుచుండె వృక్షములు ప్రవృద్ధిం గొని మకరందమును స్రవించుపత్రపుష్పఫలాదుల నిచ్చుచుండె సముద్రములు రత్నరాసుల నాయాతీరంబులం గప్పుచుండెఁ బర్వతంబులు భక్ష్యభోజ్యమ్ములతోఁ జతుర్విధాన్నంబులు గురియుచుండె నప్పు డెల్లదిక్పాలకాదు లనేకవిధంబు లగుకానుకలం గొని వచ్చి యర్పించి రట్టిపృథుచక్రవర్తి యభ్యుదయముం గాంచి దేవేంద్రుండు సైఁపలేని వాఁడై యొరులకుం గానరాకుండ వచ్చి యాగాశ్వమును హరించె.

ఉ. అశ్వముతోడ నాకసము నంటి వడిన్ గమియించెఁ బెంజడల్
విశ్వవిభుత్వ మేర్పడెడు వేషము మేల్కకపాల భూతియున్
నశ్వర మైనకావివసనంబును దాలిచి ధర్మమూర్తి నా
శశ్వదనంతకీర్తి యగుశక్రుఁ డవక్రగతిన్ జనె న్వడిన్. 264

తరువోజ. అది కనుంగొని యత్రి యాగాశ్వహరణ
మంతయుఁ బృథురాజు నాత్మజన్మునకు
విదితము గావించి వెడలుము నాఁగఁ
బృథుపుత్రుఁ డప్పుడ వెడలి వేవేగఁ

బది క్రోశములలోనఁ బట్టి పల్లార్చి
వాని యోగిగ మది భావించి వెనుక
సదమద మొనరింప సంశయ మేది
శక్ర నిల్వు మటంచు సారెఁ బల్కుచును. 265

వ. మహోగ్రబాణంబులు నిగిడించుచుఁ బరాక్రమించినపృథుపుత్రునిం జూచి యింద్రుండు సంచలించుచుఁ దనపాషండరూపంబుతో నశ్వంబు విడిచి వడివడి నూడనిం బాడెఁ బృథుపుత్రుండును హయంబుం గొని రయంబున మఖాయతనంబునకుఁ జనుదెంచె నప్పుడెల్లవారు నాతని పరాక్రమంబునకుం బరిపరి ప్రశంసించి వానికి విజితాశ్వుండని పేరు పెట్టి రాలో నింద్రుండు గాఢాంధకారంబు సృజించి వేరికిం గానరాకుండ వచ్చి యూపంబున బంగరుత్రాళ్ళం గట్టినకత్తలాని మఱియు నపహరించి తొంటివలె నింగి నంటి చనియె నప్పు డత్రియె వానిం దిలకించి విజితాశ్వునకుం జెప్పి వియోగించె నతండు నతిరయంబునం దరియ నేగి పాకశాసనుని బాణపరంపరల నోనేసిన నతండు తొంటివలెఁ బాషండరూపమును విడిచి యంతర్ధానంబునొందె విజితాశ్వుం డశ్వముం దెచ్చి తండ్రికి నివేదించిన నతండు దేవేంద్రుండు చేయు దుష్కార్యంబు నెఱింగి కృద్ధుండై తాను దీక్షితుండైనను గణింపక విల్లమ్ము లంది యింద్రునిం జంప బాణం బనుసంధించుపృథురాజుం గాంచి యత్రిముని లోనగుమునితల్లజు లెల్ల రాభూవల్లభుం దిలకించి యి ట్లనిరి. 266

—♦ ఇంద్రు నిగ్రహించినపృథునికడకు బ్రహ్మాదులు వచ్చుట ♦—

సీ. నీవు కోపింపకు మేవంవిధంబున
వాని మంత్రముల నాహ్వాన మొనరఁ
జేసి పాశుక మట్లు చేసి వేల్తుము మేము
నావుడు రాజు శాంతత్వ మొందె
నాహ్వానమంత్రము లామునుల్ పచరించు
నంతలోఁ బరమేష్ఠి యటకు వచ్చి

ఋషులార! దేవేంద్రుఁ డిట్లు వధార్హుండు
గాఁడు తద్ద్రోహము గాచిఁ పుచ్చుఁ
తే. డచ్యుతాంశజుఁ డాతఁడు యజ్ఞరూపుఁ
డైనహరి వానిఁ జంపుట కనుమతింపఁ
డతఁడు నూఱధ్వరంబుల నాచరించి
నట్టిఁ డని పేరుపొందినయట్టిఁడు జుఁడీ. 267

వ. రాజుం దిలకించి రాజా! నీ వేకోనశతక్రతువులు చేసిన నతండు శత
క్రతుసంపూర్ణుం డైన నీ కెందునుం జాలఁ డతని కాపే రుండ నిమ్ము
నీ వింక నీయాగంబులు మాని ముముక్షుజనసమాచరణీయంబు లగు
మహాయజ్ఞంబులు సేయు మని బోధించి చనియెఁ బృథుచక్రవర్తియు
నింద్రునిపైఁగల కినుక విడిచి ఋత్విగ్జనసమ్మతంబున నంతలో నయ్యా
గంబు సమాప్తి నొందించి యవభృథంబుగావించి ఋత్విగాదులకు
భూరిదక్షిణ లొసంగె యాగదర్శనాగతు లగువారందఱు రాజసత్కృ
తులై తమతమపొందుపట్లకుం జని రంత. 268

— హరి పృథునికడకు వచ్చి వర మిచ్చుట —

సీ. హరి పురందరునితో నమరులతోఁ బృథు
పృథివీశ్వరుని చెంత కేగుదెంచి
సత్కృతుండై యను క్ష్మానాథ! నీ కప
రాధి నింద్రుని సైఁప రమణ యనుచుఁ
దెలుపుచుంటిని దత్త్వకలితులు భూతవి
ద్రోహము సేయ రేతోయమునను
నీవంటివారలు దేవమాయం జేసి
మోహము గలుగుట పోలునొక్కొ
తే. విను మవిద్యచేఁ గలిగెడువిషయసౌఖ్య
ములును గామాదులును భేదబుద్ధి విడిచి
ప్రకృతిపురుషేశ్వరులఁ దత్త్వభక్తిఁ దెలిసి
విజ్ఞులాత్మాభిమానము విడిచి యుందు్రు. 269

వ. నీకు దేహాత్మస్వరూపము వివరించి చెప్పెద నాకర్ణింపు మాత్మ నానావిధదేహములం దుండినను జ్ఞానైకాకారత్వమున నేకరూపమై యుండు దేహము దేవమనుష్యాదిభేదముచే నానాత్వంబునుబొంది యుండు నాత్మ నిర్మలమై స్వయంప్రకాశమైనది. దేహము మలినమై స్వయంప్రకాశము కానిది. ఆజ్ఞజ్ఞానానందాదుల కాకరము దేహమున కట్టిగుణములు లేవు. ఆత్మ యణుస్వరూపమై సర్వత్ర వ్యాపించి యుండును దేహము-సర్వవ్యాప్తము కాదు. ఆత్మధారకము దేహము ధార్యము కావున నాత్మ దేహమున కంటె విలక్షణమైనదని తెలియం దగు దేహమునకుం గలబాల్యాదిదశ లాత్మకు లేవు. దేహగతబ్రాహ్మణాదివిభేద మాత్మకు లేదు కావున నోయీ నీవు దేహసంబంధసంజనితసుఖదుఃఖంబుల సముఁడవై యుండుము. నీ వింద్రియవశంబుగావించుకొని దేవతిర్యఙ్మనుష్యాదులందు దేహాతిరిక్తసామ్యము ననుసంధానముచేయుచు సర్వసముఁడవై లోకపాలనంబు గావింపుము ప్రజాపాలనము రాజధర్మము దానంజేసి రాజునకుఁ బ్రజలపుణ్యములో నాలవపాలు సంప్రాప్తం బగు దానంజేసి సుగతులు సులభసాధ్యంబులు ముక్తియుఁ గరతలామలకంబు మఱియు రాజను వాఁడు బ్రాహ్మణానుమతంబున వర్ణాశ్రమాచారధర్మంబుల ననువర్తించుచు ఫలాపేక్ష చేయక తనయందు స్వాతంత్ర్యమారోపించుకొనక ప్రవర్తించుచు నీకు దర్శన మిచ్చినసనకాదిసంయమీంద్రుల యుపదేశంబులం బొంది మోక్షసామ్రాజ్యంబునుం బొందుము నీ శమదమాదిగుణంబులచేతను సుస్వభావముచేత నేను నీకు వసుండనైతి వరం బడుగు మిచ్చెద నంతలో నింద్రుండు తనతప్పు క్షమింపుమని రాజుపాదంబులఁ బడి ప్రార్థించె నంత రాజేంద్రుండు లోనికోపం బుపసంహరించుకొని వానిం గౌఁగిలించుకొని పిమ్మట శ్రీహరి పాదారవిందంబులం బడి లేవకున్నంత నతం డతని లేవనెత్తి ప్రయాణోన్ముఖుండై పాదాంగుష్ఠంబున నేలరాయుచు గరుడిపై చేయివైచి యున్నహరిం గాంచి రాజేంద్రుం డి ట్లనియె. 270

సీ. ఈవు బ్రహ్మాదుల కే నధిపతి వయి
వరము లొసంగెడువాఁడ వనఘ
యజ్ఞులు గోరెడునట్టిసాంసారిక
వరముల నర్థించువాఁడఁ గాను
ముక్తినిం గోరను ముక్తి నొందిన నీదు
పాదముల్ సేవించుభాగ్య మేది
సతము నీగుణముల శ్రుతులఁ బెట్టఁగ నెంచి
నాఁడ శ్రుతులు వేయి నా కొసఁగుము
ఆ. భక్తిపరులఁ గూడి భవదీయగుణకీర్త
నమ్ము లక్ష్మివోలె నెమ్మి మీఱఁ
జేయుచుండు నట్లు చేయు మనుగ్రహ
మింత కన్న మిన్న యేది వరము. 271

మ. నిను సేవించెడుకార్యమాకమల తాఁనేకాని నేఁ గూడ స
ల్పినచో స్పైఁపక నాపయిం గినక గావింపంగ నే భీతిఁ గై
కొన నియ్యింద్రునిఁ ఁోడి వైరమున నాకుం గూర్చిన ట్లప్పుడున్
ననుఁ బ్రేమించి యనుగ్రహింతు వనుచున్ నానమ్మకం బీశ్వరా.

వ. అని పలికిన విని వాసుదేవుం డానందించుచు నీవు మోక్షమును గూడ నపేక్షింపమికి మిగుల సంతసించితిని నామాట విని నీ వింద్రు ననుగ్రహించినందులకు నీయం దెంతయే వాత్సల్యముదయించినది నాయందు నీకు భక్తి వర్ధిల్లుఁగాక పోయివచ్చెద సుఖంబుండు మని తత్కృతసత్కృతుండై సర్వదేవసమూహంబు లంటి కొలుప గరుడా రూఢుండై వియద్గమనంబున వైకుంఠంబునకు వేంచేసెఁ బృథు చక్రవర్తియు యజ్ఞాగతుల నెల్లర నంపిపుచ్చి మంత్రిసామంతాదులతో నిజపురంబునకుం జనియె నదియును. 273

సీ. ముత్తెపుసరులచేఁ జూలదండలచేతఁ
జిత్రచిత్రాంబరశ్రేణిచేతఁ

గనకబహిర్ద్వారఘనభాగములచేత
గమగమవలచుధూపములచేత
నానంద మిడుచుండు నన్నివీథులయందుఁ
బన్నీటఁ గలయంపి పర్వఁ జేసి
దీపము లెల్లెడ దీపింపఁగాఁ జేసి
ఫలపుష్పములును లాజలును నిల్పి

తే. అరటిస్తంభము లందందుఁ బరఁగఁ జేసి
పలురకంబులు పల్లవంబులను జేర్చి
ప్రక్కలం బోకవృక్షముల్ పాతి రాజ
ధానిఁ గైసేసి రిటు సంవిధానమునను. 274

వ. అంతఁ బురంబునం గలస్త్రీలుం బురుషులు నలంకరించుకొని నానా విధవాద్యఘోషంబులతో రాజున కభిముఖంబు గాఁ జని పూజించి రారాజేంద్రుం డెల్లపౌరజానపదులం గూడి మంత్రిసామంతపరివార పరివృతుండై గృహప్రవేశంబు గావించి యేండ్లుపూండ్లుగా రాజ్యంబు పాలించె నప్పు డొక్కకాలంబున గంగాయమునానదీమధ్యభాగంబున నున్నబ్రహ్మావర్త మనుపుణ్యక్షేత్రమున. 275

తే. సత్రయాగము గావించు స్వాంతమునను
దీక్షితుం డయి ఋషులతోఁ దేజ మెఱసి
సలువు చొకనాఁడు వేనవే ల్జనులు వినఁగ
నం దుపన్యాస మిచ్చె నీచందమునను. 276

—♦ ప్రథుచక్రవర్తి చేసిన మహోపన్యాసము ♦—

వ. నేను ధర్మపరిపాలనంబు గావించుచు ప్రజల రక్షింపఁ బరమేశ్వరునిచే నియుక్తుండనైతి నాచేఁతలకు బరమేశ్వరుఁడె సాక్షి. ఈశ్వరుఁడు సంత సించిన ముక్తి కరతలామలకంబు. అట్లుసేయ కూరక కరగ్రహణంబు సేయురాజు జ్ఞానబలాదులు గోలుపోయి నిరయంబులం బడుప్రజలారా! మీరు నాయెడ ననూయ విడిచి భగవదర్పణబుద్ధి గలిగి వర్ణాశ్రమ

ధర్మముల నిర్వహింపుఁడు దానం జేసి నాయందు మీరు దయ గలవారని యెంచుట కవకాశము గలుగును దేవతలారా ! పితృదేవతలారా! మీ రసూయారహితులై నా శాసన మనుసరింపుఁ డనుసరించిన మీరు సత్ఫలము లొందక మానరు. ఉత్తములారా ! యాగములం దారాధింపఁబడి తత్ఫలము కర్తల కిచ్చునీశ్వరుం డొక్కరుం డుండె ననియుఁ బరలోకమం దాయాఫలము లనుభవించు శరీరములు పెక్కులుండు ననియుఁ బ్రకృతిపురుషులకు భిన్నుఁడై యీశ్వరుఁడు లేనిచో సృష్టి యసంభవము గావున నీశ్వరపదార్థ మున్నదనియు నెఱుంగుఁ డీయెఱింగినవారిలో మనువు నుత్తానపాదుఁడు ధ్రువుఁడు ప్రియవ్రతుఁడు నాపితామహుఁ డంగరాజు బ్రహ్మ రుద్రుఁడు ప్రహ్లాదుఁడు బలి లోనగువారు కొందఱు మాత్రమే కలరు. మఱియు జీవు లొనరించు ధర్మాదులకు ఫల మగుస్వర్గాదులును మోక్షము నీశ్వరుఁడే యొసంగును గావున ధర్మస్వరూప మెట్టిదియో తద్విధాన మెట్టిదియో ఫల మేమియో తెలిసికొనం దగు స్వర్గాదిసర్వఫలప్రదుం డగు నీశ్వరుని పదకమలధ్యానము సకలానర్థముల నడంచునట్టిది తాపత్రయముచేఁ బీడితు లగువారికిఁ బరమేశ్వరునిపాదపద్మసేవ ననేకజన్మసంపాదిత చిత్తమాలిన్యముం గంగాజలంబు పంకంబువలెం గడిగి వైచును వైరాగ్యంబు గలిగి ప్రకృతికంటెం బరమైనయాత్మస్వరూపముం దెలిసి జ్ఞానంబునం జేసి భగవంతునిపాదము లాశ్రయించి తదేకధ్యానపరాయణుం డగువాఁడు జననమరణాదిరూప మయినసంసారము నొందఁబోఁడు సభ్యులారా ! మీరు మీమీవర్ణాశ్రమముల కనుగుణంబులగు కర్మంబులచేతను శమదమతపశ్శౌచాదులచేతను ధ్యానస్తోత్రాదులచేతను నిష్కపటవృత్తిం గలిగి పరమపురుషుని మీరు భజింపుఁడు పరమేశ్వరుఁ డనంతకళ్యాణగుణగరిష్ఠుండు విజ్ఞానసాంద్రుం డై వఱలుచుండు నతండే యాగరూపుఁడై యాగఫలాదు లగు స్వర్గాదిలోకము లొసంగుచుండు మఱియు నింద్రాదులం దంతర్భూతుండై యున్న వాఁ

డనియు నెఱుంగుఁడు దీనంజేసి యింద్రాదుల నారాధించినవారు నీశ్వరు నారాధించినవా రగుచుందురు మఱియుఁ గర్మమును గర్మానుగుణఫలమును ఫలమనుభవించువాఁడు నీశ్వరుఁడేకాని తద్భిన్నుఁ డెవ్వండును లేడు దారువులం దగ్ని యున్న ట్లీశ్వరుండు దేహగతుండైయుండుఁ గాని స్థూలసూక్ష్మాదిదారుగుణంబు లగ్నికి లేనట్లు శరీరగుణంబు లీశ్వరునకు లేవు కావున నాదేశమందు నివసించువా రందఱును దృఢసంకల్పులై వర్ణాశ్రమోచితరీతి నింద్రాదుల కంతరాత్మ యగుపరమేశ్వరు నారాధించుచుండునట్లు చేసితి రేని మీరు నాయనుగ్రహమునకుఁ బాత్రము లగుదురు కృచ్ఛ్రచాంద్రాయణాదులచేతను జపతపంబులచేతను బ్రహ్మోపాసనచేతను నతిథిపూజలచేతను శమదమాదులచేతను నీశ్వరారాధనము గావింప నగు లోకంబున బ్రాహ్మణులందు నీశ్వరుం డుండుఁ గావున వారినే రాజులును బ్రజలును సేవించుచుండ వలయు నట్టివారిం జూచి యీశ్వరుఁడు సంతసించును బ్రాహ్మణసేవచే మనశ్శాంతి గలుగు దానంజేసి సర్వమును సాధ్యం బగు నింద్రాదుల కగ్నియు బ్రాహ్మణులకు ముఖంబు బ్రాహ్మణుని యందు నగ్నియందు వేసినహవిస్సు లింద్రాదులకుం జేరుచుండును బ్రాహ్మణు లుపాసనచేతను జ్ఞానయోగకర్మయోగములచేతను వేదాధ్యయనాదులచేతను బవిత్రులు వారిపాదం బెప్పుడు నే శిరమునం దాల్తు మీరు నట్లు గావింపుఁడు శీలము గలిగి జ్ఞానవృద్ధుల నాశ్రయించినవారికి సకలకళ్యాణసంపత్సమృద్ధి యగు నని యుపన్యసించుచున్న పృథురాజుం గాంచి దేవతలు పితృదేవతలు లోనగువారు మేలు మే లని ప్రశంసించిరి. 277

మ. నినుఁ బోల్పుత్రునిఁ గన్ననీజనకు వర్ణింపంగ సామాన్యమే
మునుఁ బ్రహ్లాదునిఁ గన్నరాక్షసుఁ డెటుల్ మోక్షంబు గైకోఁగ న
య్యెనో నీతండ్రియు నీప్రభావమున హాయిం బుణ్యలోకంబులన్
గొననై యుండెను విష్ణుతుల్యుఁడవు నిన్ గొండాడఁగా శక్యమే. 278

వ. నీయుపదేశంబునంజేసి మేము ధన్యులము పోయివచ్చెదము నీ కిదె నమస్కార మని రాజాజ్ఞం గొని నిష్క్రమించి రంతలో నాకాశంబు నుండి మహాతేజస్సంపన్నులు కొందఱు దిగుచుండం గాంచి రాజేంద్రుండు లేచి సభాసదులతో నిలువంబడి చూచుచుండు నంతలోన.

—♦ సనకాదులు వచ్చి జ్ఞానోపదేశము చేయుట ♦—

సీ. పేరోలగమునకుఁ జేరువగా వారు
దిగి నంత నెదురేగి తెచ్చి నృపతి
చిత్రసింహాసనాశీనులం గావించి
యర్ఘ్యపాద్యంబుల నర్చన లిడి
పాదోదకముశీర్ష భాగంబునం జల్లు
కొని పాదసేవయుఁ గొంత సలిపి
మునులార నాపూర్వపుణ్యము మంచిది
మిమువంటివారలు రమణ మెఱయ
తే. దర్శనం బిచ్చుటంజేసి ధన్యతముఁడ
మీరు భగవత్స్వరూపులు మీకు నీశ్వ
రేశ్వరుఁడు తోడు నీడ మి మ్మెంత చెప్పి
చెప్పినంగాని యింతయుఁ జెప్ప నట్లు. 280

వ. సంసారమగ్ను లగువారికి సులభముగా మోక్షము సిద్ధించుమార్గ ముపదేశించి న న్ననుగ్రహింపుం డనిన వారిలో సనత్కుమారుం డిట్లనియె. 281

తే. ఈవు సర్వభూతములకు హితము గోరు
చున్నవాఁడవు తత్త్వార్థ మెన్న నీదు
సొమ్ము విద్వాంసుఁడవు లోకసమ్మతముగ
నడిగితివి ప్రశ్న మిది లోక మలరుటకయు. 282

సీ. శ్రీహరిగుణములు చెవులార వినుటకుఁ
బ్రీతి నీకెక్కువయై తలిర్చు

హరికథాశ్రవణము దురితజాలంబును
హరియింపఁగాఁ జేయుఁ బరఁగెడునది
కళ్యాణగుణగణకలిత మహాబ్రహ్మము
నందు దృఢం బగునట్టిభక్తి
గలుగుటయును దేహములయందు నిరపేక్ష
యును మోక్షమునకు సాధనము లరయ
ఆ. భక్తవరులమైత్రి భగవత్కథారక్తి
గలిగి కొనియు నర్థకాముల విడి
తత్త్వ మెఱిఁగికొనుచుఁ దగులంబు విడనాడ
ముక్తి నొందఁ గలఁడు పురుషుఁ డెలమి. 283
క. భగవద్గుణామృతంబుల్
దగఁ గ్రోలుచు భూతహితమున న్మెలగుచు లో
భగవత్స్మరణము మఱువమి
నగు మోక్ష మొకింత లోన నవనీనాథా. 284
సీ. ఇంద్రియార్థంబుల నెల్లఁ బరిహరించి
కామాదిశత్రులఁ గడఁక గెలిచి
ద్వంద్వముల సహించి తగులంబులం బాసి
పరిపూర్ణ మగుహరిభక్తిఁ జేసి
యప్రీతి దేహాదులం దతిప్రీతి బ్ర
హ్మమునఁ గుదురనుగ్రహమ్ము కలిమి
వైరాగ్యయుత మగువర్తనంబును దృఢ
జ్ఞానము భక్తియుఁ గలిగికొనుచు
తే. రాగమును ద్వేషమును వీడి యోగనిష్ఠఁ
డగుచు జగము నశ్వర మని స్వాంతమందు
నిశ్చయజ్ఞానమున నొప్పునియతచిత్తుఁ
డింతలో మోక్షలక్ష్మీసమేతుఁ డగును. 285

సీ. శబ్దాదివిషయసంసర్గము విడ కుంట
యింద్రియచింతన యెడయ కుంట
పురుషునిపురుషార్థములు సర్వము హరించు
నందున విజ్ఞాన మడఁగి పోవు
నజ్ఞాన ముదయించు నందున ధర్మార్థ
ములకు విరోధియై పొడవడంగు
నాది నే ననుమమత్వాదికంబును గల్గు
నద్దాన సర్వము నడఁగి పోవుఁ
తే. గాన మనుజుండు సంసృతిఁ గాని దనుచుఁ
దోసిరా జని సంగముఁ బొలఁగఁ ద్రోచి
సతము క్షేత్రజ్ఞుఁ డైనయీశ్వరునిభక్తి
కలితుఁడై కొల్చెనేని మోక్షమును బొందు. 286
తే. భగవదాత్మక మైనదే ప్రకృతి యనుచు
నింద్రియవశంబు గలుగ సర్వేశ్వరు మది
భక్తి చేయుచుఁ గర్మసంబంధవాస
నల విడిచె నేని పరమాత్మఁ గలసికొనును. 287
శా. ఈసంసార మపారసాగరము నాహీనోగ్రఘోరగ్రహ
వాసం బిందలిజీవితంబు చపలాప్రాయం బనర్థప్రదం
బీసంద్రంబును విష్ణుపాద మన నౌహేరాళ మౌకాచే
నేసం దేహము లేక దాఁటి మనుజుం డేలుం బరంధామమున్. 288
వ. అని బ్రహ్మకుమారుం డగుసనత్కుమారుండు బోధించిన సంతసించి
పృథురాజిట్లనియె. 289
సీ. యతులార! తాపత్రయాతిపీడితులకు
శాంతిఁ గూర్చెడుసట్టిసాధుమతులు
మీరు మీదర్శనామేయభాగ్యము నాకుఁ
గలిగె ధన్యుఁడ నైతి లలితమూర్తు

లార ! నాకోరికల్ తీరెను బ్రహ్మోప
దేశము చేసితి రీశులార !
గురుదక్షిణ యొసంగఁ గోరిక యయ్యెను
నాదుప్రాణమ్ములు నాదుధనము

తే. నాదురాజ్యము భవనముల్ నాదుభూమి
నాదుసర్వస్వము నొసంగ నాదుమనము
స్వీకరింపుఁడు దయచేసి సిద్ధులార !
మీకు వందన మొనరింతు మేదినిఁ బడి. 290

తే. అనినసనకాదు లిట్లని రవనినాథ
నీదువినయోక్తులకుఁ జాల మోద మయ్యె
సర్వమును మాకు వచ్చె నోక్ష్మాతలేశ
పోయివచ్చెద మని పల్కి రాయెడలను. 291

—♦ పృథువు విరక్తుండై తపోవనికేగి ముక్తుం డగుట ♦—

వ. ఎల్లరు చూచుచుండ వియద్గమనంబున నిర్గమించిరి పృథురాజును సనకాదులయుపదేశంబునఁ దనకోర్కు లన్నియు సమకూరె నని సంతసించుచు దేశకాలానుగుణంబుగాఁ బరమాత్మోపాసనమున కంగముగా వర్ణాశ్రమోచితకర్మము లాచరించుచు నాకర్మఫలంబు సర్వంబు సర్వేశ్వరార్పణంబు గావించుచు సంగమును బాసి భోగస్థాన మగుగృహస్థాశ్రమమం దున్నవాఁ డైనను సార్వభౌముం డైనను దేహాత్మాభిమానము విడిచి విషయాధీనుండు గాక కులాలకీట న్యాయంబునఁ బ్రవర్తించుచు రాజ్యపరిపాలనము గావించుచు నర్చి యనుపత్నియందు విజితాశ్వ ధన్వకేతు హర్యక్ష ద్రవిణ వృకు లనునేగురుపుత్రులం బడసి భూలోక దేవేంద్రుం డై మనోవాక్కాయ కర్మంబులఁ బ్రజల రంజింపఁ జేయుచు సూర్యుఁడు నిజకిరణములచే భూమింగలజలంబు గ్రహించి మరల భూమికి నొసంగునట్లు ప్రజలవలనఁ గరంబు గ్రహించి మరలఁ బ్రజోపయోగార్థ మొసంగుచు శత్రువు

లకు దుస్సహుండై భూమివలె క్షమియై కామధేనువువలె నెల్లర కోర్కులం దీర్చుచు మేఘునివలె యథేష్టముగా వసువుల వర్షించుచుఁ బ్రజలకుఁ దృప్తి గలిగించె మఱియు సముద్రునివలె దుస్తరుండును మేరువువలె నిశ్చలుండును యమునివలె శిక్షకుండును హిమవంతునిం బోలె రత్నాకరుండై కుబేరుండుబలె ధనేశ్వరుండై వాయువు వలె సర్వగామియై కందర్పుండు బోలె సుందరుండై సింహంబు వోలె స్వేచ్ఛావిహారియై స్వాయంభువమనువుం బోలె వాత్సల్యంబు గలండై బ్రహ్మదేవుఁడు వోలె సామర్థ్యంబు గలిగి బృహస్పతిం బోలె వేద వాదియై మహావిష్ణువుంబోలె స్వతంత్రుండై వెలుఁగొందుచుఁ బృధు చక్రవర్తి గోబ్రాహ్మణులందును గురువులందును విష్ణుభక్తులందును భక్తిం గలిగి పరోపకారపరాయణుండై ముల్లోకములఁ బ్రసిద్ధిం గాంచి కొన్ని వేలసంవత్సరములు మని తన్ను వృద్ధుగా నెంచుకొని తన దేశప్రజల నాదరించుచుఁ బ్రజాపాలనరూపమగునీశ్వరాజ్ఞ నెఱ వేర్చుచుఁ గొడుకులకు రాజ్య మిచ్చి పత్నీసమేతుండై తపోవనంబున కేగి వానప్రస్థులధర్మంబు నిర్వర్తించుచు శమదయాదులుం గలిగి తపించుచుఁ గందమూలపత్రఫలాదు లాహారించుచుం గ్రమంబుగా జలభక్షుండు వాయుభక్షుండు నై తుదకు నిరాహారుండు నై శీతోష్ణాది ద్వంద్వంబుల నోర్చి మౌనవ్రతంబు పూని యింద్రియంబుల నిగ్రహించి వాయువును బంధించి సనత్కుమారోక్తక్రమంబున యోగానుసంధా నంబు గావించుచు జ్ఞానంబునం జేసి పరతత్త్వంబుం బరికించుచు నేకాగ్రచిత్తుండై గుదస్థానమును గాలిమడమచే నదిమిపట్టి మూలా ధారమునుండి వాయువును నాభినిఁ బొందించుచుఁ గ్రమముగా హృదయవక్షస్స్థలకంఠశిరోభాగంబులం బొందించి పదంపడి బ్రహ్మ రంధ్రంబునం దావాయువును సంధించి నిస్పృహుండై వాయువును మహావాయువునందును దేహమునుభూమియందును దేహస్థజలమును జలమందుననుసంధానము గావించి పృథివీభాగము జలమందును

జలము తేజమునందును దేజము వాయువునందును వాయువును నాకాశమందునుం జేర్చి శబ్దాదితన్మాత్రములు నింద్రియంబు లింద్రి యార్థంబులు లయంబు నొందించి యాత్మను మహాతత్త్వమునం దనుసంధానము గావించె నంతఁ బ్రహ్మరంధ్రము భేదించుకొని ప్రాణ వాయు వర్చిరాదిమార్గంబున నూర్ధ్వంబుగా నిర్గమించె నతనిభార్య యగునర్చియుఁ దనమనోవల్లభుండు బుద్ధీంద్రియప్రాణాదులం బరిత్య జించుట గాంచి యించుక విలపించియు విజ్ఞానంబునం జేసి పతికిం దిలోదకంబు లొసంగి యప్పర్వతంబునఁ బతికిం జితిం గల్పించి దానికిం బ్రదక్షిణనమస్కారంబు లర్పించుచుఁ దా నందుఁ జొచ్చి ప్రాణంబులం బాసి భర్తతో భస్మావశేషయై వానితో నారాయణ స్థాన మైన వైకుంఠంబు నొంది శాశ్వతానందసౌఖ్యంబు లనుభవించె నని మఱియును. 292

—♦ పృ థు రా జ పు త్ర పౌ త్ర వ ర్గ ము ♦—

సీ. ఈపుణ్యచరితము నేపురుషుం డైనఁ
జదివిన వినినను సద్గతు లగు
బ్రాహ్మణుం డిది విని బ్రహ్మవర్చస్కుఁ డౌ
క్షత్రియుండు పఠించి క్ష్మాపతి యగు
వైశ్యుండు పఠియించి విశ్వోత్తరుం డగు
శూద్రుండు విని సర్వశుభము లొందు
స్త్రీపురుషులు దీని త్రిగుణము గా విని
పసువు సంతానము వడయఁ గలరు

ఆ. చదువు రానివాఁడు చదివిన విద్వాంసుఁ
డగు నలంతి యైన నధికుఁ డగును
రోగి వినె నేనిరోగము వీఁగిపోవు
నసుల విని రాజు విజయంబు నందఁ గలఁడు. 293

తే. అవల బృథురాజునాత్మజు లందుఁ బెద్ద
యైనవిజితాశ్వుఁ డేలిక యగుచుఁ దనరి

తనదుసోదరులందుఁ దత్పరతఁ దగిలి
రాజ్యమేలుచు నెంతయు రమణ మెఱసె. 294

సీ. అతఁడు తమ్ములయందు ననుకంప గలఁడయి
పతులుగా దిక్కుల నతుకఁ జేసె
హర్యక్షునకును బ్రాగాశయు ధూమ్రకే
శునకు దక్షిణము వృకునకుఁ బశ్చి
మము ద్రవిణున కుత్తరము పంచి యిచ్చెను
నందఱకుం దాన యధిపుఁ డగుచు
నాతనికి శిఖండి యనుభార్య యందు మూ
వురు కుమారులుపుట్టి రోరిమ గలిగి

తే. వారు తొలితాగ్నులు వసిష్ఠపారికాంక్షి
శాపమున మర్త్యులై పుట్టి రాపగిదిని
గార్హపత్య మాహవనీయ మర్హదక్షి
ణాగ్ని యనునామధేయము లపుడు పొంది. 295

వ. అంతర్ధానుం డనునపరనామంబు గలయావిజితాశ్వునకు నభస్వతి యనునపరభార్యయందు హవిర్ధానుం డనుమఱియొకపుత్త్రుండు పుట్టె నాహవిర్ధానుండు దండనీతి కరగ్రహణము లోనగురాజవృత్తి నవలంబింప రోసి దీర్ఘసత్రయాగము నాచరింపం దొడంగి పరమాత్మ నారాధించుచు దీర్ఘసమాధిచే భగవల్లోకము నధివసించె హవిర్ధానునకు హవిర్ధాని యనుభార్యయందు బర్హిషదుఁడు లోనగునార్వురు పుత్త్రులు పుట్టి రందు బర్హిషదుఁడు ప్రజాపాలననిపుణుండై క్రియాకలాపమునందును యోగమునందు నిష్ఠాగరిష్ఠుం డయ్యె. మఱియు నతండు భూభాగ మంతయు యజ్ఞవాట మగునట్లు మొదటిదాని ననుసరించి రెండవది గాశాలలువైచి యాగము లొనర్చుచుఁ బ్రాచీనాగ్రంబు లగుబర్హిస్సులం గప్పెం గావునఁ బ్రాచీనబర్హి యను నామంబు వడసె నాతండు సముద్రపుత్త్రికయగుశతద్రుతి వరించి

పెండ్లియాడి సమానవ్రతాచారపరాయణయగు నామెవలనఁ బ్రచేతసు
లనుపదుగురు పుత్త్రులం గాంచె. 296

తే. తండ్రి ప్రేరేప వారలు తగఁ దపింపఁ
జనుచు వని శంకరోపదేశమును బొంది
యాత్మతత్త్వము ధ్యానించునట్టి రగుచుఁ
బదియు వేలేండ్లు హరిఁ గొల్చి రుదితభక్తి. 297

వ. అనిన విదురుండు మునీంద్రా! ప్రచేతసులకు శంకరునకు సమావేశం
బెట్లయ్యె వారితపఃప్రకారం బెట్టిది చెప్పు మనిన మైత్రేయుం డతని
కిట్లనియె నట్లు ప్రచేతసులు ప్రజాసృష్టి గావింపఁ దండ్రి యగు ప్రా
చీనబర్హి ప్రేరణంబున తపంబు గావింప నెంచి సముద్రసమీపంబున
నొకసరోవరంబు గని రదియును. 298

— ప్రచేతసుల తపఃప్రకారము —

క. జ్ఞానులమానసముం బలె
నానందాకరము నిర్మలాపఃపూరం
బెనలువొందుఁ బరమహం
సానందదము వగుచు సరసి యతివిస్తృతమై. 299

చ. కలువలు తామరల్ జనుల కన్నులపండువు సేయుచుండ హం
సలును బకంబులున్ గమలషండములందు మనోహరంబుగాఁ
బలుకుచునుండఁ దుమ్మెదలు బారులు దీరిచి పాట పాడుచోఁ
జలువల నీనుతెమ్మెఱలు సల్పు లతాళుల నాట్య మాడఁగన్. 300

వ. అట్లొప్పునప్పద్మాకరంబునం బ్రచేతసులు మృదంగాదిధ్వనులతోఁ గూడిన
దేవగానంబు విని విస్మయంబు నొందుచుండ నాసందున సరోవరంబు
నుండి దేవగంధర్వసేవితుండై పార్వతీసహితుం డగు పరమేశ్వరుండు
వెడలిరాఁ గని సాష్టాంగనమస్కారంబు గావించిన భక్తవత్సలుం డగు
వామదేవుండు వారిం గాంచి యి ట్లనియె. 301

తే. మీరు ప్రాచీనబర్హికుమారవరులు
మీతలఁపు నాకవగతము మిమ్మునుగ్రి

హింప మీ కిట్లు దర్శన మిచ్చినాఁడ
భక్తులరు మీరు మీపయి వత్సలతయ. 302

చ. పురుషుఁడు నూఱుజన్మములు పుణ్యతపం బొనరించి పిమ్మటన్
వరుసను నాపదంబు మఱి బ్రహ్మపదంబును బొందు నయ్యనం
తరమున నేమునుం బలెను దత్పురుషుండును విష్ణులోకముం
గర మరుదారఁ బొందు నని గట్టిగ మీరలు విశ్వసింపుఁడీ. 303

మ. భగవంతుం డగువాసుదేవుఁడు దయన్ భావించు నన్నుం బలెన్
భగవద్భక్తులు మీరు మీకును జగన్నాథుండు ప్రత్యక్షమై
తగ లాలించుచు మీమనోరథములన్ దథ్యంబుగా దీర్చి మీ
రు గడంకం దపియింపుఁ డే వినుతుఁ గారుణ్యంబునం దత్త్వమున్. 304

వ. అనికరుణాయత్తచిత్తుండై పలికి పరమేశ్వరుండు మఱియు నో రాజపు
త్రులారా! మీరు నారాయణుండే ప్రాప్యుం డనియుఁ బ్రాపకుం
డనియు భావించి భక్తిభరితాంతరంగులై యుండుం డని మునుమున్న
సర్వాంతర్యామి యగుపరమాత్ముని ట్లని ప్రార్థించె. 305

—♦ పరమేశ్వరుఁడు పరబ్రహ్మం బ్రస్తుతించుట ♦—

సీ. జ్ఞానులరక్షింపఁ గానై ననీదును
 త్కర్షము నాపయిఁ దనరుఁ గాక
సిద్ధరూపుఁడవు నీచేత సంపాదిత
 సౌఖ్యము నాకును జగములకును
గరుణించుచుండెడు పరమాత్మ వగునీకు
 వందన మొనరింతు వాసుదేవ
జగదాత్మకం బగు జలజము నీనాభి
 యం దుండె విధిఁ గనునట్టి దగుచు

తే. భూతసూక్ష్మేంద్రియుఁడవీవు భువనములకు
నధికరణ మీవు లేవు నీకాఱునూర్ము
లందునన్ నిర్వికారుఁడ వయి చరింతు
నీకు వందన మొనరింతు నీరజాక్ష 306

మ. సకలంబుఁ బ్రవిలీనముఁ సలుపుచుఁ సంకర్షణాఖ్యుండవై
యొకమం దగ్నినివెల్గఁ జేసి సకలంబుఁ దాహముం జేయుచుఁ
నుక మొప్పఁ శయునింతు చిత్కలితుఁడై సూక్ష్మాతిసూక్ష్ముండవై
సకలేశా! నిను సంస్మరించెద నెదఁ సాక్షాత్కృతిం జేయవే. 307

మత్త. వేదముల్ సృజియించి నాఁడవు వేదరూపుఁడ వీవు నీ
వాదిమూర్తివి మేము నీదగునంశముల్ గొని యుంటి మీ
మాదిరిఁ భవదీయ మాజ్ఞకు మాఱుపల్కనివారమై
నీదునైశ్వర మైనరూపము నెమ్మదిం దలపోయుచుఁ. 308

సీ. ఈ వనిరుద్ధుఁడ వీవు పరమహంస
వపహతపాప్ముఁడ వాదిమూర్తి
వీవు పూర్ణుండవు నీవు స్వర్గమునకు
మోక్షమునకుఁ గర్త వక్షయుండ
వీవు యోగీశ్వరహృద్ధ్యానుఁడవు నీవు
యోగస్వరూపుఁడ వాఢ్యుఁ డవును
నీవు వేదములకు నేతవు త్రాతవు
నీకు నమస్కృతి లోకనాథ

తే. సకలసత్వస్వరూపుఁడ వకలుషుఁడవు
నీవు త్రైలోక్యపాలకుఁ డీవ సర్వ
భాగముల నిండి యుండినవాఁడ విట్టి
నీకు వందన మొనరింతు నీరజాక్ష. 309

ద్విపద. ఫల మపేక్షింపక భక్తిమై క్రియలు
సలిపెడువారికి ఫలరూపుఁడ వయి
యుందువు నీవు ధర్మోత్కరుల్ మాని
బృందారకులపక్ష మే పట్టి నిలుతు
వీవు సర్వజ్ఞుఁడ వీవు ప్రవృత్తివి
నీవు నివృత్తివై నెగడుచునుందు

కపిలావతారముఁ గైకొని సాంఖ్య
సుపథంబు జగతికిఁ జూపి సాంఖ్యేశ్వ
రుఁ డని పేరందినప్రోడవు వర్ష
దుఁడ వయి రవి వయి తోఁపంగ వత్తు
నీకు నమస్కార మోనీరజాక్ష
కైకొని మ మ్మ్రోలఁగా నుండు మనఘ. 310

దండక. ఓసర్వలోకేశ్వరా యీశ్వరా! నీవు సూక్ష్మాతిసూక్ష్ముండవై యుండుట న్నీదు రూపంబు దుర్గ్రాహ్యమై భక్తలోకప్రియంబై మహాసుందరంబై తటిత్వత్ప్రకాశంబునై యుండు నీనాల్గుచేతుల్ గదాచక్రశంఖాదులం దాల్చి లోకాళిఁ గావంగఁ బ్రోవంగ నై యొప్పు నీనేత్రముల్ తమ్మిలో నుండు రేకుల్ బలెన్ సుప్రకాశంబులై యుండు నీమోము రంగారుబంగారు కర్ణోత్తమాలంక్రియాకల్పితంబై కడుం బొల్చు బంగారునీరారు మేల్ గేరుదువ్వల్వ పై వల్లెవాటై కడున్ నీటు గుల్కన్ జగన్నాథ! వక్షస్థలం బందు శ్రీవత్సమున్ గౌస్తుభం బెంతయే వింతమేల్వెంచఁగాఁ జేయు నో దేవదేవా! మహాదేవ! నీ యిట్టిరూపంబు భక్తాళిపాపంబులన్ బాపఁగాఁ జాలి యుండున్ ప్రభూ! మేము నీదర్శనంబు న్మదిం గోరి యున్నార మీరీతి మ మ్మ్రోలఁగా రావె దేవా నమ స్తే నమ స్తే నమః. 311

వ. మఱియు నో దేవా! నీరూపధ్యాన మాచరించువారికి మోక్షసాధన మగుభక్తి ప్రభవించు దానం జేసి నీప్రసాదలబ్ధి సుకరంబు నీవు మానవదుర్లభుండ వైనను భక్తసులభుండవు నీవు కైవల్యముకంటెం గాంక్షణీయుఁడవు భక్తుఁ డయినవాఁడు నీపాదమూల మాశ్రయించి స్వర్గాదిసుఖముం దుచ్ఛతరంబుగా నెంచుచు మోక్షము నాశింపఁ డో మహనీయా! భక్తియోగానుగృహీతమై సత్వగుణప్రధాన మగు చిత్తము గలిగినసత్పురుషుఁడు శబ్దాదివిషయములందు సక్తుండు గాక నిన్నుం దెలిసికొనం జాలుచున్నాఁడు నీమాయసమస్తజీవులను దన

నశమునం బెట్టుకొని సంసారసాగరంబునం బడ నెట్టుచున్నది. ఆమాయ చేతనే నీవు సృష్టిస్థితిలయము లొనర్చువాఁడ వైనను నిర్వికారుండ వై స్వతంత్రుండ వై యున్నాఁడవు మహాత్ములు శ్రద్ధాసముపేతులై వర్ణాశ్రమధర్మములచే నీస్వరూపము నొంద నెంచి దివ్యమంగళవిగ్ర హుఁడ వగు ని న్నారాధించుచున్నారు నీమాయవలన సత్వరజస్తమో గుణంబులు పుట్టినవి రజోగుణమున మహత్త్వము దానివలన నహం కారము క్రమముగా నాకాశాదిభూతములు కలిగినవి. వానివలన నండోత్పత్తియు దానివలన బ్రహ్మాది దేవతలు వారివలన మరీచ్యాదులు వారివలన మానవులునుందిర్యగాదులునుం బుట్టినవి. ఈచతుర్విధజంతు జాలంబునందు నీవంతర్యామియుండవై యుందువు. దురాలోచనలచే మత్తులై విషయసక్తులై పేరాసం బ్రవర్తించువారలను నీవు సర్పం బెలుకలను బోలె మ్రింగి వేయుదువు. నిన్ను బ్రహ్మాదులును దెలియఁ జాలకుండి రట్టినీవు మ మ్మనుగ్రహింపఁ బ్రార్థించుచుంటి మని శివుండు ప్రస్తుతించి ప్రచేతసులం జూచి మీ రీభగవత్స్తుతిని జపించుచుఁ దపిం పుఁడు దీనివలన మీకు భద్రం బగు నీశ్వరుండు మి మ్మనుగ్రహించు నీస్తోత్రము తొల్లి ప్రజాసృష్టి చేయ నెంచినచతుర్ముఖుండు జపించి కృత కృత్యుం డయ్యె దీనిఁ బ్రతిదినంబును బారాయణము చేసినవారికి సర్వార్థసిద్ధులుం గలుగు నని శివుం డానతిచ్చి వారిచేఁ బూజితుండై వారు చూచుచుండ నంతర్ధానంబు నొందె నంతఁ బ్రచేతసులు శివుం డుపదేశించినస్తోత్రముం బదివేలసంవత్సరంబులు జలంబులందుండి జపించి రక్కడఁ బ్రాచీనబర్హి యాగాదికర్మములం దాసక్తి గలిగి తదేకచిత్తంబున నుండుటం దెలిసి నారదుండు వాని ననుగ్రహింప నెంచి కరుణాళుండై యతనికడకు వచ్చి యి ట్లనియె. 312

—♦ ప్రాచీనబర్హికి నారదుఁడు పురంజనోపాఖ్యానము చెప్పుట ♦—

చ. నిరతము యజ్ఞకర్మముల నీదగుకాలము వెళ్ళఁ బుచ్చుచుం
విరతిఁ యొకింత లేక దురపిల్లుచు నుంటివి దీన నేఫలం

బహుదుగఁ బొంద నెంచితి వి దంతయు వింతగఁ దోఁచు నాకు నీ
చరితము సర్వముం దెలుప సమ్మతి సేయుము నెమ్మనమ్మునన్. 313

ఆ. అనుడు నాతఁ డనియె నార్య కర్మకలాప
మునను దగులువడినమనముఁ గలిగి
యున్నవాఁడఁ గాన నెన్నఁడు నే విచా
రమును జేసి యెఱుఁగ నమలచరిత. 314

సీ. ఎట్టు చేసిన నాకు నీకర్మబంధము
తెగునో నిర్మలత నాకగునో చెప్పి
దారపుత్త్రాదిబంధమునఁ గ్గెడునహం
కారాదు లడుగంటు దారి నాకు
నుపదేశ మొనరింపు కృపఁ జేసి నావుడు
నారదుం డను నీ వొనర్చినట్టి
జన్నములం జంపఁ జచ్చినపశువులు
నీవు వచ్చినఁ గ్రుమ్మ నిన్నుఁ జీల్చ

తే. వాఁడికొమ్ములు చూపు చవ్వల మెలంగు
చున్న వవి స్వర్గమం దుండునన్న మెచ్చఁ
గాని యిటు సేయునే యన దీనిఁ దెలుపు
నొక్క యితిహాస మగుఁ జెప్పనుంటి వినుము. 315

ఉ. భూతలమందు మున్ గలఁడు భూమివిభుండు పురంజనాహ్వయుం
డాతఁడు వేల్ పురంబులు ప్రియంబునఁ జేసినదాన వాని కా
ఖ్యాతి లభించె నాతనికి నాప్తుఁడు మిత్త్రుఁ డొకానొకండ వి
జ్ఞాతుఁడు వేరికిం దెలియఁ జాలనిచేష్టలు గల్గినట్టిఁడై. 316

—◆ పురంజనుఁ డుద్యానంబున నొకస్త్రీని గాంచుట ◆—

సీ. ఆపురంజనుఁ డుర్వియందు దా నివసింపఁ
దగినపురం బేది యగునో యనుచు
నందందుఁ గొన్నినాళ్ళు వసించుచు నెందుఁ
దన కనుకూలత గనఁగ రామి

భోగ్యపదార్థముల్ బొందఁ గోరుచుఁ దగ
నన్వేషణ మొనర్చి నన్నికడల
నతఁడు హిమాచలప్రాంతదక్షిణసాను
వున నవద్వారముల్ పొసరుచుండ

తే. దర్శనీయము సురుచిరోద్యానసంవృ
తము మణిగణకలితవప్రము హిరణ్మ
యము మహాసౌధసముదంచితము పురంబుఁ
జూచె భోగవతిం బోలు సొంపుదాని. 317

వ. మఱియు నప్పురంబు విశాలచతుష్పథంబును బహువిధసభామందిర
సుందరాయమానంబును రాజమార్గవిరాజితంబును క్రీడాస్థానసము
పేతంబును విశ్రమస్థానవిరాజితంబును రత్నకుట్టిమచత్వరసమంచితంబు
నై తనరారుచుండు. 318

ఉ. ఆపురిబాహ్యదేశమునయందు విహారవనం బొకం డగుఁ
శ్రీపరిపూర్ణమై సకలశేవధులుం గలదై పికానులా
పాపరితోషదం బగుచు నాత్రిదివంబున నుండునందనం
బేపరిపాటి దాని కని యెల్లరు మెచ్చెద రెల్లవేళలఁ 319

చ. చిలుకలు వల్కఁ గోయిలలు చీదర వోవఁగఁ గూయుఁ దుమ్మెదల్
కలరవ మేర్పడఁ శ్రుతిసుఖంబుగ గానము చేయు హంసముల్
గొలకులఁ దమ్మిగద్దియలఁ గోపులు సూపుచు నాట్యమాడు నా
మలయనగాగతానిలకుమారుఁడు రాజయి సంచరింపఁగఁ. 320

సీ. ఆవనంబునయందు నటు నిటుం దిరుగుచు
నభిముఖంబుగ వచ్చె నతివ యొకత
పదుగురు భటు లామెఁ బరివృతులై యుండి
రొక్కొక్కరికి నూర్గు రువిద లుండ్రు
పంచశీర్షమ్ములఁ బరఁగుసర్పశ్రేష్ఠుఁ
డాకన్నెఁ గాపాడునట్టి డగును

గోమరూపిణి యయి కాంతుని వెదకుచు
నవప్రౌఢయై యామె యటకు వచ్చె

తే. అద్దములఁ బోలు చెక్కిళ్ళు నాకసంబుఁ
బోలు లేఁగౌను సంపగిమొగ్గఁ బోలు
ముక్కు నెలఁబోలు మోము శ్రీఁ బోలుచెవులు
గలువలం బోలు కన్నులు గలిగి యుండె. 321

ఉ. గాజులు కమ్మలుం గదలి గల్లని మ్రోయ నితంబబింబమం
దాజలతారుకుచ్చెళులయంచులపై మొలనూలికింకిణుల్
తేజు వెలార్చుచున్ మొఱయఁ దీఱగుగాళుల గజ్జె లందియల్
బాజులు గల్లుగల్లు మన భాసిలె మేలిముసుంగు రంగుతోన్. 322

వ. ఇట్లు మత్తమాతంగంబుడంబున మందగమనం బవధరించి మందహాస
సుందరవదనారవిందయై సిగ్గునం బోలె మో మించుకవంచియుఁ గుం
చియు నెత్తియు నొత్తియుం జూడనట్లు చూచియుఁ గన్నుఁబొమలు
విండ్లవలె వ్రేలఁ గటాక్షవీక్షాంబకంబుల నిగిడించుచున్ననీలవేణిం
గాంచి దరహసితవదనారవిందుండై రాజపురందరుం డిట్లనియె. 323

—♦ పురంజనుఁడు స్త్రీనిం బెండ్లియాడుట ♦—

మ. వెలఁదీ యెవ్వరిదాన వెవ్వతెవు నీపే రేమి యెందుండి యి
ప్పొలఁతుల్ గొల్వఁగ వచ్చితీ వలరునిప్పాదోటకు న్మేటివై
వెలతేనీం గికురించి వచ్చురతివో వాఁ డంప నింపున్న వా
రల నేచం జనుదెంచుపూములికివో రారమ్ము వాకి మ్మొగిన్. 324

తే. నిన్ననుసరించి వచ్చుచు నున్నవీర
భటులు వీ రెవ్వరో వారిపజ్జ నుండు
వనిత లిందఱు నెవ్వరో వారిజాక్షి
ముందుఁ జనుసర్పరా జేఁడొ విందుఁ జెపుమ. 325

మ. పతి విశ్వేశ్వరు గోరుచున్నసతి వో బ్రహ్మాన్విలోకించుభా
రతివో వెన్నునితే న్నెఱుంగురమవో రమ్యాంగి వా రైనచోఁ

క్షితిపైఁ గా లిడ రీవు వెన్నుఁ డన నై చెన్నొందునాతోఁ దగన్
వితతశ్రీవిభవాభిరామ మగునీవీటన్ రతిం దేలుమా. 326

వ. నీకటాక్షవీక్షణములచేఁ గలంగినచిత్తవృత్తిం గలిగి మదనబాణానల సంతప్యమానమానసుండ నై విరాళిం బడున న్ననుగ్రహించి నీమధురా ధరసుధారసంబున విగతజ్వరుం గావింపు మని ప్రార్థించుపురంజయుం గాంచి మించుబోఁడి మోడి సేయుచు ని ట్లనియె. 327

సీ. నిను నన్ను సృజియించి మనకుఁ బేరు కులంబు
నొసఁగినపురుషుఁ డేఁడో యెఱుంగ
నిం దుండునిన్ను నే నీపురి నేలువా
నిగ నెంతుఁ గాని యీనగర మేరు
కట్టిరో తెలియదు గాని యీపురుషులు
స్త్రీలును భృత్యులు స్నేహితులును
నేను నిద్రించిన నీనిడుపఁడు నన్నుఁ
బాలించు మేల్కొన్న వాఁడ యగుచు

తే. భాగ్యమున నీవు పురి దీనిఁ బడయు నైతి
నీకు శుభ మగు నేను నాస్నేహితులును
గామ్యసుఖములఁ గూర్తుము రాజ! నీకు
నోపి పొందుము నూ ఱేడు లీపురమున. 328

వ. రాజేంద్రా! నేను నిన్ను రమింపఁ జేయక రానున్నస్వర్గాదు లెఱుంగక మృత్యువు నకు జంకుచుండు మఱొక్కని రమింపఁ జేయఁ బోవ ననుట నిక్కం బీప్రవృత్తిమార్గంబున ధర్మార్థకామములును బుత్రపౌత్రసుఖం బును గీర్తియుఁ బుణ్యలోకంబులుం గలుగు గృహస్థాశ్రమంబు సామాన్య మనం జెల్లదు దాన దేవతలు పితరులు మునులు మాన వులు భూతములు లోనగువారికి శరణం బగుచుండు నిట్టినిరుపమాన గుణాగరిష్ఠుండ వగునిన్ను వంటిభర్తను వరింప కుండునట్టినాతి యెన్నఁ బడుండు నుండిన నది గోతి యనంజను నని వారు పరస్పరానురాగం

బులం దెలుపుకొనుచు నాపురంబునం బ్రవేశించి నూఱువత్సరంబులఁ
చెల్లుదాక సర్వసుఖంబు లనుభవించిరి. 329

తే. అప్పురంజనుఁ డాహరిణాక్షిఁగూడి
యందు నందును గ్రీడించె నంత నొక్క
గ్రీష్మమునయందుఁ దాపముఁ గ్రిందుపఱచు
బుద్ధి నొక్కసర స్తీరమ్మున వసింప 330

వ. పురంజనుం డున్నయప్పురంబున కేడుద్వారంబు లుపరిభాగంబునం దును రెండుద్వారంబులు క్రిందిభాగమునందును బొందుపడియున్నవి క్రిందిరెండుద్వారంబులును బురాధినాథుండు దేశంబులకుం బోవుట కేర్పడినవి మీఁదిద్వారంబులలో నైదు తూర్పుదిక్కునందు నొకటి దక్కినంబునను మఱొక్కటి యుత్తరంబున నున్నయవి క్రిందుగా నున్నద్వారములు పడమటగా నున్నవి తూర్పుననుండుద్వారములు రెండును ఖద్యోతము నావిర్ముఖి యనంబడువానినుండి ద్యుమత్సఖుఁడనురాజు విభ్రాజితదేశంబునకుం జనుచుండుఁ దూర్పున మఱియొకచో నున్న రెండుద్వారములు నళిని నాళిని యనంబడు వానినుండి రా జవధూత యనుమిత్రునితో సౌరభదేశముఁ జూడం జనుఁ దూర్పున నున్నమైదవద్వారము ముఖ్య మనుపేరం బరగుఁ బురంజనుఁడు రసజ్ఞుఁ డనుమిత్రునితో నందుండి బహూదకదేశంబునకును రసజ్ఞవిపణుఁ డనుమఱియొకమిత్రునిం గూడి పణ మనుదేశంబునకుం జనుచుండు దక్షిణంబున నున్నద్వారము పురుహువు నాఁబడుదాని నుండి పురంజనుఁడు శ్రుతధరుఁ డనుసఖునితో దక్షిణపాంచాలంబున కును నుత్తరమున నున్న దేవహూ వనుద్వారంబునుండి యుత్తరపాంచాలంబునకును బడమట నున్నయాసురి యనుద్వారంబునుండి దుర్మదుఁడనుమిత్రునితో గ్రామకదేశంబునకుఁ బడమట నున్ననిరృతి యను ద్వారంబునుండి లుబ్ధకుఁ డనుమిత్రునితో వైశస మనుదేశంబునకుం బోవుచుండును మఱియు నాపురద్వారములలో నంధము లనురెండు

ద్వారంబులు గలవాద్వారంబులనుండియే పురంజనుండు ప్రచరించు చుండును. 331

—♦ పురంజనుఁడు స్త్రీలోలుఁడై చెడుట ♦—

సీ. ఆపురంజననృపుఁ డంతఃపురము విషూ
చీనుఁ డఁగాసఖునితోఁ జేరి దార
పుత్రాదులందు సంమోహము సంతస
మును బొందుచుండును ముందుఁ గనక
దైవవంచితుఁ డయి తద్దయుఁ గాముము
లం దిచ్ఛ గల డయి యహరహంబు
బుద్ధి యనెడుభార్య బోధించినట్టులు
నిరతంబు మెలఁగును నెఱి దొఱంగి

తే. భార్య నిలిచిన నిలుచును బండు కొన్నఁ
బండుకొను నేడ్వ నేడ్చును బఱవఁ బఱచు
దినినఁ దిను నవ్విన న్నవ్వు దినము దినము
రమణి చెడి నట్టిఁడగుచుఁ బురంజనుండు. 332

వ. పురంజనుండొక్కనాఁడు రథంబెక్కి పంచప్రస్థమనువనంబునకుంజనియె నది శీఘ్రగతిగలది యైదురథ్యములు దానికిం గట్టఁబడును. దానికి రెండుచక్రములు రెండుదండులు దృఢమైనయినుపయిరుసు మూఁడు ధ్వజములు నైదుబంధనసూత్రములు గలవు మఱియు నొక్కగ జ్జువు సారథిరథికులుం గూరుచుండుస్థలములు రెండుయుగబంధస్థానం బులు నైదాయుధంబులు నేడు చర్మావరణలు పంచవిధగమనములు స్వర్ణమయాభరణంబులం గలిగి ప్రకాశించుచుండు నట్టిరథం బెక్కి కవ చంబు దొడిగి యక్షయతూణీరంబులు ధరించి పదునొకండ్రు సేనా నాయకులు సేవింపఁ బంచప్రస్థవనంబునం బ్రవేశించి ధనుర్బాణంబులు ధరించి మృగయావినోదంబునం దగిలి నానావిధమృగంబుల సంహ రించుచు విధినిషేధంబులు లేక తామసవృత్తిం జేసి చంపరానిమృగం

బులం గూడఁ జంపుచు క్షుత్పిపాసాపరిశ్రాంతుండై యిలుసేరి జలకం బాడి భోజనంబు గావించి విగతశ్రముండై కర్పూరచందనాద్యలంకారాలంకృతుండై యంతిపురంబునకుం బోయి తనపట్టమహిషి బుద్ధిం గానక పరిచారికలవలనం దెలిసికొని యొకనేలపై వ్యసనంబునం జేసి పడియున్నదానిం జూచి నిన్ను విడిచి వని కేగిననాతప్పు సైఁపు మని పదంబులం బడి ప్రార్థించి తొడలపైఁ గూరుచుండం బెట్టుకొని లాలించుచుండ బుద్ధి పరిశుద్ధమనస్కురాలై తనకు వశంకరుఁడైన ప్రియునిం గూడిమాడి సంతసింపఁ జేయుచుం దాను సంతసించుచుండెఁ రాజేంద్రుం డామెం బిగ్గఁ గౌఁగిలించుకొని రే యిది పవ లిది యని యెఱుంగక క్రీడాసక్తిఁ దన కిదియే పురుషార్థ మని యట్లు కొన్నినాళ్ళు వేఁగించె నిట్లుండ నతని కింతలో యౌవనమంతయు జెల్లి యేఁబదియేండ్లు దాటినవాఁ డయ్యె నప్పటికాతని కాభార్యయందుఁ బదునొకండువందలపుత్రులును నూటపదిమంది పుత్రికలుం బుట్టి రంత నతండు వంశవర్ధను లగుకొమరులకుఁ గొమారితలకు వివాహంబులు గావించె నాపుత్రులలో నొక్కొక్కనికి నూర్గురు నూర్గురు పుత్రులు పుట్టి రిట్లు పురంజనునివంశ మాపాంచాలదేశంబునఁ బ్రవృద్ధిం గాంచెఁ గొమరులు సంస్మృతిం దిద్దుకొనఁజాలినవారై యున్నను బురంజనుండు మమకారంబుననాసక్తుండై మైమఱచి వర్తించుచుండియు నిపుడు నీవుం బోలె హింసాగర్భము లగు పెక్కుయజ్ఞంబులు గావించె నంతలో నతని కప్రియం బై జర సంప్రాప్తం బయ్యె నప్పుడు. 333

సీ. వత్సరాభిఖ్యమై వఱలుగంధర్వుఁ డ
త్యాశుగమనమున నలరువాఁడు
వానికి దివసాత్ములైనసేవకులు ము
న్నూటయర్వది మంది మేటు లుండ్రు
వారు పరోక్షమం దారసి ప్రజలయా
యుర్దాయ మనియెడునురుధనంబు

నపహరించుచునుండు రావత్సరాఖ్యగం
ధర్వరాజునకు నుద్దండగతికి

తే. రాత్రిరూపులుగంధర్వరమణు లలరు
చుంద్రు వారలు పురముల నొయ్యన హరి
యింత్రు గంధర్వునానుచరు లేగుదెంచి
యతనిపురమును హరియింప నైరి కడిమి. 334

చ. అపుడు ప్రజాగరుం డనెడునాతనిపత్తనరక్షకుం డొకం
డతులితతేజ మేర్పడఁగ నాఁగుచు వత్సరుసైన్య మిర్వదే
డతినిశితాంబకంబుల నహంయువునై యెదిరించి నూర్నమల్
ప్రతి యిసుమంత లేనిగతి పట్టి పెనంగెఁ జలంబు పెంపునన్. 335

సీ. ఒకరుండు పలువుర నొగిఁ దాఁకి పోరాట
మును సల్పి సల్పియుఁ దనదుశక్తి
సామర్థ్యము లవెల్ల సన్నగిల్లుఁడు పుర
జనులతో బాంధవజనులతోడఁ
గూడి యుండినదాని గోపన మొనరింప
దుర్లభ మని చాల తొట్రుపడియె
నిది యప్పురంజనుఁ డెఱుఁగక లోలుఁడై
బహువిధభోగముల్ వడయుచుండెఁ

తే. గాలపుత్రిక జర యనుకన్య కడఁక
మూడుజగములు భర్తకై మొనసి తిరుగు
వేరు నామెను వరియింపఁ జేర రైరి
సొగసు చెడి తాఁ గురూపిణి యగుట జేసి. 336

ఆ. అట్టు లున్న నయ్యయాతిపుత్రుఁడు పూరుఁ
డిచ్చఁ బెండ్లియాడి యేలె నామె
నిచ్చ మెచ్చి వాని కిచ్చెను సామ్రాజ్య
వైభవంబు గలుగు ప్రాభవంబు. 337

మ. ఒకనాఁ డాయమ నన్నుఁ జూచి మదిలో నుత్సాహముం జేసి వే
డుక గావించి వరించి నీవు ననుఁ బెండ్లిం జేసికొ మ్మన్న నే
నకటా నీ కిటుగూడునే యతిని నే నన్నం గడుం గ్రుద్ధయై
ముని నై తేనియు దేశ్రదిమ్మరివయై పొ మ్మంచుఁ దిట్టెన్ గృపన్.

వ. అంత నాజరాకన్య నాయుపదేశంబునం జేసి యాధివ్యాధులకధిపతియైన భయుం డనువానికడకుం జని నీవు సమస్తాధివ్యాధులకుం బ్రభువవు నిన్ను నేఁ బ్రియునిఁ గా వరించుచున్నాను. కోరఁ దగినకోరికం గోరిన నన్నుఁ ద్రోసిపుచ్చక స్వీకరింతు వని నమ్మి వచ్చితిం బ్రతి గ్రహింపు మని కాలకన్యక పలికిన పలుకులు విని భయప్రభుఁడు ప్రాణికోటులకు మృతిం గూర్చువాఁ డయి నవ్వుచు నోసుందరీ నీకు లోకరూపుఁ డైనభర్తను నిశ్చయించితిని నీవు పోయి వేఁడితేని కురూపిణి వైనను నిన్నుఁ గా దన కతండు వరించు నా కాధివ్యాధులను పెక్కురు సైనికులు గలరు వారిం గూడి పోయి లోకమును వశంబు గావించుకొని సుఖంబుండుము నాకు వైష్ణవజ్వరుం డను సోదరుండు కలఁడు వాఁడు నిన్ను లోకభర్తృశోడం గలయఁ గూర్చి నింతియ కాక నీవు నాకు సోదరివి నీశోడను నాసోదరునితో డరే గూడి నేను మహాసేనాసమేతుండనై లోకమున నెరికిం దెలియఁబడకుండ సంచరింతుననిపలుకుచుఁ దనసైనికులును బ్రజ్వారకాలకన్యకలుం దన్ను వెన్నుదన్ని రా లోకసంచారంబు గావించుచు భయనాముండును.

సీ. వస్తుసంపూర్ణమై పన్నగరక్షిత
మగుపురంజనుపుర మట్టి సరభ
సమ్మున నరికట్టి నమ్మోయి కాలక
న్యక బలాత్కృతిగ నన్నగర మవుడు
గ్రమింగె దానం జేసి లొంగినపురిలోనఁ
జొచ్చిరి సైనికుల్ విచ్చలవిడి
యిది నాపురం బని యెంచుపురంజనుఁ
డవుడు లొట్రిలఁ జొచ్చె నార్తిఁబడుచు

తే. భోగలాలసుఁ డాతఁడు మూఁగి రిపులు
సర్వము హరించుచుండగా సాళ్వాడి ప్రీతి
కృతి యొనర్పఁ జాలనియతగుఁ డగుచుఁ
జాల పరిదేవనము చేసెఁ జాలి పడుచు. 340

వ. అప్పు డప్పురంజనుఁడు తనపురంబు శత్రువులచే శిథిలప్రాయ మగు టయు దారపుత్త్రాదులు తనకుఁ బ్రతికూలురై తన్ను రోయుటం జేసియు భృత్యులు పురరక్షణసమర్థులు గాకుంటంజేసియు దాను వృద్ధుఁడై పోవుటంజేసియు మిగుల వగలం బొగలుచు దానికిఁ బ్రతి క్రియ పొనరించుకొనం జాలనివాఁడై కాలకన్యకచే నిస్సారము లైనను భోగము లనుభవింప నెంచుచు దీనుండై పరముం జూచుకొనం జాలక భార్యాదులను లాలించుచు గంధర్వాదులచే విధ్వంసితం బయినపుర మును విడువఁ దలంచె నాసమయంబున. 341

సీ. ప్రజ్వారుఁ డన్నకుఁ బ్రతిలేనిప్రియముఁ గూ
ర్పగఁ బురంజనునిపురంబు గాల్చె
నపుడు పురంజనుఁ డనుఁగుఁజుట్టాలతో
సంతాపమును బొంది సర్వము చెడి
పోవ రోదనమును బొనరింపఁ దొడఁగెను
దనవారి నందఱ దలఁచుకొనుచు
భార్యావియోగము భరియింపఁ జాలక
తచ్చేష్టితంబులఁ దడవు కొనుచు

తే. అపుడు పురినుండి వానిని నవలఁ దోలియ
భయుఁడు తలపోసి త్రాళ్లఁ బశువు నట్లు
కట్టి కొనిపోయె నాతనిఁ జుట్టియుండు
వార లెంతయు సంతాపపడుచు నుండ. 342

—♦ పురంజనుఁడు స్త్రీయైపుట్టుట ♦—

వ. పురంజనుండు వివేకహీనుండై తాను దప్పు చేసినను దనయందుఁ బ్రేమ డించుపరమమిత్త్రుని స్మరించుకొన లేక పోవుచున్నప్పుడు తొల్లి

తాను జంపించినయాగపశువులు శూలంబులం బోనిశృంగములతోడం బొడిచి పొడిచి వేధించె నంత నతం డంధతామిస్రనరకంబునం బడఁద్రోయంబడి పెక్కేండ్లు దుఃఖ మనుభవించి మరణకాలమున స్త్రీసంపర్కముం దలంచుచుం బోయెను గావున నవ్వలిజన్మంబున విదర్భునిగృహంబున స్త్రీ యై పుట్టె నట్టియెడ. 343

తే. తండ్రియింట వర్ధిల్లు విదర్భకన్య
పరమభాగవతునిఁ గాక పరునిఁ బెండ్లి
యాడ నని శపథము చేసె నయ్యవసరమున
మలయపర్వతప్రాంత భూమండలమున. 344

వ. మలయధ్వజుండను రాజు జ్ఞానమునం జేసి యింద్రియజయంబు గావించి పరమభాగవతోత్తముండై యుండి గృహస్థాశ్రమమును స్వీకరించువాఁడై వైదర్భిం బెండ్లియాడి యొక్కకొమరితను నేడ్వురు కొమరులం గాంచె కుమారులు ద్రవిడదేశంబు పాలించువారైరి వారికొక్కొక్కనికిఁ బెక్కురు పుత్రులు పుట్టిరి వారును వారిసంప్రదాయమువారే మన్వంతరకాలమందును దరువాతను ధరిత్రీపాలనంబు గావించిరి మలయధ్వజునికొమరిత నగస్త్యుం డనురాజు పెండ్లియాడి యామెవలన నిధ్మవాహుఁ డనునిద్ధచరిత్రుం గనియె మలయధ్వజుండు తన రాజ్యము తనయులకుం బంచి యిచ్చి విష్ణునారాధింపఁ గులాచలంబునకు వైదర్భిసహితుండై చని చంద్రవస యనునదియొద్దన నాశ్రమము గావించుకొని కందమూలఫలాశనుండై తపం బాచరించుచు శీతోష్ణంబులు వాతవర్షంబులు క్షుత్పిపాసలు ప్రియాప్రియములు సుఖదుఃఖంబులు లోనగుద్వంద్వంబుల సహించుచు యమనియమాదులచే నింద్రియాదుల జయించి స్థంభంబు వోలె నిశ్చలుండై నిలిచి నూఱు వర్షంబులు తపం బాచరించి జీవాత్మయందుఁ బరబ్రహ్మ సాక్షాత్కారము గావించుకొని పరమపదంబు నొందె వైదర్భియు నిర్భరజ్ఞానము గలదగుటం జేసి యట నొకచితిం బేర్చి దాని పైఁ బతికళేబరంబు వెట్టి

వహ్నిం దరికొల్పి చితికిం బ్రదక్షిణించి తా నందుఁ బడనున్న సమ
యంబున సనాతనుం డైనయీశ్వరుండు బ్రాహ్మణవేషంబున నట
వచ్చి యామె నుపలాలించుచు ని ట్లనియె. 345

—♦ పురంజనుని పూర్వజన్మకథనము ♦—

సీ. వేగిరింపకుము నీ వేగతిదానవు
వేనిసంబంధించి వెలయుచుంటి
వితఁ డేఁడు సంబంధ మేమి మీయిరువుర
కేటికి దుఃఖింతు విప్పు డిట్లు
నీస్వస్వరూపము నీవు మఱచితివి
సృష్ట్యాదియం దగుస్నేహితు నెటు
తెలియంగఁ జాలుదు తెలుపఁ బడితి వీవు
చెప్పుచు నుంటి వోయప్ప వినుమ

తే. నీదుచెలికాని నను విడి నీచము లగు
భోగములు పొందఁ గోరుచు మున్ను నన్నుఁ
బాసితివి నీదుజ్ఞానము మాసిపోయెఁ
దెలిపెదను నిశ్చయార్థము నిలిచి వినుము. 346

తే. తొల్లి నీవును నేనును దోడుల మయి
మానససరోవరంబున మమత మీఱ
రాజహంసలమై వత్సరములు పెక్కు
గడపి నారము మఱచితి గాదె దాని. 347

వ. నీ వొకనాఁడు నన్ను విడిచి గ్రామ్యసుఖంబులం దగిలి యీభూమం
డలంబున కరుదెంచితివి నీకుం దగిననివాసస్థలం బేదియు నచ్చమిం జేసి
యచ్చటచ్చట వెదకుచు నొక్కచో స్త్రీవినిర్మిత మైనదొకండొక్క
పురంబుం జూచితి వది తొమ్మిదిద్వారంబులు గలిగి చుట్టు నైదుద్యాన
వనంబులతో నొప్పుచుండును దాని కొకపాలకుండు గలఁడు మూఁడు
ప్రాకారము లైదువిపణులు నైదుగురు మంత్రులు నుండిరి దాని కా

స్త్రీ యధికారిణిమై యుండె నాయుపవనము లైదు నై దింద్రియములు నవద్వారంబులు జనులరాకపోకల కర్థమ్ములై యుండె నాప్రాకారము లగ్నిమయ జలమయ పృథ్వీమయమ్ములై యున్నవి పై నాలు స్థలంబుల నింద్రియార్థములు లభించుచుండు విషయులు క్రియాశక్తిం గూడియుండు నీ వటఁ జేరి బుద్ధియనుదాని కధీనుండవై నిన్నును నన్నును మఱచితివి దానిసంబంధమువనే పాపీయ మైనయీస్త్రీ జన్మము నీకు సంప్రాప్త మైనది కావున నీవు విదర్భరాజపుత్రికవు గావు నీ కీమలయధ్వజుండు ప్రియుండు గాడు బుద్ధి యను నామాంతరము గలపురంజనికి భర్తవును గావు నీవు మున్ను పురుషుఁ డగుటకు నిపుడు స్త్రీ వగుటకు భగవన్మాయ కారణంబ మనము హంసలమై యుండునాఁటిస్వరూపస్వభావంబు లెఱింగించెద నాలకింపుము. 348

సీ. మన మిర్వురమును దెల్లనిమేనులం గల్గి
దేహమాత్మయుఁ బోలెఁ దిరుగుచుందు
మీ వన్యజనుఁడవు కావు నే నట్టులే
నీ కన్యుఁడను గాను నిర్మలాత్మ
మనవిభేదము విజ్ఞులును జెప్పఁ జాలరు
కన్నద్దములయందుఁ గాంచునట్లు
వృద్ధిహాసములు వేర్వేఱను బోల్పేడు
భావింపఁ బడియెడిభంగి నూవె

తే. మన మిరువురము నొకటిమైనను దలంప
స్థూలసూక్ష్మదేహంబులఁ జొచ్చి యుండు
కతమున నుపాధిభేదములు గలుగ నిట్లు
వేఱుగా నుండుభంగిని నారయ నగు. 349

వ. అని యిట్లు మిత్రుండగుహంసస్వరూపుండు బోధించినఁ బురంజనుండు బూర్వజ్ఞానసంపన్నుండై మిత్రునిం గూడి చనియె నని చెప్పి నారదుం డో ప్రాచీనబర్హీ! యీయుపాఖ్యాన మధ్యాత్మబోధకం

బాగునట్టిది దీన నీకుఁ దత్త్వము కరతలామలకం బగు ననిన విని
ప్రాచీనబర్హి మిక్కిలి సంతసించి మఱియు ని ట్లనియె. 350

తే. ఒకయుపాఖ్యానమునఁ దత్త్వ ముచితరీతిఁ
దెలియఁ జెప్పితి కాని యో దేవమౌని
దేహమే యాత్మ యనుకొను తెలివి లేని
మాకుఁ దత్త్వార్థము లెట్లు మదికి వచ్చు. 351

క. కేవలము జ్ఞాను లగువా
రే వివరము గాఁగ మీర లెఱిఁగించిన యా
భావము తెలియం జాలుదు
రేవం విధ మెల్ల మాకు నెఱిఁగెడి రీతిన్. 352

సుముఖి. తేట తెల్లంబుగాఁ దెలియంగ మాకున్
మేటి యాతత్త్వమున్ విసిమింతు రైనన్
బాటి గొంచు న్వినన్ బరమార్థభక్తిన్
మేటులౌ నట్లుగా మెలఁగింపు మార్యా. 353

—♦ పురంజనకథా తత్త్వ నిర్వచనము ♦—

వ. అనిన నారదుండు వెండియు నోయిరాజా! నీకుఁ బురంజనోపాఖ్యానముం జెప్పితిఁ బురంజనుం డనఁ బురుషుం డనంబడు జీవాత్మ పురమన దేహ మందు మనముతో సంబంధము గలుగుటం బురంజనుం డయ్యె. జగత్స్రష్ట్రాదులచే సత్త్వాదులచే నొరులకుం దెలియరాక యవిజ్ఞాతుఁ డని నామంబు వడసి తనమిత్రుండు పరమేశ్వరుండు పురంజనునిభార్య ప్రమద యనంటి నది బుద్ధి బుద్ధి యహంకారమమకారము లనుబుట్టించి మదము పుట్టించును గానఁ బ్రమద యయ్యె. దానిం గూడి జీవుఁడు చక్షురాదీంద్రియములచే శబ్దాదు లనుభవించు బడునొకండు స్నేహితులు మనస్సహితేంద్రియదశకంబు వా రొక్కొక్కడు నార్వురు స్త్రీలఁ గలిగి యుండి రన నింద్రియవృత్తు లని తెలియుంబడు పురము పాలించురాజు ప్రాణము. ప్రాణ మైదువృత్తులు

గలది గావున నైదుతలలపా మని చెప్పంబడెఁ బ్రమదయుఁ బదు నొకండు భటులుం గలసి వచ్చుచుండి రన బుద్ధితోఁ గూడి వచ్చు నింద్రియంబులు మనస్సు నని తెలియం దగుఁ బురంజనుఁడు పాంచాలమును బాలించు నన జీవుఁడు పంచేంద్రియవిషయపదార్థము లనుభవించు ననియుఁ దొమ్మిదిద్వారము లన నేత్రములు నాసికారంధ్రములు కర్ణబిలములు నోరు శిశ్నము గుదము ననుతొమ్మిదిరంధ్రములు. చక్షురాదీంద్రియరంధ్రంబులం దున్న యింద్రియంబులం గూడి యాత్మ మీఁదికి వెడలుచుండు నందు నేత్రరంధ్రములు నాసికారంధ్రములు నోరు ననునీయైదును దేహమునకు ముం దుండును. దక్షిణద్వారమనఁ గుడికర్ణ ముత్తరద్వార మెడమకర్ణము క్రిందరెండుద్వారము లన గుదశిశ్నము లిట్లు నిర్మితము లైనఖద్యోతావిర్ముఖద్వారము లన నేత్రములు నళినీనాళీను లన నాసికారంధ్రములు పురోభాగమం దున్న యైదవరంధ్రము నోరు మఱియు నాపురంబునకుఁ బితృహూవు దేవహూ వనఁగా దక్షిణోత్తరకర్ణంబులు చండవేగుఁడగుగంధర్వపతి యన జీవున కాయుష్కాలముం గొలుచునట్టిసంవత్సరమది చక్రమువలె వడివడిం దిరుగుం గావునఁ జండవేగ మనం బడియెఁ జండవేగుఁ డనుగంధర్వునకు గంధర్వస్త్రీ లన మున్నూటయఱువది దివారాత్రము లని యెఱుంగునది. గంధర్వులు పరోక్షమున జనుల యాయువును హరించునట్లు లివియు హరించుఁ గావున గంధర్వు లనం బడియెఁ గాలకన్య యన జరావస్థయగుఁ బురుషాయువును హరించుకాలమున కది ప్రీతినిఁ బుట్టించుఁ గావునఁ గాలము కన్య యని పిలువం బడియె. లోకము దానిం బరిగ్రహింపకున్నప్పుడు రోగరా జగుమృత్యువు లోకక్షయముఁ జేయుటకుం దానిఁ దీసెం గావున జర మృత్యువునకుం దగ్గఱచుట్టం బయ్యె. యవనేశ్వరుఁడు పురంబు ముట్టడించె నన మృత్యువు శరీరము నావేశించె ననియు యవనసైనికు లాధివ్యాధు లగురోగము లనియు రోగములు మిగుల

బాధించు నవిగావున శత్రువు లనియుఁ దెలియం దగు సుఖదుఃఖములు రాగద్వేషములు భయాభిమానప్రమాదాదు లతనిసైనికు లనియుఁ బ్రజ్వారుఁ డన వివిధరోగము లనంబడు దక్షిణోత్తరపాంచాలము లనఁ ద్రివర్గమును సాధించుటం దెలుపుప్రవృత్తిశాస్త్రము దక్షిణపాంచాల మనియుఁ ద్రివర్గఫలము నిత్యము గా దని చెప్పు నీశ్వరసత్యముం దెలుపు నివృత్తిశాస్త్ర ముత్తరపాంచాల మనియు నెఱుంగునది యాసుర మనెడిపశ్చాద్ద్వారము శిశ్నము దుర్మద మనుద్వారము గుదస్థానము దానివలనఁ బురంజనుఁడు వైశస మను ప్రదేశమునకుం బోవు నన జీవుఁ డాగుదస్థానమునుండి నరకదుఃఖ మనుభవింపఁ బోవు నని తెలియు నది పురంజనుఁ డంధు లగుపౌరుల వలనఁ గొన్నికార్యములు సాధించు నన నంధు లగుపౌరులు కాళ్ళును జేతులు నవి జ్ఞానహీనములు గావున నంధు లని చెప్పం బడినవి పురంజనుఁ డంతఃపురంబు నొందె నన జీవుఁడు హృదయమును బొందె ననుట రా జంతఃపురము నొంది మోహాదులం జేసి హర్షమును బొందినట్లు జీవుఁడు హృదయమును బొంది మోహాదు లొందుచుండును. దేహ మొకరథమువంటి దింద్రియములు గుఱ్ఱములు రథగమనము సంవత్సరవేగము పుణ్యాపాపములు చక్రములు. సత్వరజస్తమములు ధ్వజములు పంచప్రాణములు బంధనస్థానములు మనస్సు పగ్గములు బుద్ధి సూతుఁడు హృదయము రథికుఁడు ఇంద్రియార్థములు బాణములు సప్తధాతువులు రథముం గప్పుచర్మాదులు బాహ్యవిషయములం గూర్చి పఱ్వెడువింద్రియములు సేనలు జీవుఁ డారథము నెక్కి యజ్ఞానావృతుఁడై యుండును మఱియు నింద్రియాదుల ధర్మముల నాత్మయం దారోపించుకొని నేను నాయది నేను సుఖిని నేను దుఃఖి ననుచు సుఖలేశములకై పాటుపడుచు దేహాంతరప్రాప్తికిఁ దగినకర్మము లొనర్చుచుండును జీవుఁడు సాత్వికకర్మము లొనరించి కాంతిమంతమైన దేహమును రాజసకర్మము లొనరించి దుఃఖసంపాదక

మయినదేహంబును దామసకర్మము లొనర్చి యజ్ఞానశోకము లిడు
దేహమును బొందును. జీవుఁడు తా నొనరించినకర్మమునకుం దగునట్లు
మనుష్యజన్మమును దేవజన్మమును బశుపక్ష్యాదిజన్మమును గీటాదిజ
న్మము నొందుచుండును. ఒకప్పుడు స్త్రీత్వము మఱియొక్కప్పుడు
పురుషత్వము నిం కొకప్పుడు నపుంసకత్వము నొందును. 354

ఉ. ఆఁకలి గొన్నకుక్క కడునారట మందుచు నిల్లు నిల్లునుం
దోఁక గదల్చుకొంచుఁ జని యొప్పెడుగంజిని బొంద లేనిచో
నాఁకలిపోట్లు గాని గొని రోఁజుచుఁ బోయెడునట్లు జీవుఁడుం
గాకల గోర్చి కామములఁ గైకొన నెంచెడుఁ గించు కైనడిం. 355

తే. కర్మగుణమున కనుగుణగతులు నూఱు
లోకములయందు మఱియు నీలోకమందుఁ
గ్రిందిలోకము లందును బొంది జన్మ
ములు తపించెడు నెంతయుఁ బొలుపు దక్కి. 356

సీ. పురుషార్థభూతుఁడై పొలుచునాత్మకు దుఃఖ
రూపసంసారము పాపమనము
వలన సంభవ మయి వఱలెడుఁ గావున
స్వాంతము నరికట్ట వలయు మొదట
దాని కెన్న భగవద్భక్తి ముఖ్యం బగు
వైరాగ్యమునఁ జేసి భక్తి వఱలు
శ్రద్ధధానుం డయి సతతము విష్ణుక
థాశ్రవణము భక్తి దాయక మగు

తే. విష్ణుభక్తసహావాసవిధులఁ జేసి
హరికథాశ్రవణాసక్తి యది లభించు
సజ్జనులు గల్గుచోటికిఁ జనియు వారి
సాధుసహవాస మెప్పుడును సలుప వలయు. 357

వ. భాగవతులసహవాసంబున హరికథాశ్రవణము దానివలన భగవదుపా
సనము దానివలన వైరాగ్యము దానివలన భగవత్సాక్షాత్కారరూప

జ్ఞానము దానివలన భక్తి దానివలన ముక్తియుం గలుగు నాకర్ణింపు మీశ్వరుండును బ్రహ్మయు మనువులును బ్రజాపతులును సనకాదులును మరీచియు నత్రియు నంగిరసుఁడును బులస్త్యుఁడును బులహుఁడును గ్రతువు భృగువు వసిష్ఠుండును నేనును బ్రహ్మవాదులును బృహస్పతియు వ్యాసుఁడు లోనగువారును దపస్సు సమాధి లోనగు నుపాయములచే నుపాసించియుఁ బరమేశ్వరునిఁ జూడఁ జాలకున్న వా రట్టివారే చూడఁ జాలకున్నప్పుడు సంసారమం దున్న వా రెట్లు చూడఁ జాలెద రోయి రాజేంద్రా! భగవదనుగ్రహమే ముక్తికిఁ గారణ మగుటచే నీ వజ్ఞానంబువలన స్వర్గాదిఫలములం గలిగించుకర్మములందుఁ బురుషార్థసాధనమతి నిలువరింపకుము కర్మములు కేవలము స్వల్పఫలదాయకములు రజస్తమోగుణబద్ధు లయినవారు శ్రీహర్యారాధనరూప మగు వేదపూర్వభాగమును గర్మతాత్పర్యముం జెప్పెదురు వా రజ్ఞాను లని తెలిసికొమ్ము నీ విఁకఁ గర్మము లాచరింపక యజ్ఞాభిమానమును విడిచి యేకర్మము భగవంతునకు సంతస మొదవించునో యట్టికర్మ మాచరించి భగవంతునికిఁ బ్రియుఁడవై యుండుము నీమనంబు నిర్బంధింపు మర్థవాదము లైన వేదములనుండి నీ మనంబు మరలింపుము గృహస్థాశ్రమమును వీడుము జీవుని రక్షించు భగవంతుని శరణు వేఁడు మని యుపదేశించిన నారదునిం గాంచి ప్రాచీనబర్హి యి ట్లనియె. 358

—♦ కర్మఫలముల పూర్వాపరవిచారము ♦—

తే. నీదునుపదేశమునఁ జేసి నాదులోని
సంశయము లెల్లఁ దీఱె నోసంయమీంద్ర
యుపనిషత్తులకు న్మించి యుండె నీదు
బోధము లటంచు నెంచెద బుద్ధివలన. 359

సీ. ఇం కొక్కసందియ మిపుడు నా కుదయించె
దాని నివర్తింపఁ దగుదు వీవు

జనుఁ డేశరీరమునను బుణ్యపాపము
　　　　లీలోకమునఁ జేయు నిచట నాశ
రీరముఁ విడనాడు నారయ నాలోక
　　　　మున మఱి యొకమేను పొంది ఫలము
ననుభవించు నటంచు వినుతురు పెద్దలు
　　　　ప్రాక్తనదేహకర్మముల కితర
తే. దేహముల కెట్టిసంబంధ మోహటింప
కెట్టు ముడిపెట్టుదురొ యిందు నెట్టివిస్మ
యము గలిగియుండునో విన నాత్మ యయ్యెఁ
దెలియ నానతి యీయవే దేవమౌని. 360

వ. అనిన నారదుం డతని కి ట్లనియె. 361

సీ. విను మిందుఁ గర్మము లను జేయునది చిత్త
　　　　మేకాని తలపోయ మేను గాదు
స్వాంతమునకు మేను సాధన మగుచుండు
　　　　మేనికి స్వాతంత్ర్య మేని లేదు
మది లేనిదేహము మట్టిబొమ్మం బోలు
　　　　ప్రాణ ముండినలేని యట్టిద యగు
నది గాన నిటఁ జేసినట్టికర్మము ఫల
　　　　మట మన మొందు దేహంబు గాదు
తే. స్థూలదేహము నోయిన సూక్ష్మదేహ
మును మనోబుద్ధులును జీవుఁ బొంది యుండు
ను త్తరం బగుజన్మమం దుచితరీతి
కర్మములఫల మొందఁ గాఁ గలుగుచుండు. 362

చ. తెలియు ముదారకాణము దెస్నెద నీవిషయంబునందు శ
య్యల శయనించియున్నతఱి యం దెపుడుం గనియుండనట్టిదై
తులయిడరానిచిత్ర మయి తోఁపఁగ వచ్చెడుస్వప్న మెన్నియో
కల వట నబ్బురంబు లవి కన్నవి విన్నవి గా వొకప్పుడుఁ 363

ఉ. ఆపడియున్న స్థూలతను వయ్యవి యెప్పుడుఁ జూడకున్న మున్
దోఁపఁగ నైనదేహములలోఁ దిరుగాడెడునప్పు డెప్పుడో
యాపరమాద్భుతార్థముల నారసియుండుట నవ్వి సూక్ష్మదే
హాపితమై కనుంగొనఁగ నయ్యెడు నియ్యది నీ వెఱుంగనో. 364

తే. అట్లె యీజన్మమునఁ జేసినట్టికర్మ
ములఫలం బది యవ్వలఁ గలుగుజన్మ
ములను బొందఁగ వచ్చెడుఁ బురుషుఁ డతఁడు
నాశనము లేనివాఁ డయి ననుచుఁ గాన. 365

తే. అననుభూతము లెప్డును గనఁగ రా వ
టనుచు శాస్త్రము చెప్పెడు నట్లుదాన
స్వప్నములఁ గానవచ్చెడు సర్వము మును
నేభవముననో కని యున్న వే తలంప. 366

వ. ఇంక దేహాత్మలస్వరూప మించుక చెప్పెద నాకర్ణింపుము. 367

—• దేహాత్మ స్వరూప నిరూపణము •—

సీ. పంచభూతములును బంచవాయువులతోఁ
నెసఁగెడు నేకాదశేంద్రియములు
సత్త్వాదిగుణములు చక్కఁగఁగ్గలినయది
దేహ మనంగనై తేజరిల్లు
నేను నాదనునట్టిజ్ఞానమే జీవుఁడు
నాఁబడుచుండు నోనరవరేణ్య
యీరీతి లింగశరీరముం గూడ న
నేక దేహంబుల నెత్తుచుండు

తే. అతఁడు సుఖదుఃఖములు భయహర్షములును
బొందుచుఁ గొంగళిపురువు పొందియున్న
పూరి విడలేనియ ట్లప్డు పొందియున్న
మై విడువ లేక దుఃఖించు మరణవేళ. 368

మత్త. తొంటిపుట్టువులందుఁ దా నవి శోఁచి చేసినచేఁతలై
యుంట వానినె యీభవంబున నొంది చేయు నజస్రముఁ
వంటవాఁ డయి వంట మెచ్చును బాపఁ డైనను బొత్తముం
గొంట కిష్టత సేయు రాజ [illegible]రుఁ గత్తినిఁ బట్టఁగన్. 369

వ. ఇత్యాదులు వాసనావశంబున సంభవించెడు దీనం జేసి జన్మపరంపరల సంబంధము స్పష్ట మగుచుండును గావున భూతములకు జన్మములఁ గలిగించునది మన స్సనియుం దెలిసి యుండును. దేహము కర్మముల ననుసరించి వచ్చుటచేత నహంకార మమకార రూప మగునవిద్యచే నాత్మకు సంబంధము గలుగుచుండు నది తొలఁగించుకొనుటకు భగవన్నామమే శరణ మగు నని తలంచి యీశ్వరారాధనము గావింపు మని చెప్పి భగవంతుం డగునారదుండు ప్రాచీనబర్హి వీడ్కొని బ్రహ్మలోకంబునకుం జనియె నంత నాప్రాచీనబర్హి పుత్రులకు రాజ్య మిచ్చి తాను దపించువాఁడై కపిలాశ్రమంబున కరిగి భగవంతుని సేవించుచుఁ గొంతలో భగవత్సారూప్యము నొందె నని మైత్రేయుఁడు విదురుం జూచి విదురా! మఱి యేమి విన నెంచితి వన నతండు ప్రాచీనబర్హికుమాళ్ళు రుద్రోపదేశమున హరిని స్తోత్రము గావించి యెట్టిఫలంబు నొందిరి దానిని సవిస్తరంబుగ నెఱింగింపు మనిన మైత్రేయుండు. 370

— ప్రచేతసులకు హరి ప్రత్యక్షమై వరం బొసంగుట —

తే. తండ్రియనుమతిఁ గొని ప్రచేతసులు వోయి
యబ్ధిజలమధ్యమునఁ దపం బాఱఁ జేసి
రోలిఁ బదివేలవర్షము లుగ్రభంగి
నచ్యుతుఁడు వారి కంతఁ బ్రత్యక్ష మయ్యె. 371

చ. సురగిరిశీర్షభాగమునుఁ జేరిననల్లనిమేఘమో యనన్
గరుడునిమీఁద నెక్కికొని కౌస్తుభరత్నము కాంతి నల్గడన్
గరము వెలుంగఁ జక్రమును గంజమునున్ గద కైఁ దలిర్ప నా
సురమునిసంఘముల్ గొలువ సొంపలరారెను మాధవుం డటన్. 372

వ. ఇట్లు ప్రత్యక్షమై రాజనందనులారా! మీతపంబున కేను సంతుష్టుండ
నైతి మీయభీష్టం బెఱింగింపుఁ డొసంగెదను మీకు గుణవిశ్రుతుం
డగుకుమారుండు పుట్టు వానిసంతానము ముల్లోకములు నిండ నభి
వృద్ధినొందు నాకర్ణింపుఁడు. 373

సీ. మున్ను కండుం డనుముని తపించుచునుండ
నరుదేరఁ బ్రమ్లోచ యనెడుదాని
గోడ భోగింపఁ దోడ్తోఁ బుట్టె నొకకన్య
నట వీడి తలిదండ్రు లరిగి రెటకొ
వృక్షముల్ పెనిచె నాపిల్ల నాఁకలి కేడ్వ
సోముఁడు చనుదెంచి ప్రేముడి మెయి
నమృతము స్రవియించునంగుష్ఠ మాస్యము
నం బెట్టినం ద్రావె సంబరమున

తే. అమృతపానము చేయుట నప్సరసకుఁ
బుట్టుటం జాల సౌందర్యభూమి యయ్యె
నామె భర్త నన్వేషించునదియ కాన
నందఱును దానిఁ బెండ్లాడ నగును మీరు. 374

ఉ. అందఱ కొక్కభార్య తగునా యిది ధర్మవిరుద్ధ మంచు మీ
డెందములందు సందియము డిందుపడం బొనరింపుఁ డెల్ల రా
నందములోఁ బృథగ్గతమనస్కులు గాక చరింపుఁ డొక్కఁడై
పొందును మిమ్ముఁ గన్న యది పున్నెము దాన నశింప దెన్నఁగన్.

వ. ఇట్లు మీరు వేయివత్సరంబులు కాలంబు పుచ్చుఁ డవ్వల మీతపః
ప్రభావంబున నాలోకంబు నొందఁ గల రనిన జనార్దనునికి సాష్టాంగ
వందన మాచరించి చేతులు జోడించుకొని ప్రచేతసులు. 376

సీ. ఆధ్యాత్మికాదులై యడరు తాపత్రయ
మును నశింపఁగఁ జేయుఘనుఁడ వీవు
నీనామమంత్రము నెఱిమీఱ జపియింప
సంసారభూతము సడలి పోవు

మానాథ నీ వవాఙ్మానసగోచరుం
డ వుపాధు లూఁకుండనిప్రభువవు
జీవేశ్వరజ్ఞానభావులకు న్నీవు
నిరతిశయప్రీతి నెఱపువాఁడ
తే. వీవు సృష్ట్యాదు లొనరింప నై వెలయుదు
నీవు సంసారబంధము లేవి లేని
వాఁడ వవ్యయుఁడవు జగద్వల్లభుఁడవు
నీకు వందన మొనరింతు మోక్షపాళు. 377
సీ. జగములఁ బుట్టింపఁ జాలినపద్మము
నీనాభిలోపల నిలిచి యుండె
కమలాలయం బైనకమలమాలిక నీదు
కంఠభాగమునందుఁ గ్రాలుచుండుఁ
బద్మకింజల్కసువర్ణము గలిగిన
పీతాంబరము మేనఁ బ్రీతిఁ దాల్తు
నీ రేజదళములసౌరు కా దనునీదు
కనుదోయిచూపులు గాచు జగము
తే. అనిశతాపత్రయాతురు లైన మాకు
దుఃఖనాశన మొనరింప మొనసి యిట్లు
దర్శనానంద మొసఁగితి ధన్యతముల
మేము నీ కిదే మ్రొక్కెద మోముకుంద. 378
వ. అని యిట్లు ప్రచేతసలు చేసిన స్తోత్రమునకు సంతసించి పరమేశ్వరుండు వారు కోరినకోరిక లొసంగి నిఖిలపరివారపరివృతుం డై నిజలోకంబునకు నిర్గమించె నంతఁ బ్రచేతసులును సముద్రజలంబునుండి వెడలి వెలికి వచ్చి ప్రాచీనబర్హి ముక్తుఁ డగుటం జేసి కృష్యాదులు లేక పెఱిగినవృక్షాదులు గలభూమిం జూచి వృక్షముల నెల్ల నాశనము చేయువారై నిజముఖంబులనుండి వాయ్వగ్నులు వెడలం జేసిరి దానం జేసి ప్రపంచమునం గలచెట్లెల్ల భస్మావశేషంబు లగుచుండె

నప్పు డది యెఱింగి బ్రహ్మదేవుఁడు వారికడకు వచ్చి కొన్నిమాటలు
చెప్పి వారికోప ముడిగించె నపుడు వృక్షాభిమానిదేవతలు దేవురిం
చుచు బ్రహ్మయుపదేశంబునఁ దమకన్యం దెచ్చి వారి కిచ్చిరి వారును
మారిష యనుపేరు గలయాకన్యం బరిగ్రహించి యామెయందు
బ్రహ్మ కుమారుండగు దక్షుని గుమారునిఁ గాఁ బడసిరి. 379

తే. అతఁడు చాక్షుషమన్వంతరాంతరమున
క్షయమునం జేసి సర్వము సమసి పోవ
నపుడు దైవచోదితుఁ డయి యఖిలజనుల
సృష్టిచేసినదక్షుఁడే చెప్ప నతఁడు. 380

వ. సకలతేజస్వుల తేజస్సుల నాచ్ఛాదింపఁ జాలుదక్షత కలవాఁడు గావున
నతండు దక్షుండు నాఁబడె బ్రహ్మదేవుఁ డాదక్షుని మరీచ్యాదిప్రజా
పతులను బ్రజల సృష్టించుటకు రక్షించుటకు నియమించె నని చెప్పిన
విదురుండు మైత్రేయుం గాంచి మహాత్మా! ప్రచేతసు లవ్వలికాలం
బున నెట్లు ప్రవర్తించిరి చెప్పు మనిన నతం డి ట్లనియె. 381

తే. విష్ణు వానతియిచ్చిన వేయియేండ్లు
సంసృతిసుఖంబులం బొంది శాంతు లగుచు
నాప్రచేతసు లాత్మజునందు సర్వ
భారమును బెట్టి తపియించుకోరిక మెయి. 382

తే. ఇల్లు విడి వారు జాబిలి తొల్లి నిష్ఠఁ
తపము గావించి సిద్ధిమైఁ దనరి నట్టి
పశ్చిమాంభోధిచెంగటఁ బరమతపము
జపము గావింపఁ దొడగి రాసమయమందు. 383

— నారదోపదేశమునఁ బ్రచేతసులు ముక్తిం గాంచుట —

వ. నారదుండు దర్శన మిచ్చినం జూచి ప్రచేతసులు లేచి నమస్కరించి
యర్ఘ్యపాద్యాదివిధుల నర్చించి యి ట్లని విన్నవించిరి. 384

శా. మాపుణ్యంబునఁ జేసి నిన్నుఁ గనుగో మా కబ్బె నీరీతి ని
ష్టాపూర్ణోదయ! సూర్యతేజము సమస్తోర్వీతలం బంటి తా

నేపోల్కిన్ దమమున్ హరించి గరిమం బీఁ జాలునో నీవు నీ
రూపుం జూపి సమస్తభక్తవరులన్ బ్రోవంగఁ జూ తెప్పుడున్. 385

వ. మేము గృహస్థాశ్రమంబునం బడి యుండుటం జేసి రుద్రవాసుదేవులు
చెప్పినతత్త్వమంతయు మఱచితిమి మా కిపుడు బ్రహ్మజ్ఞానము నుప
దేశింపననుగ్రహింపు మనిన నారదుండు మననశీలు రయినప్రచేతసులం
గాంచి యి ట్లనియె. 386

చ. మనమును వాక్కుఁ గాయమును మానుగ నిల్పుచు నీశ్వరార్చనన్
బొనయుచువానిజన్మము సమున్నతజన్మము సూవె శుక్లసం
జననము వద్దు దీక్ష నగుజన్మము లియ్యవి జన్మసంజ్ఞకై
పొనరెడుతత్ప్రయోజనము పూజ్యము మానవకోటి కారయన్. 387

సీ. కంజాక్షునకుఁ బ్రీతిఁ గలిగింపఁ జాలని
జనుమనుగడ యేల జన్మ మేల
వేదోక్తవిధు లేల ? విప్రాదికుల మేల ?
వాగ్విలాసం బేల వసువు లేల
సత్యవ్రతము లేల ? సత్రసంగతు లేల ?
జప మేల తప మేల స్నాన మేల
సంధ్యవార్చుట లేల ? సాధుసంగతు లేల
దానము లవి యేల ధర్మ మేల

తే. ఇన్నియును వ్యర్థతములై యేటఁ గలియు
దైవవంచితుఁ డగు వాఁడు ధరణి యందు
తోలుబొమ్మకు వానికిఁ దోప దింత
యైన భేదము ప్రాణ మొం డదియుఁ గాక.

తే. వృక్షమూలము దడిపిన వృక్షశాఖ
లన్నియును దృప్తి గైకొని యలరునట్లు
విష్ణు నొక్కని సేవింప వెనుక నున్న
వేల్పు లందఱు ప్రొక్కి సేవించినట్లె. 389

తే. చరము లచరము లగుజంతుచయము లెల్ల
భూమియం దుద్భవించియు భూమియందు
పొడవడగునట్లు హరియందు పుట్టు జగము
మఱియు హరియం దడంగు లో నెఱిఁ దొఱంగి. 390

సీ. అతఁడు సజాతీయ మగువస్తు వొక్కఁడు
లేక యుండెడివాఁడు లోకనుతుఁడు
సుఖదుఃఖవికృతు లాశుభమూర్తి నంటవు
నిస్సముఁ డాతఁడు నిరవధికుఁడు
బ్రహ్మరుద్రాదులప్రభు వప్రతర్క్యుఁడు
చిదచిత్స్వరూపుఁడు చిన్మయుండు
భక్తిగమ్యుఁడు భక్తవరజనసులభుండు
సచ్చిదానందుఁడు జ్ఞానమూర్తి
తే. ఆది యంతము లేనట్టియనఘకీర్తి
నామసంకీర్తనము చేయునరుల నెపుడు
నాదరించుచు నుండు దయార్ద్రహృదయుఁ
డట్టిదేవుని భజియింప నగును ముక్తి. 391

చ. అమలినచిత్తవృత్తిమెయి నన్నిటియందును నిండి యున్నయ
య్యమలునిఁ గామముల్ విడిచి స్వాంతము చక్కఁగ నిల్పి కొల్చినన్
సుముఖత గల్గి తజ్జనునిఁ జూచు దయార్ద్రమనఃప్రవృత్తి నా
విముఖుఁడు లచ్చిని న్విడిచి భక్తులపక్షమయై తలిర్చెడున్. 392

క. మీ రాభగవంతుని లోఁ
గోరిక లేవియును లేక కొలిచితి రేనిన్
మీరాజై యతఁడు మిమున్
స్వారాజ్యము కాదు తనదు స్థానముఁ జేర్చున్. 393

వ. అని నారదుం డెఱింగించి వారి నభిమంత్రించి సత్యంబునకుం జనియె
నవలఁ బ్రచేతసులును భగవంతునిచరణకమలములు సేవించుచుఁ

గించితాకాలంబున వైకుంఠము నొంది నిత్యానందంబునం బొందుపడి
రని మైత్రేయుండు విదురునకుం జెప్పిన నతం డతనిపాదపద్మంబులకు
వందనం బాచరించి నీకారుణ్యంబున నేను సంసార సాగరముం
దాఁటఁ గలవాఁడ నైతి నని పలుకుచు జ్ఞానానందపరిపూర్ణమాన
సుండై తదనుజ్ఞం బొంది హస్తినాపురంబునకుఁ జనియె నీయాఖ్యా
నము వినినవారికి నాయుర్ద్రాయధనాదు లభివృద్ధి నొంది యిహంబునఁ
గీర్తియుఁ బరంబున ముక్తియు లభించు నని శుకయోగీంద్రుండు
పరీక్షిత్తునకుం జెప్పె నని సూతుండు శౌనకాదులకుం జెప్పె. 394

చతుర్థ స్కంధాంతము.

చ. కువలయబాంధవప్రియుఁ డకుంఠితతేజుఁడు సర్వలోకబాం
ధవుఁడు సుమిత్రుఁడు న్విమలధామనిధానము విజ్ఞలోకచ
క్షువు దిననాథవంశమణి సూర్యశుభాఖ్యుఁడు రాజరత్నమై
కవివరచక్రముల్ మనుచుఁ గావుతమెప్డు దయార్ద్రదృష్టిమై. 395

తే. చంద్రమతికి సావిత్రికి జ్ఞానసుతకును
సాటి యనిపేరు గాంచి విశాలజగతి
గరితతనమున నొప్పు వేంకటనరసయ
ప్రాణవిభుఁ డొప్పు సూర్యనారాయణుండు. 396

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందుఁ
జతుర్థ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

—:0:—

శ్రీరస్తు

శ్రీకృష్ణభాగవతము

పంచమస్కంధము

—:0:—

క. శ్రీరామసోదరుల్ బలెఁ
గూరిమి నొప్పారుసాగికులసోదరులం
దారూఢి నొప్పురాణ్మణి
నారాయణరా జెసంగు నాయకమణి నై. 1

వ. అవధరింపు మక్కథకుండు శౌనకాదుల కిట్లనియె నట్లు చెప్పిన శుకుఁ
గాంచి పరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 2

సీ. మౌనిచంద్ర! ప్రియవ్రతమానవేంద్రుఁ
డాహిరణ్యగర్భకుమారుఁ డైననార
దునివలన నాత్మవిజ్ఞానమును గ్రహించి
యును మగుడ రాజ్యపాలన మొనరిచె నఁట. 3

ఉ. ఆతఁడు తత్త్వమం దనుభవాతిశయంబు గలాఁడు విష్ణునం
దాతతభక్తితత్పరుఁ డనంతవిరాగజితేంద్రియుండు పా
పాతిశయోగ్రసంసృతిమహార్ణవపూరమునందు వెండియున్
ద్రోతకుఁ గాఁగ నై యెటులు తోషము నొందుచునుండెనో కదా. 4

—♦ మనుపుత్రుం డగుప్రియవ్రతుఁడు రాజ్య మేలుట ♦—

ఆ. దానఁ గర్మబంధ మౌను దానన్ జ్ఞాన
మునకు నింతలోటు పొసఁగ కుండ
దెప్పుడున్ ముముక్షు వేడఁద గార్హస్థ్యము
వలదు వలవ దనుచు వదలిపోవు. 5

వ. ఆత్మారాముఁ డగువానికిఁ బుత్రమిత్రకళత్రాది సంసారసంబంధము
కాని దనుచు జ్ఞానానందస్వరూపులు దానిం దిరస్కరింతురు భగ:

త్పాదసేవ తాపత్రయనివారకంబు శాంతిప్రదంబు గృహియయి యుం
డియు భక్తివైరాగ్యములు సంపాదించుకొనుటవలన దారసుతాదిసంగ
మున కది పరిపంథిస్థానం బట్టిదాని నారదోపదేశంబున విజ్ఞానియైన
ప్రియవ్రతుం డేమిటికి మఱియు నంగీకరించెనో నాకు మిక్కిలి సందే
హం బగుచున్నయది దీనిం దీర్పఁ బ్రార్థించుచుంటి నన శుకయోగీం
ద్రుండు. 6

సీ. రాజేంద్ర! చక్కనిప్రశ్నంబు చేసితి
నీసంశయము దీఱ నే నొడివెద
స్వాయంభువాదుల సంప్రార్థనంబున
నతఁ డట్లు గృహి యాట కనుమతించెఁ
గాని యాతని కందు మానస మది లేదు
చెప్పెద వినుము నీచిత్త మలర
జ్ఞాని గృహాసక్తుఁ డైనచో భక్తి న
శించెడు ననుచును జెప్పు టొప్పు

తే. భగవదంఘ్రిపద్మమరందపానరతుల
కెట్టి బంధమునం దైనఁ బుట్టియున్న
పూర్వవాసన విడువదు పుణ్యమతికి
సతము తద్ధ్యానమునయందు రతి యొసంగు. 7

వ. ప్రియవ్రతుండు మహోన్నతభాగవతధర్మతత్పరుండు నారదోపదేశం
బున నెన్నఁడును విడువఁ జాలనితత్త్వజ్ఞానమున నిశ్చలుండై యున్న
వాఁడు వానిచిత్తము వాసుదేవునియందు హత్తుకొనియున్నది
సంసారమం దుండియు సర్వము విష్ణుమయముగానే యెంచుచుఁ
గులాలకీటన్యాయంబున సంసారంబు సాగించె నదియునుం దన కా
సంసారంబును రాజ్యంబునుం బ్రియంబు లగుటం జేసి స్వీకరించినవి
కా వాకర్ణింపుము. 8

ఉ. నారదుఁ డట్లు వచ్చి నరనాథుఁ బ్రియవ్రతుఁ గాంచి తత్త్వముల్
సారమతిన్ వచించి చన సంసృతి నొల్ల కతండు రాజ్యముల్

గోరిక స్వీకరించిన నకుంఠగతిఁ మదమత్సరాదులున్
దీరనిరాగభోగములు దెంపునఁ బైఁ బడు నంచు బీతునన్. 9

తే. రాజ్యపాలన మొనరింప రా దటంచు
నాతఁ డొల్లక యున్నచో నతనితండ్రి
యైనస్వాయంభువమనువు వాని కెన్ని
యెన్నొ చక్కట్లు చెప్పెను విన్ననువున. 10

వ. ప్రజాపాలనంబు గావింపం బూనుకొ మ్మని తండ్రియు లోనగువా రేన రెన్నివిధంబులచెప్పిన ననేమిరా యని నతం డున్న సమయంబున బ్రహ్మదేవుండు మూర్తిమంతము లైన వేదములవలె నున్న మరీచ్యాదులం గూడి సత్యలోకంబునుండి భూలోకంబున నున్న ప్రియవ్రతుని సమక్షంబునకుం జనుదెంచె నంతలో నారదుండు స్వాయంభువప్రియవ్రతులతో నెదురేగి తోడితెచ్చి యర్ఘ్యపాద్యాదు లిచ్చి ప్రార్థించినం బ్రసన్నుం డై బ్రహ్మ ప్రియవ్రతునిదిక్కు మొగంబై యిట్లనియె.

ఉ. ఓయి ప్రియవ్రతా తెలియ నొక్కఁడు చెప్పెద నాలకింపుమా
యీయమరర్షు లీమునులు నీవును నేనును సర్వలోకముల్
పాయక దేవశాసనము పాటి యొనర్చుట పాడి కానిచో
నాయనయాగ్రహంబునకు నగ్గల మయ్యెద మెల్లనాఁడునున్. 12

తే. సిద్ధతపముచేఁ గాని శాస్త్రీయ మైన
జ్ఞానమునఁ గాని యణిమాదిశక్తిఁ గాని
యర్థమునఁ గాని దేనిచే నైనఁ గాని
స్వామిశాసనముం దాటఁ జాల రెవరు. 13

మ. ముకుత్రాటం దగిలించి యెద్దులను నేపోల్కిన్ వశంబందు ని
ల్పుకొనం జాలుదు రట్టు లీశ్వరుఁడు పెంపుం జెందుకర్మంబులన్
బ్రకటింపంబడు త్రాళ్ళఁ గట్టి మనలన్ స్వాధీనమం దుంచుకో
నొకయుం తేని స్వతంత్రశక్తి గలమై యుండంగఁ బో మెప్పుడున్. 14

తే. పరుని చేతను నడపింపఁ బడెడునంధుఁ
డొక్కపుడు నీడ నడచు నింకొక్కయప్పు
డెండ నడచునట్టులు సుఖ మేని దుఃఖ
మేని కర్మవశంబున నే నరులకు. 15

వ. కావున మనయిష్టానిష్టములం జేసి కార్యంబులు సాధించుకొన మన
మసమర్థులము సర్వము నీశ్వరేచ్ఛం జేసి ప్రవర్తిల్లుచుండు నీశ్వరుం డే
సంసారులఁ బ్రవృత్తిధర్మంబున నడపించు వా రట్లు నడచు టుచితంబ
కాని నే నాత్మవిద్యం బడసి ముముక్షువు నై మరలం బ్రవృత్తిం బడు
టొప్పునే యని శంకింపకుము ముముక్షు వైన నజ్ఞానదశయందుం బలె
జ్ఞానదశయందును బ్రారబ్ధం బనుభవింప నగు నట్లయ్యును దేహా
త్మాభిమానరహితుండై ముక్తుఁ డగువఱకు నతండు ప్రారబ్ధ మనుభ
వించుటకు మాత్రమే దేహమును ధరించుం గాని సంసారలంపటుండై
దేహాంతరము సంపాదించు కార్యములకుం గాదు కావున వన్యాహారం
బున దేహయాత్రం దీర్చుకొనుచుఁ గాలముఁ బ్రతీక్షించుచుండు
టొప్పు న ట్లయిన వనమం దుండుట తగుం గాని యింట నిల్లాలితో
నుంట తగునే యందువేని వినుము. 16

మ. ఇలు నిల్లాలినిఁ బాసి పోయి వనమం దే యున్నవాఁ డైన నా
కు లలంబుల్ దినుచుండువాఁడయినఁ గోర్కుల్ మీఱ దేహేంద్రియా
దులకుం జిక్కినయేని వాని వనమందుం నిల్చియుంటే మగున్
బలుసాకుల్ దినుచుండు టేమి యగునో వ్యాఖ్యిమ్ము లోకనుతా. 17

శా. ఆలుంబిడ్డలఁ గూడి లోనగళులం డావాసస్థలిం జేయుచున్
బాలుం డెక్కొరదించు నుండిన నిజస్వాంతంబునన్ దీశు న
వ్వేళ న్వీడక భక్తిని న్వీడక తా విజ్ఞుండై సంసృతిన్
బోలం గుమ్మరిపుర్వు నా మెలఁగినన్ ముక్తుండు గా కుండునే. 18

క. లోలో డాగినరిపుల న
లోలమతిన్ గెలిచి విషయలోలుం డగుచున్

బాలిశుఁడు గాక యుండిన
నేలా గెం దున్న ముక్తి యేర్పడి వచ్చున్. 19

ఉ. శత్రుజయంబు సేయ మది నల్పెడురా జొకగట్టిదుర్గమం
దాత్రము లేక యుండి స్వబలాన్వితుఁడై రిపులం బెనంచి యే
ఘాత్రము నిల్పుకోఁ గలుగుచందమునన్ గృహియై మెలంగి యే
శత్రుల గెల్చి విజ్ఞుఁ డయి జ్ఞాని ముముక్షువు మోక్ష మందెడిన్. 20

తే. పద్మకోశమునం దుండుభ్రమరమునకు
నాశుగాదిబాధలు రానియట్లు భగవ
దంఘ్రిలం జేరి సేవించునట్టినిన్ను
నంట వెట్టి సంసృతిబాధలైనఁ గాని. 21

తే. ఓప్రియవ్రత! భగవంతుఁ డొసఁగునట్టి
భోగములఁ బొందు మవ్వల యోగి వగుచు
భక్తిఁ జేసి గుణాత్మకభావ మొందు
మీశ్వరాజ్ఞను మీఱుట కెంచకు మెద. 22

వ. అని భగవంతుం డగుబ్రహ్మదేవుఁ డాదేశించిన విని భాగవతోత్తముం డగుప్రియవ్రతుండు తదాజ్ఞ బహుమానపురస్సరంబుగా నంగీకరించె నంతఁ జతుర్ముఖుండు స్వాయంభువపూజితుండై నారదప్రియవ్రతుల నాదరదృష్టిం జూచుచు వారల వీడ్కొని నిజలోకంబునకు నిష్క్రమించె నసంత రంబ స్వాయంభువమనువు ప్రియపుత్రుం డగుప్రియవ్రతుని సామ్రాజ్యపట్టభద్రునిఁ గావించి తాను విషయంబులనుండి విరక్తుం డయ్యెఁ బ్రియవ్రతుండును భగవదారాధనరూపకర్మము లాచరించుచు రాగద్వేషాదులం బుద్ధి దగులంబు నొంద నీక గుర్వాజ్ఞం గౌరవించుచు భూమండలము పాలించుచు విశ్వకర్మకూఁతు రైన బర్హిష్మతి యనుదానిం బెండ్లియాడి యామెయందు నాగ్నీధ్రుఁడు నిధ్మజిహ్వుఁడు యజ్ఞబాహుఁడు మహావీరుఁడు హిరణ్యరేతుఁడు ఘృతపృష్ఠుఁడు సవనుఁడు మేధాతిథిఁ వీతిహోత్రుఁడు కవి యనుపదు

గురు పుత్రుల నూర్జస్వి యనునొక్కపుత్రికం గాంచె వారిలో నవన మహావీర కవులు ముచ్చురును బాల్యంబునందె విరాగులై నివృత్తిధర్మ పరాయణులై పరమహంసాశ్రయంబు నొందిరి తక్కినవారు తండ్రివశం వదులై యుండిరి మఱియు న్నాప్రియవ్రతునకు మఱియొక దేవేరియం దుత్తమ తామస రైవతు లనుముచ్చురు పుట్టిరి వారు ముచ్చురును మన్వంతరాధిపతులై రిట్లు పుత్రవంతుం డైనప్రియవ్రతుండు. 23

సీ. చతురబ్ధిమేఖలాక్షితి యంతయును నేలె
ధర్మవిరోధులఁ దవిలి గెలిచి
యిరువురుభార్యల కింపు గూర్చుచువారి
ప్రేమకుఁ బాత్రమై వినుతి గాంచెఁ
దనపుత్రు లందఱు తలలోనినాల్కల
వలె మెలంగం దాను వెలయ నయ్యె
సంసారసౌఖ్యముల్ సర్వం బనుభవించు
నట్టిఁడై నిర్లిప్తుఁ డగుచుఁ దనరె
తే. అఖిలధర్మపరాయణుం డగుచుఁ నిరత
మీశ్వరారాధనమునందె నెడఁద నిలిపి
బదునొకండుకోటులయేండ్లు వసుధ నేల
సువ్రతుం డయి యుండు ప్రియవ్రతుండు. 24

—♦ ప్రియవ్రతుఁడు మేరుప్రదక్షిణము చేయుట ♦—

ఉ. బంగరుకొండచుట్టుఁ బ్రతివారము హేళిప్రదక్షిణంబు చే
యుం గును కే నెఱుంగ కతఁ డుండినచోట వెలుంగు లేనిచో
టం గడుచీఁకటుల్ గలుగుటం గని పట్టి ప్రియవ్రతుండు త
త్సంగతి సంతరించుటకు స్వాంత మొనర్చెను బేర్చి పెంపునన్. 25

తే. భానుఁ డుండినదిక్కునఁ బవలు లేని
దిక్కునన్ రాత్రి యిదిలేని తీఱు నేను
జేసి యెప్పుడు పగ లని చెప్పుకొనఁగ
నాచరింతు నటంచు బ్రియత్నమునను. 26

చ. భగవదుపాసనాబలము ప్రస్తుతి కెక్కఁగఁ బ్రొద్దు తేరిసన్
దెగడఁగ నైనత్తే రొకఁడు దెచ్చి దివాకరుఁడో యనంగ నై
మగఁటిమి గల్గి యెక్కి రవిమండల ముండెడుచక్కి కీవలన్
దగ దిరుగాడుచున్ దమము దవ్వులఁ బోవఁగఁ జేసె రివ్వునన్. 27

క. మేరువుదక్షిణఁ బొందున్
సూరుఁడు తా నున్న నితఁడు సురుచిరకాంతుల్
వాఱఁగఁ జేయుచు నుతర
ధారుణిఁ దిరుగాడు నెల్ల ధ్వాంత మడంగన్. 28

—♦ మేరుప్రదక్షిణమున ద్వీపసముద్రము లేర్పడుట ♦—

వ. ఇట్లేడువారంబులు దివాకరు ననుసరించి మేరువుం జుట్టివచ్చె నాప్రియవ్రతునిరథనేమివలనం గలిగిన చాళ్లేడుసంద్రంబు లయ్యె వానిమధ్యభాగము లేడుఖండంబు లయ్యె నవియే జంబూద్వీపము ప్లక్షద్వీపము శాల్మలిద్వీపము కుశద్వీపము క్రౌంచద్వీపము శాకద్వీపము పుష్కరద్వీప మని యేడుద్వీపంబు లయ్యె. 29

సీ. ఆయేడుద్వీపము లరయ మొదటిదాని
కంటె రెండింతలు ఘనతఁ గాంచు
సలిలభాగము లేడు క్షారోద మనియు ని
క్షూద మనియును సురోద మనియు ఘృ
తోద మనియును క్షీరోదమ్ము యనియును
దధిమంథ మనియును దదనుగతిగ
శుద్ధోద మనియును జొప్పడియును ద్వీప
ములకుఁ బరిఘలు గా నలరుచుండు

తే. భూతలంబున కీద్వీపములును సంద్ర
ములు నలంకృతులును దేవపూజితములు
మానవనివాసములు సర్వమాన్యసస్య
సంభృతంబులు దీపించు సొరుమీఱి. 30

వ. అందు జంబూద్వీపము లక్షయోజనములపరిమాణము గలది దానికిఁ బరిఘ యగులవణసముద్రము నంతప్రమాణము గలదియే ప్లక్షద్వీపము దానిం జుట్టి యున్నయిక్షుసముద్రమును రెండులక్షలయోజనంబులు ప్రమాణము గలవి యిట్లు ద్వీపంబులు సముద్రంబులును బరిమాణంబులుగలవై యున్నవి. ప్రియవ్రతుఁడాద్వీపములకుఁదన కొమారుల నేడ్వుర నధిపతులం గావించి తనకుమారి యగు నూర్జస్విని శుక్రునకు ధర్మపత్నిగ నొసంగె శుక్రున కామెయందు దేవయాని యను కన్నియ పుట్టె ని ట్లసాధారణప్రజ్ఞాప్రభావసామర్థ్యములుఁగలప్రియవ్రతుండు కొంతకాలమునకు దనప్రవృత్తిధర్మంబునం బ్రవర్తించుటకు మిక్కిలి పరితపించి తన్నుఁ దా నిందించుకొనుచు ధనధాన్యపశుపుత్రమిత్రాదుల నెల్లఁ దృణప్రాయముగఁ బరిత్యజించి నారదునియుపదేశార్థ మెల్ల నెమరునకుం దెచ్చుకొని విరాగియై గంధమాదనంబునకుం జని భగవదారాధనంబు గావించుచు సిద్ధిం బొందె నంతరంబ.

—♦ ఆగ్నీధ్రునిచరిత్రము ♦—

శా. తన్నుం గన్నప్రియవ్రతుండు చన నాతర్వాత నాగ్నీధ్రుఁడుం
గన్నింపం బ్రజఁ దండ్రియట్ల పొదవింప న్నేర్చి నే రేడుదీ
వి న్నేమంబున నేలెఁ బెక్కు లగుచుం విన్నాణ మానేండ్లు దాఁ
గన్నాకై యెకిమీఁడులందు నసముం గాటంబుగాఁ బెంచుచుం. 32

ఆ. అతని వేలు పన్న ననవచ్చు గొనముల
గనియుఁ గనికరంబు గలుఁగువాఁడు
వాడనట్టిసిరులు వడసినయొడయంఁడు
వంగసమునఁ జాల వన్నె కెక్కె. 33

వ. అతండు తనడెందంబున నొక్కనాఁ డి ట్లని తలపోసె. 34

చ. కుడువఁగఁ గట్టఁ గల్గినను గొల్లఁగ సొమ్ములు దాల్చి పొల్చినం
మడఁతులపిండు గొల్చి కడు మన్ననఁ జేయుచు నంటి యుండినం
గడఁగొన విద్యలం జదివి కాలెకువా రయినం దలంపఁగాఁ
గొడుకులు లేనిమానిసులకుం గుదు రింతయుఁ గాదు నెమ్మదిం. 35

శా. కా ల్నే యాడుచు నెంతదాఁక సిరులం గావించు నందాఁక నా
స ల్సాగించుచుఁ గూడి మెత్తు రతనిన్ సైఁదోడులు న్నెయ్యు రి
ల్లా లుస్టా ల్సరివారు నెల్లబలగం బాయింతయుం దప్పి ము
క్కా ల్సేరం జనునప్పు డెన్వయను గ్రేగంటం గనం బో రయో. 36

క. కనకున్న వారు పున్నెము
లను గన రని తెలిపె మున్ను లచ్చిమగం డం
దున నే నేవగపెంపునఁ
గని పుత్త్రిని జమునిజాడఁ గన కుండెదనో. 37

మ. అని నేమంబున నిల్చి పుత్త్రిలను దా నందంగ లోనెంచి చ
య్యన నాకవ్వపుఁగొండదండ కొకరుం డందంపుఁ బెంపొందువా
రిని జేజేజడదారిరాయ లగువారిన్ బ్రహ్మను న్నెమ్మదిన్
గనువారింగనుఁగొంచుఁబోయి రొయొకచోఁ గాలాఁచెనేలుల్సాచుచున్.

—♦ ఆగ్నీధ్రుని తపోవన వర్ణనము ♦—

ఉ. సౌ రగుగబ్బిగుబ్బలులఁ జాల్కొనునా సెలయేటినీళులన్
దీరినగున్న మామిడులఁ దీయనిపల్కులు నల్కలంకులన్
జేరఁగఁ బల్కుచిల్క లట నేలపడంతుక పాలు చేఁపురా
వారక కన్నవారి కిడ వారలు కోరిక నాడు నట్లగున్. 39

చ. తమ కగులేఁజిగుళ్ళు కొఱఁతం బడఁ గాయలుఁ బండ్లు పిట్టచా
ల్నమలగఁ జూచి కిన్కమెయి నల్గడ మొట్టుచు మావిశోఁపులోఁ
గమరఁగ ముల్కు లేరుకొనఁ గాంతు వొకో యనునట్లు కోయిలల్
గమికొని కూయుఁ గో యనుచుఁ గందుని రమ్మని పిల్చునో యనన్

మ. పెరవాఁడై తొవకన్నెలం జెఱుపనై వేవెల్గుల న్వెల్గుపో
కిరిఁ జూడం దగదంచు వెన్నుని మది న్గీర్తించునప్పంటబి
త్తరిపై మేలి ముసుంగు వేసికొనె నా దట్టంబుగా నొండొకం
డొరయం గల్గిన తోఁపు లాపొలమునం దొప్పారు నెప్పట్టునన్. 41

వ. అట్టిసోయగంబు గలపున్నెంపుఁగోనలో నొక్కచక్కని తావున. 42

చ. కడుకొని నేమముం దనరఁ గా రయిరాలినయాఁకలంబులేఁ
గుడువక గంతులాడుమది గుబ్బముఁ గక్కలకళ్ళ మేమొ నా
నడరెడునేర్పునం దిగిచి యాఁగఁగఁ బట్టి కడంకతోడఁ దా
నెడఁద బసిండిబొజ్జఁ గలయేలికఁ గొల్చుచు నిల్చె భక్తిమై. 43

తే. ఇట్టు తపసులు కొనియాడునట్టు లెండ్లు
పూంగ్లుగా బమ్మఁ గొల్చుచుఁ బొనరుచుండు
తఱిని నామున నామని దాపరించెఁ
బుడమిపై నెటనుండియో వడిగ వచ్చి. 44

— వసంతఋతువర్ణనము —

ఉ. కమ్మనిమావిపూవులను గాలువఁ గట్టెడు తేనె లాని జుం
జుమ్మని, తేంట్లు పాడెఁ గడు సొంపలరార నిగుళ్ళు మేసి కో
కొమ్మని గండుకోయిలలు గూసెను జిల్కలు గోరువంకలుఁ
ముమ్మర మైనపండ్లఁ దిని మొత్తముగా వగఁ బల్కె నత్తఱిఁ. 45

మ. చలువల్ గ్రమ్మెడుతీవ పందిరులపజ్జ న్జాజిపూఁదోటలో
మలెపూఁ బొన్నపఁబండియాలుమగుఁడుఁ మైపోయిమైఁ దేల్చుచుఁ
లలి నేతెంచెడు లేఁతపయ్యెరను రే ల్పాటించుచు న్నిచ్చలు
న్వలరావానిదురంబున న్వలఁతులై నల్వొంది రయ్యామనిఁ. 46

చ. మెలిఁగొని యొండొకం డరయ మిక్కిలి చిక్కఁగ నున్నమావిశోఁ
పుల నలనోక మొత్తముగఁ బుల్గులు గూయఁగఁ బూవుఁదేనియల్
జలజలరాలి నేలపయిఁ జాల్కొన నెమ్మిలు చూచి కారుమ
బ్బు లురుముచుం గడుం గురియుఁ బో యిపు డన్నమ నాడు నత్తఱిఁ.

క. ఆమనిఁ బొదలెడుసోయగ
మేమని మెచ్చంగ వచ్చు నెంతటివారిఁ
వే మరుని బారి కగ్గల
మై మెలఁగుచుఁ గు తిలఁగుడువ నల్లు విరాళిఁ. 48

వ. అట్టిసొగసులకు నెల్లఁ దానకం బగునట్టియామని దీమసంబై నేల నేలు
చున్నయెడ నిక్కపుజగంబుననున్న తమ్మిపుట్టువు తన్నునమ్మి యున్నట్టి

రాచపట్టం జేపట్టి ప్రోవ సమకట్టి కట్టెమురం జవులు పుట్టం బాట
వాడుచున్నట్టిపూర్వచిత్తి యనునచ్చరమచ్చెకంటిం బోరపొచ్చెము
లేనిముచ్చటం జూచుచుం బిలిచి పని యెఱింగించి పంచుటయు మం
చిది యంచు నాబోటి కోడిబోటులతో నానేటి యున్నతోట
కరుదెంచి చలువచప్పరంబు లనం జొప్పడునట్టిచెట్టునీడల నాడుచుం
బూంబొదలం దూఱుచుం దీంగయుయ్యాల లూంగుచుం గేళాకూళు
లనంజనునేళులం దేలుచుం బూలు గోయుచుం జివురులం జిదుముచుం
బూందేనె లానుచుం బుప్పొడులం గప్పుకొనుచు నాడుచుం బాడుచు
నుండె నట్టియెడ. 49

తే. ఓలి ననుం గన్నగోవాళ్ళయుల్ల మిట్టు
లట్టు నిట్టును దూంగాడు ననుచు నేమొ
గోల యొకతె యుయ్యాల జంపాల యనుచు
లాలిం బాడుచుం దీంగయుయ్యాల లూంగ. 50

తే. అట్టియెడ నొక్కసకి యొక్కయలరుందీవ
గట్టిగ నొకచెట్టునం జుట్టం బెట్టుకొనంగం
గాంచి తమి నెంచి మేం బులకించి మిగుల
వగలం బొగిలె మరుండ! యిటు తగ దటంచు. 51

మ. ఒకయారంబున గండుకోయిల యొకం డొప్పంగం గూహూ యటం
చొకమా రార్చిన మిండగీ నొకని న ప్ఫుల్లంబున న్నిల్పి మే
నొకయిం తైన నెఱుంగకున్న నవలా యొక్క ర్తం డంచుం బొం
దిక నోహో యని యేగం జొచ్చె వటకున్ మేలంబు సేయం జెలుల్.

మ. చెలియా! యామని తీవకూనలకునుం జెల్వొందు లేమావిగు
న్నలకుం గూరిమిం బెండ్లిచేసి యిదె యెంతం బొల్చెగోజ్జంగిపూ
వులలో బుజ్జవ మూరం దేటుల కిదుగో బోనంబుం బూజంపుబం
తులు సాంగించునుం జూడుమం చొకతె యెంతో సంతసం బందెడున్.

వ. ఇట్లు కడుదెఱంగులన్ వేడుక నాటలాడునచ్చరచేడెలయొయ్యారంపు
నడలం గదలుకమ్మలుం గాజులుం గడియంబులున్ సూడిగంబులున్

రవలయొడ్డాణంబులు న్మెట్టె లందియలు లోనగురవణంబుల చప్పుళ్ళ నప్పుడుఁ దెలిసి యప్పుడమితేఁ డల్లనఁ గన్నువిచ్చి చూచునంతలో నయ్యింతులచెంత నెంతయు సంతసమ్మునఁ దుమ్మెదకొమ్మయుం బలెఁ బువ్వుఁదావి మూరుకొనుచు సింగారంపునడకలకొవ్వులచేతను నేపు చూపువగలచూపులచేతను దీటగునాటపాటలచేతను వాటమగు మేటిమాటలచేతను జేజేజడదారుల నేని మరు బారింబడ వేయుచుఁ దనమోముదమ్మిం గ్రమ్ముకొనుతుమ్మెదలదిమ్ముల కోపక వడివడి నడచుటంజేసి తడఁబడునడుగులు గలపూర్వచిత్తి కన్నుఁగొందున్ప్ సేయుటయు నొడ లెఱుంగక కలఁడు తనడెందంబున. 54

—♦ ఆగ్నీధ్రుఁడు పూర్వచిత్తిం గని మోహించుట ♦—

సీ. కనుపండువై మదిఁ గరఁచుచుండెడు నిది
పొంగారుబంగారుబొమ్మ యేమొ
బంగారుబొమ్మ కీపసతావి గల్గునే
పసి మించుజాజిపూబంతి యేమొ
జాజిపూబంతి కీసరితళ్కు గల్గునే
సరిక్రొత్తమెఱుపులజంట యేమొ
మెఱుపులజంట కీమెలఁకువ ల్గల్గునే
చెలరేగుమరునిరాచిలుక యేమొ
తే. మరునిరాచిల్క కీచిన్న లరయఁ గలవె
యలరునలరువిల్తునిపువ్వుములికి యేమొ
యెసఁగుపువ్వుముల్కి కీవన్నె లెన్నఁగలవె
కోర్కు లీడేర్చుముద్దులగుమ్మ యేమొ. 55

ఉ. ముద్దులగుమ్మయే నిజము పోలిచి చూచినఁ దోఁచెఁ దీని నే
నద్దిర జాళువాపసిఁడి యూ! మెఱుఁగారు మెఱుంగుగుంపులో
నిద్దఁపుజోతి యూ! యనుచు నెమ్మది సందియ మందఁ జేయునీ
ముద్దియ నెట్టిమంచిపనిముట్టులఁ జేసెనొ బమ్మ నేర్పునన్. 56

తే. జాళువాపైడిపొడియు జేజేలబువ్వఁ
బదనుగాఁ గల్పి దాన నిప్పడఁతిఁ జేసి
నలువ మెఱుఁగున మెఱుఁ గిడె నలర నిట్లు
కాదయే నిట్టిబాగ సెట్లు కలుఁగు నహహా. 57

తే. కోడెకాండ్రమదులు పట్టఁ గోరి మరుఁడు
పన్నియుంచినవల చుమీ కన్నెకురులు
గానఁ బెళుకుబేడిస లన నైనకన్ను
లేగుఁ గాఁబోలు జానుగులాఁగ లంట. 58

ఉ. ఈనడ లీయొయారములు నీసొగ సీబలుసీటు లీబెడం
గీనెఱిచూపు లీవగలు నీపస లీతగునేర్పు లీసొరం
బీనగుమోము నీతళుకు లీపెనువన్నెలు చిన్నె లెన్నఁగా
నీనవలాక చెల్లు నిదియే మరు నేలెడుబోఁటి గాఁ దగున్. 59

వ. అని తనమదిలోనం గోర్కెదైవాఱఁ గైవారంబు సేయుచుఁ జెఱకు
విలుకానివిరికోలలతాఁకులకుం దాళఁ జాలక లేచి దానికురంగటకుం
జని యి ట్లనియె. 60

మ. వెలఁదీ! యెవ్వరిదాన వెవ్వతెవు నీపేరేమి యెందుండి యీ
పొలఁతుల్ గొల్వఁగ వచ్చితీ వలరునిప్పాదోఁటకు న్మేటివై
వలఱేనిం గికురించి వచ్చురతివో వాఁ డంప నిం దున్నవా
రల నేచం జనుదెంచుపూ్రములికివో రా రమ్ము వా కి మ్ముగ్గిన్. 61

సీ. కలువకంటీ! నీవు కనుబొమ లనువిండ్లు
కనుచూపు లనుములుకులను ధరించి
వచ్చితి వని వేనిపై నిగుడ్తువో వెఱ్ఱి
మొకమన నై వని మెల గునట్టి
నావంటి వానిపై నడపింతువో కదే
వెఱపగుచున్నది వెలఁదిమిన్న
యస దైననీనడు మక్కట బలువైన
శృంగములఁ మోయ జిగిగల దగు

తే. నీదుమైపూఁత పొలమెల్ల నిండిపోయె
నీదువదనము చందురునెఱి వహించు
నీదుకన్నులు కలువలశోఁ దలపడు
నీవు నాభాగ్యదేవతవే వెలంది. 62

వ. అని పలుదెఱంగులఁ బలికిన నప్పలుకులు విని పైకి లేసికినుకం గనఁ
బఱచుచు నక్కలికి మెలఁకువం జంకించుచు నిట్లనియె. 63

మ. వినుమా యచ్చరమచ్చెకంటులతెగల్ వెల్గొందుచు న్నేర్పుపెం
పున నిం పుప్పతిలంగఁ బాడుటలు గోపు ల్మీఱఁగా నాడుటల్
ననవిల్కాఁ డతఁ డోజ్జగా నెఱేఁగి నానాటన్ జగం బెల్ల గె
ల్చినమే మీనినుఁ దెల్పి నల్వకేటుగాఁ జేయింతుమో చూడుమా.

వ. అని గద్దించి పలికిన దద్దఱిల్లకతం డమ్ముద్దియ యొద్దకు నొద్దికమీఱఁ
జని నిద్ద మగుతనసుద్దుల బుద్ధిపుట్టించిన నదియు నట్టిపనికి వచ్చినది
గావున దాని కియ్యకొని వానియిచ్చవచ్చినమచ్చున మెలంగె నతండు
నయ్యచ్చరమచ్చెకంటిం గూడి భూలోకస్వర్గంబులై యున్ననవఖం
డంబులందు సమస్తసుఖంబు లనుభవించుచు నామెయందు నాభి
కింపురుషుఁడు హరివర్షుఁడు నిలావృతుఁడు రమ్యకుఁడు హిరణ్మయుఁడు
కురువు భద్రాశ్వుఁడు కేతుమాలుఁడు నాఁబడుకొమారుల నేఁటే
నొక్కనిగం గని నూఱువేలసంవత్సరములు పూజ్యసామ్రాజ్యం బేలి
నాభికిం బట్టంబు గట్టి పూర్వచిత్తితో నిక్కంపుజగంబునకు నిర్గమించె
నంత నాగ్నీధ్రపుత్రు లగు నాభిలోనగుతొమ్మండ్రును మేరుపుత్రిక
లైనమేరుదేవి ప్రతిరూప యుగ్రదంష్ట్రి లత రమ్య శ్యామ నారి
భద్ర దేవనీతి యనుకాంతలం బెండ్లియాడి రంత వారిలో నగ్రజుం
డగునాభియు. 65

—♦ నాభికి మేరుదేవియందు శ్రీహరి వృషభుఁడై జనించుట ♦—

మత్త. మేరుదేవినిఁ బెండ్లియాడి యమేయవైభవ మేర్పడన్
భూరిరాజ్యము బాహుపీఠికి మోయుచున్ బుధు లెన్నఁగాఁ

బేయ ప్రమోసి జగంబునం గడుఁ బేర్మి పెంపెసలారఁగా
సారుమీఱిరేయు బిడ్డలం గనఁ జాల కెంతయు జింతమై. 66

వ. మంత్రిసత్తములయు బ్రాహ్మణోత్తములయు మంతనంబున వైష్ణవ
యాగంబు సేయం బూని భగవంతు నారాధించె నంతలోన. 67

సీ. జేజేలరాజాలజిగి డీల్పఁ జాలుమై
హారాంబట్టు రెంటెంబు డంబుమీఱి
నునుబోరఁ గౌస్తుభ మనుమానికపుఁబేరు
మొయిలఁ గాఱ్మెఱుఁగునా మొనయుచుండఁ
గెంగేలఁ దలకట్టుసింగాణివలమురి
గుడుసువా ల్గుదెయును గ్రొమరుమిగుల
నెలమి దేవేరులై కలిమిలేమయు నీల
యును నేలచామయుఁ దనరఁ గొలువ

తే. నెల్ల వేల్పులుఁ దబుసులు నెఱఁగుచుండఁ
గరువలిని దూఱువడి గలగరుడి నెక్కి
కొడుకులకుఁ దన్నుఁ గొలిచెడుపుడమిఱేని
కడకు వేంచేసె మిగుల నక్కఱిక మొప్ప. 68

వ. ఇట్లు పొలిచి నాభిం బిలిచి నీ కేమికావలయు నెఱింగింపు మిచ్చెద
ననిన నతండు భక్తిఁ దళుకొత్త నతనియడుగులం బడి చాఁగిలి మ్రొక్కి
దేవరా! నీకుఁ బురుఁ డగుబుత్త్రు నొసంగు మని వేఁడుటయు నాతండు
నాకుఁ బురుడు నేన కాని మఱియొక్కరుండు లేఁడు కాన మీకు
నేను గొమరుండనై పుట్టఁ గల వని పలికి నెసరుఁ జూపుచుం జూపు
లకుం జూపట్టకంతర్ధానంబు నొందె నంత మేరుదేవియు. 69

శా. చూలాలై తగ నీరుమోసి కడుకొంచుం బున్నెముం గూర్చుచు
న్మేలీ నొలగనంబునందుఁ గనియెన్ వెల్గొందుమైవానినిన్
జాలం దేజునఁ దేజరిల్లుమొగము న్జానొందుకన్దోయియున్
గాత్రల న్మద్దులుఁ గుల్కువానిఁ గొమరున్ రాచిన్నె నొవెన్నునిన్.

మత్త. అంతఁ బుత్త్రకుఁ డైనవెన్నుని నల్లపొక్కిలిపేఱితేఁ
డెంతయేనియు సంతసంబున నెంచి ప్రేముడి కొంతయున్
గొంతభక్తియు నల్లమం దయి గొప్పగాఁ బెనవేయ నో
క్కింత నిల్వక యింటఁ బారుల కిచ్చె సొమ్ములు వేనవేల్. 71

తే. తెలుపుడాల్గలనేనును బలితమైన
బలిమియును జాలఁ దేజును గలకొమారుఁ
దెలివి నారసి నాభి పేర్వెలయఁ జేసె
ఋషభుఁ డనుచును జగమెల్ల నెఱిఁగి కొనఁగ. 72

వ. అంత నాఋషభుండు శుక్లపక్షశశాంకునిపగిది నాఁడు నాఁడునుం బెఱిఁగి పెద్దవాఁడు గా నెఱింగి తండ్రి తనభుజంబునం గలభూభారం బతనిభుజంబునం బెట్టి పడంతితో నడవుల కరిఁగె నంత ఋషభుండును.

క. పితరులయట్టులు నెమ్మది
మితి యింతయు లేనినెనరు మీఱఁగఁ బ్రజలన్
సతమును జేకొని విడువక
బ్రతికించుచుఁ బుడమి నేలె రాయం డగుచున్. 74

చ. అరయఁగ వెన్నుఁ డాఋషభు డంతట మబ్బులనెక్కురౌతుచే
నరుదుగ నీయఁగాఁ బడి జయంతి యనంజనుకన్నెఁ బెండ్లియై
భరతుఁడు దొట్టిపుత్త్రులను బాగుగ నూర్వురఁ గాంచె నందు నా
భరతునిపేర నిప్పుడమి భారతవర్షము నాఁ దలిర్చెడున్. 75

వ. ఆఋషభపుత్త్రులు నూర్వురిలోఁ బదుగురు పదుగు రొక్కసంఘంబుగ నేర్పడి రాపదిపుత్త్రదశకంబులకును గ్రమంబుగా భరత కుశావర్త ఇలావర్త బ్రహ్మావర్త ఆర్యావర్త మలయకేతు భద్రసేన ఇంద్రస్పృక్కు విదర్భ కీకటు లనువారు ప్రధాను లైరి. మఱియుం గలవారిలోఁ గవి హరి యంతరిక్షుఁడు ప్రబుద్ధుఁడు పిప్పలాయనుఁడు ఆవిర్హోత్రుఁడు ద్రమిళుఁడు చమసుఁడు కరభాజనుఁ డనుతొమ్మండ్రు గుహ పరమభాగవతోత్తములై వైరాగ్యభాగ్యసంపన్ను లై సన్న్యాసి

కెక్కిరి. తక్కినయెనుబదియొక్కరు గృహస్థాశ్రమమంద యుండి సాంగ
వేదాధ్యయనము చేసి సదాచారసంపన్నులై బ్రాహ్మణు లై రవ్వల
ఋషభుండును కేవలానందస్వరూపుఁడై తా నీశ్వరుం డయ్యుఁ బ్రా
కృతుండు వోలెఁ గర్మము లాచరించుచు సర్వభూతసమత్వము గలిగి
రాగకలుషితుండు గాక గృహస్థాశ్రమమంద యుండి యజనాభం
బనునిజదేశముం బాలించుచుఁ బెక్కేండ్లు పుడమియేలి యొక్కనాఁడు
బ్రహ్మవర్తమునం గలకొడుకులం జీరి యి ట్లనియె. 76

—♦ ఋషభుఁడు కొడుకులకు నీతు లుపదేశించుట ♦—

ఉ. తల్లియుఁ దండ్రి యన్నలును దాతలు మామలు దొట్టిచుట్టలుం
జెల్లిననెయ్యురుం దనకుఁ జెప్పినచొప్పున మెట్టుచుం జగం
బెల్లెడ మంచివాఁ డనుచు నెన్నఁగ నై వడు గైనపిమ్మటం
దెల్లము మూఁడుసందెలను దేవరఁ గొల్చుచు వార్వఁగాఁ దగున్.

చ. కొలమున రూపునన్ వయసుకొప్పున నేర్పునఁ జూపునం గొనం
బులఁ దన కీడుజో డయినపొల్తుకఁ బెండిలియాడి జన్నముల్
వెలయఁగఁ జేసి పుత్త్రులను వేడుకఁ గాంచి జగంబునందు లే
డలరెడురాయఁ డొండొకరుఁ డం చనునట్లు మెలంగఁగాఁ దగున్. 78

క. పుడమిఁ గలతనదుప్రజలను
కొడుకులఁ బలె నెమ్మి నేలుకొని నేర్పలరన్
గడుసరి వారలఁ బ్రిగడల
నిడుకొనఁ దగుఁ దనదు చెంత నెకిమీని కొగిన్. 79

సీ. తన్ను మించినయట్టిదాయతో నెదిరింపఁ
జన దెట్టులైనఁ బొం దొనరుప నగుఁ
దనకన్న నలఁతియై తారసించినతేని
గెలిచి వానిసిరులు వలయుఁ గొనఁగఁ
దగునట్టు లునిచినదండుల కెల్ల నొ
క్కదళవాయి వలయు గండుమగఁడు

మనువుమాటలు నేర్చి చనవు మీఱినయట్టి
ప్రెగ్గడనుడియంద పెఱుగ నగును
తే. జెలఁగఁ దగినట్టి వెచ్చంబు సలుపవలయుఁ
గొడుకుకుఱ్ఱలకేఁ జను విడఁగఁ జెల్ల
దేడుచెడుగుపనుల నెప్డు వీడ నొప్పఁ
బుడమియేలిక యగువాఁడు కొడుకులార. 80

సీ. నాకన్నసుతులార ! లోకములఁ మర్త్య
దేహము దుర్లభమై హరువగు
దానిఁ గామాదులకే నియోగించిన
దనకుఁ బసికి భేద మనఁగ నెద్ది
దేహి సంసారమందే బుద్ధి నిలుపక
భగవదర్చన సేఁత పాడి యగును
రాగభోగములు నిర్బంధహేతువు లగుఁ
గాన నట విరక్తిఁ గాంచు టొప్పు
తే. సుఖము దుఃఖము సమముగాఁ జూచుకొనుచు
నింద్రియార్థముల జయించి యీశ్వరు నెద
నిలిపి విజ్ఞానకలితుఁడై నిరతభక్తి
భరితుఁడై యుండి ముక్తినిఁ బడయు టొప్పు. 81

చ. ప్రకృతివిలక్షణం బగుచుఁ బ్రస్తుతి కెక్కెడునాత్మతత్త్వమున్
సుకృతులచెంత నేర్చుకొని శుద్ధమనోంబుజుఁడై జనుండు లో
సకలచరాచరంబులకు స్వామియు భూమియునై జగజ్జన
ప్రకరము లేలునీశ్వరుని భక్తి భజించి కృతార్థుఁ డయ్యెడున్. 82

సీ. కర్మవాసనఁ జేసి కలుగు నహంకార
మమకారములు వానిమహిమవలనఁ
దలసూపెడు నవిద్య దానివలన దేహ
సంబంధ మగు దానిసంగతిమెయి

మఱియును గర్మసంబంధము తాపము
సంభవించును దాన జన్మము మృతి
తెగక యెప్పటికిని మొగి చక్రి మట్టులు
తిరుగుచు నుండు నాదేహి సతము
తే. పుత్రమిత్రకళత్రముల్ ధాత్రి యెల్ల
స్వప్నతుల్య మనఁబడు నశ్వరము లగుచు
దానికై చింత సేయక తనకుఁ జావు
పుట్టువులు లేనిమార్గముం బట్ట వలయు. 83
సీ. ఈశ్వరభక్తియు నీశ్వరారాధన
మీశ్వరదాస్యము నెపుడు కోరి
భక్తియుఁ జ్ఞానము పడసి భక్తులచెల్మి
భగవత్కథల విన వలయు నెపుడు
సర్వసమత్వంబు శాంతియు దాంతియు
సాధనంబులు తద్విచారమునకు
మఱియు విషయవాంఛఁ దొఱఁగుటయును సర్వ
సమబుద్ధియును దపశ్చర్య జనుఁడు
తే. గలిగి సర్వసంగపరిత్యాగకలననలన
బంధమును వీడఁ గలిగియు భాగవతుల
సంగమము వీడ కెప్డును స్వాంతమందు
నీశ్వరధ్యాన మొనరింప నెసఁగు ముక్తి. 84
వ. మఱియు నిర్వైరంబును సర్వసమత్వంబు నుపశమంబు పరిశుద్ధాహార భక్షణంబు మనోబుద్ధ్యహంకారవిజయంబును శ్రద్ధయు భక్తియు బ్రహ్మచర్యంబును మౌనంబు నివియు నీశ్వరజ్ఞానంబునకు సాధనంబులు జనుండు వీనిం దెలిసికొని యవిద్యారూపకకర్మబంధంబు యోగంబు నం జేసి తెగదెంపులు గావించుకొని శ్రేయస్సు లెట్టివో తత్సాధనంబు లెట్టివో తెలిసి హేయంబులఁ విడి యుపాదేయంబులదిక్కు బుద్ధి నిలిపి తత్త్వదర్శనంబు గావింప వలయు మఱియును. 85

ఉ. వేఁడు దురర్థసంగతుల వేసట నొందుచుఁ గర్మబద్ధుఁడై
పాడయి పోవు నాతనికి భక్త్యుపదేశము చేయ కుండునో
వాఁడు గురుండు గాడు మఱి వాఁడు విభుండును గాడు తండ్రియున్
గాడు వచించితిన్ హితము గా దిలి పుత్రకులార వింటిరే. 86

ఉ. సత్త్వగుణప్రధాన మగుజన్మము గల్గిననాకు మీరునున్
సత్త్వగుణప్రభూతమును సంహననంబును బొందినట్టి రేన్
దత్త్వము మీ రెఱుంగునటు దారి వచించితి మీర లెల్ల నా
తత్త్వ మెఱింగి సాధుగుణతత్పరులై పొలుపొందుఁ డిద్ధరన్. 87

వ. మఱియు నోబిడ్డలారా! లోకంబునం గలయెల్లవారిలో భగవద్భక్తులు శ్రేష్ఠు లని వేదశాస్త్రంబులు సాక్ష్యం బిచ్చుచున్నవి మఱియు స్థావరంబులకంటె జంగమంబులు శ్రేష్ఠంబులు వానిలోఁ గీటాదులకంటెఁ బశ్వాదు లుత్తమములు వానికంటెఁ మనుష్యులు వరిష్ఠులు వారికంటెఁ బ్రమథులు వారికంటెఁ గంధర్వులు వారికంటె సిద్ధులు వారికంటెఁ గిన్నరాదులు వారికంటె నసురులు వారికంటె నింద్రాది దేవతలు వారికంటె దక్షాదులు శ్రేష్ఠులు వారికంటె రుద్రుండు శ్రేష్ఠుండు వానికంటె బ్రహ్మదేవుండు శ్రేష్ఠుండు వానికంటె విష్ణుం డగునేను శ్రేష్ఠుండ నాకంటె బ్రాహ్మణులు శ్రేష్ఠు లని చెప్పి యతం డట నున్నబ్రాహ్మణులం జూచి. 88

ఉ. బ్రాహ్మణులార! లోకములఁ బాఱఁగఁ జూచిన నెందు నేనియున్
బ్రాహ్మణజాతికిన్ సవతువచ్చెడుజాతి మఱొండు లేద యా
బ్రహ్మము వారిచిత్తముల భాసిలుచుండును హవ్యకవ్యముల్
బ్రహ్మముఖంబునం దిడుట వహ్నిముఖంబునకన్న మిన్నయే. 89

ఉ. వేదము నాశరీర మది విప్రులు దాల్తురు గాన వారు లో
నేదినమందు నేను వసియింతును సత్యము వారిసొమ్ము కృ
చ్ఛ్రాదితపంబు దాంతియును నంతతశాంతియు గల్గి యుండ్రు త
త్పాదజలంబు లోకమును బావనముం బొనరించు నెంచఁగన్. 90

వ. ఓనాతనయులారా! చరాచరాత్మకంబగునీసర్వప్రపంచమును నాశరీరము
గావున మీ రెప్పుడు భూతద్రోహము చేసి నాకుఁ గష్టంబు
గలిగింపకుండుఁ డదియ మదారాధనం బని ఋషభుండు పుత్రుల కనేక
విషయంబులు బోధించి తనకుమారులలో జ్యేష్ఠుండును గుణగరిష్ఠుండు
నగుభరతుని సామ్రాజ్యపట్టభద్రుం గావించి సవనాగ్నుల నాత్మా
రోపణంబు చేసికొని మేనం గోకచుట్టక వేదురుచందంబున నెఱులు
విఱియఁ బోసికొని బ్రహ్మావర్తంబునుండి వెఱ్ఱి గుడ్డి చెవుడు
మూఁగయుం గలవాఁడు బలెఁ బ్రవర్తించుచు మార్గమధ్యంబున
నేరితోడను మాఱు వలుకక పిశాచగ్రస్తునిచందంబున నున్మత్తుని
మాదిరి నొకచో నొకగడియయేని నిలువక యెల్లయెడలం దిరుగుచు
నొరులు తిట్టినను గొట్టినను గడన సేయక కొండచిలువనా నొకచో
బండి నోటఁ బడినఱాలైన నమలి తినుచు స్వస్వరూపజ్ఞానముం
గలవాఁ డగుటచే నహంకార మమకారంబులు విసర్జించి బ్రహ్మ
సాక్షాత్కారంబున నంతటను సమబుద్ధిం జేయుచు నేకాకి యై
క్రుమ్మరుచుఁ గొన్నిసంవత్సరంబులు గడపె నాసమయంబున 91

సీ. వానిశిరోజముల్ వడిసి జడలు గట్టి
వ్రేలాడుచుండెను నేల మీఁద
దొప్పెడుచింపియే నప్పుడు లేకుంట
బీతు గొల్పెను మ్రోడురీతి నగుచు
మలమూత్రములలోన మిళితమై నెమ్మేను
పరిమళించెడు జాజివిరులపగిది
వనుల గుబాళించువానిమై వ్రాలంగ
ఝుమ్మ రంచును దేంట్లు గ్రమ్ముదేఱు

తే. నడుచుచును ద్రావుఁ దిను విట్టు విడుచు దారి
నడుసు తొడుసును ఱాలు ముండ్లనక పఱచు
విడక తా నేరితోడనో నొడువునట్లు
గొణుగుకొనుచుండు నవధూతుఁ డగునతండు. 92

వ. ఇట్లు ఋషభుండు దేహాభిమానరహితుండై భూమండలమున సంచా
రము చేయుచు నొకప్పుడు కొంకణము వంకపటము కుటకము నాఁ
బఁడుదక్షిణకర్ణాట దేశంబులకుం బోయి కుటకాచలసమీపమున నున్న
యుపవనములందుఁ దిరుగాడుచు నోటిలో నొక్కఱాయి పెట్టుకొని
జటాకటాహంబువీడి నేల జీరాడ మెట్టుచుండ నట నొకచో దావాగ్ని
పుట్టి బెట్టు విహరించుచు ఋషభుని దేహంబు తనలోనం జేర్చుకొనియె
నిది యోగచర్యావిశేష మగుమోక్షమార్గము నవధూతాశ్రమవిశే
షంబులును బోధించుటకు స్వీకరించినఋషభునియవతార మిది చది
విన వారికి వినినవారి కెల్లశుభంబులు సంప్రాప్తంబు లగు నింక నాతని
సుతుం డగుభరతునివృత్తాంతము చెప్పెద సావధానుండవై విను మని
శుకుండు వెండియును. 93

—♦ భరతోపాఖ్యానము ♦—

చ. తనభుజమందు నీపుడమిఁ దాల్పుమటంచును దండ్రి పెట్టిపో
యినతరువాత నాభరతుఁ డేలికయై ప్రజ మెచ్చునట్లు కూ
ర్పునిగొద నేలుచుం బాలమురాఁబడిలోపల నార్యపాలొగిన్
దన కగుకప్ప మంచుఁ గొని తాఁ బ్రజకై సెల వెన్ని చేసెదున్. 94

క. తమ్ములఁ బ్రేముడిఁ దోంబది
తొమ్మండ్రను దనకుఁ జేతికోడుగఁ గొని తా
నెమ్మొయి నెమ్మది నేలె య
శమ్మది కడు బలిసి మూఁడుజగములు నిండన్. 95

తే. తగినప్రెగడలఁ బ్రోడలఁ దనదుచెంత
నిలుపుకొని వారనుడులంద మెలఁగుచు నెపు
డెట్టిగొదలు నేరికి నంట నట్టుపంట
నాతి ప్రజఁ గన్నయ ట్లేలె నాతఁ డపుడు. 96

చ. తనర నతండు నేమమున దక్కినపుం దెసనుండి మంచుగ
ట్టున కొకమాఱును న్మాఱఁ గడుందగఁ బడ్మరనుండి తూర్పువై

పున కొకసారెయుం బుడమి పాల్చినదాఁక సవంబు లెన్నియే
నొనరిచె నొక్కదానిసుద నొక్కటిగాఁ దగ వైచి శాలలన్. 97

ఉ. ఆతఁడు నాలుగుం దెసలయందును గెల్చును గొన్నచిన్నె కై
పాఁతినపొన్నుకంబములపట్టున జన్నపుమేటికంబముల్
పాఁతెను గవ్వ మిచ్చి కొలువం దొర లిచ్చలు దీర్ప వేల్పులున్
బాతరలాడుచుం డ్రితనివాకిటఁ గ్రిక్కిరియంగ నెప్పుడున్. 98

ఆ. విశ్వరూపుఁ డనెడు పేరఁ దలిరెడు
సామికూఁతుఁ బంచజనియనంగ
మించుకన్నెమిన్న మంచిలగ్నమునందుఁ
బెండ్లియాడె నతఁడు గొండ్లి మీఱ. 99

తే. భరతుఁ డాపంచజనియందుఁ బడసె సుమతి
రాష్ట్రభృతు సుదర్శను నాచరణుని ధూమ్ర
కేతువును గాంచె నేవురఁ బ్రీతి సుతుల
భూతపంచక మన వారు పొదలి రవల. 100

తే. తండ్రి లేలినకరణి నాతండు చేత
లన్ని విడువక పంటతొయ్యలిని నేలె
నంతమేఱయుఁ దనపేర నపుమ నిపుడు
డంబుమీఱెడు భరతవర్షం బనంగ. 101

వ. ఇట్లనేకసత్కార్యంబు లొనర్చుచుఁ బ్రజలఁ దాఁ గన్నప్రజ లట్లు
గారవంబునం జూచుచుఁ బదివేలసంవత్సరంబులు రాజ్యపాలనంబు
గావించి తనమనంబు లచ్చిమగనియందుఁ గలియం గూర్చి పుడమి
యెల్ల కొడుకులకుం బంచి యిచ్చి లచ్చి కాటపట్టగునిల్లు నిల్లాలినిం
బెడబాసి చక్రనదీతీరంబునఁ బులహామున్యాశ్రమం బగుసాలగ్రామ
క్షేత్రంబునకుం జనె నదియును. 102

చ. కలుకున నేస్తు లేనుఁగులగొంగలు గోరిక నాలు నాలదిం
డ్లెలుకలు నెక్కగొంటు లొకయింతయు లోఁనెడలేక యందునన్

గలజడదారిరాయులకుఁ గల్గినతేజున నొక్కకొంతుగా
నలరెడు నల్లకానఁ గొనియాడఁగ నా ననరాదు బ్రిహ్మకుర్. 103
మ. నడిరేదాఁ కలకానలోనఁ గడుఁ జెన్నారంగ జేజేనుడు
ల్కలచక్కం జడదారిపుత్త్రికులు వల్కంగా నెడం గొంకుల్
లలి నెంతే నిదురించుచున్నయెడ నైన న్మేలుకో లేగుదేఁ
జిలుక ల్గోరలు దిద్దు నున్నటులు జేజే లెన్నఁగా నొజ్జలై. 104
తే. పౌనర హరివాణముల నిల్పి పూజఁ జేయఁ
దగినజా లెందు తండోపతండములుగ
నుండి యాడుచునుండు నాగండకి యను
వాఁక యక్కానయం దొగిఁ బాఱుచుండు. 105
క. ఆపులహానునికిపట్టున
బాపనరేజేండ్లఁ గూడి భరతుఁడు మదిలో
నీపగిది యంచు నడువఁగ
నోపనికడుభక్తి వెన్ను నుడుగక కొలుచుర్. 106

— ♦ భరతుఁడు తపించుచు లేడిపిల్లం బెంచుట ♦ —

వ. మఱియు నతం డన్నియుం బెడఁబాసి యొం డేమి యెఱుంగక భక్తిం దగిలి సంతసంబున నేను చమరించి గగుర్పొడువ నల్లనయ్య నుల్లంబునం దిడుకొని నేమంబున నిరాబారియై తపమ్ము గావించుచు నిట్లుండఁ గొన్ని యేండ్ల కొక్కనాఁడు. 107
ఉ. గండకి నాఁకఁ జేరునను గ్రొలెడువాఁకకు నేగి యొక్కచో
మెండగుభక్తి నాడి తననేనియస ల్వెడనాడి నీటిలో
రెండుగడె ల్మునింగ యమరెం దొలిపల్కల కెద్ది తొల్లియై
యొం డగునట్టియక్కరము నొయ్యనఁ బల్కుచు నుండె నంతలో
మ. పౌనరం జూల్కొని నీరుమోయుచు నెలల్ మూఁడాఱుగాఁ గుత్తుకు
త్తనుచు న్మెట్టుచు నెట్టకేలకును నీ రానంగ నయ్యేటికిన్
జనుఁ దెంచెం గడునాస జింకనవలా చాలంగ నై కాఱుకెం
డను నోరెండఁగఁ జేయునట్టిదగతోడన్ రెండుజాల్పొద్దునన్. 109

తే. వచ్చి డిగి నీరుద్రావుచో నచ్చోటి కొక
యింతదవ్వుల మెకముల నేలుమేటి
పాటి యింతనరానట్టిపగిది యెగసి
బొబ్బరించె దెస ల్మాఱుమ్రోసికొనఁగ. 110

చ. అది చెవులందుఁ బెద్దపిడుగట్లు పడం గడుబీతుఁ జెందియు
న్నెదరియు బెగ్గడిల్లియును నివ్వెఱపాటును ఱిచ్చపాటునుం
గదురఁగ నల్ల లేడి వడి గాడుపుతండ్రిని ముట్ట లేచి యం
గద గలుగంగ నేటిదరి గట్టుపయిం బడి చచ్చెఁ బోటునన్. 111

తే. ఇట్లు పడునట్టియదనున నిఱ్ఱిచెలికి
కడుపు దిగజారి పూవిలుకానియింటి
త్రోవ నీళులఁ బడి బిడ్డ చావకుండ
నాడె దైవము కూర్పిన నట్టియెడల. 112

చ. భరతుఁడు కన్ను విచ్చి తనప్రక్కన నీళులఁ దేలి యాడుచున్
జరిగెడు లేడిపిల్లఁ గని సంతసము న్నెనరుం దలిర్పఁగాఁ
బరుగునఁ బోయి పట్టుకొని బందుగు లెవ్వరు లేనిదీని నే
నరసినఁ బున్నె మౌ ననుచు నప్పుడ తోకొనిపోయె నున్కికిన్. 113

క. తోడుకొనిపోయి మిక్కిలి
వేడుకతోఁ బాలు పోసి పెంచుచు దానిం
గూడి పెఱపనులు విడిచియు
నాడుకొనుచు నిలిచె భరతుఁ డదియే పనిగాన్ 114

శా. నీట న్మునుగుట సంధ్యవార్చుట తఱి న్నీర్పాపలో వేల్చుటల్
గూటంబుం బెడఁబాపుఁ బున్నెపుఁగతల్ లో నెంచుట ల్గోలె నై
పాటింపం దగుమంచికర్జములునుం బ్రాల్మాలి పోకార్చె నా
నీటం బట్టిన లేటిపిల్లకొఱకై నేమంపురాయం డొగిన్. 115

వ. ఆరాచదబిసియు నిట్లల్లారుముద్దుగ నున్ననాయిఱ్ఱిపిల్లఁ దనయునికి
పట్టునం బెట్టుకొని యెడతెగనికనికరంబునఁ గూరుచుండెడునపుడును

బండుకొనెడు నెడనను నీరాడెడునదనునను బూలుc బత్తిరిc బండ్లనుం దెచ్చునజ్జునను వేల్పులం గొలుచుతఱిని తనయొద్దన యునుచుకొను చుc బులి సింగం బెలుcగు తోడే లేడిక లోనగునడవిమెకంబులవలని బీతునc బొలంబుల వెనువెంటం దిరుగులాడుచుc గొంతదనుక భుజం బుల నెక్కించుకొని మోయుచు మఱికొంతసేపు తొడలమీcదం గూర్చుండంబెట్టుకొని ముద్దులాడుచు నొక్కింతతడ వక్కునం జేర్చు కొని సంతసించుచు నదియ పనిగా నుండి నిచ్చలునుం జేయుచేంత లందదుకులుగా నెడ నెడ లేచి చూచుచుc బెక్కెండ్లు బ్రదుకు మని దీవించుచుc జెంతcజేర్చికొని మిక్కిలి చెలిమిం చేసి యక్కఱగండcడై యాcకలంబులును దుంపతూండ్లును గడ్డికసవులును బాలు నీళ్ళునుం బోసి పెంచుచుండె న ట్లంటసిల్లి పెఱుగుచున్న యాజింకపిల్ల యొక్క నాc డేరికినిం గానరాకుండc గికురించి చొcకళించి యెటయే నూడ నిం బాడె నంత నాతండు దాని నెంతయేc దడ వబ్బాలాడుచు నెమ కియుc గాన కక్కిలిపడి తన్నుc బెడc బాసి పోకకు మిగుల వగలం బొగులుచు దాని నెడcదం దలంచుచు ని ట్లని పలవించె. 116

—♦ భరతుcడు తప్పిపోయినలేడిపిల్లకై దుఃఖించుట ♦—

మ. అకటా! నాచిటిపాప న న్విడిచి నీ వడ్డింతలే కేగితే
మొకమోటంబును బాసితే యడవి నేమోసంబునే జెందితే
యొకలోయం బడి దారితప్పితె మెకం బున్నట్టిచో టంటితే
సెకలోc జొచ్చితె పచ్చిక ల్మెసవుచుc జెర్లాడుచు న్నిల్చితే. 117

ఉ. కన్నులు ముక్కు మూసికొని కా ల్గదలింపక నేమ మంది నే
నున్నెడc జిన్నికొమ్ముకొన నొయ్యనc గోcకుచు మేను నాcకుచుం
గన్నులు మోము మూర్కొనుచుc గాళ్ళపయిం దలవెట్టి పండుచుc
న న్నెపు డంటియుండుc నిను నాతర మే పెడc బాసి యుండుటల్. 118

సీ. అలికి ముగ్గులు వెట్టునలవేల్పుటరుcగుపై
నెలమిc బన్నుందువా రెవ్వ రింక

నగ్గుల వేల్పంగ నమరించుతెలులే
యిగురులు గొఱుకువా రెవ్వ రింక
సాములఁ బూజింప సంతరించినపూల
నెసఁగి మూర్కొనెడువా రెవ్వ రింక
జేజేల దానంబు సేయింపఁ దెచ్చిన
యింపునీ రానువా రెవ్వ రింక

తే. నేలికకు నారగింపు సేయింపకమును
బువ్వ బుక్కెడు మెక్కువా రెవ్వ రింక
నెపుడు నను ముద్దుగుడుపువా రెవ్వ రింక
నీవు విడనాడి పోయినయింతలోన. 119

వ. అని పలు దెఱంగులఁ బలవించుచు నతం డుల్లంబున మిగుల నారాటంబు జెంది నేను దపమున నున్నయెడ నన్నుఁ గొమ్ముల గోఁకుచుండునట్టిగోనంబు లే నెన్నఁడు గందునో? నే నించుక కసరినం గని కొమరుండుబలె నెడఁ జని నిలిచి పిలిచిన మఱియువచ్చి వెనుక నిలిచి యుండునట్టిమెలఁకువలుగలదాని నెప్పుడు చూతునో? యది యెప్పుడు వచ్చి నన్ను సంతసపఱచునో? లేడిత్రొక్కననేల జన్నంబుల కగునను టం జేసి యీతోఁట లెంత పున్నెముం జేసికొన్నవో? జాబిల్లి యట్లు నేను నీతల్లి లేనిపిల్లం బెంచినం బున్నెం బని చేకొంటి నట్టినే నిట్టియిక్కట్టులఁ బొంద నయితి నక్కటా! దైవమా! యని దానిపైఁ గలతమకంబునఁ జాల విరాళిం దూలుచుఁ దనతపం బంతయుం జెడ జడనువడి యుండె నంత నొక్కింతసేపున కాఱింకబుడుత చను దెంచి రాచతపసికన్నుంగవకుం బొడకట్టుటయు నతండు పోయినసొమ్ము వెండియుం జేకొన్నవానింబలె మిగుల సంతసించుచు దానిం జేర నరిగి మోరంబట్టి ముద్దు పెట్టుకొనుచు మే నెల్ల నిముడుచు శిరంబు మూరుకొనుచు నందిటం జేర్చుకొని యి ట్లనియె. 120

మ. జలకం బాడఁగ లేదు సంధ్యయును బెల్చ న్వార్వఁగా వేదు రే
పులు మాపుల్దగ వేల్పలేదు కరివేల్పు న్గొల్వఁగా లేదు నీ

ఖలునే న్ద్రావఁగ లేదు నిద్దు రది యెట్లో చూడఁగా లే దయో
యెలకూనా! నను వీడి పోయి యెటనో యీవున్నయీయింతలోన్.

ఆ. కంటఁబడినవారిఁ గంటిరే నాబిడ్డ
ననుచు నడిగి యడిగి యడవు లెల్లఁ
దిరిగి తిరిగి యెందు నరయ నోపక పెలు
తల్లడిల్ల నైతి తల్లి కాన. 122

ఆ. కంటఁ బడితి నాదుకడ తేఱఁగానున్న
యుసురు కుదుటఁ బడియె మిసిమిఁ గంటి
మంటి పసిఁడికొండ యింటఁ జేరినయట్లు
లోఁ దలంచుచుంటి నాదుకూన. 123

వ. అని మిగుల వగలం బొగులుచు స్నానంబును సంధ్యయును జపంబును
దపంబును లోనగునన్నియును విడిచి దానిఁగోడం గూడిమాడి యుండె
నని శుకుండు వెండియును. 124

మ. తగులంబుల్ పెడఁబాపుఁ బున్నె మనుచున్ దా నాతఁ డల్లప్డు బం
దుగుల న్నెయ్యుర నిళ్ళు వాకిళులునుం దోరంపురాలచ్చియున్
దగునేల న్విడనాడి బోడి యగుచున్ దాల్ ఆప్పలుం జెట్లు చే
మగముల్ గల్గినకాన మెట్టుచుఁ గటా! మా నీగెఁ గన్గొంటివే. 125

మ. ఇలు నిల్లాలును బుత్త్రిలున్ జగమునం దెవ్వారికి న్వొండి గా
ముల నెత్తింపఁ బునాదు లంచు విడి యాభూతంబు భూతంబునాఁ
దలఁప న్జేరిన లేడిపిల్ల చెలిమిం దా జీంద్రమం దెంతయో
గలఁగె న్వింటివె! బ్రహ్మవ్రాలు తుడుపం గాఁ జాలునే యెవ్వఁడున్.

ఆ. ఎంతవారి కైన నేకిమీఁడులకు నైన
వెన్నదొంగ కైన వేల్పుఁదపసి
కైన నొసలివ్రాఁత కన్న లేదన్న చో
నెఱుఁగ మ్మానిసు లన నెంతవారు. 127

మ. ఎకిమీఁడా! విను మంత నల్లభరతుం డేం డ్లెన్నియే నట్లు కా
నక వేగించుచు నొక్కనాఁడు తనకుం జావంగ నోచొప్పు కొం

చకయే తెంచినజాడఁ గాంచి మదిలోఁ జాలంగ నారాట మొం
ది కదుఁ జేరుననున్న జింకబుడుతన్ దేర్పారఁగాఁ జూచుచున్. 128

తే. ఓసి ! ననుఁ గన్నబిడ్డ ! ని న్నాసి పోక
వచ్చెఁ దలమీఁద జేనంత వఱలు మిత్తి
చావు నిక్కంబు కటకటా ! చేవ తేని
యీ విఁ కెట్టులు బ్రదికెదవే తలంప. 129

మ. అని దానిం దలపోసి పోసి మదిలో నారాటమున్ హెచ్చ వి
చ్చినకన్నుం గవ నిట్టిఁ జూచుకొనుచున్ జీఁకాకునుం జెంది చి
క్కనగాఁ గుత్తుకలోనఁ గళ్లె మెలఁగంగా గుఱ్ఱు రెట్టింపఁ జ
ల్లనియొంటూర్పున నుండి కొంతవడి కల్లం జెందెఁ బెన్నిద్దురన్. 130

— భరతుఁడు లేడియై పుట్టుట —

చ. ఉసు రొదలి న్వడిన్ విడిచి యుప్పరవీథికిఁ బోవునప్పు డా
విసువును నెమ్మది న్నిలిపి నెయ్యము పెంపున నుండెఁ గాన న
ప్పస చెడియున్న లేఁడు కడుఁ బాటులపా లయి పోవ వెండియుం
గసవును మెక్కవిట్టి యయి కస్తికిఁ బుట్టెను దొంటితెల్విసోఁకన్. 131

చ. కడుపున నున్నయప్డు తనకాళ్లును జేతులు నే న్గదల్ప రా
కడఁగొనఁ బేవులుం బొరలు నంతటఁ జుట్టుకొనంగ కుళ్ళు విట్టు లోఁ
బడి కడు నెమ్మి లొత్త వెతపా లయి యిట్టినిసుంగు తెల్విమైఁ
గడువడి బమ్మరిల్లెఁ దనకర్జము చేఁతకుఁ దల్లడిల్లుచున్. 132

చ. వెనుకటిబాములందుఁ గఱివేల్పును గొల్చినవాఁడు గాన నం
దున నపు డిట్టియై పొడమి తోరపుఁదెల్విని బాముకుండి లో
ననయము నట్టిబాము తన కప్పుడు కల్గుట కెంతయేనియున్
గనలుచుఁ బిమ్మటం బడుచుఁ గాఱియ నొందుచు నేడ్చుచుండెఁ బో.

ఆ. తల్లిపాలు గుడుపఁ దారసించినముట్టి
పొదుగు చెంతఁ బెట్టి కొదుగుఁ గాని
కడుపునిండఁ బాలు గుడువ నొల్లదు వెన్నుఁ
దలఁచు చొడలు మఱచి నిలిచెఁ గాన. 134

సీ. వడి మెట్ట పడు గెటఁ బడి చీచు చచ్చునో
యనుబీతునను బొలమందు నెపుడుఁ
గసవు మేయదు దాని కుసురు గగ్గెడు నది
తలఁ ద్రెంప నెంత పొగులునో యనుచుఁ
దెఱచి నీరాన దే చిఱుచేఁప నోటిలోఁ
బడి నల్గునో యని వెడఁదవగను
జేలదరికిఁ బోదు రాలి యెన్నులగింజ
లలకాపరికిఁ జెదు గగు నటంచుఁ

తే. దనదుకతమున నేఱి కెత్తఱిని గొదలు
కలుఁగ కుండఁగ నెండుటాఁకులును నెండు
గడ్డియును మేసి యిన్నినీ ళ్ళడ్డి త్రావి
బ్రదుకు నేవగించుచుఁ దనబామున కది. 135

సీ. తెఱనోటిమెకముల కిఱవైనబలునీర
ముల కేగు నొకమాటు తలఁకు మాని
తనవారితోఁ గొండకొన కేఁగి తిరుగుచు
నుంకించి పడుఁ గ్రింద కొక్కమాఱు
పెనుదారి దారసించినవాఁక నడుమ నీఁ
దక యుండు నొకసారి తల ములుగఁగ
నడవి నల్గడల నేర్చెదుకారు చిచ్చులో
నొగిఁ జొచ్చి పొరలాడు నొక్కతేప

తే. తీఁగ కుత్తుక కుఱి గాఁగ నూఁగులాడు
నొక్కపరి పసరంబుమే నూడి పోవ
జింక యగునట్టిభరతుఁ డేవంక నైనఁ
జేటు వచ్చునె కుడు పెల్లఁ జెల్లకుండ. 136

వ. మిగుల వగలం బొగలుచు ని ట్లని పలవింపం దొడంగె. 137

ఉ. ఏటికి నేటికి న్మనుఁగ నేగితి నేటికి నీట నుంటి నే
నేటికి లేటిపిల్లఁ గని యింపునఁ బట్టితిఁ బుట్టె నంచు న

ప్పేటికిఁ బెంచినాఁడ మఱి యేటికి మాటికిఁ బ్రేముడింతు నిం
కేటికి నెవ్వగం బొగల నేదియుఁ దప్పద దెట్టిమేటికిన్. 138

వ. అని మఱియు నాకా లేడిపిల్లకతన నిట్టిబా మెత్తి బాములం బడఁగ బ్రె నిర్వాణంబు దూరదూరం బయ్యెఁ గదా యని యంగలార్చుచు నొక్కనాఁడు తన్నుఁ గన్నతల్లిం బెడఁబాసి యొకండ కాలంజరం బనుపర్వతంబునుండి తొల్లింటిపులహునాశ్రమంబునకుం జని యట నామే నూడిపోవునుపాయం బరయుచుఁ బున్నె మిచ్చునచ్చం బగు నాయేటినీటఁ గ్రుంకు లిడుచు నిచ్చలు నుదయించుసూర్యున కెదురుగా సాఁగిలి మొక్కుచు రాలుఁ బండ్లు కొమ్ములకొనలం గ్రుచ్చి తెచ్చి మునులకడం బెట్టి కొలుచుచుఁ గొమ్ముకొనలం గోఁకి వారిమేని కండూతిం బాపుచు నెల్లవేల్పులకు నెల్లనాఁడు మ్రొక్కులిడుచుఁ గర్మావశేషంబునకు దిక్కులు సూచుచు నొక్కనాఁడు గండకిం బడి ప్రాణంబులు విడిచిపెట్టె ననినఁ బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రుం గాంచి మునిచంద్రా! భరతుండు మృగరూపంబు విడిచినపదంపడి యేమయ్యె నో యెఱింగింపు మనిన నతం డి ట్లనియె. 139

—♦ భరతుని బ్రాహ్మణజన్మము ♦—

తే. మున్ను కలఁ డాంగిరసుఁ డనుపుడమివేల్పు
వేల్పులను జన్నముల మెక్కఁ బెట్టినట్టి
మేటిసోమాసి తగఁ దొలిమినుకుగముల
నరసి తప మొనరించెడునట్టివాఁడు. 140

సీ. నడిరేయి యగుదాక విడువక చట్టుల
వల్లెవేయించి ప్రాఁబలుకు నెల్ల
వెన్నునిఁ దలపోసి నెడనిద్దురం జేసి
వేఁకువ జామున వేగ లేచి
పదివేసములనామి మదిలోనఁ దలఁచి య
త్తఱిఁ గర్జములు దీర్చి తగినమాడ్కి

నిసుఁగులతోఁ గూడి నెఱిమీఱ నేటికిఁ
జని యందు నీరాడి సందె వార్చి

తే. తొలిమినుకుతల్లి నెదలోనఁ దలఁచి తలఁచి
చెన్నువలకన్ను నేటికోళ్లెన్నొ చేసి
యింటి కఱుదెంచి యగ్నుల నెఱిగి వేల్చి
యాంగిరసుఁ డిల్లు నిచ్చ లెసంగుచుండు. 141

తే. అతని కిద్దఱుపెండ్లము లందుఁ బెద్ద
గరితయందును దొమ్మండ్రఁ బరఁగుఁగొడుకు
కజ్జలును జిన్నసకియందుఁ గూఁతు నొకతెఁ
గాంచి పుడమిఁ గాపుర మొనరించు నతఁడు. 142

వ. ఇట్లాజన్నిగట్టు కాపురంబు సేయుచున్నయప్పుడు. 143

మ. బరువై తోఁచినజింక మేను విడి బాపం డైనతర్వాతనే
పరికింపం గడతేఱు బాము లనుచుం బాటించి లో నెంచి యా
భరతుం డంతటఁ బున్నియంపుగనియై బాగొందు చున్నట్టియాం
గిరసుం గూడినచిన్నచేడెకడుపక్కీల్పొట్టలోఁ జేరెఁ గా. 144

చ. కడుపున నున్నయప్డు తనకల్గినబాములఁ గూర్చి యెంతయే
నడలుచు దేవరా! యనుచు నాత్రముఁ జెందుచుఁ దొల్లి తా నొగిన్
వెడఁగయి చేసినట్టిపదివేలకు మించినచెడ్డచేఁతలం
దడవుచుఁ దిట్టుకొంచుఁ దనుఁ దా నిసియం చతఁ డుండె నయ్యెడన్.

ఆ. జడనుపడినబుద్ధి గలిగినకొమరుండు
కడుపులోనఁ జొచ్చి కడఁగుఁ గాన
నంచనడలచెలియ కాతఱి నెంతయు
నడలు జడనుపడియె నాఁడు నాఁట. 146

క. తెలివి యనుదివ్వె తేజున
వెలుఁగొందెడుకొడుకు లోన వెలసినకతనన్
నెలఁతకు నొడ లయ్యెడలం
దళతళ మనుజ్యోతి నలరెఁ దగఁ బరికింపన్. 147

ఆ. కేవఁ గూయుచున్న లేవనీ నట్టులు
పెరుగుచున్నయట్టి పెద్దకడుపు
చెలఁగ మోసి మోసి నెలలు తొమ్మిది గాఁగఁ
గనియెఁ గొడుకుకుఱ్ఱఁ గలికిమిన్న. 148

ఆ. గాలి దూలి సోఁకి కందు సెడకయుండఁ
జల్లి బూఁపె వేళ్ళ వెల్లకులును
నూఱి పొగలు వేసి నోములు నోపించి
పురిటినాళ్ళు పదియుఁ బోకడంచి. 149

క. మఱి బారసాల నొనరిచి
భరతుం డని పేరు పెట్టి బంగరువున నాం
గిరసుండు పాలు పెదవులఁ
బరఁగం దగులించెఁ దాను బడఁతుకతోడన్. 150

వ. మఱియును గలపండువులెల్లఁ గావించుచుఁ దల్లిదండ్రులు దమబం
దుగులపిండుతో మెండుకొనుసంతసంబున నిండుకొని యుండి రంత.

శా. కన్నుల్విచ్చి కనందు గిల్లు లిడినం గా ర్కా ర్మనం దుగ్గనుం
జన్నుం బా లిడఁ బోవ నావనఁ డోగి న్గాల్సేతు లాడింపఁ డే
సన్న ల్సూపిన నవ్వఁ డెప్పుడును జాచందంబునం బండు లో
నెన్నం జూచుచునుండెఁ గానఁ గడు తెల్విం బుట్టునప్పట్టితాన్. 152

చ. నిసువును గాలి సోఁకె నని నేర్పునఁ జేతుల రక్షఁ గట్టియుం
బసుమము మేనఁ జల్లియును మందులు మాత్రికులునూఱిపోసియున్
విసువక చేయరానియవి వేలను జేసియుఁ దల్లిదండ్రు ల
ద్దెస వితయైనవా రయిరి దేవరచెయ్వుల కబ్బ ముందునే. 153

వ. ఇట్లుండియు నబ్బాదుతండెట్లా యొక్కచందంబునం బెఱిఁగి పెద్దవాఁడై.

ఆ. ఓనమాలు తండ్రి యొయ్యన వ్రాయింప
నొజ్జకడను జదువ నుంప నతఁడు
జడనువడినవానిచందంబుఁ దోఁపఁగఁ
జదువఁ డన్ని తొల్లి జతన మగుట. 155

వ. మఱియు నిట్లు పిచ్చియుఁ జెవుడును మూఁగయుం గ్రుడ్డియుం గలిగి జడనుఁగడినవానిమాదిరిం జూపుచు జడభరతుం డనియొక్క బిరుదు పేరుం గాంచి పెద్దముద్దు తెఱంగున నున్నను గన్నవాఁడు గాన నాంగిరసుండు ప్రేముడిం బెంచుచు జన్నిగట్టులకుం జేయ నగునట్టి చేఁత లన్నియు వరుసతోడ నడిపించి వడుగుం జేసి నడవడికల నేర్పు గదుర విద్యలం గఱపుచువచ్చిన నిచ్చ లేకుండియుం దండ్రియానతి నన్నియుఁ గఱచి కైకొని యతండు వినునట్లుతలఁతోడంగూడిన తొలి మినుకులతల్లి నేమంబున నుడువుచుఁ దొల్లివచ్చినవాఁడైన మఱియుఁ దొల్లింటిపలుకులువల్లె వేయుచు నగ్గుల వేఁడ్చుచు వేల్పులం గొల్చుచుఁ దల్లిదండ్రుల సంతసవెల్లిం దేల్చుచుండె నంతలో దైవప్రేరణంబునం జేసి తండ్రి యగునాంగిరసుండు మృత్యుగ్రస్తుండై చనినంత వాని ద్వితీయపత్ని తనపిల్లలను సవితిపిల్లలకు నప్పనంబుగావించి తాను దనభర్తతో సహగమనంబు గావించి కాలధర్మంబు నొందె నిట్లు కన్న వా రిద్దఱును దన్నువిడిచి పోయినవెనుక యిల్లు చక్కఁబెట్టుకొనుచున్నసవతితల్లికొడుకు లెల్లరు నీసున నాభరతుని జదువనీయక యింటి పనులయందు నిలుపుటయు నతం డెప్పటియట్ల వెంబరవిత్తువలె నై మెలంగుచుఁ దమవారు చెప్పినపను లెల్ల నేమరక చేయుచు నిలు దీర్చుచుండె నప్పుడు. 156

సీ. దోడుకులపా ల్పిండి తోడి మేపుకొనివచ్చి
పుల్లెలుఁ గట్టి గొడ్డళ్ళ వంట
కట్టెలు గొట్టి నాఁగలిదున్ని గుద్దలిఁ
ద్రవ్వి పొలము దొడ్డిఁ దనరఁ జేసి
కూరగాయలచెట్లు గొలిపి గనిమ లెల్ల
మునుఁగ నీటను జేతిమోట లాఁగి
చేలఁ గలుపుఁదీసి నాలుగు పెడలను
వెలుఁగు చక్కఁగఁ బెట్టి పిట్ట గాఁచి

తే. తను బవలు రేయి గడియేని గునుక కిల్లు
పొలము నరసి కాపాడుచు మొనసి యన్ని
పనులు నన్నలయానతిఁ బాటుపడుచు
సలుపు నిచ్చలు రక్కసిచంద మమర. 157

వ. ఇట్లుతం డెడ తెగక యింటిపనులయందు మెలంగుచు చేఁతకానిరెండు కాళ్ళపసరంబు లగువారిచేఁ బిచ్చివాఁడు వెఱ్ఱివాఁడు గ్రుడ్డివాఁడు జడ్డివాఁడు నని పిలువం బడుచు తమవారు చెప్పినచొప్పున నెల్లపనులం జేయుచు నొక్కనాఁడు పొలంబున జొన్నచేను గాయుచుండె నా సమయంబున. 158

ఉ. ప్రోలిపజేటి లోకండు గడుపోడిమియై సిరు లంది యుండియుం
జాలఁగ బిడ్డలం బడయఁ జాలమి నొవలనంతఁ గుందుచుఁ
వేలుపు లడ్డుపెట్టి రఁట వేయగుచేతులసత్తిఁ గొల్చినఁ
మేలగు నంచు నూరికడ మించినకోవెల కొక్కరాతిరిఁ. 159

క. చని నేమంబున సత్తిం
గొనకొని పూజించి తనకుఁ గొడుకుల నిమ్మం
చని వేఁడిన సనె నాయమ
యును బడసెదు మానిసిబొలి యొసఁగుదు వేనిఁ. 160

—♦ భరతునిసత్తికి బొలిపెట్టుట ♦—

ఉ. ఆపలు కాలకించి మదియం దపు డెంతయు సంతసించి య
క్కాపుకొలంబువాఁడు తనకావలివారలఁ బిల్చి యెక్కడే
నోఁపికతోడుత న్నెమకి యొక్కనిఁ దోడ్కొని రం డొకింతలో
నే పరికించి యెంచి బొలి యిచ్చెద సత్తికి నేను వేఁడుకఁ. 161

వ. అని యానపెట్టుటయు నాతనికింకరులు నలుగడ నన్వేషణంబు సేయుచు భరతుం గనుంగొని. 162

ఆ. అరసి పట్టి యతని నయ్యారె! యీబాప
నయ్య చియ్యఁబట్టి యలరు పీనిఁ

జూచి సంతసించుఁ జుమి మనయొడయండు
నొడలిసిల్ల సత్తికడుపు నిండు. 163

వ. అని పలుకుచుం దఱిమి తోడుకొనిపోయి తమ యేలికకుం బొడసూపిన నతం డింతింతనరానిసంతసంబునం బొందె నంత నతనిబంటు లతనికిం దలయంటిపోసి పసపుపూసి క్రొత్త పుట్టంబులు గట్టనిచ్చి మేన గంధం బలంది పూలదండలు మెడనిండ వైచి దేవళంబునకుం దోడుకొని పోయి దేవియెదుటం గూరుచుండం బెట్టి రపు డక్కాఁపువాఁ డామగ మానిసినెదుట సతి నలరింపం దలంచి తనచేతికత్తిం దూసి జళిపించుచుఁ దలఁ ద్రెవ్వనేయ నుంకించె నంత. 164

చ. తనతలఁ ద్రెవ్వఁజేయు నని తా నపు డెంచియు నించుకేని బీ
తనునది యెట్టిదో యెఱుఁగ కాభరతుం డెద సంతసించుచున్
గనలక వారలం దనదుగారవపుంజెలులట్టు లెంచుచుం
గనుఁగవ మూసికొంచు మదిఁ గన్గొనుచుండెఁ గడంక వెన్నునిన్. 165

వ. అంత నాకోఱిలమ్మయు నెల్లయుసురుదాల్పులయందును వేరంబులేక చెలిమిం జూపుచు బ్రహ్మంగను నాపుడమివేల్పు తేజుఁ జూడ నరిది యైనం దనకెట్టుపోయి యెట్టువచ్చునో యనుబీతున గడగడవడంకుచు హుమ్మనుచు నొక్కకేక వైచె దాన నప్పాఱునిం జంపునానాలవ జాతివాఁడును వానియనుచరులుం గుండెలవియ బ్రాణంబులు విడిచిరి.

ఉ. అత్తఱి నేలవేల్పు మదియం దట బీతొకయింత లేక వే
కుత్తుకఁ గోయవచ్చి తను గుంజెడువారలయందు సత్తియం
దొత్తెడు కత్తియందుఁ గడునొప్పెడు వెన్నునిరూపు నిల్పి లో
హత్తియ యుండుఁగాని యిసుమంతయు నాత్రముఁ దెందఁడయ్యారే.

వ. అంత నప్పారుండు గుడివెలుపలికిం బోయి యటనుండి తొల్లింటి జొన్నచేనిం గాయనేగె నట్టియెడం గొన్నాళ్ళ కొక్కనాఁడు సౌవీర దేశాధీశ్వరుం డగురహూగణుం డనునొక్క రాజు కపిలునివలనసాంఖ్య శాస్త్రంబెఱుంగం గోరి శబికారూఢుండై పోవుచు నిక్షుమతీతీరంబున

విశ్రమించి తనవాహకులలో నొక్కండు తెవులుగొంటై నడువఁ
జాలకుంటం దెలిసి చేనికడనున్న భరతునిం బట్టుకొనిపోయి వీనిచే
మోయింత మని పట్టి మూపునఁ బల్లకిదండిం బెట్టి త్రోలి నడపించి
రట్టియెడ నతండు తనయోపినకొలంది మోయుచు నడువ నప్పల్లకి
దనకు మిగులఁ గుదుపుగలిగించుటం జేసి పుడమిఱేఁడు. 168

చ. ఉడుగుడి బెస్తలార నడ యుల్లమునం దళు కింతయేని లే
కడుగున మిట్టుపల్లముల నారయ కిట్టులు మీరు బిట్టుమై
నడచుట మేనికిం గుదుపు నాటెడు నెంతయు నిందు నిల్వఁగా
గడగడలాడుచుంటి నిటు కల్గుట కేమికతంబు చెప్పుఁడీ. 169

వ. అనుటయు నాబోయ లి ట్లని రయ్యా యియ్యది మావలన నై నది కా
దీనావలవాఁడు మంచిగ మోయనేరండు గావున నేము నీతనితోఁ
బాటువారము కావలసివచ్చె ననినం బుడమిఱేఁడు పెద్దలఁ గొలిచినవాఁ
డయ్యును నాఁగనికినుకం గనకనలాడుచు నెఱుకఁదప్పినవాఁడై నీఱుగప్పి
ననిప్పు వలె నెఱుంగరాని బ్రహ్మతేజమున నొప్పు నా బాపనయ్యం గని
కటకటంబడుచు ని టనియె. 170

ఉ. చావఁగ మోదెదం బ్రదికి చచ్చినయట్టివెడంగుబోయ! నీ
కావర మిట్టులుండినది గా తగు నాదగునాన మీఱి పో
నీ విటు తప్పుగా నడుతు నీచెడుపోఁకలు మాన్పి మంచిగాఁ
బోవఁగఁ జేయువాఁడ నని మోటుతనంబునఁ బల్కె నల్కమై. 171

వ. అట్లు రాజ ననుగర్వంబున గ్రుడ్డివాఁడై యుండువాని మాటలాల
కించియుఁ గడునోపిక గలిగి తెలివిచూపున వెలుఁగుచు నిద్దంపుబమ్మ
రూపై యెల్లభూతంబులలోన నున్నవాఁడు తానయై యున్నయన్నేల
వేల్పు తన్నెఱుంగక కాఱులఱచుచున్నయాఱేనిం జూచి యిట్లనియె.

— భరతుండు రహూగణునితోఁ బ్రసంగించుట —

చ. దొరగరువంబున న్నిలిచి తోరముగా నను నీవు దూఱుచుం
గరగఱిక న్మెలంగఁ దగుఁ గా యని శిక్షయొనర్పఁ బూన ని

త్తతి విత కాని యింతయిన దానను మే ల్సమకూఱునోటు వే
దు రయిన నాకడం జవిటితో నగునేలను విత్తు మొల్చునే. 173

వ. అని పలికి యొప్పుగలడెందంబుతో నాజడదారి తొంటిబాములయందలి
పనులు మిగులుటం జేసి బరువునకు సైచి పల్లకిమోయుచుం దొంటి
యట్లుజనుచుండె నపుడెఱుకం గోరిచనునాదొర డెందంబుముడి విచ్చ
నట్టియతనిపలుకులు విని తనయుల్లంబున. 174

శా. ఔరా! యే మిది వింత యయ్యో! నిటు లే నాడంగ నింపొప్పఁ గా
మాటాడెం గద యీతఁ డెవ్వఁడొకో తా మార్గ్మనితో వచ్చి నా
కాఱుల్ సైఁచినగొప్పవాఁ డొకఁ డగుౕ గాదంటిమా బోయలం
దేరీ యిట్టిపు కల్గిరే యొరులు నే నే నేమి పొల్లంటినో. 175

వ. అని దిగ్గన పల్లకి డిగ్గనుఱికి యప్పుడమిదేవరయడుగులం బడి గరువం
బంతయుం దిగఁద్రావి చేతులు జోడించుకొని యిట్లనియె. 176

శా. అయ్యా! యెవ్వరు నీవు గోఁచియును లే కైనట్టివేషంబుతో
నివ్యాజం జనుచున్నవాఁడ వలమిన్నేర్దాల్పవో వేల్పవో
నెయ్యం బొప్పఁగ నన్నుఁ దేర్చుటకునై నేఁ డిందుఁ జూపట్టు దా
నెయ్యం డొకపిలుండవో తెలిపి నానేరంబు సైరింపవే. 177

చ. ఎఱుఁగక మోఁతలో నిలిపి యెన్నియొ కాఱులు పల్కి దూఱుచుౕ
గరకఱి దప్పఁ జేసితిని నాదగునేరము లెంచ కేలు మే
వెఱవను బ్రొద్దుచూల్గుదెకుఁ బెద్దగరంబున కగ్గికిం గరం
బరయఁగఁ బాఱువాకులకు నాత్రముతో వెఱఁజెంది నట్లుగౕ. 178

వ. అయ్యా! నీవు తగులంబు విడిచి జడనువడినవడువున నుండి మెలంగు
చున్నవాఁడవు నీపలుకులు పెనుమినుకులకుం బుఱుడై తలంచుటకును
నుడువుటకును దరంబులుగాక యున్నయవి. నేను గఱివేల్పుపొల్పునం
బొడమినకపిలునికడ బ్రహ్మవిద్యం దెలియం గోరి చనుచున్నవాఁడ
నీవు మాఱురూపున నన్నుఁ బ్రోవవచ్చినకపిలుండవు గాఁ బోలుదువు
వెంబరవితు లగునావంటిగేసులు తపసిరాయలలోనికత లెఱుంగఁ

గలరు. నేను రాయఁడ ననియెడుగరువంబున విఱ్ఱవీఁగుచు పెద్దలం
దూఱితి గోడు మూటఁగట్టికొంటి నది నీయక్కటికంపుచూపునం దీఱుఁ
గానియొంటం గాదు శత్రుమిత్రుల నొక్కలాఁగునం జూచుమీ కీసు
గలుగనేరదు. నన్నుం గాపాడు మనిన భరతుం డతని కిట్లనియె. 179

తే. ప్రకృతికంటె పవిత్రమై పరఁగెడుపర
మాత్మతత్త్వవిజ్ఞానము నరయ నట్టి
వాఁడుపలికెడునట్టులు పలుకుచుంటి
సలిపితిని జ్ఞాన మఱి యపచార మనుచు. 180

ఆ. ఈశ్వరాజ్ఞఁ జేసి యెల్లపనుల్ సాఁగు
నీవు చెప్పియుంట నేను జేయ
లేదు దైవ మట్టి చైదికిఁ గత మని
యంతరాత్మ నెఱుఁగ నగును నీకు. 181

మ. ఇది నాదే చతురంతయాన మిది నాదే యిల్లు నాదేహ మి
య్యది యంచుం దలపోయుచున్ జనుఁడు నాయందే సమస్తాధికా
రదిదృక్షల్ గలవంచు గర్వమతియై రాగాతిరేకంబునన్
సదసద్జ్ఞానము లేనిదాన నిటు లజ్ఞానంబునం గ్రాలెదున్. 182

వ. పృథివీశా! పృథివ్యాదిభూతపంచకముచేతను వానిగుణంబు లగు గం
ధాదితన్మాత్రలచేతను బుణ్యాపాపరూపకర్మములచేతను గాలము
చేతను మనోవికారములు నూఱులు వేలు కోట్లు సంభవించుచున్న
యవి యివి యన్నియు నిత్యములై సుషుప్తియందుఁ దిరోహితంబు
లగుచుండును వీని నీశ్వరుం డంతర్యాభితుండై చూచుచుండు నాపర
మాత్మ తనమాయచే జీవునియందుఁ దిరోహితుండై యుండు నతండు
ప్రకృతికి వశ మగువారికిఁ గానరాడు దేహి జ్ఞానోదయముం గలిగి
యహంకారమమకారాద్యభిమానంబు విడిచి దేహగేహాదులసంగ
మంబు విడి యింద్రియంబుల జయించి పరమాత్మతత్త్వ మెఱుంగని
యంతకాలము సంసారతాపత్రయముం బొందెడు వాఁడే యగుచుండుఁ

గావున నీకు నీయంతఃకరణమే శత్రు వని యెఱుంగుము నీ వప్రమ
త్తుండవై భగవత్సేవయ నెడి శస్త్రముం బూని యజ్ఞానముం బాఱఁ
ద్రోలి యంతఃకరణముం జయింపు మప్పుడు నీకాత్మతత్త్వము తెలియ
వచ్చు నని మఱియును. 183

మ. ఒడయండా! విను పెద్ద లీజగమునుం బొల్పెక్కఁగాఁ బల్కుచుం
విడువుం బేరిటితాన మొందుటకునై వేడ్కం దగం గొందు రి
ప్పుడు నీ వాడినమాటలెల్లఁ జదివెం బో యీతఁ డన్నట్టిపెం
పెడలె న్నీ వన నే నవంగ నెవఁ డే నేల్వాఁడనే ని న్నరయో. 184

ఉ. ఈవు దిరంబుగా నిలువ నెంచితివే కద యీజగంబులోఁ
గావున నన్ను నెయ్యమునఁ గావుము సైఁపుము నేర మంచు లోఁ
గావరముం దగం విడిచి కాళ్లపయిం బడి వేఁడి తీవు నే
లీ విటఁ దప్పఁ జేసితివె? యెవ్వరి కెవ్వరు ప్రోచువారునుం. 185

క. పల్లకి మోయించుట నని
యుల్లంబున నుండఁ బోలు నోహో నీ కేఁ
ద్రొల్లిఁటిచెయ్వుల కతమునఁ
బల్లకి మోసితిని నీదుపని యిటఁ గలదే. 186

క. కను గానక త్రోలిబాముల
నొనరించినవెల్ల వెనుక నొందఁగఁ దగు ని
ట్లన నొప్పఁ గాని చేయిం
పను జేయం గర్త యొకఁడు పరఁగునె చెప్పుమా. 187

వ. అని పలికి యూరకున్న వెఱఁగంది యగ్గోఁచిపాతరాయనికి దండంబు
పెట్టి యూరాయండు మఱియుఁ ని ట్లనియె. 188

ఆ. నన్నుఁ గన్నతండ్రి నాసందియము లెల్ల
నిన్ను నడిగి తెలియ నున్నవాఁడఁ
దనరఁ జెప్పు నేను దా నైతి ననియెడు
దారి నెనరుఁ దోఁపఁ దపసిరాయ. 189

వ. అనిన నతం డతనిం జూచి రాయా! నీవు రాయఁడ వనిగరువంబునం బల్లకులెక్కి తిరుగుచుండుటయె కాని యెప్పుడుం బెద్దలపేరోలగంబులం దిరిగి నేర్చియుండినవాఁడవు గావు. ఎల్లయుసురుదాల్పులపిండు నకుఁ మనికి యగునీజగంబు బూటకంబున నొనరింపం బడియె నిది నిక్కంబై యుండునది కా దని వెండియు. 190

—♦ భ ర తు ని జ్ఞా నో ప దే శ ము ♦—

సీ. ఆత్మవిజ్ఞాన మయ్యది కృచ్ఛ్రచాంద్రాయ
ణాదులచేత జపాదికమున
నుపవాసములచేత నుత్తమవైదికా
చారములఁ దానసంగతులను
గార్హస్థ్యధర్మసంగ్రహముచే వేదపా
ఠముచేత వివిధాధ్వరములచేత
రవ్యాద్యుపాసనావ్రతములచేతను
బడయంగ రాని దెప్పుడును గాని

తే. అద్ది యుత్తమశ్లోకులై యనిశ మీశ్వ
రుని స్మరించెడు భక్తులరుచిరపాద
పద్మములసేవ చేయుచు భక్తి నెసఁగు
వారలకు మాత్రమ లభించు వసుమతీశ. 191

మ. ఒడయండా! విను మేను దొల్లి భరతుం డోహో యనం బేర్మి నొ
ప్పెడుతేఁడఁ దగులంబు వాసి యడవిఁ వేఁగించుచుఁ నాళ్లలో
క్కెడ నీరాడుచు లేడిపిల్లఁ గొని యెంతేఁ బ్రేముడిఁ సాఁకుచుఁ
బుడమిఁ లేడికిఁ బుట్టి వెండియును బాము ల్వొందితి న్వింటివే. 192

చ. వలమురితాల్పునందుఁ గడుభక్తి మెలంగుచు నుంటిఁ గాన నా
పొలుపటియున్న మే న్విడిచి పుట్టితి నిట్టులు జన్నిగట్టునై
తెలివి యొకింత కల్గుటను దిక్కుల వెన్నుఁడు దక్క నొక్కఁడుం
గలుగఁ డటంచు నెంచుచు నొకండ మెలంగుచునుంటి నిట్లుగన్. 192

వ. రాజా! యెల్లవారలు పెద్దలం గొల్చుటం జేసి తగులంబులం బెడఁ
బాసి తెలివి గలిగి సిరిచెలువునిం గొలుచుచున్నయెడ విడువం జెం
దుదురని మఱియును. 194

ఉ. ఇల్లనుకాఱుకానఁ దమ కేదియొ కోరి మెలంగుచుండఁ దా
రల్లన వచ్చి కోర్కు లనునార్వురుదొంగలు పున్నె' మన్న సొ
మ్మెల్లను దొంగిలించుకొని యేగినయంతట దిక్కు లేనిదై
యుల్లము పల్లటిల్ల గొద లొందెడు మానిసిపిండు మెండుగన్. 195

తే. కాపురం బనునడవిలో నేపుమీఱు
నాలుబిడ్డలు నాఁబడునట్టినక్క
లెల్లఁ జెలరేఁగి మానిసియెముక లెల్ల
గొఱికి తిన వాఁడు పాడయి యుఱక వచ్చు. 196

తే. అడవిలోపలఁ గొఱవిదయ్యంబుఁ గాంచి
యగ్గిఁ గొనవెంటనరిగెడునను వు దోఁప
నాలుబిడ్డలఁ బ్రోవ సొమ్మాసఁ జెంది
మెలఁగుఁ గలవారియిండ్లపంచలను వెడఁగు. 197

క. ఎడ నెండమావులం గని
కడుదగ నీరాడునిచ్చఁ గాల్కొలఁదిం బా
ఱెడుమేకములవడువున న
వ్వెడఁగులు కాపురము సేయ వెడలెద రొడయా. 198

చ. తలఁచిన నోకిలింత లగుదట్టఁపువిట్టునఁ గొట్టుకొంచుఁ బోఁ
గులు నరము ల్వొర ల్తనదుకుత్తుకకు న్మొయికిం గడంకమై
దళముగఁ జుట్టఁ బెట్టుకొన దారి యొకింతయు లేక వేఁగుచున్
వెలలఁ దలంచె పో పొలఁతిపెన్గడు పఱచెఱసాల యం దటన్. 199

తే. ఇరుకుత్రోవను వెలివచ్చుతఱిని యుక్కు
ముక్కలకుఁ బోనియెమ్ములనొక్కటలకుఁ
బుట్టువాఁ డొందునంగద పోల్చి చూడ
వగపు పుట్టక పో దెట్టివాని కైన. 200

చ. గరితలఁ బెండ్లియాడి చెలఁగన్ గొమరుల్ దగ నిల్లు దీర్చి కాఁ
పుర మొనరించుచున్ సుకము పొందెద మే మనుసంతసంబుతోఁ
దిరుగుటె కాని దాన నగుతిప్ప లొకింతయుఁ గాన రయ్యయో
యరయఁగ గుండె జల్లుమను నయ్యవి వాకొనునట్టిపాటివే. 201

చ. బ్రతికినయన్నినాళ్ళటులు బాములకే యగుకాఁపురంబునా
వితఁ యగుపేరితోఁ దనరి పీఁగక మండెడుకారుచిచ్చులో
సతముగ వేఁగి వే మిడుతచందమున న్బడి వేఁగి వేఁగి యా
మతకరి చచ్చి పుట్టు నది మానెడుదారి నెఱుంగఁ బోలదో. 202

క. తిన నాఁకు లలము లుండఁగఁ
గొన నేళ్ళన్ నీళ్ళు లుండఁ గొసరక కట్టం
జనునార లుండఁ బండం
గ నేల లుండ నోరుఁ గొల్వఁగా నేమిటికిన్. 203

ఆ. బ్రతుకు తరగలాట పసిజవ్వనము కొన్ని
నాళ్ళమాట సుకము నీళ్ళమూట
బోఁటి సొమ్ము కొడుకు మేటిమెఱుపు తేఁట
యేటి కయ్య! యిట్టిపాటి బాట. 204

చ. తెలియఁగ నెంతవారు నిలఁ దెళ్ళిరకాని యొకండు మిత్తిక
న్నుల మసిఁ ద్రామి పొల్చుట కనుంగొనియే వినియే నెఱుంగ మీ
పొలిసెడునంతయున్ వినియు బూమె లెఱింగియు నుట్టి గట్టి యు
య్యాల లిటు లూఁగుచుందుమని యొంచుట వెఱ్ఱితనంబు కాదొకో. 205

తే. కాపుర మనుకడలి నీఁద నోఁపుదారి
యెట్టిగొదలను దీర్చెడునట్టిదారి
పుట్టి చావనిసుక మిచ్చునట్టిదారి
బమ్మ మరయుట యని లోన నమ్ము తేటి. 206

చ. దళముగఁ గంటికిం బొరలు దాఁకక మున్న నొడ ల్వడంకుచున్
మలఁగక మున్న లోఁ దెలివి మా సతి పోవకమున్న కాళ్ళుసే

తులు సెడిపోకమున్న తగుత్రోవలఁ బో నగు నిండ్లు గ్రాల బా
వుల నోగిఁ ద్రవ్వఁ బూనుటలు పోలునొకో తలపోసి చూడఁగన్.

వ. అని యెఱింగించిన సంతసించి యతం డతనిపదంబులకుం జాగిలి
మ్రొక్కి యి ట్లనియె. 208

ఉ. పాఱుకొలంపుమానికమ! పట్టిపయిం గలగారవంబునన్
మీ రెఱిఁగించుసుద్దులను మీఱిననాచెడుబుద్ధియంతయున్
దీఱెను దోసముల్ నడచెఁ దెల్వియు మించెను నాకొలంబునన్
జేరెను బున్నె మే విడుపుఁ జెందెద మీయడుగంటి కొల్చుటన్.

తే. నీదుపలు కనుచందువ నాదులోనిఁ
గదువ మనియెడుకటికిచీఁకటి దొలంగె
దెలివి యనుపండువెన్నెల తేఱెకాయు
దొంగ లార్వురు తిరుగక లొంగినారు. 210

ఆ. నీదుబోధఁ జేసి నాదులోఁ గడుతెల్వి
నైనసంతసం బట నెడునిండు
చందమామ వొడిచె నిం దందుఁ గలబమ్మ
మన్నసొమ్ముఁ గంటిఁ గన్నతండ్రి. 211

—♦ భరతుండు ముక్తి నొందుట ♦—

వ. అని కడుదెఱంగులఁ గైవారంబుఁ జేసి వేఁడుకమెయి వీడుకోలువడసి యతం డన్నియునుం బెడఁబాసినవాఁడు కాన వెంగలియన నెటయేని యూడసింబాడె నంత నాభరతుండునుం దనకు మేను గలకర్జంబు దీఱెఁ గానఁ దొల్లింటి గండకివాఁకయొడ్డునకుం జని కూరుచుండి మెండగుభక్తిం దనడెందంబునం దనకు వేఱుగానివాని ని ట్లని తలంచుచుండె.

చ. నలకలకన్న నల్కయి కనంబడి పెద్దలకన్నఁ బెద్దయై
నెల వొకచోటు నాక మఱి నింగియు నేలయు నిండఁ బొంగియున్
దులవల కెల్ల లే డనఁగఁ దోఁచెడు దేవర తాను నేన యై
వెలిఁగెడు జోతినిం దలఁచి వేయుఁదెఱంగులఁ గొల్తు నిచ్చలున్.

ఉ. ఈ వన నొక్కఁ డే ననఁగ నెంచ మఱొక్కఁడునే జగంబులో
నీ వన నే ననంగ నొకఁడే యగు సందియ ముండ దైన నిం
కీ వన నే ననంగ నుడు లేగక యున్నవి రెండు వానినిం
బోవఁగఁ జూచి నన్ను నినుఁ బొందఁగఁ జేసి కడంకఁ బ్రోవవే. 214

ఆ. మెఱుఁగు జోతివోలె మెఱుఁగుచు నాలోన
నున్న నన్ను నేన యెన్ని కొలుతు
నిన్ను మాఱు గాఁగ నీవు దిరుండవు
జగము దిరము గాని సరణి తెలిసి. 215

క. తలచుటకుం బలుకుటకుం
దల మిసుమంతయును గాని దైవమ ! నిన్నుం
గలసినకతమున నేమో
తలఁచుచు నుంటిని వెలుఁగుతలఁపున జేజే. 216

వ. అని పలుదెఱంగులం దలపోయుచు దివ్యో దివ్యం గలసిన ట్లతండు
బ్రహ్మసాయుజ్యంబు నొందె నిది భరతునిచరిత్రం బింక నతనివంశంబు
నభివర్ణింతు విను భరతునకు సుమతి యనువాఁ డాత్మజుండు పుట్టె
నాసుమతికి ధ్రువసేనయందు దేవతాజి త్తనుసుతుండు పుట్టె దేవ
తాజిత్తున కాసురియనుగరితయందు దేవద్యుమ్నుం డనుతనయుండు
పుట్టె దేవద్యుమ్ననకు ధేనుమతి యను దేవేరియందుఁ బరమేష్ఠి
యనుపుత్రుండు పుట్టెఁ బరమేష్ఠికి సువర్చల యనుసతియందుఁ బ్రతీ
హుండు పుట్టె. 217

— భరతునిపుత్రపౌత్రవర్గము —

తే. ఆప్రతీహుఁడు తనదేశమందు నుండు
పెక్కుమందికి నధ్యాత్మవిద్యఁ గఱపి
యెల్లవారికి విజ్ఞాన మెసఁగఁ జేసి
నిర్మలాంతఃకరణుఁ డయి నెగడఁ బడిసె. 218

వ. ఆప్రతీహునకుఁ బ్రతిహర్త ప్రస్తోత యుద్గాత యనుమువ్వురు పుట్టి యాగక్రియలయందు నిపుణులైరి వారిలోఁ బ్రతిహర్తస్తుతి యనుసాధ్వి యందు నజుఁడు భూమ యనునిర్వురం గనియె నజుననుజుం డగుభూమ ఋషి. కుల్యయనుపత్నియందు నుద్గీథుం డనుతనయుం గాంచె నుద్గీథునకు దేవకుల్య యనుపత్నియందుఁ బ్రస్తరుఁ డనుపుత్రుండు పుట్టెఁ బ్రస్తరునకు వికుత్స యనునామెయందు విభు వనుసుతుండు పుట్టె విభునకు భారతి యనుదానియందుఁ బృథుషేణుఁడుపుట్టెఁ బృథుషేణునకు నాకూతి యనునాతియందు నక్తుం డనుసూనుండు పుట్టె నానక్తునకుఁ గృతి యనుభార్యామణియందు గయుం డనుతనయుండు పుట్టె నాగయుండు. 219

స్రగ్ధ. రాజర్షిశ్రేష్ఠులందు న్రమణమెఱయుచున్ రాజ్యభారంబుదావి
భ్రాజత్తేజంబుతోడ బ్రజలకు హితుఁడై బాహుయుగ్మంబునందున్
రాజుల్మెచ్చంగఁగొంచుం బ్రకటితయశుఁడై ప్రస్తుతైశ్వర్యయుక్తుం
డై జిష్ణుండో యనంగానయిసకలజగత్ఖ్యాతి దీపించె నుర్విన్. 220

తే. తనదుకులధర్మమును వీడనట్టిఁ డగుచు
విష్ణునంశమునం బుట్టి వివిధసుగుణ
గణములకు నాలవాలమై గణన కెక్కి
ప్రజలఁ బ్రజ లట్లు పాలించెఁ బ్రభు వతండు. 221

సీ. ధర్మాదిగుణములు దవిలియుండుట మహా
పురుషుఁడై రాజిల్లెఁ బుడమియందు
పరమాత్మతత్త్వముఁ బరికించినట్టిఁడై
విజ్ఞానియై యుండె విడిచి భ్రాంతి
వివిధాధ్వరంబులు ప్రవిమలమతిఁ జేసి
విష్ణున కర్పించు వీనిఫలము
బ్రహ్మవిదులపాదపద్మముల్ సేవించు
భక్తియోగం బది ప్రస్తుతించు

ఆ. ఆత్మయందు నంతరాత్మగా నుండెడు
పరమునందు బుద్ధిఁ బరఁగ జేసి
సకలజనులు తన్ను సంస్తుతింపఁగఁ బ్రజా
పాలనం బొనర్చెఁ బ్రాజ్ఞుఁ డతఁడు. 222

వ. వర్ణాశ్రమధర్మపరిపాలకుండును సత్యసంధుండును సంపత్సమేతుండును సత్పురుషస్తూయమానుండును భగవదంశసంభూతుండు నగుగయుండు లోకోత్తరమహోత్తరగుణుం డయ్యె మఱియును. 223

సీ. దక్షపుత్రికలు శ్రద్ధయు మైత్రి దయయు న
తనిఁ గూడి ఘనుఁ జేయఁ దామె వచ్చి
రవని గోవై సకలార్థదుగ్ధంబులఁ
బ్రజలకోర్కులు దీర్పఁ బాడి నిచ్చు
వేదోక్తకర్మముల్ వేదముల్ నిష్కాముఁ
డగునావిభునకుఁ నొసఁగు ఫలములు
రణతిరస్కృతు లగురాజు లెల్లరు వచ్చి
బలులు సమర్పించి వెలలుచుండ్రి

తే. ధర్మపరిపాలనంబునఁ దనరి భూమి
సురులు తాము సమార్జించు సుకృతమందు
నార్వపా లాతనికిఁ బ్రీతి నప్పనంబు
చేయుచుందురు గయుఁ డెట్టిరాయఁ డగునొ. 224

వ. ఆగయునకు జయంతిఁ యనుకాంతయందుఁ జిత్రరథుండు స్వాతివరుండు ధనుండు ననుమూవురు పుత్రులు పుట్టిరి వారిలో జిత్రరథున కూర్జ యనుదానియందు సమ్రాట్టనుతనయుండు పుట్టె సమ్రాట్టునకు నుత్కల యనుకలికియందు మరీచి పుట్టె మరీచికి బిందుమతి యను సతియందు బిందుమంతుండు పుట్టె బిందుమంతునకు సుషేణయందు మధు వనువాఁ డుదయించె మధువునకు సుమనస్సనుసతియందు వీరవ్రతుం డనుసుతుం డుదితుం డయ్యె వీరవ్రతునకుఁ బ్రబోధి యను

సాధ్వియందు మధువు ప్రమధువు నను నిరువురు కొమరులు జనించిరి వారిలో మధువునకు సత్యయందు భౌమనుండు సంభవించెను. భౌమనునకు దూషణయందుఁద్వష్ట యనుతనయుండు గలిగెఁ ద్వష్టకు విరోచ యనుసుదతియందు విరజుండు పుట్టె విరజునకు విషూచియందు శత్రుజిత్తు లోనగునూర్వురు కొమాళ్ళు నొక కొమారితయుం బుట్టిరి కడపటివాఁడైన శత్రుజిదాదులకుం బ్రియవ్రతవంశ మని వంశసంకీర్తనంబు గావింపఁబడె ననిన రాజేంద్రుండు మునీంద్రా! సూర్య సంచారంబు గలిగినంతవఱకుం గలభూమండలము వైశాల్యమునందుఁ గలద్వీపాదులును దదవాంతరభేదంబులును నామాదులును విన నెంచితి మఱియు సవిస్తరముగాఁ జెప్ప ననుగ్రహింపు మనిన నరేంద్రునకు మునీంద్రుం డి ట్లనియె. 225

—♦ భూగోళద్వీప స్వరూపాదినిర్ణయము ♦—

సీ. బ్రహ్మాండ మంతయుఁ బరమునిసత్వాది
పరిణామమే యన వలయు దాని
సర్వస్వరూపము చర్చించుటకును బ్ర
హ్మాదులకు నశక్య మనఁగ వచ్చుఁ
గాన భూతలమందుఁ గలిగినముఖ్యము
లైనద్వీపాదిమానాదు లెల్ల
సంగ్రహించి వచింతు సర్వంబు కా దను
శంక విడిచి విను మంకిలి చెడ

తే. భూమివలయం బనెడుపద్మమునకుఁ గర్ణి
కావిధమున జంబూద్వీప మై వెలుంగు
నన్నిద్వీపములకు మధ్యమందు నద్ది
కోశమో యనఁ జెప్పనై కొమరుమిగులు. 226

వ. జంబూద్వీపము లక్షయోజనముల వైశాల్యము గలిగి పద్మపత్రంబు వలె వర్తులమై యున్న దందుఁ దొమ్మిది వర్షంబు లవి యొక్క

టొక్కటి తొమ్మిదివేలయోజనంబుల పరిమాణంబు గలిగి జంబూ ద్వీపము నీలము శ్వేతము శృంగవంతము నిషధము హేమకూటము హిమాచలము మాల్యవంతము గంధమాదనము నాఁ బేర్కొనంబడు నందు నిలావృతము మధ్యభాగంబునం దుండు నిలావృతంబునకు మధ్యమందుఁ గులగిరుల కధిపతి యగుసుమేరువు గలదు దాని యౌన్నత్యంబు లక్షయోజనంబులప్రమాణంబు దానిమీఁదిభాగము ద్వాత్రింశద్యోజనంబులు వైశాల్యము దానిమొదలు షోడశసహస్ర యోజనంబులు. అది భూమండలమధ్యంబున నున్నయది. ఇలావృత వర్షంబున కుత్తరోత్తరమునం గ్రమముగా నీలము శ్వేతము శృంగ వంతము నా నొప్పుమూడుపర్వతంబులు రమ్యకము హిరణ్మయము కురువు నాఁబడుమూడువర్షములకు సీమాంతపర్వతంబులై యున్నవి. ఆపర్వతములు ప్రాక్పశ్చిమముల లవణసముద్రము నంటి యున్నవి. అవి రెండువేలయోజనముల విస్తీర్ణము గలవి. యవి యొకదాని కంటె నొకటి దైర్ఘ్యంబునఁ బదునొకండవవంతు తగ్గి యున్నయవి. యిలావృతంబునకు దక్షిణమున నిషధము హేమకూటము హిమా లయము నాఁబడుపర్వతములు తూర్పునకుఁ బొడుగుగా వ్యాపించి నీలాదులతో సమానపరిణామము గల్గి నీలాదులకంటెఁ బదివేల యోజనంబులపొడవు గలిగి హరివర్ష కింపురుషవర్ష భారతవర్షములకు సీమాపర్వతంబులై యున్నవి. ఇలావృతమునకుఁ దూర్పునను గంధ మాదనంబునకుఁ బడమటను మాల్యవంతమును నీలనిషధపర్వతముల పర్యంతము వ్యాపించి రెండుయోజనముల ప్రమాణము గలదై భద్రాశ్వమునకుఁ గేతుమాలమునకును మర్యాదాపర్వతంబు లగు చున్నవి మఱియును. 227

—♦ ద్వీపములు పర్వతములు నదులు వనులు ♦—

సీ. మేరువునకు నలుమేరల మందర
మును మేరుమందరమును సుపార్శ్వ

మును గుముదము నాఁగ భూధరంబులు నాలు
గయుతయోజనము లాయతము లగుచుఁ
దూరుపుదిక్కునందుఁ మందరము దక్షి
ణమ్మున మేరుమందరము పశ్చి
మమున సుపార్శ్వము కుముద ముత్తరమున
నమరియుండెడు నందుఁ గ్రమముగాను

తే. ఆమ్ర జంబూ కదంబ వటాగమములు
పదునొకండువే లామడల్ పరిమితి గల
వగును గొమ్మలు నూఱువేలామడలు గ
విస్తరించినవై యుండు విస్మయముగ. 228

క. ఆనగములందుఁ బాలును
దేనియు మఱి చెఱకురసము తియ్యనిజలముల్
గానంగ వచ్చు హ్రదములు
మానొందెడు త్రిదసంబు మహిమఁ దలిర్చున్, 229

వ. గంధర్వు లాహ్రదంబులను సేవించి యష్టైశ్వర్యములం గాంచి వఱలుచుందురు మఱియు నాగిరులందు నందనము చైత్రరథము వైభ్రాజికము విశ్వతోభద్రము నాఁబడు దేవోద్యానంబులు గలవు.

చ. సురవరు లావనంబులను సుందరు లెందఱొ కొల్చుచుండఁ గా
నిరతము సంచరించెద రనింద్యచరిత్రము లుప్పతిల్లఁగా
విరులను గోయుచున్ లతల విన్నను వొప్పగఁ బ్రోదిసేయుచున్
మరువిలుకాని కగ్గ మగుమాటల తేటలనీటు గుల్కుచున్. 231

సీ. మందరశిఖరము క్రిందుగా దేవచూ
తము పదునొండువంద లగుయోజ
నము లున్నతిం గల్గి సముచిత మగుచుండు
నమృతతుల్యఫలాళి నాతరు విడు

నాఫలంబులు పండి నంతట నానేల
పైఁబడి చితికి ప్రవాహ మగుచుఁ
దద్రస ముచ్చోటఁ దగఁ బాఱుచుండును
మధురసుగంధ మామహితరసము
తే. అరుణకాంతులతోనొప్పి యనవరతము
జగతినరుణోద యనుపేరఁ దగె నది యయి
మందరాచలశిఖరమునందు నుండి
క్రిందికై యిలావర్ష ధరిత్రిఁ దడుపు. 232
సీ. అరుణానదీరస మమరాంగనలు గ్రోలి
ప్రియులతో నట విహరించుచుంద్రు
వానిమైగంధము పదియోజనమ్ముల
దాఁక గుబాళించు నేకడలను
మేకుమందరగిరిమీఁద జంబూవృక్ష
మది యేన్గులంతలై పొదలు పండ్లు
ఫలియించు నాపండ్లు పయినుండి క్రిందికిఁ
బడి శిథిలము లయి బహుళరసము
తే. వానినుండి స్రవించి ప్రవాహ మయ్యె
జంబునది యద్ది ద్వీప మాసంజ్ఞ నొప్పె
నహ్నివాయుసంయోగమువలన నార
సమ్ము స్వర్ణమై జాంబూనద మ్మనఁ బడె. 233
వ. ఆజాంబూనదంబును దేవత లాభరణంబులు గావించుకొని ధరించి తరుణులతోడఁ గూడి క్రీడింతురు సుపార్శ్వపర్వతముపయిం గలకదంబ వృక్షము కోటరంబుననుండి పెద్దలావు గలయైదుమధుధారలు పర్వత శిఖరంబునుండి క్రిందికిం బ్రవహించుచు నిలావృతము పశ్చిమభాగ మును బర్వతప్రాంతదేశమును బరిమళింపఁ జేయుచుండును. ఆమధు ధారలం ద్రావువారి మేనులపరిమళము గ్రహించి వాయువు నూఱు

యోజనముల దాఁకఁ దానిం బ్రసరింపఁ జేయుచుండును కుముదపర్వతమున నున్నవటవృక్షము శతవలిశ మనుపేరం బరఁగు దానిస్కంధమునుండి కొన్ని నదములు పుట్టి ప్రవహించుచుండును. ఆనదంబులు పాలులోనగుపానీయంబులు భక్ష్యములు భోజ్యములు దుకూలంబులు శయ్యాసనాదులు విభూషణంబులు లోనగునవియొసంగుచుఁ గుముదపర్వతమునుండి క్రిందికి దిగి యిలావృతము నుత్తరభాగమున నున్నప్రజల సంతసింపఁ జేయు నందలిస్నానపానాదులచే యావజ్జీవసౌఖ్యంబు గలుగును. దేహములకు ముదిమి రోగము శ్రమము చెమ్మటలు నపమృత్యువు మృత్యువు వైవర్ణ్యము రాగద్వేషభయాభిమానాదులును గలుగనేరవు మఱియు భూమండల మనుపద్మమునకుఁ గర్ణికవలె నుండునామేరువుచుట్టును కురంగము కురరము కుంభము వైకంకతము త్రికూటము శిశిరము పతంగము రుచకము నిషధము సితివాసము కపిలము శంఖము వైదూర్యము చారువిహంగము ఋషభము నాగము కాలాంజనము నారదము మొదలగుభూధరంబులెన్నో కింజల్కములవలె నున్నవి జఠర దేవకూటములు మేరువునకుఁ దూర్పున వేయియోజనముల దూరమునఁ బదునెనిమిదివేలయోజనములపొడుగు రెండువేలయోజనములయెత్తు నంతియ వైశాల్యము గలిగి యుత్తరమునకు వ్యాపించి యున్నవి వీనితో సమానవైశాల్యాదులు గలపవన పారియాత్ర పర్వతంబులు మేరువునకుఁ బశ్చిమభాగంబునను దక్షిణంబునుండి తూర్పునకు వ్యాపించుకైలాస కరవీర పర్వతంబులు నుత్తరమునఁ ద్రిశృంగ మకరపర్వతంబులు గల వీయెనిమిదిగిరులచేతం బరివృతం బగుమేరువు దర్భలచేతం బరివృతం బగు గార్హపత్యంబు వలె నున్నది దానిశీర్షంబునఁ బదివేలయోజనముల వైశాల్యము గలిగి సమచతురస్రమై శాతకౌంభి యనుపేరం బరఁగు చతుర్ముఖునిపురంబు కరంబు డంబుమీఱు దానిచుట్టు నష్టదిక్పాలకులగునింద్రాదులచేఁ బాలింపఁబడునెనిమిది పురంబు లున్నవి. అవి

రెండు వేల యేడువందల యోజనంబుల వైశాల్యమున నొప్పుచు సమ
రావతి తేజోవతి సంయమని కృష్ణాంగన శ్రీద్ధావతి గంధవతి మహో
దయ యశోవతి యను పేళ్ళంబరఁగుచున్న వని మఱియును. 234

ఉ. వామనమూర్తి లోకములఁ బాదముచేతను గొల్చుచుండ నా
భూమిధరంబు మీఁదుగను బోయి యజాండకటాహ మంగ్రిఘా
తామితభిన్నమై యచట నైనబిలంబుననుండి బాహ్యభా
గామృత మంతయుం దిగెఁ దదంతర మందుఁ బ్రవేశ మొందఁగన్. 235

సీ. ఆజలధారలు హరిపాదకుంకుమ
కలితముల్ సర్వపుష్కరమునందు
వ్యాపించి లోకపాపము లెల్ల హరియింపఁ
నై విష్ణుపది యనునాఖ్య వడసి
విష్ణుపదంబున విఖ్యాతనది యయి
ప్రవహించె వేల్పులవాఁక యగుచు
నామీఁదనే ధ్రువుఁ డమరియుండియు దాని
శిరమున ధరియించుఁ బరమభక్తి

తే. అవల సప్తర్షులును దన్మహాత్మ్య మెఱిఁగి
నట్టిరై దానిశిరములయందుఁ దాల్తు
రంత నది చంద్రుపై నుండి యాసుమేరు
మూర్ధమున నున్ననరనేష్టిపురముఁ జేరు. 236

వ. బ్రహ్మపురంబున నాగంగానది నాలుగుపాయలై సీత యలకనంద
చక్షువు భద్ర యను పేళ్ళం బరఁగి నలుగడం బ్రవహించి సముద్ర
ముం జేరుచుండు నందు సీతానది మేరుశిఖరాగ్రమునుండి క్రిందికి
దిగుచు గంధమాదనశిఖరంబునం బడి భద్రాశ్వమధ్యమునుండి
తూర్పుగాఁ బ్రవహించి లవణసముద్రగామిని యగుచున్నది చక్షు
ర్నది మాల్యవన్నగాగ్రమునుండి క్రిందికి మహావేగంబునం దిగి కేతు
మాల్యవర్షంబున నుండి పశ్చిమాభిముఖంబుగాఁ బ్రవహించి పశ్చిమ

సముద్రమునం గలియుచున్నది భద్రానదియు మేరుశిఖరంబునుండి యొకగిరినుండి మఱియొకగిరి మీఁదుగా నెగయుచు నీలశ్వేతపర్వతంబులం దాఁకకయె శృంగవచ్ఛికరంబునం బడి యట నుండి క్రిందికి దిగి కురువర్షమార్గంబున నుత్తరసముద్రమునం జేరుచున్నది యలకనందయు బ్రహ్మపురమునుండి దక్షిణదిశకుం దిగి నడుమ నున్నపర్వతంబులం దాఁకక దాఁటి హేమకూటహిమాలయపర్వతశిఖరంబుల భేదించుకొని కర్మభూమి యగుభారతవర్షంబునుండి ప్రవహించుచు దక్షిణసముద్రమునఁ గలియుచున్నది జంబూద్వీపంబునం దీభారతవర్షము కర్మక్షేత్రమై పుణ్యాపాపఫలం బనుభవింపం జేయుచు దీపించుచున్నది తక్కిన యెనిమిదివర్షంబులును బుణ్యాశేష మనుభవింపనుపభోగస్థానంబు లగుచు భూలోకస్వర్గంబు లనుపేరు గాంచినవి.

—♦ భారతాదివర్షములు ♦—

సీ. ఆవర్షముల నుండునందఱుఁ ద్రేతాయు
గమునందు బలె సౌఖ్యగరిమ నుంద్రు
జేజేల కెనవచ్చు తేజమునను వారు
పదివేలయేన్గులబలము గలిగి
పదివేలవర్షముల్ బ్రదుకుచు వజ్రకా
యము రతిసౌఖ్యము నమరి యుంద్రు
తత్సతుల్ కడపటఁ దా మొక్కసంతతిం
గందు రందునఁ గామగతులు చెడవు
తే. అచటి చెట్లెల్ల సర్వర్తులందుఁ బూలు
ఫలములు కిసాలములు నిచ్చుఁ బ్రజకు నట్టి
కాననములందు నాశ్రమస్థానములను
గొండచరియల విహరింత్రు నిండి జనులు. 238

చ. చిలుకలు పల్కుచున్ జెవులు చిల్లులు వోవఁగఁ గోకిలంబులున్
సలలితరీతిఁ గూయుచును సారసముల్ కలహంసముల్ కదున్

విలసనముల్ వెలార్చుచును విన్ననువొప్పఁగఁ జేయుచో సురల్
చెలువము మీఱ నంగనల చెయ్వులఁ జొక్కుచు నుందు రక్కడన్.

తే. ఇఁక నిలావృతవర్షమునకు భవాని
శాపమునఁ జేసి పురుషు లీశ్వరుఁడు దక్క
వేఱు నుండ రచట వేనవేలు స్త్రీలు
గొలువ శాంకరి యీశిత్వకలనఁ దనరు. 239

తే. అందు శంకరుఁ డనిశము హరిని మనము
నందు స్మరియించుచుఁ దపంబు నధికనిష్ఠ
సలుపుచుండును నేను నీసలలితాత్మ
నైక్యమును బొందినట్టిడ ననుచు వేఁడి.

వ. అని చెప్పి శుకుండు వెండియును. 240

—♦ హయగ్రీవుని వృత్తాంతము ♦—

తే. అవల భద్రాశ్వవర్షమునందు ధర్మ
సుతుఁడు భద్రశ్రవుం డనునుతుల కైన
ఘనుఁడు వొల్చుహయగ్రీవుఁ డనఁగ నొప్పి
తచ్చరిత్రఁ బవిత్రము ధాత్రి వినుమ. 241

ఉ. ఆవిలయంబునందు నమరారులు నల్వను గన్మొఱంగి వే
దావళిన్ హరించి చని నప్పుడుపేంద్రుఁ డెఱింగియున్ హయ
గ్రీవుఁడమై సురారులను గీటడఁగించి శుభంబు గూర్చి తా
నావరవర్షమందుఁ బ్రియ మందుచు నుండె జనుల్ భజింపఁగన్. 242

క. వేదస్వరూపుఁ డగుచున్
వేదంబుల నుద్ధరించి విశ్వప్రజలన్
బ్రోదిమెయిఁ బ్రోచి యుంటివి
శ్రీదయితా నీకు వినతిఁ జేయుదు మెపుడున్. 243

క, సృష్టిస్థితిలయములు నీ
యిష్టంబున నైనవాని కీశుఁడ వైనన్

విష్టపరూపుఁడ వైనన్
స్పష్టము నీ కెందు లేదు సంగము తెలియన్. 244

వ. అని ప్రజలాహయగ్రీవునిఁ బ్రార్థించుచుందురు. 245

క. హరివర్షంబున శ్రీహరి
నరహరిరూపమునఁ బొలిచి నలువొందెడు భ
క్తిరతి భజించెడివారల
దురితంబులు వాయఁ జేసి తొడరిన ప్రీతిన్. 246

శా. ఆవర్షంబును బ్రేముడించుచును బ్రహ్లాదుండు శ్రీనారసిం
హావిర్భూతికి మూలకారణము భద్రాశ్వాం బటం చెంచుచున్
దా విచ్చేసి భజించుచుండు హరినిన్ ధ్వన్నామసంకీర్తనం
బే విశ్వంబు సముద్ధరించు నని యెంతే భక్తి భావించుచున్. 247

సీ. దేవదేవ నృసింహ! దిక్కు మాకై మామ
కాధుల నడఁగించునట్టెఁ డగుము
మాభయమ్ముల నెల్ల మాయమై పోవఁ గా
సాక్షాత్కరింపుమా సముఖమందు
దుర్మతులకు మదుల్ నిర్మల మగునట్లు
సలిపి జగంబులు సాఁకఁ దలఁపు
మపుడు మామదులు శమాదులం దగిలి నిన్
భజియించుచుండెడు భక్తి నిడుము

తే. మాకు నింద్రియజయము సంప్రాప్త మగుచు
నిర్మలాంతఃకరణవృత్తి నిలుచునట్లు
నీదుపాదపద్మారాధనాదిర కి
విడువకుండెడునట్లు గావింపు మీశ. 248

వ. ఇంకఁ గేతుమాలవర్షవృత్తాంతంబు చెప్పెద నాకర్ణింపుము. ప్రజా
పతికి రాత్ర్యభిమానదేవత లనుపుత్రికలు నహరభిమానదేవత లను
పుత్రులునుం గలరు వారు శతవర్షరూప మగుజనులనాయుర్దాయ

మును గణించుచుందురు. వా రా కేతుమాలమున కధినాథులు వారికి వారియుపాసనదేవత యగులక్ష్మీకిని ప్రియ మొనర్ప నెంచి భగవంతుఁడు కేతుమాలమునఁ బ్రద్యుమ్నరూపుఁడై ప్రవర్తించుచు మందహాససుందరవదనారవిందవిలాసవిభ్రమంబుల విలసిల్లు నిందిరాసుందరిని గని సంతసించుచు నామెను సంతసింపఁ జేయుచుండు నట్టి సమయంబున లోకమాత రాత్ర్యభిమానదేవతలతో రాత్రులయందు నహరభిమానదేవతలతోఁ బవళ్ళయందును గూడు కొని శ్రీమహావిష్ణువు నిట్లు స్తోత్రము గావించు నో దేవా! 249

సీ. నీ వింద్రియములకు నేతవు జ్ఞానవి
జ్ఞానాదులకు నధిష్ఠాత వీవ
సకలచరాచరసంవిధాతవు వేద
ములకుఁ బ్రదాతవు జగంబులకు ధాత
వీవు నిన్ గొనియాడ నెవ్వరికిని శక్తి
లేదు స్వరూపము లేనివాఁడ
సకలప్రపంచరూపకుఁడవై వర్తింతు
వీవె జగత్సాక్షి వీవె పతివి
తే. కర్మవశ్యుఁడవై నీవు గామిఁ జేసి
నీకు నెందును భయ మన్న వాకు లేదు
భయము లన్నియుఁ బాపి నీభక్తవరులఁ
గాచి రక్షింప నేతు వో కమలనాభ. 250

చ. నినుఁ బతిఁ గాఁగఁ గైకొనిననేను గృతార్థను ధన్య నెన్న నే
మనమున వాక్కునం గ్రియల మానక నిన్నె భజించుచుందు నీ
కనికర మెప్డు నాపయిని గల్గఁగఁ జేయుము భక్తులందు నీ
కొనరెడుప్రీతి దీనిపయి నుంచినఁ జాలును భక్తవల్లభా. 251

తే. నీకు భక్తులు ప్రియు లైన నెటినే నేను
గాను దత్ప్రీతిమై నన్నుఁ గా దటందో

యని భయము నామనంబున ననిశము నగు
నేను నీభక్తురాలఁ జుమీ మహాత్మ. 252

వ. ఇట్లనిశ మాలక్ష్మి భగవంతునిం బ్రార్థించుచుండు నింక రమ్యకవర్ష
విశేషంబు లెఱింగించెద నాకర్ణింపుము. 253

సీ. మనువు రమ్యకవర్షమున కధిపతి యతం
డయ్యుగాంతంబున కరసినట్టి
మత్స్యమూర్తిని సదా మనమున నిడికొని
భజియించుచుండును భక్తిఁ జేసి
తెలియంగ సత్యమూర్తివి నీవు సర్వశ
క్తులకు నధిష్ఠాత విలఁ దలిర్చు
నవతారములలోన నాదిది యానీదు
మత్స్యావతారము మహిత మెన్న

తే. నీకు వందన మొనరింతు నోకృపాళు
నీదురూపము లోకపాలాదు లెవరు
నెఱుఁగఁ జాలరు వేదాత్మ నీవు నీకు
వందనసహస్ర మొనరింతు వాసుదేవ. 254

చ. మనుజుఁడు కట్టుబొమ్మ నొకమాదిరి సూత్రమునందుఁ గట్టి దాఁ
దనవశమందు బెట్టుకొని దానినిఁ ద్రిప్పుచు నాట లాడఁగాఁ
బొనరుచునట్లు నీవు శ్రుతిపూతరవంబున నెల్లలోకముల్
గొని వశమందుఁ బెట్టుకొని కోరిక నాడుచు నుందు వచ్యుతా. 255

మ. ఒకదైనందినకల్పమందు సకలం బుల్లోలకల్లోలమై
కకుబంతంబులు గానరానియటులై గప్పట్టు ఘోరాబ్ధిలో
సకలర్షిప్రకరంబుతోడ ననుఁ గాంక్షంజేసి రక్షించి తీ
వొకనావ న్నిలువంగఁ జేసి కరుణాళూ! నిన్ను సేవించెదన్. 256

వ. ఇట్లు మనువ మ్మత్స్యమూర్తిని ధ్యానించి సేవించుచుండు నింక హిర
ణ్మయవర్షవృత్తాంతంబు చెప్పెద విను మావర్షంబునందు భగవంతుండు

కూర్మరూపుండవై యుండఁ బితృగణంబుల కధిపతి యగునర్యముఁడు
పితృజనతోడం గూడి కూర్మమూర్తి నుపాసించి. 257

చ. అమృతముపొంటె సంద్రము సురాసురు లెల్ల మథించువేళ న
య్యమృతములందు మందరమహాద్రి మునుంగఁగ నీవు కూర్మరూ
పమున సముద్ధరించి సురవర్యులఁ బ్రోచిననిన్నుఁ గొల్చెదన్
బ్రియమనుఁడవై సదా మముఁ గృపం గనుచుండుము ప్రోచువాఁడవై.

పంచ. చరాచరాత్మకప్రపంచజాలముల్ విలాసవై
ఖరిన్ సృజింపఁ బెంపఁ ద్రుంపఁ గర్త భర్త హర్తవై
నిరామయుండవై వెలుంగునిత్యుఁ డప్పరాత్పరుం
డురుప్రభావుఁ డీవ మమ్ము నోముచుండు మెప్పుడున్. 259

వ. అని ప్రార్థించి యర్చించుచుండు నింకఁ గురువర్షం బభివర్ణింతు నాక
ర్ణింపు మందు భగవంతుఁడు వరాహరూపంబునఁ బ్రవర్తిల్లుచుండు
భూదేవి మనుష్యరూపంబున నచ్చటివారిం గూడి భక్తియోగంబునం
బ్రార్థించుచుండు వినుము. 260

సీ. ఇంద్రాది దేవత లెల్ల నీరూపముల్
యాగముల్ నీయాత్మ యగును దేవ
నీవు యజ్ఞంబవు నీజ్ఞానశక్త్యాదు
లీసృష్టి కాధారమే తలంప
శ్వేతవరాహరూపాతతఖ్యాతి కై
కల్పంబు సెల్లింతు కమలనాభ
భూతజాతమునందుఁ జాతురు పండితుల్
వీరూపమే ముక్తిఁ జేఁప పొంటె

తే. త్రిగుణములఁజేసి సృష్టియు స్థితియు లయము
సేయుచుండు ప్రపంచక మేమొదలను
సర్వమునకును సాక్షివై నిర్వహింతు
వెల్ల కార్యముల్ నీ కివే యేటికోళ్లు. 261

తే. నను రసాతలమునకుఁ గైకొని గమించు
నాహిరణ్యాక్షు నాదివరాహరూప
మునను దెగటార్చి దంష్ట్రాగ్రమునను నన్ను
నుద్ధరించిననినుఁ గొల్తు నోమహాత్మ. 262

వ. అని వినుతించి సేవించుచుండు నింకఁ గింపురుషవర్షం బభివర్ణించెద నవధరింపు మందు శ్రీరామచంద్రుండు సీతాలక్ష్మణసహితుండై వెలసి యున్నవాఁ డాంజనేయుండు వర్షజనుల గూడి సేవించుచుండు భగవంతుం డగుశ్రీరామునిదివ్యమంగళకథలను గంధర్వులు కిన్నరులు గానము సేయుచుండఁ గింపురుషవర్షజనులలో నుత్తముఁ డగునార్ష్టిషేణుఁ డనువానితోడం గూడి హనూమంతుం డాకథలాలకించుచుఁ దానును.

సీ. శ్రీరామ ! జయరామ ! శీలము వ్రతమును
సంయతచిత్తము సాధువాద
ముత్తమలక్షణాయత్తచిత్తంబును
గలవాఁడ వాత్మభక్తులను బ్రోవ
బద్ధకంకణుఁడవు బ్రాహ్మణభక్తి నీ
హృదయంబునం దెప్డు దెసక మొసఁగు
రాజాధిరాజవు రఘుకులార్ణవచంద్రుఁ
డవు నీ కొకప్పుడు దవులు కానవు

తే. రాగమోహాదు లోదేవ ! యోగిరాజ
వందనీయపదాంబుజ ! పరమపురుష
జానకీమనోరామ ! రాక్షసవిరామ
నీ కిదే వందన మొనర్తు నీరజాక్ష. 264

ఉ. నీవు ధరాతలంబున జనించితి మర్త్యుఁడవై కరంబు ప
త్నీవిరహార్తి నొందితివి. నీచమృగావళి చెల్మి చేసితో
దేవ ! యి దంతయుఁ దెలియఁ దెల్పెను లోకవిడంబనార్థ మం
చీవిధ మెంతయేనియు మహీజనబోధక మయ్యెడుం గదా. 265

క. ఉత్తరకోసలవాసులు
చిత్తమునం దెప్పుడు నిన్నుఁ జేరిచి యుంటన్
మొత్తముగ నెల్లవారికి
నుత్తరలోకముల నిచ్చితో రఘురామా. 266

—♦ భారతవర్షప్రశస్తి ♦—

వ. ఇట్లు హనుమదాదులు ప్రార్థించుచుండు రింక మనభారతవర్షప్రశస్తిం బ్రశంసించెద నిందు భగవంతుఁడు నారాయణుం డన బదరికావనంబునఁ గల్పాంతంబువఱకుఁ దపంబు గావించుచుండును. 267

సీ. అట్లు చేయుచు నతం డాత్మసాక్షాత్కార
గతి కుత్తమం బగుకర్మయోగ
జ్ఞానయోగములు మనోనిగ్రహంబును
నణిమాదు లైశ్వర్యఫణితకృతులు
ప్రాణజయంబును బాహ్యేంద్రియవినిగ్ర
హమును వర్ధిల్లెడునట్లు చేయు
నచట ఫలాపేక్ష యన రాదు లోకర
క్షార్థమే యని విజ్ఞు లరయఁ గలరు
తే. నారదమహర్షి వైదికాచారధర్మ
ముల ననుసరించి భారతీయులను గూడి
పాంచరాత్రాగమమ్ము సావర్ణిమనువు
నకును మున్నుపదేశించె నయ మెసంగ. 268

వ. ఇట్లుపదేశించి నారదుండు నారాయణునిదర్శనంబుచేసి కృతాంజలియై.
సీ. లేవు నీకు షడూర్మ్ము లీవు ముముక్షువు
లకుఁ బెన్నిధానమ వకళంకుఁడవు
కళ్యాణగుణములు గలవాఁడవు సమస్త
దోషములఁ దొలంగఁ దోలినాఁడ
వీ వెప్డు సంకోచభావము నొందని
వాఁడ వానందరూపమున నుందు

సర్వభూతముల కీశ్వరుఁడవు సాక్షివి
సకలంబునకు నిన్ను సన్నుతింతుఁ
తే. జదివియును దారపుత్రాదిసంగమందు
సతము తగులొందువారలచదువు తలఁప
వ్యర్థమును వ్యర్థతర మని పలుక వచ్చు
జ్ఞాని యగువాఁడు నీభక్తి మానఁ డెపుడు. 269
వ. కావున నో మహాప్రభూ ! 270
క. నిరుపాధిక మగుయోగము
పరమావేశమున మాకు భక్తుల మనుచున్
బరికించి యొసఁగు మందున
గురుతర మగుమాయవిద్యకున్ నాశ మగున్. 271
క. అనుచు ననేకవిధంబుల
ఘనుఁ డగునారదుఁడు మానిగణయుతుఁ డగుచున్
ముని నారాయణుని సదా
వినుతించును భారతీయవిజ్ఞులతోడన్. 272
వ. అట్టి యాభారతవర్షమందు మలయము మంగళప్రస్థము మైనాకము త్రికూటము ఋషభము కూటరము కోల్లము సహ్యము వేదగిరి ఋశ్యమూకము శ్రీశైలము వేంకటగిరి మహేంద్రము వారిధరము వింధ్యము శుక్తిమంతము ఋక్షగిరి పారియాత్రము ద్రోణము చిత్రకూటము గోవర్ధనము రైవతకము కకుంభము నీలము కాకముఖము ఇంద్రకీలము రామగిరి మొద లగుపర్వతంబులు పెక్కులు గలవు మఱియు ననేకశతసహస్రపర్వతములు గలవు వానియం దుదయించిన నదీనదంబులు వేనవే లవి యన్నియుఁ బుణ్యప్రదంబులై యల రారుచుండు నందు భారతవర్షీయులు కృతస్నాతులై పవిత్రు లగు చుందు రానదులం జెప్పెద వినుము చంద్రవట తామ్రపర్ణి యవ టోద కృతమాల వైహాయసి కావేరి వేణి పయస్విని పయోద శర్క

రావర్త తుంగభద్ర కృష్ణవేణి భీమరథి గోదావరి నిర్వింధ్య పయోష్ణి తాపి రేవ శిల సురస నర్మద చర్మణ్వతి మహానది వేదస్మృతి ఋషికుల్య త్రిసమ కౌశికి మందాకిని యమున సరస్వతి దృషద్వతి గోమతి సరయువు భోగవతి సుషమ శతద్రువు మరున్నది వృధ విత స్త విశ్వ లోనగునవి మహానదులు సింధువు శోణయనునవి నదంబులు.

సీ. భారతవర్ష భూభాగమునం గర్మ
వశమునం బుణ్యపాపప్రకార
గతు లందుచున్నారు గనుఁగొన సాత్త్విక
కర్మమునన్ దివ్యగతియు రాజ
సమున మానవలోకసముచితగతియును
దామసమున నధోధామగతియుఁ
బొందుచు నున్నారు పురుషులున్ స్త్రీలును
వర్ణాశ్రమాదులు వఱలు నిందు
తే. ధర్మకర్మములకు నిద్ది తానకంబు
తలఁప నిందుఁ బొనర్చినదానిఫలమె
యనుభవించెద రితరలోకాదులందు
దీని కెన యగుతాన మెందేని లేదు. 274

తే. ఊర్ధ్వలోకములం దుండునుత్తము లగు
దేవతలు తాము భారతదేశమహిమ
సతము పొగడుచు వా రిందు జన్మ మొందు
వారిపుణ్యము సర్వదా ప్రస్తుతింత్రు. 275

ఉ. భారతవర్షమందుఁ బ్రభవం బగువారలపుణ్య మెట్టిదో
పేరుకొనంగఁ జాల మట వెన్నఁడు వారికిఁ దోడునీడ యై
కోరక దర్శనం బిడును గొంచెము మాత్రము సాధనంబు నే
వారికిఁ బూనుకోఁ దగు నవశ్యత గానఁగ రాదు తత్కృతిన్. 276

క. మానవు లెంతో సుకృతము
పూని పొనర్చి రది గానఁ బుట్టిరి భరత

త్మానిలయమందు మా కా
మానవజన్మంబు నొంద మనసం ద్రమరుల్. 277

సీ. స్వర్గముఁ మేటిగాఁ జదువుదు రది యెన్న
సుఖకరం బనుట లసూనృతములు
కామాదులకు నిక్క లేమెయిం జూచిన
నీతిబాహ్యము గర్వనిరతిశయము
మత్తు లింద్రియవశు లెత్తఱి భగవంతు
నర్చించు టెఱుఁగ రనంతరతులు
దాని నొందం గోరి దానముల్ వ్రతములు
యాగముల్ పొనరింతు రక్కటకట

తే. అయిన నిచ్చటఁ జేసినయట్టిసుకృత
ఫలమె యచ్చటఁ గొందు రాఫలము సెల్లఁ
గ్రిందఁ బడఁ ద్రోయుదురు వారు కించు వానిఁ
బట్టి యిట్టితుచ్ఛం బగుస్వర్గసుఖము. 278

తే. కోరుచుండెడివారలు వీరిడు లని
చెప్పకయ చెప్పుచుండెడు నప్పను లయొ
నాకసౌభాగ్యమీపాటి దనుచు మదిని
మనము తలపోయరాదొకో మానవేంద్ర 279

వ. ఈభారతవర్షమందు పశాశ్వతం బగుమేనితోఁ జేసినక్రియాకలాపము భగవంతునకు సమర్పించి భగవదుపాసకు లై చావుపుట్టువులు లేనివారై పరంధామం బగువైకుంఠమును బొంది పునరావృత్తి లేక శాశ్వతానందసౌఖ్య మనుభవింతు రూర్ధ్వలోకములోఁ గల్పశతకాలమాయు వుండినను బునర్జననంబున కెప్పటి కైనం బోవలయుఁ గావున నల్పకాల మాయు వుండిన నీలోకంబునం బుట్టి యీశ్వరసమారాధనంబు గావించి ముక్తు లగుచుందురు. 28

నారాయణునికథానవ్య ప్రవాహ మే
వర్షంబు నందుఁ బ్రవర్తి గనునో
సాధుసజ్జను లగుసంయము లేచోట
నారాయణునిసేవ నడుపుచుండ్రో
మాసోత్సవంబులుం బక్షోత్సవంబులు
నిత్యోత్సవము లెట నెగడఁ బడునో
సత్యదయాశౌచసత్కర్మముల క్షేత్ర
దేశము నెల వయి తేజరిలునో

ఆ. అట్టికర్మభూమి యమరుల కభ్యర్థ
నీయ మఖిలలోకగేయ మైన
భరతవర్ష మెన్నఁ బరమేష్ఠియును జాలఁ
డన్న మనలఁ జెప్ప నవసరంబె. 281

చ. జగతి ముముక్షువుల్ తమరు సల్పినదానజపాదిసత్క్రియల్
సుగతము లైనలోకములఁ జొచ్చి సుఖించి తదంతమందు నొం
డగుకడ కర్మశేషమున నయ్యెడుఁ గావున భారతంబునన్
మగుడ జనింపఁ జేయు మని మాటికిఁ గోరుచునుందు రీశ్వరున్.

వ. మఱియు నో జనమేజయా ! సగరపుత్రులు సవనాశ్వమునకై నేలం ద్రవ్వి నిర్మించినద్వీపము లెనిమిది జంబూద్వీపంబునకుం జేరి యున్నవవి స్వర్ణప్రస్థము బృందశుక్లము ఆవర్తనము రమణకము మందేహారుణము పాంచజన్యము సింహళము లంక యనునామంబులం బోలుపొందుచున్న విది జంబూద్వీపప్రకారం బింకఁ బ్లక్షాదిద్వీపము లెఱింగించెద నాకర్ణింపుము జంబూద్వీపము లవణసముద్రముచేఁ బరివేష్టితమైనట్లు జంబూద్వీపముచే మేరువు పరివేష్టితమైనట్లు నాలవణసముద్రమును రెండులక్షలయోజనములపరిమాణము గలప్లక్షద్వీపముచే నావృతమై యగడ్తవలె నున్న దాద్వీపమున జంబూవృక్షప్రమాణము గలప్లక్షవృక్ష మున్నది. దానిచేతనే దానికాపేరువచ్చినది.

—♦ ప్లక్షాదిద్వీపములు వాని యాన్నత్యము ♦—

సీ. ఆప్లక్షవృక్షమునభ్యర్ణమున నేడు
జ్వాలలు గలిగినవహ్ని వెలుఁగుఁ
దొలిఁ బ్రియవ్రతునిపుత్రుం డిధ్మజిహ్వుఁ డా
ద్వీప మేలెను బెక్కువేలయేండ్లు
విభజించి యతఁ డేడువిధములుగా దానిఁ
దనకొడుకుల కిడెఁ దత్తదాహ్వ
యములు శివము యశస్యము సుభద్రము శాంత
మును క్షేమము నభయమును నమృతము
తే. నాఁగ నొప్పెడునవ్వేడు నామధేయ
ములఁ బ్రియవ్రతతనయు లాభూము లేలి
రందు నదు లేడు గిరు లేడు పొందుపడును
వానినామము లెఱిఁగింతు వరుస వినుము. 284

వ. మణికూటము వజ్రకూటము ఇంద్రసేనము జ్యోతిష్మంతము ధూమ్రవర్ణము హిరణ్యగ్రీవము మేఘమాలము నాఁబడు నవి పర్వతంబులు అరుణ నృమణ యాంగిరసి సావిత్రి సుప్రభాత ఋతంభర సత్యంభర నాఁబడునవి నదీవరంబు లం దాడినవారికి రజస్తమోగుణంబు లడంగి సత్వంబ సంప్రాప్త మగు నందు బ్రాహ్మణాదిసంజ్ఞలకు బదులుగా హంసులు పతంగులు నూర్ధ్వాయనులు సత్యాంగు లని నాలుగువర్ణములవారునుం గలరు వారికి వేయివత్సరంబు లాయుఃప్రమాణము వారు వేదోక్తకర్మములచే భగవంతుఁ డగుసూర్యదేవు నారాధించుచుందురు ప్లక్షాదు లగునైదువర్షంబులందును బరమాయువు నింద్రియపటుత్వము మనోబలదేహబలబుద్ధిబలము లెల్లవారికి సహజంబులై యుండు నింక శాల్మలద్వీపవృత్తాంతము చెప్పెద వినుము. 285

సీ. నాల్గులక్షల యోజనముల వైశాల్యము
గలశాల్మలద్వీప మలరు నంత

శౌలత గల్గినసురాజలనిధిచే వృతం
బగు ప్లక్షవృక్షము నంత యైన
శాల్మలివృక్ష మాత్మాతలంబునఁ గల్గు
దాని కానామ మద్దాన నయ్యె
వినతాత్మజునకు నావృక్షము నిలయ మా
నాద్వీపమును మఱి ప్రియవ్రతసుతుఁ
ఆ. డయినయజ్ఞబాహుఁ డనువాఁడు పాలించి
దాని నేడ్వురైనతనయులకును
బంచి యిచ్చె నవ్వి వారిపేరులతోడఁ
జెప్ప నొప్పె నపుడు చెన్నుమీఱి. 286

వ. అవి సులోచనము సౌమనస్యము రమణకము దేవబర్హము పారిబర్హము ఆప్యాయనము నభిజ్ఞాతము నా వ్యవహరింపంబడు నా యేడు ద్వీపములందు నేడుపర్వతంబులు గల వవి స్వరసము శతశృంగము వామదేవము కుముదము ముకుందము పుష్పవర్షము శతశ్రుతి యనం బొలుపొందు నందు నేడునదులుం గల వవి యనుమతి శినీవాలి సరస్వతి కుహువు రజని నంద రాక యని చెప్పం జొప్పడు నట శ్రుతధరులు విద్యాధరులు వసుంధరులు నిధ్మధరు లని నాలుగువర్ణముల వారు గలరు వారు వేదోక్త వర్ణాశ్రమధర్మములం గూడి పరమపురుషున్కు దేహం బగుచంద్రుని శేషుని నారాధించుచు. 287

తే. స్వకరములఁజేసి శుక్లపక్షంబునందుఁ
గ్రతుభుజులకును గృష్ణపక్షంబునందుఁ
బితరులకు నన్నముం బెట్టి పెనుచునట్టి
ప్రభువు చంద్రుఁడు మాకు శివంబుఁ గూర్చు. 288

వ. అని ప్రార్థించుచుందు రింకఁ గుశద్వీపవృత్తాంతము విను మాకుశద్వీప మెనిమిదిలక్షల యోజనముల వైశాల్యము గలిగి సురాసముద్రముచే శాల్మలద్వీప మావృతమై యున్న ట్లెనిమిదిలక్షలయోజనముల వైశా

ల్యము గలఘృతసముద్రముచే నావృతమై యున్న దందు బ్రహ్మని ర్మిత మైనకుశస్తంభ మొక్కఁడగ్నివలెం బ్రకాశించుచుండు నాద్వీప మునకుఁ బ్రియవ్రతునిసుతుం డగుహిరణ్యరేతసుం డధిపతియై దాని నేడుగా విభజించి వసువు దానుఁడు దృఢరుచి నాభిగుప్తుఁడు సత్య వ్రతుఁడు విప్రనాముఁడు దేవనాముఁడు ననుతనయేడ్వురు కుమారు లకుం బంచి యిచ్చె నవి వారిపేళ్ళం బరగుచుండె నం దేడువర్వతం బులు నేడునదులుం గలవు క్రమముగా నవి బభ్రువు జతుశృంగము కపిలము చిత్రకూటము దేవానీకము నూర్ధ్వరోమము ద్రవిణ మనం బొలుచు నవి పర్వతంబులు రసకుల్య మధుకుల్య శ్రుతవింద మిత్రవింద దేవగర్భ ఘృతచ్యుత మంత్రమాల యనునవి నదు లాకుశద్వీపవాసులు కుశలులు కోవిదులు నభియుక్తులు కులకు లు నా నాల్గువర్ణంబుల వారై యుందురు వారు పరమేశ్వరరూపుం డగునగ్ని నారాధించుచు.

మ. తెగువం జేయుమఖంబులన్ ముఖమవై దేవళ్ళకున్ హవ్య మీ
యగ మర్త్యాళికి నన్న మీయఁ దగుముఖ్యుం డైనదైవంబవై
తగి లోకంబుల నుద్ధరించుటకునై తళ్కొత్తి తో దేవ మా
వగు రొక్కుల్గొని మమ్ముఁ బ్రోచుటకు నిన్నర్థింతు మెల్లప్పుడున్.

వ. అని ప్రార్థించుచుండు రవ్వలఁ బదాఱులక్షల యోజనముల వైశా ల్యము గలక్రౌంచద్వీప మొప్పు నది యంతియ పరిమాణము గల దధిసముద్రముచే నావృతంబై యుండు నందుఁ గ్రౌంచపర్వతంబు గలదు. దానిం దొల్లి కుమారస్వామి భిన్నంబు గావింప నది దధిమంథ సముద్రమునం డాగి యుండి వరుణునిచే రక్షింపఁ బడుచుండు నాద్వీ పంబునందుఁ బ్రియవ్రతునిసుతుం డగుఘృతపృష్ఠుండు పాలించుచు దాని నేడుభాగములు గావించి తనతనయు లగునామోదుఁడు మధు వహుఁడు మేఘపృష్ఠుఁడు సుదాముఁడు ఋషిజ్యుఁడు లోహితార్ణుఁడు వనస్పతి యనునేడ్వురకుం బంచి యిచ్చి తాను దపోవనంబునకుం జనియె వారినామములచేత నాద్వీపంబులు దీపించె నందు శుక్లము

వర్ధమానము భోజనము నుపబర్హ్వణము నానందము నందనము సర్వతోభద్రము నని యేడుపర్వతంబులును నభయ యమృతౌఘ యార్యక తీర్థవతి తృప్తిరూప పవిత్రవతి శుక్ల యనునేడునదులునుం గలవు గురువులు ఋషభులు ద్రవిణకులు దేవకు లనునాలుగుజాతుల వారు గలరు వా రానదీజలంబులం గ్రుంకులాడుచు జలరూపుఁ డయిన పరమపురుషుని నుదకాంజలులతో నారాధించుచు. 291

ఆ. జలములార మీరు సర్వేశ్వరుని దేహ
భూతము లయి సేర్మిఁ బొందుచుఁ ద్రిభు
వనములను బవిత్ర మొనరించుచుంద్రు మా
పాపములఁ దొలంపఁ బ్రాంజలు లివి. 292

వ. అని ప్రార్థింతు రవ్వల శాకద్వీపం బది ముప్పదిరెండులక్షల యోజనములు గలిగి తనమానముచే నొప్పుక్షీరసముద్రముచేఁ బరివేష్టిత మందు మహోన్నతం బగుశాకవృక్షంబు గల దది తనపుష్పములచే నాద్వీప మంతయుఁ బరిమళింపఁ జేయుచు దానికిఁ దననామంబు గలిగించినది దానిని బ్రియవ్రతునిసుతుఁడు మేధాతిథి పాలించుచు నేడుగా విభజించి పురోజవుఁడు మనోజవుఁడు వేపమానుఁడు ధూమ్రానీకుఁడు చిత్రరథుఁడు బహురూపుఁడు విశ్వచారుఁడు ననుపేళ్ళు గలనేడ్వురు కుమారుల కిచ్చి తాను దపంబునకుం జనియె. ఆవర్షంబులకు నాయానామంబులు గలుగ నయ్యె నందు నీశానము నురుశృంగము బలభద్రము శతకేసరము సాహస్రస్రోతము దేవపాలము మహానసము ననునేడుగిరులును ననఘ యాయుర్ద ఉభయస్పృష్టి యపరాజిత పంచపది సహస్రస్మృతి నిజధృతి ననునేడునదులును విరాజిల్లుచుండు నందలి ప్రజలు ఋతవ్రతులు సత్యవ్రతులు దానవ్రతులు స్వవ్రతులు నను నాలుగువర్ణములవారై యుందురు. వారు ప్రాణాయామాదులచే రజస్తమంబులఁ దొలఁగించుకొని నిశ్చలసమాధి నుండి వాయురూపుం డగునారాయణు నారాధించి సేవించుచుందు రవ్వల క్షీరసాగరము

నకుఁ బిమ్మటఁ బుష్కరద్వీప మది యిరువదినాలుగులక్షలయోజనములు వైశాల్యము గలిగి యంతియ ప్రమాణము గలశుద్ధజలార్ణవముచేఁ బరివేష్టితమై యున్నది. అందు లక్షపత్రములు గలకమల మొక్కటి గల దది సువర్ణమయమై వహ్నివలె మండుచుండు నందు బ్రహ్మదేవుం డధివసించి యచట జనులచే సేవింపఁ బడుచుండు నాపుష్కరముకారణంబున నాద్వీపమునకుఁ బుష్కరసంజ్ఞ కలిగినది. దానిమధ్యభాగమునఁ బదివేలయోజనము లౌన్నత్యంబు నంతియ విశాలంబునుం గలమానసోత్తర మనుపర్వత మొకటి గలదు. దానికిఁ జతుర్దిశలందు నింద్ర యమ వరుణ కుబేరుల పురంబులు గలవు. వానికి మీఁదుగా మేరువునకుఁ బ్రదక్షిణము సేయుచున్నసూర్యుని రథమునకుఁ జక్రమై యుత్తరాయణ దక్షిణాయనము లనునవయవములతో వెలయుచుఁ బరిభ్రమించుచుండును. ఆపుష్కరద్వీపమును బ్రియవ్రతునికుమారుఁడు వీతిహోత్రుఁడు పాలించుచు రమణక ధాతకు లనుతనయిరువురుకుమారులకు విభజించి యిచ్చి తాను దనసోదరుల వలెఁ బరమపదంబు నొందె. ఆవర్షమునందలిప్రజలు చతుర్ముఖరూపుఁ డైనభగవంతు నారాధించుచు. 293

తే. నీవు పరమాత్మునకు దేహ మీవు సకల
జగములఁ సృష్టి చేయుదు స్రష్ట వైన
నిన్ను సేవించుచుందుము సన్నుతమతి
వగుచు మ మ్మెప్పుడుం గావు మనఘచరిత. 294

వ. అని బ్రహ్మదేవునిం బ్రార్థించుచుందురు. 295

తే. దేవ విను మిది పుష్కరద్వీపచరిత
దీనితో నేడుదీవుల దివ్యచరిత
నీకుఁ జెప్పితి నవ్వల వాకొనఁ దగు
వానినిం జెప్పెదను విన వలయు నిచ్ఛ. 296

క. లోకంబునకు న్నటయు న
లోకంబున కంతరమున లోకింపఁగ నై

లోకాలోకం బనుచుఁ
వాకొన నగుపర్వతంబు వర్ణింప నగుఁ. 297

వ. ఆకర్ణింపు మమ్మేరువుమధ్యభాగము మొదలుకొని మానసోత్తరభాగము వఱకుం గలభూమి యొకకోటియేఁబదియేడులక్షలు యేఁబది వేలయోజనంబులు ప్రమాణంబు గలదియై యున్నది శుద్ధోదధి మొదలుకొని లోకాలోకమువఱకుం గలభూమియు నంతియ పరిమితి గలదు లోకాలోకపర్వతశుద్ధజలసముద్రమధ్యభాగస్థ మగుభూమి కాంచనమయమై నిర్మలమై జనసూన్యమై యుండును మేరువు మొదలు లోకాలోకమువఱకుం గలదంతయు లోక మనియు లోకాలోకమున కవ్వలి భాగ మంతయు నలోక మనియుఁ జెప్పఁ బడుచుండును లోకము నలోకము నట్లు వ్యవస్థ చేయుచుండుఁ గావున నాపర్వతమునకు లోకాలోక మనుపేరు వచ్చినది భూతాదిలోకములు మూఁడును లోకాలోకమున కంతర్వర్తులై యున్నవి కావున సూర్యుఁడు మొదలు ధ్రువునివఱకుం గలజ్యోతిర్మండలము తమక్రిందుగా నున్నవారికి మాత్రమే ప్రకాశము కలుగఁ జేయుచున్నది. చక్రవాళము ప్రతిబంధకమై యుంటంజేసి యవ్వలిభాగమునకు ప్రకాశము లేకుండెడానంజేసి సూర్యప్రకాశము కలది లోకమనియు లేని దలోక మనియు నెఱుగం దగు. 298

సీ. ధ్రువమండలంబును దొరసి యున్నతము గా
నుంట లోకాలోక ముర్వీధరము
మూఁడులోకములను గూడ నంతర్భూత
ములుగఁ జేసికొనంగఁ గలిగి లోక
మనుదానికి నలోక మనుదానికిని మధ్య
మం దయి యెల్ల నా నతిశయిల్లు
నిట్టిభూపరిమితి యేఁబదికోట యో
జనము లంచు నభిజ్ఞు లనుట కలదు

ఆ. చక్రవాళనగము సరిగఁ బండ్రెండుకో
టులును నేనుపదులు గలుగుయోజ
నముల యున్నతిం బ్రమాణ్యమై నంత యా
యామమునఁ దలిర్చు నద్భుత మయి. 299

సీ. ఆకొండమీఁద నా గ్నైనదిక్కులయందు
బ్రహ్మదేవుఁడు వృషభమును బుష్క
రము వామనము నపరాజిత మనియెడు
నాల్గుదంతుల నిల్పె నలువుమీఱ
నాదంతులకును నింద్రాదులకును బహు
సామర్థ్య మలవడుచక్కిఁ గూర్చి
లోకరక్షకుఁ డయి-లోకేశ్వరుఁడు సర్వ
సంరక్షణ మొనర్పఁ జాలి యుండుఁ

తే. జక్రవాళమునకు వెనుచక్కియందు
భూరియోగప్రభావసంపూర్ణు లైన
యోగివర్యులు మాత్రమే యుకుతరాత్మ
శక్తివలనను వసియింత్రు శాంతు లగుచు. 300

వ. మఱియు భూమండలమునకు మధ్యమున సుమేరుపర్వత మున్నయది దానిమీఁదుగా భూమ్యాకాశముల నూర్ధ్వాధఃకర్పరములకు మధ్యమున సూర్యుఁ డుండును సూర్యునకు నండభిత్తికి నెటు చూచిన నిరువదియైదుకోట్ల యోజనములపరిమాణము. ఈయండము నశ్వరము గాన మృతండ మని చెప్పంబడు మృతండమువలన నైనవాఁడు కాన సూర్యుఁడు మార్తాండుఁ డని చెప్పఁబడుచున్నాఁడు. ఈయండ మధ్యభాగము హిరణ్మయము కాన బ్రహ్మ హిరణ్యగర్భుం డనఁ బడును. సూర్యుం డండపరిమాణంబునకే కాక దిగ్విభాగమునకుఁ గూడ నవధి యగుచున్నాఁడు. సూర్యుఁ డవధిగాఁ జేసికొని దిక్కులును గగనమును స్వర్లోకమును భూమిని మోక్షప్రదేశములను

నరకములను నతలాదిలోకములను విజ్ఞులు విభజించి చెప్పుచున్నారు సూర్యుఁడు దేవతలు తిర్యక్కులు మనుష్యులు లతలు వృక్షములు మొదలగుసమస్తజీవనికాయములను దృగీశ్వరుండై యధిష్ఠాతయై యున్నవాఁడు. 301

—♦ ఖ గో ళ స్వ రూ పా ది ని ర్ణ య ము ♦—

సీ. మనుజేంద్ర వినుము భూమండలపరిమాణ
మిది దీనితెఱఁ గెల్ల నెఱుగఁ జెప్పి
తిని భూమిపరిమాణమును బట్టి గగనమం
డలపరిమాణముఁ దెలిసికొనుచు
నేఁబదికోట్లయి యెసఁగుయోజనముల
యని చెప్పిరి యభిజ్ఞు లట్టిరెండు
మండలములకును మధ్యమునం దంత
రిక్షము గల దంతరిక్షమధ్య
తే. మందు నుండియు హరిదశ్వుఁ డతులితప్ర
భాసమూహమునం జేసి భాసమాన
ముగ నొనర్చుచు లోకముల్ తగఁ దపింపఁ
జేయుచుండును దద్గతుల్ చెప్పెద విను. 302

తరళము. భగవదాత్మక మై తలిర్చెడుభవ్య మై వరశింశుమా
రగణనాంచితకాలచక్రవరప్రచారఖగాళికిన్
భగణకోటికిఁ దావలం బయి వందయెన్మిదిమూఁడు లె
క్కగొని మండలమండితం బయి క్రాలుచుండు నజస్రమున్. 303

వ. ఆశింశుమారచక్రములు నూటయెనుబదిమూఁడు మండలాకారరేఖలు గలిగి యంతర్వలయ బహిర్వలయ మధ్యవలయము లని మూఁడు భాగములుగా విభజింపఁబడి యున్నవి. 304

సీ. వలయత్రయంబును బట్టియే సూర్యున
కుం గతిభేదముల్ గూడ నయ్యె

నాద్వాదశాత్మన కారోహణావరో
హణసమములు నాగ నగును మూఁడ
వస్థ లతఁడు బహిర్వలయమునుండి యం
తర్వలయమునకుఁ దరలు టరయ
నారోహణం బగు నదె యుత్తరాయణ
మనఁగ విఖ్యాతమై యలరుచుండు
తే. అట్లె యంతర్వలయమునయందు నుండి
యాబహిర్వలయమునకు నరుగుట యవ
రోహణం బగు నద్ది పేరొందు దక్షి
ణాయనం బన సంజ్ఞమై నలరుచుండు. 305

వ. మధ్యమండలగతి సమావస్థ యగు నదియె సమకాలంబు నాఁబడు
దానినే వైషువతస మని వ్యవహరింతురు. 306

క. భగవన్నియమితకాలము
ఖగనాథుఁ డతిక్రమింపకయ నియమం బొ
ప్పఁగ విశ్రమం బెఱుంగక
మొగి సంచారంబు సతతముం బొనరించున్. 307

వ. ఆసంచారంబున నారోహణమ్మునకుఁ జిరకాలంబు పట్టుటం జేసి పగళ్ళు
దీర్ఘంబు లగు రేలు హ్రస్వంబు లగు నవరోహణంబున శీఘ్రగతి
కలుగుం గావున దక్షిణాయనంబున రేలు దీర్ఘంబులై పవళ్ళు
హ్రస్వంబు లగుచుండు నయనసంధికాలంబున సమగతి యగు నప్పు
డహోరాత్రింబులు సమంబులై యుండు నని మఱియు. 308

సీ. శింశుమారమునందుఁ జెలఁగుచుండును మక
రాకార రేఖల నమరుమండ
లములు నక్షత్రములకు నభిముఖ యయి
మెలఁగ నహోరాత్రము లవి హ్రస్వ
దైర్ఘ్యము లగుచుండుఁ దద్విధం బంతయు
వివరింతు సూర్యుఁడు వృషభ మిథున

కర్కాటక మృగేంద్ర కన్యకా రాసులం
దున్నప్డు రాత్రులు సన్న మగును

తే. అట్లె సూర్యుఁడు వృశ్చికమందు ధనువు
నందు మకరకుంభఝషములందు నున్న
యపుడు రాత్రులు దీర్ఘము లగుఁ బగళ్లు
హ్రస్వము లగు మేషతులల నగును సమత. 309

వ. మానసోత్తరగిరియందు మేరుపరిధి తొమ్మిదికోట్లయేబదియొక్క యోజనముల దూర ముండు నామానసోత్తరమందు మేరుపూర్వ భాగమున దేవధాని యనుపురంబును దక్షిణమున సంయమనీపురం బును బశ్చిమమున వారుణీనగరంబు నుత్తరమున విభావరీపురంబును గలవు. సూర్యుఁడు దేవధానియం దున్నప్పుడు భూలోకవాసు లుద యం బనియు సంయమనియం దుండ మధ్యాహ్న మనియు వారుణి యం దుండ సాయంకాల మనియు నవ్విభావరియం దుండ నిశీథ మని యుం జెప్పుదురు. సూర్యుఁడు మేరువును జుట్టి వచ్చును గావున మేరువుదక్షిణమున నున్నవారి క్రింది బట్టి తూర్పు లోనగుదిక్కు లగును దద్విధంబునన యుదయాదిసమయము లగును మేరువుపడమట నున్నవారికి దక్షిణము మొదలు పూర్వాదిదిక్కులు నుదయాదు లగు నుత్తరమున నున్నవారికిఁ బశ్చిమము మొదలుకొని దిక్కులు నుదయాదిసంవిభాగములును దూర్పున నున్నవారికి నుత్తరము మొ దలు దిగ్విభాగాదులును గలుగుచుండు నిది భూలోకవాసులకు మా త్రమే. మేరువునం దున్నవారి కెప్పుడును పగలే గాని రాత్రి లేదు కావున దిగ్విభాగాదులు లేవు వినుము. 210

సీ. మేరువునకు నెప్డు సూరుఁడు సవ్యము
గా సంచరించును గాన దానిఁ
బట్టుకొనియె దిగ్విభాగాదు లగుటను
సర్వవర్షములకు సరిగ మేరు

వుత్తరంబునయందు నున్నది యన నొప్పు -
మేరువునకు నాల్గుమేరలందుఁ
నొనరుపురంబు లొండొంటికి రెండుకో
టులు ముప్పదేడులక్షలును యోజ
సీ. నములదూర మందును దీని ద్యుమణి పదియు
నైదుఘటికలలో దాఁటి యవలఁ బడును
జంద్రతారాగ్రహంబు లీచందమునను
నుదయ మస్తమయంబును నొందు చుండు. 311

వ. ఇట్లు సూర్యుఁడు వేదమయం బగునిజరథంబుతో నానాల్గుపురంబులును ముహూర్తంబులో ముప్పదినాలుగులక్షల యెనిమిది వందల యోజనమ్ములుగా సంచరించును. 312

—♦ సూర్యరథవర్ణనము ♦—

ద్విపద. ఆసూర్యరథమున కగుఁ జక్ర మొకఁడు
భాసిల్లు దానికిఁ బరఁగెడు మాస
రూపములై కడు రూఢికి నెక్క
నొప్పుచుండెం డర లుండును ఋతువు
లను నేమియుఁ ద్రికాల మనియెడునాభి
చనెడు నాచక్రము సంవత్సరముగఁ
నెంచి యుపాసింతు రెల్లరు దానిఁ
గాంచనాచల మిర్సుగా దానిశీర్ష
మం దుండు గాలిచే నది బద్ధ మగుచుఁ
బొందుపడుగ జక్రమున నొప్పుచుండుఁ
గొన మానసో త్తరకోణంబునందు
ఘనతైలయంత్రము గతిఁ దిర్గుచుండు. 313

వ. ఆకాలచక్రప్రాంతమండలియిరుసు ముందు కట్టంబడి రెండవభాగము ముప్పదితొమ్మిదిలక్షల ముప్పదియేడువేల యేనూఱు యోజనములు

పరిమితి గలిగి వాయుపాశమున మూలంబున బద్ధమై తైలయంత్ర క్షమువలె నుండు నారథంబునం దుపవేశస్థానంబు ముప్పదియాఱు లక్షలయోజనము లాయామము దానియుగ్మము నవలక్ష యోజనముల వైశాల్యము దాని కేడుగుఱ్ఱంబులు పూన్పంబడు నవి గాయత్రి బృహతి యుష్ణిక్కు జగతి త్రిష్టుప్పు ననుష్టుప్పు పంక్తి యనుఛందోనామములు గలవి సూతుం డరుణుం డనుపిచ్చుకుం టతనిరథ్యములు పురోభాగమం దున్నం దాను బశ్చాద్భిముఖుండై రథంబునకుంబూన్పు వాలఖిల్యులనువదివే లంగుష్ఠపర్వప్రమాణముల ఋషులు సూర్యాభిముఖులై భగవదాదేశంబున నతని నుతించు చుండుదురు మఱియుం. గొంద ఱచ్చరలు గంధర్వులు నాగులు యక్షులు రాక్షసులు దేవతలు ననుసప్తవిధగణంబులును బ్రతిమాస మందును బదునల్వురేసి పోయిమాసభేదమున నామభేదములం బొంది యున్నసూర్యునిన్నృత్యగానాదుల నుపాసించుచుందు రట్టి సూర్యుండు తొమ్మిదికోట్ల యేబదియొక్కయోజనముల పరిమితి గలిగి భూమండలమునకు రెండువేలరెండుక్రోశముల దూర మతిక్ర మించుచుండు ననిన రాజేంద్రుండు మునీంద్రా! నీవు మున్ను సూర్యుండు నక్షత్రాభిముఖుండై మకరాదిరాసులం జరించుచుండు నంటి విప్పుడు సూర్యుండు మేరువును ధ్రువమును జుట్టి వచ్చునంటి విట్లు చుట్టివచ్చువానికి రాసు లభిముఖంబగుట యెట్లు చెప్పు మనిన శుకుం డిట్లనియె. 314

— చంద్రసూర్యగ్రహనక్షత్రాదిసంచారము —

సీ. చరియించు కుమ్మరిసారె సమాశ్రయిం
చినచీమ చక్రగమనము గంటె
భిన్నగతిం గల్గి వెసఁ దిర్గుచున్న కు
మ్మరిసారెపై నది తిరుగుచు మఱి
యొకచోటఁ దిరుగు వేఱొకచీమఁ గలయు నా
కరణి గ్రహములు నక్షత్రములును.

నాధారభూత మహానాశింశుమారము
మేరువు ధ్రువమును జేరి తిరుగు

తే. మకరముఖరాసులును గతిమంతము లయి
తిరుగు సూర్యాదులం గూడి తిరుగుచుండు
నదను పొదలెడుఁ గావున నది తెలియం గ
సంభవం బనుట పొసంగఁ బోదు. 315

సీ. ఆదినారాయణుం డాదిత్యుఁ డనుపేర
శీతాతపాదులఁ జెలఁగఁ జేసి
తాను బండ్రెండువిధములై పిదప వ
సంతాదిఋతువుల సాఁగఁ జేసి
శ్రుతిచోదితుం డయి సుజనులచేత ను
పాసితుం డగుచుండె భూసురాళి
సవనాదు లొనరించి సతతంబు శ్రేయముఁ
మోక్షము నవ్వలఁ బొందుచుండు

తే. అతఁడు [illegible]్యమున నుండు
శింశుమారమునం దుండి చెల్లురాసు
లందు భగణాభిముఖముగా నరుగుచుంట
వత్సరావయవము లయి వఱలు నెలలు. 316

వ. అవి చాంద్రమానంబునఁ బక్షద్వయ మనియు సౌరమానమున సపాదనక్షత్రద్వయ మనియుఁ బిత్రుమానమున నక్తందినము లనియు వ్యవహరింపంబడుఁ బండ్రెండు నెలలతోఁ గూడినసంవత్సరంబునం దాఱు మాసము లుత్తరాయన మనియు నాఱుమాసములు దక్షిణాయన మనియుం జెప్పంబడు సూర్యుండు మంద శీఘ్ర సమగతులు మూఁడు నం గూడినకాలము సంవత్సరం బనియుఁ బరివత్సరం బనియు నిద్వత్సరం బనియు నిడావత్సరం బనియుఁ జెప్పుదురు. 317

ద్విపద. నక్షత్రపతి దిననాథునికంటె
లక్షయోజనముల లక్షింపఁ బడెడు

దూరంబు మీఁదుగాఁ దోఁచి వర్తించు
సూర్యుండు వడి గల్గి సారిదిఁ బండ్రెండు
రాసులం దాఁటినక్రమమున నేఁడు
భాసిల్లుఁ జంద్రునిపదియాఱుకళలు
నక్షీణ మగునప్పు డయ్యెడు శుక్ల
పక్షంబు క్షీణమై పస చెడునప్డు
కృష్ణపక్షం బని కీర్తింపఁ బడును
జిష్ణురూపుం డగు శీతాంశుపక్ష
ములు రెండు పితలకుఁ బొలుచు రేఁబవలు
చలువ నిడి యతండు సౌఖ్యం బొసంగు. 318

తే. అతఁ డొక్కొక్కనక్షత్రమందుఁ జేరి
ముప్పదిముహూర్తములకాలమునను దాని
దాఁటి పదునాఱుకళలతోఁ దనరుమాస
మునకు నధిదేవత యనంగఁ బొదలుచుండు. 319

వ. అతండు మాసాధిదేవత యగుటం జేసి మనోమయుం డనియు నోష
ధీశుం డగుట నన్నమయుం డనియు సకలజీవిజీవనంబునకు హేతు
భూతుండగుటం జేసి యమృతమయుం డనియు దేవతలకుఁ బితృదేవత
లకు మనుష్యులకుఁ బశుపక్షిసరీసృపాదులకును దరుగుల్మలతాదుల
కును సుఖము గలిగించుటం జేసి సర్వమయుం డనియుఁ గీర్తింపఁబడు
చుండు నని మఱియును. 320

సీ. ఇందుమండలమున కింత మీఁదుగ మూఁడు
లక్షలామడలపై లక్షిత మగు
కడ నభిజిత్తుతోఁ గలసినయిరువద
యెనిమిదితారక లెసక మెసఁగి
కాలచక్రమునందుఁ గలిగినవై మేరు
వునకుఁ బ్రదక్షిణమును బొనర్చు

నామండలమునకు నవల ద్విలక్షయో
జనముల దవ్వునఁ దనరు శుక్రుఁ
తే. డతఁడు రవివెన్కముందుల నంటి నడచు
నెదుట నగుచుక్కలను దాఁటి యేగి నపుడు
వాన లుండవు వెనుక నై వఱలునపుడు
వర్షములు భూమిఁ బడు నని పలుకు శ్రుతులు. 321
తే. బుధగతియు శుక్రగతికిని బోలి యుండుఁ
బూషకును వెన్కముందులఁ బోవుచుండుఁ
గవికి మీఁదుగ రెండులక్ష లగుయోజ
నముల దూరమునం దుండు నని తెలియును. 322
వ. ఆబుధుండు లోకాపకారి యందు రతిచారముచే సూర్యునకు ముందు
గఁ జరించినపుడు మహావాయువు విజృంభించు ననియు మేఘములు
వ్యాపించు ననియు ననావృష్టిదోషము సంభవించు ననియుఁ బ్రసిద్ధి
గలదు. బుధమండలమునకు మీఁద రెండులక్షలయోజనంబులదూరం
బున నంగారకమండలం బగు నంగారకుండు పక్షత్రయంబున నొక్కొ
క్కరాసిగా నెల్లరాసులు నతిక్రమించుచుండు నశుభగ్రహ మైనను
వక్రగమనము లేనిచో శుభకరుం డగును. 323
సీ. కుజమండలంబునకుఁ మీఁదు గా రెండు
లక్షలయోజనాల్ దాఁటినపయి
గురు వగు నతఁడు వత్సరమున నొకరాశి
గా సంచరించుచు బ్రాహ్మసురులకు
శుభదుఁ డామీఁద నశుభము లిచ్చుచు రెండు
లక్షలయోజనాలకుఁ గడపట
శని యగు మందుఁడై కన ముప్పదేసిమా
సములుగాఁ బ్రతిరాశి నమరియుండు
తే. మందునకు మీఁదిభాగమునందుఁ బదియు
నొండులక్షల లెక్క నాయోజనముల

దూరమున సప్తఋషు లుండ్రు వారు ధ్రువుని
చుట్టుఁ దిరుగుచు నుందురు శుభదు లగుచు. 324

వ. సప్తర్షి మండలంబునకు మీఁదుగాఁ బదుమూఁడులక్షల యోజనముల దూరమున ధ్రువమండలము దీపించు నది పరమపదం బనం దగు సందు నుత్తానపాదునిపుత్త్రుం డగుధ్రువుం డధివసించు నగ్నీంద్ర ప్రజాపతి కాశ్యప ధర్ము లెపుడు సగౌరవంబుగా నాధ్రువునిఁ బ్రదక్షిణించు చుందు రామండలంబునఁ గాలచక్రంబునం దిరుగు సూర్యాదిగ్రహంబులకు నశ్విన్యాదినక్షత్రంబులకు నాధార మగునట్లు స్థాపింపం బడి స్థాణువువలె ధ్రువుండు చూపట్టుచుండు గ్రహనక్షత్రాదు లాకాలచక్రమున బహిరంతర్భాగంబుల ధ్రువు నవలంబించి పరిభ్రమించుచుండును కొందఱు యోగులు యోగధారణంబునం జేసి జ్యోతిర్గణంబునకు శింశుమార మాధార మని తెలియుచున్నారు. మఱియుం గొందఱు భగవంతుఁడు సర్పమువలెఁ దననేను కుండలీకరణము చేసి క్రిందికిఁ దలయును మీఁదికిఁ దోఁకయు నుండం జేసి పుచ్ఛాగ్రంబున ధ్రువుం డున్నట్లు కొంచెము క్రిందుగాఁ బ్రజాపతియు వానికి నధోభాగంబున నగ్నీంద్రధర్ములును బుచ్ఛమూలంబున బ్రహ్మయుఁ గటియందు సప్తర్షు లున్నట్లును దమయోగమహిమం దెలిసికొనుచున్నారు. మఱియు శింశుమారముదక్షిణభాగంబున నభిజిత్సహితము లగుశ్రవణాదిపునర్వస్వంతము లగుపదునాలుగు నక్షత్రములు నుత్తరపార్శ్వమునఁ బుష్యమి మొద లుత్తరాషాఢదనుకం గలపదునాల్గునక్షత్రములు నున్నట్లు చెప్పుచున్నారు శింశుమారము పృష్ఠమున సూర్యుని దక్షిణాయనము నట గంగానదియును గల దందురు. దక్షిణమునఁ బుష్యమీనక్షత్రము నుత్తరమునఁ బునర్వసు పిఱుందులయందు నార్ద్రాశ్లేషలును బాదములందు నభిషిదుత్తరాషాఢలును నేత్రములందును ధనిష్ఠామూలలు కర్ణములందును శతభిషజ్యేష్ఠలు స్కంధములందును మృగశీర్ష రోహిణి కృత్తిక యశ్విని రేవతి యుత్తరాభాద్ర

పూర్వాభాద్ర యను నెనిమిదియు దక్షిణపార్శ్వమునందును మఖ
పూర్వఫల్గుని యుత్తరఫల్గుని హస్త చిత్ర స్వాతి విశాఖ యనూరాధ
యను నెనిమిదియు వామపార్శ్వమునందును యోగు లనుసంధానము
చేయుచుందురు. మఱియు దక్షిణోత్తరకపోలప్రాంతదేశములందు
వరుసగా నగస్త్యుఁడు యముఁడును ముఖమునఁ గుజుఁడు గుండెల శని
గళముక్రింద బృహస్పతి యురంబున రవి హృదయంబున నారాయ
ణుఁడు మనంబునఁ జంద్రుఁడు నాభి శుక్రుఁడు స్తనములం దశ్వినీ
దేవతలును ప్రాణాపానముల బుధుఁడు గళమున రాహువును
సర్వాంగములఁ గేతువును రోమకూపంబుల సమస్తతారాగణంబును
ననుసంధానము చేయుచున్నా రిట్లు చూపట్టు నిట్టి శింశుమారమును
భగవంతునిరూపముగ నెంచి ధ్యానించువారు సుకృతాస్థానంబు
నొందఁ గల రని మఱియు. 325

తే. పూషకుఁ బదివేల్ యోజనములను గ్రింద
రాక్షసుఁడు సింహికేయుఁడు రాహు వనఁగ
నొప్పు నుడు వయి దేవత్వ మొంది వాని
చరిత మవ్వలఁ జెప్పెద నరవరేణ్య. 326

తే. రవికి మీఁ దయి వెలుఁగుచంద్రమునికొలత
పదియు రెండువేలామడల్ వానిక్రిందఁ
బొదలు సింహికేయుఁడు పదుమూఁడు వేల
యోజనంబులు విరివియై యొప్పుచుండు. 327

తే. పుణ్యవంతుల మండలములను మించి
రాహుమండల మొప్పు నా రాహు వర్క-
చంద్రములను నాచ్ఛాదించు స్వప్రకాశ
గతుల నొక్కప్పు డవ్వియే గ్రహణము లగు. 328

ఆ. అట్లుకప్పఁబడినయాచంద్రసూర్యులు
హరిని శరణుఁ జొత్తు రపు డతండు

వడి సుదర్శనంబు వానిపై నిగిడింపఁ
దొలఁగి పోవుచుండు నిలక తమము. 329

సీ. ఘనరాహుమండలమునకును బదివేల
యోజనంబులక్రింద నొప్పఁ బ్రేత
భూతపిశాచాదిముఖ్యగణంబులు
గ్రహహీన మగునింగిఁ గాన వచ్చు
నది గాలి మబ్బులు పొదలెడునంతటి
దాఁక వ్యాపించినదై కన నగు
నంతరిక్షము నాఁగ నలరుదానికి నూఱు
యోజనంబుల క్రింద నుర్వి యెసఁగు

తే. ఉర్వికిం గ్రింద వివరము లొప్పు నేడు
తెలియఁ బదివేలయోజనములు చదరము
గలది యొకఁ డొక్కఁడాభూమితలము కంటె
నందు భోగభాగ్యమ్ము లత్యధికము లగు. 330

—♦ పాతాళాదిలోకప్రస్తావము ♦—

వ. ఆవివరములు వరుసగా నతల వితల సుతల రసాతల తలాతల మహా
తల పాతాళము లనంబడుచుండు. 331

మ. అవి స్వర్గంబునకన్న మిన్న లనుచుర్ వ్యాహారముం జేయఁగాఁ
దవు నం దున్నవిలాసముల్ విభవముల్ ద్రవ్యంబు నైశ్వర్య మే
భువనంబందును లేవు తద్గరిమముం బోలించి వర్ణింప నే
కవియుం జాలఁడు కార్ద్రివేయు లసురుల్ గాణాచులై యుండెటర్.

తే. అందు నుద్యానవనములు నందనమును
గ్రిందు పడఁ జేయుఁ గేళికాగేహము లవి
వైజయంతాదులకు బొమ్మ వైపఁ జాలు
నం దొనరువారు స్వర్గాదు లాసపడరు. 333

క. అం దెసఁగుచుండు దానవు
లందఱు మాయావినోదులై మోద మెదం
బొందుచు నుందురు మాయా
సందోహవిరాజి మయుఁ డెసంగెడు నచటన్. 334

సీ. మయుఁ డాపురంబులు మణిమయంబులు స్వర్ణ
మయములుగా నిజ మహిమఁ జేసెఁ
బ్రాకారములు గోపురములు సభాభవ
నములు చతుష్పథసముదయములు
రథ్యామహావృక్షరాజముల్ దర్శనీ
యములగు నెల్లలోకముల కైనఁ
గృత్రిమ భూములుం గ్రీడాసరస్సులు
కేళికాగిరు లందు వేలు కోట్లు

తే. వనుల శుకములు పికములు భ్రమరములును
సరసులన్ హంసములు బకసంచయములు
సతతకోలాహలధ్వనుల్ సలుపుచుండ
నచటివా ర్వని యానంద మందు చుండ్రు. 335

తే. అట నహోరాత్రములు లేనివగుటఁ జేసి
యాయువు క్షయించు ననుభయ మచట నుండు
వారలకు లేక చిరజీవులై రహింత్రు
రవికి నచ్చోటులన్ విహారమ్ము లేదు. 336

వ. ఫణిఫణామండలప్రేధితమణీగణ
కాంతిచే నచటఁ జీఁకట్లు వాయుఁ
నచ్చటివారు దివ్యౌషధంబులు రసా
యనములు సేవించి యామయములు
పో నడంచియు యావనానంతసంపదల్
గలిగి వర్తింతురు క్రతుభుజు లటు

శ్రమము స్వేదము ముదుసలితనమును దేహ
మాలిన్యమును లేక మసలుచుంద్రు
తే. వారికి సుదర్శనభయంబు వఱలుఁ గాని
యితరభయము లేమియును లే వతలమందు
మయకుమారుఁడు బలుఁ డనుమాయలాడు
తండ్రి మించినవాఁడు విద్యాపటిమను. 337

వ. ఆబలుండు పుట్టించినతొంబదితొమ్మిదిమాయలలోఁ గొన్నిమాత్ర మిప్పుడు కొందఱుమాయావులు చేకొనుచున్నారు. ఒకనాఁడు బలుఁ డావులింపఁగా వానిముఖంబునుండి మూఁడుస్త్రీగణంబు లుదయ మయ్యె వారు స్వైరిణులు కామినులు పుంశ్చలు లనుపేళ్ళం దాల్చి రందు స్వజాతితోఁ గ్రీడించువారు స్వైరిణులు. ఇతరజాతులతోఁ గూడ రమించువారు కామినులు చంచలస్వభావము గలవారు పుంశ్చలులు వారు. 338

చ. బిలముల కెవ్వఁ డేనియుఁ బ్రవేశము చేసిన వానికిన్ మహో
జ్జ్వల మగుహాటకం బనురసాయన మానఁగ నిచ్చి భోగమం
దలఘుసమర్థతన్ గలుగునట్టులు చేసినమీఁద వారితోఁ
గలసి సుఖింతు రందుఁ గలకాంతలు వారు నిరంతరంబునన్. 339

ఉ. హాటకపానమున్ సలుపునట్టిజనుల్ పదివేలలెక్క నా
నేటిమతంగరాజముల మిక్కిలి శక్తిగలట్టిరై గడుం
బాటవ మేర్పడన్ సకలపల్లవపాణులమన్మథార్తులన్
మాటికిఁ దీర్చుచుండెదరు మారటమారు లొకో యనంగ నై. 340

సీ. అట హాటకేశ్వరుం డనుపేర రుద్రుఁడు
పరఁగుచునుండుఁ దచ్చరిత వినుము
సృష్టిప్రజావృద్ధి సలుపు మంచును రుద్రు
నకు నాజ్ఞ యొసఁగె ననంతరమున
నతఁడు పార్వతితోడ నతనుకేళిం దేలు
చుండె వారలవీర్య మొక్కమొగిని

హాటకి యనుపేర వాహినియై పాఱె
నగ్నిహోత్రుఁడు దాని నాహరించి
తే. త్రక్కె నయ్యది హాటకాఖ్యను సువర్ణ
మయ్యె వితలనివాసు లాహాటకమున
నగలు చేయించుకొని దాల్తు రగధరుండు
హాటకేశ్వరనామము నందె దాన. 341
తే. వితలమునకుఁ గ్రింద సుతలంబతిశయిల్లు
నందు బలిచక్రవర్తి నిత్యము నివాస
ముండు నింద్రాదులకు లేనియురుతర మగు
వైభవము గల్గి దేవతావంద్యుఁ డగుచు. 342
తే. బలి త్రిలోకములం గెల్చి ప్రబలియుండ
వామనుం డయి హరి వానివైభవంబు
నొడిచి కొని యింద్రునకు నిచ్చి వడిగ నతని
నచటికిం బుచ్చెఁ దొల్లింట నలరి యతఁడు. 343
మ. హరి భూదానము సంగ్రహించి బలికిన్ బ్రాప్తిప్రదానంబు గాఁ
గరుణం దా నపవర్గ మీక యచటం గట్టెన్ వదాన్యుండు భ
క్తిరతుం డాబలిచక్రవర్తి యతనిం గీర్తించుచున్ దద్బిలాం
తరమం దుండె ను ద్వారపాలకుఁ డయై దామోదరుం డచ్చొటన్.
చ. సుతలముక్రింది భాగమున శోభిలుచుండుఁ దలాతలం బటన్
స్థితి గొని యుండు దైత్యకులశిల్పి మయుండు పురత్రయేశ్వరుం
డతనిని రుద్రుఁ డల్కమెయి నప్పుడు క్రిందికిఁ ద్రోయ నప్పురిన్
వితతయశోవిశాలుఁ డయి విశ్రుతికెక్కుచు నుండె దండియై. 345
క. దాని కధోభాగమునన్
జానొందు మహాతలంబు సంపత్కరమై
గానఁబడుచుండ్రు కద్రూ
సూనులు పెక్కండ్రు విభవశోభితు లచటన్. 346

వ. ఆమహాతలంబు క్రోధవశంబునాఁ బేర్కొనంబడు నందు సర్పశ్రేష్ఠులై కుహకుఁడు తక్షకుడు కాళియుఁడు సుషేణుఁడు లోనగువారు ముఖ్యులు వారు గరుడభయంబున నట వచ్చి కుటుంబములతోఁ గాపురం బుండిరి దానిక్రిందిభాగమున రసాతలం బందు దితిదనుసంతతులవారు ఫణు లను పేర వ్యవహరింపఁబడుదు రందు నివాతకవచులు కాలకేయులు హిరణ్యపురవాసు లని మూడు తెగ లై యుందురు. 347

ఉ. వారు సుపర్వవర్యులకు వైరులు జన్మముచేతనే మహా
శూరతయున్ బలంబు గలశోభనమూర్తుల యై తలిర్చుచున్
వేరికినే నసాధ్యు లయి వీసరవోవనివిక్రమంబునన్ .
స్వైరవిహారమున్ సలుపువా రయి యుంద్రు రసాతలంబునన్. 348

వ. ఆరసాతలంబున కధోభాగంబునఁ బాతాళ మందు వాసుకి శంఖకుళికుఁడు మహాశంఖుఁడు శ్వేతుఁడు ధనంజయుఁడు ధృతరాష్ట్రుఁడు శంఖచూడుఁడు కంబళుఁడు నశ్వతరుఁడు లోనగువారు సర్పరాజు లుందురు. వారు మహాబలపరాక్రమసంపన్ను లందుఁ గొందఱు పంచ షట్సప్త శీర్షంబులు గలవారును దశ శత సహస్ర శీర్షములు గలవారునై యుందురు వారు తమశిరోమణులచేఁ దమలోకంబుల చీఁకట్లం బాపుచుందురు. 349

సీ. పాతాళమున కధోభాగమునందుఁ ద్రిం
శద్యోజనములవైశాల్యము గల
నంతర మొక్కఁ డౌ నందును దామసా
హంకారమునకు నిరంతరం బ
ధిష్ఠాతయు ననంతధీసంజ్ఞ గలదియు
నగుభగవత్కళ యగు నొకఁ డది
జ్ఞాతకున్ జ్ఞేయమునకు జ్ఞాన మిదుఁ గాన
సంకర్షణుం డని సంజ్ఞ గాంచు
తే. మఱియు దాని కనంతనామములు గలవు
వేయిఫణము లద్దానికి వెలయుచుండు

నం దొక శిరంబునఁ భూమి యావగింజ
వలెఁ గనంబడుచుండు ననంతుఁ డతఁడు. 350

ఉ. రెండుపరార్థముల్ చనినఁ దేవట సర్వము సంహరింప నై
మెండగు కోపముం గలిగి మీఁదికొమల్ ముడివెట్టు నందులో
నుండి త్రినేత్రముల్ గలిగి యుగ్రులు దోఁచి త్రిశూలధారు లై
యొండన కంతయు న్విలయ మొందఁగఁ జేయుదు రీశ్వరాజ్ఞమై. 351

వ. అచ్చటిసర్పరాజు లాసంకర్షణుని సేవించి జీవించుచుండు రచటి నాగకన్యకలు వానివలనం బురుషార్థము లభిలషించుచు వానిభుజంబులకు నుదరంబునకుం గుంకుమచందనంబు లలంది సంకర్షణుని వదనారవిందదర్శనంబునం గృతార్థ లగు చుందు రనంతుండును దన తేజస్సమూహముచేఁ గడల వెలుంగం జేయుచు లోకకళ్యాణ మాచరించుచుండును మఱియు సురలు నసురులు నురగులు సిద్ధులు సాధ్యులు గంధర్వులు విద్యాధరులు లోనగువారు సర్వదా నమ్మహాపురుషుని సేవించుచుండు రతండును ముదితుండై సుందరమందహాసపూర్వకంబుగా నిజసేవకుల వచనామృతంబులఁ దృప్తులఁ గావించుచు వైజయంతీమాలావృతుండై నల్లనివస్త్రము ధరించి మకరకుండలమండితగండస్థలుండును సుందరసుకుమారకరధృతహలాయుధుండును నై ధ్యానించుచుండుముముక్షులం దపార ప్రేమంబుఁ జూపుచు హరినయనంబులందును హృదయంబులందును బొందుపడి వారిహృదయగ్రంథివిచ్ఛేదము గావించుచుండు నట్టిభగవంతుని నారదాదులు బ్రహ్మసభలో నివ్విధంబున గానంబు చేయుదు రాకర్ణింపుము. 352

సీ. సత్వరజస్తమోంచద్గుణంబులు మూఁడు
సృష్టిస్థితిలయప్రసిద్ధకార్య
ములఁ జేయఁగ సమర్థములు కాక యున్నచో
నేమహాత్మునిదృష్టి యొసఁగ మెసఁగ
బ్రహ్మాదిరూపముల్ వడసి సమర్థము
లై క... త్యము లై తలిర్చు

నేవాఁడు తనయందు దేవమనుష్యాది
రూపముల్ లే కొక్కఁ డేపుమీఱుఁ

తే. బ్రకృతిపురుషాత్మకం బయి వఱలువేని
రూపు క్రియలందు నానాత్వరూఢి నొందు
నట్టిసంకర్షణు ననంతు నమలమూర్తి
నాదిమధ్యాంతరహితు నే నభినుతింతు. 353

చ. వనులు సముద్రముల్ గిరులు పత్తనముల్ గలభూమి నంతయుఁ
దనయొకశీర్షమందు సతతం బణువట్టులు దాల్చి కంధిలో
మునుఁగకయుండఁ జేయుచును మోయుచు నెవ్వఁ డెసంగునో ఘనుం
డును మహనీయుఁ డాతనిఁ గడంగడఁ భక్తి నమస్కరించెదన్. 354

వ. అని చెప్పి శుకుం డో రాజా! నీకు భూగోళ ఖగోళాదులయు లోకంబులయు వృత్తాంత మంతయు సవిస్తరంబుగా వేదోక్తక్రమం బునం జెప్పితి నింక నేమి యడుగుదు వనినఁ బరీక్షిన్నరపాలుండు మహాత్మా! భూలోకంబునం జేసినకర్మములఫలంబు సుఖము దుఃఖము మిశ్రము లగుఫలంబు లనియు నవి వారివారిశ్రద్ధాభక్తులం జేసి కలుగుచుండు ననియుఁ గామ్యకర్మరూపము లైనపాపములకు ఫలం బుల కగుస్థానంబు లనంతంబు లనియుం జెప్పితి విప్పు డానరకంబుల వృత్తాంతంబు విన నెంచితి నవి యెన్ని యెం దున్నవి యేవిధంబున నున్నవి యెఱింగింపు మనిన నతం డతని కి ట్లనియె. 355

—♦ నరకలోకము-శిక్షాస్మృతులు ♦—

సీ. ఆనరకములు బ్రహ్మాండమునకు నంత
రమునంద యున్నవి క్షమకుఁ గ్రిందుఁ
గా జలంబులకుఁ బైఁగా దక్షిణాశను
ఘోరరూపంబులై నారయనగు
నచట సంయమనీపురాధినాథుఁడు సమ
వర్తి యముఁడు రాజ్యపాలనంబు

పొనరించుచుండు నాపొంత నగ్నిష్వాత్త
ముఖపితృదేవతల్ పొదలుచుండ్రు

తే. జముఁడు కర్మానుగుణ మయి చనెడుదండ
నమ్ము జీవులకుం జేయు నమ్మహీ నిరు
వదియొకం డగునరకముల్ పొదలు ననుచుఁ
జెప్పుచున్నారు వానినిఁ జెప్పెద విను. 356

వ. తామిస్రము నంధతామిస్రము రౌరవము మహారౌరవము కుంభీ
పాకము కాలసూత్రము నసిపత్రవనము సూకరముఖము నంధకూపము
క్రిమిభోజనము సందంశము తప్తసూర్మి వజ్రకంటకశాల్మలి వైతరణి
పూయోదము ప్రాణరోధము విశసనము లాలాభక్షణము సారమే
యాదనము నవీచిమంతము నయఃపానము నను పేళ్లం గలయివి
యేకవింశతినరకంబులు మఱియు క్షారకర్దమము రక్షోగణభోజనము
శూలప్రోతము దందశూకము నవటనిరోధము పర్యావర్తనము సూచీ
ముఖము నననివి యేడును నరకసంజ్ఞ గలిగి యుండు నివి పాపాను
భూతిస్థానంబు లింక నేపాపమున కేనరకమో చెప్పెద నాకర్ణింపుము.

సీ. పరధనపరదారపరసంతతుల నెవ్వఁ
డపహరించునో వాని నవలఁబట్టి
కాలపాశంబులం గట్టి పరేతరా
డ్భటులు సంయమనికిఁ బట్టుకొనుచుఁ
బోయి తమోవృత మై యుండుతామిస్ర
మునఁ బడ వైతు రావెనుక పర్వ
తాగ్రము నెక్కించి యట్టిపడం ద్రోతు
రంత దండములఁ దాడింతు రోలి

తే. ఇట్లు బహువిధముల హింస లెన్నొ చేసి
యెంత యేసియు బాధింత్రు జంతు వపుడు
చేయునది లేక చేసినచేతలకును
జింతిలుచు నంతలోన మూర్ఛిల్లుచుండు. 358

మ. తనకుం బోషకుఁ డైనవానిధనముం దారాదులన్ వంచనన్
గొని స్వార్థంబుగఁ జేసికొన్నఖలునిం గొం చంధతామిస్రమం
దు నొగి న్వైచి గదాసితోమరములన్ దోట్రిల్లగాఁ జేయఁ నం
ధునిచందంబున నై మహార్తిఁ బడు నెంతో వంత కై చింత కై. 359

వ. తామిస్రముకంటె నంధతామిస్రము కొన్నిమడుంగు లెక్కువయై
జంతువులదృష్టిసంహారము గావించు నదిగాన దాని కాపేరు వచ్చినది.

మ. ఇది నామే నిది నాకళత్ర మిది నాయి ల్లిద్ది నా కైనమేల్
పదమం చేడు మమత్వమున్ విడక సర్వద్రోహముం జేయుచున్
దుద కేకాకికి నైన వేయకయ బంధుల్ తానును న్మెక్కుదు
ర్మద నారౌరవమందు వైచిమిగులన్ మర్దింత్రు రోఁకళ్ళతోన్. 361

ఉ. భూతద్రోహము చేసి నట్టిదురితాత్మున్ రౌరవంబందు ని
ర్ఘాతం బేర్పడ వైవ వానివలనన్ రారాపులం బడ్డయా
భూతంబుల్ రురురూపమున్ బడసి చంపుం గొమ్ములం గ్రుమ్మి వి
ఖ్యాతం బయ్యెను రౌరవంబు రురువుల్ గాటంబు వేధించుటన్. 362

వ. ఇట్లే మహారౌరవంబునందును రురువులు వచ్చినవానిం జీరి కాఱేన
నెత్తును మాంసంబునుం దిను నిదియ విశేషంబు. 363

సీ. ఎవ్వాఁడు స్వోదర మ్మెప్రొద్దు నిండించు
కొంచును బశుపక్షికోటులకును
హింస గావించినహీనకిరాతుని
రాక్షసుల్ వేధించి రాచి రాచి
కుంభిపాకమునందుఁ గూలఁ ద్రోయుచు వండి
వచనము సేయగాఁ బొల్పుదుదురు
వాని నచ్చటఁ దప్త పాత్రమునం బడ
ద్రొబ్బుదు రానూనెఁ గుబ్బునందుఁ

తే. గాలసూత్రము నాఁబడుఘననరకము
నందుఁ బదివేలయోజనా లాయత మగు

త్రామవన మొందు గల దందు దహనుఁ డున్కి-
మండుచుండు నజస్ర మమందగతుల. 364

తే. తల్లిదండ్రుల విప్రులఁ ద్రెళ్ళ నేసి
నట్టిదుష్టు నావనమున యందు మీఁదఁ
బెట్టి క్రిందను మండించి వీతిహోత్రుఁ
గాల్చి పుత్తురు ప్రాణముల్ గలిగియుండ. 365

శా. వాఁ డానిప్పులలోన వేగుచు మహాబాధం బడన్ లేక నో
ఱేఁడా ! చచ్చితిఁ బైకిఁ దీయుఁ డనుచున్ ఱేయిం బవళ్ళార్వగా
నేఁడుం బల్కఁడు గుల్కఁ డిట్లు పసిమై నెన్నే నెఱుల్ గల్గునో
వాఁ డన్నేఁడులు నంచు నుండి మిగులన్ వాపోవుఁ దాపంబునన్. 366

మత్త. కాలసూత్రము నాఁగ నింతగు కాల మంచు నియామ మె
ప్డాలకింపఁగ రానియ ట్లయి యాతనల్ పొసఁగించు నం
దాలఁ బొందినవాని నాలను హానిచేసినవానినిన్
గూలఁ ద్రోయుదు రెల్ల కాలము కుయ్యి వెట్టుచు నుండఁగన్. 367

తే. వేఁడు వేదోక్తకర్మముల్ విడిచి వేద
రహితకర్మములం జిక్కి విహితధర్మ
మున విడినపాపి నసిపత్రవనమునందుఁ
బరుగు లెత్తింత్రు మేనెల్లఁ బగిలిపోవ. 368

ఆ. రాజు గాని లేక రాజభటులు గానిఁ
దండనార్హుఁ డయినధరణిజనుని
వదలి యితరుఁ డైనవాని దండించిన
యతని సూకరముఖమునయం దిడుదురు. 369

క. సూకరముఖనిరయంబున
సూకరములు వానిఁ బట్టి సూనరులు బలెన్
వాకొనఁగ నమలి యుమియున్
జాకుండఁగఁ జెఱకుగడను సామజము వలెన్. 370

ఉ. నల్లులు దోమలుం జనులనల్లను బీల్చుచు నుండుఁ గావునన్
బిల్లలతోడ మంచముల బీటల సందుల నుండు వాని న
ల్లల్లన నల్పి చంపు జను లందఱుఁ బట్టియు నంధకూపమం
దెల్లమహావ్యథల్ గలుగ నేఁచెద రాయమభృత్యు లయ్యెడన్. 371

చ. అతిథుల కన్నదానము నొకప్పుడు సల్పక పంచయజ్ఞముల్
స్థితి గలవాఁడయ్యు నెపుడుఁ జేయక తా నొకరుండె మెక్కు నా
క్షితిజనునిం గ్రహించికొని చేర్చెద రా క్రిమిభోజనాఖ్యదు
ర్గతిఁ బడ వేయ నాతఁ డటఁ గారియ నొందుఁ గ్రిముల్ భుజింపఁగన్.

వ. క్రిమిభోజనమను నానరకము వేయియోజనములపరిమితి గలక్రిమికుండమై యుండు నందు వేయిసంవత్సరంబు లెంతయు దుఃఖం బనుభవించు నెవ్వండు బ్రాహ్మణాదులధనధాన్యాదుల నపహరించునో వానిని సందంశ మనునిరయంబునం బెట్టి పట్టుకార్లం బట్టించి బిట్టు హింసింతురు దంశమనఁ గొఱుకుట యగుం గావున దాని కాపేరు వచ్చినది. మఱియుఁ బురుషుండు గాని స్త్రీ గాని పొందఁ దగనివారిం బొందుదురో వారిం బట్టి తప్తసూర్మి యనునరకంబునం బెట్టి కశాఘాతము లర్పించుటయ కాక యగ్నితప్తస్త్రీపురుషరూపప్రతిమలం బరిరంభణంబు గావింపం జేయుదురు. సూర్మియన విగ్రహము తపించినవిగ్రహ మని దాని కాపేరు వచ్చినది లోభగుణంబున నీచకార్యము లాచరించినవారినిఁ బరలోకమున వజ్రకంటకశాల్మలివృక్షము నెక్కించి బాధింతురు. ధర్మమర్యాదల నతిక్రమించి రాజులు గాని రాజభటులుగాని ప్రవర్తించిర యేని వారినిం బట్టి వైతరణీనదిం బాఱవేయుదురు వైతరణి సంయమనీపురికిఁ జుట్టు నగడ్తవలె నుండునిప్పులయేఱు మఱియు నందుఁ గొంతలో మలమూత్రాదులు పూయము శోణితము కేశములు నఖములు నెమ్ముకలు మెదడు మాంసము మస్తిష్కము లోనగువానితో నిండి యుండు నందు మహామత్స్యములు సంచరించుచుం బతితులం బీకికొని తిని వేధించుచుండును. 373

తే. బ్రాహ్మణుం డయ్యు శూద్రితోఁ బంచశరుని
సంగరంబులఁ దేలి యాచారములను
విడుచునో వాఁడు సతతంబు విట్టు వినుచు
నధివసించును బూయోదమందు డింది. 374

వ. పూయమనే యుదకముగా నుండునది పూయోదమందుఁ బూయము
మలమూత్రాదులు శ్లేష్మము రేతస్సు లోనగుదుష్టపదార్థంబులు
నిండి యుండు నదిపూయోదనరకము. 375

తే. విప్రుఁ డయ్యును వేఁటాడ విల్లు నమ్ము
లును ధరించి వనంబుల ననుదినంబు
మృగములఁ జంపు వానిని మొగి వధించి
ప్రాణములు గల్గ ఖండింతు రంగకములు. 376

సీ. తన్ను జగము మెచ్చ జన్నముల్ గావించి
పశుహింస వృథగ సల్ప నగువాని
వైశసనం బనం బడునిరయంబునఁ
బడవేసి వేధింతు రుభటులు పట్టి
మదన కేళిం గడుమత్తిల్లి స్త్రీచేత
నిజవీర్యపానము న్వేడుక మెయిఁ
జేయించువానినిం జెరివి లాలాభక్ష
ణాఖ్యనరకమునయందు వైతు

తే. రిండ్లు గాల్చెడువాండ్రను గొండ్లిమీఱి
విషము నిడి ప్రాణహింస గావించుఖలుల
దొంగతనముఁ జేసెడువాండ్రఁ ద్రోతురు పడి
సారమేయాదనం బనునారకమున. 377

వ. మఱియుఁ గ్రయవిక్రయాదులందున్ సాక్ష్య మిచ్చునప్పుడు నసత్య
మాడినవాని నవీచిమంత మనుదుర్గతిం బడవైచియు నూఱుయోజ
నంబులయెత్తునుండి తలక్రిందుగఁ బర్వతశిఖరంబెక్కించి పడఁద్రోయు
దురు వాఁ డందు మేను తిలలంత లైనను మృతింప కుండు. 378

మ. సుర ద్రావ న్మదిసేయు బ్రాహ్మణుల మేనున్వాఁడో నయఃపానమున్
నిరయంబందు బడల్పడన్ సలిపి వహ్ని న్నీరుగా నైనయి
న్నరసంబుం బటుగార్ల నోళ్ళులఁ దెరల్పం జేసి మొత్తో యటం
చరవం బోయుదు రాకృతాంతభటు లత్యంతక్రుధామూర్తులై. 379

వ. జన్మకర్మాదులఁ దాను నికృష్టుఁడై వరిష్ఠు లగువారి నవమానించిన వానిం బట్టి క్షారకర్దమ మనునరకంబునం బెట్టి యటఁ దలక్రిందుగం బాతి హింసింతురు. 380

చ. సలుపుచు శక్తిపూజలఁ బ్రశంసకు నెక్కఁగ నర్థకాములై
పొలఁతుల దేవికిం బొలిగఁ బుచ్చుదురో జను లేరు వారి నా
పొలఁతులె రాక్షసాకృతులు పొంది యమాలయమందు ముక్కముక్కలుగను గోసి మెక్కెదరు గట్టిని త్రేఁచుచు నెత్రు గ్రోలుచున్.

వ. మృగాదులం బెంచి వానిని విలాసార్థము శూలాదులకు గ్రుచ్చి చంపుదురో వారిని నిరయంబుల యమభటులు శూలంబులం గ్రుచ్చి త్రిప్పుదురు వాఁడిముక్కులకాకులు గ్రద్దలు వానిం బీకి తిను భూతద్రోహము చేసినవారు దందశూకం బనునరకంబు నొందు నందు నైదాఱుమోములు గలసర్పంబులు వాని నెలుకలం బోలె మ్రింగుచుండును బాలురు నంధులు లోనగువారింబట్టినిరోధించి చంపినవాని నిరోధ మనునరకంబున గోతులలోనం బడఁద్రొబ్బి విషవహ్ని ధూమములు వెట్టి నిరోధింతురు. 382

సీ. తనయింటి కరుగుదెంచినవాని నతిథి న
భ్యాగతు నెవ్వఁ డహంకరించి
నొంచియును దిరస్కరించి త్రోచునో వాఁ డ
దంతయు దిగనాడి కొంతలోనఁ
బ్రాణంబులను బాసి యక్షిపర్యావర్త
మను నరకంబున యంటుఁ జేరు
వాని నట నృదా వజ్రతుండములు గృ
ధ్రమ్ములు కాకముల్ రాఁబులుగులు

తే. పీఁక తినుచుండు శ్రమచేసి విత్తము గణి
యించి యేరికిసిం బెట్ట కింతలోనఁ
జచ్చి సూచిముఖంబునఁ జొచ్చి భటులు
తనదు నే న్స్నాదులం గుట్ట వనరుచుండు. 383

మ. యమలోకంబున నిట్టినారకము లత్యంతాధియుక్తంబు లా
సమిత్యోగ్రవ్యథ లెన్ని యేనియునుఁ బాపాచారు లావారికిన్
యమరాట్సంకలితంబులై గలుగు నిం దైనట్టిపాపంబులం
దయయో నాఁ గుడువంగ వచ్చెడిని దుఃఖాక్రాంతులై కుందుచున్.

తే. స్వకృతకర్మఫలం బిట్లు జనము లనుభ
వించి తచ్ఛేషమునఁ జేసి పృథివియందుఁ
దత్తదనుయాయిధర్మముల్ తాముఁ బడసి
మగుడ వర్తించెదరు భూమిమండలమున. 385

వ. రాజా! నీ కిపుడు నివృత్తి ప్రవృత్తి ధర్మవర్తినుల ప్రాప్తిస్థానంబు లెల్లఁ దెల్లంబు గావించితి మఱియు భూగోళఖగోళంబులు నరకములు లోనగు నన్నియుం జెప్పితి దీని నాదరంబునం బఠించినవారు విన్నవారును భగవంతునిదివ్యరూపమును దెలిసికోఁ గలవా రగుదు రని శుకుండు పరీక్షితునకుం జెప్పెనని సూతుండు శౌనకాదులకుం జెప్పె.

పంచమస్కంధాంతము.

మ. వరబంగారమగర్భశుక్తిఫలమై పాంచద్గుణస్యూతమై
పరమోజఃకలితం బనర్ఘమయి దీవ్యద్రాజశీర్షోత్తమా
భరణంబై వరగోపబాలనరదేవస్వాతి మేఘోత్థమై
కర మొప్పారెడుసూర్యరాజబిరుదఖ్యాతంబు వర్ధిల్లుతన్. 387

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందుఁ
బంచమ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

—:0:—

శ్రీ ర స్తు

శ్రీ కృ ష్ణ భా గ వ త ము

ష ష్ఠ స్కం ధ ము

-:0:—

క. శ్రీమద్రాజకులాంబుధి
సోముఁడునై విభవతులితసుత్రాముఁడునై
భూమి నగుకల్పవృక్షం
బై మెలఁగెడుసూర్యుఁ డొప్పు నభ్యుదయములన్. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె నట్లు చెప్పిన విని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రుం గాంచి యిట్లనియె. 2

సీ. కామాదులనివృత్తి గావుట యనివృత్తి
ధర్మ మనంబడు దానివలన
పొందంగఁ గలయది మోక్ష మనియు జ్ఞాన
కర్మయోగంబులఁ గలిగికొనిన
భక్తియోగముచేత బ్రహ్మలోకము నొంది
బ్రహ్మతో ముక్తినిఁ బడయుదు రని
తెలిపితి మును నీవు తెలియంగ సుఖదుఃఖ
ము లవి సాధనధర్మములు ప్రవృత్తి
తే. మార్గ మనియు సాత్వికులు తామసులు రాజ
సు లనుము త్తెఱంగుల పురుషులకు దాని
యందు నధికారము గలుగు ననియు మఱియు
నరకగతులును దెలిపితి పరమపురుష. 3

వ. మఱియు ద్వీపములు వర్షములు పారావారంబులు పర్వతంబులు నదు లుద్యానంబులు వృక్షంబులు భూతలప్రమాణంబును సుతలాదివివరణం

బునఁ సూర్యాదిగ్రహసంచారప్రకారాదికంబునుం జెప్పితి వాలకించితి
నానందం బయ్యె నిప్పుడు. 4

క. స్వాయంభువమను వాతని
దాయాదులు వంశభవులు దా రేరీతిన్
బాయక కొని ధర యేలిరొ
యాయాసర్వంబు నాకు నానతి యీవే. 5

చ. నరకములం దనేకము లనంతము లంటివి తీవ్రవేదనల్
నరులకుఁ దత్ప్రసంగతి గనంబడ కుండెడునట్టిమార్గముల్
దొరకొనురీతులున్ దొరయఁ దోఁచినవానిని నుత్తరింప నో
వరగతులున్ వచింపు మన వానికి మౌనివరేణ్యుఁ డిట్లనున్. 6

—♦ శుకుఁడు పాపనిష్కృతులప్రకారం బెఱింగించుట ♦—

ఆ. మనమువాక్కు కాయమనుపీనిచే నగు
పాపములను జనుఁడు వాపుకొనక
మెలఁగుచో మదుక్తములు నరకంబులు
పొందువాఁడ యగుచుఁ బొడ వడంగు. 7

ఉ. రోగము లైనవానిని నరుల్ దొలఁగించుకొనంగ వైద్యమున్
బాగుఁగ జేసికో వలయుఁ బ్రాణికి నట్టులె పాపసంగతుల్
రాగఁ దదుక్తపద్ధతి వరం బగునిష్కృతిఁ జేసికోఁగ నో
నాగతిఁ జేసికొన్న నరకాధులఁ బొందఁడు మానవుం డిలన్. 8

చ. ఎఱుగకఁ జేసిన ట్లయిన నెంతటిపాపము నైనఁ బాపుకో
వఱలెడు నిష్కృతుల్ తెలిసి పాప మొనర్చినయేని దాని కె
త్తెఱఁగున నిష్కృతుల్ సలుపఁ దీఱెడు నయ్యవి సందియంబున
న్నఱిముఱి పెట్టుచున్నయది యంచు వచించెద మౌనిసత్తమా. 9

మ. ఇదియుం గాక మనుష్యుఁ డొక్కఁ డెది యేదే బాపముం జేసి య
య్యది వో భూసురు లానతిచ్చినటు ప్రాయశ్చిత్తముం జేసికొం
చదటుం గల్గుట నింద్రియార్థములఁ బాపాచారుఁడై వెండియున్
గదలం బోయినవాని నిష్కృతి గజస్నానంబునుం బోలెడిన్. 10

వ. అనిన రాజునకు మౌనిరాజి ట్లనియె. 11

సీ. వినుము ప్రాయశ్చిత్తమునఁ బాపకర్మము
మొదలంటఁ బోవుట పొసఁగఁ బోదు
వెనుక ముం దగుపాపవిసరము౯ జ్ఞానము
వలెను నిష్కృతు లవి దొలఁచ లేవు
మందు తాత్కాలికామయములం బలె నవి
సామాన్యకలుషముల్ సమయఁ జేయు
నందునం జేసి ప్రాయశ్చిత్తవిధులకు
వైయర్థ్యమును జెప్ప వలను పడదు
తే. పరమపురుషు సేవింపనివారిపాప
ములను గొన్నింటి నిష్కృతుల్ తొలఁగఁ జేయు
సేవకులసర్వపాపముల్ సేవయె నశి
యింపఁగాఁ జేయు ననుచు నీ వెంచ నొప్పు. 12

చ. పదిలము గాఁగ పాపడెడువారికి రోగము లంటఁ బోవు వా
రదె యిదె యంచు నూఱుసమ లాయువు గల్గి వశింతు రుర్విపై
విదితము గాఁగ నే నిపుడు విన్పెదు నేమముల౯ గణించు చోఁ
బొదలుదు రెట్టిపాపములఁ బొందనివా రయి సౌఖ్యసంగతి౯. 13

వ. ఆచరింపఁ దగునానియమంబులం జెప్పెద నాలకింపుము. 14

సీ. దినము దినంబును దేహధారణకును
దగినంత యన్నమే తగును దినఁగ
ఋతుకాలములఁ దప్ప నితరకాలములందు
స్త్రీలఁ బొందఁగ నపేక్షింప నొప్ప
దంతరింద్రియనిగ్రహ మ్మాచరింపఁ నా
సత్పాత్రదానము సలుప వలయు
భూతహితం బెప్డు పొనరింపఁగాఁ జెల్లు
సతము సదాచారగతి గొన నగుఁ

తే. గామమును ద్రోసిరాజనఁ గలుగుటయును
జాతిమతధర్మములు గల్గి భూతలమున
మెలఁగుటయు నివ్వి నియమముల్ సలలితాత్మ
వీనిఁ బాటింపఁ బాపముల్ గాన రావు. 15

వ. మఱియు ద్వంద్వముల సహించువాఁడును ధర్మతత్పరుండును శ్రద్ధా
సమువేతుండు నగుపండితుండు గుణత్రయసంభూతము లగుపాతకం
బులు పాయఁ జేసికొనం జాలు జపతపస్స్వాధ్యాయనిరతులై మునులు
నియమసముద్భూతం బగుభక్తిచే సర్వప్రతిబంధకం బగుపాపనంబు
మాయించుకొనం జాలుదురు. 16

తే. వాసుదేవునియందు సుస్వాంత మెప్పుడు
నిలిపి యుండెడుభక్తజనులసమర్చ
సలుపువారలు పాపముల్ దొలఁచునట్లు
శమదమాదులు కలవారు చాల రట్లు. 17

శా. శ్రేయస్సాధనకార్య మెద్ది యనుచుం జిత్తంబునం దెంచుచో
నీయుర్విస్థలి భక్తియోగ మొకఁడే వీక్షింపఁగా నయ్యెడిన్
బాయున్ దాన సమస్తదోషములు సంప్రాప్తం బగుం సర్వత
స్స్ఫయత్తేజముతోడి జ్ఞానమును విష్వక్సేనసంయోగమున్. 18

తే. కృష్ణుని నొకప్పుడేని స్మరింపకుండు
వాని నెట్టిప్రాయశ్చిత్త మైనఁ గాని
పృథ్విని బునీతుఁగా నొనరింప లేదు
వరసురాపగ వారుణీభాండ మట్లు. 19

ఉ. చేత సుదర్శనంబుఁ గొని శ్రీవనమాల యురంబుపైఁ దగన్
బాతరలాడ నల్ల నగువాని నొకానొకనాఁటికేనియున్
జేతమునం దలంచిన నృసింహుఁడు ప్రేతపతిం దదీయులన్
బ్రీతికి నైనఁ జూడఁ డని పెద్దలు చెప్పుచునుందు రెప్పుడున్. 20

వ. నరేంద్రా! నరుం డెంతటిపాపి యైన నొక్కమాఱు నారాయణుని
స్మరించినవానికి నారకాధు లుండ వనుటకుఁ దార్కాణముగా

విష్ణుదూతయమదూతసంవాదాత్మకం బగునొక్కయితిహాసంబు గలదు చెప్పెద నాకర్ణింపుము. 21

—• అజామిళోపాఖ్యానము •—

తే. కాన్యకుబ్జము నాఁగ విఖ్యాత మైన
దేశమున నజామిళుఁ డనుద్విజుఁ డొకండు
కలఁడు వాఁ డొక్కదాసినిఁ గట్టుకొన్న
కాంతఁగాఁ జేసికొని లోకకంటకుఁ డయి. 22

ఉ. ప్రాసగువంశధర్మములు పాడయి పోవఁగఁ దల్లిదండ్రులన్
రోసి బహిష్కృతుం డగుచు రోఁత జనింపఁగ నెల్లవారికిన్
దోసము లాచరించుచును దొప్పలు దోరలు మద్యమాంసముల్
వేసర కెల్లవేళలను వేడుక మీఱఁగ స్వీకరించుచున్. 23

ఉ. కత్తెఱదొంగయై పగల కన్నము వేసియు దారిఁ గొట్టియున్
గుత్తగ జూద మాడియును గొంపలు దీసియు మోస చేసియున్
మొత్తము గాఁగ విత్తమును బ్రోఁగులు వెట్టియు నిల్లు దీర్చుచున్
మెత్తన గానిచిత్తమున మీఁదులు గానక సంచరించుచున్. 24

క. పశుపక్షిమృగాదుల దా
నశనార్థము సంహరించునాక్రూరుఁ డహ
ర్నిశము పలాశి యయి ద్విపా
త్పశు వై చరియించుఁ బాపపంకిలుఁ డగుచున్. 25

క్రౌంచపదవృత్తము.
వాటలు గొట్టెన్ బేటలు మెట్టెన్
బ్రబలినధనికుల పస చెడ నెట్టెన్
బోఁటులఁ బట్టెన్ నేటులఁ గట్టెన్
బురభవనములకు బొరియలు వెట్టెన్
ఏటుల కోర్చెన్ బోటు లమర్చెన్
హీటులకుఁ గడువెత లెడఁగియ కూర్చెన్

గూటికి నార్చెఁ మాటికి నేర్చెఁ
గుజనులపజ్తిఁ గొని కుతలమునందుఁ. 26

సీ. కూటసాక్ష్యము లిచ్చుఁ గులసతులను బుచ్చు
గుజనులఁ గని మెచ్చుఁ గులము వ్రచ్చు
టాటోటులను బల్కు మాటల సుధఁ జిల్కు
బూటకంబునఁ గుల్కుఁ బున్నె మల్కు
బాటసారులఁ గొట్టు బోటులఁ జెఱఁ బట్టు
మేటులఁ గొదఁ గట్టు మిగులఁ దిట్టు
మధుమాంసములు మెక్కు మర్యాదలకుఁ దక్కుఁ
బోరాటముల కెక్కుఁ బొరిగ నిక్కుఁ

తే. బోతరించుఁ బరార్థముల్ ద్రుచ్చిలించు
జూదముల నాడుఁ గులటల సురతి మాడు
సత్క్రియల రోయు దుష్క్రియల్ సలుపఁ డాయు
దుర్జనవ్యూహమును గూడి దుర్జనుఁ డయి. 27

వ. ఇట్లజామిళుండు కులభ్రష్టుఁడై దాసిం గట్టుకొని దానితోఁ గ్రీడించుచు దానియందుఁ బెక్కుమంది పిల్లలం గని వారిం బెంచుచు నష్టాశీతి వత్సరంబులు వయసు వచ్చినవాఁ డయ్యె నయ్యెడ. 28

మ. కొడుకుల్ వానికి బెక్కుమంది గల రాక్షుద్రోద్భవుల్ వారిలో
గడగొట్టైనయతండు తండ్రిమది కెక్కం బొల్చు నారాయణా
ఖ్యుడు ప్రేమాస్పదుఁ డెల్లవారి కతనిం గొం చయ్యజామిళుఁ డె
ప్పుడు లాలించుచు గారవించుచుఁ గడుం బోషించు భూషించుచున్.

సీ. తాను సాపడునప్డు తగఁ గంచమున వాని
కినిఁ గల్పి పెట్టి తా నెపుడు దినును
దాను మైరేయము నానుచున్నప్పుడు
వానినోటం బోసి తాను గొనును

దాను జలక మాడ వానిపై శుద్ధి లా
లను బోసి తాఁ బోసి కొనును వెన్క
తాను మంచంబుపైఁ దనదేహముం జేర్చి
యును వాని ఱొమ్మునఁ గొని శయించు

తే. నాఁడునప్పుడు పాడున ష్డవి కరుగు
నప్పు డెప్పు డెప్పుడు వాని నప్పతితుఁడు
తో నునిచికొంచు నవ్వానితోనె తనకు
సర్వ ముండె నంచును వాని సాఁకుచుండు. 30

చ. ముదుసలివాఁడ నైతి నెటు పోవుదునో యెపు డెప్పు డెప్పుడో
తుది యగుదెంచు నం చెడఁదఁ దోఁపనివాఁ డయి బ్రహ్మబంధు వ
మ్మదవతిపొత్తు బాయక కుమారులతోడనె లోక మంచు మీఁ
దిది కనఁ జాలనట్టిఁ డయి దేవుఁగొ ట్టయి పోయెఁ బొల్లయై. 31

ఆ. ఇట్టు లున్నవాని కింతలో మృత్యువు
శిరసుమీఁద నాడె జేనె డంత
నంత వేఁకి వచ్చె నవ్వల దలయేను
సూపె నంతలోన నేఁపుమీఱి. 32

తే. ఏడుతాళ్ళప్రమాణమై యెగిచి జ్వరము
మేనిమీఁదఁ దాండవ మాడె మిసిమి దప్పె
సన్నిపాతము పొడసూపె సన్న మయ్యె
స్మృతి చెడియె మాట వాతము చేర నయ్యె. 33

ఉ. ఆయెడఁ బ్రాణవాయువు తదాస్యముఁ బోఁ బ్రసరించుచుండ నా
రాయణ యంచుఁ బుత్రుపయి బ్రాలినచిత్తముతోడఁ బిల్చుచోఁ
బోయెనొ జీవనం బనఁగఁ బోలఁగఁ దోఁచెడునంతలో యమా
జ్ఞాయుతులై భటుల్ ముగు రజామిళుఁ బట్టఁగ వచ్చి రట్టిచోఁ. 34

తే. భీషణవ్యాఘ్రముఖములు పృథులదేహ
ములును ఖడ్గరోమంబులు గలుగువారు

శూలపాశగదాదులు గాలిచి భయ
దాకృతులతోడఁ జొప్పడి రప్పు డచట. 35

—♦ విష్ణుదూత యమదూత సంవాదము ♦—

చ. యమభటు లంతలోపలన యాతనికంఠమునందుఁ బాశముల్
బ్రమద మెసంగఁ జుట్టియుఁ గరంబుల లాగుచునుండి రాత్రివి
క్రమభటు లాశుగాము లయి క్రచ్చరొనం జనుదెంచి తత్ప్రదే
శమునకు నాఁగుఁ డాఁగు డని శాసన మట్టులు పల్కి రల్కమై. 36

వ. అ ట్లత్తిరయంబునం బలికి బలాత్కరించి ప్రతిషేధించుచున్నవిష్ణుదూతలం గాంచి యమదూత లి ట్లనిరి. 37

ఉ. ఎక్కడివారు మీ రటకు నెక్కడి కేగుచు వచ్చినారు మీ
రిక్కరణిన్ వచించుచుఁ బరేతపతిప్రధితాజ్ఞ కడ్డు రా
మొక్కలులై చరింతు రిటుఁ మోఱకు లాటకు నేకతం బగున్
జక్కనిరూపముల్ గొని ప్రశంసకు నైతిరి మీరు వేల్పులో. 38

వ. అని యడుగ మందహాససుందరవదనారవిందులై గోవిందదూతలు మేఘగంభీరవాగ్గుంభనల ని ట్లనిరి. 39

ఉత్సాహ. ధర్మరాజశాసనంబు దగ వహింతు రేని మీర్
ధర్మమార్గ మెఱిఁగినట్టిదంట లేదు రందునన్
ధర్మ మనఁగ నెట్టిదో యధర్మ మనఁగ నెట్టిదో
నిర్మలాత్మ నెంచి మాకు నిర్ణయంబు సేయుఁడీ. 40

తే. నరుల దండన మెరీతి నడపఁ బడెడు
నకట నితఁ డెవ్విధిన్ దండనార్హుఁ డయ్యె
ధరణిఁ గలవార లందఱు దండ్యు లంద్రొ
యరయఁ గొందఱు మాత్రమే యంద్రొ చెప్పుడ. 41

వ. అనినం గృతాంతదూతలు వారి కి ట్లనిరి. 42

సీ. ధర్మము శ్రుతిబోధితము తద్విరుద్ధ మ
ధర్మము నాఁబడు ధర్మబోధ

క మగునా శ్రుతి హరి కమరు నిశ్వాసము
వలన నయ్యెను స్వయంప్రతిభ గలిగి
యది పరమేశ్వరు నాకృతినా నొప్పి
ధర్మములెల్లను దవిలి చెప్పు
మనుజుఁ డొనర్చినపనుల నన్నింటిని
దివియును భువియును దేవతలును
తే. జంద్రసూర్యులు నగ్ని సంజలును బవలు
రేలు దిక్కులు జలములు కాలము సమ
వర్తి యగుధర్మరాజు నవశ్య మెఱుఁగ
సాక్షిభూతులై చెప్పుచుం డ్రప్పు డప్పుడు. 43
వ. కావున మేము ధర్మాధర్మము లెఱుంగుచుందుము మాచే నధార్మికు
లు మాత్రమ శిక్షింపఁ బడుదురు శిక్షార్హునే మే మిపుడు శిక్షించు
చుంటిమి కాని కానివానిని శిక్షింపఁ బూన మాకర్ణింపుఁడు. 44
సీ. అవనిజనుల్ విషయాసక్తులై పుణ్య
పాపకర్మంబులపాలఁ బడుదు
రందులకుం దగ నందఁ బోదురు సుఖ
దుఃఖముల్ స్వర్గమందు నరకమున
గతులందు న్యూనాధికములందు వ్యత్యయ
వినుమయంబులు లేక వెలయు ఫలము
కర్మానుసారముగా ఫల మందెడుఁ
బరలోకముల మార్పఁ బడక జనుఁడు.
ఆ. అట్టికర్మఫలము లనుభవించిన పయి
జన్మమందుఁ దొంటిసంగతులకుఁ
గన నిదర్శనంబు గా సుఖదుఃఖాదు
లొనరు జన్మములను గొనఁగ నగుచు. 45
చ. జనుఁ డెఱుఁగంగ లేక తొలిజన్మమునం దగుకర్మసంగతుల్
పొనరుచు నప్పు డొప్పుతనపుట్టునకుం దగ నిత్యకర్మముల్

కనుఁగొని యాశ్వరుం దనదుకష్టములం దొలఁగించుకో మనం
బును గోనఁ జాలఁడై మగిడి పుట్టియు గిట్టియు గిట్టిపుట్టియున్. 46

తే. పదియు నాఱుకళలు గూడఁ బడ నవిద్య
కర్మమును వాసనలు నాఁగఁ గలుగుమూఁడు
శక్తుల నెసంగి లింగాఖ్యఁ జనెడుమేను
జీవునకు సంసృతిం గల్గఁ జేయుచుండు. 47

వ. అట్టిదేహి దేహాత్మాభిమానము గలిగి యింద్రియంబుల జయింప నేరక తనకుఁ జేయ వలయు నని లేకున్నను లింగదేహంబునం జేసి పుణ్యపాపమిశ్రకార్యంబులం జేసి సాలెపురుగువోలెఁ దన్నుం దానె బంధంబు చేసికొనుచున్నాఁ డో పుణ్యశీలురారా! చెప్పెద మాల కింపుఁ డియ్యజామిళుండు. 48

—♦ అజామిళుని ప్రాథమిక ప్రవర్తనము ♦—

సీ. ఆది వేదాధ్యయనాదికం బొనరించి
యోగ్యతాపట్టము నొందఁ నగుచు
సుస్వభావము గల్గి శుద్ధుఁడై శాంత్యాది
గుణములు గలఁడయి కొమరుమిగిలి
సతము సదాచారసంపత్తికై బ్రహ్మ
చారియై స్త్రీమోహముఁ జూడఁ గనక
యుండువాఁ డీతనియుల్లము కోమల
మింద్రియంబులఁ గెల్చె నితఁడు నియతి.

తే. సత్యమే పల్కు సావిత్రిజప మొనర్చి
పూతుఁడై వచ్చునతిథుల పితృహోత్రు
గురువులను వృద్ధులం భక్తిఁ గొలుచుచుండు
వాఁడు గర్వహీనుఁడు మితభాషి మఱియు. 49

ఉ. భూతహితంబుఁ గోరుచును బూజ్యులకుం దలలోనినాల్క నా
నాతఁడె మిత్రకార్యములయందుఁ జరించెడివాఁడు మత్సరం

బాతని కెన్నొ క్రోశముల కవ్వల నుండును శత్రు లాప్వ రీ
పూతచరిత్రువంకఁ గనఁ బోవరు ప్రాణభయంబు పెంపునన్. 50

వ. ఇట్లున్నకాలంబునం దొక్కనాఁడు. 51

—♦ అజామిళుఁడు శూద్రిం బెండ్లియాడినకథ ♦—

తరువోజ. తనతండ్రియాజ్ఞ నీతఁడు వని నుండు
దర్భలు సమిధలు దళములు పూలు
గొని తేరఁ జని యొక్కకోమలిఁ గోడఁ
గోర్కి రమించెడుగోవానిఁ జూచి
తనపూర్వకర్మబంధంబునఁ జేసి
తగవు దప్పి యతండు దర్పకుచేతి
ఘనబాణములు వచ్చి కాయముఁ దాఁకఁ
గనుఁగొన కీతఁడు కామాంధుఁ డయ్యె. 52

ఉ. ఆమిథునంబు మద్య మధికాదృతిమైఁ గొని యున్నదాన నా
భూమికి నేరు వచ్చుటయుఁ బోవుటయుం గనఁ జాలనట్టి దై
కాముని కేళిఁ దేలుచును గాయముపై స్పృహ లేనియట్లు గా
నామునఁ గోకలన్ విడిచి యాహవముం బొనరించె నుద్ధతిన్. 53

ఉ. తాఁగినవాఁడు పూరుషుఁడు త్రావెను స్త్రీయును యౌవనంబునం
దోఁగెడువారు గావునను దోడ్పడి యిర్వు రొక ళ్ళొకళ్ళనున్
మూఁగుచుఁ గ్రిందుమీఁదగుచుఁ బొర్లుచు దొర్లుచు మోముమోమునం
దాఁగఁ బెట్టుచున్ భుజగు లట్టులె గట్టిరి నే నొకండు గన్. 54

ఉ. మీఁ దగుచాననేను గని మిక్కిలిమోహము మానసంబునం
దాదటఁ దారసింప ద్విజుఁ డధ్యయనాదులు పూర్వవాసనల్
కాదను నట్లు గా స్మృతికిఁ గల్గఁగ నీయక తాను దానితో
మోదము నొందఁ గాఁ దలఁచెఁ బోకడఁ బెట్టిస్వధర్మకర్మముల్. 55

తరళము. పరుల కూఁడిగముల్ పొనర్చెడుపాపదాసికులంబునన్
పరఁగునట్టిది కల్లు మాంసము బాన లాదిగఁ గ్రోలుచున్

నిరతమున్ జరియించునట్టిది నీచు రా లగుదానిపై
మరులు కొంచుఁ దపించె దానిసమాగమంబును గోరుచున్. 56

వ. అంతలో నక్కిరాతవిటుండు తన కార్యంబు దీర్చుకొని కిరాతిం బెడ
బాసి యెటయేనియుం జనియె నజామిళుండును దన్నొకచీటికింగొనక
తనవంకం జూడక పోవుదాని వెంబడించి తనమనోరథం బెఱింగించిన
నిరాకరించియు నది పునఃపునఃప్రార్థనంబునం జేసి యెట్టకేల కిట్లనియె.

చ. ఒరులకు దేహ మమ్ముకొని యూడిగముల్ పొనరించుదాననై
ధరణిఁ జరింతు నామగఁడు దయ్యము చెయ్యుల కగ్గమై చనెన్
బురుషుని వెండి రొండొకని బుస్తె గొనం దలపోసి యుంటి నీ
వరయఁగ బాడబుండ వన వచ్చెదు నీకును నాకు నెట్లగున్. 58

ఆ. నీదుకులము విద్య నీనియమంబును
నిష్ఠ విడిచి పెట్టి నేఁడు మొదలు
నాకు మగఁడ వగుచు నాచేతియన్నము
తింటి వేని నిన్ను నంటికొందు. 59

భుజంగప్రయాతము.
అనంగా నతం డంత యజ్ఞోపవీతం
బు నొప్పుం బవిత్రంబు ముప్ప్రొద్దుసంధ్యన్
ఘనబ్రహ్మయజ్ఞంబు గాయత్రినిన్ భూ
తిని న్వీడె వేదంబు దేవార్చనంబున్. 60

వ. అంత నాశూద్రిదాసి చెప్పినచొప్పునం జేసి దానిం బరిగ్రహించి
పాణిగ్రహణంబు చేసెఁ బదంపడి. 61

సీ. తండ్రి గణించినధనమంతయుం బెట్టి
దేశంబులం గలదివ్యవస్తు
సముదయం బంతయుఁ గ్రమముగాఁ గొని తెచ్చి
దాసి కప్పనచేసి దోస మనక
సత్కులజాతయు సద్గుణవతి యైన
దేవేరిని న్వీడి తృణము వోలె

నింటం గలధనంబు పెంటం గలసినంత
న్యాయ మన్యాయంబు నరయఁ బోక
తే. కూటసాక్ష్యము లిచ్చియు నేటిజూద
ములను బందెములం బొంది ముడియ విడుపు
కన్నగాఁడును దెక్కలికాఁడు నగుచు
ధనము గ్రహియించి యిచ్చు నాదాసి కపుడు. 62
చ. అడవుల లేళ్ళ దుప్పుల నహర్నిశముల్ వధియించి మాంసముల్
బుడుతలు తాను బత్నియును మాడును బ్రొద్దులు నాహరించుచుల్
గడుకొని ప్రాణికోటులకుఁ గాలయముం డన నొప్పి యెప్పుడుల్
నుడువఁగ రానిపాపము లనూనగతిం బొనరించెఁ గించునాల్ . 63
వ. అట్లీతండు శాస్త్రం బతిక్రమించి ప్రవర్తించుచు దాసీసంబంధంబునం
జేసి మహాపాపియై యున్నవాఁడు వీనికి యమదండనము విహితము
గావున వీనిఁ సంయమనికిం గొనిపోవుచుంటి మనిన విని విష్ణుదూత
లి ట్లనిరి. 64
సీ. ధర్మతత్త్వరు లిట్లు ధర్మము వర్తిలఁ
జేయుట లొప్పు నట్టే యమసభ
దండనార్హుల దండింతు రని విని
కటకటం బడుదు మక్కట కట కట
యింతకంటె నధర్మ మేమి యుండెడు ధర్మ
మూర్తులు మీరె యిప్పల్కు మిగుల
వైషమ్యమున నైనఁ బలుకంగ నుండునే
ప్రజ లింక నెవ్వనిపాలఁ బడుదు
తే. రధికు లొనరించుమార్గమే యల్పు లాచ
రింతు రిది మీకుఁ దగవు గా దంతకుండు
సర్వసమవర్తి యపరాధిజనులమాత్ర
శిక్ష సేయు నటం డ్రిది చెల్లు నొటు. 65

మ. ఒక డొండొక్కని విశ్వసించి తొడపై నొప్పించి శీర్షంబు ని
ద్రకునై యుండినవాని భూతమయుఁడై ధర్మాత్ముఁడై యున్నవాఁ
డకటా! చంపఁగ నెట్లు చాలెడిని ద్రోహం బిద్దియం చెంచఁడే
సుకలుండున్ సమవర్తి ధర్మపరుఁ డీచొప్పుల్ ప్రశంసించునే. 66

ఉ. ఈయన పాపముల్ సలిపె నేము యమాలయమందు శిక్షలం
జేయఁగఁ గొంచుఁ బోదు మని చెప్పితి రక్కట యొక్కజన్మమం
దే యన మెన్నో జన్మముల నేర్పడి యుండినపాప మేని నా
రాయణ యన్న నాశ మగు నంచు వచింపవె వేదశాస్త్రముల్. 67

సువృత్తము. పారం డితం డిట్లు ప్రాణప్రయాణ
ప్రారంభమం దాత్మజాహ్వాన మైనన్
నారాయణా యంచు నాల్కన్ వచించెన్
బారంబుఁ గైకోవె పాపంబు లెల్లన్. 68

శా. ఘోరాఘంబులు గల్గినప్పుడు శ్రుతుల్ ఘోషించెడిన్ స్మృతుల్
గోరక్షాదులు తీర్థయాత్ర లవి పెక్కుల్ సల్పి పాపంబులన్
బారం బందగఁ జేయ లేవు భగవన్నామంబు సర్వాఘముల్
దీరం జేయు నిమేషమాత్రమున నిర్నిద్రప్రభావంబునన్. 69

సీ. యమదూతలార! స్వర్ణాపహర్తయు సురా
పాయి మిత్రద్రోహి బ్రహ్మహంత
గురుదార నంటినకూళ స్త్రీఁ జంపిన
వాఁడు తండ్రిని రాజవరునిఁ గూల్చి
నట్టేఁడు లోనగునందఱు నరయ మ
హాపాపు లవ్వారిపాపములను
నారాయణోచ్చారణము వాపి నట్లు ప్రా
జాపత్యముఖ్యముల్ పాప నోప

తే. వీయజామిళుఁ డుసురు పై కేగునప్పు
డాత్మజునిఁ బిల్చునెపమున నైన హరి స్మ

రించె వీనిపాపములు నశించె నెంచ
నిరయముల నొందుట కనర్హుఁ డరయ నితఁడు. 70

క. జ్ఞానము చేతనయే న
జ్ఞానముచే నైన రోగజనితాధులచే
నైనను భగవంతుని లో
ధ్యానించినవానిపాప మంతయుఁ దొలఁగున్. 71

సీ. ఆది గాన నోదూతలార! యజామిళుఁ
డీతఁడు నిష్పాపుఁ డెన్నికొనఁగ
వైకుంఠపత్తనవాసంబునకు నర్హుఁ
డందు సందియ మైన నేగి మీప్రభువు
ధర్మరాజు ధర్మువు వాసిసామ్ము మీ
రడిగి చూడుఁడు వాని నపుడు మీకుఁ
దెలియవచ్చు ననంగఁ దెలిసి వారల్ వాని
విడిచి పాశములను వీడఁజేసి.

తే. వారి నామంత్రణము చేసి వడిగ వేగి
యమునకుం జెప్పి రంతయు నంత నిచట
మిత్తికిం గాక యయ్యజామిళుఁడు కడల
విష్ణుదూతలఁ గని మ్రొక్కి వినయమునను. 72

వ. వారితో నేదియో ప్రసంగింపఁ నున్నయంతలో వా రంతర్ధానంబు నొంది రంత నతండు విష్ణుదూతయమదూతలసంవాదంబు సర్వంబును విన్నవాఁడు గావున భగన్నామధ్యానప్రభావం బెఱింగి యుండుటం జేసి తా నొనర్చినపాపంబులం దలంచుకొని పశ్చాత్తాపతప్తుండై తన మనంబున. 73

—♦ అజామిళుని పశ్చాత్తాపము ♦—

మ. అకటా! యే మని తిట్టుకొందు నను నే నారీతి బ్రహ్మత్వమున్
సకలారాధ్యపదంబు బ్రహ్మమును లేశం బైనఁ జర్చింప కా

సకలంబుఁ బెగడెంపుచేసికొని దోషప్రాప్తికై శూద్రికో
నొకసంసారముఁ గల్గి కొంచెఁ జెడి నే నున్నాఁడ నీచుండనై 74

మ. కలు ద్రావం గలదాసితోఁ గలియుటన్ గల్మద్యముం ద్రావియున్
బలులంబుం దిని క్రొవ్వి వన్యములఁ జంప న్నేర్చి పాపాత్ముఁడై
నలువుర్ నింద యొనర్పఁ బీనుఁగువలెన్ నాయుష్క యయ్యోం గటా
తలిదండ్రుల్ నను గంట కెంత లఘుముల్ తార్ చేసి యున్నారొకో

చ. పరమపవిత్రురాలు గుణవద్వనితాజనకీర్తనీయ సుం
దరి సుకుమారదేహ పతిదైవత దాని నిమేషమాత్రలోఁ
దొఱఁగి సువర్ణ మబ్బినటు తోఁచుట సల్లని మేనిదాసినిన్
బరిణయ మాడి పం డనఁగవచ్చెదు బ్రహ్మకులంబు 76

క. ఈలోకము చెడిపోయెన్
బైలోకముఁ జెడు నటంచుఁ బలికెడు నయ్యో
యీలోకమె నా కగుపా
ట్లాలోచింపంగ దుఃఖ మగు నకట కటా. 77

వ. అని విచారించుచుఁ దన కాలో నైనవిస్మయక్రమం బంతయు నంత
రంగంబునఁ జింతించుచు. 78

ఉ. ఇప్పటినాప్రకార మది యెంతయు నచ్చెరు వట్లు తోఁచెడిన్
జెప్పఁగ లేను స్వప్న మది చేరఁగ వచ్చెను మేల్కనంగ నీ
చొప్పునఁ గానవచ్చెడినొ సూనరు లెవ్వరొ వచ్చి త్రాళ్ళతో
నిప్పుడు నన్నుఁ గట్టి రిపు డెక్కడి కేగిరొ కానరా రయో. 79

పాశబద్ధునిఁ జేసి నన్ బట్టిలాగు
కొనుచు వారలు పోవ నుండినయెడ నలు
చేతులు గలారు నల్వురు చేర వచ్చి
నన్ను విడిపించి రవ్వారిఁ గ్రన్నఁ దోలి. 80

—• అజామిళుఁడు విష్ణుసాయుజ్యము నొందుట •—

వ. అయ్యో నే నట్టిపుణ్యపురుషుల సందర్శించియు ఫలంబు నొందఁ
జాల నైతి వా రెందః వోయిరో యని కొందలం బందు డెందంబునఁ

గొట్టుకొనుచు నేను వృషలీసాంగత్యమ్మునం జేసి బ్రహ్మమును బ్రాహ్మణ్యమును విడిచి నిర్లజ్జుఁడనై పితృపితామహార్జితమైనపుణ్య లేశమునకుఁ గాని వాఁడనై పాపినై పారాడుపీనుంగు వలె నున్న వాఁడ నాజీవనంబు వ్యర్థంబు నశ్వరం బగుప్రపంచంబు నమ్మి రెంటికిం జెడినరేవఁడినై చేవ చెడి యుంటి నింక నా కాచతుర్భుజులసందర్శ నంబున నింతబుద్ధి వచ్చినది విషయాభిలాషంజేసి సంప్రాప్తం బయిన సంసారబంధంబు ద్రెంచుకొని ప్రాణేంద్రియవ్యాపారంబు లెల్లఁ బ్రయత్నంబున నిగ్రహించి దయాళుండనై భూతహితుండనై నేను నాదియనుమిథ్యాజ్ఞానంబుగా కాత్మజ్ఞానంబున భగవన్నామసంకీర్తనం బు చేయుచుఁ గాలంబు పుచ్చెద నని పశ్చాత్తాపతప్తుండై సర్వసంగపరి త్యాగంబు గావించి గంగాద్వారంబుకడకుం జని సాధుసందర్శనంబున భగవద్భక్తియోగంబు సమాశ్రయించి యింద్రియంబు లింద్రియార్థం బులుం జయించి దేహాదులనుండి ప్రత్యగాత్మను విభాగించి మనం బందుఁ బొందుపఱిచి జీవాంతరాత్మ యగుపరమాత్మను ధ్యానించుచు భగవచ్ఛబ్దవాచ్య మగుపరమ తేజంబునం దాత్మ నిలువం జేసి సుస్థిర చిత్తుండై ధ్యానించుచుండె నంతలోఁ దొంటివిష్ణుదూతలు దర్శన మిచ్చిన వారిపాదారవిందంబులకు వందనం బాచరించి గంగాద్వారం బునఁ గళేబరంబు విడిచి తద్రూపంబు నొంది వారితో వచ్చిన విమానం బెక్కి యర్చిరాదిమార్గంబున వైకుంఠధామంబునకుం జనియె నని శుకుండు వెండియును. 81

సీ. సర్వార్షధర్మముల్ సమయ నజామిళుఁ
డట్లు శూద్రిం బెండ్లియాడి కూడి
యార్యనిందితకర్మ మాచరించుచు నిర
యమునఁ ద్రోయంబడునట్టిఁ డయ్యు
నారాయణా యని నాల్క నాడించిన
యంతన వైకుంఠ మందఁ గలిగెఁ

సంసృతిబంధసంసక్తు లౌవారినిఁ
దరియింప నీశ్వరస్మరణము తగు
తే. నీయుపాఖ్యానమును భక్తి నెవ్వ రేని
వినినఁ జదివిన వారలు గనరు నరక
ములను వైకుంఠవాసము పొందఁ గలుగు
ననిన శుకుఁ గాంచి రాజేంద్రుఁ డనియె నిట్లు. 82
చ. తనభటు లట్లు చెప్పఁగఁ గృతాంతుఁడు శాంతుఁడ యయ్యెనో యెటే
ననియెనొ వైష్ణవుల్ తనదునాజ్ఞ ప్రవర్తిలకుండఁ జేయుటన్
గినిసెనొ యేమిచేసెనొకొ కీడ్పఁడఁ డాతఁడు వానియాజ్ఞ కె
ప్డును వితథత్వముం గలుగుపోల్కి నినంబడ దెట్టిపట్టునన్. 83
తరువోజ. అనిన శుకుం డను యమదూత లట్లు
హరిదూత లనుటచే నాప్రయత్నంబు
పొనరింపఁ గా మాని పోయి కాలునకు
మ్రొక్కి యి ట్లని రీశ! భువనంబులందు
ఘనుఁ డగునీయాజ్ఞ కాని యొండొకఁడు
కా దని మాకెదఁ గలుగును గాన
వినిపించుచుంటిమి వృత్తాంత మొండు
విని సందియము దీర్పవేఁడుదు మనఘ. 84
శా. నీదేయాజ్ఞ సమస్తలోకములకున్ నీయాజ్ఞ వర్తించుటన్
గాదే సర్వము సంచరించెడిని రక్షాశిక్షలం జేయ నీ
మీఁదం గల్గును భార మోప్రభువరా! మే మిప్పు డొండొక్కచోన్
నీదౌనాజ్ఞఁ దలం ధరించి ఖలునిన్ దేరంగ నొండొక్కనిన్. 85
క. నరలోకంబునకుం జని
పురుషునిఁ బాపాత్ము నొకనిఁ బూని రయమునన్
నిరయమునకుఁ దెచ్చెడుచోఁ
బురుషులు నల్వురు జగత్ప్రపూజితరూపుల్. 86

తే. దండము వహించుటం జేసి దండధరుఁడ
నైననీయాజ్ఞఁ గాదని వానిఁ బ్రోచి
మమ్ముఁ ద్రోచిరి నే మిట్లు ముమ్మఱి మగు
తాపమునఁ జేసి పల్కెదు మీపగిదిని. 87

వ. అనిన నంతయు నెఱింగి యున్నకృతాంతుండు సంతసించుచు దూతలం
గాంచి యి ట్లనియె. 88

ఉ. ఎవ్వనియందు విశ్వ మిది యెల్లఁ బటంబునఁ దంతుకోటులఁ
ట్లెవ్వలన న్విడంబడక యేర్పడి యుండునో యెల్లకాలముం
దెవ్వనిశక్తి భూతములు సృష్టియుఁ బుష్టియు నష్టిఁ గల్గునో
యవ్వరమూర్తి సర్వమున కాఢ్యుఁ డవధ్యుఁడు నెల్లవారికిన్. 89

ఆ. అతని యాజ్ఞ సెల్లు నఖిలలోకములందు
నేను నిర్ఋతి వరుణుఁ డింద్రుఁ డగ్ని
శూలి గాలి బ్రహ్మ సూర్యుండు చంద్రుండు
వానిలెంక లెల్లవారుఁ దలఁప. 90

వ. ఎల్లరును మాయామోహితులై వాని నెఱుంగం జాలక జాలిం
గుడుచుచున్నవార మింకఁ దక్కినవారిం జెప్పనేల జీవులయం దంత
రాత్మరూపుండై సత్త్వాదిగుణంబులచే నపరిచ్ఛిన్నుండై చిదచిదాత్మ
కం బగుజగంబుకంటె విలక్షణుండై సమస్తమున కధీశుండై నిరతిశయ
ప్రభావము గలవాఁడై నారాయణాదినామంబులం బొలుపొందు
చుండు నాతనిదూతలును నాతనివంటివారు తేజఃప్రభావసంపన్నులు
బ్రహ్మాదివందనీయులు వా రెం దెందుం గలపుణ్యాత్ముల మృత్యు
ముఖంబునుండి విడివడం జేసి రక్షించుచుందురు వినుండు. 91

శా. మీచేతం గొన నైనపూరుషుఁ డజామీళుండు పాపాత్మకుం
డై చూపట్టియు విష్ణునామమును బ్రాణాపాయకాలమ్మునం

♦ కొండొకచో నీరూపమున్నది. నామ మగుట నేమి ?

దే చిత్తంబున నైనఁ బల్కె నదియే హేత్వర్థమై పుణ్యముల్
వాచింపం గలఁడె వికుంఠనగరిన్ వాసింప నయ్యెం జుఁడీ. 92

వ. మఱియు నాకర్ణింపుఁ డాభాగవతధర్మము పరమగోప్యము దాని నెఱుంగుట నెంతవారికి నసాధ్య మయిన నేను హిరణ్యగర్భుండు నారదుండు శివుండు సనత్కుమారుండు కపిలుండు స్వాయంభువ మనువు ప్రహ్లాదుఁడు జనకుండు భీష్ముండు బలి శుకుండు మాత్రమె మెఱింగి యున్నవారము దాని నెఱింగినవారికి ముక్తి కరతలామలకంబు నారాయణనామోచ్చారణంబునంజేసినభక్తియోగమే భగవద్ధర్మం బని యెఱుంగుఁ డదియే ముఖ్యధర్మ మదియే పురుషులు సాధింపఁ దగినది యది యుండనిండు భగవన్నామోచ్చారణప్రభావ మెట్టిదియో పాపాత్ముం డగునజామిళుఁడు ముక్తి నొందుటయే మీకు సాక్ష్య మిచ్చుచున్నది కావున భగవన్నామము స్మరించువారు నాదండనమున కర్హులు కాఁ జాలరు వారిపాపము లన్నియు నామోచ్చారణంబునఁ బటాపంచ లగు నో భటులారా! మీ రట్టి వారివంకం బోక వాసుదేవపాదారవిందవిముఖు లగుపాపాత్ములను మాత్రము పట్టి తెచ్చుచుండుఁ డని భటుల కాజ్ఞాపించి వైకుంఠునిం దలంచుచు ని ట్లని విన్నవించె. 93

శా. ఓనారాయణ! యోపురాణపురుషా! యోభక్తమందార! యో
జ్ఞానానందమయస్వరూప! వినుమా నాభక్తు లోకింతయే
జ్ఞానం బన్నది లేక భక్తునియెడన్ గావించినా రాగముల్
దానిన్ సైఁచి యనుగ్రహింపు మనుచు న్బ్రార్థింతు నక్రాంతమున్

వ. ఇట్లు ధర్మరాజు భటులు కావించిన తప్పు సైఁపు మని తా నాహరిం బ్రార్థించె. దానంజేసి తన్నామప్రభావ మిట్టి దని తెలిసి యున్నది గదా రాజేంద్రా! పాపపరిహారంబునకు నామోచ్చారణముకన్న నితరప్రాయశ్చిత్తము లెవ్వియుం జాల వని తొల్లి యగస్త్యుండు మలయపర్వతంబున నున్నప్పుడు పరమగుహ్యం బగునిట్టియితిహాసంబు

వక్కాణించె ననిన విని పరీక్షిన్నరేంద్రుండు మునీంద్రా! స్వాయంభువమన్వంతరమున నైనసృష్టిక్రమంబు సంక్షేపించి చెప్పితి విస్ఫుడది సవిస్తరంబుగం దెలియఁ జెప్పు మనిన శుకమహర్షి యిట్లనియె.

—♦ మన్వంతరకాలసృష్టిక్రమము ♦—

సీ. ప్రాచీనబర్హి యర్కరాజేంద్రునకుఁ బ్రచే
తసులు పదుగురు పుత్రకులు గల రని
ప్రాచీనబర్హి నారదునుపదేశంబు
కతన నివృత్తిమార్గము వహించె
నని చెప్పితిని మున్ను విను మాప్రచేతసుల్
జనకాజ్ఞ సాగరమునకు నేగి
తన్మధ్యమునఁ జెల్లు దట్టముగా నుంటఁ
గని నోట నగ్నినిఁ గలుగఁ జేసి
తే. దానిచే వృక్షములఁ గాల్చుచో నెఱింగి
యబ్జుఁ డరుదెంచి దీనము లైనవీనిఁ
గాల్ప నొప్పునె భూతరక్షణముపొంటె
నీశ్వరుఁడు వీనిఁ జేసె మీ కిట్లు తగదు. 96

వ. నాయీశ్వరత్వమున నున్నవీని నిట్లు కాల్ప నొప్పదు కాచిపుచ్చుఁడు మీరు మీజనకునిచేఁ బ్రజాసృష్టి గావింప నియమింపఁబడితి రిట్టిమీకీక్రూరకార్యం బొప్పదు మీరు మీపితృపితామహప్రపితామహుల మార్గం బవలంబింపుఁడు స్థావరజంగమాత్మక మైనసర్వభూతసంఘాతంబునందును బరమేశ్వరుం డుండు నివి యన్నియు నాతనిశరీరములు గావున నీభూతద్రోహము భగవద్ద్రోహ మట్టి దగు నని యెఱింగి శాంతి వహింపుఁడు మీకు శుభం బగుఁ గాక యని మఱియును. 97

శా. ఈవృక్షంబులు పెంపఁగాఁ బెఱిఁగె నీయిందీవరాక్షీమణిన్
దేవానుగ్రహపాత్రభూత యగుచున్ దీపించునీమారిషన్

దేవిం గా పరిణయింపు(డంచు నిడి దానిం బోయె వా రంతట(
వ్యావిష్టాధృతి దాని నందఱు వివాహం బైరి చంద్రాజ్ఞమై. 98

వ. అనంతరం బా ప్రచేతసుల కామారిషయం దాదికాలంబున బ్రహ్మాం గుష్ఠంబున(బుట్టియు రుద్రాపరాధకారణంబున శప్తుం డైనదక్షుండు పుత్రుండై పుట్టి ప్రాచేతసుండు నా(బ్రఖ్యాతిం గాంచె లోకత్రయ మం దున్న వారు సామాన్యముగా నందఱు నాతనిసంతతివా రే దుహితృవత్సలుం డగునాదక్షుండు చేసినసృష్టిం జెప్పెద సావధా నుండ వై విను మని మఱియును. 99

తే. మున్ను దక్షు(డు నభమందు భూమియందు
జలములందు వివిధప్రజలమనస్సు
వలన సృజియించె వారు దేవతలు మాన
వులును రాక్షసు లాదిగా నలరువారు. 100

వ. ఆమనుస్సృష్టి వర్ధిల్లనికారణంబున నతండు వింధ్యప్రత్యంతపర్వతంబున కుం జని యట నున్నయఘమర్షణపుణ్యతీర్థంబున(ద్రికాలస్నానంబు నొనరించుచు ఘోరతపంబు గావించుచు నారాయణు నారాధించుచు నొక్క-నా(డు హంసగుహ్యాక మనుస్తోత్రంబు గావించె దానిం జెప్పెద నవధరింపుము. 101

—♦ దక్షుండు చేసినహంసగుహ్యాకస్తవరాజము ♦—

సీ. ఎవ్వా(డు తెలియంగ నెప్పుడు చిదచిత్తు
లకు విలక్షణు(డయి లలి(దలిర్చు
నెవ్వానిసంకల్ప మెప్పుడు జీవుల
సంకల్ప మట్టులు సమసి పోదొ
యెవ్వా(డు త్రిగుణంబులే హేతువుగ నగు
ప్రకృతి దేహము గా(గ(బర(గువా(డొ
యెవ్వా(డు సర్వవిశేషద్రసృష్టికి హేతు
భూతు(డై యొప్పెడుపురుషవరు(డొ

తే. అట్టిపరమేశ్వరున కనాద్యంతమూర్తి
కఖిలలోకేశ్వరునకు ననంతునకును
నవ్యయున కప్రమేయున కచ్యుతునకు
నే నమస్కార మొనరింతు మానసమున. 102

తే. దేహి జీవాంతరాత్ముఁడై తేజరిల్లి
రత్నములకుఁ దేజము వోలె రమణ మెఱియు
నేమహామహునిం జీవుఁ డెఱుఁగఁ జాల
కుండు నో వాని కేటికో ళ్ళొసఁగుచుండు. 103

మ. తనువుం బ్రాణము చిత్తవృత్తులును భూతంబుల్ పృథివ్యాదు లె
వ్వను దమ్ముం గనుచుండు వానిఁ గనుపెంపుం దక్కి యున్నట్టు లె
వ్వసిజీవుం డెఱుఁగండొ త న్నరయుచుక్ వర్తించుచున్నక్ జగ
త్ప్రభుతోక్ వానిని నే భజించెదను సంప్రార్థించుచుక్ మ్రొక్కుచుక్.

సీ. మదికి స్వప్నావస్థ వదలి సుషుప్తిగ
లీనయప్పు డెవ్వాఁడు గానఁగ నగునో
రాగాదులకుఁ గాక రమణించుజ్ఞానము
కలిమిఁ బొందఁగ నయి తెలియ నగునో
సంకుచితము గానిజ్ఞానంబునం జేసి
యనిశంబు పరిశుద్ధుఁ డగు నెవండో
సతత ముపాసనాజ్ఞానశుద్ధి నెవండు
స్వాంతసన్నిహితుఁడై వఱల నగునో

తే. ఎవఁడు పంద్రెండు శక్తుల నెసక మెసఁగి
యరణి నగ్ని వలెక్ హృదయాంతరమున
నణఁగి యింద్రియాగోచరుం డగుచు నుండు
నట్టిసర్వేశ్వరు భజింతు నాత్మయందు. 105

దండకము. ఎవ్వాఁడు మాయావికారంబు లేగంగ నమ్మోద మోదంబు
తోఁ యోగికిం బ్రీతి నిర్వాణసౌఖ్యంబు గల్గించునో యెవ్వఁ డెన్నన్
మనోవాక్పరిచ్ఛేద్యముల్ గాని శక్తుల్ గలాఁడౌటచేవిశ్వరూపుండు

నై యుండియుఁ దద్గతాఘంబులఁ బొందఁడో యామహాదేవుఁ
డేలు న్నను న్వేనిరూపంబు శబ్దాదిబోధ్యంబు ప్రజ్ఞాగృహీతంబు
సర్వేంద్రియగ్రాహకంబై పరివర్తింప కెల్లప్పు డుత్పత్తికిం గారణం
బై నసత్త్వాదికార్యంబులఁ జేసి లక్షింపఁగా రానిదో యట్టిదేవున్
మదిం గొల్చి సేవించెదన్ దేనిచే లోక ముత్పన్నమై దేనిచే వృద్ధి
గావింపనై దేనిచే ఖ్యాతినిం బొందునో యట్టితేజంబు రూపంబు గాఁ
గలుసర్వేశ్వరు న్సర్వపూజ్యు న్సదా భక్తి భావింతు నెవ్వాఁడు దా
విశ్వదేహుండు విశ్వుండు నై యట్టివిశ్వంబుకంటెం బరుం డంచు
భావింప రాఁడో యెవం డీమహాసృష్టికిన్ మున్ను విస్పష్టముం గాని
నామంబు రూపంబునుం గల్గి సూక్ష్మాకృతిం బోల్చి యొక్కండమై
యుండునో వాఁడు నా దిక్కగున్ వానికే మ్రొక్కెదన్ మ్రొక్కెదన్

వ. మఱియు గ్రంథనిబంధనముచే వాదులాడు వైశేషికాదుల కెవ్వాని శక్తు లగుభూమ్యాదులు పరస్పరవిరుద్ధవాదములకు విషయము లగుచున్నవో యెవ్వానిశక్తులు లోచనగోచరంబు లగుచున్నను జగము పరమాణుజనితమా? ప్రధానజనితమా? నిత్యమా? యనిత్యమా? భిన్నమా? యభిన్నమా? యని వారికి వారికి మోహంబు గలుగుచుండునో యట్టికళ్యాణగుణున కాదినారాయణునకు నమస్కారమతీంద్రియుఁ డైనయీశ్వరుం డుండె నని నిర్ణయించుటకుఁ బ్రమాణముగా స్వీకరింపఁ బడువేదాంతవాక్యములచేఁ బరమాత్మ యేకరూపుం డనియు నపరిచ్ఛిన్నుఁ డనియుఁ దెలుపఁ బడునో యట్టి పరమాత్మ మాకు దిక్కగుం గాక యని యిట్లు ప్రాచేతసుండు ప్రార్థింప భక్తవత్సలుం డగుభగవంతుఁ డాయఘమర్షణక్షేత్రమున సాక్షాత్కరించె నప్పుడు. 107

— దక్షునకు భగవంతుఁడు ప్రత్యక్ష మగుట —

సీ. ఆజానులంబులై రాజిల్లు నెనిమిది
కరముల శంఖచక్రములు గదయు

విల్లమ్ములును డాలు విఖ్యాతఖడ్గము
పాశమ్మునుం దాల్చి ప్రతిభ పొరయఁ
బసిపచ్చ నగుమేలుపట్టుపుట్టము గట్టి
నల్లనిమైచాయ నలువు మీఱ
వక్షమునందు శ్రీవత్సము కౌస్తుభ
హారము వనమాల నంటి మెఱయ

తే. మెఱుఁగుచామనచాయనౌ మేను దనరఁ
గరములం గంకణంబులు గల్లు మనఁగ
శిరమున న్మేటి బోమిడీక మరిది గాఁగ
మోహనాంగుఁడు విష్ణుఁడు మ్రోలఁ దోఁచె. 108

వ. అప్పుడు నారదుఁడు నందుఁడు లోనగువారు పరివేష్టింప సిద్ధగంధ ర్వాదులు గానము సేయఁ జారణులచే నుతింపఁ బడునామహావిష్ణు వాప్రాచేతసుని ప్రక్కం బొలుచుటం గాంచి యతండు సంతుష్టాంత రంగుండై దండప్రణామంబు గావించి యొండేమియుం బలుకఁ జాల కుండె నప్పుడు సర్వజ్ఞుం డగుభగవంతుండు సంతానకాంక్షి యగు భక్తునిం జూచి యి ట్లనియె. 109

ఉ. నీవు మహానుభావుఁడవు నీదుతపంబున కేను మెచ్చితిన్
దేవత లైన నిన్ దొరయ నేరరు నీతప మేను మెచ్చితిన్
నీవలనన్ శుభంబులను నే విన నెంతు నజస్రమిప్డు నీ
భావము నాదుభావ మొకపంథన పట్టిన విట్టిపట్టునన్. 110

వ. బ్రహ్మయు శివుండు ప్రజాపతులు మన్వాదులు నింద్రాదులు మొద లగువారు భూతజాతంబు సంవర్ధింపఁ జాలినవా రని పలికి మఱియును.

సీ. తపము నాహృదయము జపము నాదేహము
యజ్ఞకర్మములు నాయంగకములు
దానాదిధర్మముల్ నానెమ్మనము దేవ
తలు నాదుప్రాణముల్ తెలియ వినుము

సృష్టికిఁ బూర్వము చెప్పఁ బడనినామ
రూపముల్ గలిగి చిద్రూపి నగుచు
నే నొకండన యుంటి నిమ్మెయిఁ దల్లఁ ద్రవ్య
మింతయును లేదు మే నేరుపడని

తే. దగుచు నవ్యక్త మొక్కఁడు తగవు మఱచి
నిద్రవోయెడునట్టులు నెగడుచుండె
నపుడు చిదచిచ్ఛరీరుఁడ నయిననాకుఁ
గలిగె మేను బ్రహ్మాండాత్మకంబ యగుచు. 112

వ. దానివలనఁ జతుర్ముఖుండు పుట్టె నతండు మదాజ్ఞంజేసి సృష్టికర్మం బునఁ బ్రవృత్తుం డయ్యు సమర్థుండు గాకుండు టెఱింగి నేను దపంబు చేయు మని బోధింప నతం డట్లు చేసి సమర్థుండై సృష్టి చేయం దొరకొని మునుమున్న ప్రజాపతుల మిమ్ము సృజింపం గలిగెఁ బరంతపా పంచజనుం డను ప్రజాపతికి నసిక్ని యనుకన్య గలదు దాని నీవు భార్యగాఁ బరిగ్రహించి పిల్లలం గనుము దానంజేసి ప్రజాసృష్టి వర్ధిల్లఁ గల దని పలికి పలుకుచుండునంతలో నంతర్ధానం బయ్యె ననంతరంబ. 113

సీ. ప్రాచేతసుం డల్ల పాంచజనిం బొంది
హర్యశ్వు లను పేర నలరుచుండు
వారిసిం బుత్రులఁ బదివేవురం బుత్రి
కలఁ బదివేవురఁ గాంచెఁ బ్రీతి
నాదక్షసుతులు పితాజ్ఞను బాలించి
ప్రజల సృష్టించెడువార యగుచు
సింధునదం బబ్ధిఁ జేరినచోటను
నారాయణసరస్సు నలువు మీఱు

తే. స్పర్శమున సర్వపాపముల్ సమయఁ జేయు
నన్నదతటంబునందు హర్యశ్వు లుండి

తండ్రియాజ్ఞను దలఁ దాల్చి తప మొనర్చి
సలిపిరి ప్రజాభివృద్ధికై జతనములను. 114

వ. అంతలో నటకు నారదుండు వచ్చి వారిం గాంచి యి ట్లనియె. 115

—• నారదుఁడు దక్షసుతులకు జ్ఞానోపదేశము చేయుట •—

ఉ. బాలకులార! మీర లోకపాటి యెఱుంగనివార లౌటచే
బేలతనంబునం దపము పేరిడులై పొనరించుచుంటి రీ
లీలను బార్థివంబు లయి లియ్యము లయ్యెడునట్టి దేహముల్
పోలఁగ సృష్టిచేయుటకుఁ బూనికఁ జేసితి రక్క టక్కటా. 116

చ. తనువు లశాశ్వతంబు లనుతత్త్వ మెఱుంగనివార లౌటచే
జనులఁ సృజించు కోరికను సల్పితిరిట్లు తెఱంగియుండినన్
మనమున నీ యటంచుఁ గొఱమాలినదీనికిఁ బూన కిజ్జగం
బును భవబంధముల్ దెగడి పొందఁగ నెంతురు మోక్షలక్ష్మినిన్.

తే. సృష్టియును దల్లయంబును జేయు మాయఁ
బంచవింశతితత్త్వరూపమున నొప్పు
జీవదేహసంబంధముఁ జెప్ప వినమిఁ
బండితులు గానిమీ రిట్లు పడితి రకట. 118

వ. అని నారదుండు పలికిన హర్యశ్వులు విచారశక్తి గలవా రగుటంజేసి
తద్వచనమ్ములు విమర్శించి నిశ్చితమనస్కులై. 119

తే. పుణ్యపాపనిబద్ధమై పొనరుచుండు
దేహ మిది పార్థివం బని తెలియఁ బడును
బుట్టువుం జావు గలదేహమును బొనర్చు
కర్మమును ద్రుంపఁ జాలరు కష్టు లకట. 120

తమనోజ. ప్రకృతిపూరుషులకుఁ బరుఁ డయి జ్ఞాన
వైరాగ్యమద్గుణవంతుఁడై సతము
సకలదోషములను సమయింపఁ జేసి
సంసారసంధికి శత్రువై పఱలు

సకలేశ్వరునిఁ జిత్తజలజంబునందు
సతము పూజింపనిజమునిజన్మంబు
సుక మన రా దెప్డుఁ జూచినఁ గష్ట
సంగతికై త్రెళ్ళు సంసృతియందు. 121

సీ. అయ్యయో మాయ మహాప్రవాహమువంటి
దిహపరలోకము లెన్నఁ దటము
లాప్రవాహము తన కైనవస్తువు వేగ
వశమున నిం దందుఁ బడఁగఁ జేర్చు
నట్లు మాయయు జీవునందందుఁ బడ వైచుఁ
దద్గతుఁడై యుండుదాన నట్లు
కాకున్నఁ దద్భయకారణం బుండదు
కాన దాని జయింపఁ గా వలయును

తే. ఆత్మపరమాత్మవిజ్ఞాన మలవడంగఁ
దత్త్వమును మున్ను సాధింపఁ దగును మనము
విషయసుఖముల నాశింప వెడలకుండ
జ్ఞానపాశమునం దానిఁ గట్ట వలయు. 122

ఉ. కాలము బ్రహ్మ దొట్టియును గల్గినసర్వశరీరధారులన్
గాలునివీటికిం బనుపఁ గాఁ గలదై కరుణావిహీన మై
ద్రోలుచునుండి యజ్ఞుల కఖండభయం బొడఁగూర్చు విజ్ఞుఁ డా
కాలము నింతలో గెలువఁగాఁ గలఁ డీశునను్గ్రహంబునన్. 123

వ. అని హర్యశ్వు లనేకవిధంబులఁ దత్త్వవిమర్శనంబు చేసి నారదు నా మంత్రించి వివిక్తదేశంబునకుం జని పరబ్రహ్మోపాసనంబు చేసి ముక్తిం బొంది రంత నారదుండును హరిపాదపద్మంబులు చిత్తంబున నిల్పుకొని భక్తిభరితుండై యెప్పటియట్లు లోకంబులఁ బరిభ్రమణంబు సేయువాఁ డయ్యె నంత నక్కడ దక్షుండును దనపుత్రులు నారదోప దేశమ్మునంజేసి సృష్ట్యుద్యోగంబునుండి విరక్తులై ముక్తిం గాంచు

బెటింగి దుఃఖించుచు నింత శాంతి వహించి పాంచజనియందు శబ
ళాశ్వు లనువేవురు పుత్రులం గని వారిం గూడఁ బ్రజాసృష్టిఁ జేయ
నియమించె నాశబళాశ్వులు సన్నలు వోయినచోటికిం బోయి ఘోర
తపంబు గావించుచుండి రపుడు తొంటివలె నారదుండు వెండియు
వచ్చి హర్యశ్వులకుం జెప్పినచొప్పునం జెప్పి పోయిన వారును దదుప
దేశంబునం దమయన్నలవలె నివృత్తిమార్గం బవలంబించి మోక్షంబు
నొందిరి. దక్షుం డదియును గర్ణాకర్ణికగా విని నితాంతచింతాసాగ
రంబున మునింగి యుండ నంతలోఁ దనచెంతకు వచ్చిననారదు నిరీ
క్షించి కోపానలదందహ్యమానమానసుండై. 124

—♦ దక్షుఁడు నారదుని శపించి ప్రజాసర్గముచేయుట ♦—

శా. ఓరీ! సాధువు నా నటించెదవు ధన్యుం డీతఁడం చెల్లరుం
జేర న్వచ్చి భజించి యింత యిడి వాసిం గూర్ప నోచెల్ల లో
కారాధ్యుండవొ నీవు తంత్రములు నీయం దెన్ని యే నుండె నీ
పేరుం జెప్పినఁ బాప మంటు నని చెప్పె న్నాకు నాచిత్తమే. 125

పంచ. ప్రవృత్తిమార్గమందు నున్నవారి నాకుమారులం
నివృత్తిమార్గమందు నిల్పి నీవు వారు సన్యసిం
ప వారు చేసి నన్ను దుఃఖవార్ధి ముంచి తెక్కటా
భవత్కృతాపచార మెన్నఁ బారహీన మయ్యెడిన్. 126

తే. పుత్రుఁ డగువాఁడు వేదోక్తపుణ్యకర్మ
ములను బొనరించి దేవతాదులఋణములు
దీర్చు నని పుట్టె డాసతో దేవులాడి
తండ్రి వారలఁ బొందంగఁ దలఁచుఁ గాదె. 127

క. త్రైరుణ్యము దీర్పనిచో
వారలకుం ముక్తి లేదు పాపీ! యుచటం
గోరికలు దీరఁ బిదపన
వేరును మోక్షంబు నొంద నెడలుట లొప్పున్. 128

వ. ఓరీ దుష్టాత్మా ! దుర్బుద్ధులు గఱపి నాపుత్రుల కిహపరలోకంబులు
రెండును లేకుండఁ జేసితి కర్మాసక్తచిత్తుండ నగునాకు దుస్సహ
మగునపకారంబు గావించితి వది కారణంబుగ నీ వొక్కచో నిలిచి
యుండక సర్వలోకసంచారివై పోఁ గల వని నారదునకు శాప
మొసంగె నారదుండును శాంతుండై సమర్థుం డయ్యుఁ బ్రతిశాపంబు
పలుకక శాపమును స్వీకరించుచు సంతసించుచు మహతి వాయిం
చుచు నీశ్వరుం బాడుచుం జనియె నంత దక్షుండు పుత్రశోకసంతప్త
చిత్తుండై యుండ బ్రహ్మదేవుండు వచ్చి దుఃఖోపశమనంబు చేసి
ప్రజాసర్గోపాయంబు చెప్పి చనియె నంత. 129

ఉ. దక్షుఁడు దుఃఖము న్విడిచి తత్పరతం గొని సృష్టిఁ గోరి స
ల్లక్షణలక్షితాంగి యయి లక్ష్మి యనం జనునయ్యసిక్నియం
దాక్షణమందఁ పుత్రికల నర్వదిమందినిఁ గాంచి వారికిన్
రక్షణముం బొనర్చె రుచిరం బగుదివ్యపదార్థసంగతిన్. 130

సీ. అట్లు పెంచినవార లర్వదిమందిలోఁ
బదుగుర ధర్మదేవతకు మఱియుఁ
బదు మువ్వురం గశ్యపప్రజాపతికిని
నిర్వదియేడ్వుర నిందునకును
నిర్వు రిర్వురు గాఁగ నార్వుర నుదాత్తింగి
రఃకృశానులకు భార్యలుగ నిచ్చి
మిగిలి యుండిననల్వు రగువారిఁ దార్క్ష్యున
కిచ్చి వివాహము లెసఁగఁ జేసి

తే. నంతఁ గొంతటిలో వారిసంతతియు న
నంతమై త్రిలోకమ్ములు నాక్రమించె
వారినామధేయంబులు వరుసతోడ
నిపుడు వివరించెద న్విను మేర్పడంగ. 131

వ. అందు ధర్ముండు భానువు లంబ కకుప్పు జామి విశ్వ సాధ్య మరు
త్వతి వసువు ముహూర్త సంకల్ప యనంబడు పదుగురను బెండ్లి

యాడి భానువునందు వేదుఁడు ఋషభుఁడు ననునిరువురఁ బుత్రులను లంబయందు విద్యోతుఁ డనువానిని గకుప్పునందు గీకటుని జామియందు దుర్గాభిమానదేవతలఁ గొందఱను విశ్వయందు విశ్వేదేవులను సాధ్యయందు సాధ్యగణమును మరుత్వతియందు మరుత్వంతుఁడు జయంతుఁడు ననునిద్దఱు నీజయంతుఁడే వాసుదేవాంశమున నైనయుపేంద్రుం డని చెప్పుదురు వసువునం దష్టవసువులను ముహూర్తయందు ముహూర్తాభిమాను లగుదేవగణంబును సంకల్పయందు సంకల్పుఁడనువానింబుట్టించె నందు ఋషభునకు నింద్రసేనుఁడు నవిద్యోతునకు స్తనయిత్నువు లనుకొందఱు సుతులును గీకటునకు సంకటుండును దుర్గాభిమాని దేవతలకు స్వర్గుఁడు నంది యనునిర్వురను సాధ్యగణమున కర్థసిద్ధుఁడు సంకల్పునకుఁ గాముఁడును బుట్టిరి వసుపుత్రు లగునష్టవసువులు ద్రోణుఁడు ప్రాణుఁడు ధ్రువుఁడు నర్కుఁడు నగ్ని దోషుఁడు వసువు విభావసువు ననువారు వారిలో ద్రోణునకు నభిమతి యనుదానియందు హర్షుఁడు శోకుఁడు భయుఁడు లోనగువారు పుట్టిరి ప్రాణున కూర్జస్వతి యనుసతియందు సహుండు నాయువు పురోజవుండు జనించిరి ధ్రువునకు ధరణి యనుదానియందుఁ బురాభిమాని దేవతలు పెక్కురు పుట్టి రర్కునకు నశన యను పత్నియందుఁ దర్షాదు లనుసూనులు జన్మించి రగ్నికి వసోర్ధార యను నారియందు ద్రవిణకుఁడు లోనగుసుతు లుదయించిరి మఱియు నయ్యగ్నికిఁ గృత్తికలందు స్కందుఁ డుదయించె నాతనికిఁ గార్తికేయుఁడు షాణ్మాతురుఁడు నగ్నిసంభవుఁడు కుమారుఁడు ననునామంబులు కల వాస్కందునకు విశాఖాదు లుదయించిరి దోషునకు శర్వరి యనుకళత్రమందు నారాయణాంశమున శింశుమారుఁ డుదయించె వసువున కాంగిరసి యనుసాధ్వియందు విశ్వకర్ముఁడు పొడమి శిల్పాచార్యుండై ప్రసిద్ధిం గాంచె విశ్వకర్మునికిఁ జాక్షుషుఁ డనుమను వుదయించె నతనికి విశ్వులు సాధ్యులు ననుకుమారులు పెక్కురుజనించిరి.

విభావసు వనునష్టమమనువునకు నుష యనుసతియందు వ్యుష్టుఁడు రోచిస్సు నాతపుఁ డనునారు గలిగిరి. ఆతపునకుఁ బంచయాముఁ డనుదినాభిమాని దేవత పుట్టె నాపంచయామునందే సకలభూతములును జాగరూకములై వర్తించు నిది ధర్మునిపుత్రపౌత్రసంతాన మింకఁ గశ్యపచంద్రుల కొసంగిన దక్షకన్యలసంతానాభివృద్ధి పదంపడిఁ జెప్పెద రుద్రభార్య యగుసరూప కోటానఁగోట్ల రుద్రగణములం గనియె. ఆగణములకుఁ బదునొకండ్రు రుద్రులు నాయకులైరి. వారు రైవతుఁడు నజుఁడు భవుఁడు భీముఁడు వాముఁడు నుగ్రుఁడు వృషాకపి యజైకపాత్తు నహిర్బుధ్నుఁడు బహురూపుఁడు మహాంతుఁడు ననువారు మఱియు రుద్రపారిషదగణములు ప్రేతులు వినాయకులు నాఁగఁ గొన్నిగల వివి యన్నియు రుద్రునకు నన్య యగు భార్యయందు జన్మించె. నాంగీరసుఁడు తనయిరువురుభార్యలలో స్వధయందుఁ బితృగణంబులును సతియందు నథర్వాంగిరసుఁ డను వేదాభిమానిపురుషునిం గనియె! కృశాశ్వుఁ డర్చి యనుసతియందు ధూమ్రకేతుని భీషణ యనుదానియందు వేదశిరుఁడు దేవలుఁడు వయునుఁడు మనువు ననుసుతులం గనియెఁ దార్క్ష్యుఁడు తననలువురు పత్నులలోఁ బతంగియందుఁ బతగులను యామినియందు శలభులనుం గనియె సుపర్ణ యనునామాంతరము గలవినతయందు విష్ణువాహనమైనగరుత్మంతుఁడు సూర్యసారథి యైనయనూరుఁడును బుట్టిరి కద్రువుకుఁ బలువిధము లగునాగులు పుట్టిరి. 132

ఉ. ఇందుఁడు కృత్తికాదు లగునిర్వదియేడ్గురఁ బెండ్లియాడి యా
సుందరులందు రోహిణినిఁ జూచి ప్రియంబున నొడ్ల రోయఁగా
నందఱుఁ దండ్రికిం దెలుప నాతఁడు నాతనిఁ గుష్టరోగిఁ గా
నుండు మటంచు శాపము మహోగ్రగతిం బొనరించెఁ గించుగ౯. 133

తే. ఇందుఁ డందున రోగియై కృత్తికాదు
లందు బిడ్డలఁ గనఁ జాలఁ డయ్యె నప్పు

డసితపక్షమునఁ గ్షయ మైనకళలు
శుక్లపక్షమున న్వొండి సొంపు నొంద. 134

వ. ఇట్లు దక్షుండు వరం బొసంగె నవ్వల కశ్యపుం డదితి దితి దనువు కాష్ఠ యరిష్ట సురస యిళ ముని క్రోధవశ తామ్ర సురభి సరమ తిమి యనువారిం బడసె వారిలోఁ దిమి యనుదానియందు యాదోగణము పుట్టె. సరమయందు శునకములు వ్యాఘ్రములు మార్జాలములు లోనగుజంతువులు పుట్టె సురభియందు మహిషములు గోవులు లోనగు భిన్నఖురజంతువులు పుట్టె. తామ్రియందు శ్యేనములు గృధ్రములు లోనగునవి పుట్టె. మునియందు నచ్చరలు పుట్టిరి క్రోధవశయందు సర్పాదులు పుట్టె. నిళయందు వృక్షములు పుట్టె. సురసయందు యాతుధానులు పుట్టిరి. అరిష్టయందు గంధర్వులు పుట్టిరి. కాష్ఠయందు నశ్వగర్దభాదులు పుట్టె. దనువునందు నేకషష్టి కుమారులు పుట్టిరి. వారిలో ముఖ్యులు పదునెనమండ్రు వారు ద్విమూర్ధుఁడు శంబరుఁడు నరిష్టుఁడు హయగ్రీవుఁడు విభావసుఁడు నయోముఖుఁడు శంకుశిరుఁడు స్వర్భానువు కపిలుఁడు నరుణుఁడు పులోముఁడు వృషపర్వుఁడు నేకచక్రుఁడు సుతాపనుఁడు ధూమ్రకేశుఁడు విరూపాక్షుఁడు విప్రచిత్తి దుర్జయుఁడు ననువారు వారిలో స్వర్భానుపుత్త్రి యగుసుప్రభను నముచి పెండ్లియాడె. నహుషపుత్త్రుండగుయయాతి వృషపర్వునిపుత్త్రి యగుశర్మిష్ఠను బెండ్లియాడె. వసుసుతుం డైనవైశ్వానరునకు నలువురు పుత్త్రికలు వారిలో నుపదానవిని హిరణ్యాక్షుండును, గ్రతువు హయశిరసను గశ్యపుఁడు పులోమాకాలకలను బెండ్లియాడి రందుఁ బులోమాకాలకలకుఁ బౌలోమకాలకేయు లనునఱువదివేవురు దానవులు పుట్టిరి. 135

ఉ. వారు నిరంకుశత్వమున వర్తిలుచున్ సవనాదిసత్క్రియా
వారము సర్వముం జెఱుచు వారయి వారక యెల్లలోకముల్
కారియ నొంది కుందు నటు కార్యములం బొనరించు చల్లబ్బం
దారకకోటికిన్ బెదరు తాఁకఁగఁ జేయుచు నుండి రెంతయున్. 136

క. నీతండ్రితండ్రి విజయుం
డాతఁడె స్వర్గమున కేగి యమరులపంపుం
జేతమునఁ దాల్చి వారికి
ఘాతుకులం దునిమి నైచె ఘనశౌర్యమునన్. 137

వ. విప్రచిత్తి సింహికను బెండ్లియాడి నూఱుగురు రాక్షసులం గాంచె వారిలో రాహువు జ్యేష్ఠుండు. వాఁడు దానవుం డయినను భగవదనుగ్రహంబున గ్రహంబులం జేరె నింక నదితివంశముం జెప్పెద నవధరింపుము. అదితికి వివస్వంతుఁడు నర్యముఁడు పూషుఁడు త్వష్ట సవిత భగుఁడు ధాత విధాత వరుణుఁడు మిత్రుఁడు శత్రుఁడు నురుక్రముఁడు ననెడు పన్నిద్దఱు పుత్రులు పుట్టిరి. వివస్వంతుఁడు సంజ్ఞ యనుసతియందు శ్రాద్ధదేవుఁడు యముఁ డనుపుత్రులను యమునయనుపుత్రికం గాంచె సంజ్ఞయే బడబారూపము నొంది యశ్వి దేవత లనునాసత్యులం గనియె ఛాయ యనుదానియందు శనైశ్చరుండు సావర్ణి మను వనుసుతులును దపతి యనుసుతయుం గలిగిరి తపతి సంవరణునిఁ బతిగా వరించె నర్యమునకు మాతృక యనుసహధర్మచారిణియందుఁ గర్మశీలు రయినప్రజలు పుట్టిరి వారి మూలమున మానవజాతి భూతలమునఁ బ్రవర్తింపఁ గలిగె. 138

ఉ. పూషుఁడు దక్షుతోఁ గలహముం గొని యుండిన రుద్రుఁ జూచి సంభాషణ మాచరింపకయ ఫక్కున నవ్వెను దంతపంక్తిలో
దోషము దోఁపఁ జేయుచును దోఁచినయప్పుడ రుద్రపార్షదుల్
రోషముతోడఁ దద్రదనరూపము రూపఱఁ జేసి రీసునన్ 139

ఆ. గవ్వ లట్లు పండ్లు గలగల రాలంగ
బోసినోటివాఁడ నైయె నవ్వు రతఁడె
పిండిమాత్ర తినుచు నుండెడివాఁ డయ్యెఁ
బూషుఁ డెటులఁ గొంటె భూతలేశ. 140

వ. అట్టిం డైనపూషుండు సంతానము లేనివాఁడయ్యెఁ ద్వష్టకు దానవసోదరి యగురచన యనుపత్నియందు విశ్వరూపుఁ డుదయించె

దేవతలు కారణాంతరంబున బృహస్పతిం గాదని విశ్వరూపునిం బురోహితునిగం గైకొని రనిన రాజు మునిరాజుం జూచి సురాచార్యుండయినబృహస్పతి దివస్పతిప్రభృతుల దేవతలం విడిచి పోవుటకుం గలకారణంబు సెప్పు మనిన నతం డతని కి ట్లనియె. 141

— ♦ బృహస్పతి యిందుఁ బరిత్యజించి పోవుట ♦ —

ఉ. ఇంద్రుఁడు ముజ్జగంబులకు నేలిక గావున దుర్మదాంధుఁడై
సాంద్రవిభూతి నొప్పుచును సాధ్యులు రుద్రులు నశ్వినీసుతుల్
చంద్రదినేంద్రులుం సురలు సన్నుతి సేయుచు నంటి కొల్వ ని
స్తంద్రత సింహపీఠమున స్వైరత నుండెను గొల్వు దీర్చుచున్. 142

వ. అప్పు డచ్చరలనృత్యంబును గంధర్వులగానంబును బ్రహ్మవాదుల వేదనాదంబును విద్యాధరులవినయాభినయంబులును విస్తరిల్లుచుండ శచీసమేతుండై పేరోలగంబు సేయుచుండె నాసమయంబున సర్వదేవతాచార్యుండును బరమపూజ్యుండు నగుబృహస్పతి సభాభవనంబునకుం జనుదెంచె నప్పు డింద్రుండును. 143

ఉ. ఆతనిం జూచి యాసనమునందున యుండియు లేవనట్టిఁడై
చేతుల నైన మోడ్చుటకుఁ జిత్తము సేయక చూచుచున్న చోఁ
బ్రీతిం దొఱంగి గీష్పతి జరీన గమించె మరల్చి మోమొకం
డాతడి నాడ కోడక సముద్ధుఁడు గాన నహంకరించుచున్. 144

స్వాగతము. దేవతాధిపతి దేశికుఁ డేగన్
దావులం దగనితత్తఱపాటన్
భావమందుఁ గడు బమ్మెర గల్గన్
జేవఁ దప్పి యిటు చింతిలఁ జొచ్చెన్. 145

ఉ. అక్కట కష్టకాల మిటు లయ్యె నయో యిఁక నేమి సేయుదున్
మిక్కిలితప్పు చేసితిని మీఁదు తెలుంగనివాఁడ నైతి నా
పక్కన యున్న దేశికునివైపు కనుంగవ వేయ నైతి ర
మ్మక్కడ విశ్రమింపు మన నైతిఁ గరంబున నైన మత్తుఁడన్. 146

క. చూచియుఁ జూడనియట్టులు
రాచరికపుఁ శ్రీవశోడ రాజ్యమదమునన్
నాచేసినతప్పునకున్
ధీచతురుఁడు గురునికాళ్ల దెసఁ బడుటె తగున్. 147

సీ. సాత్త్వికంబయినభాస్వత్స్వభావము, గలదేవ
తల కేను విభుఁడనై తగనిరాజ
సస్వభావము గలజాల్ముఁడనై యిట్లు
మసలితి నైశ్వర్యమత్తుఁడ నయి
నాకంటె నధముఁ డేలోకంబునన్ లేదు
దీనికి నిష్కృతి దేశికవర
పదరజోధారణ మది గాక యొండొక్క
డెదియు లే దని నిశ్చయించి యపుడ

తే. యిందుఁ డావిబుధాచార్యునింటి కేగి
గురు నరయుచుండ నంతలో గురుఁడు యోగ
బలమునఁ దిరోహితుం డయి వాసవునకుఁ
గాన రాఁడయ్యె వెదకినఁ గాని యెందు. 148

వ. ఇట్లు దేవేంద్రుం డెల్లకడల గురు నన్వేషించుచు నెల్లరాజకీయంబు లుం గన నొల్లక విచారాందోళితమనస్కుండై కుందుచు నెంబరవిత్తు చందంబున విహరించుచుండె నిది నందని యెఱింగి రాక్షసు లందఱు శుక్రప్రేరణంబున సమరసన్నద్ధులై నానావిధాయుధంబులతోఁ జతు ర్విధసేనాసమేతులై వచ్చి యమరావతిన్ ముట్టడించి దేవతలతో ఘోరయుద్ధంబు గావించి రప్పుడు. 149

దైత్యు లింద్రుపై దాడివచ్చి యోడించుట :—

మ. కరవాలంబులు భిందివాలములు ఖడ్గంబుల్ సహస్రఘ్నులున్
బరశువ్రాతములుం బరశ్వథములున్ బహ్వస్త్రశస్త్రంబులున్
సురసైన్యంబులమీఁద నేసి దనుజుల్ శుంభన్మహారంభముల్
వఱఁగ న్నొంచి కలంచి రెల్లరు భయభ్రాంతాత్ములై పాఱఁగన్.150

వ. ఇట్లు దనుజమర్దితులై దేవతలు దేవేంద్రునిం బురస్కరించుకొని పరమేష్ఠిపాలికిం జని ప్రార్థించి సర్వంబు నివేదించి శరణుం జొచ్చుటయు నతండు శత్రుపీడితులైన త్రిదశులం జూచి జాలిపడి యూరడించుచు ని ట్లనియె. 151

ఉ. మీరు మహాపరాధమును మీఁదు దెలుంగక చేసినారు త
త్కారణమూలమై యిటులు కారియ గల్గఁగ నయ్యె నట్టు లాం
గీరసునిం బరాభవవికీర్ణునిఁ జేసితి రట్టి తత్తిర
స్కారఫలంబపో యిటులు కల్గఁగ వచ్చుట మీకుఁ జూడఁగన్. 152

ఆ. వార లలతులైన భార్గవుం గొలిచెదు
కారణమున నిట్లు గండుమిగిలి
రేమి చెప్పవాఁడ నేఁచె బీ తెద నాదు
నాలయంబుఁ గూడ నాక్రమింతు్రు. 153

వ. అయినదాని కిపు డనుకొనిన ఫలంబు లేదు కావున మీ రిపుడు త్వష్టకొడు కగువిశ్వరూపుం బురోహితునిఁగా వరింపుఁ డతండు దానవపక్షపాతి యైనను వరింపుఁడు పొండు మీకు విజయం బగు ననిన వారు వాని వీడ్కొని విశ్వరూపునిఁకడకుం జని ప్రార్థించుచు ని ట్లనిరి. 154

—♦ దేవతలు విశ్వరూపునిఁ బురోహితునిగ వరించుట ♦—

చ. అతిథులమై భవత్సముఖ మందఁగ వచ్చితి మాదరించి మా
కతిథిసపర్యలం జరిపి న ట్లయినన్ శుభ మౌను నీకు నీ
క్షితికిని నీదుపూర్వులకు సేమము చేకురు నిట్టినేము నీ
పితరులవంటివార మని ప్రేముడిఁ జూపుము మాపయి న్మనీ. 155

సీ. ఆచార్యుఁ డీశ్వరునట్టిండు తండ్రి వి
ధాతకు దీటనఁ దగినవాఁడు
సోదరుఁ డింద్రునితోఁ దులఁదూఁగెడు
జనని భూదేవికి సవతు వచ్చు

నాత్మసోదరి సుదయారూపురాలు తా
మాఱట ధర్మముమూర్తి యతిథి
తనరూపమే యని తలపోయ వలయు న
భ్యాగతుఁ డగ్నిరూపప్రథితుఁడు
తే. అనుచు వీరి నారాధించి కని భజించి
పూజ గావించి సేవింపఁ బోలు ననుచు
శాస్త్రములు చెప్పుచుండు నో త్వష్ట్రాసురేంద్ర
మాకు నుపకృతిసేయుట నీక చెల్లు. 156

వ. నే మిపుడు శత్రుపీడితులము నీ కతిథులమై వచ్చినారము నీకు నే మత్యాదరణీయులము నీతపఃప్రభావమ్మున శత్రుతిరస్కారరూప మగుమాదుఃఖమును దొలంగించి మ మ్మాదరింపుము బ్రహ్మజ్ఞాన సంపన్నుఁడ వగునిన్ను నే ముపాధ్యాయునిఁగా గురువుఁగా నాచార్యునిఁగా వరించితిమి వృతోఽస్మి యని నీవు మా కార్యంబు దేసవాఁడ వై శత్రుజయంబు చేకూర్పుము. నీవు చిన్నవాఁడ వయిన వేదాధ్యయన సంపన్నుఁడవు గావునఁ బెద్దవానిగ నెంచి నీ కిదె నమస్కరించు చుంటి మని బహువిధంబులం బ్రార్థించిన విశ్వరూపుండు వేల్పులారా! పౌరోహిత్య మంత మంచిది కాదు బ్రహ్మవర్చసము నడంచు నట్లయినను బితృతుల్యులు మీరు ప్రార్థించుటం జేసి నిరాకరింపఁ జాలక నేను దానికంగీకరించితి ధర్మముచేఁ బ్రాణముచే మీయర్థంబులు సాధించి మీయభిలషితంబులు దీర్చుచుండు నని పౌరోహిత్య మంగీకరించి స్వీకరించి శుక్రరక్షిత మగు దైత్యసంపదను నారాయణ కవచమంత్రబలముచే నాకర్షించి దేవేంద్రున కొసంగియు నవల నతని కతఁడు నారాయణకవచమంత్రం బుపదేశించె దాన నతండు గండు మిగిలి దైత్యసైన్యంబుల దైన్యంబు నొందించె ననిన రాజేంద్రుం డట్టిమహోన్నతం బయిననారాయణకవచప్రభావము విన నెంచితి నా కెఱింగింపు మనిన శుకయోగీంద్రుండు విశ్వరూపుండు దేవేంద్రునకుఁ జెప్పినచొప్పునం జెప్పు చుంటి నాకర్ణింపు మని యి ట్లనియె. 157

—♦ నారాయణకవచప్రభావము ♦—

తే. వర్మము జపింపఁ దలఁచినవాఁడు మున్ను
స్నానసంధ్యాదికృత్యముల్ సంతరించి
కుశలయం దుదఙ్ముఖుఁ డయి కూరుచుండి
వార్చి వాఙ్నియమంబున వలయు నుండ. 158

వ. అష్టాక్షర ద్వాదశాక్షర మంత్రంబుల నంగన్యాసకరన్యాసంబులు గావించి పద జా నూ రూదర హృద యోరోముఖ శీర్షంబు లను నష్టాంగంబులఁ బ్రణవసంఘటితైకైకాక్షరంబుగ షడక్షరిన్ సన్న్యసించి యస్త్రాయఫట్టని దిగ్బంధమ్ము చేసి నారాయణధ్యానంబును ల మిత్యాదిపంచపూజయుం బొనరించినపదంపడి. 159

ద్విపద. కరుణతో నాశ్రితకష్టముల్ దీర్చి
గరుడి మూఁపున నెక్కి ఖడ్గమున్ డాలు
శంఖచక్రంబులు శార్ఙ్గంబు గదయుఁ
బుంఖానుపుంఖముల్ భూరిశరాళిఁ
బాశము నెనిమిది బాహువులందు
వేశ మేర్పడ దాల్చి వివిధవిభూతు
లందియు హతపాప్ముఁ డగుచు నన్నింటి
యందు జగన్మయుఁడై వెలుగొందు
పరమేశ్వరుఁడు నన్నుఁ బ్రతిపదమందుఁ
గరుణమై రక్షించుఁ గాక యాదోగ
ణమ్ములకును వారుణము పాశమునకు
సమ్మతిమై నుండ జలమందు మత్స్య
మూర్తియై వెలుగొందుపురుషోత్తముండు
కీర్తించు నను నీటఁ గేయూత యిచ్చి
పాలించుఁ గావుత భక్తార్తిఁ బాపఁ

జాలి వామనుఁ డగుశౌరి స్థలఁబు
లందు నఱ గాపాడు నంఘ్రిత్రయంబు
పొందుకోరికిఁ దెల్పి మూఁడులోకముల
నాక్రమించిన దేవుఁ డలత్రివిక్రముఁడు
విక్రమ మెసఁగ నఱ విన్ననఁ బ్రోచుఁ
గాక రాక్షసులకు గర్భపాతంబు
వీఁకమైఁ గలుగంగ భీషణుం డగుచు
నట్టహాసము చేసి యసురులఁ జంచి
నట్టినృసింహుఁ డత్యంతదుర్గాట
వుల సంగరంబులఁ బుట్టెడుభీతిఁ
దొలఁగించి ననుఁ గాచుఁ దోడునీ డగుచు
వరయజ్ఞమూర్తియై వఱలి దంష్ట్రలను
ధర నుద్ధరించుభూదారరూపుండు
మార్గముల న్నన్ను మనిచెడుఁ గాక
భార్గవాన్వయమందుఁ బ్రభవించి మించి
దుష్టశిక్షణమును దోర్దర్ప మొప్పఁ
గష్టములకు నోర్చి కాశ్యపి యెల్ల
ముయ్యేడుమాఱులు పోయి శోధించి
శయ్యంబు లొనరించి క్రాలురాముండు
శరణమైఁ దా నెల్ల కడలను నన్నుఁ
బరికించి రక్షించువాఁ డగుఁ గాక
దశరథరాముఁడై ధరణిపైఁ గల్గు
పశుతుల్యు లగుదైత్యపతులను గూల్చి
ధర సురక్షితముగాఁ దనరించినతఁడు
వరదుఁడై న న్నేలి పాలించుఁ గాక
క్రూరధర్మము లవి క్షోణి వర్ధిల్ల
నారసి మూర్తికి నాత్మజుఁ డగుచుఁ

దీరి జన్మించి తద్భృతి వోఁ జలుపు
నారాయణుఁడు కూర్మి ననుఁ గాచుఁ గాక
యోగవిరోధులై యుండినవారి
యోగపారగులు గా నొనరించి నట్టి
ఘనుఁడు దత్తాత్రేయకంజాయతాక్షు
డనుకంపమై నన్ను నరసి రక్షించు
జ్ఞానసముద్రుఁడై కర్మబంధముల
పూని ఛేదించెడుభూరిసామర్థ్య
మున నొప్పుఘనుఁడు సత్పూజితమూర్తి
తను నాశ్రయించినఁ దగ నేలునట్టి
కృప గలవాఁడు లోకైకబంధుండు
కపిలుండు సాంపట్లఁ గరుణించుఁ గాక
కామనిగ్రహుఁ డయి ఘనుఁ డయి మోక్ష
కాముఁడై కృతలోకకళ్యాణుఁ డగుచుఁ
'్రిలుసనత్కుమారబ్రహ్మవాది
పాలించు ననుఁ గామబాధ లడంచి
కమలాసనాదులఁ గన్మొఱంగి లయ
సమయమునఁ శ్రుతుల్ సనసన్నఁ గొన్న
మధుకైటభాదుల మర్దించి మించి
విధువు హయగ్రీవవిఖ్యాతుఁ డెపుడు
న న్నేలుఁ గావుత నారదమూర్తి
సన్నుతాచారము సమకూర్చుఁ గాక
ఆశ్రితార్తిహరుండు హరి కూర్మమూర్తి
పరిశ్రితుని న్నన్నుఁ బాలించుఁ గాక
వైద్యుఁడై యమృత మస్వప్నుల కిచ్చి
హృద్య మాపద్ధతి నొప్పుధన్వంత
రిఖ్యాతదేవుండు ప్రీతి న న్నేలు

సఖ్యంబు నాయెడ సంధిల్లఁ జేసి
విజితేంద్రియుం డగువృషభుండు నాదు
వృజినంబులం బాపి వెలయించుఁ గాక
సర్వాంతరాత్ముఁడై చనువిష్ణుమూర్తి
సర్వాధు లడఁచి నన్ సాఁకెడుఁ గాక
దుర్జనబాధలఁ దొలఁగించి పాప
వర్జితుఁ డగు బలభద్రుఁడు నన్ను
పరమదయాళుఁడై పాలించుఁ గాక
యురగాధిపతి యయి యొప్పు శేషాహి
యురగబాధలు వాపి యోమెడు నన్ను
పరమపావనుఁడైన వ్యాసుండు నాకుఁ
ధర్మోపదేశము దయ సల్పుఁ గాక
దుర్మోహకృత్యము లయి తోఁచుపాషండ
ధర్మబంధమునుండి తప్పించి నన్ను
గృపానీతుఁడై యేలు
దుష్టశిక్షార్థము తొడరి జన్మించు
శిష్టుఁ డకల్కి నన్ జేకొని ప్రోఁచు. 160

సీ. ఉదయకాలమునందు గదఁ దాల్చి కేశవ
స్వామియు సంగమసమయమందు
వేణువుఁ దాల్చి గోవిందుఁడు పూర్వాహ్ణ
మందు శక్తిఁ గొని నారాయణుండు
విష్ణువు మధ్యాహ్నవేళఁ జక్రముఁ దాల్చి
యపరాహ్ణమునఁ జక్రహస్తుఁ డగుచు
మధుసూదనుండును మఱియు సాయమ్మునఁ
దొడరి మాధవుఁడు ప్రదోషమందుఁ
తే. ప్రీతి హృషీకేశుఁడును నర్ధరాత్రిమందుఁ
బద్మనాభుఁడు కడరాత్రి పఱలునప్పుడు

శ్రీధరుండు ప్రత్యూషము చెలఁగునపుడు
శ్రీజనార్దనుఁ డేలుత తేజ మెసఁగ. 161

వ. మఱియుఁ బ్రతిసంధ్యయందు దామోదరుండును బ్రభాతమందుఁ గాలరూపుండును విశ్వనియంత యగుభగవంతుండును రక్షించుతురుగాక.

సీ. ప్రళయాగ్ని కక్షంబు బలె శాత్రవులఁ గాల్చు
చక్రరాజమ! నన్ను సాఁకు మమ్మ
పిడుగునా నుల్కల విడుచు గదాదండ
మా! సేవకుఁడ నన్ను నర్మిలిఁ గని
కూశ్మాండయక్షరక్షోఘోరభూతపి
శాచాళిఁ ద్రుంచి నన్ గాచు మమ్మ
ప్రళయాబ్దగర్జ నాఁ బ్రతిఫలించెడుశంఖ
సర్వ్యమా! నన్నేలు భయముఁ బాపి
తే. తీవ్రధారోగ్రఖడ్గమా! ద్రెంచి రిపుల
నాభయంబును బెడబాపి నాదుకష్ట
ములను దొలఁగించు దానవై మొనసి నాకుఁ
దోడునీడవు గమ్ము సంతోష మిడుచు. 163

వ. మఱియు నీవు నీప్రకాశంబునఁ బాపాత్ములఁ జూపుల నరికట్టి వారి నేత్రము లపహరింపుము ధూమకేతుగ్రహాదులయు చోరాదులయు సర్పాదులయు భయంకరభూతములయు బాధలు భగవంతుని నామరూపాయుధాదిస్మరణంబున హరించుం గాక బృహద్రథంతరాది సామంబుల స్తుతింపం బడుచు ఛందోమయుం డై నగరుత్మంతుఁడు సకలాపదలనుండి నన్ను రక్షించుఁ గాక విష్వక్సేననామంబులు శ్రీహరి నామంబులు రూపములు వాహనములు నాయుధములు పార్షదజనంబులునుగౌస్తుభాద్యలంకారములును నాబుద్ధి యింద్రియములుమనస్సు ప్రాణము లోనగువానిని రక్షించుఁ గాక చిదచిదాత్మక మగు నీజగత్తంతయు నీశ్వరాధీన మని నమ్మి ప్రార్థించునాదునాపదలు నాశనం బగుఁ గాక. భగవంతుఁడు దేవమనుష్యాదినామరూపభేద

ములు లేని వాఁ డయ్యు నాయుధాలంకారముల ధరించునట్లు రామ కృష్ణాదినామరూపము లొందుచుండె నని తలంచుచుఁ బ్రార్థించు నాప్రార్థనలు సత్యములు గాఁ జేసి సర్వకాలములందును సర్వప్రదేశములందును సర్వావస్థలందును సర్వదా నన్ను రక్షించుఁ గాక దశదిశలందును నూర్ధ్వాధోభాగములందును శరీరాంతర్బహిర్భాగములందును గాన వచ్చునరసింహమూర్తి నిజతేజంబున సూర్యాది తేజంబుల నాచ్ఛాదించి వెలుంగుచు నిజభక్తజనులభయంబు వాయం జేయుఁగాక.

క. ఇది నారాయణకవచము
విదితం బగుదీని నీకు వినిపించితి ని
య్యది నీదుకవచ మట్లై
సదమద మొనరించు నెల్లశాత్రవచయముల్. 165

క. ఈనారాయణకవచము
నే నరుఁ డేనియుఁ బఠింప నెల్లభయంబుల్
గానంగ రానివై చను
దీని జపింపుము జయమ్ము దీపింపంగన్. 166

వ. మఱియు నీవిద్యాప్రభావముం దెలుపు నితిహాసం బొండు గలదు చెప్పెద వినుము. 167

సీ. మున్ను కౌశికగోత్రమున నైనవిప్రుఁడీ
విద్య నెఱింగినవిబుధుఁ డగుచుఁ
గాలము తీఱ నొకానొకనిర్జల
స్థలమున మేను నీఁగి చనియె దివికి
నంతఁ జిత్రరథుండు కాంతాసమేతుఁడై
దేవయానంబున దివిఁ దిరుగుచు
ద్విజకళేబర మున్నదేశముపై నుండి
పోవుచోఁ గూలె నాదేవయాన
తే. మతఁడు వడి దేవపురించుచో నటకు వాల
ఖిల్యముని వచ్చి కౌశికుశల్యములను

చూపి కవచప్రభావము సోఁప జేసి
వీని నది వేయు శ్రేయము వెలయు నీకు. 168

వ. అని చెప్పినఁ జిత్రరథుం డాశల్యంబు లెల్లం గొనిపోయి సరస్వతీనదిం బడవైచి తొంటియట్లు విమానం బధిష్ఠించి యథేచ్ఛం జనియె నని చెప్పి యింద్రుండు విశ్వరూపునివలన నీవర్మంబు నొంది రాక్షససంహారంబు గావించి త్రైలోక్యసామ్రాజ్యలక్ష్మీసమేతుం డయ్యె నని శుకుండు వెండియు. 169

—♦ ఇంద్రుఁడు విశ్వరూపుని సంహరించుట ♦—

సీ. అమరపురోహితుం డగువిశ్వరూపున
కమరెడు సోమపీథ మనియును సు
రాపీథ మనియును నాపయి నన్నాద
మనియుఁ బేళ్ళగు మూడునోదల లగు
నతఁ డవనీతుఁడై యవల మాతృప్రయు
క్తస్నేహమునఁ బరోక్షముగ రాక్ష
సులకు సవనభాగముల నిచ్చుటలు గాంచి
యిచ్చలోఁ గోపము పెచ్చుపెఱుగ

తే. వజ్రి యుక్కుపట మెఱింగి వానితలలు
దఱిగె నందులో సోమపీథము కపింజ
లము సురాపీథము కలవింకమును మూఁడ
వ దగునన్నాద మది తీతు వగుచు నెగసె. 170

వ. అట్లు విశ్వరూపుం జంపి దేవేంద్రుండు దేవతాపరివృతుండై స్వర్గంబునకు నిర్గమించె నంత. 171

—♦ బ్రహ్మహత్య యింద్రుని వెన్నంటి తఱుముట ♦—

సీ. అతిఘోరరూప మత్యతిరౌద్రనేత్రము
లోకభయావహాలోకనములు
భీకరదశనముల్ వికృతశిరోజముల్
కృష్ణపింగళవర్ణ ముష్ణకోచి

చీరవల్కలములు భూరికపాలమూ
లలు గల్గి నెతురు లొలికికొనుచు
విశ్వరూపునినుండి వెలి వచ్చి నిప్పుక
గ్గవరాల సృక్వముల్ నాకి కొనుచు
తే. నాసురీరూపమున బ్రహ్మహత్య గదలి
శక్రు నరయుచు నాతఁడు స్వర్గమునకుఁ
జనుట నెఱిఁగినదై వాని ననుసరించి
కొంతలోఁ బట్టె నతఁడు లోఁ గుతిలఁ గుడువ, 172
వ. ఇట్లు బ్రహ్మహత్యానురోధితుం డగుపురుహూతుండు భీతుండై పఱచి
పోయి యొక్కజలాశయంబున బిసతంతువులం దంతువమై పెక్కేండ్లు
డాగియుండె బ్రహ్మహత్యయు నతని ననుసరించియ యుండె నంత
నిస్తేజస్కుం డగునింద్రుండు దానిం దొలఁగించుకొనునుపాయంబు
గాన కొక్కనాఁడు పితామహునిపాలికిం జని ప్రాంజలియై విన్నవించు
నంతలో వెన్నుఁ దన్ని వచ్చినబ్రహ్మహత్యం దిలకించి హిరణ్యగర్భుండు
సాంత్వనపూర్వకంబుగా మృదుమధురస్వరంబున ని ట్లనియె. 173

—♦ బ్రహ్మ బ్రహ్మహత్యం బ్రార్థించి పెడఁబాపుట ♦—

ఆ. మత్ప్రియం బొనర్పుమతి గలదానవై
విబుధనాథు నితని విడిచి పుచ్చు
మేమి కోర్కి నీకు నెసఁగెడినో చెప్పు
మేను దీర్చువాఁడ నింతలోన. 174
ఉ. నావుడు బ్రహ్మవధ్య యను నాకొకకోరికి యుండఁ బోవునే
నీ విటుసంతసించి కరుణించితి వింతియ చాలుఁ బొ మ్మనం
బోవుదు నీబిడౌజసునిపొంత వసించుట మాని కాని నా
కేవిధ మైనవాస మెట నేర్పడఁ జెప్పెదొ చెప్పు మబ్జజా. 175
వ. అనినఁ బితామహుండు దానిని నాలుగువిధంబులుగ విభజించి
భూమియందును జలమందును వృక్షములందును స్త్రీలయందు నుండు

నట్లు నియమింప నా బ్రహ్మహత్య భూమియందుఁ జవుడుగాను జలంబులందు బుద్బుదంబులు నురువులుగాను వృక్షములందు నిర్యాసముగాను స్త్రీలయందు మాసమాసము రజోగుణము గాను బ్రవేశించె నప్పుడు బ్రహ్మదేవుండు. 176

సీ. భూమిపై గర్తముల్ పొడసూపె నే నవి
తమయంతనే పూడి యమరునట్లు
జలములకు ద్రవంబుఁ జలువయుం గలిగి జ
గజ్జీవనంబులై క్రాలు నట్లు
వృక్షముల్ నఱికిన వెండియును సహస్ర
వలుశములం దాల్చి వఱలు నట్లు
స్త్రీలకు మాటికిం జెలువులతోఁ గూడ
భోగయోగ్యత గల్గి పొలుచు నట్టు
తే. లరసి వరముల నొసఁగి స్వాయంభు వెల్ల
వారి వెస నంపి పుచ్చిన పదపడి సుర
విభునిఁ గన్గొని నీ వింక విగతభయుఁడ
వగుచు నాకాధిపత్యము నందఁ జనుము. 177

వ. అని యంపిపుచ్చిన నింద్రుం డట్లు బ్రహ్మహత్యం బెడబాసి పితామహాజ్ఞాతుండై హయమేధంబుగావించి శుద్ధిం గాంచె ననంతరం బాత్వష్ట తనతనయుం జంపినయింద్రుం జంప నెంచి జంపఁ గలవానిం బుట్టించువాఁడై తపించుచు నగ్ని హోత్రమునందు హోమముగావించె.

—• త్వష్ట వృత్రాసురుని బుట్టించుట •—

సీ. ప్రళయకాలానిలప్రజ్వలదగ్ని నా
వెలుఁగుచుండెడు మేనితళుకువాఁడు
దావాగ్నిదగ్ధభూధ్రము పోల్కి సకలభీ
మాకారమునఁ జూడ నైనవాఁడు
మహితమధ్యందినమార్తాండుఁ డన మండు
చుండుగుండ్రనికన్ను లొప్పువాఁడు

అనలసంతప్తము లగురాగితీఁగల
పోఁగులో యనెడుశ్మశ్రువుల వాఁడు
తే. చేతిలోనిత్రిశూలము చివరఁ బెద్ద
పెద్దయేనికలం గ్రుచ్చి పేరెములను
ద్రిప్పుచుండెడువాఁడు పృథ్వీధరంబు
లవిసి కూలెడునట్లు పెల్లార్చువాఁడు. 179
సీ. అడుగు వెట్టిన నేల నదరంగఁ జేయుచు
నాల్కచేఁ జుక్కల నాఁకికొనుచు
వివృతాస్యబిలమున వేయుచు నాకాశ
మంతయుఁ జేదోయి నాఁగికొనుచు
దంష్ట్రాకరాళాస్యదర్శనంబున మృత్యు
దేవతకే భీతిఁ దెలుప నగుచు
నడగొండ కైవడి నడయాడుచును గాళ
రాత్రికి భీతి గూర్పంగ నగుచుఁ
తే. గహకహధ్వని సేయుచు గండుమిగిలి
మెలఁగుచును వాఁడు ముల్లోకములును భీతి
వృతము లగున ట్లొనర్చినబిరుదు గాన
వృత్రుఁ డనుపేర నొప్పె నారాత్రిచరుఁడు. 180
వ. వాఁడు ధర్మవిరోధియై లోకదుస్సహుండై వర్తించుచుండె వాని నోర్వక దేవతాశ్రేష్ఠు లందఱును బొందుపడి వచ్చి తమతమశస్త్రాస్త్రము లొక్కపెట్ట వానిపైఁ బ్రయోగించిన వాఁడు వాని నన్నింటి నొక్కవడిని మ్రింగి వైచి దిక్కులు సూచె వానిం జూచి దేవతలు మిగుల వగలం బొగలుచు సర్వభూతాంతర్యామియు సర్వేశ్వరుం డగుభగవంతు నంతరంగంబులం దిడుకొని యిట్లు ప్రార్థించిరి. 181

—• దేవతలు వృత్రుని కోఁడి విష్ణువుం బ్రార్థించుట •—

సీ. వాయ్వగ్ను లుదకము వసుధయు మేమును
బ్రహ్మాదులును నీకు భయపడుదుము

నీశాసనమునంద నిలిచి నిన్ సేవింతు
మంతకుండును నీకు ననుచరుండు
నీకన్న రక్షకుల్ మాకు నెవ్వరు లేరు
సర్వరక్షకుఁడవు స్వామి నీవ
కామాదు లన్నియుఁ గలిగినవాఁడ వై
రాగశూన్యుండవై గ్రాలుచుందు
తే. వెల్లరకును శరణ్యుఁడ వీవ కావె
బుద్ధిహీనుఁ డెవండేని యిద్ధతేజు
నిన్నుఁ గా దని పెరలను సన్నుతింప
నున్నవాని కధోగతు లెన్న వచ్చు. 182

చ. విలయసముద్రమందుఁ బడి గ్రీలఁగ నుండినభూమిపోక నీ
వెలమిని మత్స్యమూర్తి వయి శృంగమునం గొని వచ్చి భూతకో
టుల కగునాపదల్ కడుపటుత్వమునం దొలఁగించి నట్టి నీ
వల సెదు మమ్ముఁ బ్రోచుటకు నౌ దని నిన్ శరణంటి మీశ్వరా. 183

తే. ప్రళయకాలమునన్ నాభిపద్మమందు
జనన మందినబ్రహ్మ ప్రచండవాయు
హతి ధ్వనించెడుఘోరాబ్ధి సరసి బెగడు
నతని నేలిననీవు మా కగుత దిక్కు. 184

క. ఈవే మాకు శరణ్యుఁడ
వీవే రక్షకుఁడ వీవె యీశుఁడ వగు దో
దేవా! మా కభయం బిడ
రావే వృత్రాసురుండు రాయిడి వెట్టున్. 185

వ. అని యిట్లు సురలు ప్రార్థించినం బ్రసన్నుండై పరమేశ్వరుండు పాంచ
జన్యసుదర్శనాదిసాధనంబులు దాల్చి భక్తులసమక్షంబున సాక్షాత్క-
రించిన వారును నందాదిసేవితుండై శ్రీవత్సకౌస్తుభాద్యలంకారాలం
కృతుండై మనోహరాకారుండై కాన వచ్చెడునాపరమాత్ముంజూచి
సాష్టాంగదండప్రణామం బాచరించి లేచి యిట్లని వినుతించిరి. 186

తే. ఈవు షాడ్గుణ్యసంపూర్ణుఁ డీవ జీవ
సంఘమునకుఁ బ్రాప్యమ వయి సతము ప్రాప
కుఁడవు నాధారుఁడవు నయి కోమరుమిగులు
చుంటి సర్వలోకములకు నొడయుఁ డీవ. 187

వ. మఱియు నీవు జగత్కారణుండ వచింత్యప్రభావసంపన్నుఁడవు మంగళ స్వరూపుఁడవు పురుషోత్తముఁడవు పరులదుఃఖములు చూచి సైఁప లేనివాఁడవు లోకైకనాథుఁడవు. పరమహంసుండవు. పరమాప్తుండవు పరంజ్యోతివి పరబ్రహ్మంబవు పరాత్పరుండవు పరమేశ్వరుండవు నీలీలావిహారాదులు మృత్కులాలాదులవ్యాపారముల వంటివి కాకుండుటచేఁ దెలియ రానివగుచున్నవి కులాలుఁడు ఘటనిర్మాణము నకు భూమ్యాద్యాధారము నపేక్షించు నీ వేయాధారము నపేక్షింపవు నీకు నీవ యాధారమై సృష్టి గావించుచుందువు నీవు కర్మనిష్ఠునివంటి వాఁడవును, జ్ఞాననిష్ఠునివంటివాఁడవును గావు కర్మనిష్ఠునివలెఁ గర్మ ఫల మనుభవింపకుందువు సృష్ట్యాదు లొనరించువాఁడ వగుటచే జ్ఞాననిష్ఠునివలె నుదాసీనుఁడవును గావు నీవు కర్మనిష్ఠులకు జ్ఞాననిష్ఠుల కంతరాత్ముఁడవై వారికంటె విలక్షణుండవై యుందువు. 188

సీ. ఆరయ నీవు జ్ఞానాదిసద్గుణములఁ
బరిపూర్ణుఁడవు జగద్వరముఁ గూర్చు
కళ్యాణగుణములు గలవాఁడ వీవు క
ర్మజ్ఞాననిష్ఠులమహితచేత
నముల నంతర్వర్తి వమితమాహాత్మ్యము
గలవాఁడ వేరోగములును లేని
వాఁడవు నేకరూపకుఁ డవు మాయచే
తం దిరోధానము నొందుచుందు

తే. రజ్జువును జూచి సర్ప మఁట భ్రాంతిఁ గొంద
రొందుచుందురు కొందఱు పొంద రట్లు

రజ్జువుగ నెంచుచుందు రీరమణ నిన్నుఁ
గురిచి వాదోపవాదముల్ పఱఁగుచుందు. 189

వ. నీవు సర్వపరిపూర్ణుఁడ వయి యుండియును నిర్వికారుండ వై యున్న వాఁడ విట్టినిన్ను రాగాదిరహితులై ప్రవర్తించుపరమభాగవతోత్తము లందఱు నీమహిమామృతసముద్రంబునందలిబిందు వొక్కటం డాస్వాదించి నిరతిశయానందసుఖ మనుభవించి యైహికాముష్మికసుఖలేశములను మఱచి నీచరణసేవ చేయుచున్నవారు నీవు త్రివిక్రముఁడవు సూర్యచంద్రాగ్నులు నీనేత్రము లట్టినీ కిదే నమస్కారము. 190

సీ. దానవుల్ దైత్యులు మానవులును నీవి
భూతుల వారిఁ జంపుటలు తగవు
కా దని యున్నచోఁ గలుగులోకోపద్ర
వము గాన మును నీవు వామనాది
రూపములం దాల్చి రూపుమాపితి దుష్టు
లగువారి నిప్పు డీయవసరమున
జగము లేర్చెడు కాలిసంహార మొనరించి
ప్రజల రక్షింపవే పంకజాక్ష.

తే. మేము నీసేవకులమును సామతత్త్వ
రులము భవదధీనులము నీరూపువార
మగుట మాపయిఁ గృపఁ జూపు టగునటంచు
వేఁడుకొన వచ్చినార మో వేదపురుష. 191

వ. అని యిట్లు దేవతలు ప్రస్తుతించిన భగవంతుండు సంతసించి వారి కిట్లనియె. 192

శా. మీస్తోత్రంబున కేను ప్రీతుఁ డయితిన్ మీపైఁ బ్రియం బయ్యె నీ
నాస్తోత్రంబున సర్వమానవులకున్ నాభక్తి సంప్రాప్త మహా
నస్తోకం బయి జ్ఞానముం గలుగు నాకానంద ముద్భాస నా
స్వస్తి స్వాస్థ్యము లేను వారలకు మేల్ సంధానముం జేయుదున్. 193

క. నన్నిట్లు మీర లిష్టప్రి
సన్ననిఁ గాఁ జేసికొనియు శత్రుజయంబుల్
సన్ననికోరిక కోరితి
రన్నన్నా ! తగని బుద్ధి యని నే నందున్. 194

తే. ఇంద్రియాధీనుఁ డగువాఁడు తెలియఁగఁ దగిన
యట్టిపురుషార్థ మేదియో యరయఁ జాలఁ
కెట్టు లెట్టులో మెలఁగు నే నట్టివారి
పట్లఁ దాటస్థ్యము వహింతు వాసి గలిగి. 195

ఉ. రోగి యపథ్యవస్తువు తెఱుంగక పెట్టుఁ డటంచు వేఁడినన్
రోగగుణం బెఱింగిన పటుం డగు వైద్యుఁ డపథ్యవస్తు వా
రోగికిఁ బెట్టనట్టు లితరుల్ బలెఁ గోరినదాని మీ కిడం
గాఁ గలనే మహోన్నతసుఖం బిడఁ గల్గుదుఁ గాని నిర్జరుల్. 196

వ. అయినను మీప్రార్థనము లోకహితార్థ మంటిరి కావునఁ జెప్పెద
నాలకింపుఁడు. 197

—♦ మహావిష్ణువు వృత్రవధోపాయం బెఱింగించుట ♦—

చ. కలఁడు దధీచినాముని జగత్త్రయవిశ్రుతదానకంకణో
జ్జ్వల జపమాలికాకలిత దక్షిణదోషుఁడు దోషతూలికా
వలిబహులజ్వలద్దవవిభావసువేషుఁడు వేషశోన్యపే
శలగుణజాలపోషితయశఃప్రవిశేషుఁ డశేషతోషుఁడై. 198

వ. సకలజగజ్జేగీయమానమహాతపోధనసంపన్నుండగునమ్మహానుభావుండు.

ఉ. నామ గభస్తినా బడల నా నలరారెడునేకపత్ని సు
శ్యామ యగస్త్యునాలుచెలియల్ సహధర్మిణి గా వరించి గో
దామహి నాహితాగ్ని యయి తాపసవృత్తిని గార్హధర్మగుం
డై మహిమాతిరేకమున నాఘటయోని యనన్మ్రలం గెడున్. 200

దోషుఁడు = హస్తముగలవాఁడు; విభావసు = అగ్ని; ప్రవిశేషుఁడు=అతిశయము గలవాఁడు; గోదా=గోదావరి; గార్హధర్మము=గృహధర్మము; ఘటయోని=అగస్త్యుఁడు;

ఆ. తత్ప్రభావగరిమఁ దద్దండకాటవీ
స్థలులఁ జొరదు దైత్యదానవాళి
జాతివైర ముడిగి జంతువు ల్వర్తించుఁ
గల దటఁ దృణకాష్ఠజలసమృద్ధి. 201

ఉ. అల్లదధీచి యెంతయు సమర్థుఁడు వాసిశరీరశల్యముల్
చెల్లును సారవంతమయి చేకొనఁ డిచ్చును బోయి వేఁడినన్
సల్లలితప్రభావనిధి సంయమిచంద్రుఁడు బ్రహ్మవిద్యయం
దెల్లవిశేషముల్ దెలిసి యింపెసలారుచునుండు దండియై. 202

తే. ఆదధీచిమహాముని యస్మదీయ
కవచవిద్య నెఱింగినఘనుఁడు దాని
త్వష్ట కొసంగె నాతఁడు తన తనయుఁ డైన
విశ్వరూపున కెంతయుఁ బ్రీతి నిచ్చె. 203

వ. ఆవిశ్వరూపుండు దేవేంద్రుఁడవును శిష్యుండ వయిననీ కొసంగె దాని
వలన నీ వధికుండ వయితి వోయి వాసవా! నీవు పోయి ప్రార్థించిన
చో దధీచి ప్రత్యాఖ్యానంబు సేయక తప్పక నీకుఁ దనయవయవం
బుల నిచ్చు నవి నీవు విశ్వకర్మ కిచ్చి శస్త్రములు గాఁ జేయించి
నారాయణకవచప్రభావభాసురంబు లగునాశల్యాస్త్రంబులతో వృత్రా
సురుని సంహరింపఁ గల వని దేవేంద్రపురోగము లగుదేవతల నంపి
పుచ్చె ననంతరంబు దేవత లందఱు నధర్వణపుత్రుండును మనన
శీలుండు నగుదధీచిపాలికిం జని దర్శనం బిచ్చుటయును. 204

— దధీచి దేవతలకు నిజశల్యాస్త్రము లిచ్చుట —

చ. తనవని కేగుదెంచుసురతల్లజులం దగుదవ్వు దవ్వులం
గని మునికుంజరుం డెదురుగాఁ జని తోడ్కొని వచ్చి వేఁడుకం
దన రెడుభద్రపీఠికలఁ దార్చి సతీయుతుఁడై విధిక్రమం
బున గృహకృత్యము ల్చెలఁగఁ బూజ లొనర్చెఁ బృథక్పృథక్కగన్.

ఏకపత్ని=పతివ్రత; గోదా=గోదావరి.

క. పూజితులై భద్రాసన
రాజితులై యమునునమరరాజులఁ గని య
వ్యాజవినయమతిఁ గుశలం
బాజటిరా జడిగి యుడుగ కానందమునన్. 206

ఉ. ఎట్టితపంబు తొల్లి చనునేభవమం దొనరించినానొ? మీ
యట్టిమహానుభావు లమరాభ్యులు దర్శన మీయఁ గల్గె నా
యట్టివివేకహీనునకహో యిఁక మత్కుల మేమి చెప్ప నే
పుట్టుకొలంబులో నిపుడు పూతుఁడ నైతి భవత్పదార్చనన్. 207

వ. అని వినయంబునం బలుకుమునిం గని మనంబున సంతసించుచు నల్ల
నల్లన వాని ననుసరించుచు. 208

ఉ. క్రూరుఁడు వృత్రుఁ డాదనుజకుంజరుఁ డొక్కఁడు పుట్టి ఘోరతన్
మారి మసంగినట్టులు సమస్తజగచ్చయ మేర్చుచుండి బృం
దారకులైనమావయికి ధైర్యము శౌర్యము వీర్య మేర్పడన్
జేరఁ గ వచ్చి నొచ్చునటు చేసెను మాశరముల్ హరించుచున్.

చ. వితరణలుబ్ధకల్పపృథివీరుహ నీమెయిఁ గొల్చుశల్యశ
స్త్రతతుల శత్రుపింజ మతిసత్వరపూనని వింధు మందునన్
యతివర! పాపమంచు నిసుమంతయుఁ గొంకక నేను వేఁడ వ
చ్చితి మిటు లుండునే భువి నిసీ యని రోయక దానమీయవే. 210

ఉ. భూతదయాసమేతు లగు భూరియశస్కుల కీయరాని దీ
భూతలమం దొకింతయును బోలఁగఁ దోఁపదు ప్రాణమన్న నో
యేతతినిం ద్రుణంబువలె నెంచెద రించుక కొంచకుం డిలన్
ఖ్యాతియె వారిదేహ మని స్వాంతములందుఁ దలంతు రెంతయున్.

తే. ప్రాతవస్త్రము విడి క్రొత్తవస్త్రములను
దాల్చునట్టులు విజ్ఞాని తనదుదేహ
మశ్వరం బని యెఱిఁగిన యతఁడు గాన
క్షణములో విడుఁ గ్రొత్త నేఁ గైకొనుమతి. 212

వ. అని యనేకవిధంబులం బలికి ప్రార్థించుటయు నమ్ముని నెమ్మనమ్మున సంతసించుచు మందహాసంబు గావించి వారి కిట్లనియె. 213

సీ. నాకాధిపతులార! ప్రాణముల్ తీపని
మెఱిఁగియు మీరిట్టు లెఱుక విడిచి
సందేహపడక యస్మద్దేహశల్యము
నిమ్మని వేఁడితి రిట్లు తగునె
యద్ది ధర్మసాధన మయినది యదిపోవ
ధర్మార్జనమునకు దారి లేదు
మీరు నీదేహ మి మ్మోయంట సాహస
మని నేను పల్కుదు నమరులార
తే. అని వినోదార్థ మింతసే పతఁడు పలికి
వెనుక వినయవినమ్రులై విన్నవించు
నవ్వియచ్చరులం జూచి యక్కటికము
గలుగుటం జేసి యి ట్లని పలికె మఱియు. 214

ఉ. ఊరక యిట్లు మీకడ హుహూహూ! యనుచుం గనుచు న్విలాసవా
గ్ధోరణి నాచరించితినిఁ గోరిక లీరిక నెత్తుచుండినన్
మీరు మహానుభావులరు మీ కొడ లిచ్చుటకంటె నొండొకం
డీరసఁ బుణ్యకార్య మొకఁడేనియు నుండుటఁ జెప్ప వచ్చునే. 215

సీ. సురలార నామేనఁ జూపట్టెడు కశేరు
కమ్ము లోనగు నెమ్ముకలను గొనుచు
శస్త్రమ్ములగువాని సంగతిఁ వృత్రుని
బ్రేల్మిడి వధియించి వెలయుచుండు
రని యోగమునఁ జేసి ప్రాణముల్ విడనెంచి
కర్మవాసన లెల్లఁ గడకుఁ ద్రోచి
బ్రహ్మను సంధానపరుఁ డయ్యె నంతలో
బ్రహ్మరంధ్రమునుండి పవన మరిగెఁ

తే. త్రిదశు లమ్మౌని శల్యముల్ దీసి విశ్వ
కర్మచే శస్త్రరూపము గలుగఁజేసి
కొనిరి కోలెమ్మి వజ్రమై ఘనత కెక్కె
నింద్రుఁ డద్దానిఁ గైకొని యెసక మెసఁగ. 216

వ. పదంపడి ముదంపడి దేవతావారంబు సర్వసంభారంబులు సంతరించు
కొని యుద్ధసన్నద్ధమయ్యె నింద్రుండు నైరావణంబు నధిష్ఠించి కుమా
రుఁ బురస్కరించుకొని బలంబులెల్లఁ బరివేష్టింప వృత్రు నెదిరింప
దాడివెడలె నయ్యవసరంబున. 217

— ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరించిన కథ —

సీ. ఆదిత్యులున్ రుద్రు లశ్వులున్ వసువులు
సిద్ధులు సాధ్యులు చేరి కొలువ
శతమన్యుఁ డాయుధ ప్రతతిఁ దంభోళి
తో నెదిరింప రా దోర్బలాఢ్యుఁ
డైన వృత్రాసురుఁ డాసురసైన్యస
మేతుఁడై నముచి ప్రహేతి హేతి
వృషపర్వ శంబర విప్రచిత్తి పులోమ
కపిల వృషధ్వజ కాలకల్వ

తే. పల్వ లేల్వల కాలనాభ ప్రభృతులు
దైత్యదానవయోధులు దవిలి వేల
కొలఁది గా నస్త్రశస్త్రాళిఁ గలిగి కొనుచు
మూఁగి నడుమ నింద్రుని డీకొనఁ బోయె నపుడు. 218

వ. ఇట్లు కోటానఁగోటులు దైత్యదానవసేనాసమూహంబులు గర్వాతి
రేకంబునఁ గేకలు నాకంబు ముట్ట నట్టహాసంబు సేయుచు ముసల
ముద్గర గదాసి తోమర భిందివాల పరశు పట్టసాది నానావిధాయు
ధంబులు ధరించి దివౌకస్సైన్యంబు నెదిరించి వివిధాస్త్రశస్త్రపాతం
బులం జేసి వాసిమెయిం బోరాడం జొచ్చి రాసమయంబున. 219

సీ. ప్రేంఖన్మహాస్త్రముల్ పుంఖానుపుంఖము
గాఁ గోట్లు మేట్లుగాఁ గదనమందు
దైత్యదానవభటుల్ ధైర్యంబు శౌర్యంబు
పెచ్చుపెఱుఁగ నేసి విచ్చలవిడి
విహరించుచుండి రవ్వేళ నిర్జరసేన
కాండపాతంబునఁ గప్పువడియు
నొక్కింతలోనన యుక్కుమిగిలె నిర్జ
రులు దుర్జయు లగుచుఁ గ్రూరశస్త్ర

తే. సంచయంబున వారలశస్త్రసమితి
సమసిపోఁ జేసి రష్టు రాక్షసులు గండు
మిగిలి వృక్షపాషాణముల్ మేఘము లనఁ
బెల్లు వర్షించి రాదేవవీరులపయి. 220

క. అవియును వితథములై పో
దివిషద్వరశస్త్రసమితి తెప్పునఁ దాఁకన్
బ్రవిదారణమున నిల లే
క వడిం బడి పాఱె నసురగణము భయమునన్. 221

వ. ఆసమయంబున ధీరాగ్రేసరుండును వీరాధివీరుండు నగువృత్రాసు
రుండు గండుమిగిలి పోరీగి పోవుతనవారిం జూచి యోహో! విప్ర
చిత్త్యాదివీరులారా! పరాక్రమైకజీవను లగుమీ రిట్లు వెన్నిచ్చి
పోవుట వీరలక్షణంబు కాదు నేఁడు గాకున్న రేపయినఁ బుట్టిన
వానికి గిట్టుట వెన్నంటియ యుండును గావున నిట్లు ప్రాణభీతిం జేసి
పాఱుట సంప్రదాయంబు గాదు మరలుఁడు రండు సంరంభింపుఁడు నే
నిదె మీ కభయం బిచ్చుచున్నవాఁడ ననినఁ బరాఙ్ముఖు లగువా
రందఱు ముందటియట్ల మొనసి ధైర్యస్థైర్యంబు లినుమడింప మడమ
త్రిప్పక నిలిచి పోరాడం జొచ్చి రప్పుడు. 222

ఉ. వృత్రుఁడు సింహనాదము సువిశ్రుతమై దివ మెల్ల మ్రోయఁ బె
ల్లార్తము నొందు దైత్యులకు నాప్తముగా నొనరించుచున్ గడుం

జిత్రము గాఁగ యుద్ధమును జేయఁ గడంగిన దేవసైన్యముల్
ఘాత్రము వీఁగి మూర్ఛపడి చచ్చినమచ్చున నుండె నయ్యెడన్. 223

ఉ. శూలము కేలఁ ద్రిప్పుచును శూరుఁడు వృత్రుఁడు గోత్రభిచ్చమూ
పాళినిఁ దోలఁ జొచ్చెను మృగావళిఁ గొల్పులి వోలె లీలమై
జాలి వహించె నెల్లసురసంఘము లయ్యని నిల్వలేమి కై
కాలికొలంది పాఱుటకుఁ గైకొన దయ్యెను సిగ్గొకింతయున్. 224

తరువోజ. అది చూచి దేవేంద్రుఁ డంతరంగమున
యందు సైరింపనియట్టిఁడై బెట్టు
గుదె త్రిప్పి వృత్రునిఁ గొట్టె బిట్టదరి
కొట్టిన గద నట్టె కొని కడకేల
మదమత్త మగుదంతిమాద్రి జృంభించి
మానవాదుం డింద్రుమదగజేంద్రంబుఁ
గదియంగ నై శిరోగ్రంబున బెట్టు
గాఁ గొట్టె నెత్తూరి కాల్వలు గట్ట. 225

తే. దాని కోపక యభ్రమాతంగ మడలు
గుడిచి ధాతుప్రపూర్ణ మహాకొండ యనఁగ
వెనుక కింద్రునిఁ గొని యేడువిండ్లదూర
మఱిగె మురలెల్ల దుఃఖితులై తలంక. 226

వ. అంత నింద్రుండును. 227

మ. అమృతంబున్ స్రవియించుహస్తములతో నైరావణాంగంబు స్ప
ర్శము గావించెను దాన బాధ తొలఁగన్ స్వాస్థ్యంబు గైకొంచు నా
గము యుద్ధాభిముఖంబుగా నడచె నక్కల్పంబున న్వచ్చునా
సుమనోనాథునిఁ జూచి వృత్రుఁ డనియెం జూఁడంగ నేమాటలన్.

శా. ఓరీ! నీ వొక జీవి వంచు మదిలో నూహింపఁగా నొప్పునే
సారాచారుని నాదుసోదరుని దోషఘ్నున్ గురుం జంపి పా
పారంభంబున కైతి నిన్నుఁ గనినం బ్రాపించుఁ శాపంబు నా
క్రూరాసి న్నినుఁ గూల నేసి పగ వోఁ గోర్కిఁ బ్రవర్తించెదన్. 229

సీ. నాసోదరుఁడు బ్రాహ్మణప్రవరుఁడు వేద
వేదాంగవేత్తయై వెలయువాఁడు
నది గాక దేశికుఁ డై నీకుఁ గూర్చి న
వాఁడు సవనదీక్ష వఱలువాఁడు
కరుణారహితుఁడవై కడ తేర్చితివి వానిఁ
బాపివి నీవంటిపాపి యొకఁడు
పుట్టఁడు గురుహత్య పొందవచ్చెను నిన్నుఁ
గాల్ప నోపం డగ్ని కాన నిపుడు

తే. ఖండములు చేసి నీమేను కాకులకును
గ్రద్దలకు వేసి భ్రాతృఋణ మద్ది మూల
ముట్టుగా వక్షింగో దీర్చినట్టిఁ డగుదు
ననుచు శూలము గైకొని యట్టె కదిసి. 230

ఉ. శూలముఁ ద్రిప్పికొంచు లయశోభితకాలయముండు నాఁగ నై
కాలము దీఱె నీ కనుచు గట్టిగ నార్చుచుఁ బెద్దపెట్టునన్
వేలుపుఱేనిశీర్షమున వ్రేఁ కగునట్టులు వేసె వేసినన్
జ్వాలలు గ్రక్కుకొంచు నది వచ్చిపడెన్ వడి నుల్కయో యనన్.

తే. దానికిఁ జలింప కింద్రుఁడు ధార లొక్క
నూఱు గలిగినదంభోళిఁ బాఱఁ జూచి
విసరి వృత్రునిశూలము విఱిచి బాహు
దండమును గండడంచె నఖండపటిమ. 232

సీ. బాహువు తెగిపడ్డ నోహటిల్లక వృత్రుఁ
డాత్రమునం బరిఘాయుధంబు
పట్టి నెట్టన వజ్రిపాణి యైరావతమును
రహిఁ ఘీంకరించునై రావణమును
మర్దించె నందున మరుదధీశునిచేతి
శతకోటి నేలపై జారి పడియె

హస్తి గీపెట్టుచు నట్టిట్టు నడయాడెఁ
దల్లడిల్లిరి వేల్పులెల్ల నపుడు

తే. సిగ్గుపడి దానిఁ గింద్రుఁడు డిగ్గి గజము
నవనిఁ బడియున్న వజ్రము నంది కొనఁగఁ
బరిహసించెను వృత్రుఁడు బవర మేల
నీకుఁ బో పొమ్మటంచును వాకు లిడుచు. 233

ఉ. నవ్వుచు వజ్రి నాకరమునం గలవజ్రము జారి పోకకున్
నవ్వుచు నున్నవాఁడ వొకొ నాకరవాలము నీదుహస్తమున్
ద్రెవ్వఁగ నేసి నేలఁబడి ద్రెళ్ళఁగఁ జేసినదాని కింతయే
నవ్వవ దేమి క్రొవ్వినజనంబుల కొప్పెదు నివ్విధం బిలన్ 234

తే. వృత్రుఁ డొండొక్కఁ డాడక వెస గ్రహించి
వామహస్తమునన్ లోహపరిఘ మొందు
త్రిప్పి యింద్రునిపై వైచెఁ దెగువ దాని
నడుమఁ ద్రుంచియుఁ గడమకేల్ వడిగ నఱికె 235

ఉ. నెత్తురు వఱ్ఱునన్ మునిఁగి నీల్గుచు నాకస మట్టపెట్టఁగన్
రత్తఱిఁ దెర్చి హుమ్మనుచు సాశనినాగము గాఁగ నింద్రునిన్
మొత్తము ముద్దగా నసురపుంగవు డంగిలిఁ జేర మ్రింగె లో
కోత్తరకార్య మిద్ది యని న మెచ్చిరి నొచ్చి రందఱున్.

వ. అంతఁ గొంతలోన. 237

మత్త. వృత్రుగర్భము నందుఁ జొచ్చినవీరవర్యుఁ డొకింతయే
నాత్రముం గొనఁ బోక వజ్రమహాయుధంబున దైత్యరా
డ్గాత్రముం వ్రీలించి తానును గంధసింధురమున్ వడిన్
జిత్రనైఖరిఁ దత్పదంబునఁ జేరె నివ్వలి కువ్వనన్. 238

ఆ. ఇట్లు వెలికి వచ్చి యెల్లప్రజాపతుల్
సురలు మే లనంగ శూరుఁ డతఁడు
వానిశిరము నఱికె వజ్రమునన్ బలా
త్కారమునను బాహుసారమునను. 239

క. వాఁడి యగునూఱుకోటుల
పోడిమి గలదయ్యు స్వరువు మొక్కలుఁ డగునా
ప్రోడగళము గోయుటకొక
యే డయ్యెను దానిగట్టి యే మన వచ్చున్. 240

వ. అట్లు కూలి మృతుం డైనవృత్రాసురుని మేనినుండి జ్యోతీరూపంబునం గ్రాలుచు నొక్కవెలుఁ గెల్లరుం జూచుచుండ సూర్యమండలంబు బొదలి వైకుంఠునిం బొందె నిట్లు వృత్రాసురుని సంహరించిన దేవేంద్రుని దేవతలు మునులు వినుతులు గావించిరి దేవదుందుభులు మ్రోసెం బుష్పవర్షములు గురిసె ముల్లోకములవారు నిరతిశయానందముం బొంది రిట్లున్న నింద్రునకు సుఖంబు లేకపోయె నని చెప్పిన బరీక్షిన్నరేంద్రుం డట్లగుటకుం గారణంబు చెప్పు మనిన శుకయోగీంద్రుం డి ట్లనియె. 241

మత్త. విశ్వరూపుని సంహరించినవేళవచ్చినపాప మా
విశ్వయోనికృపాకటాక్షము పేర్మి నెట్టులో వాపనై
విశ్వ మెన్నఁగ నుంటి నిప్పుడు వృత్రహత్యను బాప నే
యీశ్వరుం డగు నాకుఁ నిత్తఱి నెట్లు చేయుదు నయ్యయో. 242

వ. అని యింద్రుండు వగచుచున్నసమయంబున. 243

—♦ బ్రహ్మహత్య యింద్రునిఁ జుట్టుముట్టుట ♦—

మ. అనివార్యం బయి బ్రహ్మహత్య సురలోకాధీశునిం జుట్టుకో
జనుదెంచెన్ మును పట్టిదాసవలనన్ సొల్వడ్డవాఁ డౌట నా
సుమనోనాథుఁడు తత్తఱించి మిగులన్ శోకంబు పాకంబుగా
మనమం దేమియుఁ దోఁపనట్టిఁ డగుచున్ మా నేదె నాఁ డాదిగన్.

సీ. ముదుసలితనముచే వదవదలాడెడు
సర్వాంగకంబులు సంచలింప
క్షయరోగమునఁ జేసి సగ మైనమేనితోఁ
దగ్గ కుండెడుకుళ్ళు దగ్గుఁ గోష

నెఱసినవెండ్రుకల్ నెఱి దప్పి కను దోయిఁ
గప్పి వేసెడునట్లు గంతు లిడఁగఁ
జొల్లు గారఁగ నోట వెల్లువవలె నూర్పు
గాలి దుర్వాసన లోలిఁ బర్వఁ
తే. గుల్లకం పెల్లదారులఁ గొట్టుచుండఁ
బడుచు లేచుచు వెలివాఁడ పడఁతి వోలె
కహకహధ్వని సేయుచుఁ గదియ వచ్చె
వృత్రహత్య యొనర్చినవృషుని నపుడు. 245

క. వెలివ్వాడ నెలదిఁ వోలెన్
బలుకులు నడకలును వేషభావలు గలుగన్
నిలునిలు మెక్కడి కేగెదు
కలియఁగ నే వచ్చుచుంటిఁ గను మిదె నన్నున్. 246

వ. ఇట్లు మార్గనిరోధంబు చేయుచు నతం డేదిక్కునకు నేగఁ దాను నాదిక్కునఁ బ్రత్యక్షం బగుచు వెన్నుదన్ని యున్నబ్రహ్మహత్యం జూచి భీతిల్లి దేవేంద్రుం డెం దుండుటకును స్థిమితత్వము చిక్కమిం జేసి యుత్తరదిక్కున కరిగి మానససరోవరంబున సూక్ష్మరూపుండై యొక్కసరోజనాళరంధ్రం బాశ్రయించి బ్రహ్మహత్యకుం గానరాక వేయివత్సరంబు లాతూఁడునం గాలంబు గడపె నక్కాలంబున నింద్రుం డగునహుషుండు. 247

మహా. ననుఁబొందన్ స్వాధిపత్యోన్నతి కయి దివము న్సర్వసంపత్సమృద్ధు
ల్తనరం బాలించుచు న్మత్సరమున శచినిన్ దా వరింపంగ నాస్త్రీ
జనతారత్నంబు నాకేశ్వరగురునుడి నాజాల్మునిన్ బ్రహ్మవాహం
బున రా రమ్మన్న వాఁ డప్పుడుమునిజనులన్మోయగానిల్పుకొంచున్.

వ. చతురంతయానంబెక్కి శచికడకుం జనుచు దారిలో నిజాపచారంబున జేసి శప్తుండై కొండచిలువయై నేలం గూలె నసంతరంబ. 249

ద్విపదము. ఇంద్రునివృత్తాంత మెల్ల శ్రీదేవి
సాంద్రదయారసస్వాంతయై విష్ణు
దేవునకుం జెప్ప దేవదేవుండు
దేవేంద్రునిం బ్రహ్మదేవునిచేతఁ
దెప్పించి పాపంబు తెలియలేదుపొంటె
నప్పుడు హయమేధయాగ మొనర్పఁ
గాఁ జేసి నద్దానఁ గలుషముం బాసి
జేజేలరాయండు చెన్నలరారె. 250

వ. ఈమహాఖ్యానంబు పర్వంబులం బఠించినవారు సంవత్సమృద్ధియు
రిపుజయంబును యశంబునుం గలిగి చిరాయువులై యుందు రనిన
శుకునిం గాంచి రా జి ట్లనియె. 251

ఉ. పాపి రజస్తమోగుణవిభావితభావుఁడు వృత్రుఁ డక్కటా
పాపపథంబులం బడెడువాఁ డని యెంచఁగ వచ్చు నట్టివాఁ
డేపగిదిన్ మహామహుల కేనియుఁ బొందఁగ రానివైష్ణవం
బై పరమోత్తమం బగుమహాపద మొందగ నయ్యెఁ జెప్పవే. 252

తే. అనిన శుకుఁ డను నీవు న న్నడిగినట్టి
దాని కొకయితిహాసంబు దనరు చుండు
నది వినిన నీదుసంశయ మంతఁ దీఱు
నాలకింపుము చెప్పెద నవహితుఁ డయి. 253

—♦ వృత్రుని పూర్వజన్మము – చిత్రకేతు చరిత్రము ♦—

వెనుకటిభవమున వృత్రుండు తెలియంగ
శూరసేనము లేలు భూరియశుఁడు
చిత్రకేతుఁ డనంగఁ జెప్ప నొప్పెడువాఁడు
వానికి వేగురు వనిత లుండ్రు
సంపన్నమేతుఁడై సౌరుమీఱుచుఁ దాను
సంతతి లేమినిఁ జింతపడుచు

నుండు నాతనికడ కొకనాఁడు నంగిరో
మునిపుంగవుఁడువచ్చి పూజితుఁ డయి

తే. క్షేమ మడిగిన నారాజు చెప్పె నిట్లు
సకలసౌభాగ్యములు నాకు సమకుఱియును
నాత్మజులు లేమిఁ జింతింతు నార్య నాకు.
నట్టిభాగ్యము గలిగింప నర్థి నగుదు. 254

మ. అని యాచింపఁగ బ్రహ్మపుత్త్రుఁ డగుచున్ హవ్యాందునయ్యంగిరో
ముని తా నప్పు డొనర్చి త్వాష్ట్రచరువున్ బొల్పొందఁ బూజించి త్వ
ష్టను దచ్ఛేషము పెద్దభార్య తినఁ బెట్టం జాలె నద్దేవి దా
నిని భక్షించెను జిత్రకేతుమన మెంతే సంతసం బందఁగన్. 255

వ. ఇట్లంగిరసుఁడు యాగశేషం బగుచరువు వానివేగురుభార్యలలో జ్యేష్ఠురా లగుకృతద్యుతి యనుదానికిం బెట్టి రాజుం దిలకించి దీనంజేసి పుత్త్రుండు పుట్టు వానివలన నీకు సుఖదుఃఖంబులు సమంబు లగు నని యథేచ్ఛం జనియె నంతఁ గృతద్యుతి గర్భవతియై నవమాసంబులు నీరుమోసి కుమారుం గనియెఁ దండ్రియుఁ జాతకర్మాదులు నిర్వర్తించి భూసురాదుల కనేకదానంబు లొసంగె లేకలేక పుట్టిన వాఁడు గావునఁ దల్లిదండ్రుల కాపుత్త్రునియం దత్యంతానురాగంబు పుట్టుటంజేసి తదేకశరణ్యులై యొం డెఱుంగ కానందసాగరమగ్నులై యుండి రక్కాలంబున. 256

ఉ. తక్కినరాజపత్నులును దాము కుమారులఁ గన్నవారు కా
కొక్కమొగి న్విచారమున నుల్లము పల్లటిలంగ నుండి రా
జక్కటికంబు పిల్లఁ గనుచామపయిం దవులంగఁ జేసె నిం
కెక్కడివల్లభత్వ మని యెక్కటిదుఃఖము నొందునట్టిరై. 257

వ. దీనికిం బ్రతిక్రియఁ జేయవలయు నని యెల్లసపత్నులు నేకగ్రీవంబుగ నిశ్చయించుకొని పాపంబునకు శంకింపక పాపనికిఁ బాలలో విషము కలిపి పెట్టిరి దానంజేసి యతండు నిర్గతజీవుం డయ్యెఁ దల్లితండ్రి

వ. మహాత్ములారా! మీరు సనత్కుమారనారదాంగిరస దేవలాసిత
వ్యాస మార్కండేయ కపిల దత్తాత్రేయ పరాశర వసిష్ఠ వామదేవ
శుక భరద్వాజాదులలో నెవ్వరో యెఱుంగఁ జాలకున్నవాఁడ నేను
మూఢుఁడ నజ్ఞానాంధతమసంబునం బడియున్నవాఁడ నాకు జ్ఞాన
దీపం బొసంగి దారి చూపుం డనిన నంగిరసుం డిట్లనియె. 267

మ. భగవంతుం డగు నారదుం డితఁడు నేఁ బల్మాఱు నీచెంతకున్
మొగి విచ్చేయుదు నంగిరుండ సుతునిన్ ము న్నిచ్చితి న్నీకు నా
దగు నార్త్విజ్యము పెంపున న్మఱచి తీ వజ్ఞానివై దుఃఖివై
తగునే నీ కిపు డాత్మశోకమున నేతద్రీతి వర్తించుటల్. 268

తే. ఉత్తముఁడ వీవు నీ దగు నుత్తలంబుఁ
నుడుప వచ్చితి మిట్లు నే నుడివియుంటిఁ
గొడుకు సుఖమును దుఃఖంబు గూర్చునట్టి
వాఁడగు నటంచు మఱచితే వసుమతీశ. 269

సీ. జ్ఞానోపదేశము గావింప నెంచియుఁ
బుత్రార్థి వగు నీ కపుడు మనమున
కెక్కఁ బోవ దటంచు నే విరమించితి
నిప్పుడు వైరాగ్య మెసఁగుచుంట
నాయుపదేశము నాటుకోఁ గల దెదఁ
గొడుకు మఱిన్ సుఖ మిడి కూర్చు దుఃఖ
మిల్లి భార్యాది సమృద్ధు లెల్లను దుఃఖ
మున కగు నని యెన్నుకొనఁగ నొప్పు

తే. సర్వమును స్వప్నతుల్య మాసమయమందు
ననుభవించెదు నట్లుండు నవల సున్న
లోకము వినశ్వరం బని లోఁ దలంచి
దేనికిని జింత సేయఁడు జ్ఞాని యెపుడు. 270

వ. ఈసంసారము దేహికిం బహువిధదుఃఖంబులం గూర్చునట్టి దని
తెలిసికొని దారపుత్రాదులందలి ప్రేమానుబంధంబుం ద్రెంచుకొని

స్వస్థచిత్తుండవై జీవాత్మునివిలక్షణునిఁగాను బరమాత్మకు శరీరభూతుని
గాను దెలిసికొని విషయసుఖంబుల విడనాడి వైరాగ్యంబ భాగ్యం
బని విశ్వసించి పరమేశ్వరారాధనంబు గావించి కృతార్థుండవు గ
మ్మని చెప్పుచుండ నారదుండు రాజుదిక్కు మొగంబై యి ట్లనియె.

ఆ. నీకు మంత్రరూప మైన కన వచ్చెదు
నుపనిషత్తుఁ జెప్ప నుంటి దాని
నేడురాత్రు లీవు నెద ధారణ పొనర్పఁ
గేశవుండు నీదు కెలనఁ బొలుచు. 272

తే. బ్రహ్మశర్వాదు లెవ్వనిపాదమూల
మాశ్రయించి మహామహత్త్వాదికంబు
పొందనై యుండిరో యట్టియిందిరేశు
నాశ్రయము నీకు లభియించు నవనినాథ. 273

వ. అని చెప్పి నారదుండు నంగిరసుండును మృతుం డైనబాలుం దెప్పించి
వీనిచేతం జెప్పించెదము చూడుం డని యెల్లరు నాశ్చర్యమగ్నాత్ము
లై చూచుచుండ నారదుండు. 274

తే. ఓయి జీవాత్మ నీ కాయు వుండె నింక
నివు నీదేహమును బొంది నీదుబంధు
వులకు నానందమును గూర్పఁ గలుగు మన్న
నట్లు గావించి జీవుఁ డి ట్లనియె నపుడు. 275

—♦ చిత్రకేతునకు మృతబాలుండు బ్రతికి యుపదేశించుట ♦—

దండకము. నే నెన్ని యో పుణ్యముల్ పాపముల్ కర్మముల్ చేసి కర్మా
నుసారంబుగా దేవతల్ మర్త్యులున్ దిర్యగాదుల్ మొదల్ గా ననే
కంబు లౌజన్మముల్ పొందియుం బొందుచున్నాఁడ నాజన్మకోట్లందు
నా కెందఱో తల్లులుం దండ్రులున్ బాంధవుల్ లోనివా గల్గి
రీచిత్రకేతుండు నీతన్వియున్ నేఁటిజన్మంబునన్ దల్లిదండ్రుల్ మఱెం
దెందఱో తల్లిదండ్రుల్ వినన్ వత్తు రే నేరికిం బుత్రుఁడన్ మిత్రుఁడన్

వేలునుం గోట్లు జన్మంబులై యుండుటకు జీవికిఁ గొందఱో యెందఱో బంధువులై కాని గోత్రస్థులై కాని మధ్యస్థులై కాని యాత్మీయులై కాని విద్వేషులై కాని కాకుండఁ బోరేను వేర్వేరి కేరీతి నేరీతిఁ జుట్టంబులై యెట్లు వర్తింపఁగా నేతు నాణెంబు లొండొకచే నుండి యొండొకనిం జేరుచున్నట్లు జీవులుం బెక్కు లాయోనులం జేరుచుఁ మాఱుచుఁ దాఁగు చుండుఁ విచారింప మర్త్యత్వమందుండు జీవుండు పశ్వాదులకుఁ శాశ్వతప్రీతి వాటింప కుండుఁ గ్రియాద్యంతసంబంధమే కాని వేఱొండు సంబంధ ముండంగఁ బోదట్లు గాకెన్న నీమర్త్యసంబంధ మత్యంతమై నిత్యమై యుండు జీవుండు దేహాభిమానంబు లేనట్టిఁ డయ్యుఁ నిజంబైనకర్మంబునఁ జేసి దేవాది దేహంబులం దుండి పిత్రాదులం గాంచి నావారు వీ రంచు భావించి భాషించు చున్నాఁడు తద్దేహముఁ వీడి నంతం దదీయాప్తులందుఁ మమత్వంబు గావింపఁ డీజీవుఁ డాద్యంతముఁ లేనివాఁడై జలాగ్న్యాదులఁ నాశనం బందఁ బోఁ డొక్కఁడై యుండి. బుద్ధీంద్రియప్రాణచిత్తంబులం గూడి నిత్యుండునై వెల్గు జీవాత్మ నాదేవదేవుండు తేజస్స్వరూపుండు సత్యుండు నిత్యుండు సత్త్వాదిసంపత్తిచే దేవమర్త్యాది రూపంబులం బొందఁగాఁ జేయుచుఁ విశ్వకర్తృత్వముం గాంచి వెల్గొందుచుండుఁ బరుం డిష్టుఁ డఁభావ మామూర్తికిఁ లేదు సర్వాంతరాత్ముండు సర్వేశ్వరుండుం జిదానందరూపుండు గర్మానుసారంబుగాఁ జీవులఁ బుణ్యముఁ బాపముం బొందుచందంబునం జేసి తా సాక్షిభూతుండునై యుండు సృష్టిస్వరూపంబు నైషమ్యముం గొంది యున్నఁ బరంధామునందుఁ సమత్వంబు పోఁ బోదు సర్వజ్ఞుఁ డౌవాని కేపుణ్యముం బాపముఁ ముట్టగా రావు దాసీనుఁడై యుండు నాజీవుఁడుఁ గర్మసాన్యుండు గాబట్టి పుణ్యంబు పాపంబునుం జేయ దేహంబె యాఁ గాని తాఁ గర్తఁ గా డిట్లు జీవుండు తా నీశ్వరుం బోలి యున్నఁ గ్రియారూప ఫలనాఫలం బొందఁగా

నుండు సర్వేశ్వరుం డట్లుగా నెల్లజీవస్వరూపంబులఁ స్వస్వరూపం
బునం జూచుచుఁ స్వప్రకాశంబున నెల్లు నాతండు విజ్ఞానరూపుండు
దేహాత్మవిభ్రాంతి లేనట్టిఁడై యుండు నే నాపరంధాముని బొందఁగా
బోయెదఁ బోయెదఁ. 276

సీ. అని యిట్లు జీవుండు వినిపించి విడి పోయెఁ
జిత్రకేతుఁ డెద నచ్చెరువుపడుచు
బుత్రానుబంధంబు పుటుకునఁ దెగఁదెంచి
బాలదేహమునకుఁ బారతంత్ర్య
ములు క్రియ లొనరించె మునులను సేవించి
విషము పెట్టినతేనివెలఁదు లెల్ల
వెలయుప్రాయశ్చిత్తములఁ జేసికొని రంతఁ
మోహముఁ విడనాడి పుడమితేఁడు

తే. యమునకుం బోయి కడునియమము సెలంగ
స్నానసంధ్యాద్యనుష్ఠానసమితి దీర్చి
నారదునిఁ జేరి యభివందనం బొనర్చ
నాతఁ డాతనిశిష్యత్వ మధిగమించి. 277

క. ఘనమంత్రోపనిషద్వి
ద్యను నుపదేశం బొనర్చె ధరణీశునిపై
ననురాగాతిశయంబున
వినిపించెద దాని వినుఁడు వీడనిభక్తిన్. 278

—♦ నారదుఁడు మంత్రోపనిషద్విద్య నెఱింగించుట ♦—

వ. దేవదేవా! వాసుదేవవ్యూహము ప్రద్యుమ్నవ్యూహము ననిరుద్ధ
వ్యూహము సంకర్షణవ్యూహము ననునాల్గువ్యూహముల వర్తించు
నీ కిదె నమస్కారము. నీవు విజ్ఞానరూపుఁడవై రాగద్వేషాదిరహి
తుఁడవై యొప్పుచు స్వాత్మానంద మనుభవించుచున్నవాఁడవు
షడూర్ములు లేనివాఁడవు. నీ వింద్రియంబులకు నింద్రియాధిష్ఠాన

దేవతలకు నియామకుండ వనంతశక్తులుగలవాఁడవు నీ కిదె జోహారు పరమేశ్వరా ! వేదములు నిన్నెఱుంగం గోరి ప్రయత్నించియు సమర్థములు కాకపోయిన విట్టి నిన్నెవ్వరు తెలియంగలరు. నీవు జ్ఞానైకాకారుండవు నిస్సముండవు నిరధికుండ విట్టినీవు మ మ్మెల్లపుడు రక్షించుచుందువు గాక చిదచిద్రూపక మగునీజగమంతయు నీవలన నుదయించినది నీయందు వర్తించుచున్నది నీయందే లీన మగుచున్నది యిట్లు సృష్టిస్థితిలయము లొనర్చునీకు సాష్టాంగవందన మిందిరేశా ! నీవు సర్వత్ర వ్యాపించియు నాకాశరూపుండవై యున్నవాఁడవు నిన్ను మనోబుద్ధీంద్రియము లెఱుంగఁ జాల వట్టినీ కివే యేటికోళ్ళు సత్యస్వరూపా ! దహనునికి దాహశక్తి గలిగించునట్లు దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులకు నీవు జ్ఞానక్రియాశక్తులు గలిగించుటం జేసి క్రియాకలాపంబు లొనరింప సమర్థము లగుచున్నవి జీవుండు స్వతస్సిద్ధజ్ఞానశక్తి గలవాఁడు గావున జ్ఞానవికాసమును బొంది నిన్ను సాక్షాత్కరించుకొనఁ గలుగుచున్నాఁడు నీవు జ్ఞానాదిషడ్గుణముల నిండియున్నవాఁడవు మహాపురుషుఁడవు మహానుభావుండవు భక్తకరకమలోపలాలితచరణకమలములు గలవాఁడవై పరమస్థానమం దున్ననీ కిదే నమస్కారము గావించుచున్నాను. 279

ఆ. అని నుతించి దేవముని భూమినేత క
మ్మంత్రవిద్య దానితంత్రములును
దెలియ నానతిచ్చి దేవలోకంబుల
కరిగె నంగిరసుఁడు సరస నెసఁగ. 280

వ. అనంతర మాచిత్రకేతుండు. 281

— ♦ చిత్రకేతుఁడు తపించి భగవత్ప్రసాదము నొందుట ♦ —

ద్విపద. జలము లాహారించి సంయమీంద్రుండు
తెలిపినయావిద్య తేజ మాఱంగ
నేడుదినంబుల నేకగీకగను

ప్రోడతనంబునం బూని మంత్రంబు
చలనంబు లేనిసుస్వాంతంబుతోడ
తలఁగక జపియించెఁ దత్ప్రభావమున
వితరణశీలంబు విద్యాధరాధి
పతితయు బహువిత్తభాగ్యము గలిగి
కామగతిం జని కాంచె నాతండు
కోమలనీలదుకూలము గట్టి
యంగము లందు గదాద్యలంకృతులు
సింగారముగఁ దాల్చి సిద్ధేశ్వరాది
సేవ్యమానుం డయి చెలఁగఁ బాతాళ
భవ్యలోకముక్రిందఁ బరఁగుసంకర్ష
ణునిదర్శనంబున నున్న పాపుండు
ఘనుఁ డయి మైఁ బులకలు గ్రమ్మి కన్నుఁ
గవయందు నానందకణములు రాల
సవినయంబుగ వానిసరసకు నేగి
యడుగులపై వ్రాలి యంజలి సల్పి
కడుభక్తి స్తుతియించెఁ గమలాక్షు నతని. 282

— చిత్రకేతుఁడు భగవంతుని స్తుతించుట —

సీ. నీవు దుర్లభుఁడవు నిర్జరావళికైన
　　సులభుఁడవే సాధువులకుఁ దెలియ
నిష్కాములై నిన్ను నెఱిఁ గొల్చువారికి
　　సర్వ మొసంగుదు సారసాక్ష!
వారియందే నీకు వాత్సల్య ముండును
　　వశముగాఁ గైకొండ్రు వారు నిన్ను
సృష్టియుఁ లయమును స్థితియును మోక్షంబు
　　నీదువిభూతులు నిఖిలవేద్య

తే. సృష్టిలయములు విధిశివుల్ చేయుచున్న
నీదునంశములే జాతవేదునకును
మిడుగురులవంటివార లోజడజనాభ
నీవ సర్వాధికారివి నిఖిలమునకు. 283

ఉ. సొన్నము కారణం బగుచు సొమ్ములరూపము దాల్చి వెండియున్
సొన్నము గాని యుండునటు సూవె జగచ్చయమూల మైననీ
వెన్నగఁ గార్యజాతమున నేర్పడి యొండుగ వెండి తొంటియం
దున్నటు లుందు నిన్ దెలియ నోపరు యోగివరేణ్యులేనియున్. 284

మ. అపరిచ్ఛిన్నుఁడ వెల్లవస్తువులలో వ్యాపించి యుం డెప్డు భూ
తపరిశ్లిష్టములై యనంతములునై తళ్కొత్తు బ్రహ్మాండముల్
సుపరిష్కారములై భవత్తనువునన్ జూపట్టునట్లాకృతిన్
గృప రక్షింతు వజాండకోటి సకలక్షేమంకరా! శంకరా. 285

మ. సకలేశుండవు నీవు సర్వమునకున్ స్వామిత్వముం బొంది డిం
దక వెల్గొందుచు నుండ నజ్ఞులు నినున్ దాదవ్వులం దోచి కొం
కక యింద్రాదులఁ గొల్తు రర్థపరులై క్ష్మాభర్తలం గొల్చి వా
రొకకైటు పోవఁ దదాశ్రితుల్ వెనుక బో నుందు ర్నిరాధారులై. 286

సీ. నీయుపాసనమె నిర్ఛిద్రమై ఫలియించుఁ
బెర లగ్ని వేఁచినబీజము లటు
ఫలియింప నేరవు పరమేశ! జ్ఞానాది
శక్తుల కాశ్రయస్థాన మైన
నిన్ను సేవించిన నిఖిలదుఃఖంబులు
నశియించిపోవు క్షణంబులోన
దుచ్ఛసుఖంబులందు స్మృతి సేయ కా
త్మారాము లగుమునుల్ చేరి విడక

తే. సతత ముపాసింతురి నిన్ను మోక్షంబుపొందె
నీ వనుసరింతు వారిని నిన్నుఁ బోలె

భక్తపరతంత్రుఁడవు కృపావార్ధి వీవు
నిన్నిదే కొల్తు సేవింతు సన్నుతింతు. 287

మ. భగవద్భక్తుఁడు నారదుండు కరుణాపాథోధియై చేర్చి మం
త్రిగతిం గూర్చినదాన నాకిపుడు నిధన్యాకృతిం జూడఁగ
ల్గె గతాఘుం డయితిన్ బవిత్రతయు భక్తిశ్రద్ధలున్ గల్గె నే
ను గృతార్థుండను ధన్యుఁడన్ సకలమాన్యుండన్ మహానాయకా. 288

ఉ. జ్ఞానసముద్రులై తనరునారదముఖ్యుల కైన నీవు వి
జ్ఞానము గల్గఁ జేయుటకుఁ జాలినమేటివి నీకు సర్వమున్
గానఁగ వచ్చు మాపలుకు గాథలు బోధములన్ బ్రభాకరా
స్థానమునన్ మిణుంగురులు విధంబున వెల్గెడు నట్టి దయ్యెడిన్. 289

వ. అని యిట్లు వినుతించువిద్యాధరవల్లభుం డగుచిత్రకేతునిం గాంచి భగవంతుం డగుసంకర్షణుం డి ట్లనియె. 290

మత్త. నీకు నారదుఁ డంగిరస్సును నెమ్మి నిచ్చినవిద్య నే
నే కృపం గలిగించినట్టిది నీకు నిచ్చుట నామతం
బే కుమార! కృతార్థుఁ డైతి విఁ కేల పల్కఁగ నీపయిన్
నాకుఁ బ్రేముడి యయ్యె నీ వికఁ నానుడింబడి నద్వ్యమా. 291

ఉ. నాకును జీవకోటికిఁ గనంగ నవంతర మింతయేనియున్
వాకొన రాదటంచు మది భావన సేయుచు నన్నుఁ దన్నుఁ గా
చూడఁ గల్గి భజియింపఁగ నుండునో వాని నేను సు
శ్లోకునిఁ జేసి ముక్తి నిడి లోఁ గొనఁ జూచెడువాఁడ నయ్యెదన్.

వ. చిత్రకేతూ! నీవు నావాక్యంబునం జేసి యాత్మానుసంధానమ్ము సేయుము దానం జేసి నీవు సిద్ధుండవై యిద్ధకీర్తిం బ్రవర్తింతు వని వాని నాశ్వాసించుచు నంతర్ధానంబు నొందె నవంతరంబ విద్యాధర పతి యగు చిత్రకేతుండు యటనుండి గగనమార్గంబున నచ్చటచ్చట సంచరించుచు నింద్రియపాటవంబునకుం దగువిధంబున భోగ్యవస్తువు లనుభవించుచు సిద్ధచారణాదులు తన్నుఁ బరివేష్టించి కొలున

సుమేరుకందరంబుల విహరించుచు విద్యాధరాంగనలచే మృదుమధుర
గానంబున హరికీర్తనంబు గావించుచు సుఖపరిసంగతిం గలకాలంబు
గడవ నీదె నప్పుడు. 293

—♦ గర్వి యగుచిత్రకేతుని గౌరి శపించుట ♦—

సీ. ఒకనాఁడు హరి తనకొసఁగిన దేవయా
నము నెక్కి తిరుగుచు నలుగడలను
సురలోకమున మునివరసభామధ్యము
నందుఁ గాత్యాయని నంటుకొనుచు
మందాక్ష మెఱుఁగనిచందంబునం గూరు
చున్నశివుం జూచి చిన్ననవ్వు
నవ్వి యెల్లరు విన నారితో నీరీతిఁ
బరిరంభణ మొనర్చుపగిది నితఁడు
తే. కూరుచుండె లోకములకు గురువు ధర్మ
మునుపదేశింప నోపినపురుషుఁ డిట్లు
నిండుకొలువునఁ గూర్చుండె నండనుండు
దండివారు సహించి రీదుండగంబు. 294

ఉ. మీసలు పెంచి గడ్డమును మక్కిలిగా నొనరించి నెత్తిపై
వాసెనకట్టునా జడలు బర్వగుమోపనఁ గట్టి బూది మైఁ
బూసి మునీంద్రుఁడో యనఁగఁ బొల్చెడునీతఁడు కామచారి యై
చేసె ననంగరా దిటులు చేసెఁ దపంబు మహోన్నతంబుగన్. 295

వ. అని యిట్లు నిర్భీకుండై పలుకుచున్నచిత్రకేతునిపలుకులు విని పార్వతి
క్రోధతామ్రాక్షియై తా నొకసిద్ధపురుషుండను దురభిమానంబునం
గొట్టుకొనువాని నుద్దేశించి సభ్యులు విన ని ట్లనియె. 296

మ. అవురా వీఁ డెవఁడో మముం గనుచు నత్యాకార మేపారఁ గా
నవుచున్ శిక్ష యొనర్చువాఁడు వలె జ్ఞానంబుం బ్రదర్శించుచున్
దేవడెన్ వీఁ డిట కేల వచ్చెనొ శివున్ శిక్షింప నే వచ్చెనో
యెవరుం బల్కరు కాదు కూడ దని వా యెత్తంగఁ బో రితఁడున్.

చ. ఇచటఁజతుర్ముఖుండు మఱియింద్రుండుచంద్రుఁడునయ్యుపేంద్రుఁడున్
సుచరితు లుత్తముల్ భృగువు సూరివరేణ్యులు నారదాదులున్
ప్రచురమహత్వముం గలిగి వర్తిలుచుండిరి వారలైన ని
ట్లుచితము కాదటంచన రయో గిరిజాహృదయేశు నాడుటల్. 298

క. ఈతనికిఁ దెలియవచ్చిన
యీతత్త్వము నారదాదిఋషివర్యులకున్
చేతములఁ దెలియన టగు
నీతఁడు ధర్మస్వరూపుఁ డేమో తెలియన్. 299

ఉ. ఇందఱు సర్వలోకపతు లీమహనీయునిఁ గాలకాలునిన్
డెందములందు భక్తి యది డెప్పరమై కుదురంగ లోకరక్షకుం
డందురు దేవదేవుఁ డని యందురు మ్రొక్కుదు రర్చ సేయుచుం
డ్రిందఱికన్న నిత్తులువ యెక్కువవాఁడ నటంచు నిక్కెడున్. 300

సీ. నిక్కముగా దండనీయుఁడు వీఁడు దు
రాత్ముఁడు పరమేశు నవమతిమెయి
నరసి కాఱులు వల్కె నందున నీతండు
రాక్షసుం డయి పోవు నీక్షణమున
ననుచు శాపము వెట్ట నాచిత్రకేతుఁడు
దేవయానము డిగ్గి దేవికడకుఁ
జనుదెంచి పదసరోజములందుఁ బడి మ్రొక్కి
యీ వొసంగినశాప మేను భక్తి

తే. నంజలి గ్రహించుచుంటి నోయమ్మ యిటులు
నిగ్రహానుగ్రహములకు నేను జేసి
యున్నకర్మమే కర్తగా కొరులు గారు
కర్మఫల మొంది నంతనే కలుగు ముక్తి. 301

ఉ. పాపఫలానుభూతి తరువాతన కల్గెడు నాకు ముక్తి నీ
శాపము ముక్తికారణము శాంకరి నీవు శపించి తంచు లోఁ

గోపముఁ బూని నిన్ను నొకకొంచెము నేనియుఁ నాడ నొల్ల నో
కోపన ! నీవు చేసినది కొంచెము నా కుపకారమే యగుఁన్. 302

తే. నేను జేసినదానికి నీవు చేసి
నట్టికర్మము పూర్వకర్మార్జితంబు
కాన నీవును మావలెఁ గర్మబద్ధ
వు నభిమానము గలిగితి వనుట లొప్పు. 303

సీ. అరయ శాపానుగ్రహము లన నేమి స్వ
ర్గసుఖంబు లెన్న నొక్కండు గాదె
సుఖదుఃఖములు రెండు చూపట్టు రెంటియం
దును రెండు నంటి యుండును దెలియఁగ
స్వర్గ మందినపయి వచ్చును దుఃఖము
నిరయాంతమునఁ గొంత నెమ్మియు నగుఁ
గర్మానుసారముగా బంధమోక్షము
లుత్తమాధమజను లొందు వగును

తే. వీఁడు ప్రియుఁ డనియుఁన్ వీఁడు సూ డనియును
వీఁడు జ్ఞాతి యనియు వీఁడు వే ఱనియును
రాగవిద్వేషములును లే వాగుణాఢ్యుఁ
డైనపరమేశ్వరున కని యందు నేను. 304

వ. జీవులకు సుఖదుఃఖరూపక మగుసంసారమును మోక్షమును జనన
మరణంబులు గలిగించుటకుఁ గర్మమే కారణ మగుచుండును గావున
నో దేవీ ! నీ వొసంగినశాప ముపసంహరింపు మని నిన్నుఁ బ్రార్థింపం
గాని నే నజ్ఞుండనై పరమేశ్వరునిఁ గూర్చి పలికిన నిందావాక్యంబులు
సైఁపు మని నిన్ను నీమహేశ్వరునిం బ్రార్థించుచుంటి నని వారి కభి
వందనంబు గావించి విమానం బెక్కి యెక్కడేనియుం జనియె నంత
నంతకాంతకుండు దేవమునులు సిద్ధులును సాధ్యులును వినుచుండఁ
బార్వతి కి ట్లనియె. 305

తే. విష్ణుభక్తులు వినయవివేకములును
విపులమహిమయు గలవారు వేనియందు
రాగమును ద్వేషమును లేనియోగపురుషు
లందులకుఁ జిత్రకేతుఁడ సాక్షి సువ్వె. 306

తరువోజ. ఆనందమూర్తి యగునాభగవంతు
నందు భక్తిం గల్గునందఱకును
నానందమ యగు దేహాభిమానంబు
నర్థాభిరతియు నాయాగుణవిష
యానుయాయిత్వ మహంకార మెపుడు
ననృతభాషణము నన్యాయపథంబు
మానసవ్యథలును మాటకు నైన
మసలంగఁ బో వనుమాట నిక్కంబు. 307

సీ. దేహేశ్వరాభిమానాహంకృతులతోడ
నున్న నేనును బ్రహ్మయును సనత్కు-
మారనారదముఖ్యమౌనీంద్రు లిందు్రిందు
వాసుదేవునిమహత్వం బొకింత
తెలియనివార మై మెలఁగుచు నుంటిమి
పరుఁ డెవ్వఁ డతనికిఁ బరఁగఁ బోడు
సకలంబునందును సమదృష్టి గలవాఁడు
చిత డు విశిష్టమూర్తి

తే. అతసివలె మేము భక్తుల మచ్యుతునకుఁ
జిత్రకేతునిచర్య కచ్చెరువు నాకు
నుంతయేనియు మదిఁ దోప దింతయు హరిఁ
గొలుచుజనులస్వతస్సిద్ధగుణము లగుట. 308

వ. అని యిట్లు శంకరుండు పలికినపలుకులు విని పార్వతియుం దక్కిన
వారు నచ్చెఱువడి చిత్రకేతుని మెచ్చుకొని రని చెప్పి శుకుం డో

రాజేంద్రా! యట్లు శప్తుం డయినచిత్రకేతుం డే త్వష్ట్రుయజ్ఞంబున దక్షిణాగ్నియందు వృత్రాసురుండై తొంటిజన్మమున విష్ణుభక్తుండు గావున నాజన్మమునందు నట్టివిజ్ఞానము గలవాఁ డయ్యె. 309

క. ఈయాఖ్యానము చదివిన
శ్రీయును సంపదయు యశము శ్రేయోవిభవం
బాయువు నాపై నీశ్వర
సాయుజ్యము గలుగుచుండు జనులకు నెపుడున్. 310

—♦ సవితృవంశప్రవచనాదికము ♦—

వ. ఆకర్ణింపు మాకశ్యపున కదితియం దుదయించినద్వాదశాదిత్యులలో నేనవవాఁ డగుసవితకుఁ బృశ్ని యనుభార్యయందు సావిత్రి లోనగు నభిమానదేవతలును సోముండు నగ్నియుఁ బశుయాగాభిమాని దేవతయుఁ బంచమహాయజ్ఞాభిమానిదేవతలును బుట్టిరి భగునకు సిద్ధి యనుదానియందు నంగుఁడు మహిముఁడు విభువు ప్రభువు ననునల్గురు సుతులును నాశీ స్సనుసుతయును బుట్టిరి ధాత యనువానికిఁ గుహువు సినీవాలి రాక యనుమతి యనునలువురు పత్ను లందులోఁ గుహూదేవియందు సాయ మనువాఁడును సినీవాలియందు దర్శుఁడును రాకయందుఁ బ్రాతలాహ్వయుఁడును ననుమతియందుఁ బూర్ణిమాసుఁడును బుట్టిరి విధాత యనువానికిఁ గ్రియ యనుసతియందు నగ్నిపురీష్యాదులు పుట్టిరి వరునకుఁ జర్షణి యనుపత్నియందుఁ దొల్లి బ్రహ్మపుత్రుం డగుభృగువును వల్మీకమునఁ బుట్టినవాల్మీకియుఁ బుత్రులై మగుడఁ బుట్టిరి మిత్రునకు రేవతి యనురమణియం దుత్సర్గుఁడు నరిష్టుఁడు పిప్పలుఁడు ననువారు పుట్టిరి మిత్రావరుణు లూర్వశిం గనుటచేఁ గామంబునం గలిగిన తేజ స్స్కుంభయం దుంచిరందున నగస్త్యుండు వసిష్ఠుండు నుదయించిరి వీరు మిత్రావరుణులకును బుత్రులైరి శక్రుఁడు శచీదేవియందు జయంత ఋషభ విదుషులనుముగ్గురం గాంచెఁ ద్రివిక్రముం డురుక్రముండు నాఁబడువామను

నకుఁ గీర్తి యనుపత్నియందుఁ బృహచ్ఛ్లోకుండు పుట్టె బృహచ్ఛ్లో
కునకు సౌభగాదులు పుట్టిరి. 311

క. ఇది యదితివంశసంగ్రహ
ము దగం దెలిపితిని నింక ముద మెదఁ బొదలన్
విదిత మగునట్లు దితివం
శదశ వర్ణింతు వినుము క్ష్మాతలనాథా. 312

—♦ దైత్యదానవసంపత్తి ♦—

వ. దితికి దైత్యదానవు లనునిరువురు కుమారు లుదయించిరి. వారు
హిరణ్యాక్షహిరణ్యకశిపు లని ప్రసిద్ధి గాంచి రందు హిరణ్యకశిపుఁడు
జంభాసురునిపుత్రిక యగులీలావతిని బెండ్లియాడి దానియందుఁ బ్రహ్లా
దానుహ్లాద సంహ్లాద హ్లాదు లనుపుత్రులను సింహిక యనుపుత్రికను
గనియె సింహిక విప్రచిత్తినిఁ బరిణయమై రాహువుం గాంచె నతఁడు
దేవతలలోఁ గలసి యమృతపానము సేయుచుండ విష్ణువు వానిశిర
మును జక్రధారచే ఛేదించె సంహ్లాదునకు మతి యనుసతియందుఁ
బంచజనుఁడు కలిగె హ్లాదునకు దమనియం దిల్వలుఁడు వాతాపి
యనునిర్వురు పుట్టిరి. 313

తే. అందు నిల్వలుఁ డధికమాయావి యగుచుఁ
దమ్మునిం జంపి మాంసము తఱిగి వండి
ముని యగస్త్యునకుం బెట్టె గని యతండు
జీర్ణముగఁ జేసికొనియె భక్షించి వెనుక. 314

వ. అనుహ్లాదుఁడు సూర్మ్య యనుదానియందు బాష్కలమహిషు లను
నిర్వురం గనియెఁ బ్రహ్లాదునకు ధృతి యనుసతియందు విరోచనుండు
పుట్టె వానికి బలిచక్రవర్తి జన్మించె బలి శమన యనుకొమ్మయందు
నూర్వురు కొడుకులం గనియె వారిలో బాణాసురుండు జ్యేష్ఠుండు
వాఁడు శివు నారాధించి శివభక్తులలో నగ్రగణ్యుం డయ్యె దితికి

మఱియు మరుత్తు లనునలువదితొమ్మండ్రు కుమారులు గలరు వారల
కింద్రుఁడు దేవత్వ మొసంగె ననిన రా జి ట్లనియె. 315

— మరుత్తులు దేవత్వ మొందినకథ —

చ. గురువర జన్మసిద్ధ మయి క్రూరతరం బగు రాక్షసత్వముం
దొరఁగి మరుత్తు లింద్రుఁ డిడ దొడ్డతనం బగు దేవతాత్వముం
దొరకొని రేటికో వినఁగఁ దోరము యయ్యెను గోర్కి గావునం
గరుణ దలిర్పఁ జెప్పు మనఁగాఁ నతఁ డి ట్లని చెప్పె నొప్పుగన్.

వ. జిష్ణునిప్రార్థనంజేసి విష్ణుండు హిరణ్యాక్షహిరణ్యకశిపుల సంహరించె. దానంజేసి దితి బుత్రశోకోద్దీపితం బగుకోపంబున మండిపడుచు నాపుత్రులం జంపించినయింద్రు నెట్టులైన మిత్తివాతం బడవేయుట పోలు న ట్లొనర్ప సమర్థుం డగుపుత్రుం బడయుదు నని నిశ్చయించు కొని తనమనోవల్లభుం డగుకశ్యపునిచెంత కరిగి పరిచర్యసేయుచు నతని మోహింపం జేసి సంభోగార్థ మంగీకరించునట్లు సలిపి వాని తోడం గూడె నతండు దానికిఁ బ్రీతుండై యి ట్లనియె. 317

ఉ. సంతసమయ్యె నో సుదతి స్వాంతము చక్కఁబడంగ నయ్యె నీ
కెంతయుఁ బ్రీతితో వరము నే నిడ నుంటి మనంబు దెల్పుమా
యెంతటిదుర్లభం బయిన నిచ్చెద నిచ్చకొలంది నావుడుం
సంతస మందుచుం బలికెఁ జల్లనిముచ్చట లెచ్చఁ జేయుచున్. 318

సీ. నీమాటలంజేసి నామన మలరారెఁ
జెప్పెద వినుము యోజీవితేశ
నాకన్నబిడ్డల నాకాధినాథుండు
చంపించె నది నేను సైఁప కుంటెఁ
బుత్రశోకాగ్నిచేఁ బీడితురాలను
నీకు నాపైఁ గృప నెగడునేని
శతమన్యునిం జంపఁ జాలినవరపుత్రు
దయసేయవే నాకు దయ దలిర్ప

తే. అనుచుఁ బలికినపలుకుల నాలకించి
కశ్యపుం డిట్లు పలికె నోగరితమిన్న
కరుణమాలినదానవై కడు నధర్మ
మాచరింపఁ దలంచితి వక్కట కట. 319

తే. స్త్రీస్వభావము కడుకూ్రర మాస్వరాజ్య
పట్టభద్రు నీ వెట్లు పాపబుద్ధిఁ
జంప నేమిటి కీరీతి తెంపుఁ జేసి.
పలుకుచుంటివి నీ కింతయలుక యేల. 320

తే. స్త్రీవశీకృతుఁడై దీనుఁడై వెడఁగయి
నే నధర్మము నొనరించుదాని కైతి
నింతపాపము చేయ నీ వెట్లు తెగువ
చేసితివి చెప్పవే యేమిచేటు వచ్చె. 321

చ. సతులముఖంబు శారదలసద్విధుబింబము నోలెఁ గాంతమై
స్తుతులకు నెక్కు వాక్కు సుధతో సమమై రుచియించునట్టి దై
కుతుకము గూర్చు బంగరువొకో యన నై మెయి తీగూరె దుర్గ
శిత మగుక తివాదరకుఁ జేరికచుట్టము నెమ్మనం బరయో. 322

ఆ. తనదుకోర్కి దీర్చుకొనుటకుఁ బతి నైనఁ
దోడబుట్టు నైనఁ దోడు నైనఁ
గన్నబిడ్డ నైనఁ గడతేర్పఁ గా నెంచు
రమణి యనఁగ బ్రహ్మరాక్షసి కద. 323

వ. నావచనంబు వ్యర్థంబుగా కుండునట్లును దేవేంద్రుండు వధార్హుండు గాకుండునట్లును గార్యంబు సంఘటించెద నని తనలోఁ దన్నుఁ దిట్టు కొనుచు దితిం గాంచి మించుబోఁడీ! నీ కింద్రునిఁ జంపఁ జాలు పుత్రుండు పుట్టు దానికై నే నొకవ్రతంబు సెప్పెద నది యొకసంవత్సరంబు సలుపఁ దగినయది నీ వట్లు చేసితివేని నీమనోరథంబు సిద్ధించుఁ గాదేని నీకుఁ బుట్టినవాఁడు వేలుపులం జేరు ననిన దితి దాని కంగీకరించి వచించిన గశ్యపుండు. 324

ఉత్సాహ. భూతహింస సేయఁ గాదు పోతరించువారి సే
నేతలేక దిరస్కరించి యీఁతఁ రాదు శావ మె
బ్రాతి సైన నిజము గానిపల్కు పల్క రాదు దు
ర్జాతితోడ నాడరాదు చాడి కూడ దెప్పుడున్. 325

ఉత్సాహ. గోళ్ళు నెఱులు పట్టి త్రుంపఁ గూడ దెప్పుడు నెమ్మికల్
వ్రేళ్ళ ముట్టరాదు సంజవేళ బండరాదు దో
సిళ్ళతోడ నీళ్ళు ద్రావఁ జెల్ల దెప్డు కేశముల్
నీళ్ళలోన ముంచియాడ నెలఁత కొప్ప దెప్పుడున్. 326

వ. మఱియు సాయంప్రాతఃకాలములయందు దిగంబరవు ముక్తకేశవుం గాకుండవలయుఁ దడిగలకాళ్ళతోఁ బండుకొనుటయు నుత్తరశీర్షంబుగాఁ బండుకొనుటయుఁ జేయక నియతవ్రతంబున నొక్కసంవత్సరంబు పుంసవనం బనువ్రతంబు నిర్వర్తింపు మట్లయిన నీ కింద్రునిం జయింపఁ గలపుత్త్రుండు పుట్టెడు నని కశ్యపుండు చెప్పిన సంతసించుచు దితి తదనుసారంబుగఁ బ్రవర్తించుచు గర్భంబు ధరించి వ్రతంబు నిర్వర్తించుచుండె నాసమయంబున నింద్రుం డదియంతయు నెఱింగి తనసవతి తల్లిం జేర వచ్చి వ్రతము చేయుచున్న నామె కుపచారంబులు గావించుచు సేవింప నారంభించె నప్పుడు. 327

చ. వనముల కేగి కాయలును బండ్లను దుంపలు దూండ్లు పత్రముల్
ననలు సమిత్తులున్ జలము నాఁడును నాఁడును తెచ్చి యిచ్చుచున్
గనుఁగవఁ దెఱ్చుమాత్రమునఁ గాఁగలకార్యము లెల్లఁ దీర్చుచున్
ఘనుఁ డమరేంద్రుఁ డమ్మకడఁ గాలము పుచ్చెను సేవ సేయుచున్

ఆ. వేఁటకాడు మృగికి వేఁచి యుండెడునట్లు
చిన్నతల్లి వ్రతము చెడఁగ ఛిద్ర
ములను రోయు చింద్రుఁ డలకాశ్యపాశ్రమ
మందు వేఁచి యుండె నట్టియెడల. 329

వ. వ్రతపరాయణ యగు నాదితి నియమంబు లెల్లఁ జెల్ల వ్రతంబు నిర్వ
ర్తించుచు నొక్కసాయంసమయంబునఁ బాదప్రక్షాళనంబు గావింపక
యశుచియై యొక్కచోఁ బండుకొని నిద్రవోయె నదియ యద నని
వేచియున్న వాస్తోష్పతి తనయోగసామర్థ్యంబున నొడ లెఱుంగక
నిదురించుదితిగర్భంబునం జొచ్చి యం దున్నగర్భమును వజ్రంబునం
జేసి యేడు వ్రక్కలు గావించి మఱియు వాని నే డేడుగా ఖండించి
“మారోదీ” యని పలికి వెడలి వచ్చె నంతలో నానలువదితొమ్మిది
ఖండంబులు కరచరణాదులం గలిగి వెలికివచ్చి “మారోదీ” యను
టం జేసి మరుత్తు లను పేరం బ్రకాశించుచు దేవ శైరపు డింద్రుండు
దితిం జేర నరిగి నమస్కరించుచు ని ట్లనియె. 330

శా. తల్లీ! నీయుదరాంతరంబునను బుత్రప్రాయుఁడం గాన నే
నొల్లం బోవక చొచ్చి నా కవల మృత్యుత్వంబు గైకోఁగ వ
ర్థిల్లం జొచ్చిననీదుగర్భమును నిర్భేదించితిం దప్పు నా
వల్లం గల్గెను సైఁప వేఁడుదును నీపాదంబులన్ వ్రాలుచున్. 331

ఆ. ప్రాణరక్షపొంటె పాటిఁ దప్పితి నిట్లు
కన్నతల్లి వీవు గాచి పుచ్చు
మమ్మ వీంద్రు నాకుఁ దమ్ములు నాతోడ
వత్తు రీ వొసంగ వలయు నాజ్ఞ. 332

వ. అనిన దితి యొండాడక తనగర్భంబు విచ్ఛిన్నంబు గాక వర్ధిల్లినందు
లకు సంతసించుచు నిజప్రాణరక్షణార్థ మట్లుచేసినయింద్రు నొండు
పలుక కాదరించి పుచ్చె నింద్రుండును మరుద్గణంబు గూడి మాతృ
వందనంబు గావించి స్వర్గంబునకు నిర్గమించె నిది మరుత్తులజన్మవృత్తాం
తం బింక నేమి చెప్పవలయుం జెప్పు మనిన రాజేంద్రుండు యోగీం
ద్రుదిక్కు మొగంబై దితి గావించినపుంసవనం బనుమహావ్రతంబు
ప్రభావంబువిన నెంచితి నన నతం డి ట్లనియె. 333

—• పుంసవన ప్రభావ కథనము •—

సీ. పురుషార్థముల నెల్లఁ బొందింపఁ జాలునీ
పుంసవ్రతంబును బూని మార్గ
శీర్ష మాసంబున శితపక్షమున శుభ
తిథి భర్త యనుమతిం దెలియ నొంది
వ్రతము ప్రారంభింప వలయును స్త్రీ మొట్ట
మొదట మరుత్తులపుట్టుగడను
విని విప్రునానతి గొని దంతధావన
మొనరించి నూత్న వసనము గట్టి

తే. ప్రాహ్ణభోజనమునకుఁ బూర్వమునయందు
లక్ష్మి నారాయణుని పూజ లక్షణముగ
నాచరించి పదంపడి నధికభక్తి
సలిపి చేమోడ్చి ప్రార్థింప వలయు నిట్లు. 334

ఉ. నీవు సమస్త భూతులకు నేతవు త్రాతవు సంవిధాతవున్
నీవు తలంచు మాత్రముననే సకలం బగు కార్యసిద్ధులున్
జేవ నొనర్పఁగాఁ గలవు చెందిరి వెల్లమనోభిలాషముల్
నీవు మహానుభావుఁడవు నీ కిదె వందన మోజగత్పతీ. 335

చ. ఒరులకు వేరికిం బడయ నోపనిభూరిసమర్థతాస్థితుల్
గరిమము నష్టసిద్ధులును గల్గి మహాగుణవంతుఁ డైనయీ
శ్వరుఁ డవుసర్వసాక్షి వయి వరి లుచుండెడు దేవదేవ యో
పురుషవరేణ్య నిన్నిదె "నమోనమ" యంచు భజింతు మెప్పుడున్.

వ. అని లక్ష్మి నుద్దేశించి. 337

శా. ఓతల్లీ ! సకలప్రపంచముల నీవొప్పారు చెన్నే నియున్
జేతోమోదముతోడ శక్తులను వాసిం గాంచి సల్లక్షణా
తీతఖ్యాతి వహించి మించెదవు నీదివ్యప్రభావంబు వి
ఖ్యాతం బెల్లజగంబులం దిదె నమస్కారంబు సర్వేశ్వరీ. 338

వ. అని నమస్కరించి మఱియును. 339

సీ. ఓనరహరి నీ కిదే నమస్కార మా
వాహన మొనరింతు వాసుదేవ!
ఆసనం బిదె కొమ్ము భాసురమూర్తి! పా
ద్యం బొసంగెద నిదే హరి ముకుంద
అర్ఘ్యం కై కొను మాచమనీయ మి
య్యదియె దేవా! స్నాన మాచరింపు
వస్త్రయుగ్మం బిదే వైకుంఠ! తాల్పుము
యజ్ఞోపవీత మియ్యదియె కొనుము

తే. చందనం బిదె కైకొను సారసాక్ష
భూషణంబులు హారముల్ పుష్పములును
ధూపదీపోపహారము లోపరేశ
తమలము ప్రదక్షిణము లివే రమణఁ గొనుము. 340

వ. అని షోడశోపచారంబులం బూజించి నమస్కరించి హవిస్సుం జేసి "ఓన్నమో భగవతే మహాపురుషాయ స్వాహా" యని ద్వాదశవారంబు లగ్నిలో హోమంబు గావించి సర్వాభీష్టంబులు గోరువారు లక్ష్మీనారాయణుల సేవించి యిట్లు ప్రార్థింపవలయును. 341

సీ ఓకమలాలయా! యోకమలాక్ష! యో
లోకబాంధవులార! మీకు సర్వ
లోకముల్ దేహము మీకుఁ గా కేదియు
నణుమాత్ర మేనియు నరయ రాదు
ప్రకృతి యీయిందిర ప్రకృతికి నీ వధీ
శుఁడవు యజ్ఞస్వరూపుఁడవు లక్ష్మి
యిష్టిస్వరూపిణి యీవ యాగఫలంబు
ననుభవించెడువాఁడ వాదిదేవ

సీ. ఈవు జీవశరీరమ వీసముద్ర
తనయ సర్వేంద్రియముల కాధార మైన
దీమెనామరూపంబుల నెల్లవేళ
నిర్వహించెడువాఁడవు నీవు దేవ. 342

వ. అని యిట్లు లక్ష్మీనారాయణుల సన్నుతించి నిర్మాల్యవిసర్జనంబు చేసి మఱియుం దొంటియట్ల పూజించి యాగావశేష మాఘ్రాణించి వెండియుం బూజింప వలయు నీపూజ భార్యాభర్త లిరువురుం గాని వేఱువేఱుగఁ గాని చేయం జెల్లుఁ బ్రారంభించి విడుట తగదుగావున నెట్లయిన సమాప్తినొందింప వలయును బ్రతిదినమ్మును బ్రాహ్మణులకును బుత్రవతు లైనముత్తైదువులకు భోజనభాజనతాంబూలదక్షిణ లొసంగి దంపతులు హవిశ్శేషము భుజింపం దగు నిట్లొక్కవత్సరంబు గడపి పిదప నగుకార్తికమాసంబున నంతిమదినంబున నుద్వాసనము చేసియు నామఱునాఁడు. 343

తే. ఉదయమున లేచి జలమాడి యుచితరీతి
తొంటివలె స్వామిఁ బూజించి తోడుతోడఁ
బదియు రెండు హోమముల్ పరఁగఁ జేసి
పిదపఁ బన్నిద్దఱం బిల్చి విప్రవరుల. 344

తే. ఇష్టమృష్టాన్నమును బెట్టి యెలమిఁ దిలలు
గుడము లాజలు జలమును గూడికొనిన
పాత్రములు దక్షిణలతోడ వారి కిచ్చి
తాను భుజియింపఁ దగు బంధుతతులతోడ. 345

వ. ఆవ్రతాంగహోమమునందలిచరుశేషము యజమానపత్ని భుజింప వలయును దీనిఁ బురుషుఁడొనర్చి యభీప్సితార్థమును స్త్రీయొనర్చి సౌభాగ్యము సంపదయుఁ బుత్రపౌత్రాభివృద్ధియుఁ జిరజీవితమును గీర్తియు గృహారామాదిష్టవస్తువులునుగలుగునుగన్యదీనిఁబొనర్చెనేని

సర్వలక్షణలక్షితుం డగుభర్తను బొందఁ గలుగును బుత్రార్థిని పుత్రులం బడయు రూపహీన యగుస్త్రీ యీవ్రతం బొనర్చి రూపవంతురా లగు రోగి పొనరించి యారోగ్యంబు నొందు శ్రవణాదీంద్రియవికలురు దీని నాచరించి యింద్రియపాటవంబు నొందెద రీయుపాఖ్యానము జదివినవారు వినినవారును సమస్తవాంఛితంబులం బొందఁ గలిగి సుఖింతు రోకురూద్వహా! నీ వడిగినపుంసవనవ్రతవిధానముం జెప్పితి నింక నేమి చెప్పవలయు నని శుకుండు రాజు నడిగె ననిన విని నైమిశారణ్యవాసు లవ్వలివృత్తాంతంబు చెప్పు మని సూతు నడుగుటయును. 346

షష్ఠస్కంధాంతము.

మాలిని. తెలుఁగుధరణియందుఁ దివ్యసంపత్సమృద్ధిఁ
వెలసినతునిచెంతన్ వీరసేవ్యంబు తంగే
డలరెడు నట సాగిఖ్యాతరాజేంద్రచంద్రుల్
పలువురు గల రందుఁ భాసిలుఁ సూర్యుఁ డిచ్చన్. 347

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందు
షష్ఠ స్కంధము.
శ్రీ శ్రీ శ్రీ

—:0:—

శ్రీరస్తు

శ్రీకృష్ణభాగవతము

సప్తమస్కంధము

—:0:—

క. శ్రీమత్తంగెడునామ
గ్రామాంతర్వ్యాసుఁ డగుచుఁ గరుణాళుండై
భూమిం బాలించెడు హరి
ప్రేమన్ మాసాగిసూర్యవిభునిం బ్రోచున్. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియెనట్లు తన్నడిగినశుక
యోగీంద్రుం గాంచి పరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 2

— పరమేశ్వరునిసర్వసమత్వము —

సీ. సంయమీశ్వర నన్ను సందేహ మొక్కఁడు
పీడించుచుండె నాపీడ నీవు
దీర్పంగ వలయును దేవదేవుఁడు సర్వ
సముఁడెల్లరును వానిసంతతి యగు
నొకచోట మిత్రత యొకచోట శత్రుత
వహియించు టేమి దేవతలఁ బ్రోచి
రాక్షసులం బట్టి రాచెడు నిది యేమి
విపరీత మిది యేమి విధమొ చెప్పుమ

తే. అనిన శుకుఁ డను నీప్రశ్న మతులితంబు
హరిచరిత్ర మూహింపఁగఁ దరము గాని
యంతసూక్ష్మార్థమును బొంది యలరుచుండుఁ
దెలిసినట్లు వచించెదఁ దెలియ వినుము. 3

వ. నరేశ్వరా! యీశ్వరునకు రాగద్వేషాదులు జన్మకర్మాదులును లే
వతండు ప్రత్యక్షప్రమాణాగోచరుండు చిదచిదాత్మకమైన ప్రకృతి
పురుషులకంటెఁ బరమైనవాఁ డయినను సత్త్వాదిగుణముల ననుస
రించి దేవాసురుల కంతరాత్మయై ప్రవర్తిల్లు దానంజేసి బాధ్యబాధక
భావములు గలుగుచున్నవి. 4

తే. అది ప్రకృతిపురుషులకంటె నతివిలక్ష
ణ మగుపరమాత్మ నొందఁగ నమరెడునది
కాదు సత్త్వరజస్తమోఖ్యాతగుణము
లరయఁ బ్రకృతివ కాని కా వాత్మవి గన. 5

సీ. స్వఃపురవాసులు సత్త్వప్రధానులు
రాక్షసాదులు రజోరూక్షమతులు
యక్షాదులు తమోవిలక్షణుల్ తెలియంగ
సత్త్వ ముద్రేకించుసమయమందు
జయము దేవతలకు సమకురుచుండును
రాక్షసు లోడుదు రాక్షణమున
కర్మమునంజేసి కలుగు నిగ్గతు లెల్ల
సత్త్వ మనుసరించి చను మురారి

తే. జయము వేల్పులకు నపజయము రాక్ష
సులకు హరి కూర్చు ననుటలు వలనుపడదు
వారికర్మమె కర్త యప్పట్ల శౌరి
కర్త యనుటకు భ్రాంతియే కారణంబు. 6

ఆ. కాష్ఠములను వహ్ని కలిగి తద్దోషము
కలిగికొనఁగ వేఱుగ నయి వెలుఁగు
నట్లు దేవమానవాదులం దుండియుఁ
బ్రభువు తద్గుణములఁ బడయఁ బోఁడు. 7

ఉ. జీవులకుం శరీరములఁ జేయఁ దలంచి రజోగుణంబునుం
బ్రోవఁ దలంచి సత్త్వమును బోకడఁ బెట్టఁ దలంచి తామసం

బాపహింలంగఁ జేయుఁ ధన కర్గము కాలము గానఁ దద్గతిన్
దేవుఁడు కర్మమార్గమునఁ ద్రిప్పుచునుండు సమస్తజీవులన్. 8

ఉ. కాలము పేరితం బగుచుఁ గర్మము సత్త్వమయంబయై కడున్
గ్రాల జయంబు వేల్పులకుఁ గల్గెడు నట్లె రజస్తమోధికం
బై లలి దుష్టపాళి కజయం బగు నింతియ కాని పక్షపా
తాలసుఁడై మెలంగుఁ బరమాత్ముఁ డటంచుఁ దలంచు టొప్పునే 9

వ. ఈయర్థంబు తేటపడ నొక్కయిదిహాసంబు గలదు తొల్లి ధర్మరాజు
రాజసూయంబు గావించునప్పుడు నారదుండు సెప్పి నది నీకుఁ జెప్పెద
నాకర్ణింపుము. 10

సీ. రాజసూయాధ్వరరాజంబునన్ ధర్మ
రాజు శాంతనవుప్రేరణమువలన
వాసుదేవుని సభాపతి గాఁగ నెంచి పూ
జించుచుండఁగ లేచి చేదివిభుఁడు
క్రుద్ధుఁడై కృష్ణునిఁ గ్రూరవాక్యంబుల
నిందింపఁ జొచ్చె నాసందునందుఁ
జక్రధారన్ గృష్ణుఁ డక్రమవర్తియా
వానిశీర్షము వడిఁ ద్రవ్వఁ జేసె

తే. నపుడు శిశుపాలుదేహమునందునుండి
తేజ మొక్కఁడు వెలి వచ్చి దివ్యపురుషుఁ
డైనకృష్ణునిలోఁ జొచ్చె దానిఁ జూచి
శమనసంభవుఁ డెడఁద నాశ్చర్య మొంది. 11

వ. సభాసదుం డైననారదుం జూచి యెల్లను వినుచుండ ని ట్లనియె. 12

మత్తమయూరము.

ప్రకృతిపురుషవిలక్షణుం డయి ప్రస్తుతింపఁగ నైనయీ
సుకృతపురుషునియందుఁ జొచ్చెను జూడ నీశిశుపాలునం
దకలుషమయి వెలుంగు తేజ మహా యి దెంతయు వింతయై
సకలజగదభివర్ణ్యమై తగె సాధుసజ్జనగేయమై. 13

మ. భగవద్భక్తుల కైన దుర్లభమ యేవంరీతి సాయుజ్య మీ
జగతీనాథుఁడు జ్ఞాన మబ్బినమొదల్ సాపత్న్యముం బూని యీ
భగవంతుం డగుకృష్ణునిం దెగడుచే ప్రజ్ఞావిశేషంబుగా
నెగడం జేయుముఁ బాపి యయ్యెఁ దెలియన్ నీచుండు వీఁ డక్కటా.

శా. వేనుం డీశ్వరధిక్కృతుల్ సలుపుటన్ ద్వేషించి భూదేవతల్
వానిన్ నారకకూపమందు బడఁగా వ్రాక్రుచ్చి ర ట్టీఖలుం
డానంత్యంబులు నారకాధులకుఁ గానై యున్నవాఁ డజ్జరే
తా నీరీతిని బొందఁగాఁ గలిగె నీదాశార్హసాయుజ్యమున్. 15

తే. వీఁడునుం దంతవక్త్రుఁ డీపృథివిఁ గుష్ఠ
రోగమునఁ గుళ్లి తెగటారి రోఁత కైన
నరకకూపములం ద్రెళ్లి నవయ నైన
వార లిటు కృష్ణుఁ జెంది రేకారణంబొ. 16

వ. అనిన నారదుండు సభాసదు లెల్లరు వినుచుండ ధర్మరాజుదిక్కు-
మొగంబై యి ట్లనియె. 17

సీ. నిందాస్తుతు ల వెన్న నెమ్మనికే గాని
యాత్మకు లే వన నగును జువ్వె
మఱియు దేహాత్మాభిమానముచే జీవుఁ
డది యెల్లఁ దనయందు నదుకునట్లు
మోపుకొనుచునుండు నాపైని బరహింస
లకు దిగు నజ్ఞానలక్షణముగ
సర్వేశ్వరున కిట్టిసంబంధములు లేవు
కర్మాభిమానము కలుగ దెపుడు

తే. కానిపించుచు నుండ నీకరణి యదువి
భునకు దేహాభిమానము వొసఁగ దనుట
యెట్టి దాతఁడు తిట్టెఁ ద న్నితఁడు గొట్టె
నందువేఁ జెప్పెదను విను మిందుకులజ. 18

ఉ. లోకవిడంబనార్థ మిలలోఁ బ్రభవించెను గృష్ణదేవుఁ డీ
వీఁకను దండనార్హు లయి ప్రేలెడువా రిట దండ్యు లంచు నీ
లోకు లెఱుంగుపొంటె నని లోఁ దలపోయఁగ రాక్షసత్వమున్
బోకడ బెట్టి భక్తునకు మోక్ష మొసంగుట కి ట్లొనర్చుటల్. 19

వ. సంసారులకుం బోలె భగవంతుఁ డగుశ్రీకృష్ణుఁడు నిందాస్తుతులు లేనివాఁడు కావునఁ దన్ను నిందించినశిశుపాలునకు మోక్షంబు ప్రసాదించె. 20

ఉ. తిట్టిన మోక్ష మిచ్చు నని దీన నెఱుంగఁగ వచ్చు నందు వే
నట్టులు కాదు వైరము నిరంతరమై ప్రబలంగ నెప్పుడున్
బట్టి శపించినట్టిఁడును భక్తునియట్టిఁడ యట్టివానికిన్
నెట్టన మోక్ష మిచ్చుఁ గరుణించి యటంచు నెంచ నా. 21

వ. భక్తిచేత ముక్తిని సంపాదించుటకంటె నిట్లు తన్మయత్వము నొందినప్పుడు వైరమే శీఘ్రముక్తి నిచ్చు నని తెలియం దగు ముక్తికి రెండును మార్గము లగుచున్న వందుఁ దన్మయత్వ మొందించు వైరమే ముఖ్యమని నాయభిప్రాయం బని మఱియును. 22

ఉ. తుమ్మెద కీట మొండు తనతొఱ్ఱకుఁ దెచ్చి భయంబు గొల్పుచున్
జుమ్మని శబ్ద మెప్పుడును శ్రోత్రయుగంబునఁ బర్వఁ జేయఁ గీ
టమ్ము నిజస్వరూపము సడల్చుచుఁ బెల్చన చంచరీకరూ
పమ్మును బొందు నట్లె పగవాఁడు హరిత్వము నొంద నయ్యెడిన్. 23

— వైరాదులును ముక్తిహేతువు లని చెప్పుట —

సీ. భక్తిచేతం గాని భయముచేతం గాని
స్నేహవైరంబులచేతఁ గాని
కామముచేఁ గాని మామనోహరు నెమ్మ
నమ్మునఁ బాదుకొనంగఁ జేసి
సంతతధ్యానము సలిపి కామాదిదో
షమ్ములు వాసినసాధు వగుచుఁ

బరమయోగులకును బడయ శక్యము గాని
పరమపదంబును బడయ వచ్చు

తే. అట్లు ముక్తిని బొందినయట్టి ఘనులు
పెక్కుమంది కలరు పృథివీకళత్ర
విష్ణునామస్మరణ మిట్టివిధ మటంచుఁ
దెలియుచున్నది ప్రత్యక్షఫలము గాఁగ. 24

సీ. కామమునఁ గోపికాస్త్రీలు భయమునఁ
గంసుఁడు ద్వేషంబు గలిగికొనుట
శిశుపాలుఁ డాదిగాఁ క్షితిపతుల్ పెక్కురు
బంధుత్వమున యదువంశజులును
నిండుమైత్రింజేసి పాండవుల్ మీరును
పూర్ణభక్తింజేసి మునుల మేము
భగవంతుఁ డగుకృష్ణపరమాత్మునందు నె
మ్మనము నిశ్చలముగా నునిచి కొలిచి

తే. ముక్తు లయితిమి ధర్మజా పోల్చిచూడ
వైరము వహించినను శిశుపాలముఖ్యు
లకును మోక్షము లభియించె లఘుగతులను
సందియం బంద నిట నవసరము లేదు. 25

వ. ధర్మజా! శిశుపాలదంతవక్త్రులు ముక్తు లగుట వైరానుబంధమే కాక మఱియు నొండు గల దాకర్ణింపుము వీరు మున్ను శ్రీమహావిష్ణువుద్వారపాలకులు జయవిజయులనువారువిప్రశాపంబున నిట్లుర్విం బుట్టిరి భగవద్భక్తులగుటంజేసి భగవంతు డనుగ్రహించి మీకు మూడు జన్మములలో వైరంబునంజేసి మీశాపంబు వాయంజేసి మీపదంబు మీకిచ్చెద నని విశాపంబు వలికినంతవారు హిరణ్యాక్షహిరణ్యకశిపులై పుట్టి రందు హిరణ్యాక్షుని హరి వరాహరూపంబున సంహరించె నంత వారు రావణకుంభకర్ణులై పుట్టిరి హరి వారి శ్రీరామావతారం బెత్తి

సంహరించె ననంతరకాలంబున వారే యిప్పుడు శిశుపాలదంతవక్త్రులై
పుట్టిరి వారి నిట్లు హరి శ్రీకృష్ణుండై సంహరించె ననిన ధర్మనందనుం
డావృత్తాంతంబు సవిస్తరంబుగం జెప్పు మనిన నారదుం డిట్లని చెప్పం
దొడంగె. 26

—♦ జయవిజయులశాపాదికము ♦—

చ. జయవిజయాఖ్యు లిర్వు రనిశంబు రమాధవపార్శ్వవర్తులై
భయమును భక్తియుం గలిగి ప్రస్తుతి కెక్కఁగ నందు రొక్కనాఁ
డయ మొదవంగ నప్పురుషు లప్పురుషోత్తమమందిరంబునన్
నియమితులై మెలంగిరి వినీతమతి న్నగసాలఁ గాచుచున్. 27

క. అపుడు దిగంబరరూపము
సుపరిష్కృతి మగుచునుండఁ జూడఁగ నైదేం
డ్లపడుచులో యన సనకా
దివరంతపు లచటి కేగుదెంచిరి కడిమిన్. 28

తే. లోపలికిఁ జొచ్చి చనునంతలోన నచట
ద్వారపాలకు లాఁగి రవ్వాలకుఁ జొరఁగ
నీక హరిశాసనము గాన నింతమాత్రెఁ
గనలి వారలఁ గని వారు కటకటపడి. 29

ఉ. మేము సమస్తలోకముల మెట్టుచు నిట్టియెడన్ రమాధవున్
ప్రేమ మెయిం గనుంగొనెడు వేడుక పెంపున వచ్చినార మా
హా! మదవృత్తి మీరు మము నాఁగితి రందునఁ జేసి వాసి నో
భూమి నపాత్రగర్భమునఁ బుట్టుఁడు గిట్టుఁ డటంచుఁ దిట్టుచున్. 30

మ. మదమాత్సర్యవిగర్హితాత్ము లగుమీ ర్మానాథునిం బొంది యి
ప్పుదమం దుండఁగ రాదు పీడి మదిరాపానప్రమత్తాసురీ
పదదాస్యం బొనరించునట్టి రగుచున్ వర్తింపుఁడీ యంచు నా
విదితాత్ము ల్సనకాదిసంయమివరు ల్విచ్చేసి రిచ్ఛాగతిన్. 31

తే. అంత వారు పదభ్రష్టు లగుచుఁ గుయ్యి
వెట్టి కూలెడునప్పు డావిష్ణు వెఱఁగి

మూడుజన్మముల న్వైరమునను నన్ను
మరలఁ బొందెద రని పల్కి కరుణఁ జూపె. 32

వ. శాపోపహతు లగువా రిరువురును భగవత్సన్నిధానంబునకుఁ దప్పి యప్పుడు భూతలంబున దితికిని గశ్యపప్రజాపతికినిం బుట్టి హిరణ్యకశిపు హిరణ్యాక్షు లనఁ బొలిచి కాలక్రమంబున గండుమిగిలి జగత్కంటకులై ప్రవర్తిల్లి రందు. 33

—♦ హిరణ్యాక్ష హిరణ్యకశిపుల కథ ♦—

మ. అరయన్ లోకభయంకరుం డగుహిరణ్యాక్షుండు తాఁ బ్రమాక్షుఁడై
పరిపంథిప్రకరంబులన్ రణమునన్ బల్మారు నిర్జించి తా
ధరణీచక్రముఁ జాపచుట్టి జలధిన్ డాఁగె న్మహాోపప్లవం
బరుదై క్రోడ వరాహరూపమునఁ దున్మాడె న్విభుం డాతనిన్. 34

తే. అనుజుని న్సూకరాకారుఁ డైనశౌరి
వైరమునఁ జంపె నని విని ఘోరరోష
వహ్నిదందహ్యమానహృద్వర్ష్ముఁ డగుచుఁ
గనలి ఘూర్ణిల్లుచు హిరణ్యకశిపుఁ డపుడు. 35

వ. జటాసముత్పాటనామర్షితహర్యక్షాధ్యక్షునిం బోలి పెల్లు గర్జిల్లినిటల తటఘటితకుటిలభ్రూకుటియై కటంబు లదరఁ బండ్లు పటపటం గొఱుకుచుఁ బ్రళయానలజ్వాలాజాలంబునుం బోనిశూలంబు కేలం ద్రిప్పుచు నిజసభాభవనంబున నిలువంబడి శకుని శంబర శతబాహు త్రిమస్తక త్రిలోచనాదిమంత్రివర్గంబులం గని. 36

ఉ. ఎమ్మెలు మీఱ లోకముల నెంతయుఁ బంతముతో మెలంగునా
తమ్ముని సూకరం బగుచు దైత్యవిరోధి విరోధ మాత్మలో
ముమ్మరమై కలంచుటను బొంచి మలంచి వధించె నంట నే
నెమ్మెయిఁ దాళియుండఁ గల నీపగఁ దీర్పక పేర్పఁ కిం కిటన్. 37

ఆ. దేవతాస్వభావ మావంతయును లేక
కేవలంబు పశువుగా వెలువడి

నాదుతమ్ము్ఁ బాలు నడిసంద్రమునఁ జంపె
నట్టివానిఁ ద్రుంప కెట్టు లుందు. 38

శా. పాతాళంబునఁ దూఱె నే మఱి నభోభాగంబునం బాఱె నే
స్ఫీతాంభోనిధి డాఁగె నే న్దెసల కుద్వేగంబుమై నేగె నే
భూతప్రేతపిశాచశాకినులతోఁ బోరాడఁగా మూఁగె నే
నేతన్మాత్రములోన నాహరిఁ గిరిఁ హింసించి యేతెంచెదన్. 39

క. కరవాలధారఁ దునిసిన
హరికంఠమునుండి వెడలునస్రప్రతతిన్
మరణించినసహజునకున్
బరఁగం దర్పణము చేసి వడి శాంతింతున్. 40

చ. మునులు మఖంబులు న్సురలు భూసురులుం దపము ల్జపంబులున్
ఘనకృతులున్ శ్రుతు ల్వ్రతులు గాఁ గలకార్యము లెల్లఁ జక్రి వై
తనరెడు వానియం దతఁడు తద్దయు మగ్నుఁడు గానఁ దద్వినా
శనమునఁ దద్వినాశన మసత్యము గాదు నిజంబు చెప్పితిన్. 41

ఆ. ద్విజు లానద్భుస్మార్తవిధులును శ్రౌతక
ర్మములు విష్ణువునకు నమరుదేహ
ము లవి వోవ నతఁడు పోయిన ట్లని యెంచ
నగును గాన వాని నడప వలయు. 42

చ. ద్విజులను బట్టి చంపినను దేశములం దెటనేని యజ్ఞక
ర్మజపము లెవ్వి యుండవు సురల్ సవభుక్కులు యాగభాగమున్
భజనము లేక యుండినను వారలు తిండికి లేక చత్తు రా
విజయము సంభవించు మన పీటికి నాఁటికి దైత్యకోటికిన్. 43

తే. మీరు మీమీదళంబులఁ గూరుచుకొని
క్రమ మరయఁ బోవ కాయాస్థలముల కరిగి
మించి విక్రమమున విజృంభించి ముజ్జ
గముల ధ్వంసంబు గావింపఁ గడఁగుఁ డిపుడు. 44

వ. అని నుడికారం బెసంగ నాజ్ఞ యొసంగిన వారు నపారసే
నావారపరివృతులై కదలి. 45

మ. పరమర్షి ప్రకరంబులం దఱిమి విప్రవాతముం దోలి మే
ల్పురము ల్గాలిచి గోపురంబులును గుళ్ళుం గూల్చి గోసంఘముల్
మరణం బందఁగఁ జేసి యజ్ఞకృతుల న్మర్దించి దిక్పాలురన్
సురలన్ స్రుక్కఁగఁ జేసి ముజ్జగములన్ దూలించి రత్యుద్ధతిన్. 46

వ. అంత హిరణ్యకశిపుండును దమ్మునిపోకకు శోకించుచు నాతనికిఁ బ్రేత
కార్యంబులం దీర్చి శకుని శంబర దార్ష్టి భూతసంతాపన వృ   కాల
నాభ మహానాభ హరిశ్మశ్రు మదోత్కలులను సోదరపుత్రులను
వారితల్లి యగురుషద్భానువును దనతల్లి యగుదితిని దుఃఖవిముఖులం
గావించి యూరార్చుచు ని ట్లనియె. 47

మ. అతిలోకుండు మహాబలుం డగుహిరణ్యాక్షుండు పద్మాక్షునిన్
బ్రతి లేనట్టిపరాక్రమంబున ననిన్ బాహాబలప్రౌఢి భూ
తతత్థుల్ మే లని మెచ్చ మాఱుకొని దుర్దైవంబునం ద్రెళ్ళి నై
క్షితిఁ బాసెన్ రణశూరుఁ డాతని కిటుల్ చింతింపఁగా నేటికిన్. 48

సీ. తెలియంగ సంసృతి చలిపందిరినిఁ బోలు
ప్రజలు పెక్కురు జలపానమునకు
నట వచ్చి పాంథనికటమునఁ గూర్చుండి
పనిఁ దీర్చుకొని వీడి చనియెద రటు
లీభూతజాతము లీశ్వరప్రేరిత
మయి కూడు వీడు నింతియ చూఁడి యిది
మే నస్థిరం బాత్మ తా నెప్డు స్థిర మగుఁ
జచ్చె జీవుం డంట సరిగ భ్రమయె
తే. నీటఁ బ్రతిబింబితము లగుమేటిచెట్లు
చేమలు చలించి నట్టులు చిత్తమునకుఁ

దెలియ వచ్చెడు నారీతి దే యిది యని
యెఱుఁగుటం జేసి యే దుఃఖ మిట్లు పడుట. 49

వ. ఈయర్థంబు తేటపడఁ బ్రేతబంధు యమ సంవాదరూపం బగు నితి
హాసంబు గల దాకర్ణింపుఁడు. 50

—♦ సుయజ్ఞోపాఖ్యానము ♦—

ఉత్సాహ. మున్ను శిథదేశమందు భూవిభుఁడు సుయజ్ఞనా
మోన్నతుండు రిపులతోడ యుద్ధ మాచరించి త
ద్భిన్నదేహుఁడై మృతించి పృథ్విపైఁ బడంగ నై
యున్నయప్డు వానిజ్ఞాతు లొల్లఁ బోయి నట్టిరే. 51

వ. శవంబు పడియున్నకడకు వచ్చి రప్పు డదియును. 52

చ. చిరిఁగినరత్నకంచుకము చిందరవందర లైనభూషలుఁ
బఱియలు వాఱి రక్తమునఁ బర్విసవక్షము దేహయష్టియుఁ
ధర విడఁబాఱు కేశములు దష్టరదచ్ఛద ముగ్రభంగికై
కరములు ద్రెస్సి నేలఁ బడఁగాఁ గన వచ్చె నుశీరకుం డటఁ. 53

వ. ఇట్లు కుణపంబై పడియున్నరాజుం గాంచి యెల్లదాయాదులుం జుట్టు
ముట్టి బెట్టు వాపోవ సాఁగి రప్పట్టునం దాతని పట్టంపుదేవులును. 54

చ. ఉరములు మోదికొంచుఁ గడు నున్నతకేశకలాపముల్ విడఁ
విరు లవి రాలి నేలఁ బడ వెల్లువ లట్లయి పాఱ నశ్రువుల్
ధరణియు నాకసంబులు విదారిత మయ్యెడినో యనఁ రవం
బగు దయి పర్వ నేడ్చిరి గతాయువు భూపతిమీఁద వ్రాలుచుఁ. 55

చ. దయ యనుమాట లేక నినుఁ దామరసాసనుఁ డిట్లు కూల్చి మా
యయము లి వెల్లఁ ద్రెళ్ళఁ బడునట్టులు చేసి వధించునట్టిఁ డై
ప్రియపడుచుండె నా తనదుప్రేయసి యైనమదీయుఁ డంచు నీ
పయి నెనరుంచుమంచు నిజభర్తకుఁ జెప్పక పోయె నక్కటా. 56

శా. ఓప్రాణేశ్వర ! మమ్ముఁ గా దను చిటుల్ ప్రాణంబులం బాయుటఁ
మా ప్రాణంబులు పోయినట్టివ యగుఁ మావల్లభా మాపయిఁ

నీప్రేమం బడి యేమిచేసితి వయో నీపిల్లలుం జెల్లలున్
నీప్రాపుం గొనువార లెట్లు మనఁగా నీ వెంచితో చెప్పుమా. 57

వ. అని రాజపత్నులు భర్తశవంబుపైఁ బడి పరిపరివిధంబులఁ బరితపించుచు దహనసంస్కారంబు సలుపుట కొడంబడకుండి రంతలో సాయంతన సమయం బగుదెంచె నాసమయంబునఁ గాలుండు బాలుండై వారి కడకు వచ్చి యి ట్లనియె. 58

చ. వయసునఁ బెద్దవా రగుచు వర్తనముల్ భువనంబునందు నే
నయమునఁ సాగుచున్నయవి నల్వురకన్నను భిన్నరూప మిం
దయి కనిపట్టుచున్న దనునాగము చూపుదు రే సమస్తముల్
లయమగుఁ గాని యొండొకఁ డిలం దిరముండుట మీరు విందురే. 59

శా. ఈనాఁ డీతఁడు రేపు మీరు మృతులై యేగంగ నున్నారు మీ
పై నామిత్రికిఁ గారవంబు గలదే ప్రాల్మాలి తా నుండునే
కానం జాలరు లోకవృత్తమును మీకంటెం గడుంజిన్ననై
నే నున్నన్ దలిదండ్రు లీల్గినపుడేనిం గుంద లే దిగ్గతిన్. 60

సీ. వినుఁ డెవ్వఁ డీజగంబును జేసి పెంచి ల
యింపఁ జేయుచును దా నింద యుండి
యాట లాడుచు నుండు నామహనీయుఁ డా
యావస్తువులతోడ ననుదినంబు
నాటలో వస్తువు లట్టిట్టు పడుచుండు
నిల్లె భూతము లని యెఱుఁగ వలయుఁ
గావునన్ జచ్చినఁ గారాదు ఖేదము
పుట్టినన్ మోదముఁ బొంద రాదు

తే. దైవరక్షితుఁ డగువాఁడు దా నరణ్య
గతుఁడు మందులు లేకున్నఁ బ్రతుకు దైవ
హతుఁడు గృహమున నౌషధతతులు గలిగి
చచ్చు దైవవిలాస మీసరణి నడుచు. 61

వ. కావున దేనికిని మనకర్తృత లేదు మీ రిట్లు కాలధర్మము నొందిన వీనికై మరణించుట వెఱ్ఱితనము మఱియు నిట్లు వేయేండ్లు దుఃఖించి నను బోయినవానిం దే లేరు మీరునుం బోయెద రీయర్థంబు దేటపడ నొక్కకథ గలదు చెప్పెద వినుండు. 62

—♦ కలవింకములకథ ♦—

తే. కలఁడు మ న్నొకవ్యాధుండు కారుటడవి
నాలుబిడ్డలతో నుండు నాఁకుటిల్లు
గట్టుకొని కాపురంబుగాఁ బిట్టలకును
మృగములకుఁ గాలయముఁ డయి మెలఁగు వాఁడు. 63

ఉ. వాఁ డొకనాఁడు జాలమును వైచి పతత్రులఁ బట్టుచుండఁ గా
నాఁడు తదంతికంబునఁ దినర్గ విహారించుకుళింగి యొక్కఁడా
గోడగువాగురం బడియెఁ గ్రూరకిరాతుఁడు దూరవర్తియై
చూడఁడు దాని నయ్యదియు శోకము పాకము గాఁగ నేడ్చుచున్.

తే. తనదుబిడ్డలు మగఁడును దాను బోయ
వలను జిక్కినదెఱుఁగక వచ్చునిప్పు
డిదిగో నదిగో యంచును జూతు రక్కట కట
యనుచు వారల గతి కది వనట నొందు. 65

వ. అంతలో నేఁతకుం బోయినకుళింగము వచ్చి గూటఁ దనకుళింగిం గానక మిక్కిలి యుక్కివం బగుచింతాసాగరంబున మునింగి యెట్టకేల కక్కుళింగి నుద్దేశించి. 66

సీ. ఎచట నుంటివో చెలీ ! యింతప్రొద్దొకచోట
నను బాసియుండుట నాయమటవె
యేకారణంబున నేమైతివో యెండ
యేపునఁ దెగితివో యిగురుబోఁడి
నవుటాల కీపజ్జనన యుండి న న్నిట్టు
లాడించుచుంటివో యలరుగొమ్మ

నినుఁ బాసి యేనొక్క నిమిషమాత్రంబైన
నెమ్మినఁ బ్రాణముల్ నిలుపఁ జాల

తే. నింటి కిపుడవత్తొ యిఁక నెవత్తువో యంచు
నాసపట్టి యెచట నలుకుఁ డైన
నోళ్ళు దెఱచి నీదుపిల్లలు వాపోవు
వానివనట దీర్ప నైన రావె. 67

చ. కడుకొని తేయునుం బవలుఁ గష్టము లంటఁగ నీఁక సౌఖ్యముల్
దొడరఁగఁ జేయుచుం బయలఁ దోచెడుప్రాణమ వై మెలంగు నీ
వెడసిన బోటి నాకు సుతు లేటికిఁ గాపుర మేటి కేరు మె
చ్చెడునది మే ని దేటి కిఁకఁ జీటికి మాటికి మాట లేటికిన్. 68

వ. అని వికలరవంబునం బలికినతన చెలువునిపలుకులు విని యక్కిరాతుని
చిక్కంబునం జిక్కి యున్నయాఁడుపక్కి సన్నంపుటెలుంగునఁ దాను
వలం జిక్కియుంట తనమగని కెఱింగించి విధికృతంబునకు వగవం బని
లే దుడిగి పిల్లలఁ జూచుకొనుచుండు మనిన నమ్మగపిచ్చుక చచ్చిన
దానిమచ్చున చైతన్యంబు వోయినయట్టిద యై యెట్టకేల కించుక
తెప్పిరిల్లి యప్పలుకులు వచ్చినవలను బట్టిపోయి కనుంగొని కంటికిం
గడవెడునిళ్ళుగా వలవల వలపోయుచు ని ట్లనియె. 69

మ. అకటా యొక్కనిసొత్తు గాని వనమం దావాసముం బొంది యొం
డ్లకు కీ డెన్నఁడుఁ జేయ కాకు లలము ల్భక్షించుచుం గాల మి
ట్లొకచందంబున వెళ్ళఁబుచ్చుమన కయ్యో దయ్య మోర్వంగఁ జా
లక యిప్పాటులు సంఘటించె గదె వాల్గంటీ! యిఁ కేమందునే. 70

ఉ. నెత్తురుగుడ్లు పిల్ల లవి నేరవు నోళ్ళను దెర్చి మేఁత లో
గుత్తుక వేసికొంటకును గూడ సమర్థము లంచుఁ జెప్ప లే
ని త్తఱి వానిరక్షణ మదెట్టులొ తల్లియు నిప్డు తండ్రియున్
మి త్తికి నైన వానిగతి మీఁదట నే మగు నక్కటక్కటా. 71

వ. అని యొడలెఱుంగక యేడుచుచున్నదాని దవ్వులం గని కిరాతుండు రివ్వున వచ్చి చెచ్చెఱ దాని నొక్కకోలం గూలనేసె నో సుయజ్ఞబంధువులారా! మీ రాకులింగమువలె మీఁద వచ్చుమృత్యువు నెఱుంగక చచ్చినవానికై యేడ్చుచున్నవారు మీ రిట్లు నూఱేండ్లేడ్చినను జచ్చినసుయజ్ఞుండు రాఁబోఁడు. వానికై మీ రిట్లు పడుట తగ దూఱడిల్లుఁ డని మాయాబాలుం డదృశ్యుం డయ్యె నంత సుయజ్ఞుని జ్ఞాతులును బుట్టినవా రెల్ల గిట్టుట నిశ్చయం బని నిశ్చయించి రాజునకు నుత్తరక్రియలు గావించి శాంతి నొంది రని చెప్పి హిరణ్యకశిపుండు తల్లి లోనగువారి నూఱడించి పదంపడి తాను సర్వసమర్థుం డయ్యుఁ దన కజరామరణత్వంబును నప్రతిహతశూరత్వంబును ద్రిజగ ద్రాజ్యవిభుత్వంబునుం గోరి. 72

ఉ. ఏయవి చేయలేనిపను లేయవి పొందఁగ రానికోర్కులే
యేయవి దాఁట రానిగిరు లేయవి యీఁదఁగ రానియేఱులే
యాయవి యెల్లఁ గన్దెఱచునంతటిలో నెఱవేర్ప వచ్చు నిం,
దాయజుసత్కృపారసము నందు తపం బొనరించువారికిన్. 73

—♦ హిరణ్యకశిపునితపఃప్రకారము ♦—

వ. అని నిశ్చయించి మందరమునకుం జని యందుఁ గామక్రోధలోభమోహమదమాత్సర్యంబులు విడనాడి దయా సత్య శౌచ బ్రహ్మచర్య క్షమార్జవ ధృతి మితాహారాదిమహాగుణంబులం గలిగి యమ నియ మాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులం దగిలి యతవ్రతంబున నొక్కచోఁ జతుర్దిగంచితాగ్నికుండంబుల మహాగ్నిజ్వాలలు నిగుడఁ దన్మధ్యంబునఁ గాలిపెనువ్రేల నేల నిలువంబడి యూర్ధ్వబాహుండై ప్రభాకరబింబంబుపై నంబకంబిడి ప్రళయకాలహుతాశనుని యాకారంబున నేరికిం దేఱి చూడరాక బహిరింద్రియవ్యాపారంబులం దెగడి త్రైలోక్యసంతాపకరం బగునట్టి దారుణతపం బొనరింపం దొడంగె. 74

చ. జడధులు వట్టి పో నిఖిలసస్యములుం జెడి పో దవాగ్నితోఁ
దొడుసుగఁ గాయు నెండలకు దోడ్పడుచు న్వడగాలి గొట్టుచో
మిడమిడలాడు వేసవిని మే న్గడు నావదమస్తకంబుగా
నుడుకఁ గృశానుమధ్యమున నుండి తపించె నతండు మెండుగన్. 75

ఉ. ఉండినచోట నుండి మఱి యొండొకచోటికిఁ గాలు మెట్టి పో
కుండఁగఁ ద్రాఁచులం జదల నొత్తుగ వ్రేలఁగఁ గట్టినట్లు నీ
రుకుండలఁ గ్రుమ్మరించునటు కొట్టెడువార్షికవాసరంబులన్
బండల నుండి పెన్బయట బాఢతపం బొనరించె నెంచఁగన్. 76

చ. చదలునఁ బుట్టి కోలుపులిచందమునం బఱతెంచి మంచు భూ
పదమున నెల్లెడం బ్రబలి పైఁబడఁ బాఱుడు నెట్టివారినే
వదవదలాడఁ జేయుహిమవత్సమయంబున గొంతుబంటిగా
నదులజలంబుల న్నిలిచి నాకవిరోధి తపించె మించఁగన్. 77

వ. ఇ ట్లధికనిష్ఠాగరిష్ఠుండై యనేకదివ్యవర్షంబు లనన్యసామాన్యంబుగ
నత్యుగ్రతపంబు గావించె నంత. 78

మ. ధర గంపించెఁ బయోనిధు ల్గలఁగెఁ బాతాళంబు భేదిల్లె ది
క్కరులున్ మ్రొగ్గె ననంతుఁడు న్బడియె రిక్కల్ రాలె భూమీధ్రము
ల్వ్రీరిసెన్ విష్ణుపదంబు పేలిపగిలెన్ వేవెల్గు రేవెల్గునుం
దిర మేదం గతి దప్పి రెల్లకడలం దీపించెఁ బెంజీఁకటుల్. 79

చ. కడిమిఁ జరాచరాత్మకజగత్రయ మల్లతపోనలంబునన్
బడిబడి మండఁ బాఱుడు సుపర్వముఖ్యులు సత్యలోకమున్
వడిఁ జని యందు దేవమునివర్గము గొల్వఁగ భూతసర్గమున్
నడపెడునబ్జజుం గని వినమ్రత దోఁపఁగ మ్రొక్కి చక్కటిన్. 80

చ. తెలియ ననుగ్రహింపు మిటు దీనుల మొఱ్ఱలు దేవదేవ! పెం
ఫులగనియై హిరణ్యకశిపుం డను దైత్యవరేణ్యుఁ డుర్వి ని
శ్చలమతియై మహాతపము సల్పుచు నుండెను దాని వేఁడికిన్
ప్రాణములమాఁడి పోతి మిఁక మాఁగతి యేమి? వచించి ప్రోవవే. 81

వ. అని విన్నవించుసురశ్రేష్ఠులకుఁ సురజ్యేష్ఠుం డి ట్లనియె. 82

క. సురలార నే నెఱుంగుదు
సురవైరి యతండు నన్ను స్తుతియించి తపం
బరుదారఁ జేయుచుండెను
వరముల నిడి వానితపము వడి నుడిగింతున్ 83

వ. మీ రింక నంతరంగంబులఁ జింత దక్కి యుండుం డని వారి నెల్లర
నంపిపుచ్చి దా నొక్కరుండ హంసవాహనారూఢుండై మంద
రంబునకు వచ్చి బాహ్యేంద్రియవ్యాపారశూన్యుండై తపంబున్న
హిరణ్యకశిపుం గని బోధించుచుం ద న్నెఱింగించి యి ట్లనియె. 84

చ. కటకట మీఁదితో ల్చితికి కాయ మపాయముగా నెఱుంగ కి
త్తటమున నింతకాలము నుతంబగుభంగి మహాతపంబు ప్ర
స్ఫుటముగ నన్నుఁ గూర్చి శ్రుతిచోదితమార్గమునం బొనర్చి త్రీ
వెటులు సహించితో వెతల కీలుగ నైతివి జాలి పుట్టెడున్. 85

వ. అని యిట్లు పలికి బ్రహ్మ తనకమండలుజలములం జల్లి వానికి జవ
సత్వంబులు గలిగించి. 86

క. వేఁడుము వర మిచ్చెద నీ
వేఁడుకకుం దగ మునీంద్రవినుతవిచారా
మూఁడు జగంబులలో నీ
కీ డెవ్వఁడు మెచ్చినాఁడ నీతపమునకున్. 87

వ. అనిన నతం డల్లనఁ గన్ను విచ్చి యప్పితామహునకు సాష్టాంగ
నమస్కారంబు గావించి. 88

సీ. ప్రళయకాలమున సర్వప్రపంచము దమో
మయ మయి యుండుసమయమునందు
స్వప్రకాశమున నెవ్వాఁడు ప్రకాశింపఁ
జేసెనో యెవ్వాఁడు సృష్టియు స్థితి

లయము నొందఁబడుశక్తులను బూనుటకు సత్త్వ
మును రజంబును దమంబును వహించి
ముమ్మూర్తులై సర్వభువనేశ్వరుం డయి
యెవ్వాఁడు వెలుఁగొందు నెల్లకడల

తే. అట్టినీకు నమస్కార మాచరింతు
సకలకారణకారణప్రకటితుఁ డయి
సకలకార్యనిర్వాహకస్థానము నయి
నామనోరథములు దీర్ప నాదుమనవి. 89

వ. నీవు సకలాంతర్యామివై యుండి వేదత్రయముచేఁ జాతుర్హోత్రాదు
లను మంత్రములం జేసి యజ్ఞములం బ్రవర్తింపఁ జేయుచుందువు నీవు
యోగేశ్వరుండవు యోగవిద్య వెలయింపం జేయుదువు నీవు దేశ
కాలాపరిచ్ఛిన్నుండవు నీవు సర్వాంతరాత్మ వైన ని న్నెట్టిదోషంబులు
నంటరావు నీవే కాలంబవు కాలనియామకుండవు నీవే పరమాత్మవు
నీకు జన్మాదులు లేవు చరాచరప్రపంచ మంతయు నీస్వరూప
మోయీశ్వరా నీకు దండప్రణామము. 90

చ. కలితచరాచరాత్మకజగత్త్రయసృష్టి విధానహేతువై
వెలసిననీవు వేలుపులవేలుప వై వెలుఁగొందుచుందు నీ
సలలితరూపదర్శనము సర్వఫలప్రద మేను ధన్యుఁడన్
గలిగెను నీకు నాపయి నఖండకృపారస మోపితామహా. 91

వ. అదికావున. 92

— హిరణ్యకశిపుఁడు వరము లంది విజృంభించుట —

క. అమరేంద్రత్వముఁ గోరితి
నమరత్వము తోడ మఱియు నప్రతిహతశౌ
ర్యముఁ ద్రిజగద్విజయము నిడు
మమరార్చిత ! కరుణ గలిగెనా నామీఁదన్ 93

తే. అనుఁడుఁ జతురాననుం డను నసురనాథ
నీకు నమరాధినాథత్వ మేకట వగు

నోయి! యసురాధినాథత్వ ముండెఁ గాదొ!
పెద్దపడ దది దీనికి బుద్ధి నరయ. 94

వ. అని ప్రత్యాఖ్యానమ్ము చేసిన దానికి దితిసుతుండు తనలోఁ దాను గర్వించుకొనుచు మఱియును. 95

చ. నల దమరేశ్వరత్వ మది నాగధినాథ! సురాసురాళిచేఁ
జెలఁగెడునస్త్రశస్త్రములచే మృగకోటులచే నరాళిచే
జలముల నేల గాలిని గృశానువునన్ దివి రేఁ బవళ్ళ ది
క్కుల మృతి లేనియట్లు దయకుం దగ నిమ్ము వరమ్ము వేఁడెదన్. 96

వ. మఱియుఁ బ్రాణరహితము లగునవి కాని ప్రాణసహితము లగునవి కాని నన్నుఁ జంప లేకుండునట్లును యుద్ధములందు నా కెదురు లేకుండునట్లును సమస్తప్రాణులకు నే నధిపతినై యుండునట్లును మహాయోగీశ్వరసాధ్యము లగునణిమాదిసిద్ధులు నాకు సిద్ధించునట్లును వరంబు లనుగ్రహింపు మని విన్నవించి ప్రార్థించినం బ్రసన్నుండై పరమేష్ఠి వాని కావరంబు లొసంగి సిద్ధమునిసంఘంబులు గొలువ నిజమందిరంబునకుం జనియె నంత హిరణ్యకశిపుండును హిరణ్యగర్భదత్తవరదుర్విదగ్ధుండై గండుమిగిలి. 97

చ. బలములు గల్గు లోకములఁ బర్వినసర్వసుపర్వముఖ్యులన్
బలమదనిర్జితాఖు లగుపార్థివముఖ్యుల నాగముఖ్యులన్
గెలిచి రణాంగణంబుల సుకీర్తి వహించెఁ బరాక్రమంబు ది
క్కులఁ గలయంగఁ బర్వఁ దనకుం బ్రతి లేక జగత్త్రయంబునన్. 98

ఇంద్రలోకము జేరి యింద్రుని నోడించి
యగ్నిలోకముఁ జని యగ్ని గెలిచి
యమలోకమున కేగి యముని వినిర్జించి
నిరృతిలోకముఁ జేరి నిరృతి నోడిచి
వరుణలోకముఁ జని వరుణునిఁ గరుణించు
పవనలోకముఁ గని పవనుఁ ద్రోలి
ధనదలోకముఁ జూచి ధనదునిఁ దూలించి
రుద్రలోకము నొంది రుద్రుఁ గదిసి

ఆ. మఱియు బ్రహ్మవిష్ణ్వాదులఁ దిరిగి గెలిచి
తనర నీరేడుజగములు తనవశంబు
గాఁగఁ గైకొని యేరికిఁ గాక కండ
కావరమ్మునఁ దిరిగె నాదేవవైరి. 99

వ. మఱియు గరుడ గంధర్వ విద్యాధర సిద్ధ సాధ్య ప్రభృతులం గెలిచి భూతప్రేతపిశాచశాకిన్యాదులఁదనఁవశంబు గావించుకొని లోకపాలాస్థానంబులాక్రమించిసకలసంపత్కరం బగునందనవనంబున వెలుగొందు నమరావతీపురంబుఁ జొచ్చి విశ్వకర్మనిర్మితమై సర్వసంపత్సమేతమై ప్రకాశించునింద్రభవనంబునం బ్రవేశించె నదియును. 100

సీ. చిత్రచిత్రాసన శ్రీవిరాజితమును
వరరత్నకంబళ పరివృతంబు
వరమణీసోపానపరిచితంబును దివ్య
మరకతమణిగణ మండితంబు
స్ఫటికనిర్మితకుడ్య భాసమానంబును
భర్మకవాటసంభావితంబు
వైదూర్యనిర్మిత వలభీయుతంబును
శుంభన్మణిస్తంభ సంభృతంబు.

తే. మౌక్తికామలహార సమంచితంబు
మణికలితకాయమాన సమ్మతతలంబు
లలితకౌశేయగణ సమలంకృతంబు
వాసవోన్నతభవనంబు వాసి మీఱు. 101

ఆ. పాలనుర్వులు నాఁ దెల్లడాలు చిమ్మ
వరదుకూలములఁ గప్పఁ బడినహంస
తూలికాతల్పములతోడ శ్రీల నీను
చందురుశయ్యాతలంబుల నొప్పుచుండు. 102

ఇట్లుమహావైభవంబున విరాజమానంబగు మహేంద్రమందిరంబునం బ్రవేశించి పరాక్రమైకధనుండును మహాబలసంపన్నుండును నిరర్గళ

సంకల్పుండు నగుహిరణ్యకశిపుండు నిష్కంటకంబుగా నాధివ్యాధిజరా
మరణేతిబాధారహితంబు గా నిఖిలలోకంబుల నేలుచు నింద్రాదుల
క్రిందుండై గండుమిగిలి యుండునంత. 103

సీ. సిద్ధులు సాధ్యులుఁ సిద్ధర్షు లచ్చరల్
విద్యాధరులును సేవింతు రతని
యాయజూకులు చేయు యాగములం దాది
పూజ వానిద యయి తేజు మీఱు
వానిపాలనమున వసుమతి యంతయు
దున్నకుండఁగఁ బండుచున్న దయ్యె
సప్తసముద్రముల్ గుప్తధనము లైన
శ్రీమణుల్ తెచ్చి యర్పించుచుండు

తే. సమయ మనుమాట లేకుండ సకలవృక్ష
ములును బూలును బండ్లు ముప్పొద్దు వాఁడు
కోరకుండగనే తెచ్చి కోట్లకొలఁది
యిచ్చుచుండును వానిబీ తెచ్చి యుంట. 104

వ. ఇట్లు ప్రపంచకేశ్వరుం డయి సర్వసౌఖ్యంబు లనుభవించుచు జితేంద్రి
యుండు గామి నైశ్వర్యమదమత్తుండై వైదికమార్గంబు లెల్ల విభ్ర
ష్టంబు లగునట్లు చేయుచు సజ్జనుల హింసించుచుఁ దపోధనులం
దూలించుచుఁ జండశాసనుండై యుండె నంత నింద్రాదిబృందారకు
లెల్ల నారాక్షసేంద్రుని బాఁంబకీ తప్పించుకొనుట కేయుపాయంబును
గానక మిగుల వగలం బొగలుచు సర్వలోకశరణ్యుం డగునారాయణ
దేవు శరణంబు వేఁడుట మన కిపుడు కర్తవ్యం బని సర్వభావంబులం
దలంచి యొక్కనాఁ డుదగ్దిశాభిముఖులై చని చని ముందట. 105

—♦ దేవతలు వైకుంఠమున కరిగి మొఱ్ఱపెట్టుట ♦—

మ. కని రావేల్పు లనల్పకౌతుకమునం గళ్యాణరత్నప్రభా
జనితాహ్లాదము సంభృతామృతరసస్వాదంబు చంద్రాదిపా

వనదాయాద మతిప్రసాద మపనిర్వాదమ్ము సుశ్రీదమున్
వినిరూఢోన్నతనాద ముద్ధృతమహావేదమ్ము క్షీరోదమున్. 106

వ. ఇట్లు కనుంగొని వా రప్పయోనిధ్యనుభావంబునకు నద్భుతామోదం
బునం బొందుడెందంబులఁ, బొందుగఁ బొగడుచు మందగమనం
బంగీకరించి. 107

చ. హరి యిటనున్నవాఁడు నెనరార మిముం గరుణించు రం డటం
చురుతరమారుతోద్ధతమహోర్మి సుహస్తపరంపరాధికో
త్తరళితసంజ్ఞ ఘూర్ణిత ముదాత్తఘనస్వరవాక్ప్రసక్తిగాఁ
బెరిమ నితం డొగి న్మనలఁ బిల్వెడునాఁ బొలుపొందెఁ గంటిరే. 108

వ. ఇట్లన్యోన్యవాక్ప్రసంగంబుల రంగదభంగతుంగతరంగపరంపరాతిశ్రాం
గారం బగు నయ్యంబునిధి ననేకభంగులం గొనియాడుచుఁ గొంతద
వ్వరిగినంతఁ దన్మధ్యంబున ననేకశతసహస్రకోటియోజనవిశాలభాజ
నంబై శ్వేతద్వీపంబు దీపించు నదియును. 109

చ. తరగలరాపిడిం బొడమి తద్దయు ముద్దగఁ జేరి పేరి పెం
పర మయి పాలవెల్లినడుమం దవువెన్నయె వెల్లదీవి యై
తిరపడి వెన్క వేల్పు లుదధి న్మథియింపఁగ నాసుధారసం
బరుదుగ నాఁడు దానిపయి నారి పరంగ మెఱుంగుపూఁతయై. 110

వ. అమ్మహాద్వీపమధ్యమ్మున. 111

మ. అరుదార న్మణిభర్మనిర్మితమహాహర్మ్యప్రభాపుంజమున్
వరణస్థాపితనూత్నరత్నసురుచివ్రాతంబునుం గూడి భా
స్కరకోటిద్యుతులన్ హసించుచును వేడ్కం బొల్చి వైకుంఠ మ
న్పురరాజంబు విరాజమాన మగు సంపూర్ణప్రభావంబునన్. 112

ఆ. పాలవెల్లినడుమఁ బద్మంబు నా నొప్పు.
తెల్లదీవియందుఁ దెల్ల మగుచుఁ
గర్ణికాక్రమంబు గలిగి వైకుంఠంబు
కాంతి నెసఁగుఁ బుణ్యకాండ మగుచు. 113

క. విరజానది వైకుంఠము
పరిసరమునఁ బాఱుచుండుఁ బావన మగుచున్
బరికింప సర్వపాపము
లరుదుగ నాశనము నొందు నంతటిలోనన్. 114

ఉ. అందఱు నూర్ధ్వపుండ్రధరు లందఱు చామనచాయమేనివా
రందఱు శంఖచక్రధరు లందఱు పన్నగవైరి నెక్కువా
రందఱు నల్వఁ గన్నదొర లందఱు నాలుగుచేతు లున్నవా
రందఱు సర్వలోకపతు లందఱు వైష్ణవమూర్తు లప్పురిన్. 115

శా. ఆవైకుంఠపురంబు నట్టనడుమన్ హైమంపుఁబ్రాకార మా
లో వాలాయము వాఱు కాల్వ లట నాలోకింపనౌఁ బారిజా
తావిచ్ఛిన్నసుగంధబంధురవనం బం దిందిరాసుందరీ
గోవిందాంచితదివ్యసౌధము పొసంగున్ భక్తహృద్బోధమై. 116

వ. ఆప్రాసాదరాజమధ్యంబున. 117

సీ. నీలంపుఱాలడాల్ డీలింపఁ జాలునై
హొంబట్టుకెంబెంబు డంబుమీఱ
నునుబోరఁ గౌస్తుభమునఁ గ్రాలుపేరు క్రొ
క్కారుమెఱుంగునాఁ గరము దనరఁ
గెంగేలఁ దలకట్టుసింగాణి వలమురి
గుదుసువా ల్గదయును గొమరుమిగుల
నెలమి దేవేరులై కలిమిలేమయు నీల
యును నేలచామయుఁ దనరఁ గొలువ

తే. మొగి సనకసనందనముఖమునులు వొగడఁ
జెలువయెకిమీని మేనిపైఁ జెన్నుమీఱ
నత్తమిల్లినవెన్నునిఁ దత్తఱంబు
పొసఁగఁ గనుఁగొని దేవళ్ళు పొగడి రిట్లు. 118

సీ. హంసాయ వాఙ్మానసాతీతరూపాయ
నిర్గుణాయ గుణాత్మనే నమోఽస్తు
ఆదిమధ్యాంతశూన్యాయ వేదాత్మనే
దేవాదిదేవాయ తే నమోఽస్తు
భక్తార్తిహారిణే భగవతే వనమాలి
నే నరకేసరిణే నమోఽస్తు
క్షీరాబ్ధిశాయినే శ్రీవత్సకౌస్తుభ
శ్రీనిభృతోరసే తే నమోఽస్తు
తే. భవకుశేశయసంభవ పాకశాస
నాదినిర్జరమకుట విన్యస్తపద్మ
రాగమాణిక్యకాంతి నీరాజితామ
లాంఘ్రికోకనదాయ తుభ్యం నమోఽస్తు. 119

సీ. జ్ఞానాదిషడ్గుణాస్థానంబవై యుందు
వీవు సర్వాంతరాత్మైకవేద్యుఁ
డై వెలుంగుచు నుందు వానందరూపుఁడ
వవ్యయుం డవు నీకు నక్కటికమె
భూషణ మాశ్రితపోషణమే నీదు
సహజధర్మం బయి సాఁగుచుండు
బ్రహ్మరుద్రాదిరూపముల జగత్సృష్టి
సంహారములు సేయఁ జాలి యుందు
తే. నీవు సర్వేశ్వరుండవు నిఖిలలోక
మీవ పోషింతు రక్షింతు వీవ కర్త
వీవ భర్తవు ని న్నాశ్రయించి నార
మేము మా మొఱ్ఱ లాలింపవే ముకుంద. 120

శా. తండ్రీ! తల్లిమఱుంగుపిల్లలవలెం దృప్తోప్తపోషణం బందిమే
మాంద్రక్ బిడ్డలఁ గూడి నేఁటిదనుకక్ హాయిం బ్రవర్తింతు మే

వాంద్రుఁ దాయలు లేమి నిప్పటికి నీవారెల్ల ప్రమగ్నంగఁ జా
ల్వేంద్రం బైనమహార్తి వచ్చెఁ గరుణ న్వీక్షించి రక్షింపవే. 121

క. దితిజుఁడు హిరణ్యకశిపుఁడు
పితామహసమాత్తవరము పెంపున గర్వ
ప్రతిహతమతియై లోక
త్రితయము వేధింపఁ జొచ్చె దేవవరేణ్యా. 122

సీ. వజ్రి రక్కసికిఁ గప్పము గాఁగ సర్వస్వ
మర్పించి మొగసాల నాఁగె
ననలుఁ డంధఃకరుండై రసవంతంబు
గా వండి పెట్టు రాక్షసునియింట
జముఁ డనాయుష్యుని జను నైనఁ గొంపోక
నివ్వెఱ వరవుళ్ల నిలిచె నచట
నిరృతియు బెదరి నే నీవాఁడఁ జూ యని
సేవించు నానల్లఁ ద్రావు వాని

తే. వేగ ననయం బపాంపతి వోఁగ ధూళి
యల్లమర్మతివాకిళ్ల నీళ్లు చల్లు
నీఁద వానికి వీఁచోపు లిడుచునుండు
శ్రీదుఁ డీశానుఁడును వానిఁ జేరి మనిరి. 123

తే. ఇంద ఱివ్విధమున నిచ్చ లేమరకయ
సాధ్వసాతిశయావృతస్వాంతు లగుచుఁ
గన్నుసన్నల మెలఁగుచు నన్నిపనులు
తీర్చుచుండిన బలువంత గూర్చుచుండు. 124

వ. దీనరక్షకా! భవద్రక్షకం బగునిజ్జగత్త్రయంబునకుం గలిగిన గురుతరో
పద్రవం బుడిపి త్వదేకశరణ్యుల మగుమ మ్మగణ్యానుకంపాతిశ
యమ్మునం గాచి రక్షింపవే యని యనేకవిధంబుల వేఁడికొనిన విని
భక్తలోకపరాయణుం డగునానారాయణుండు ప్రసన్నుండై వారి
కి ట్లనియె. 125

తే. ఎఱుఁగుదు హిరణ్యకశిపు వాఁ డెఱుక విడిచి
బ్రహ్మవరగర్వమునఁ జేసి ప్రబలుఁ డగుచు
జగము లేర్చుచునున్నవాఁ డోగిని వాని
సదమదము సేయ యత్నింతు శంక విడుఁడు. 126

వ. అని వారి నెల్ల నంపిపుచ్చి యచ్యుతుండు దైత్యవధోపాయం బంతరం
గంబునఁ జింతించి యంతరం బరయుచుండె నంత నక్కడ. 127

మ. అజరుద్రాచ్యుతు లంతవారి నయినన్ స్వాంతంబునం దెన్న కే
విజయంబుం గొని యక్షరాక్షసమరుద్విద్యాధరాద్యాజులన్
ద్రిజగన్నాథుఁడవై ప్రభుత్వగరిమన్ దీపించు దైత్యేశ్వరుం
డజితుండై చరియించె నెల్లకడలం దవ్యాహతప్రజ్ఞుఁడై. 128

వ. ఇట్లు మహోన్నత్యంబున దితిసుతుండు తేజరిల్లుచున్న సమయంబునఁ
గొంతకాలంబునకు. 129

ఉ. ఆవిబుధారిదేవి విబుధాంగనలు న్మఱి పన్నగాంగనల్
భూవలయాంగనల్ తనకు ముచ్చట లెచ్చఁగ నూడిగంబు సం
భావన మీఱ జేపులును మాపులునుం బొనరింప బెంపునన్
దా విలసిల్లి యెల్లరు ముదంపడ గుర్విణి యయ్యె నయ్యెడన్. 130

క. నెల దప్పెఁ గోర్కు లొప్పెను
బలుకులు నడకలును జాల బడలికఁ జెప్పెన్
బలువేవి క్రొవ్విగఁ గప్పెను
వెలవెలనై మోముకళల విప్పుం గుప్పెన్. 131

క. అలరెడు తేజముతోడన్
వెలుగొందెడుకొడుకు లోన వెలసినకతనన్
నెలఁతుకయొడ లయ్యెడలం
దళతళ మను కాంతి నలరెఁ దగఁ బరికింపన్. 132

ఆ. అట్లు నీరుమోసి యైదాఱు నెల లైన
వెనుకఁ జక్రధరుఁడు వెలఁదిమిన్న

కలను బోలఁ దోఁచి గర్భస్థుఁ డగునర్భ
కునకు బోధపఱచి చనియె నిచ్చ 133

మ. నవమాసంబులు నిండ నంతఁ ద్రిజగన్నాథోపదేశంబునన్
భువనాతీతమహత్త్వతత్త్వవిలసత్పూర్ణప్రభావంబునన్
బ్రవరుం డైనకుమారుఁ డారమణికిన్ భాస్వన్మహాలగ్నమం
దు వగం బుట్టెను సర్వలోకములు సంతోషంబునం గాంచఁగన్. 134

న. హిరణ్యకశిపుండును బుత్త్రోదయంబునఁ ద్రిజగంబులందును మహో
త్సవంబు చాటించి బంధుమిత్త్రామాత్యపరివృతుండై శుక్రాచార్యో
క్తక్రమంబున నాత్మజాతునకు జాతకర్మాదిసంస్కారంబులు నిర్వర్తించి
సకలజగత్ప్రహ్లాదుం డగుటం జేసి ప్రహ్లాదుం డని నామకరణంబు చేసె
నంత నాప్రహ్లాదుండును. 135

— ప్రహ్లాదచరిత్రము —

సీ. కదలఁడు మెదలఁడు కమలేశ్వరుని లోన
సేవించుచున్నట్టిజీవి గాన
నవ్వఁడు త్రుళ్ళఁడు నారాణుని లోనఁ
స్మరియించుచున్నట్టిజ్ఞాని గాన
నాఁ యనఁ డూఁ యనఁ డఖిలాండపతి లోనఁ
గీర్తించుచున్నట్టిమూర్తి గానఁ
జూడఁడు పలుకఁడు సురరక్షకుని లోనఁ
జూచుచుండినయట్టి సూరి గానఁ

తే. బడఁడు లేవఁడు విద్దెము లిడఁగ బోఁడు
తినఁడు త్రావఁడు సుద్దుల వినఁగఁ బోఁడు
లోకరక్షకుఁ డైనలక్ష్మీకళత్రు
లోన ధ్యానించుచుండినమౌని గాన. 136

వ. ఇట్లాదైత్యకుమారుండు శుక్లపక్షక్షపాకరునిచందంబున దినదిన ప్రవ
ర్ధమానుం డై. 137

సీ. కలనైన ననృతంబు పలుకఁడు జంతుహిం
సాకర్మ మనఁగనే శౌరిఁ దలఁచు
నవివేకు లభిముఖు లైన మాటాడఁడు
వృథగ వాగ్వ్యయము గావింపఁ బోఁడు
శత్రుమిత్రుల నొక్క సమతచేఁ జూచెడుఁ
బరుల బాధలు చూచి పరితపించు
జననమరణము లసహ్యంబు లని యెంచు
నిహసుఖం బన్న చో నేవగించు
తే. భూజలస్థములై యోజఁ దేజరిల్లు
జంగమస్థావరంబుల సంఘమందుఁ
బరమగురుబుద్ధి నిలిపి తాఁ బరఁగుచుండుఁ
బంచవర్ష వయస్కుఁ డబ్బాలకుండు. 138

సీ. పరమేశ్వరుని భక్తి భావమునం గొని
యె స్మరించుచు నెసఁగుచుండు
వేదంబులును వేదవిద్బ్రాహ్మణులు వాని
కెంతయుం బ్రీతికి నిక్క లరయఁ
దనుఁ బోలె నెల్లభూతములను దిలకించు
సమబుద్ధి నాతండు సదయహృదయుఁ
డమలచిత్తుఁడు దీను లగువారియెడ లోనఁ
గనికర మెంతయేఁ గలుగువాఁడు
తే. గురువులఁ దైవ మని భక్తిఁ గొలుచుచుండు
గర్వ మాతనిమది కెప్డు గలుగఁ బోడు
శాంతభావుఁడు లోక మశాశ్వత మని
తలఁచుచుండుఁ బ్రహ్లాదుఁ డా దైత్యసుతుఁడు. 139

సీ. వాసుదేవుని మది వర్ణించుచుఁ బాహ్య
మగు ప్రపంచమువంక నరయఁ బోడు

తినుచుఁ ద్రావుచు లేచి తిరుగుచుం బండుచుఁ
బరమేశ్వరధ్యాన పరత నుండు
నొకపరి నవ్వు నింకొకపరి నేడ్చు వేఁ
డొకపరి నృత్యము నొనరఁ జేయు
నొకపరి బిలిచిన నో యన కుండును
దా నెక్కడనొ యున్నవాని వలెను
తే. తన్మయుం డయి మఱచి యంతయును లోన
మాటలాడుచు నుండును బాట పాడు
చుండు నాగర్భవిష్ణుభక్త్యుదితుఁ డగుట
వన్నెకెక్కెను బ్రహ్లాదుఁ డన్నియెడల. 140

వ. అంత హిరణ్యకశిపుం డా బాలునకు యథాకాలంబుగఁ జౌలోపనయ
నాదిసంస్కారంబు లొనరించి విద్యాభ్యాసము సేయింప గురు
కులంబునకుం బుచ్చుటయు నతం డచ్చట. 141

చ. పరమహితోపదేశ మిది భక్తి మెయిం బఠియింపు మంచు న
గ్గురువరుఁ డొండు చెప్పిన నొకండు విను న్మఱి యొండు నల్క లో
నరయు నొకానొకం డనఘుఁ డవ్యయుఁ డచ్యుతుఁ డప్రమేయుఁడౌ
హరి యుదరాంతరాళమున నంతయునిండి వెలుంగుచుండుటన్. 142

వ. మఱియును. 143

—♦ ప్రహ్లాదుని విద్యాభ్యాసము ♦—

సీ. చదివింపఁ బోయినఁ జదువ నొల్లం డొజ్జ
చదివినచదు వెల్లఁ జట్టు పడఁగఁ
బాడింపఁ బోయినఁ బాడ నొల్లం డొజ్జ
పాడెడుపాటలు పదటఁ గలియ
వ్రాయింపఁ బోయిన వ్రాయ నొల్లం డొజ్జ
వ్రాసినవ్రాఁతలు మాసి పోవఁ
బలికింపఁ బోయినఁ బలుక నొల్లం డొజ్జ
పలికినపలుకులు బయలు పట్టఁ

తే. దన్నుఁ గూరిచి యిట్టు లాదైత్యగురువు
పాటుపడుచున్నఁ జెప్పినమాట యొకటి
వినఁడు చదువఁడు పలుకఁడు కనఁడు వినఁడు
భక్తిఁ బరవశుఁ డాదైత్యబాలకుండు. 144

వ. ఇట్లు వాసనావశంబునం జేసి పరమవైరాగ్యభాసమానహృదయాబ్జ కోశంబున శ్రీవాసుదేవచరణాబ్జయుగళంబు నిలిపి సర్వంబును మఱచి తదేకధ్యానపరాయణుండై సవయస్కులైనసహశ్రోతలం గూడి విద్యాభ్యాసము చేయుచున్నవాఁడు వోలెఁ బ్రవర్తించె నంతఁ గొంతకాలంబునకా దైత్యకులశేఖరుండు తనతనయుం డెట్లు పఠించు చుండెనో గురువు లెట్లు పఠింపించిరో చూచెదం గాక యని పిలువం బంచి తనయుత్సంగంబునం దనయుఁ గూర్చుండం బెట్టుకొని ముద్దు లాడుచు నుపలాలించుచున్నసమయంబున సకలజనాహ్లాదకరుం డగు ప్రహ్లాదుండు తండ్రి కిట్లనియె. 145

శా. సర్వజ్ఞుం డగునీశ్వరుం దెలిసి విజ్ఞానంబునం దోఁగుచే
నేర్వన్ విద్యలకున్ ఫలం బగును గానీ కీర్తి నొందంగఁ గా
దుర్విన్ గర్వి నశించుఁ గావునను నే నో విద్యల నేర్చితిన్
'సర్వం విష్ణుమయం జగ' త్తనుచు నశ్రాంతంబుఁ జింతించుటల్. 146

ఉ. ఆగమముల్ బఠి న్నదువు నాదయు నంతము లేక లోకముల్
వీఁగక సృష్టిచేసియును బెంచియుఁ ద్రుంచియు లీల నాడుచున్
దా గతియై మెలంగెడు నుదారత నచ్యుతుఁ డంచుఁ గాన నా
యోగివరేణ్యునిం దెలియు టొక్కఁ డెఱింగితిఁ దండ్రి! విద్యలన్. 147

తే. మానవుండు దేహాత్మాభిమానమునను
మానసమున స్వతంత్రతాభిమానమునను
విషయసుఖముల నభిలాష విడక యుండి
యంధతామిస్రమునఁ బడు నవనినాథ. 148

క. సంసారాంధువునం బడి
ధ్వంసం బయి పోవుగతికిఁ దార్కొనక రహిన్

హంసస్వరూపు నీశ్వరు
శంసించుచు నడవి నుంట చను నని తెలిసెన్. 149

వ. అని పలుకఁ డిల్లపడి యుల్లంబునం గలయుల్లాసం బది యెల్ల
నాసిరిల్ల దనుజవల్లభుం డల్లనఁ బ్రహ్లాదున కి ట్లనియె. 150

చ. అరయఁగ నీచరిత్ర మిది యంతయు వింతగఁ దోఁచె నక్కటా
పరు లెవ రిట్లు నీమదికిఁ బట్టఁగఁ జేసిరి కోఁడెకాఁడ వీ
విరసము లెట్లు నేర్చితివి వెన్నుఁడు దానవజాతి కంతకుం
బరమవిరోధి వాని నిటు పాడి చెడంబడ నేటి కాత్మజా. 151

వ. అని పలికి తనమనంబున. 152

చ. అభము శుభం బెఱుంగ రెవ రన్నది విన్నది విన్నయట్లు గా
ప్రభు వనుభీతి లేక నుడువం గల రిగ్గతి బాలు రక్కటా
శుభముఁ దలంచి యొం డొకఁడు చూడక దేశికునాలయంబునం
దభయుఁడ నై వసింప నిడి యూఱడి చేసితి వీని నక్కటా. 153

క. ప్రచ్ఛన్నవేషు లగుచుం
సచ్ఛాత్రులు వోలె వచ్చి సద్గురుకులమం
దిచ్ఛఁ జరింతురు వా రీ
స్వచ్ఛాత్మునిమతము మార్పఁ జాలిరొ కట్టా. 154

వ. అని చింతించి విచారించెదం గాక యని పురోహితుం బిలువ నంచి.

చ. గురువులు మీరు మాకుఁ గడుఁ గూర్చినవారలు మిమ్ము మే మెదన్
నిరతముఁ గొల్చుచుందుము వినీతులమై యిటు మాకుమారుఁ డీ
కరణిఁ గృతాపరాధుఁ డగుకష్టుని దుష్టునిఁ బెద్ద చేసి మా
గరువ మెఱుంగఁ జాలఁ డిటఁ గారణ మేమి తలంప నయ్యెడిన్. 156

వ. అనిన గడగడవడంకుచు నుపాధ్యాయుండు వాని కి ట్లనియె. 157

తరళము. తెలియుదే కద దానవేశ్వర దేశికోత్తము లైనమా
వలన నేమియుఁ దప్పు లుండవు వైరిఁ జెప్పము మేము మీ
కలిమిఁ గోరినవార మీపలుగాకి బుద్ధులు నీవి కే
కలిగె నైనను దిద్ది తెత్తుము గాక సైఁపుము దీనికిన్. 158

క. అని వాని నోడంబడఁగా
నొనరిచి ప్రహ్లాదుఁ గొనుచు నొజ్జ యతనితోఁ
జని నిజగేహమునం దిడి
కొని యి ట్లని బుజ్జగించెఁ గొనకొని వానిన్. 159

చ. వినుము కుమార ! నానుడులు వీనుల కొప్పఁగ జెప్పుచుంటి నీ
జనకుఁడు ముజ్జగంబులకుఁ జాలినవాఁడు పరాక్రమంబునన్
మునుకొని పాకశాసనుని ముట్టడి వెట్టి జయించినట్టి డా
తనిపెనుదాడి కోడి మును దామరసాక్షుఁడు వాఱెఁ బోరునన్.

ఆ. అతనిపేరు విన్న నజ రుద్ర విష్ణ్వింద్రు
లడలు గుడుచుచుందు రతఁడె నేత
యతఁడె త్రాత విష్టపాలికి నీ కట్టి
తండ్రి విడిచి పగతుఁ దడవ నేల. 161

ఉ. సత్యము చెప్పు మే రయినఁ జక్కటు లాడుచు నీకు నీక్రియన్
వ్యత్యయముల్ నచించి రన వచ్చెడి వైష్ణవుఁ డెవ్వఁ డే నిటన్
నిత్యము వచ్చి పోయెడిని నీవిటు లాటకు హేతు వేమయో
ప్రత్యయ మావహిల్లు నటు పల్కుము కల్లమెసంగ కుండఁగన్.

వ. అనినఁ బ్రహ్లాదుం డతని కి ట్లనియె. 163

తే. తాను బెరవాఁడు ననుబుద్ధి మానసమున
భ్రాంతునకుఁ గల్గుచుండును వాఁడు నేను
నొండు గా దీశ్వరునిరూప మొక్కఁ డనఁగ
నిట్టిచో నిట్లు ప్రశ్నించు టేటిమాట. 164

వ. గురువరా ! యిట్టిభ్రాంతి పరమేశ్వరునిమాయాప్రభావము గాని మఱియొక్కటి కాదు దీని నెఱుంగుట భగవదనుగ్రహంబునన కాని కా నేర దినుమయస్కాంతముకడ భ్రమించునట్లు నాబుద్ధియు భగవంతునియొద్దఁ బరిభ్రమించుచుండును గావున భగవదనుగ్రహము వలననే నా కిట్టిబుద్ధి సంభవించినది కాని యొరులబోధము కా దని

విన్నవించుచుంటి ననిన శుక్రపుత్రుఁ డవక్రవిక్రమంబునఁ జేత
నొక్క-శిక్షాసాధనంబు గొని చూపి జడిపించుచు నెల్లగుపిన నిట్లనియె.

ఆ. పందువంటి దైత్యవంశంబునకు వీఁడు
వహ్ని యట్లు పుట్టె వంశ మెల్ల
వీనికతన నాశ మగు నని యెంచెద
శిక్ష కర్హుఁ డిట్టి చెనఁటి కొయ్య. 166

వ. అని యనేకవిధంబు లగునుపాయంబుల బుజ్జగించి బోధించి దిద్ది
మఱియు వానితల్లి చేతం దిద్దింప నెంచి లీలావతికడకుఁ గొడుకుం దోడి
కొనిపోయి చెప్పుటయు నప్పతివ్రత సుతునిం గౌఁగిటం గదియించి
చుంచు పుడుకుచు ని ట్లనియె. 167

చ. కడుపునఁ గన్నబిడ్డఁడవు గాని యొకండవు గావు తండ్రి! నీ
కిడుములు రా భవజ్జనకుఁ డేటికిఁ జెప్పెడిఁ జెప్పినట్లు గా
నడువుము దానవాంతకు మనంబున వీడుము వీడకున్న నీ
పడియెడిపాటుఁ జూచి యొకపాటిగ నే నెటు తాళి యుండెదన్.

తే. ఉఱిడు మీఁయన్న యింద్రాదియోధవరుల
నున్నయట్లుండి కోపించు నన్ను ని న్నొ
కఁడుగఁ జేయును దల్లికిఁ గడుపుశోక
మిడక వేవేగ హరిభక్తి విడువు మన్న. 169

వ. అని చెప్పి కొడుకు నొప్పించితి ననుకొని గురున కప్పగించుటయు నతం
డాతనిం గొని గృహంబునకుం జని సహపాఠకులలోనం గూర్చి నిత్య
కర్మానుష్ఠానంబున కై యెడయుటయు నపు డా దైత్యబాలకుల నెల్లం
జేరఁ జీరి ప్రహ్లాదుం డి ట్లనియె. 170

— ప్రహ్లాదుఁడు దైత్యబాలకులకు జ్ఞానోపదేశము చేయుట —

మ. ప్రతిదిష్టంబును వేనవేల్ ప్రజలు చావం జూచుచున్నార మీ
శ్రుతులున్ శాస్త్రములుం బురాణములు వస్తువ్రాతముల్ ప్రాణికిన్
మృతి లేకుండఁగఁ జేయఁ జాలు నె జగన్మిథ్యాత్వ మూహించుచున్
మృతియున్ జన్మము లేనిచొప్పుఁ గొన నీమీఁద న్విచారింపుఁడీ.

ఉ. కావు గురూక్తపాఠములు కావు గృహంబులు కావు సంపదల్
కావు ప్రభూతరాజ్యములు కావు జయంబులు కావు శౌర్యముల్
కావు సతీవిలాసములు కావు శుభంబులు దేహధారికిన్
జావును బుట్టువుం దొలఁచి శాశ్వతసౌఖ్య మిడన్ సమర్థముల్. 172

చ. తలఁచిన నోకిలింత లగుదట్టపుతెట్టను గొట్టుకొంచుఁ బే
గులు నరముల్ పొర ల్తనకుతుత్తుకకు న్మొయికిం గడంకమై
దళముగఁ జుట్టఁబెట్టుకొన దారి యొకింతయు లేక వేఁగుచున్
వెలలఁ దరంబె పో పొలఁతి పెన్గడు పన్ చెఱసాలయం దొగిన్. 173

చ. బ్రతికినయన్ని నాళ్ళిటులు బాములకే యగు కాఁపురంబు నా
వితయగుపేరునం బ్రబలి వీఁగక మండెడుకారుచిచ్చులో
సతముగ నేగి వే మిడుతచందమునం బడి వేఁగి వేఁగి యీ
మతకరి చచ్చి పుట్టు నది మానెడుదారి యెఱుంగఁ బోలదో. 174

శా. ఆయుర్దాయము నూఱువత్సరము లం చాఖ్య ల్వచింత్రిందు ని
ద్రాయోగంబున సాము బాల్యమున వ్యర్థం బౌఁ బదేం డ్లాటలన్
వ్యాయామాదులచేఁ బదేండ్లు చనఁ జేయం గల్గు నంత్యంబునం
దాయాసాదుల నిర్వదే డ్లుగుఁ బై నౌ నాపదేండ్లే కదా. 175

వ. ఆపదియేను లైనను భగవత్కాలక్షేపంబునకుం గాక జనుండు గృహకృత్యాదులందగిలి కామాదిరిపుబాధితుండై కొట్టుమిట్టాడుచుం బొట్టం బోసికొన నిట్టునట్టుం దిరుగులాడుచుండుంగాని తన బ్రదుకు తా నెఱుంగకుండు నాకర్ణింపుఁడు. 176

ఆ. బ్రతుకు తరగలాట పసిజవ్వనము కొన్ని
నాళ్ళమాట సుకము నీళ్ళమూట
బోఁటి సొమ్ము కొడుకు నేటిమెఱపుఁ దేట
యేటి కయ్య! యిట్టిపాటి బాట. 177

తే. కాఁపుర మనుకడలి నీఁద నోపుదారి
యెట్టిగోదలను దీర్చెడునట్టిదారి

పుట్టిచావనిసుఖ మిచ్చునట్టిదారి
బమ్మ మరయుట యని లోన నమ్ముఁ డోరి. 178

వ. అని సహపాఠుల కెల్లఁ దత్త్వజ్ఞానోపదేశంబు చేసి మఱియు నో బాల కులారా! మనగురుం డుపదేశించెడిధర్మార్థకామములమార్గంబు లన్వీక్షకీవిద్యయును దండనీతిం దెలుపుశాస్త్రంబులును నాకు మున్న తెలియు నవి పురుషార్థసాధనంబులు గాఁ జాలవు పరమేశ్వరునకు మన యాత్మ నివేదింపవలయు నని చెప్పనుపనిషత్తులుమాత్రమే పురుషార్థ మును సాధించును నే నాసాధనమును మాత్రమే కోరుచుండు సామా న్యదుర్లభంబగునీజ్ఞానమును నారదుండు నా కుపదేశించె నని చెప్పిన వెఱంగుపడి దైత్యబాలకులోయి ప్రహ్లాదా! నీవుమాయంతవాఁడవు మన మక్షరాభ్యాస మైనది మొద లొక్కగురువుకడనే పఠించుచుంటి మి ట్లుండ నీకు నారదుం డుపదేశించె ననుట యెట్టిది వానిగురుత్వము నీ కెప్పుడు కలిగెం జెప్పి మాసందేహముం దీర్పు మనినఁ బ్రహ్లా దుండు వారి కిట్లనియె. 179

సీ. వినుఁడు బాలకులార! మును విన్న తెఱఁగు నే
మాతృగర్భమునందు మసలుచుండ
మాతండ్రి తపియింప మందరంబున నున్న
తఱి నింద్రుఁ డలుకమై దాడి వచ్చి
మాతల్లిఁ జెఱఁగొని ప్రీతి నేగుచునుండ
నారదుం డాతని దారి నడ్డి
మాయవ్వఁ దనయాశ్రమమునకుఁ గొనిపోయి
పోషించెఁ బుత్రికాబుద్ధిఁ జేసి

తే. వెనుక నమ్మౌని గర్భమం వొసరునేఁప
వినఁగ నమ్మహాసాధ్వికి ననుదినంబు
జేసెఁ దత్త్వోపదేశంబు వాసి మీఱ
దాన నిసుమంత నా కిట్లు జ్ఞాన మబ్బె. 180

వ. అని బోధించిన వారును జ్ఞానసంపన్ను లయి సర్వంబునుం దెగడి
నారాయణభక్తిం దగిలి యుండి రది యంతయు నాచార్యు లెఱిఁగి
తఱుగనికినుకం గొని హిరణ్యకశిపునికడకుం జని తమకంబున ని ట్లనిరి.

మ. దనుజాధీశ్వర ! నీసుతుండు కులతిక్తం బేరికిం గాఁడు చె
ప్పినమాటల్ చెవిఁ బెట్టఁ డన్యమతము న్వీడండు దుష్టత్వముం
గొని వర్తించుచుఁ దోడిబాలకులఁ గైకోఁ జేసె దుర్బుద్ధు లా
తనిమూలంబున నెల్లరాక్షసులకుం దబ్బిబ్బు గా నయ్యెడిన్. 182

ఆ. అనిన నులికిపడుచు నమరారి యే మేమి?
చేటుకాల మయ్యె నోటు? కడుపు
చెడఁగఁ బుట్టి కొడుకునుడిఁ గొన్నయరి గాని
కొడుకు గాఁడు నాకుఁ గూళ వాఁడు. 183

— ◆ హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని శిక్షించుట ◆ —

వ. అని కల్పానల్పగభీరభైరవసదృక్షుండై రాక్షసేంద్రుండు తక్షణంబ
రాక్షసులం బంచి ప్రహ్లాదుని రప్పించి రూక్షేక్షణంబుల నిరీక్షించి
ధిక్కరించి యి ట్లనియె. 184

శా. ఏరా! రాక్షసవంశనాశకుఁడ! నీవే కాక నీకోటిపా
టారక్షస్సుతులుం జెడం గఱపితే యన్యాయమార్గంబునం
జేరం దుర్మత మెంత చెప్పినను నీచిత్తంబు దుర్వృత్తిమైఁ
బారం బందుట లేదు నీవు బ్రతుకన్ వాంఛింపవా దుర్మతీ. 185

శా. ఓరీ! మూఢుఁడ! నీ కిటుల్ తెలిపె నేఁడో సర్వలోకంబులన్
శూరత్వంబున గెల్చి సర్వవిభుతాశుంభత్ప్రభావంబునన్
రారాజై చనుకన్నతండ్రి నను నారాజత్వము న్మెచ్చఁ బో
వేరా! రాక్షసవంశదూషకుని నీ వి ట్లెంతు వజ్ఞుండవై. 186

శా. నా కేరున్ వచియింప లేదు పదు లన్యాయంబు తన్నిందలున్
నాకే పుట్టెను జేటుకాల మనుచున్ మా దేశికస్వామితో
వాకొంటల్ వినిఁ యుంటి దుర్మతివి నాపాపంబునం జేసి యే
నాకుం బుట్టితి పుత్రరూపమునఁ గాన న్వచ్చుకాలుండ వై. 187

చ. గడగడలాడు లోకము లొకానొకనాఁటికి నేని నానుడిం
గడచి నడంగఁబో రజుఁడు గాని జనార్దనుఁ డైనఁ గాని రు
ద్రుఁడ యగుఁ గాని నాదయినదోర్బలశక్తికి నోడి వాడి వో
నడవులు పట్టి పోయిరి భయంబున నింతయు నీ వెఱుంగవో. 188

శా. నాయాజ్ఞం గొని కాని గాలి కదలన్ రా దగ్నియు న్మండఁ బో
దీయాకాశమునందు వెల్గఁ డరుణుం డేప్రొద్దు వైవస్వతుం
డాయుఃప్రాణులఁ జంపఁ జూడఁడు సమస్తాశావకాశంబులన్
బాయం బోక మదీయ తేజము దలిర్పం జెల్లు నెల్లప్పుడున్. 189

క. నానుడి మెలఁగవ యేనిన్
సూనుం డని చూడ కింత శూలప్రోతుం
గా నొనరించెద నొంచెద
మానసమున నింక నెఱుఁగుమా నాశక్తిన్. 190

వ. అనినఁ బ్రహ్లాదుండు జడియక తండ్రి కిట్లనియె. 191

చ. చెడి చెఱుపంగ లే దొరులఁ జెప్ప నొకప్పుడు దుష్టబుద్ధి లే
ర్పడఁగ జగత్త్రయంబునకు భర్తయు హర్తయుఁ గర్త యైనవి
ష్ణుఁడు మనకున్ శరణ్యుఁడు గనుంగొనువారికి మోక్షమార్గ మా
తఁడు కరుణించు నంటి నిది తప్పనుచుంటివె తండ్రి! చెప్పుమా. 192

మ. బలవంతుండను నేన నన్నివిధులన్ బాధింప వేధింపఁ గా
బలవంతుం డొకరుండు ముజ్జగములన్ భాషింప లే డంటి నీ
బలమున్ నిన్నును నన్ను నెల్లజగముల్ బల్మాఱు గాలించి మి
క్కిలి పేర్మిం గలవాఁ డొకం డతనిశక్తి న్నీవు భావించితే. 193

చ. ఇలఁ గలమెల్ల శాత్రవుల నేఁచి జయించితి నంటి వయ్యరే
తెలియఁగ నీదులోపలఁ బ్రతిష్ఠితమై ఽకుశత్రుషట్కమున్
గెలువఁగ లేకపోతి కద కేవలశౌర్యము చాల దందు వా
రలను జయించితేని నినుఁ బ్రజ్ఞగలాఁ డన వత్తు రన్నిటన్. 194

ఆ. జనుల కెంతకాలమున కైన మృత్యువు
తప్ప దింత వగవ దాని కేను

మానసమున లోకమాన్యుండు హరి యుండఁ
బరులవలనిభయము పడఁగ నేల. 195

వ. అని తెంపరియై పలికిన నలుక నొడమి రాక్షసేశ్వరుఁడు నిర్దయుండై
రాక్షసవీరుల నిరీక్షించి. 196

ఉ. పుత్రుఁడు గాఁడు వీఁ డెడఁదఁ బుట్టినపుం డని తెల్ల మయ్యె నా
శత్రుని సంస్మరించెడిని సంతతముం గడుం బెద్దఁ జేసి నా
పాత్రితఁ జూడఁబోఁ డెదిరి పల్కెడు వీనికతంబున న్మహా
గోత్రము దూలు నిట్టిచెడుగు న్వధియించుట పాడి తండ్రికిన్. 197

చ. కరచరణాదులన్ వ్రణము గల్గి యసాధ్యమ మైనచో భిష
గ్వరుఁ డలయంగకంబు దెగవైచి విశిష్టశరీరరక్షణం
బరుదుగఁ జేసినట్టులు కులాపశదుం డగునిద్దురాత్మునిన్
మరణము నొందఁ జేసి కులమాన్యత ధన్యత నిల్వరించెదన్. 198

క. కావున మీరలు వీనిం
భావమునం గనికరించి ప్రభుసుతుఁ డనుచున్
బోవక పెడత్రోవల వడిఁ
జేవమెయిం జంపి రండు జీంద్రడం బేగన్. 199

వ. అని యాజ్ఞాపించుటయు శూలహస్తు లగుప్రహస్తాదిరాక్షసప్రవరు
లాప్రహ్లాదుం బట్టుకొని గిట్టింపం దలంచి. 200

చ. పలువురు రాక్షసాధములు బాహుబలంబునఁ బట్టి ముట్టి క
త్తులను గటార్ల శూలముల దొప్పలుదోరలు నెత్తు రూఱ మి
క్కిలి వెత దేర బాలకునిఁ గ్రిందఁబడం బచరించి నొంచినం
దలఁకఁ డతండు లోన హరినామము నేమఱ కుండి దండియై. 201

చ. కలఁగఁడు వెచ్చనూర్చఁడు వికారమునొందఁడు బీతుఁ జెందఁ డె
వ్వలనను గంట నీ ర్విడఁడు వాఱఁడు చేరఁడు తండ్రిచెంత కే
యలమటయుం గొనం డెడఁద హా! పరమేశ్వర ! హా ! రమేశ ! హా!
సలలితమూర్తి ! హా ! సుగుణసాగర ! యంచు వచించు నెంతయున్.

వ. అట్లు ప్రహ్లాదుండు చెక్కుచెదరకున్నం గని తండ్రి కనికరంబు లేక కనలి కనలి మఱియును. 203

సీ. కాలసర్పములచేఁ గఱపించి కఱపించి
కత్తులచే బిట్టు మొత్తి మొత్తి
మదగజంబులచేత మట్టించి మట్టించి
గండోపలంబులఁ జెండి చెండి
దుర్గాగ్రములనుండి త్రోయించి త్రోయించి
మన్నీటితరగల ముంచిముంచి
వీతిహోత్రునియందు వేయించి వేయించి
విషసముత్కరములు పెట్టి పెట్టి

తే. యిలను బాఁతించి పెనుగాలి కెదురు నిలిపి
గదల మొత్తించి బల్ముత్రాటఁ గట్టి కొట్టి
నవబిలంబులు మూయించి నవయ నొంచి
తనయు వేధించెఁ గ్రోధించి దైత్యవిభుఁడు. 204

వ. మఱియు ని ట్లనేకవిధంబుల వేధించియుం గొడుకుఁ వధింప నేరక నిర్విణ్ణుండై హిరణ్యకశిపుండు తనమనంబున. 205

మ. మడియింపం గడుమార్గముల్ వెదకితిన్ మాయించితి న్నొంచితిన్
జడియం బోవఁడు చావఁ డేవెతయు నెంచం బోఁడు వేసారితిన్
బడుఁ గీతండు మహాప్రభావనిధి నా భావింపఁగా నయ్యె నేఁ
డిడుమల్ వచ్చెడు వీనిమూలమున రాని మ్మోమి సేయం దగున్. 206

వ. అని మిగుల నగలం బొగులుచు ధైర్యంబు దెచ్చుకొని ప్రహ్లాదుం బరీక్షించి యి ట్లనియె. 207

చ. జనకునితోడ నైర మొగి సల్పుచు నల్పపుఁగారణంబునం
దనువు చెడంగఁ గార్యము లొనర్చుట నీతిపథంబు గాదు పు
త్రున కిటు లేల నీ కసురదూషకుఁ డాహరిమాట మాని భూ
జనసుత మైననామత మజస్రము నమ్మి భజింపవే సుతా. 208

వ. అనినం దండ్రికిం గొడుకి ట్లనియె. 209

మ. అమృతాస్వాదన మాచరించుచు మహాహ్లాదంబునం దోఁగును
త్తమచారిత్రుఁడు గంజి ద్రాగుటకుఁ జిత్తంబందు వాంఛించునే
సుమనస్సంఘసమర్చితుం డయినవిష్ణుం భక్తి భావించునే
నమరారీ! యెటులైనఁ గాని విడి యన్యంబుం గనం బోదునే. 210

తే. అనిన రోషించి సురవైరి తనయుఁ జూచి
యోరి పలుగాకి! త్రిజగంబు లుల్లమందు
నానుడి యనంగ వెఱఁగందుఁ గాని నీవు
ధిక్కరింతువు నీ కేరు దిక్కు సెప్పుమ 211

వ. అనినఁ బ్రహ్లాదుండును. 212

— నరసింహావతారఘట్టము —

ఉ. ఎవ్వనిలీల నీజగము లిన్నియు నేర్పడుచుం దలిర్చునో
యెవ్వఁడు సర్వభూతముల నెప్పుడుఁ ద్రిప్పుచు నొప్పుచుండునో
యెవ్వఁడు సర్వసాక్షి యయి యీక్షణమున్ వెలుఁగొందుచుండునో
యవ్వరమూర్తి యచ్యుతుఁ డనంతుఁడు శాంతుఁడు నాకు దిక్కగున్.

చ. అనవుడు రాక్షసాధముఁ డహంకృతి మీఱఁగ హుంకరించుచున్
జనయిత రోసి చంపినను జచ్చెద నంచును మొండికట్టె వై
వనరుదు వోరి నీతలఁచువాఁ డెవఁ డెచ్చట నుండుఁ జూపు మా
తని నిను నంటఁ గట్టి ఘనదావమునన్ బడవైచి ప్రుచ్చెదన్. 214

వ. అని గర్వించి పలికిన నంతరంగంబున శ్రీహరిం జింతించుచుఁ బ్రహ్లా
దుండు తండ్రి కిట్లనియె. 215

మ. ఒకచో నుండెడు నుండఁ డొక్కెడ వేఱొండొక్కచో నుండు నిం
కొకచో నుండఁడు నాఁగ నేమిటికి దేవోత్తంసుఁ డావిష్ణుఁ డా
సకలేశుండు చరాచరాత్మకజగజ్జాలంబుల న్నిండి యుం
డి కడుం బొల్పెడు వానినిం దలఁపఁ దండ్రీ! మేలు సేకూరెడిన్.

వ. అని పలుకుచున్నసమయంబున హిరణ్యకశిపుండు రోషకషాయితా
క్షుండై కరవాలంబు కేలం గీలించి సింగంపుగద్దియ గ్రద్దన డిగ్గ నుఱికె.

శా. ఎందుంజూచిన నందు నిందిరవిభుం డింపొందు నం చాడి తీ
విందుం జూపుదువే కులాపశద నే నీక్షింతు నీ వన్నయ
ప్పందం జూపకయున్న నీశిరము నా బాహాసి ఖండించి వే
ద్రుమందింతుం గను మంచు వ్రేసె ఘనసంరంభంబునన్ స్తంభమున్

వ. ఇట్లు వ్రేసిన నాసభాభవనస్తంభంబు ప్రళయకాలవలాహకనిష్ఠురనిర్ఘా
తనిర్ఘోషంబునం బెటిల్లునం బగిలె నందు సహస్రకిరణ సహస్రకోటి
ప్రభాభాసమానాసమాన దేహధగద్ధగితసకలాశావకాశంబును శ్రీవత్స
కౌస్తుభవైజయంతీప్రముఖ మహాలక్షణలక్షితవక్షస్థలంబును గఠోర
ఘోరదంష్ట్రాకరాళవివృతవదనగహ్వరంబును దైత్యపశుబంధనబం
ధురయూపాయితోరుయుగళంబును వజ్రసదృశఖరనఖరకూరంబును
సంవర్తసమయసప్తజిహ్వాజిహ్వాకాసమమహాజిహ్వాంచితంబునుసంధ్యా
రాగసదృశమహోన్నతసటాచ్ఛటంబును గర్జానినాదనిర్దళితాశావ
కాశంబును మహారోషభీషణవేషంబును మహోన్నతంబును నగు
శ్రీమన్నృసింహరూపం బావిర్భవించి విజృంభించె నంత హరిభక్తుం
డగుప్రహ్లాదుండు భయసంభ్రమంబులు పెనంగొనంగ నిర్వాణుం డగు
తనతండ్రి కామహానరసింహవిగ్రహంబుఁ జూపుచు. 219

సీ. పదియు నార్వన్నెల బంగారమును బోలు
పింగళనేత్రముల్ బిగువు సూప
మోముపై మెడలపై ముసరుకొనిన కేస
రములమో పెంతయు రమణ మెఱయఁ
జందువంకం బోలి చండమై దండిమై
వజ్రదంష్ట్రలు నోటివక్కలఁ దగ
శతకోటులకు దీటు సలుపంగఁ జాలిన
ఖరనఖరంబులు గండు మీఱ

తే. నిక్కువీనులు వరఖడ్గనిభరసనయు
ముక్కురంధ్రములున్ నోరు భూధ్రగుహల

పగిదిఁ దెఱవఁ బడి వెలుంగఁ బర్వతంబు
నా నృహరి వెల్గెఁ జూచితే నాదు తండ్రి. 220

చ. సనకసనందనప్రముఖసంయమిచంద్రుల కైన నెమ్మదిం
గనుఁగొన రానివేల్పు మనకట్టెదుట న్నరసింహమూర్తి యై
కనుఁగొన నయ్యె ధన్యుల మిఁకన్ గరువం బెడలన్ భజింపు మో
జనక! దయామయుం డితఁడు శత్రువు నైన ననుగ్రహించెడున్. 221

ఆ. అనుడుఁ గ్రిందు మీఁదు నరయఁ జాల కతండు
వాలుఁ బలుకఁ బూని జ్వాలనమందు
మిడుత నోలె నృహరిమీఁద నుంకించిన
నాతఁ డొడిసి పట్టె నతని నట్టె. 222

— నరసింహమూర్తి హిరణ్యకశిపుని సంహరించుట —

చ. గరుఁడుడు సర్పముం బలెను గండరగండని వానిఁ బట్టుడున్
గరములపట్టు తప్పుకొనఁ గగ్గి సురారి జరీలున మీఁది కేగ గా
సుర లది చూచి బీతువడి శోకము పాకము గాఁగఁ గుంధుచున్
బిరుసుగలాఁడు వీఁ డెటులొ వీని వధించుట లంచుఁ గించులై. 223

ఆ. వగచుచుండి రపుడు వాఁ డది హరి హేల
యని తలంప కేన ఘనుఁడ వీని
నింతలోన నడఁతు హరాంతకారిని నేన
యనుచు విఱ్ఱవీఁగు నంతలోన. 224

వ. గుప్పున యుప్పరంబున కెగసి యప్పరమపురుషుండు పెద్దపెట్టున నట్టహాసము చేయుచు నట్టె పట్టుకొనినం బట్టు తప్పించుకొన నేరక ట్టట్టు కొట్టుకొని వజ్రకాయుం డయ్యు నారక్కసుం డుక్కు డక్కి కుక్కినపేను వలె మొక్కవోయి యుండె నప్పు డానారసింహుండు.

సీ. బాహుపాశంబుల బంధించి బంధించి
యూరుతలంబునం దుండఁ జేసి
ఖరనఖరంబుల నురము వ్రయ్యలు సేసి
రక్తప్రవాహంబు వ్యక్తపఱచి

హృదయకోశము వ్రచ్చి యద నెంచి సకలాంత్ర
ములఁ దుంచి గుండెకాయలను ద్రెంచి
కంఠమాలికలుగాఁ గడఁకఁ బ్రేవులు దాల్చి
మెదడుగందము తీసి మేన మెత్తి
తే. పవలు రేయును గాక సంజవడుతఱిని
మహియు గగనంబు గా కూరుమధ్యమందుఁ
బశువు మనుజుఁడు గాని రూపమున శస్త్ర
మస్త్రమును గానిగోళ్ళ నయ్యసురఁ జించె. 226

వ. ఇట్లు చించి చంపి పెంపు మిగిలియున్న నరహరిం గరవాలపాణులై గవి
యనున్న పూర్వదేవానుచరుల నెల్ల హుంకారంబునన త్రెళ్ళనేసి
వాసిం జూపుచుండె నాసమయంబున. 227

సీ. అతనిజటాచ్ఛట లంతరిక్షమ్మునఁ
గాదంబిన్నిం జేసె ఖండములుగ
నాతనిదృష్టి సూర్యాదిగ్రహమ్ముల
కాంతి నడంగింపఁ గలది యయ్యె
నాతనినిట్టూర్పు లాతతమై సంద్ర
మల్లకల్లోల మా నట్లు చేసె
నాతనిసింహనాదాతిశయంబున
దిగ్గజంబులు భీతి ద్రెమ్మగిల్లె
తే. అతనిపదఘాతమున భూమి యద్రుచు దద్ద
ఱిలె నతనివడి కద్రులు దెళ్ళి నయ్యె
నతని తేజాన దివి ప్రకాశితమ యయ్యె
నతనివడి కెల్ల జగములు నడల నయ్యె. 228

వ. ఇట్లు జగద్భీషణవేషంబున లోకకంటకుం డగుహిరణ్యకశిపుని సంహ
రించి నారసింహుండు రంహంబుగం జని సభాభవనంబున సింహాసనా
సీనుండై నిస్సపత్నుం డయ్యును క్రోధం బుపసంహరింపఁ జాల కుగ్రి

వదనుండై యుండె నప్పుడు దర్శనాగతు లగుసురగరుడోరగయక్ష రాక్షసకిన్నరకింపురుషాదులయు హరపురందరవరమేష్ఠిప్రభృతులయు సంఘంబుల నొక్కరుండునుం బ్రక్కకుం బోఁ జాల కెడ గలిగి నిలిచి చేతులు జోడించుకొని లోలోన వినుతించుచుండి రాభార్గవియు దగ్గఱుటకు భయంపడి దూరదూరంబున నుండె విష్ణుపార్షదు లైన సునందాదులును బద్ధాంజలు లై యించుక సమీపించి తేజోమూర్తి యగునారసింహునిం జూచుచుండి రాసమయంబునఁ బితామహుం డవనతశిరస్కుండై చేతులు దోయిలించుకొని యి ట్లని ప్రార్థించె.

—♦ నరసింహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించుట ♦—

స్రగ్ధర. దేవా! నీశక్తు లెన్నన్ దివి భువి నెవరున్ దెల్పఁగా లే రనంత
శ్రీవిజ్ఞేయంబు లోజోంచితములును బరిచ్ఛేదముల్ లేవు నీవే
యీవిశ్వం బెల్లఁ దేజం బెసక మెసఁగఁగా సృష్టి గావింతు వెన్నన్
నీవే సర్వేశ్వరుండై నెగడుదువు నినున్ నే భజింతు న్ముకుందా. 230

వ. రుద్రుండుసమీపించి ప్రాంజలి యై. 231

శా. కల్పాంతంబున నీదుక్రోధము సముద్బాధంబు గావింప నో
నల్పం డీతఁడు పీనిపట్ల దగునయ్యా యీాగ్రై నీ సేరిపైఁ
గొల్పం జూపుదు విట్లు నీప్రజలు పీ గ్గోపాల నీపాలనే
నిల్పం జూతురు భక్తి వీరలఁ గృపన్ వీక్షించి రక్షింపవే. 232

వ. దేవేంద్రుండు కృతాంజలిపుటుం డై. 233

మ. అవధా రోకరుణాసముద్ర! గుణభద్రా! సర్వజీవాళికిన్
శివముం గూర్చితి పీహిరణ్యకశిపున్ శిక్షించి రక్షించి తీ
భువనంబుల్ పదునాల్గు సౌఖ్యమునకై పాల్పొందు నీభూస్థలిన్
సవముల్ సాఁగెడు నట్లు చేసితివి నీసామర్థ్య మగ్గించెదన్. 234

వ. ఋషిపుంగవులు చేతు లెత్తి మ్రొక్కుచు. 235

ఉ. ఏది భవత్స్వరూపమును నేర్పడ మాకు నెఱుంగఁ జేయునో
యేది జగద్వినిర్మితికి హేతువ యయ్యెనో యట్టినీజపా

సాదితదివ్యశక్తిఁ గనఁ జాలితి మిప్పుడు దేవదేవ నీ
పాదము లాశ్రయించెదము భక్తుల మమ్ము ననుగ్రహింపవే. 236

వ. పితృదేవతలు వందన మాచరించుచు. 237

మ. కులసంబంధులు మాకుఁ దీర్ఘములలోఁ గొండంచుఁ బిండంబులున్
దిలనీరంబు లొసంగ నీదనుజుఁ డుద్రిక్తుండు మానోరు గొ
ట్టి లఘుత్వంబున నాహరించెడిని మేటిన్ వానిఁ బాటింప కి
ట్టులు జా నేసి జగంబు లేలితి విరాడ్విఖ్యాత! తేజోంచితా! 238

వ. సిద్ధు లరుదెంచి మ్రొక్కుచు. 239

తే. పాపి యీదానవుఁడు తపోబలమువలన
నపహరించెను మాయణిమాదివిద్య
లెల్ల వీని విదారించి యిట్లు మాకు
మాకళల నిడునీకు నమస్కృతు లివె. 240

వ. విద్యాధరులు నమోవాకంబు లర్పించుచు. 241

తే. మామనోధారణమున సంపాదిత మయి
వెలయుచుండునంతర్ధానవిద్య యెల్ల
నిచ్చి తీయపకారిని నిట్లు చంపి
నట్టినీ కిదె వందన మనఘచరిత. 242

వ. నాగులు పరతెంచి చాఁగిల్లి మ్రొక్కి. 243

క. మారత్నంబుల మఱియున్
స్త్రీరత్నంబుల హరించి చియ్య బలసె నీ
క్రూరుని గోళ్ళం జీఱితి
వేరు నినున్ మ్రొక్కుకుందు రీఘునకృతికిన్. 244

వ. అంత మనువులు వచ్చి వినమ్రులై. 245

చ. మనువుల మేము లోకజనమాన్యులమై ప్రచరించువార మీ
దనుజుఁడు సర్వధర్మములు దగ్ధముగా నొనరించి నొంచుటన్
మనముల దుఃఖ మొందుచును మానతి యుంటిమి నారసింహా! దు
ష్టుని దునుమాడి లోకముల చొక్కు వదల్చితి వెంతవాఁడ వో. 246

వ. ప్రజాపతులు నతు లొనర్చుచు. 247

మ. భవదాజ్ఞం గొని మేము సృష్టిని బొనర్పం జాలి యే యంటి మీ
దివమందుర్ మముఁ బట్టి దుష్టుఁడు నిషేధింపంగ నే మిట్టులై
శివముం బాసిన వార మైతిమి జగచ్ఛ్రీవర్ధిలం జేసి తీ
భువనద్రోహి వధించి తిట్టినిను సంపూజింతు మెల్లప్పుడుర్. 248

వ. అనంతరంబ గంధర్వులు గదియ వచ్చి. 249

సువృత్తము. నేము గంధర్వులము మీకథావళు లెప్పుడుర్.
ప్రేమతోఁ బాడుచు ను రేపుమాపును నాడుచుర్
సామగానప్రియుని స్వామినిర్ భజియింతు మీ
తామసుం జంపి తిటు దాన నే లగు నంతకుర్. 250

వ. పిమ్మటఁ జారణు లేటికోళ్ళు వెట్టుచు. 251

మ. అపవర్గప్రదుఁడై నిజాశ్రితుల కానార్తుల్ దొలంగించు నీ
దుపదాబ్జంబుల సేవ సేయుమము నీదుష్టుండు కష్టుం డయో
యుపరోధించెను నొంచె నేఁటికి నుదీయోగ్రాధు లెల్లం దెగెర్
నృపశుం డీత్రిదశాంతకుండు దెగుటర్ నిక్కంబు లోకేశ్వరా. 252

వ. యక్షులు సమక్షంబున మోడ్పుకేలు ఫాలంబునం గీలించి. 253

శా. నీకుర్ గింకరులై మెలంగెడిమముర్ నీచుండు వీఁ డెన్నియో
వాకుర్ వ్రేలుచుఁ బట్టి వాహనములై వర్తింపఁగాఁ జేయుచుర్
వీఁకం గూర్చుచు నుండె నట్టి ఖలునిర్ వీర్యం బవార్యంబు గా
నాకాలుం గొలువంగఁ బుచ్చితివి ని న్నర్థింతు మెల్లప్పుడుర్. 254

వ. అంతఁ గింపురుషులు. 255

తే. నీవు సర్వాంతరాత్మవు నీకు నెట్టి
కార్యమును గష్ట మనరాదు కష్టుఁ డీహి
రణ్యకశిపుఁడు వీనిని రంహముగను
దృణమువలెఁ జీల్చితివి నిన్నుఁ దెలుతు మీశ. 256

వ. పిమ్మట వైతాళికులు వచ్చి వందన మాచరించి. 257

మత్త. లోకరక్షక ! మేము నీదగులోచనాదులె కాక నీ
శ్లోకముల్ మహిమాదికంబులు స్తోత్రపారము సేయుచున్
బాకశాసనముఖ్యభూముల ప్రస్తుతుల్ గొనుచుండు మీ
నాకవైరి వధించి మాదగునాధి తీర్చితి వచ్యుతా. 258

వ. కిన్నరు లన్నరసింహుని సన్నిధికిం జని. 259

క. నీయనుచరులము మమ్మున్
బాయక వేధించి వెట్టిపనులన్ మాచే
జేయించుకొనుచు నుండెన్
మాయించితి వీని నిట్లు మామదు లలరెన్. 260

వ. అనంతరము విష్ణుపార్షదు లగుసునందాదులు సమీపించి సందర్శించి.

శా. మమ్ముం బోలినవాఁడు వీఁడు జయుఁ డోమావల్లభా నీకు బం
టిమ్మాడ్కిన్ జనియించె శాపమున నీ వీరూపముం దాల్చి నీ
నెమ్మిం గల్గినగారవంబునన వీనిం జంపి తీరీతి నం
చెమ్మిం జేసి భజించి మ్రొక్కెదము మానీంద్రాంచితాంఘ్రిద్వయా.

వ. అని యిట్లు బ్రహ్మేంద్రాదులు వినుతించి ప్రార్థించినన్ బ్రసన్న
హృదయుండు గాక రోషభీషణవేషంబున హుహ్వాయని వెట్టనూర్చుచు
సంరంభంబున జృంభించుచుఁ గుంభినివంక మోము వెట్టక నింగివంకం
బెట్టి బెట్టు గర్జిల్లుచున్న యన్నరసింహునిసన్నిధికి నెవ్వరుం బోఁ జాల
రై రప్పు డెప్పుడు ననపాయినియై విష్ణువక్షస్థలవాసిని యైనమంగళ
దేవత దేవతాప్రార్థితయై మగనిచెంతకుం బో నెంచియు దంష్ట్రా
కరాళంబై క్రూరంబై పింగళనేత్రజ్యోతుల భూతలాంతరిక్షంబుల
వెలిగించుచుఁ గాలాంతకయముం గాదనిపించుచందంబున మండిపడు
చున్న నరకంఠీరవునుపకంఠంబునకుం బోయిన నెటు నోయి యెటు
వచ్చునో యని సంశయాకులచిత్తయై తత్తఱంపడుచుండె నాసమ
యంబున బ్రహ్మదేవుఁడు పరమభాగవతోత్తముం డగుప్రహ్లాదుని
చెంగటికిం జని వత్సా యని పిలిచి బుజ్జగించుచు ని ట్లనియె. 263

శా. క్రుద్ధుండై నరసింహమూర్తి మిగులన్ ఘోరాకృతిం బూని బ
ద్ధౌద్ధత్యంబును బాయఁ డయ్యె జగముల్ హాహాకృతుల్ చేసెడిన్
వృద్ధుల్ బుద్ధిమదగ్రగణ్యులు బుధుల్ వేవేలు ప్రార్థించినన్
వృద్ధిం బొందెడుఁ గాని క్రోధము గనంతే శాంతి లే దయ్యయో.

ఆ. భక్తులందుఁ బ్రీతి భగవంతునకు మెండు
భక్తుఁడవును బరమభాగవతుఁడ
వీవు దేవదేవు భావించి సేవించి
శాంతుఁ డగువిధంబు సలుపు మన్న. 265

వ. అనిన నౌఁ గాత మని సర్వలోకజనాహ్లాదుం డగుప్రహ్లాదుండు నిటల తటఘటితకరపుటుండై హరిసన్నిధికిం జని సాష్టాంగదండప్రణామం బాచరించె నంత నారసింహుండును. 266

మత్త. పాదమూలమునందు వ్రాలిన బాలు సద్గుణశీలుఁ బ్ర
హ్లాదునిం గని లోఁ గృపారస మావహిల్లఁగ నల్లనన్
మోద మేర్పడ లేవ నెత్తి ప్రభూతభీతిముఖంబునన్
బ్రోదిగాఁ గవివామహస్తము మోపె వానిశిరంబునన్. 267

వ. అంతఁ బ్రహ్లాదుండును హరికరస్పర్శంబునఁ బరబ్రహ్మసాక్షాత్కారంబు వడసి మేనఁ బులకలు గ్రాలఁ గన్నుల నానందాశ్రులు రాలఁ బరమేశ్వరుని పాదపద్మములు హృదయంబునం దిడుకొని వినయవినమితగాత్రుండై చేతులు దోయిలించుకొని గద్గదస్వరంబుతో ని ట్లని ప్రార్థించె. 268

—♦ ప్రహ్లాదుఁడు నరసింహుని స్తుతించి ప్రార్థించుట ♦—

కళ్యాణివృత్తము.

పాపశిక్షకా నతభక్తరక్షకా పరాత్పరా వరాక్షరకా పాపశిక్షకా
ఆపదుద్వహాజగదాదిభూర్వహాహతారిగేహాకోమలదేహామహామహా
శ్రీపతీ సతీపతిసేవితోన్నతీ శ్రితార్తిభంజనేష్టమతీ శిష్టహృద్గతీ
దీపికోపమాధికతేజఉద్గమాస్థిరోద్యమారమానుగమా తేనమోనమః

మ. నిను బ్రహ్మాదు లెఱుంగఁ జాల రనినన్ నే నెంత మూఢాత్ముఁడన్
మునిలోకాహితవంశసంభవుఁడ దుర్బుద్ధిన్ సుపర్వాగినం
దనుఁడన్ బాలుఁడ గాలభావుఁడ జగన్నాథా! భవద్భక్తి లోఁ
గొని వర్తించెదువాఁడఁ గాన దయఁ జేకొంచుం గటాక్షింపవే. 270

మ. నిను సంతుష్టునిఁ జేయ భక్తి యది యెంతేనిం బ్రధానంబ యా
ధనముల్ జన్మము సుందరత్వము తపోధర్మంబు పాండిత్యముల్
ఘనతేజంబును బుద్ధి పౌరుషము లోగం బొల్చునెన్నని కా
వనుచు న్నిదుగజేంద్రమోక్షణమె సాక్ష్యం బిచ్చు నిప్పట్టునన్. 271

సీ. ధర్మంబు సత్యము దమమును శ్రుతమును
దానము యజ్ఞము ధైర్యగరిమ
శమ మనసూయ లజ్జయు నమత్సరమును
వ్రతము నాఁ బడియెడు పదియు రెండు
గుణములు కలిగినకోవిదుం డైనను
నీపాదవిముఖుఁడై నెగయువాఁడు
బ్రాహ్మణోత్తముఁ డైనఁ బరగఁడు నీయందుఁ
బ్రాణంబు మనమును వాక్కు నిలిపి

తే. సేవ సేయుచండాలుఁడే శ్రేష్ఠుఁ డగుచుఁ
దన్నుఁ దనకులమును బవిత్రముగ వాఁడు
సలుపఁ జాలును విప్రుఁడు చాలఁ డొక్క
తన్నయినఁ బవిత్రుగ సల్పుదాని కరయ. 272

తే. ఈవు వాంఛింపఁ దగినది యెదియు లేదు
నీకుఁ గలవెల్ల వాంఛలు నీవు భక్త
పూజలను స్వీకరింతువు పురుషవర్య
వారిలాభమునకె యన వచ్చుఁ గాదె. 273

మత్త. నీకు లెంకల మేము మావలె నే హరాజముఖామరుల్
భీకరం బగునీదురూపము వెల్గు చూచి భయంబునన్

శోక వ్యాపదపించుచుండిరి సూర్యచంద్రదృగంచితా
కాంక వీడి యనుగ్రహింపు మికన్ వరాభయహస్తమున్. 274

పద్మనాభవృత్తము

దుష్టారులం ద్రుంచి శిష్టాళ్యులం బెంచి
తుష్టిన్ జగం బేర్పడం జేయునిచ్ఛన్
బుష్టిం బ్రవర్తిల్లుమత్స్యాదిరూపప్ర
భూతుండవై భూతధాత్రీస్థలోద్య
త్కష్టంబులం దీర్చి కావంగఁ బ్రోవంగఁ
దళ్కొత్తుచున్నాఁడ వి స్పైనరూపం
బిష్టార్థసంసిద్ధినిం బొంద నై యుండె
నింకం బ్రశాంతిం గొనం జెల్లు దేవా. 275

స్రగ్ధర. నాతండ్రిం జంపుదానన్ సకలజగములన్
శాంతి చేకూఱె లోకుల్
ప్రీతిన్ సౌఖ్యంబుఁ గొండ్రన్ వివిధవిధములన్
వేడుకల్ విస్తరిల్లన్
భూతుల్ వర్ధిల్ల బిడ్డల్ పొలఁతులు పొలముల్
పోడిమిం బొంద దీవ్య
త్ఖ్యాతిన్ వర్తించుచున్నా రనఘచరిత! యు
గ్రాకృతిన్ వీడు మింకన్. 276

క. దుష్టులను జంపి జగముల
కష్టంబులు దీర్ప నిట్లు కన్పట్టినఁగా
శిష్టగతిఁ గాక యింకొక
కష్టంబును గూర్చునట్లు గానఁగ వచ్చెన్. 277

తుక్మవతీవృత్తము.

పాములుఁజంపం బాపము లేన, ట్లీమహోఁ గూరున్ హింస యొనర్పన్
వేమఱునిన్నున్ విజ్ఞులుమెత్తుర్, సామమెసంగన్ శాంతిలు మింకన్.

సీ. భయపడుచున్నయీ బ్రహ్మాదులభయంబు
దీర్చి పంపుము వారి దేశములకు
నీరూప మభయము నెలకొల్పుటక యగుఁ
గావుత మని కోరు దేవగణము
లతిభయంకర మగునాస్యమున్ నాలుక
ఖరకరునిం బోలుకన్నుఁ గవయు
భీకరదంష్ట్రిలు బ్రేవులమాలికల్
కీలాలమునఁ దేలు కేసరములు
తే. దిగ్గజంబులఁ జీల్చఁజాల్ తీక్ష్ణనఖము
లట్టహాసములు కహాకహార్భటులును
బ్రహ్మా లంతలకును భీతి పరఁపుచుండెఁ
గాన శాంతింప వేఁడుదుఁ గమలనాభ. 279

ద్విపదము. నీరూపమును జూచి నే భయపడను
ఘోరమై పరమాంధకూపముం బోని
సారహీన మగుసంసారముం జూచి
తీరనిభయము మదిం బొందుచుందు
నే నెవరో యని యెఱుఁగంగ లేక
నేను నాయది యనునిరతవిభ్రాంతిఁ
బూని బద్ధుఁడ నయి పొలుపఱి యుంటిఁ
గాన నాభయమును గడతేర్పు మీశ. 280

శా. నీపాదంబులనీడ నెప్పుడు నన్ నిల్పం గటాక్షింతు వో
సోపాపంబుల కంతు లే దెప్పుడు నా నాకష్టము ల్పొందుచున్
రూపింపం బడి కర్మబంధముల సంయుక్తుండ నై యుంటి నన్
గాపాడం గలవాఁడు లే డొరుఁడు నీకంటెన్ జగద్వల్లభా. 281

ఉ. భక్తుఁడ నంచు నావయిఁ గృపం బొదలించితి వేని నిత్యసం
సక్తుఁడ నై ప్రసాదము పొసంగఁగఁ జేయుచు నీదు దాస్యమున్

ముక్తికిఁ దావలం బగుట మోదముతో దయచేసి ప్రోవు మే
ద్భక్తమనోవ్యథుండనయి తావకపాదము లాశ్రయించెదన్. 282

సీ. తల్లిదండ్రులరక్ష తగ నున్న బాలుఁడు
నీకటాక్షము లేక నిలువ లేడు
మంచిమందులు తిన్న మహి రోగి నీకృప
లేకున్న నీరోగి కాక యుండు
జలధి నావలు చాలఁ గలిగిన జనుఁడు నీ
జివ లేక పారముఁ జేర లేడు
సాధనము ల వెన్నొ సమకూర్చిన దేహి
నీకృప లేక సిద్ధిఁ దాఁక లేడు
తే. నాకు నేసాధనంబులు లేక యుండు
నుండినన్ వానిఁ గోరి నేనుండ నెపుడు
లోకరక్షక ! నీకృపాలోకనమ్మె
నాపయిం బాఱఁ జేయు మోనాహృదీశ. 283

వ. దేవా! నీమాయ జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు పంచప్రాణములు మనస్సు పదియాఱు వికారము లనునరములు గల్గినసంసారచక్రమునం బడ వైచి నన్నుఁ ద్రిప్పుచున్నది నే నిందు ముప్పతిప్పలం బడుచున్నవాఁడ నీమఱువు సొచ్చితి నన్ననుగ్రహింపు ముద్ధరింపుము నీ కిదే నమస్కారము. 284

సీ. ఇంద్రవైభవము నా కివ్వని నే వేఁడ
నశ్వరముం దుచ్ఛ మైశ్వర మది
నీపార్శ్వముల కగు నెలవు నేఁ గోరెద
నా కిమ్మే దాని నోలోకనాథ
మృగతృష్ణలం బోలు సుగములు రోగాల
పుట్ట దేహము వీనిఁ బొందఁ దలఁప
గమలాసనాదిశీర్షములకుఁ గానినీ
హస్తము నాశీర్షమందఁ గలిగె

తే. నేఁ గృతార్థుఁడ నైతి నిప్డిపుడె యనుచుఁ
దలఁపఁ దల్లిగర్భమునందు మెలఁగునపుడె
నారదునిచేతఁ దత్త్వము నా కెఱుంగఁ
జేసి ప్రోచితి కాదె లక్ష్మీకళత్ర. 285

మ. నిను రక్షించెడు వాఁడు లే డెవఁడు గానీ యంచు నాతండ్రి చే
తను ఖడ్గంబు ధరించి చూపు మెటనే తా నున్న లేకున్న నీ
దును మున్నాకరవాల మం చనియె లో దోర్దర్పముం జూపుచున్
గనుఁగో ని ట్లరుదెంచి ప్రోచిననినున్ గైమోడ్చి ప్రార్థించెదన్. 286

సీ. సకలచరాచరాత్మకజగం బంతయు
నుపసంహరించి నీ వొక్కరుండ
యోగనిద్రాశక్తి నుండియు సృష్టి క
న్ముఖుఁడ వైనప్డు నీబొడ్డునుండి
కమలము పుట్టె నాకమలంబులో బ్రహ్మ
పొడమి నిన్ దెలియని వెడఁగ యగుచు
నూఱేండ్లకాల మావారిలో మునుఁగుచుఁ
దేలుచు నీజాడ తెలియ లేక

తే. అవలఁ దనుఁ గన్నపద్మము నాశ్రయించి
గాఢతరతపం బొనరించి క్షమను జేరి
గంధ ముండు కైవడిఁ దనకాయమందె
కలసి యుండిననినుఁ జూడఁ గలిగె నపుడు. 287

మత్త. వేయి మోములు వేయి చేతులు వేయి శీర్షములున్ గనుల్
వేయి పాదములుం గరంబులు వేనవే లగుకైదువుల్
శ్రేయ మొప్ప ధరించి పొల్చెడుశ్రీవరి న్నినుఁ గాంచి య
త్యాయతం బగుసంతసం బది స్వాంతమందునఁ బొందుచున్. 288

తే. బ్రహ్మణునకును హయగ్రీవరూపమునను
గానఁ గా వచ్చి సృష్టినిఁ గలుగఁ జేయు

మనుచు వేదము లర్పించి యప్పుడు మధు
కైటభులఁ ద్రుంచి సృష్టి కాఘనుఁడ వీవు. 289

క. నీమత్స్యాద్యవతారము
లీమహి ధర్మంబు నిలుపునీహాన్ వెలసెన్
నీమహిమఁ బొగడ వశమే
కామితమందార నీకుఁ గైమోడ్పు లివే. 290

ఉ. నాలుక రుచ్యవస్తువుల నాశను వీనులు దుష్కథల్ వినన్
వాలుఁగనుల్ మనోజ్ఞముల వస్తువులం గన ముక్కు గంధముల్
గోరిలఁగ లాగెడిన్ మదినిఁ గొంతయు శాంతి లభింప నట్లిలన్
గోలలు పెక్కు రామగనిఁ గూడి శ్రమంపడఁ జేయునట్లుగన్. 291

చ. మునులు వివిక్తదేశములు పొంది తపించి యొకళ్లు మాత్రమే
కొనకొని ముక్తినొందుటకుఁ గోరుదు రే నటు గాక ముఖ్యులౌ
జనులును నేను ముక్తిగొన స్వాంతము చేయుదు నోయి రక్షకా
మనమును వాక్కు కాయ మొకమాడ్కిగఁ బెట్టెద నీకు భక్తుఁడన్.

తే. గుల యయిన దాని గోళ్ళతో గోఁకి కొనఁగ
సుకముగా నుండిన ట్లయి సుదకు బాధ
కగునటులు మిథునాదులు వ్యసనదములు
వానిఁ దవిలి వైరాగ్యము వడయు టఱిది. 293

తే. నీనమస్కృతి నీనుతి నీదుపూజ
నీదయినపదధ్యానము నీదుసేవ
నీకథాశ్రవణంబును నెమ్మిఁ జేసి
భక్తిఁ గలవాఁడు ముక్తినిఁ బడయు దాన. 294

వ. ఇట్లు ప్రహ్లాదుండు శ్రీహరిగుణవర్ణనంబు గావించిన విని నరసింహమూర్తి సంతుష్టాంతరంగుండై దైత్యబాలకుం గాంచి యి ట్లనియె.

—♦ నరసింహమూర్తి ప్రహ్లాదు ననుగ్రహించుట ♦—

మత్త. నేను నీకుఁ బ్రసన్నుఁ డైతిని నెమ్మి మర్త్యులకోరికల్
బూని చేయఁ దలంచి యుంటిని బుణ్యబాలక! నీ విఁకన్

మానసంబున నున్న కోర్కులు మాన కిత్తు వరింపుమా
నేను నీపయిఁ బ్రేమ ముంచితి నీవు పుట్టక పూర్వమే. 296

వ. అనినఁ బ్రహ్లాదుఁ డావరంబులు తనభక్తియోగంబున కంతరాయ
మాపాదించు నని తలంచి కొంచెము నగి నరహరికి నమస్కరించుచు
ని ట్లనియె. 297

సీ. కామాదులం జిక్కి కదల లేకుండిన
నాకు వరము లిత్తుఁ గైకొను మని
పలికి తాశంజేసి బద్ధుఁ డౌవానిఁ గాఁ
జేయఁ దలంచుట న్యాయ మగునె
కర్మబద్ధునిఁ జేయఁ గడఁగకు మోదేవ
నీపాదసేవచే నేను నాదు
నాశ లన్నియుఁ ద్రెంపఁగా శక్తి గలవాఁడ
నయితి నంచును మోద మందుచుంటి

తే. నేను నీపయి భక్తిని నెఱపుచుంటి
నీ వొసంగినవరములు నేను గొంట
కొన్ని వస్తువు లిడి మఱి కొన్ని గొనెడు
వర్తకునకు నాకును భేదపథము గలదె. 298

సీ. సేవించి వరములు చేకొన్నవాఁడు భృ
త్యుండు గాఁడట్టిభృత్యునివలనను
బ్రతిఫలం బందినప్రభువు ప్రభువు గాఁడు
కాన ఫలాపేక్ష కాక యుండ
సేవ యొనర్చుట సేవధి వని కాదు
తృష్ణ నా కింతయుఁ దెలియ లేదు.
నీ కెట్టిచిత్తము నాకొఱ కయ్యెనో
యీవేళ దాని కే నేమి యందు

తే. ప్రభువ విచ్చెద నంటివి వరము నేను
వల దనఁగ రాదు కోరెద వరద! నాదు

మదినిఁ గోర్కులు పుట్టనిమాద్రి వరము
నా కొసంగుము కరుణించి నతి యొనర్తు. 299

వ. అని విన్నవించినఁ బ్రహ్లాదునకు నరహరి యి ట్లనియె. 300

సీ. నీవంటిభక్తులు సేవించుచు నొకప్పు
డైన నే వరముల నడుగఁ బోవ
రైన నే వరముల నీ నెంచితి న్నీకు
రాక్షసాధిపతివై రమణ మెఱసి
సుఖము లనుభవించుచును ధర నొక్కమ
న్వంతరకాలము వఱకు మనుము
నాకథామృతము పానము సేయుచును భక్తి
యోగమునఁ గొల్చుచుండు నన్ను

తే. "విష్ణవ ఇద న్న మమ" యంచు విష్ణునవము
లాచరింపుము సుఖముల ననుభవించి
వెనుక సంసారబంధము విడి వడంగ
మోక్షసామ్రాజ్యలక్ష్మిని బొంద రమ్ము. 301

వ. వత్సా! నీ వొనర్చినస్తవరాజముపఠించినవారు కర్మబంధవిముక్తిం
గాంచఁ గల రనినఁ బ్రహ్లాదుండు తండ్రీ! నాతండ్రి సర్వలోకేశ్వర
ణ్ణుఁడ వైనని న్నెఱుంగఁ జాల కపరాధంబు గావించి మహాపాత
కంబు గణించె వానిపాపంబు పాయం జేసి ముక్తుం డగునట్లు వరం
బొసంగు మని పుత్రుండ నగుటం జేసి ప్రార్థించుచుంటి ననిన భగ
వంతుం డాప్రహ్లాదునిఁ గరుణాకటాక్షవీక్షణంబులం దనుపుచు నభయ
హస్తం బొసంగి. 302

ఉ. భక్తుఁడ వీవు నిన్ గనినవాఁడును భక్తుఁడ కాన వానికిన్
ముక్తి నొసంగితిన్ దనుజపుత్రుఁడ నే నని చింత దక్కు మీ
పావిత్ర్యపుణ్యకర్మమున భాగవతోత్తముఁడై జనించి తీ
వుక్తు లిఁ కేల మత్పదము నొందెద నవ్వలికాలమం దొగిన్ 303

వ. మఱియు నోకుమారా ! పరమభాగవతుండ వైననీవు జన్మించుటం జేసి దితివంశంబు దశపూర్వదశాపరంబు లగుతరములవారితోఁ గూడ నీ జనకుండు పవిత్రుం డయ్యె సర్వభూతహితరతు లగునాభక్తు లున్న దేశంబులం గలమ్లేచ్ఛులును బునీతు లగుదురు. నీవు సర్వభక్తులకు నగ్రేసరుండవై వర్తింతువు గాక మఱియు నాశరీరసంస్పర్శనంబునం జేసి పరమపవిత్రుఁ డైననీతండ్రికిఁ బ్రేతకార్యంబు నిర్వర్తింపుము నీ వింక దానవరాజ్యాధిపతివై ప్రజాపాలనంబు గావింపు మనినఁ బ్రహ్లాదుండు భగవంతుండు చెప్పినచొప్పునం బ్రవర్తించె నపుడు బ్రహ్మదేవుండు దేవదేవునిఁ దరియ వచ్చి నమస్కరించి యి ట్లనియె. 304

సీ. కష్టాత్ముఁడు హిరణ్యకశిపుఁడు కడతేఱె
లోకసంతాపము లోఁగి పోయె
నావరంబునఁ జేసి యీవాసి గాంచెను
సకలధర్మంబుల సమయఁ జేసె
నఖిలజనాహ్లాదుఁ డైనప్రహ్లాదుఁడు
చాకుంట కెంతయో సంతసంబు
నారసింహాకృతి నారయువానికి
మృత్యుభయము లేమియే నిజంబు

తే. అనినఁ బరమేష్ఠిఁ గని హరి యనియె నోయి
పాములకుఁ బాలుపోసినపగిది నూవె
ఖలులకు వరంబు లిచ్చుట కాన నింక
నిట్టివరముల నేటికి నీకు మయ్య. 305

వ. అని నారసింహరూపం డెల్లరు చూచుచుండఁ దిరోహితుం డయ్యె నవ్వేళఁ బ్రహ్లాదుండు బ్రహ్మాదుల కభివందనం బాచరించి పూజించె వారును వానిపూజలను స్వీకరించి మునిగణపరివృతులై ప్రహ్లాదుని దైత్యాధిపతిగఁ బట్టభద్రుం గావించి తమతముపొందుపట్లకుం జని రని చెప్పి నారదుండు ధర్మరాజా ! జయవిజయు లిట్లు హిరణ్యాక్షహిరణ్యకశి

పుత్రులై పుట్టి వరాహనరసింహావతారములచే హతులైరి వారే రావణ కుంభకర్ణులై పుట్టి రామునిచేతం దెగిరి వార వెండియు శిశుపాలదంత వక్త్రులై పుట్టి కృష్ణునిచేతఁ గూలిరి. వీ రందఱు విద్వేషంబున ముక్తిం బొంది రని మఱియును భక్తిజ్ఞానవైరాగ్యంబులును హరిమాహాత్మ్యంబును బరమేశ్వరునద్భుతచర్యలుం గలయీప్రహ్లాదచరిత్రము నీకుం జెప్పితిని దీనిం బఠించువారు వినువారును బరమభాగవతోత్తములై యుత్తమలోకంబులం బొందుదు రని చెప్పి నారదుండు ధర్మరాజు దెసం గాంచి మఱియును. 306

మ. ప్రచురప్రక్రియ సర్వలోకములు పెంపం ద్రుంపఁ గల్పింప నా
సుచరిత్రుండు రమాకళత్రుఁ డగుకృష్ణుం డిష్టవరిష్ఠుఁడై
సచివుండై సఖుఁడై సహాయుఁ డయి విశ్వాసార్హుఁడై బంధువై
సుచిరాప్తుం డయి నీయెడన్ మెలఁగు నీస్తోమంబు సామాన్యమే. 397

క. నానావిధశక్తులకున్
స్థానం బగునీశ్వరుండు శర్వునకు యశం
బానాడు గలుగఁ జేసెన్
దా నామయు మాయ నడఁచి తాత్పర్యమునన్. 308

—♦ త్రిపురాసురసంహారము ♦—

వ. అనిన ధర్మనందనుండు నారదుం గాంచి మునీంద్రా! నా కావృత్తాంతంబు చెప్పు మనిన నతం డతని కి ట్లనియె. 309

తే. మయుఁడు దానవశిల్పి పూర్వయుగమందు
గలఁడు దైత్యుల కోటమి గలిగినపుడు
బలము గలిగించి దేవళ్ల గెలుచునట్టు
చేయుచుండు నమ్మృతిమును జేసి మున్ను. 310

సీ. మయుఁడు వారలకోర్కి మై పైడితో వెండి
తోడ నినుముతోడ మూఁడు వీండ్లు
చేసి వారల కిచ్చె భాసురములు కామ
గము లవ్వి వానిపైఁ గడక నెక్కి

దేవవారముతోడ దిగ్గేశములు గెల్చి
గంటఃమిగిలి వారు కాన రాక
పూర్వవైరము నెంచి గర్వించి యున్నచో
వేలుపు లుగ్రునిపాలి కరిగి
తే. విన్నపము చేసి రక్షింపు మన్న నతఁడు
వల్లె యని పోయి వాలమ్ము లల్ల వీండ్ల
పైఁ బ్రయోగించె నయ్యవి వహ్ని వోలె
మండుచును వానిపైఁ బడి మాడ్చి వైచె. 311

వ. దానంజేసి త్రిపురంబులం గలదైత్యదానవులు మృత్యుముఖంబునం
బడిన వారినెల్ల మయుండు తనప్రభావంబున నిర్మితకూపామృతరసం
బునం బడవేయుటయు వా రాసిద్ధామృతసేచనంబునం జేసి పునర్జీవి
తులై యుద్ధంబునకు సిద్ధం బగుచుండి రట్టిసమయంబున. 312

మ. భూతేశుండు భయాభిభూతుఁ డగుచున్ పో ల్పేది నారాయణుం
జేతోవీథిఁ దలంప నోడ కని లక్ష్మీవల్లభుం డంత గో
వై తా నబ్జభవుండు లేగ యయి తత్ప్రాంతంబునం గల్గుకూ
పాతీతామృత మెల్లఁ ద్రావె వడి మృత్స్నాంశౌవ శేషంబునన్.

వ. అంత నమ్మహాపురుషుండు. 314

సీ. తనదుశక్తిం జేసి ధరణీతలంబును
సంగ్రామరథము గా సంతరించి
నాల్గువేదంబుల నాల్గుగుఱ్ఱములు గాఁ
గల్పించి విధి సూతుగా నమర్చి
బంగారుకొండను రంగారువిల్లు గా
నహిపతి మౌర్విగా నాచరించు ~
తాను మహోగ్రాగ్నిదైవతబాణమై
శివునకుఁ బొడసూపి చెప్ప నతఁడు
తే. రథికుఁడై ధనుర్బాణముల్ రభసమునను
దాల్చి తా శక్తిరూపుఁడై పెల్చఁ ద్రిపుర

ములను గడ తేర్చి వ్రేల్మిడి పురహరుండు
నాఁగఁ బేరంది ప్రఖ్యాతి నాఁగ నొప్పె. 315

వ. ఇది యంతయుఁ గృష్ణానుగ్రహసంపాదితవిజయం బని యెల్ల లోకం
బులును సంతసించె దేవతలు పుష్పవర్షంబు గుఱిసి రో రాజా!
మఱియు నేమే నడుగవలసిన దున్న నడుగ మనిన నతండు వర్ణాశ్రమ
ధర్మంబులును భక్తియోగంబునం జేసి పరమపురుషసాక్షాత్కారము
గలిగించుకొనుమార్గంబులును నాకుం దెలియఁ జెప్పుము. 316

చ. కొడుకులలోన నీవు కడుఁగూర్చుకుమారుఁడ వెన్న బ్రహ్మ కా
తఁడు మఱుఁగుల్ సమస్తము నుదారమతిన్ వచియించు నీకు నీ
యెడద నెసంగుధర్మములు నేరి కెసంగవు సత్తపంబుచే
వడలినవాఁడ వే నిల భవద్దయ కైతినిఁ బాత్రభూతమై. 317

వ. అనిన నారదుండు నారాయణు నంతరంగంబునం దలంచి నమస్కరించి
పాండవాగ్రజా! నాకు నారాయణుం డుపదేశించిన తెఱంగున నెఱిం
గించెద నాలకింపు మని యి ట్లనియె. 318

సీ. నారాయణుండును నరుఁడును దక్షపు
త్రిక యగుమూర్తి యన్ దేవియందు
ధర్మునివలన నుదయ మంది సర్వలో
కక్షేమమును గోరి కడక బదరి
కాశ్రమంబునఁ దప మాచరించుచు నున్న
వా రిప్పటికి నందు వరదుఁ డైన
నారాయణుఁడు వేదసారరూపుఁడు గాన
వేదధర్మము లెల్ల విఱియఁ జేసె

తే. అట్టిధర్మములున్ స్మృతు లందు వెలయు
ధర్మములు నీకుఁ జెప్పెదఁ దవిలి వాని
మార్గము లవన్నియును భక్తిమార్గమునను
గలియఁ గూర్చి వినుమని పలికె మౌని. 319

—♦ వర్ణాశ్రమ ధర్మ కథనము ♦—

వ. సత్యము దయ శౌచము తపము తితిక్ష వివేకము శమము దమము జయము అహింస బ్రహ్మచర్యము త్యాగము జపము ఋజుత్వము యథాలాభసంతుష్టి మహాత్మసంసేవనము ప్రవృత్తికర్మానాచరణము దుష్టచేష్టానవలంబనము మితభాషణము ఆత్మతత్త్వపరిశీలనము భూతాన్నదానము భూతాత్మదర్శనము సర్వమానవదేవతాబుద్ధి పరమేశ్వరగుణగణవిచారము పరమేశ్వరనామసంకీర్తనము పరమేశ్వర విభూతిస్మరణము పరమేశ్వరనమస్కారము పరమేశ్వరసేవ పరమేశ్వర దాస్యము పరమేశ్వరస్నేహము ఆత్మసమర్పణము లోనగునవి సర్వజనాచరణీయధర్మంబులు త్రింశల్లక్షణలక్షితంబులు వీనివలనఁ బరమేశ్వరుఁడు సంతసించు నని మఱియును. 320

సీ. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మూవురు
ద్విజసంజ్ఞ గల రయి వెలయు చుండ్రు
వారిధర్మంబుల వరుసతో వివరింతు
నాధానముఖ్యము లవి పదాఱు
సంస్థిజునకు వివాహ మ్మొకఁ డగుఁ గాన
వారు పొందరు ద్విజత్వప్రసిద్ధి
జన్మకర్మములచే స్వచ్ఛతం గాంచిన
వారు ద్విజులు గాన - వారలకును

తే. యాగ మధ్యయనము దాన మాది యైన
కర్మములు విహితమ్ములై కమలగర్భ
నిర్మితంబులు వానినిఁ గర్మఠు లయి
సలుపుచుండఁగ వలయు నీక్ష్మాతలమున. 321

వ. అందు బ్రాహ్మణునకు యజన యాజ నాధ్యయ నాధ్యాపక దాన ప్రతిగ్రహంబు లాఱును విహితంబులు క్షత్రియునకుఁ బ్రతిగ్రహము తక్క నితరము లైదును ధర్మములు యాజ నాధ్యయన ప్రతిగ్రహ

ములు బ్రాహ్మణునకు జీవనోపాయములు క్షత్రియుఁడు వాని నపే
క్షింప నొప్పదు ప్రజాపాలనాధికారము గలక్షత్రియుఁడు బ్రాహ్మణే
తరులనుండి కరంబు గ్రహింప నొప్పు నది వానికి జీవనోపాయం బగు
వైశ్యుఁడు వ్యవసాయవర్తకములవలన జీవింప నగు శూద్రుఁడు పై
వారి నాశ్రయించి జీవింపఁ దగు నిట్లు కానిచో వృత్త్యంతరములును
గల వాకర్ణింపుము. 322

సీ. విప్రునకుం గృషి వినయపూర్వకయాచ్ఞ
గోరక్షణము దేశపారవశ్య
ముంఛవృత్తియు నాపదుక్తధర్మంబులై
యొక్కదానికి మఱి యొక్కఁ డెచ్చు
విహితంబు లగునట్టి వృత్తులచే జీవ
నము సల్ప లేనప్డు నరపతులకుఁ
దక్కనందఱకును దగు నన్ని వృత్తులు
ప్రత్యవాయము దాన రాదు తెలియ

ఆ. క్షత్రియునకుఁ బ్రజలసాకేడువృత్తియు
విప్రునకును యాజనప్రవృత్తి
దొరకనపుడు వారు మఱి కొన్ని వృత్తుల
జీవనంబు చేయఁ జెల్లుఁ జూవె. 323

వ. ఆవృత్తులు ఋతము నమృతము మృతము ప్రమృతము సత్యామృతము
శ్వవృత్తి యనంబడునవి యట నటం బడియుండుధాన్యాదు లేరి తెచ్చు
కొనుట ఋతము యాచింపకుండ వచ్చినవి యమృతము నిత్యయా
చనవలన లభ్య మైనది మృతము దున్నుకొనుట ప్రమృతము వాణి
జ్యము సత్యామృతము నీచసేవ శ్వవృత్తి యని చెప్పంబడు వీనిలో
నీచసేవ యధమాధమంబు బ్రాహ్మణుఁడు సర్వవేదమయుఁడు క్షత్రి
యుఁడు సర్వదేవమయుం డగుటం జేసి నీచసేవ సేయ నొప్పదు
మఱియు నీనాల్గుజాతులవారికిఁ గొన్ని కొన్ని ప్రత్యేకలక్షణంబులు
గల వందు శమము దమము తపము శౌచము సంతోషము క్షమ

యార్జవము జ్ఞానము దయ సత్యము భగవదాసక్తియు బ్రాహ్మణ
లక్షణములు శౌర్యము వీర్యము ధైర్యము స్నేహము త్యాగము
దేహధర్మనిరసనము సహనము బ్రహ్మకులానుసరణము ప్రసాదము
ప్రజాపరిపాలనము ననునివి క్షత్రచిహ్నంబులు దేవతలను గోవులను
జ్ఞానవృద్ధులను వృద్ధులను గురువులను భక్తితోఁ జూచుటయు ధర్మా
ర్థకామపరితుష్టియుఁ బరలోకబుద్ధియు నిత్యధనార్జనప్రయత్నమును
వైశ్యచిహ్నంబులు వర్ణత్రయవినయంబును స్నానాదిపరిశుద్ధియు
నిష్కపటస్వామిసేవయు దొంగతనము లేకుండుటయు సత్యవచనము
గోవిప్రరక్షణంబును శూద్రలక్షణంబు లని మఱియు. 324

మ. పతి దైవంబుగ నెంచుచుఁ సతము సేవం జేయుచుఁ బంధుసం
తతిపై మైత్రియు బ్రాహ్మణార్చనము నిత్యప్రార్థనంబుల్ పతి
వ్రతకుఁ ముఖ్యము లైనలక్షణము లాపద్మాస్య యిట్లాడ్చి శు
భ్రిత గల్గం బొనరించి తాను శుచియై వర్తింపఁగా నొప్పెడుఁ. 325

సీ. సిరుల కావాసమై పరఁగునట్టులు దీర్చి
తా వస్త్రభూషలు దాల్చి పతికి
హితము గూర్చును సతి సతతము వినయంబు
దమము శమమును సత్యమ్మును బ్రియ
వచనము గలిగి సర్వము నిర్వహించుచు
నిలు దీర్చుచుఁ భోగములను సతము
బుద్ధి నిల్పక ధర్మబుద్ధియు శ్రద్ధయు
జాగరూకతయు నచ్చంపుగుణము

తే. గలిగి వర్తించుచును భక్తిఁ గలసి మెలసి
పాపకృత్యము లని తోఁచువాని విడిచి
నిజకులోచితధర్మముల్ నెఱపుకొ నెడు
నట్టిసాధ్వి మహాలక్ష్మి యనఁగ నొప్పు. 326

తే. వసుధ సంకరజాతులవార్ కులక్ర
మాగతము లైనవృత్తులనే గణింప

వలయుఁ జౌర్యాదివృత్తులు గలిగి యున్న
వాని వారు విసర్జింప వలయు నెపుడు. 327

సీ. తనకులధర్మమే తగు నాచరింపఁగ
నట్లు చేయుచును గ్రమ్మానుగతిగఁ
బుణ్యపాపాదికములు కర్మములు విడి
ముక్తి సులభముగాఁ బొంద వచ్చు
సతతము సస్యసంగతిఁ జేను నిస్సార
మయి పండు టుడిగినయట్లు నిరత
కామానుభవమును గలుగుటచే విర
క్తమ యయి చిత్తము దాని నాస

తే. సేయకుండి యీశ్వరసేవ సేయ నెంచు
వాని కప్పుడు మోక్షము వచ్చు బ్రాహ్మ
ణాదిజాతులకు శమదమాదిధర్మ
ము లవి ప్రముఖము లనియును దెలియవలయు. 328

వ. ఇవి వర్ణధర్మంబు లింక నాశ్రమధర్మంబు లెఱింగించెద నాలకింపుము బ్రహ్మచర్యము గార్హస్థ్యము వానప్రస్థము సన్న్యాసము ననునీనాల్గు నాశ్రమము లిందు బ్రహ్మచారి గురుకులంబున నుండి శాంతుఁడై సౌహార్దంబున శుశ్రూషగావించుచు సాయంప్రాతఃకాలముల గుర్వగ్నిసూర్యుల నుపాసించుచు గాయత్రిని జపించుచు నధ్యయనము చేయ వలయును మఱియు నతండు మేఖలను నజినమును జటాయజ్ఞోపవీతములను దండకమండలువులను దర్భపవిత్రంబును ధరించి యుండ వలయును. 329

సీ. ప్రతిదినంబును భిక్ష పచరించి తెచ్చిన
భిక్ష గురువునకు విసిచి దానిఁ
దదనుమతిం దిని తగినంత మితముగాఁ
గలిగి సదాచారగరిమఁ దనరి
శ్రద్ధానుండయి చదివి గురూక్తముల్
వేదశాస్త్రాదులు వివిధములును

నవయవముల గెల్చి యన్ను మిన్నలకతల్
వినఁగఁ బోవక వానిఁ గనఁగఁ బోక
తే. వారు తలదువ్వఁ దలయంట వలవ దనుచుఁ
బలుకుచు నిషేధ మొనరింప వలయు నతఁడు
నెలఁత దవవహ్ని పురుషుఁడు తెలియనాజ్య
ఘటము ద్రవియింపకుండదు కలసె నేని. 330

వ. ఇట్లు స్త్రీసంగమము విడుట బ్రహ్మచారికే కాక సన్యాసికిని ముఖ్య ధర్మము యతి యగువాఁడును బ్రహ్మచర్యవ్రతము నెల్లప్పుడుం బాటింప వలయును గృహస్థుఁడు ఋతుకాలముల స్వభార్యాసంగము చేయ నగుం గావున నీనియమ మాతనికిం జెల్లదు. గృహస్థుఁ డైనను గుడ్యంబులపైఁ జిత్రప్రతిమల వ్రాయింపరాదు స్త్రీలచే నభ్యంగనముఁ జేయించుకొనరాదు. బ్రహ్మచారి మాంసము మద్యము పుష్పమాలికలు గంధానులేపన మలంకారములును స్వీకరింపం జన దిట్లు నియమముల నాదరించుచు గురుకులంబున నుండి వేదవేదాంగాది విద్యల నభ్యసించి గురువు కోరినదానిని దక్షిణ యొసంగి తదనుమతిం బడసి గృహస్థాశ్రమమును గాని సన్యాసమును గాని స్వీకరింప నగుఁ గానినాఁడు బ్రహ్మచర్యమందే కాలముం బుచ్చవచ్చు నింక వానప్రస్థధర్మములం జెప్పెద విను మావానప్రస్థుఁడు. 331

సీ. దున్నక పండినవన్న ధాన్యాదులు
దినరాదు పచ్చివై కనఁగ వచ్చు
పండ్లును దినరాదు వన్యము లైన నీ
వారధాన్యములచే వఱలుచరు పు
రోడాశములు సేయఁ గూడును గ్రొత్తలు
రాఁగ నాగ్రయణేష్టి సాఁగఁ జేయ
వలయు నగ్నుల రక్ష వలయును గావున
నాఁకుటిల్లను గందరాదులందు
తే. వాస మొనరించుకొన నగు వాన గాలి
వహ్ని యివమును సూర్యాతపంబు వీని

సైఁప నగుఁ దోళ్లు తొళ్కలు జడలు శ్మశ్రు
వులును దండకమండలుల్ వలయుఁ దాల్ప. 332

వ. వానప్రస్థుఁ డిట్టికష్టపాటుల కోర్వలేనిచోఁ బండ్రెండు గాని యెనిమిది గాని రెండు గాని వత్సరంబులలోఁ బ్రాజాపత్యేష్టి గావించి యజ్ఞుల నాత్మారోపణము గావించుకొని యహంకారమమకారములు విడిచి దేహాకాశము నాకాశమందును బ్రాణవాయువుల వాయువునందు నూష్మ మగ్నియందును రుధిరశ్లేష్మమూత్రాదులు జలమందును మాంసాదులు భూమియందును గలయ ననుసంధానముఁ జేసి వాక్కు నధిదేవత యగునగ్నియందును బ్రాణేంద్రియము నింద్రునందును బాదేంద్రియము విష్ణునందును నుపస్థేంద్రియము ప్రజాపతియందును బాయ్వింద్రియము మృత్యువునందును లయించునట్లు చేసి శ్రోత్రేం ద్రియము దిక్కులందును దృగింద్రియము వాయువునందును జక్షు రింద్రియము సూర్యునందును రసనేంద్రియము వరుణునందును ఘ్రాణేం ద్రియము పృథివియందును మనస్సు చంద్రునందును బుద్ధి బ్రహ్మ మందును దేహాత్మాభిమానాదికర్మములును గారణాహంకార మమ కారములు రుద్రునియందును జిత్తము క్షేత్రజ్ఞునియందును సాత్వికా హంకారము మహత్త్వమందును సంక్రమింపఁ జేయ నగు నంతఁ బృథివిని జలమందు జలమును దేజస్సునందు దేజస్సు వాయువునందు వాయువు నాకాశమునందు నాకాశము దామసాహంకారమునందు దానిని మహత్త్వమందు మహత్త్వము నవ్యక్తమందు దాని జీవుని యందును గూర్పవలయు నిట్లు కూర్చి జీవాత్మ పరమాత్మకు శరీరం బగుట స్వభావసిద్ధ మని తెలిసికొని జాతిగుణాదిభేదములు విడిచి వానప్రస్థుండు నిరశనవ్రతంబునఁ బ్రాణత్యాగము చేసికొనం దగు నని చెప్పి మఱియును. 333

శా. వానప్రస్థుఁడు నైజధర్మము నొనర్పంగాఁ దురీయాశ్రమ
స్థానంబుం గొని నిర్వహించుటకు లో సామర్థ్యముం గల్గ న
ట్లేనీతిం గొని సంచరింప వలెనో యే నిప్డు తత్సర్వముం
జ్ఞానం బేర్పడఁ జెప్పెదన్ నృపలోకగ్రామణీ ! వింటివే. 334

క. వానప్రస్థుండు తురీ
యాశ్రమము నొందు నభిలాష మదిన్
బూనినయేని సమస్తం
బైనం జేయంగ నైనయవి యొఱఁగింతున్. 335

సీ. భార్యాదులను దేహబంధుల విడనాడి
గ్రామైకరాత్రము గా మెలఁగుచుఁ
దన కపేక్ష యొకింతయును లేక భూతల
మందు నల్లడ నడయాడ వలయుఁ
గాపీన మాచ్ఛాదనోపయోగాంశుక
మును గమండలుదండములు గ్రహింప
వలయుఁ దోడ్పడఁగ నెవ్వాలన నెవ్వనిఁ గోర
కసహాయుఁడై యొంటి నరుగ వలయు

తే. భిక్షితాన్నమువలన జీవింప వలయు
సర్వభూతహితుం డయి సంచరింప
నగును గ్రోధము విడిచి నారాయణస్మ
రణము సలుప నౌ జగ మీశ్వరమయ మనుచు. 336

తరళము. చిదచిదాత్మక మౌ ప్రపంచము చెల్లునంతటిలోన నా
సదమలాత్మకుఁ డాత్మయై హరుసంబున న్వెలుగొందు నం
చెదఁ దలంచుచుఁ బ్రత్యగాత్ముని నెంచుచున్ సకలంబు బు
ద్బుదమువంటిది నశ్వరం బనుబుద్ధి నాతఁ డెసంగ నౌ. 337

సీ. బంధమోక్షాదులు పరమేశ్వరునివిలా
సము లై యాత్మస్వరూపములు గావు
జీవిత మసిరం బౌవల మ్మని
నిశ్చయం బనుచును నెమ్మి నమ్మి
భూతజాతము చావు పుట్టువులం గని
సరకుగొనక కాలపరిణతులకుఁ
గాలధర్మమునకుఁ గాఁ బ్రతీక్షించుచు
శుష్కశాస్త్రాదులచొప్పు లరయఁ

తే. జో కొకరిపక్షమై తాను వాకు లిడక
శిష్యులను బెక్కుమందినిఁ జేర్చుకొనక
తనదుచిత్తము వారితోఁ దగులు వడఁగ
నీక సన్యాసి జ్ఞానియై నిలువ వలయు. 338

ఉ. తనమాహాత్మ్య మెఱుంగ నీక నిపుణత్వం బుండియున్ లేనియ
ట్లును విజ్ఞుం డయి మూర్ఖు నట్టులు జనుల్ లోనెంచఁ దా నేదియున్
గనుఁగోఁ జాలనివెఱ్ఱివానిపగిదిన్ గన్పట్టి సమ్రాట్టునే
మనమం దెంచక మౌనిరాట్టు జగతిన్ మానొందు నా నొప్పెడిన్.

వ. ఈయర్థంబు తేటపడ నొక్కపురాతనేతిహాసంబు గల దాకర్ణింపుము.

—♦ ప్రహ్లాదాజగరసంవాదము ♦—

తే. మున్నొకప్పుడు ప్రహ్లాదసన్నుతాహ్వ
యుండు కతిపయజనసమేతుండు జగతి
తత్త్వ మరయంగఁ దలపోసి తత్పరతను
భూతలంబునఁ దిరుగాడెఁ బూర్ణదీక్ష. 341

స్రగ్ధర. కావేరీతీరమందుం గల నొకగిరి వి
ఖ్యాతమై సహ్యసన్నా
మావిర్భూతంబు పూతం బట దిగువున నా
నశ్మభూభాగమందున్
జేవల్ వో బూదె గ్రిమ్మన్ జివికినతనువుం
జేర్చి పన్నుండువానిన్
భావంబున్ లేనివానిన్ బల మగునొకనిన్
బాఱఁ గన్గొంచు నంతన్. 342

ఆజగరవ్రతంబున మహాతపముం బొనరించువాని న
వ్యాజవచోవిశేషమున నాకృతివైఖరి వన్నెచిన్నెలన్
రాజిలు నీతఁ డిట్టిఁ డనరానివిధంబున నున్నవాని వి
భ్రాజితతేజుఁ డైనహరిభక్తుఁడు గన్గొని మ్రొక్కి యిట్లనున్. 343

తే. ఓమహాభాగ ! భోగము లొందుచుండు
వానివలె దేహబలమున వఱలుచుండు
నీకు నాహారవస్తువుల్ నీవ్రతంబు
పెంపున లభించు టరిది నీపెం పిదేమొ. 344

శా. ఉద్యోగంబునఁ గాని ద్రవ్య మది సంయోజ్యంబు గా దిమ్మహిన్
దద్యోగంబునఁ గాని భోగముల నొందం గాదు కానప్పు డీ
హృద్యత్పీవరదేహ ముండు టకు దీ వి ట్లుంటి వొండొక్కచో
నుద్యోగంబును లేదు లేనియప్పు డి ట్లుంటల్ గదుర్ వింతయే. 345

తే. ఈవు విద్వాంసుఁడవు దక్షుఁడ వే నెఱిఁగితి
నీదునాకారమునఁ జేసి నీ వెవ రిటు
సోమరివిధంబున శయించి తేమి చెప్పుము
మంచికర్మము లొనరింప నెంచకుండ. 346

వ. అనినఁ బ్రహ్లాదున కమ్మహాముని మందహాసంబు సేయుచు ని ట్లనియె.

సీ. ఓయి ప్రహ్లాద ! నీ వుత్తమోత్తముఁడవు
పరమభాగవతుండ వరయఁ దెలిసె
నీవు ప్రవృత్తినివృత్తు లెఱుంగుదు
నీ వతీంద్రియవస్తుకోవిదుఁడవు
జ్ఞానాదిషడ్గుణస్థానంబవై స్వీయ
తేజంబునం జేసి తేజరిలుదు
నీవు భక్తుండవు నిత్యసంతుష్టుఁడ
విట్టినీచిత్తమం దెల్లనాఁడు

తే. శ్రీహరి వసించి సూర్యుఁడు చీఁకటి బలె
నీదునజ్ఞానము హరించు నీవు సర్వ
వేత్త వీనీకుఁ దెలియని దేమి యుండు
నయిన నడిగితి వని చెప్ప నగుదు నిపుడు. 348

శా. ఏ నాన్నో విషయేచ్ఛలం దగిలి యెన్నో పుణ్యపాపంబులన్
గానం జాలనివాఁడనై సలిపితిన్ గర్మానుసారంబుగా

నానాయోనులయందుఁ బుట్టితిని దానం జేసియే మానవుం
డై నే నీనరలోక మొందితి మహాత్మా! చెప్పితిఁ వింటివే. 349

వ. ఆర్యా! యీలోకము ధర్మాదు లాచరించి నాకాదిలోకము లందుటకును జ్ఞాన మార్జించి యపవర్గము నొందుటకును నధర్మమాచరించి నారకాధులందుటకుఁ బొందుపడినద్వారమువంటిది జీవులు తమపుణ్యాపరిపాకంబున నీలోకంబున నుత్తమోత్తమమానవజన్మము నొందియు సుఖదుఃఖరూపకర్మము లాచరించి ప్రియత్నానుకూలములు గాని విపరీతఫలంబులనుబొందుచుందురుదాని నెఱింగిననాకువిరక్తిజనించినది.

తే. ఆత్మ సుఖరూప మగు మన మాసుఖంబు
కొఱకు నన్యథా జతనింప నిరవసరము
మేని కైనవ్యాపారముల్ మానుకొనినఁ
జాలు నప్పుడు కేవలసౌఖ్యమ యగు. 351

తే. అరయ విషయసుఖమ్ములు నశ్వరమ్ము
లాత్మసుఖ మది నిత్యమౌ నని గ్రహించి
నేను బ్రారబ్ధకర్మావసానమునకు
నిట్లు శయనించి యుంటి నో యిద్ధచరిత. 352

సీ. ఆత్మ సుఖస్వరూపాతిశయం బని
పురుషార్థ మది యని పొల్చుకొనక
విషయసుఖంబులే వెలసెడుపురుషార్థ
ము లని తలంచుచు మూర్ఖు లగుచు
దుఃఖాదు లనుభవింతురు ధనాదులు సుఖ
మొసఁగఁ జాలవు దుఃఖ మొసఁగునవియు
ధన మార్జనమునందుఁ దద్రక్షణమునందు
వ్యయమునందును దుఃఖ మతులితంబు

తే. ధని కడుపు నిండఁ గూటిని దినఁడు కంటి
నిండ నిద్రను పోవఁ డెన్నండుఁ గాని
రాజచోరాదిభయము నిరంతరంబు
పుట్టుచుండును ధని యగుపూరుషునకు. 353

వ. ధనమువలన సౌఖ్యభయమే కలుగు నని చెప్ప నొప్పదు శోకము మోహము రాగము క్రోధము శ్రమము ద్వేషము లోనగుమహాదోషంబు లెన్నియో దానివలన సంప్రాప్తంబు లగు నేను మధుమక్షికంబును మహాసర్పంబును గురువులు గా నెంచి కొంతవిజ్ఞానంబు సంపాదించితి నాకర్ణింపుము. 354

సీ. మధుమక్షికము బహువిధపుష్పములనుండి
మకరందము గ్రహించి మమతఁ దెచ్చి
కూడఁ బెట్టుం దాని గూడొక్కరుఁడు గట్టి
యంతలో నెవ్వఁడో యరుగు దెంచి
గూటఁ గల్గినజంతుకోటి నగ్గిం గాల్చి
మధువు హరించు నామాడ్కిఁ దెలియ
నార్జితవిత్తము లని యెఱింగి ధనాదు
లందు విరక్తుఁడ నైతి మఱియు

తే. నెట్టివ్యాపారగతులు దా నెఱుఁగ కొక్క
యెడ మహాసర్ప ముండి దైవేచ్ఛలబ్ధ
మైనయాహారము భుజించు నది యెఱింగి
యుత్తమోత్తమ మని యెంచి యుల్లమందు. 355

వ. నే నేవంకకుం బోక చిరకాలమునుండి యిట శయించి ప్రాప్తపదార్థంబున నాహారము గల్పించుకొంటి నది స్వల్ప మైన నధికం బైనను మధు వైనఁ గటుతిక్తాదులం గూడిన దైన నమృతతుల్యం బని యాహారించుచు మృదులదుకూలాంబులును నారలు నొక్కరీతిగ నెంచి ధరించుచు హంసతూలికాతల్ప మైన కటికనేల యైన నొక్కటి యని యిక్కడఁ బండుకొని నిందాస్తుతులకు నెల వొసంగక నిత్యసంతుష్టుఁడ నై యుండుటం జేసి భోగరాగాదులు లేకున్నను నాశరీరము శుష్కింపక పీవరం బై యున్న యది మఱియు నితరవ్యాపారము లన్నియుం జాలించి విషయసుఖంబులం గోరక నిశ్చలచిత్తుండ నై యాత్మానుసంధానంబున నీశ్వరు నారాధించుచుఁ బ్రారబ్ధావసానంబున నీలింగశరీరంబు

విడువ నుంటి నిది యెవ్వరికిం జెప్పరాని దైనను బరమభక్తుండ వైన
నీ వడిగితివి గానఁ జెప్పితి నని యజగరవ్రతపరాయణుండు చెప్పిన
విని ప్రహ్లాదుం డతనిఁ బూజించి యథేచ్ఛం జనియె నని నారదుండు
చెప్పినవిని ధర్మరా జమ్మునిం గాంచి యి ట్లనియె. 356

మ. ఇలు నిల్లాలినిఁ బ్రేముడించుచు సదా యే దేదియో దుష్క్రియా
కలనం దేలుచు నైహికార్థములె వేడ్కం గూర్పనం జెంతు రి
య్యిల మావంటిరు ముక్తి నొంద సులభోపాయేద్ధమార్గం బెదేఁ
గలదేఁ జెప్ప ననుగ్రహింపు మన నక్కంజాక్షభక్తుం డనున్. 357

తే. లోకము ననుగ్రహింప నీ వీకరణిని
బ్రశ్న మొనరించితి గృహస్థభవ్యధర్మ
ములను విపులముగాఁ జెప్పఁ దలఁచి నాఁడ
నెల్లరు గృహస్థులును వాని నెఱుఁగ వలయు. 358

సీ. గృహి కులోచితరీతికిం దగఁ బంచమ
హాయజ్ఞములు లోగ నైనకర్మ
ము లొనర్చుచును భక్తపురుషులఁ గొలుచుచు
హరికథామృతము నిరంతరంబు
శ్రవణపుటంబులం దాన్రుచు సత్సంగ
మలరించుకొనుచు దేహాభిమాన
మది విడి స్వప్నమం దగువస్తువులు వోలె
దారధనాదులఁ దలఁచి ప్రేమ

తే. బంధమును ద్రెంచి క్రమముగా వారియందు
మమత విడి సర్వమును నశ్వర మని యెంచి
మనుజుఁడు విరక్తుఁ డగుచుఁ గుమ్మరిపురు వన
మెలఁగ నగు సంసృతిఁ బొనర్పఁ దనఁచినపుడు. 359

మ. ధనధాన్యాదిసమస్త మీశ్వరుదయన్ దన్నొంద సర్వంబునుం
దనకై కా కశనార్థు లైనజనులన్ దర్శించుచున్ వారికిన్

దనియం జేయుచు నాసఁ బూన కెపుడుఁ ధాన్యాదులఁ నిత్యముం
దినుచోఁ గుక్కలు కాకు లెల్కలును వానిఁ బిడ్డలల్లించ నే. 360

ఉ. కుక్కలు నక్కలుఁ మఱియుఁ గోదులు మాలలు మాదిగల్ మొదల్
తక్కినయెల్ల జీవులకుఁ దత్పరతం దినఁ గట్టఁ బెట్ట నా
నక్కటికంబు భూతములయందుఁ బొనర్చుచు సర్వ మీశ్వరుం
డిక్కరణి న్మెలంగు నని యెంచుచు నుండ నగుఁ మనంబునఁ. 361

సీ. స్త్రీనిమిత్తము తనజీవ మర్పించును
దల్లిదండ్రుల నన్నదముల నైనఁ
జంపును గురువునే సరకుగొనక ధిక్క
రించును మఱి యెట్టికించుతనము
లైనఁ గొంకక సేయు నట్టిస్త్రీపైఁ గల
యనురాగమును వీడు టలఁతి గాదు
కాకుండినఁ దానిఁ గలయుపాయంబుల
విడువఁ గల్గినవాఁడె విజ్ఞుఁ డగుచు

తే. సులభముగ నీశ్వరుం జూడఁ గలుగువాఁడు
దారపుత్రమిత్రాదిసంసారమందుఁ
దిరుగుచుండినవాఁ డయ్యు దురితము లగు
పనులకుం బోవ కుండినవాఁడ యేని. 362

మ. మలమూత్రాదులతోడ నిండి క్రిములఁ మాలిన్యముం గాంచి ము
క్కుల నోటన్ గవు లీనుమట్టమల మెక్కొ వాసనల్ గొట్టుచుఁ
కులు కుళ్ళి కనుపట్టునాడుగుఱితోఁ గూడంగ నాచేడతో
గలయం గల్గినపూరుషోత్తముని సౌఖ్యం బెన్న సామాన్యమే. 363

ఆ. అట్టిసౌఖ్యమునకు నాశించుకంటెను
విట్టు పూసికొనుచు విట్టుఁ దినఁగ
నుండుకీటజన్మ మొందుట యొక్కింత
మే లటంచు నెంతు మేదినీశ. 364

వ. ఇట్లు తత్త్వవిచారంబు చేసి భార్యాభిమానముం బరిత్యజింపఁ గలి
గినవాఁ డున్నతస్థితిం బొందఁ గలఁ డాకర్ణింపుము. 365

—♦ గృ హ స్థా శ్ర మ వి శే ష ము లు ♦—

సీ. గృహమేధి యగువిప్రుఁ డెప్పుడు యాజనా
ధ్యాపనాదులచే సమార్జిత మగు
సద్ధనంబునం జేసి యతిథు లభ్యాగతుల్
దేవతల్ మఱి పితృదేవతలును
మునులు మానవులును భూతముల్ లోనగు
వా రివి సంప్రీతి వఱచు చుండి
తన కంతరాత్మయై తనరు పరమపురు
షు నహర్నిశంబు గన్గొనఁగఁ వలయు

తే. యాగము లొనర్చి పరమేశ్వ రార్పణంబు
సేయ నగు బ్రహ్మముఖమున వేయఁ బడిన
యన్నమాయజ్ఞ భోక్త యా హరికి నంటు
యగ్నిముఖ హోమ ములకంటె నతులిత మగు. 366

తే. ద్విజులు భాద్రపదంబునఁ దెలిసి కృష్ణ
పక్షము మహాలయం బని భక్తితోడఁ
దల్లిదండ్రులు లోనగుతనదుపితల
కెంచి శ్రాద్ధము గావించు టెంతయుఁ దగు. 367

వ. మఱియు గృహమేధి ప్రతిసంక్రమణంబునందు ముఖ్యముగ దక్షి
ణోత్తరాయణసంక్రమణములందును వ్యతీపాతదినక్షయములందును
జంద్రసూర్యోపరాగములందును ద్వాదశ్యమావాస్యలయందును శిశి
రహేమంతఋతుకృష్ణపక్షాష్టములందును గార్తికశుద్ధ నవమియందును
వైశాఖశుద్ధతృతీయయందును మాఘశుద్ధసప్తమీపూర్ణిమలయందును
మాసనామనక్షత్రములందును ననూరాధాశ్రవణోత్తరోత్తరాషా
ఢోత్తరాభాద్రలతోఁ గూడినయేకాదశియందును జన్మనక్షత్రముతోఁ

గాని శ్రవణనక్షత్రముతోఁ గాని కూడినదినంబులందును బితృశ్రాద్ధంబు గావింప వలయు నీదినంబుల స్నానము జపము హోమము తపము దేవతార్చనము బ్రాహ్మణపూజయు నొనర్చిన శ్రేయము నాయువు నభివృద్ధి నొందు మఱియు నప్పుడు చేసినదానంబులు దేవతలకుఁ బితృదేవతలకు మానవులకును భూతములకును బ్రీతిదంబులై యక్షయ ఫలసాధనంబు లగు జాతకర్మాదులందును యజ్ఞాదిదీక్షలందును బ్రేత దహనాదులందును మృతాహస్సులందును బొనర్చినదానాదికము లుత్తమఫలదాయకంబులు. 368

ద్విపదము. వినుము కాలమునందు వివరింపఁ బడిన
దినములకై వడి దేశములందు
శ్రేయస్కరంబులై చెలఁగు స్థలములు
నాయాదిశలయందు నలరారుచుండు
వానిఁ జెప్పెద భగవంతునిప్రతిమ
లైనచోట్లనుఁ దపంబు నాత్మవిద్యయును
దయయును సత్యంబు దనరినచోట్ల
నయము న్యాయంబు వినయమును గల్గు
స్థలములు బ్రాహ్మణోత్తములు వసించు
స్థలములు భగవదర్చలు సల్పుకడలు
పుణ్యతమంబులై పొలుపొందు ననుచుఁ
బుణ్యశాస్త్రంబులు బోధించుచుండు
అమలగంగాది దివ్యనదులుఁ బుష్క
రములును దివ్యసరస్సులు పుణ్య
పురుషు లుండెడునవి పుణ్యస్థలములు
పరఁగెడు వానిలోపలఁ బ్రధానములఁ
జెప్పెద విను కురుక్షేత్రము గయయు
నొప్పు గంగాయమునోన్నతసంగ

మామృతస్థలము ప్రయాగము సాల
గ్రామనామక్షేత్రరాజము నైమి
శము ఫల్గునీనది చనియెడుచోటు
శమితపాపము ప్రభాసమును శ్రీరామ
సేతువు ద్వారక శ్రీపంపతటము
భూతుల నిడుకాశిపురమును గర్ద
మాశ్రమంబును మధురావని బదరి
కాశ్రమం బలకనందాదితీర్థములు
నుత్తమోత్తములై యొప్పెడుతీర్థ
సత్తమంబులు పెక్కు క్ష్మామండలమునఁ
బొదలుచుండును గాన పురుషుఁ డచ్చటికి
సదమలమతి నేగి స్నానదానాదు
లాచరించినవాని కత్యధికంబు
లై చనుసుఫలంబు లందఁగ వచ్చు. 369

వ. ఇవి దేశకాలాదు లింకఁ బాత్రలక్షణంబు లెఱింగించెద నాలకింపుము

పంచ. చరాచరాత్మకప్రపంచజాలరూపుఁ డైనశ్రీ
హరిన్ వచింప నొప్పు లోకమందు నుత్తమంబ యై
చరించు పాత్రమందునన్ విశాంపతీ! భవన్మఖాం
తరంబునందుఁ గృష్ణపూజనం బొనర్ప నయ్యెఁ గా. 371

క. సనకాదిసంయమీంద్రులు
ఘనులును వేల్పులును నృపులు గలిగినసభలో
మునుమున్న కృష్ణదేవుఁడె
కొనకొని పూజింప నయ్యెఁ గోవిదు లెన్నన్. 372

మత్త. వృక్షమూలమునందుఁ బోయఁగ వృక్షపీటముల్ సకలంబు నా
వృక్షభాగము లెల్లఁ దృప్తిని విస్తరిల్లెడునట్లు

వత్సుఁ డొక్కనిఁ బూజచేసిన వాసుదేవుఁడుగానఁ ద
త్ప్రక్ష మైనజగంబు లన్నియు దానఁ దృప్తము లయ్యెడిన్. 373

క. హరి నారాధించెడువా
రరసినవారల మొక్కువారు హరికీర్తనముల్
నిరతి మొనర్చెడువారును
బరికింపఁగఁ బాత్రము లని భావింప నగున్. 374

చ. జపము తపంబు రేబవలు సంతతముం బొనరించువార లై
సుపథమునందవర్తిలుచు సూనృతవాద మొనర్చువార లై
యెప్పుడును వేదచింతనయు నీశ్వరచింతనయుం బొనర్చుచున్
సుపురుషతం బ్రవర్తిలెడుక్షోణిసురుల్ పరికింపఁ బాత్రముల్. 375

వ. ఆక్షోణీసురులలోఁ గొందఱు వర్ణాశ్రమోచితధర్మకర్మంబు లాచరించు వారును గొంద ఱనశనదీక్షం జేసి తపంబు చేయువారును గొంద ఱధ్యయనాధ్యాపనరతులును గొందఱు జ్ఞానయోగనిష్ఠులై యుందు రందు జ్ఞానయోగనిష్ఠున కిడినశ్రాద్ధాన్నాదిదానంబు లనంతఫలదం బులు శ్రాద్ధంబులందు విశ్వేదేవస్థానంబున నిద్దఱను బితృస్థానంబున ముగ్గురను ముఖ్యమయినను శ్రద్ధాయుక్తం బగుకర్మంబు గావున ధర్మపత్నీభయంబున విస్తరించి చేయఁ జెల్లదు గావున రెంటుస్థానంబు లందు నొక్కొక్కరుని మాత్రమే నియమించుకొందురు శ్రాద్ధాదు లందు మాంసము నిషేధించి కందమూలంబులం జేసి యు దేవర్షిపితృ ర్చనంబు సేయందగుఁ బశుహింసపాతకహేతువు భూతద్రోహంబు సేయకుండుట పరమధర్మంబు యజ్ఞాదులం బశుపురోడాశంబు గావిం తురు యజ్ఞకర్తం జూచి పశువులు గడగడవడంకుచు నిందించుచుండు నిష్కాము లైనకొంద ఱీయోగంబుం దెగనాడి జ్ఞానయజ్ఞంబులం గావింతురు భూతహితకాము లైనపురుషు లన్నాదులచే నిత్యనైమి త్తికకర్మంబు లొనరింతురు విధర్మము పరధర్మము నుపధర్మము డాం బికధర్మము నాభాసధర్మ మని ధర్మంబు లైదువిధముల నడు స్వధర్మ

హాని గావించుధర్మము విధర్మము శ్రుతియాదిచోదిత మగునది పర ధర్మము వేదవిరుద్ధ మగునది యుపధర్మంబుఁ బాషండ మనియుం జెప్పంబడుఁ బరవంచనార్థ మయినధర్మంబు దాంభికంబు నాల్గాశ్రమం బులకుం గానిధర్మం బాభాసంబు నివి యైదు నధర్మవృక్షంబునకు శాఖ లనం బడుచుండుఁ గావున వాని విడువం దగు మనశ్శాంతిం గూర్చు స్వధర్మమె ధర్మము గాని పరధర్మంబు భయావహం బని మఱియును.

సీ. తీర్థయాత్రల కని దేవపూజల కని
ధనమునకై యాచ్న తగదు సేయ
దైవసంప్రాప్త మౌదానినే భక్షింపఁ
గైకొనఁ దగు నజగరము కరణి
నిత్యసంతుష్టుఁడు నిష్కాము నకు నగు
తృప్తి లంపటులకుఁ దెలియ లేదు
సంతుష్టుఁ డగువాఁడు జలముచేతన జీవ
నము నిల్పుకొనఁ జాలు శమము గలిగి

తే. విషయసుఖలోభమున కెంచి వెలలువాఁడు
దీనుఁడై కుక్క వలెను నిందింపఁ బడును
బ్రాహ్మణుం డసంతుష్టుఁడై పరఁగు నేని
నష్టుఁ డగు ఖ్యాతి విద్యయు జ్ఞానము చెడి. 377

ఉ. లోభ మనర్థదాయకము లోభము మించినదుర్గుణంబు లే
దే భువనంబునందు మఱి యెద్దియు నైనను మాన్పుకోఁగ నో
లోభము మాన్పుకొంట యతిలోకున కైన నశక్య మందురన్
లోభము పట్ల సజ్జనులు లోన భయంపడుచుండ నొప్పెడిన్. 378

తే. క్షుత్పిపాసలు నశియింపఁ జోటు లేదు
కామమున కప్డు నశియించు భూమిజనుల
పోదు లేకున్నఁ గ్రోధము పొడ వడంగు
నోడలు జీర్ణింపఁ జీర్ణింప దుర్విఁ దృష్ణ. 379

సీ. ఘను లయ్యుఁ బెక్కురు జను లసంతుష్టులై
నరకకూపములకు నడచుచుండ్రు
కాన నెట్లైనను గామాదుల జయింప
నగును భోగాదుల ననుభవింప
వలయు ననెడిబుద్ధి వదలినచో నంతఁ
జులకగాఁ గామము గెలువ వచ్చుఁ
గామ మడంగిన గ్రమముగా లోభము
నడఁగు ధన మనర్థ మనుతలఁపునఁ
తే. బుట్టినవి యెల్ల గిట్టు నక్క బుద్ధివలన
శోకమోహాదు లుడుగును సుజనసేవ
దంభము నశించు నాత్మతత్త్వంబువలన
సాధ్వసము నశించెడు సరభసముగ. 380

వ. మఱియు మౌనముచే లోకవార్తాదులును దేహనిస్పృహచేహింసయుఁ గారుణ్యముచే నాధిభౌతికదుఃఖంబును మనస్సమాధానముచే నాధిదైవికదుఃఖంబును యోగబలంబుచే నాధ్యాత్మికదుఃఖంబును సాత్త్వికాహారముచే నిద్రను సత్త్వగుణముచే రజస్తమస్సులను గురుభక్తిచేఁ గామాదిరూపము లగుసమస్తదుర్గుణములును సులభముగా జయింప వచ్చు నని మఱియును. 381

తే. జ్ఞానదీపము నొసఁగి యజ్ఞానతిమిర
మును ద్రోలంచిన భగవంతు ననఘమూర్తిఁ
గృష్ణు మానవుఁ డను బుద్ధి యెవఁడు సేయు
వానికామాదిజయమెల్ల వ్యర్థ మగును. 382

సీ. విను యాజనాదులు వృత్తిధర్మంబులు
యోగ మనుష్ఠింప నొప్పు జీవ
నమును బోషించెడుక్రమమునకుం గాక
యొండొకగతి కైన నొప్ప వవి య

నర్థదాయకములై వ్యర్థలై పోవు
యోగి నల్లమందుఁ
దలఁపనిజనునిస్తార్ణంబులు శ్రోతముల్
పోవునిష్ఫలములై పొడ వడంగి

తే. పవనమును జయింపఁ గలిగినమనుజుఁ డైన
దారపుత్రాదులఁ ద్యజించి తపసి యగుచు
విజనమం దుండి సతతంబు భిక్షితాన్న
మునను జీవిక నడపుచుఁ దనరుచుండి. 383

వ. ఒకసముద్రదేశంబున నాశీనుం డై ప్రణవముం జపించుచుఁ బూరక కుంభక రేచకము లన్ప్రాణాయామములచేఁ బ్రాణవాయువుల నిరోధించి మనస్సు శబ్దాదివిషయములనుండి మరలించి నాసాగ్రమున దృష్టి నిలిపి విషయాంతరగతి గలమనంబు నిగ్రహించి హృదయపద్మంబునఁ బరమేశ్వరుఁ బ్రతిష్ఠించి సమారాధనంబు గావింప వలయు నిట్లు కావించినపురుషుం డల్పకాలంబునన బ్రహ్మానందసుఖం బనుభవించుచుఁ బునరావృత్తిరహితశాశ్వతబ్రహ్మలోకం బనుభవించు మఱియు నాకర్ణింపుము. 384

మ. తనువే స్యందన మింద్రియంబు లవి రథ్యంబుల్ మనస్సే వడిన్
జనుపగ్గంబులు బుద్ధి సూతుఁడు బలౌజంబే మహాకూబరం
బులు శబ్దాదులు మార్గముల్ ప్రణవమొప్పన్ మేల్ధనుర్బాణముల్
ఘనుఁ డాజీవుఁడు స్యందనస్థుఁ డట లక్ష్యం బీశ్వరుం డారయన్. 385

వ. మఱియు నారథంబునకుఁ బ్రాణాపానవ్యానోదానసమానములును నాగ కూర్మ కృకర దేవదత్త ధనంజయంబు లను నీప్రాణదశకం బిరుసు గాను బుణ్యపాపములు రథాంగంబులు గాను జెప్పుచున్నారు రాగ ద్వేష లోభ శోక మోహ భయ మదమానతిరస్కారాసూయా వంచన భూతద్రోహ మత్సర క్రోధ ప్రమాద క్షు న్నిద్రాదులు

శత్రువులు. శరీరరూప మగురథము వశ మగునప్పుడే పురుషుండు మహాత్మసేవాసంపాదిత మగుజ్ఞానఖడ్గముం దాల్చి రాగద్వేషాదిశత్రువులం గూల్చి నిర్మలచిత్తుండై ముక్తిసంపదం బొంది శరీరరథముం బరిత్యజించుచున్నాఁడు. 386

తే. జీవి తా నట్లు మదమునఁ జేయకున్న
బుద్ధి యనుసూతుఁ డింద్రియంబు లనుహయులు
నతనిఁ గొనిపోయి విషయచోరాళి కిడఁగ
వారు త్రోఁతురు నరకసంసార మందు. 387

వ. వేదకర్మంబులు ప్రవృత్తి నివృత్తి యను రెండు తెఱంగులనుండుఁ బ్రవృత్తి లోకాంతరంబుల నిజకర్మానుభవము నొందించు నివృత్తి శాశ్వతం బగుముక్తిని గలిగించు నాకర్ణింపు మగ్నిహోత్రాదులు దర్శపూర్ణమాసములు చాతుర్మాస్యములు పశుయాగసోమయాగంబులు వైశ్వదేవబలిహరణంబులు ననునిష్టంబులును దేవాలయ నిర్మాణము కూపతటాకారామాదిప్రతిష్ఠలు లోనగు నవిప్రవృత్తికర్మము లివి ఫల మపేక్షింపక చేసిన నిష్కామకర్మము లైనచో నివృత్తికర్మములై తత్తత్ఫలంబులం గలిగించుఁ బ్రవృత్తిధర్మరతుండు సూక్ష్మావస్థను బొంది పృథివ్యాదిభూతములతోడం గూడి యింద్రియార్థ రతుండు దక్షిణాయనంబును గృష్ణపక్షంబును రాత్రియుం గూడఁ బయనంబై ధూమ్రమాదిమార్గంబునఁ బితృలోకంబు నాకాశంబు నతిక్రమించి చంద్రలోకంబునఁ దనపౌనర్భవయిష్టాపూర్తకర్మఫలం బనుభవించి కళాక్షయ మైనపదంపడి యటనుండి కదలి యాకాశంబును వాయువును మేఘములు వర్షములు నోషధులు నన్నము వీర్యమునుం బొంది మరల నీలోకంబునం బుట్టి గర్భాధానాదిసంస్కారసంస్కృతుండై ద్విజుం డగు నిది పితృయానంబు నాఁబడు నింక నివృత్తికర్మగతిం జెప్పెద వినుము నివృత్తికర్మపరాయణుండు జ్ఞానప్రదీపకంబు

లగుచక్షురాదీంద్రియంబులందు జ్ఞానేంద్రియకర్మేంద్రియవ్యాపారం బులును వానిని మనస్సునందును దానిని వాక్కునందును దానిని వర్ణసమామ్నాయమునందును దాని నోంకారమునందును దాని బిందునాదమునందును దానిని బ్రాణమందును దానిని జీవునందును జీవునిఁ బరమాత్మయందు లీనంబు గావించి యుత్తరాయణంబును శుక్లపక్షంబును దివాభాగంబునుం గూడి యర్చిరాదిమార్గంబున నగ్నిని పదంపడి సంవత్సరంబున సూర్యునిఁ జంద్రుని విద్యుత్తును వరుణుని నింద్రుని విరాట్టును గ్రమముగా నొంది ముక్తిం గాంచు నిది దేవయానంబు నాఁబడుఁ బరమాత్మోపాసకుండు గ్రమముగా నీయర్చిరాదులం బొంది ప్రకృతి నతిక్రమించి యపహతపాప్మాదు లష్టగుణంబులం జెంది ముక్తుండై మరల జననమరణాదిరూపసంసారం బునకు రాకుండు నింకఁ బ్రాప్యుఁ డగుపరమేశ్వరుస్వరూపంబు చెప్పెద నాకర్ణింపుము. 388

సీ. సృష్ట్యాదినుండి యీజీవులలోపల
వెలుపల భగవంతుఁ డలరుచుండు
వర్ణాదినామరూపాత్మక మగు నెల్లఁ
బరమాత్మరూపమే పరము కాదు
దృశ్యంబు లగుచుండు దేహేంద్రియాదు లా
దిని నిత్యములు వోలెఁ దెలియ నచ్చు
నవల జ్ఞానంబున నవి యనిత్యము లని
నశ్వరంబు లని గానంగ వచ్చు

ఆ. వృక్షమునకు నీడ వేఱైనయదియు న
శాశ్వతంబు ననియు విశ్వవేద్య
మట్లు దేహ మాత్మ కగునీడవంటిది
యాత్మ విడిచి యుండునదియుఁ గాదు. 389

మహాస్ర. కలలో నిద్రించియున్ మేల్కనియును గలలోఁ
గాంచియున్ మీఁద జాగ్ర
త్తలవం గాఁ దొంటికార్యం బది కల యనుచున్
స్వాంతమం దెంచునట్లే
తెలియన్ దేహాత్మభేదస్థితి కల దనుటల్
తెల్పుటల్ భ్రాంతి యంచున్
బలుకన్ విజ్ఞాని రెండున్ బరఁగు నొకఁడ యన్
భావమున్ జాటి చెప్పన్. 390

వ. దేహాత్మల కభేదము నిరూపించుట కనేకనిదర్శనంబులు చూపట్టు నందు శాస్త్రానుమత మగున ద్వైతము విశ్వసనీయ మది భావాద్వైతము క్రియాద్వైతము ద్రవ్యాద్వైత మని వ్యవహరింపఁ బడుచుండుఁ గార్యకారణములగు పటతంతువులకుం బోలె జగంబునకు బ్రహ్మమునకు నైక్యదర్శనము భావాద్వైతము తా నొనర్చినసత్కార్యముల నెల్ల భగవంతున కర్పించుట ముఖ్య మనుట కర్మాద్వైతము ధనము భోగసాధనములు భోగస్థానములును సమస్తభోక్తలకును సామాన్యము లే యని తలంచుట ద్రవ్యాద్వైతము వీనిం బాటింపక పరమాత్మోపాసకుండు పరబ్రహ్మముకంటె నన్యవస్తువు కల దను భ్రాంతినిఁ దదితరభ్రాంతులం దొలఁగించుకొనఁ దగు నోయి ధర్మజా! వేదోక్తములగు నీభావాద్వైతాదుల ననుసంధానము చేయుచు వర్ణాశ్రమోచిత కర్మాచరణంబుచేయుచు భగవంతునియందు భక్తి గలిగి యున్నచో గృహస్థుఁడు ముక్తుం డగు నని మఱియు. 391

తరువోజ. నావంటిమూఢు లేనయమునఁ దరియింత్రు
నాకుఁ జెప్పు మటంచు నన్నడిగితివి
దేవదేవుఁడు నీదు దెసఁ బ్రాపకుఁ డయి
దీపించుచున్నాఁడు దేవ! నీ వట్టు

భావించుచుండుట పాటి గాఁ బోదు
పరమేశ్వరునికృపవలన నే మీర
లాపదలం బాసి యఖిలభూమండ
లాధిపత్యము గల్గి యలరుచు నుంద్రు. 392

ఉ. ఆమహనీయమూర్తి కరుణాతిశయంబునఁ జేసియే దిశా
స్తోమములన్ జయించి మునిసోములసన్నిధి మఖ్యరంబు లా
స్తోమము లాచరించితివి క్ష్మోణిపతుల్ కొనియాడ వైభవ
శ్రీమహితుండ వై తతనిచెల్మిన ముక్తినిఁ గాంతు వవ్వలన్. 393

క. నీ కేమికొఱత ధర్మజ!
నీకున్ సరివచ్చువారు నిఖిలజగములన్
నాకొనంగ లేరు కృష్ణుని
ప్రాకామ్యము గలిగె నీదుభాగ్యం బసదే. 394

—• నారదుఁడు తనజన్మవృత్తాంతము చెప్పుట •—

వ. ఈసందర్భంబున నావిషయం బించుక చెప్పెద నవధరింపు మేను గతకల్పంబున నుపబర్హణుం డను గంధర్వుఁడనై పుట్టి క్రమంబున సౌందర్యసౌకుమార్యంబుల నత్యధికుండనై గంధర్వులకును గంధర్వాంగనలకును బ్రియుండనై మత్తెక్కి విషయాసక్తుండనై ప్రవర్తించుచు నొక్కనాఁడు విశ్వసృట్టులు చేయుబ్రహ్మసత్రంబున గానంబొనర్చుట కచ్చరలతోడం గూడి పోయి. 395

క. ఆనారాయణుచరితల
గానం బొనరించుచుండి గడు మోదమునన్
నానాచరితలు గరిమన్
గానం బొనరించినాఁడ గర్వస్ఫూర్తిన్. 396

ఆ. న న్నెఱింగి వారు నాహేళనము సైఁప
నట్టి రగుచు నన్నునరసి కినిసి

గర్వి వయితి కాన గంధర్వరూపము
విడిచి శూద్రయోనిఁ బడుము పుడమి. 397

తే. అని శపించిన నే నష్ట వనిధి కాంచి
నొక్క బ్రాహ్మణదాసికి నుదయ మంది
బ్రహ్మవాదుల సేవించి వారికరుణ
బ్రహ్మపుత్రుఁడ నై యిట్లు ప్రబలినాఁడ. 398

శా. దాసీపుత్రుఁడ నైననేన యిటు పెద్దల్ పూను లవ్వారికిన్
దాసత్వంబున సేవ సేయుటన యేతద్రీతి జన్మంబునన్
భాసిల్లం గలవాఁడ నైతి నృపచంద్రా! యెల్లకాలంబు నీ
వీసర్వేశ్వరు సేవచేయు దట యెంతేఁ గాఁగ నున్నాఁడ వో. 399

ఉ. నీవు గృహస్థధర్మములు నేను వచింపఁగ వింటి సర్వమున్
దేవమునీంద్రులెల్ల భవదీయగృహంబున కేగుదెంత్రు నీ
భావము దేవతార్చనలఁ బట్టి వెలుంగుచునుండు నిచ్చలున్
దేవుఁడు నీకుఁ దోఁడగుచుఁ దెల్పు సమస్తము నీ వలంతివో. 400

మ. జగదారాధ్యుఁడు కృష్ణదేవుఁడు భవత్సాన్నిధ్యమం దెప్పుడున్
దగవుల్ దిద్దుచు ముద్దు సేయుచు నినున్ దర్శించుచుం జుట్టమై
సుగముం గూర్చెడు మిత్రమై సఖుఁడునై సూచించుచుం గర్జముల్
దగులం బంది మెలంగుచుండు నఁటె నీదైవంబు సామాన్యమే. 401

ఉ. ఎవ్వఁడు సర్వలోకముల కీశ్వరుఁడై జగదాదిహేతువై
నివ్వటిలంగనై సతము నీరజగర్భభవాదిసేవ్యుఁడై
యెవ్వలనన్ బ్రకాశిలుచు నేర్పడి పేర్పడి యుండునో ఘనుం
డవ్వరవాసుదేవుఁడు కృపాత్ముఁడు నాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్.

వ. అని వాక్రుచ్చిన నారదునివాక్యంబులు విని ధర్మరాజు ప్రేమవివశుం
డై కృష్ణనారదులం బూజించె నంత నారదుండును బూజితుఁడై

ధర్మరాజకృష్ణుల నామంత్రణంబుచేసి యథేచ్ఛం జనియె నని శుకుండు పరీక్షిత్తునకుం జెప్పె నని సూతుండు శౌనకాదిమహర్షులకుం జెప్పె.

సప్తమస్కంధాంతము

శా. శ్రీనిత్యప్రతిభావిశాలుఁ డగుచున్ శ్రీసూర్యనారాయణుం
డే నారాయణుఁ డన్ ప్రసిద్ధి గలఁడై యింపొందుచున్ రాజ్యల
క్ష్మీనైసర్గికధర్మగోచరుఁడునై చెప్పంగనై రాజవం
శానూనప్రభ కైన దేవుఁడు జగత్ఖ్యాతిం బ్రవర్ధిల్లెడున్.

వల్లీవృత్తము.

ఎలమంచిలిగ్రామపృథ్వి దేవాలయ
మ్ములు గట్టి సేనానిఁ బొంత దేవేరులన్
దెలియంగ శ్రీవల్లి దేవసేనన్ ముదం
బలరారఁగా నిల్పి యాతఁ డర్చించెడున్.

తే. శూలినీదుర్గఁ బార్వతి గ్రాలుచోట
రామలింగేశుగుడి నవగ్రహములను బ్ర
తిష్ఠ గావించి పూజించు ధీయుఁ డతఁడు
పుత్రపౌత్రాభివృద్ధిమైఁ బొదలుఁగాక.

గద్యము

ఇది శ్రీ మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ, ప్రభుత్వాస్థానకవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
ప్రణీతంబయిన శ్రీకృష్ణ భాగవతంబునందు
సప్తమ స్కంధము.

శ్రీ శ్రీ శ్రీ

-:0:-

భువనస్తుత్యకథావిధానకలితంబుం గృష్ణమాహాత్మ్యసం
భవసంభావితభక్తియోగవిభవప్రఖ్యాత మత్యున్నత
స్తవరాజాంచిత మార్యజుష్ట మగుచుం దక్షోత్కృత్తు శ్రీకృష్ణభా
గవతం బియ్యది సుప్రసిద్ధ మగుచుం గైసేయు నాంధ్రావనిన్.

T.T.D. Religious Publications Series No. 496
Price:Rs. 45-00

వ్యాసప్రణీత భాగవతానికి అనువాదం కీ॥శే॥ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి "శ్రీకృష్ణభాగవతము". ఇది రెండు భాగాలుగా ముద్రింపబడుతోంది. ఒకటి నుండి ఏడు స్కంధాల ప్రథమ భాగం; ఎనిమిది నుండి పన్నెండు స్కంధాల ద్వితీయ భాగం.

భాగవతం అనగానే తెలుగులో పోతన, గంగన, సింగన, నారయల అనువాదరచనకే ప్రసిద్ధి. ఆ పాతమధురమైన పోతనాదుల భాగవత కవిత్వాన్ని అర్థవివరణలతో దేవస్థానం భక్తుల కందించింది.

అనౌచిత్యాన్ని పరిహరించి, ఔచిత్యాన్ని గ్రహించి మూలానుసారంగా ఆంధ్రీకరించబడ్డ ఈ కృష్ణభాగవతాన్ని కూడా మీముందుంచుతున్నాం.

ఈ అనువాదం పోతనరచనతో తులనాత్మకంగా పరిశీలించడానికి కూడా చక్కగా అక్కరకు వస్తుంది. ఇది సంస్కృతమూలానికి యథాతథమైన స్వరూపం.

భాషాస్పష్టత, రచనానిర్దిష్టత, మూలకథాంశ వివరణలో తేటదనము కలిగిన రచన 'శ్రీకృష్ణభాగవతము'. దక్షాధ్వరధ్వంసము, ధ్రువుని వృత్తాంతము, ప్రహ్లాదచరిత్ర మొదలైన ప్రాచుర్యం పొందిన ఘట్టాలు ఈ భాగంలో చోటుచేసుకొన్నాయి.

సమకాలీన సాహితీవేత్తలచే మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజు, కవిసార్వభౌమ, ఆంధ్రవ్యాస, అభినవశ్రీనాథ, వేదవిద్యావిశారద, ప్రసన్నవాల్మీకి, విశ్వకవి, కవిబ్రహ్మ ఇత్యాది సార్థక బిరుదములతో సమ్మానితులై తొలి ప్రభుత్వాంధ్రాస్థానకవిగా నియమితులైన శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారి 'శ్రీ కృష్ణభాగవతము' ప్రథమ భాగం మీముందుంది.

... చదవండి.

Published by the Executive Officer, T.T. Devasthanams, Tirupati
and Printed at Gayathri Art Printers, Hyderabad, on behalf of T.T.D.